# శ్రీమద్భాగవత మణిహారము

ప్రథమ సంపుటము



*సంకలనకర్తలు*

**దర్భా వేంకటరమణ నటరాజ ప్రభాకర్**

**దర్భా సూర్యనారాయణ**

**దర్భా సుబ్బలక్ష్మి**

*ప్రచురణ*

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2015**

# ŚRĪMAD BHĀGAVATHA MANIHĀRAṂ

First Volume

*Compiled and Edited by*

**Darbha Venkata Ramana Nataraja Prabhakar**
**Darbha Suryanarayana**
**Darbha Subbalakshmi**

T.T.D. Religious Publications Series No.1175
© All Rights Reserved

First Edition : 2015

*Copies :* 1000

*Price :*

*Published by :*
**Dr. D. Sambasiva Rao**, I.A.S.
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P:*
Office of the Editor-in-Chief
T.T.D., Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

శ్రీరస్తు



శ్రీ రుక్మిణీ సత్యభామాసమేత శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః

## సమర్పణము

సీ. అర్పింతు నందికొమ్మా! రుక్మిణీ సత్య
భామాయుతా! కృష్ణ! పరమపురుష!
యిచ్చుచుంటిని భక్తిఁబుచ్చికోఁగదె! భూమి
జాకళత్రా! రామచంద్రదేవ!

కాన్కవెట్టెద నీకుఁగైకొమ్ము! లక్ష్మీస
మేత! నారాయణా! ప్రీతితోడఁ
బసదనంబుగ మీకు నొసఁగెదఁజేకొండు!
పద్మావతీ శ్రీనివాసులార!

తే. వ్యాసముని పోతనామాత్యవరుల శ్లోక
గద్యపద్యాల హృద్యసంకలన మిదిగొ
**"భాగవతమణిహారంబు"** ప్రవిమలంబు
భాగవతలోకసంతోషవర్ధకంబు.

సీ. శ్రీబదరీక్షేత్ర చిరనివాసులు రమా
నారాయణులకు వినమ్రభక్తి
శ్రీజానకీరామ భూజానులకు సదా
భయభక్తియుక్తులఁబ్రమదమునను
శ్రీరుక్మిణీసతీ శ్రీసత్యభామా స
మేత కృష్ణునకు నమేయభక్తి
శ్రీయలమేల్మంగ ప్రేయసిఁగవగూడు
శ్రీవేంకటేశ్వర దేవమణికి

తే. **"భాగవతమణిహార"** మీ భవ్యకృతిని
అంకిత మొసంగి శ్రీశుకవ్యాస దైవ
ములకుఁబోతనకును గేలు మోడ్తు నెల్ల
భాగవతకర్తలకు నాత్మభక్తి యడర.

శ్రీరామనవమి దర్భా వేంకటరమణ నటరాజ ప్రభాకర్
దుర్మతి సంవత్సరము దర్భా సూర్యనారాయణ
1981 ధర్భా సుబ్బలక్ష్మి

## మహాకవియుగళవందనము

### వ్యాసభగవానుడు

క. వ్యాసుని భగవత్పదసం
వాసుని నాగమ పురాణ వరవిష్ణుకథా
వాసుని నిర్మల కవితా
భ్యాసుని పదపద్మయుగము భావింతు మదిన్.

### బమ్మెర పోతనామాత్యుడు

చ. పరులకసాధ్యమై పరఁగు భాగవతంబు రహస్యమంతయున్
హరికృపచే నెఱింగి మృదులాంధ్ర వచోరచనాచమత్క్రియా
కరణ మహాప్రబంధములుగా రచియించిన భానుతేజు బ
మ్మెరపుర పోతరాజును సమీకృతతేజు నుతింతు నెప్పుడున్.

సీ. శ్రీకృష్ణమూలమై శ్రీయుతస్కంధమై
ప్రవిమలవ్యాసాలవాల మగుచు
మంజులతాప్రతిమానమై యసమాన
వృత్తమై సుమనస్సువేద్య మగుచు
వరశుకాలాపసంభరితమై మాధురీ
ప్రస్తుతోత్తమమహాఫలము నగుచు
నజరమై యమరమై యఖిలసద్ద్విజగణా
నందసంధానచణంబు నగుచుఁ

తే. బరఁగు భాగవతాఖ్యకల్పద్రుమమ్ము
నాంధ్రజనతకు నందించి యశముఁగన్న
సహజపాండిత్యమండిత సత్కవీంద్ర!
వందనము పోతనామాత్యవర్య! నీకు.

**ఓమ్**

**శ్రీశృంగేరీ శ్రీజగద్గురు మహాసంస్థానమ్**

# శ్రీ విద్యాశంకరతీర్థ మహాస్వామి



శ్లో॥ విద్యానిధి స్త్వభినవో విద్యాతీర్థాభిధో మహాన్ ।
అవిద్యా ద్విపపంచాస్యో జయత్యద్య జగద్గురుః ॥

భారతీతీర్థనామ్నా యో భాఽభిస్సందీపయన్ జగత్ ।
అజ్ఞానధ్వాంతసంచ్ఛేత్తా జయత్యను జగద్గురుః ॥



శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య పదవాక్యప్రమాణ పారావార పారీణ, యమనియమాసనప్రాణాయామ ప్రత్యాహార ధ్యానధారణా సమాధ్యష్టాంగ యోగానుష్ఠాననిష్ఠ తపశ్చక్రవర్త్యనాద్యవిచ్ఛిన్న శ్రీశంకరాచార్య గురుపరంపరాప్రాప్త షడ్దర్శన స్థాపనాచార్య వ్యాఖ్యాన సింహాసనాధీశ్వర, సకలనిగమాగమసార హృదయ, సాంఖ్యత్రయప్రతిపాదకవైదికమార్గప్రవర్తక, సర్వతంత్రస్వతన్త్రాదిరాజధానీవిద్యానగరమహారాజధానీకర్ణాటకసింహాసన ప్రతిష్ఠాపనాచార్య, శ్రీమద్రాజాధిరాజ గురుభూమండలాచార్య, ఋష్యశృంగ పురవరాధీశ్వర, తుంగభద్రాతీరవాసి, శ్రీమద్విద్యాశంకర పాదపద్మారాధక శ్రీజగద్గురు శ్రీచంద్రశేఖర భారతీస్వామి గురుకరకమల సఞ్జాత

॥ శ్రీజగద్గురు శృంగేరీ శ్రీమదభినవ విద్యాతీర్థస్వామిభిః ॥

అస్మదత్యంతప్రియశిష్య శ్రీదర్భాసూర్యనారాయణ విషయే నారాయణ స్మరణ పురస్సరం విరచితా ఆశిషస్సముల్లసంతు.

వేదవ్యాసమహర్షి ప్రణీతమును, భగవల్లీలా ప్రతిపాదకమునగు శ్రీమద్భాగవతము మన కెల్లరకునూ పరమపవిత్రమగు గ్రంథము. ద్వాదశస్కంధ సముల్లసిత మగు నీగ్రంథమునందు వేదాంతతత్త్వము విస్తృతముగ ప్రతిపాదింపబడియున్నది. జన్మజరామృత చక్రరూపమగు సంసారమునందు పరిభ్రమించుచూ దిక్కు తెలియక దుఃఖించు జీవులకు ఇది దారిదీపము. ముముక్షువగు పరీక్షిత్తునకు శ్రీశుకమహర్షి ఈ గ్రంథము నుపదేశించెను. కావుననే, ఇది సకలలోక సమాదరణీయముగ నున్నది.

ఈ గ్రంథమును పరమభాగవతుడగు బమ్మెర పోతనామాత్యుడు తెలుగున కనువదించెను. ఆ యనువాదము అత్యంతమనోహరముగ నున్నది. పోతన భాగవతము ఆంధ్రదేశమునందు ఆబాలగోపాలము అందరకును పరిచితము.

ప్రకృతము మీరు సంస్కృత భాగవతమునందలి కొన్ని శ్లోకములను తదనువాదరూపములగు పోతనగారి గద్యపద్యములను సంగ్రహించి **"శ్రీమద్భాగవతమణిహార"** మను పేరుతో నొక గ్రంథమును ప్రకటించుచున్నారని తెలిసి మిక్కిలి సంతసించినాము. ఈ గ్రంథమును మే మవలోకించినాము. విద్వాంసుల సహాయముతో చేసిన ఈ సంకలనము హృద్యముగ నున్నది. ఈ కార్యమునందు మీ ధర్మపత్ని సౌ॥ సుబ్బలక్ష్మి, పుత్రుడు చిరంజీవి వేంకటరమణ నటరాజప్రభాకర్ మీకు సహకరించిరని తెలిసికొనినాము. మీకెల్లరకును ఇతోఽధికమైన శ్రేయఃపరంపరలు కలుగుగాక యనియు ఈ గ్రంథము ఎల్లెడల ప్రసరించుగాక! యనియు నాశీర్వదించుచున్నాము.

శృంగేరి
దుర్మతి వైశాఖ శుద్ధ
త్రయోదశి శనివారము
16-05-1981 —ఇతి నారాయణ స్మరణమ్

# ముందుమాట

ఆముష్మిక ఆధ్యాత్మిక చింతనాపరులకే కాకుండా సాహితీ మర్మజ్ఞులకు సైతం ఆరాధ్యగ్రంథం భాగవతం. వేదాలను వింగడించి; పురాణాలను, భారతాన్ని అందించిన వ్యాసభగవానుడే భాగవతాన్నీ అందించి సాక్షాత్ పరమాత్మగా స్తుతి పాత్రుడవుతున్నాడు. ఈ వ్యాసభాగవతాన్ని తెలుగులో చెప్పడం తనకు అందివచ్చిన మహాఫలమంటాడు బమ్మెరపోతానామాత్యుడు. ఆయన తేనెలో అద్దిన గంటంతో భాగవతాన్ని అనువదించి తెలుగువారి నాలుకల మీద నర్తనం చేయించాడు. సంస్కృత భాషాభిజ్ఞులు వ్యాస భాగవతాన్ని తలదాల్చినట్లే తెలుగు మాటాడ నేర్చిన వారందరు బమ్మెర పోతన భాగవతాన్ని పరమ రసాయనంగా ఆస్వాదిస్తారు. సంస్కృతాంధ్ర భాగవతాలు రసజ్ఞులైన పాఠకుల్ని చిరకాలం అలరిస్తూనే ఉంటాయి.


నవరత్నాలలో మణి ఒకటి. వ్యస్తంగా తన విలువ తాను నిలుపుకొంటూ, హారంలో సమస్తంగా నిలిచినా తన విలువను అస్తిత్వాన్ని కోల్పోదు. వ్యాస, పోతన భాగవతాలలో మణులవంటి అమూల్యమైన పద్యాలను ఏర్చి కూర్చి "శ్రీమద్భాగవత మణిహారము" అనే ఈ గ్రంథాన్ని రూపొందించారు సంకలన కర్తలు. ఈ శ్రీమద్భాగవత మణిహారం – ప్రథమ సంపుటం సంకలన కర్తలు దర్భా వెంకటరమణ, నటరాజ ప్రభాకర్, దర్భా సూర్యనారాయణ, దర్భా సుబ్బలక్ష్మి గారలు వ్యాసభాగవతంలోని శ్లోకాలను, తెలుగు భాగవతంలోని పద్యాలను గుదిగుచ్చి కథాభాగం సడలకుండా భాగవత సమాహారాన్ని అందించడంలో చేసిన కృషి ప్రశంసనీయం.

సంస్కృతాంధ్రాలతో పరిచయం ఉన్నవారు ఈ మణిహారాన్నిఅవధరించ గలరు. సరికొత్త మార్గంలో సంతరించిన ఈ గ్రంథాన్నితిరుమల తిరుపతి దేవస్థానం స్వీయముద్రణగా పాఠకలోకానికి అందిస్తున్నది.

పాఠకులు ఈ విధమైన సంకలనాన్ని, ఆదరిస్తారని ఆకాంక్షిస్తున్నాను.

సదా శ్రీవారిసేవలో...

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి



# విజ్ఞప్తి

శ్లో॥ చిత్తదృఙ్మోహనాంగాయ శ్రీమతే నందసూనవే ।
రుక్మిణీ సత్యభామాభ్యాం నిత్యయుక్తాయమంగళమ్ ॥

భగవద్గీతలో, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రములో భగవాను డిట్లనియె.

శ్లో॥ అనన్యాశ్చింతయంతో మాం యేజనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥
– భగవద్గీత, రాజవిద్యారాజగుహ్యయోగం 9–22

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥
– భగవద్గీత, జ్ఞానయోగం 4–8

ఆర్తా విషణ్ణాః శిథిలాశ్చ భీతాః
ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః ।
సంకీర్త్య నారాయణ శబ్దమాత్రం
విముక్తదుఃఖాః సుఖినో భవంతి ॥
– విష్ణుసహస్రనామమ్, ఉత్తరపీఠికాశ్లో. 152

శ్రీమద్భాగవతసారమంతయు పైశ్లోకములయందు నిమిడియున్నది. వేదములకు, శ్రుతిస్మృతులకు, శాస్త్రములకు, సంస్కృతికి భారతదేశము పుట్టినయిల్లు. వేదసారమంతయు పురాణములందు తెలియజేయబడినది. పురాణములు సృష్టిమొదలు కలియుగ ప్రారంభమునకు భారతదేశచరిత్రను వ్యక్తపరచుచున్నవి. ఆ పురాణము లన్నింటికంటె భాగవతము కడుగొప్పది. అది ఒక అమూల్యరత్నము. అందు భగవత్తత్త్వము, విష్ణుభక్తిప్రాశస్త్యము, శ్రీవిష్ణుని యవతారములు, విష్ణులీలలు చక్కగా ప్రతిపాదింపబడినవి.

భాగవతము కీర్తిని జ్ఞానమును సర్వాభీష్టములను సిద్ధింపజేయునది. అందుగల నాలుగక్షరములు ధర్మార్థకామమోక్షము లనబడు నాలుగు పురుషార్థములను, సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యములను నాలుగు మోక్షములను తెలియజేయును.

భక్తిశాస్త్రసర్వస్వమగు యీ భాగవతమును పారాయణము చేయుట వలన తాపత్రయములు నశించి ఐహికాముష్మికసుఖములును, సర్వ శుభములును ప్రాప్తించును. కలియుగమున భాగవతముకన్న మిన్నగా శ్రేయోమార్గమును జూపు వేఱొక గ్రంథములేదు.

క. విను, మీ సంసారం బను
వననిధిలో మునిఁగి కర్మవాంఛలచే వే
దనఁబొందెడువానికి వి
ష్ణుని గుణవర్ణనము తెప్ప సుమ్ము మునీంద్రా!

క. శ్రేయములు గురియు, భక్తిని
జేయక, కేవలము బోధసిద్ధికిఁదపముం
జేయుట విఫలము, పొల్లున
నాయము సేకుఱునె, తలఁప నధికంబైనన్.

అని పోతనగారీ గ్రంథమున చెప్పియున్నారు.

భాగవతమును అమరగాథ యందురు. కాశ్మీరదేశమందుగల పవిత్రమైన అమరనాథ గుహలో ఒకానొక రాత్రిసమయమున శంకరుడు పార్వతీదేవికి అత్యంతగోపనీయమైన భాగవతము నుపదేశించెనని కౌశిక సంహితలో వివరింపబడినది. శ్రీకృష్ణపరమాత్మయొక్క కేశాదిపాదాంత స్వరూపమే ద్వాదశ స్కంధ పరిమితమైన భాగవతమని వర్ణింపబడినది. "కృష్ణరూపమిదం శాస్త్రం సంశయో నహి విద్యతే". ఈ భాగవత మొక మహాశాస్త్రము. ఇది యాధ్యాత్మిక వాఙ్మయరూపమున వెలుగొందు శ్రీకృష్ణపరమాత్మయొక్క దివ్యస్వరూపము.



ఇందు ప్రథమస్కంధము శ్రీకృష్ణుని పాదాదిజానుపర్యంతముగా గల భాగముగాను, ద్వితీయస్కంధము జానువులు మొదలు కటిపర్యంతముగాగల భాగముగాను, తృతీయస్కంధము కట్యాదినాభిపర్యంతభాగముగాను, చతుర్థ స్కంధము నాభిమొదలు ఉదరపర్యంతముగా గల భాగముగాను, పంచమ స్కంధము హృదయముగాను, షష్ఠస్కంధము కంఠప్రదేశముగాను, సప్తమ స్కంధము ముఖముగాను, అష్టమస్కంధము నేత్రయుగళముగాను, నవమ స్కంధము భ్రూకపోలములుగాను, దశమస్కంధము బ్రహ్మరంధ్రముగాను, ఏకాదశస్కంధము మనస్సుగాను, ద్వాదశస్కంధ మాత్మగాను, పేర్కొనబడినవి.

శ్లో॥ జీవన్ముక్తా న సందేహో జాయతే శ్రుతి మాత్రతః ।
తస్మాదేషా సదాశ్రావ్యా శ్రీమద్భాగవతీకథా ॥

కలియుగమందు భాగవతశాస్త్రము ఏ గృహమందు నిత్యము పారాయణము చేయబడి పూజింపబడునో ఆ గృహమందు శ్రీకృష్ణపరమాత్మ ప్రీతితో నివసించును. ఆ గృహస్థులను సర్వదా రక్షించుచు జీవన్ముక్తి సిద్ధింపజేయును.

"వ్యాసో నారాయణో హరిః" వ్యాసభగవానుడు ద్వాపర యుగాంతమున (5 వేల సంవత్సరములకు ముందు) భాగవతము సంస్కృతమున లోకకల్యాణము కొఱకు రచించెను. దీనిని పరమ రామభక్తుడు సహజపాండిత్యసంపన్నుఁడు నైన బమ్మెర పోతనామాత్యుడు శ్రీరామచంద్రుని ప్రత్యక్షదర్శనభాగ్యము నొంది తదాజ్ఞానుసారముగా తదంకితముగా సుమారు 500 సం॥లకు ముందు అతిమనోహరముగాను, అతిమధురముగాను ఆంధ్రీకరించి ఆంధ్రలోకమునకు ప్రసాదించెను. భాగవతానువాదవిషయమున తన లక్ష్యమును తన పద్యములలో నిట్లు ప్రకటించెను.

"శ్రీకైవల్యపదంబుఁజేరుటకునై చింతించెదన్"

"నా జననంబున్ సఫలంబుఁజేసెదఁబునర్జన్మంబు లేకుండగన్"

మానవుడు తరించుట కివియే ఉత్తమోత్తమ లక్ష్యములు. పోతన ఆధ్యాత్మిక శక్తిలోని మహిమను ఘనతను గూర్చి యిట్లు తెలియజేసెను.

మ. వరగోవిందకథాసుధారసమహా వర్షోరుధారాపరం
పరలం గాక బుధేంద్రచంద్ర! యితరో పాయానురక్తిం బ్రవి
స్తరదుర్దాంతదురంతదుస్సహజను స్సంభావితానేకదు
స్తరగంభీరకఠోరకల్మషకన ద్దావానలం బాఱునే!.

మఱియు పోతన ఆంధ్రులకు అద్వైతతత్త్వముపదేశించి అమృతత్త్వమును ప్రసాదించెను.

క. వేదకల్పవృక్ష విగళితమై శుక
ముఖసుధాద్రవమున మొనసి యున్న
భాగవతపురాణఫలరసాస్వాదన
పదవిఁగనుఁడు రసికభావవిదులు.

అందువలననే భాగవతామృతమును గ్రోలినవారికి అమరత్వము సులభముగాను, నిశ్చయముగాను లభించును.

సుమారు అయిదు సంవత్సరములకుముందు శ్రీ సుసర్ల శ్రీనివాసరావు గారు, రిటైర్డు డెప్యూటి కలెక్టరు, కాకినాడు, 1930 వ సంవత్సరములో ప్రచురించిన The Heart of Bhagavatam చదివి ఆనందించెడి భాగ్యము కలిగినది. వ్యాస పోతన భాగవతములలోని సారము తీసి ఇటువంటి మంచి గ్రంథము ఒకటి ప్రచురించవలెనన్న కోరిక నాలో ఉద్భవించినది.

తదనంతరము రాజమండ్రి హిందూసమాజములో శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులవారి భాగవతోపన్యాసములను భక్తిశ్రద్ధలతో వినెడి అదృష్టము నాకు లభించినది. ఆ సమయమున దైవ ప్రేరణచేతను, నా పురాకృత సుకృతముచేతను నాకొక సత్సంకల్పము కలిగినది. వ్యాస పోతన భాగవతములలోని మణులనెంచి భాగవత సారమంతయు తీసి



**"శ్రీమద్భాగవత మణిహారమును"** కూర్చి శ్రీకృష్ణపరమాత్మకు సమర్పించవలెనన్నదే యా సంకల్పము. తన్మూలమున భాగవతధర్మములను, భగవత్తత్త్వమును, భక్తిమార్గమును, భాగవత కథలలోని విశిష్టతను, సుభాషితములను, నేటి విద్యార్థులకు యువకులకు నందజేయవలయునన్న యాశయము యాసక్తి నాలో నుదయించినవి. పరిపూర్ణవిశ్వాసముతోను భక్తిశ్రద్ధలతోను యీ పవిత్రగ్రంథము సంకలనముచేసి ముద్రింపవలెనన్న కార్యక్రమము ప్రారంభించడమైనది. యథార్థానికి ఇందులో "మా స్వంతమ" నేది యేమీ లేదు. ఇందులో ఏదైనా లోపముంటే అదంతా మాదే. పాఠకులు మమ్ములను మన్నించ కోరుచున్నాము.

నా యీ సంకల్పమునకు శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులవారు, శ్రీమాన్ ఎస్.టి.పి.వి. కోనప్పాచార్యులవారు నాయందు పరిపూర్ణానుగ్రహము జూపి ప్రోత్సహించి సర్వవిధముల తోడ్పడి, మార్గదర్శకులై నన్నాశీర్వదించినారు. వీరుచేసిన మహోపకారమునకు నా కృతజ్ఞతాపూర్వక నమస్కారముల నర్పించుచు, వీరికి శ్రీకృష్ణపరమాత్మ సర్వశ్రేయములు ప్రసాదించవలసినదిగా ప్రార్థించుచున్నాను.

శ్రీ మిన్నికంటి గురునాథశర్మగారు, శ్రీ బులుసు వేంకటేశ్వరులుగారు, శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు, శ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మగారు, శ్రీ దర్భా కృష్ణమూర్తిశర్మగారు, శ్రీ కొంపెల్ల లక్ష్మీనారాయణగారు, శ్రీ చెరువు రామకృష్ణశంకరస్వామిగారు, శ్రీ బులుసు ఉదయభాస్కరంగారు, **"శ్రీమద్భాగవత మణిహారము"** వ్రాతప్రతి తయారుచేయుటలోను, ముద్రణ చేయుటలోను సర్వవిధముల నిష్కామభావముతో తోడ్పడిన పుణ్యపురుషులు. వీరికందఱకును నా కృతజ్ఞతాపూర్వక వందనముల నర్పించుకొనుచు, వీరందఱికి సర్వశుభములను ప్రసాదించవలసినదిగా శ్రీకృష్ణపరమాత్మను ప్రార్థించుచున్నాను.

ఆర్థికసౌలభ్యము నపేక్షించి యీ మహాగ్రంథమును రెండు సంపుటములుగానచ్చువేయించి పాఠకలోకమున కందింప సంకల్పించినాము. అందిదిగో యిది ప్రథమసంపుటము. క్రమముగా ద్వితీయ సంపుటమును గూడ ననతికాలమున ముద్రించి యందజేయగలమని మనవి చేసుకొను చున్నాము.

ఈ పవిత్రగ్రంథ ముద్రణమునకై శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము కార్యనిర్వహణాధికారి యగు శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్‌గారు గ్రంథరచయితలను ప్రోత్సహించు పథకము ననుసరించి ధన సహాయము మంజూరు చేసినారు. దేవస్థానము మంచి అభివృద్ధిలోనికి వచ్చుటకు వీరికిగల కార్యదీక్ష భక్తిశ్రద్ధలే కారణములు. వీరికి నా ప్రత్యేక కృతజ్ఞతాభివందనముల నర్పించుకొను చున్నాను. మఱియు యీ గ్రంథ ముద్రణకు ఆదరాభిమానములనుచూపి సర్వవిధముల తోడ్పడిన శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారికి, శ్రీ ధూళిపాళ అర్కసోమయాజిగారికి, శ్రీ కాట్రపాటి సుబ్బారావుగారికి నా కృతజ్ఞతలను తెలుపుకొనుచున్నాను.

శ్రీవేంకటేశ్వరస్వామివారి ప్రేరణవలన భక్తిశ్రద్ధలతో విరాళముల నొసగి ప్రోత్సహించిన దాతల కందఱకును మఱియు ప్రత్యక్షముగాను పరోక్షము గాను సహకరించిన శ్రేయోభిలాషులందఱకును నా కృతజ్ఞతలు దెలుపుకొను చున్నాను.

మాయందు పరిపూర్ణానుగ్రహముజూపి యీ గ్రంథసంకలనమును ఆనందపూర్వకముగా పరిశీలించి ప్రోత్సహించుచు ఆశీస్సులను తమ సదభిప్రాయములను ప్రసాదించిన జగద్గురువులకు పీఠాధిపతులకు వేదశాస్త్ర పండితులకు మహాకవులకు మిత్రులకు మా కృతజ్ఞతాపూర్వక సాష్టాంగ నమస్కారముల నర్పించుకొనుచున్నాము.



ఈ దుర్మతి సంవత్సరమున 1981, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారి పర్యవేక్షణమున ఆంధ్రదేశమంతటను మహాకవి బమ్మెర పోతనామాత్యుని పంచశతతమ జయంతి మహోన్నతములు నిర్వహింపబడునని మేము విని పరమానందభరితుల మైతిమి, పరమరామభక్తుడైన పోతనామాత్యుని భాగవతములోని కొన్ని పద్యములైనను ఆంధ్రుల మందరము ప్రతినిత్యము భక్తితో చదివిన ఆ మహాకవికి ప్రీతిచేకూరును. ఇదియే మన కర్తవ్యము. ఇదియే మన శ్రద్ధాంజలి. ఈ జయంతి ఉత్సవములకు ముందుగనే భగవదనుగ్రహమువలన తలవనితలంపుగా **"శ్రీమద్భాగవత మణిహారమును"** ముద్రించి యాంధ్రలోకపాఠకుల కందింప గలుగుచున్నందులకు మేమెంతయో యానందించుచున్నాము. శ్రీకృష్ణ, వ్యాస, పోతనలు మాకీభాగ్యము ప్రసాదించుట మా పూర్వజన్మ ఫలితముగా భావించుచున్నాము. పోతనామాత్య మహాభక్తకవిశేఖరుల కివియే మా కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు.

శ్లో॥ దృష్టం కిమపి లోకేస్మి న్న నిర్దోషం న నిర్గుణమ్ ।
తస్మాద్దోషాన్ పరిత్యజ్య గృహ్ణంతు సుగుణాన్ బుధాః ॥

"శ్రీనివాసనిలయము"
14/139, గాంధిపురము-2
రాజమహేంద్రవరము
533 103
04-06-1981

శ్రీకృష్ణదాసానుదాసుడు
దర్భా సూర్యనారాయణ
(రిటైర్డు సివిల్ ఇంజనీరింగు ప్రొఫెసరు
అణ్ణామలై యూనివర్సిటి
అణ్ణామలై నగర్, తమిళనాడు)

# విషయసూచిక


| ప్రథమసంపుటము | పేజీ |
|---|---|
| 1. ఇష్టదేవతా ప్రార్థన | 1 |
| 2. చతుఃశ్లోకీ భాగవతము | 13 |
| 3. శ్రీభాగవత మహిమ | 16 |
| 4. శ్రీమద్భాగవత వైభవము (కౌశికసంహితాంతర్గతము) | 20 |
| 5. బదరీలక్ష్మీనారాయణులు | 23 |
| 6. వ్యాస, శుక, పోతన స్తుతులు | 25 |
| 7. ప్రధానదేవతావందనము పోతన పద్యములు | 29 |
| 8. శ్రీభాగవత ప్రశంస | 34 |
| 9. శ్రీనివాస నారాయణ స్తుతులు | 36 |
| 10. శ్రీమద్భాగవత మాహాత్మ్యమ్ (పద్మపురాణము) | 38 |
| 11. శ్రీమద్భాగవత ప్రార్థన | 40 |
| **శ్రీమద్భాగవత మణిహారము** | |
| 12. ప్రథమ స్కంధము | 41 |
| 13. ద్వితీయ స్కంధము | 131 |
| 14. తృతీయ స్కంధము | 213 |
| 15. చతుర్థ స్కంధము | 277 |
| 16. పంచమ స్కంధము – ప్రథమాశ్వాసము | 317 |
| ద్వితీయాశ్వాసము | 327 |
| 17. షష్ఠ స్కంధము | 349 |
| 18. సప్తమ స్కంధము | 401 |


# శ్రీమద్భాగవత మణిహారము

(శ్రీవ్యాస, పోతన కృత సంస్కృతాంధ్ర భాగవతముల సారము)

## ప్రథమ సంపుటము

శ్రీ

మ. లలితస్కంధము కృష్ణమూలము శుకాలాపాభిరామంబు మం
జులతాశోభితమున్ సువర్ణసుమనస్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వలవృత్తంబు మహాఫలంబు విమలవ్యాసాలవాలంబు నై
వెలయున్ భాగవతాఖ్యకల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయమై.

– పోతన. 1-20

# శ్రీమద్భాగవత మణిహారము

**(సంస్కృతమూలము - శ్రీవ్యాసభగవానులు)**

**(తెలుగు పద్యములు - శ్రీపోతనామాత్యులు)**



శ్లో॥ శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం
విశ్వాకారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగమ్ ।
లక్ష్మీకాన్తం కమలనయనం యోగిహృద్ధ్యానగమ్యం
వన్దే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథమ్ ॥

**సంకలనకర్తలు : సంపాదకులు**
**దర్భా వెంకటరమణ నటరాజ ప్రభాకర్**
**దర్భా సూర్యనారాయణ**
**దర్భా సుబ్బలక్ష్మి**

శ్రీరస్తు

## 1. ఇష్టదేవతా ప్రార్థన

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్,
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ॥ 1

వక్రతుణ్డ మహాకాయ కోటిసూర్యసమప్రభా,
నిర్విఘ్నం కురు మే దేవ సర్వకార్యేషు సర్వదా ॥ 2

యస్య ద్విరదవక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతమ్,
విఘ్నం నిఘ్నంతి సతతం విష్వక్సేనం తమాశ్రయే ॥ 3

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షా త్పరంబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః ॥ 4

జ్ఞానానందమయం దేవం నిర్మల స్ఫటికాకృతిమ్,
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే ॥ 5

గురవే సర్వలోకానాం భిషజే భవరోగిణామ్,
నిధయే సర్వవిద్యానాం దక్షిణామూర్తయే నమః 6

రామాయ రామభద్రాయ రామచన్ద్రాయ వేధసే,
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః ॥ 7

నమః కృష్ణాయ శుద్ధాయ బ్రహ్మణే పరమాత్మనే,
యోగీశ్వరాయ యోగాయ త్వా మహం శరణం గతః ॥ 8

కృష్ణాయ వాసుదేవాయ హరయే పరమాత్మనే,
ప్రణతక్లేశనాశాయ గోవిన్దాయ నమో నమః ॥ 9

సభారూపాయ తే నిత్యం సభాయాః పతయే నమః
నమశ్శివాయ సాంబాయ బ్రహ్మణే సర్వసాక్షిణే ॥ 10

సర్వమంగళమాంగళ్యే శివేసర్వార్థసాధికే,
శరణ్యేత్ర్యంబకే గౌరి నారాయణి నమోऽస్తుతే ॥ 11

సర్వజ్ఞే సర్వవరదే సర్వదుష్టభయంకరీ
సర్వదుఃఖహరే దేవీ మహాలక్ష్మీ నమోऽస్తుతే ॥ 12

బ్రహ్మస్వరూపా పరమా జ్యోతీరూపా సనాతనీ,
సర్వవిద్యాధిదేవీ యాతస్యై వాణ్యై నమో నమః ॥ 13

వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్,
పరాశరాత్మజం వన్దే శుకతాతం తపోనిధిమ్ ॥ 14

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే,
నమోవై బ్రహ్మనిధయే వాశిష్ఠాయ నమో నమః ॥ 15

సర్వపౌరాణిక కథాసంప్రదాయ మహాగురుమ్,
కృష్ణద్వైపాయనం వన్దే పరాశర తనూభవమ్ ॥ 16

శ్రీపరాశర పౌత్రంచ వ్యాసపుత్ర మకల్మషమ్,
నిత్యవైరాగ్య సంపన్నం జీవన్ముక్తం శుకం భజే ॥ 17

యోగీంద్రాయ నమ స్తస్మై శుకాయ బ్రహ్మరూపిణే,
సంసారసర్పదష్టం యో విష్ణురాత మమూముచత్ ॥ 18

ప్రహ్లాద నారద పరాశర పుణ్డరీక
వ్యాసాంబరీష శుక శౌనక భీష్మదాల్భ్యాన్
రుక్మాంగదార్జున వశిష్ఠ విభీషణాదీన్
పుణ్యానిమాన్ పరమభాగవతాన్ స్మరామి. 19

* * *

శ్రీరస్తు
**శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః**



శ్లో॥ అంగుళ్యగ్రైరరుణకిరణైర్ముక్తసంరుద్ధ రన్ధ్రమ్
వారంవారం వదనమరుతా వేణుమాపూరయన్తమ్,
వ్యత్యస్తాఙ్ఘ్రిం వికచకమలచ్ఛాయ విస్ఫారనేత్రమ్
వన్దే బృందావన సుచరితం నన్దగోపాలసూనుమ్ ॥

కృష్ణం కమలపత్రాక్షం పుణ్యశ్రవణ కీర్తనమ్,
వాసుదేవ జగద్యోనిం నౌమి నారాయణం హరిమ్ ॥ 1

కృష్ణాయ యాదవేంద్రాయ జ్ఞానముద్రాయ యోగినే,
నాథాయ రుక్మిణీశాయ నమో వేదాన్త వేదినే ॥ 2

సచ్చిదానన్దరూపాయ విశ్వోత్పత్త్యాదిహేతవే,
తాపత్రయవినాశాయ శ్రీకృష్ణాయ వయం నుమః ॥ 3

నమో బ్రహ్మణ్యదేవాయ గోబ్రాహ్మణహితాయ చ ।
జగద్ధితాయ కృష్ణాయ గోవిన్దాయ నమో నమః ॥ 4

వాసనాద్వాసుదేవస్య వాసితన్తే జగత్రయమ్
సర్వభూతనివాసోఽసి వాసుదేవ నమోఽస్తుతే ॥ 5

యం బ్రహ్మా వరుణేంద్రరుద్రమరుతః స్తున్వంతి దివ్యైస్తవై
ర్వేదై స్సాంగపదక్రమోపనిషదై ర్గాయంతి యం సామగాః ।
ధ్యానావస్థితతద్గతేన మనసా పశ్యంతి యం యోగినో
యస్యాంతం న విదుస్సురాసురగణా దేవాయ తస్మై నమః ॥ 6

శ్లో॥ నమ స్తస్మై భగవతే వాసుదేవాయ సాక్షిణే,
యఇదం కృపయా కస్మై వ్యాచచక్షే ముముక్షవే ॥ 7

వ్యాస 12-13-19

సీ. సకలగుణాతీతు సర్వజ్ఞు సర్వేశు,
నఖిలలోకాధారు నాదిదేవుఁ
బరమదయారసో ద్భాసితుఁ త్రిదశాభి
వందిత పాదాబ్జు వనధిశయను
నాశ్రితమందారు నాద్యంత శూన్యుని,
వేదాంత వేద్యుని విశ్వమయునిఁ
గౌస్తుభ శ్రీవత్స కమనీయవక్షుని,
శంఖ చక్ర గదాసి శార్ఙ్గధరుని

ఆ. శోభనాకారుఁ బీతాంబరాభిరాము
రత్నరాజిత మకుట విభ్రాజమానుఁ
బుండరీకాక్షు మహనీయ పుణ్యదేహుఁ
దలఁతు నుతియింతు దేవకీతనయు నెపుడు. 8

పోతన 12-13-50

* * *



## కేశవాది చతుర్వింశతి నామ ధ్యాన శ్లోకములు

శ్లో॥ కేశవాయ నమస్తుభ్యం నమో నారాయణాయ చ,
మాధవాయ నమస్తేస్తు గోవిన్దాయ నమో నమః ॥ 1

శ్రీవిష్ణవే నమస్తుభ్యం మధుసూదనరూపిణే,
త్రివిక్రమ సుదీర్ఘాయ వామనాయ నమో నమః ॥ 2

శ్రీధరాయ నమస్తుభ్యం హృషీకేశాయ తే నమః,
నమస్తే పద్మనాభాయ దామోదరాయ తే నమః ॥ 3

నమస్తే సంకర్షణాయ వాసుదేవాయ తే నమః,
ప్రద్యుమ్నాయ నమస్తేఽస్తు అనిరుద్ధాయ తే నమః ॥ 4

నమః పురుషోత్తమాయాధోక్షజాయ తే నమో నమః,
నమస్తే నారసింహాయ అచ్యుతాయ నమో నమః ॥ 5

నమో జనార్దనాయాస్తూపేన్ద్రాయ చ నమో నమః,
శ్రీహరయే నమస్తుభ్యం శ్రీకృష్ణాయ నమో నమః ॥ 6

## కృష్ణం వన్దే జగద్గురుమ్

శ్లో॥ వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్,
దేవకీపరమానన్దం కృష్ణం వన్దే జగద్గురుమ్ ॥ 1

అతసీపుష్పసఙ్కాశం హారనూపురశోభితమ్,
రత్నకఙ్కణకేయూరం కృష్ణం వన్దే జగద్గురుమ్ ॥ 2

కుటిలాలకసంయుక్తం పూర్ణ చన్ద్రనిభాననమ్,
విలసత్కుణ్డలధరం కృష్ణం వన్దే జగద్గురుమ్ ॥ 3

మన్దారగన్ధసంయుక్తం చారుహాసం చతుర్భుజమ్,
బర్హిపిఞ్ఛావచూడాఙ్గం కృష్ణం వన్దే జగద్గురుమ్ ॥ 4

ఉత్ఫుల్లపద్మపత్రాక్షం నీలజీమూతసన్నిభమ్,
యాదవానాం శిరోరత్నం కృష్ణం వన్దే జగద్గురుమ్ ॥ 5

రుక్మిణీకేలిసంయుక్తం పీతామ్బర సుశోభితమ్,
అవాప్తతులసీగన్ధం కృష్ణం వన్దే జగద్గురుమ్ ॥ 6

గోపికానాం కుచద్వన్ద్వకుఙ్కుమాఙ్కితవక్షసమ్,
శ్రీనికేతం మహేష్వాసం కృష్ణం వన్దే జగద్గురుమ్ ॥ 7

శ్రీవత్సాఙ్కం మహోరస్కం వనమాలావిరాజితమ్,
శఙ్ఖచక్రధరం దేవం కృష్ణం వన్దే జగద్గురుమ్ ॥ 8

కృష్ణాష్టకమిదం పుణ్యం ప్రాతరుత్థాయ యః పఠేత్,
కోటిజన్మకృతం పాపం సద్య ఏవ వినశ్యతి ॥ 9

## శ్రీకృష్ణ స్తుతిః
## (గోపాలోత్తర తాపిన్యుపనిషత్)

శ్లో॥ ఓం నమో విశ్వరూపాయ విశ్వస్థిత్యన్త హేతవే
విశ్వేశ్వరాయ విశ్వాయ గోవిందాయ నమో నమః ॥ 1

నమో విజ్ఞానరూపాయ పరమానంద రూపిణే
కృష్ణాయ గోపీనాథాయ గోవిందాయ నమో నమః ॥ 2

నమః కమలనేత్రాయ నమః కమలమాలినే
నమః కమలనాభాయ కమలాపతయే నమః ॥ 3

బర్హాపీడాభిరామాయ రామాయాకుంఠ మేధసే
రమామానసహంసాయ గోవిందాయ నమో నమః ॥ 4

కంస వంశ వినాశాయ కేశి చాణూర ఘాతినే
వృషభధ్వజవంద్యాయ పార్థసారథయే నమః 5



శ్లో॥ వేణునాదవినోదాయ గోపాలాయాహిమర్దినే
కాలిందీకూలలోలాయ లోలకుండలధారిణే ॥ 6

వల్లవీవదనాంభోజ మాలినే వృత్తశాలినే
నమః ప్రణత పాలాయ శ్రీకృష్ణాయ నమో నమః ॥ 7

నమః పాపప్రణాశాయ గోవర్ధన ధరాయచ
పూతనాజీవితాంతాయ తృణావర్తానుహారిణే ॥ 8

నిష్కలాయ విమోహాయ శుద్ధాయాశుద్ధవైరిణే
అద్వితీయాయ మహతే శ్రీకృష్ణాయ నమో నమః ॥ 9

ప్రసీద పరమానంద ప్రసీద పరమేశ్వర
ఆదివ్యాధి భుజంగేన దష్టం మాముద్ధర ప్రభో! ॥ 10

శ్రీకృష్ణ రుక్మిణీకాంత గోపీజనమనోహర
సంసారసాగరే మగ్నం మాముద్ధర జగద్గురో! ॥ 11

కేశవ క్లేశహరణ నారాయణ జనార్దన
గోవింద పరమానంద మాం సముద్ధర మాధవ! ॥ 12

* * *

## "ఓం నమోనారాయణాయ"
## అష్టాక్షరీ మన్త్ర స్తుతిః

**ఓం** నమః ప్రణవార్థార్థ స్థూలసూక్ష్మక్షరాక్షర,
వ్యక్తావ్యక్తకళాతీత **ఓం**కారాయ నమోనమః ॥ 1

**న**మో దేవాదిదేవాయ దేహసంచారహేతవే,
దైత్యసంఘ వినాశాయ **న**కారాయ నమోనమః ॥ 2

**మో**హనం విశ్వరూపం చ శిష్టాచార సుపోషితమ్,
మోహవిధ్వంసకం వన్దే **మో**కారాయ నమోనమః ॥ 3

**నా**రాయణాయ నవ్యాయ నరసింహాయ నామినే,
నాదాయ నాదినే తుభ్యం **ణా**కారాయ నమోనమః ॥ 4

**రా**మచన్ద్రం రఘుపతిం పిత్రాజ్ఞాపరిపాలకమ్,
కౌసల్యాతనయం వన్దే **రా**కారాయ నమోనమః ॥ 5

**య**జ్ఞాయ యజ్ఞగమ్యాయ యజ్ఞరక్షకరాయ చ,
యజ్ఞాంగరూపిణే తుభ్యం **య**కారాయ నమోనమః ॥ 6

**ణా**కారం లోకవిఖ్యాతం నానాజన్మఫలప్రదమ్,
నానాభీష్టప్రదం వన్దే **ణా**కారాయ నమోనమః ॥ 7

**య**జ్ఞకర్త్రే యజ్ఞభర్త్రే యజ్ఞరూపాయ తే నమః,
సుజ్ఞానగోచరాయాస్తు **య**కారాయ నమోనమః ॥ 8

ఓంకారమన్త్రసంయుక్తం నిత్యం ధ్యాయన్తి యోగినః
కామదం మోక్షదం తస్మై ఓంకారాయ నమోనమః ॥ 9

నారాయణః పరంబ్రహ్మ నారాయణః పరంతపః,
నారాయణః పరో దేవః సర్వం నారాయణ స్సదా ॥ 10

* * *

## శ్రీ ద్వాదశాక్షర మంత్ర (ఓం నమో భగవతే వాసుదేవాయ) స్తోత్రమ్
## (శ్రీవేదవ్యాస కృతమ్)

**ఓం**దితో జ్ఞానవక్త్రేణ రాగానిర్మగ్న నిర్జితః,
తమోమోహాత్ ప్రపన్నోఽస్మి త్రాహి మాం మధుసూదన ॥ 1

**న**గతిర్విద్యతే చాన్యా త్వమేవ శరణం మమ,
మాయా పంకేన లిప్తోఽస్మి త్రాహి మాం మధుసూదన ॥ 2



**మో**హితో మోహజాలేన పుత్ర దార గృహాదిషు,
తృష్ణయా పీడ్యమానోఽస్మి త్రాహి మాం మధుసూదన ॥ 3

**భ**క్తి హీనం చ దీనం చ దుఃఖ శోక సమన్వితమ్,
అనాశ్రయ మనాథం చ త్రాహి మాం మధుసూదన ॥ 4

**గ**తాగతి పరిశ్రాంతో దూర మధ్వని కర్మణాం,
సంసార భయ భీతోఽస్మి త్రాహి మాం మధుసూదన ॥ 5

**వ**సితో మాతృగర్భేషు పీడితోఽహం జనార్దన,
గర్భవాస క్షయకర త్రాహి మాం మధుసూదన ॥ 6

**తే**న దేవ ప్రసన్నోఽస్మి సత్యాశ్రయ స్త్వత్పరాయణః,
జరా మరణ భీతోఽస్మి త్రాహి మాం మధుసూదన ॥ 7

**వా**చా నుపకృతం పాపం కర్మణా యదుపార్జితమ్,
సోఽహం దేవ దురాచారం త్రాహి మాం మధుసూదన ॥ 8

**సు**కృతం న కృతం కించి ద్దుష్కృతంమే సదా కృతం,
తే నాహం పరితప్తోఽస్మి త్రాహి మాం మధుసూదన ॥ 9

**దే**హాంతర సహస్రేషు కుయోని స్సేవితా మయా
తిర్యక్త్వం మనుష్యత్వం చ త్రాహి మాం మధుసూదన ॥ 10

**వా**సుదేవ హృషీకేశ వైకుంఠ పురుషోత్తమ,
సృష్టి సంహారకారస్త్వం త్రాహి మాం మధుసూదన ॥ 11

**య**త్ర యత్ర గమిష్యామ నార్యాం వా పురుషేఽపి వా,
తత్ర తత్ర చ తే భక్తిః త్రాహి మాం మధుసూదన ॥ 12

ద్వాదశాక్షర స్తుతి మిమాం యః పఠే చ్ఛృణుతేఽపి వా,
స యాతి పరమం స్థానం యత్ర యోగేశ్వరో హరిః ॥ 13

* * *

## శ్రీ కలిసంతారణ స్తోత్రమ్

**నారదంప్రతి బ్రహ్మోవాచ :**

హరేరామ హరేరామ రామరామ హరేహరే,
హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే. 1

ఇతి షోడశకం నామ్నాం కలి కల్మష నాశనమ్,
నాతః పరతరోపాయ స్సర్వవేదేషు దృశ్యత. 2

* * *

## శ్రీదశావతార స్తోత్రమ్

వేదోద్ధార విచారమతే సోమక దానవ సంహరతే
మీనాకార శరీర నమో భక్తం తే పరిపాలయ మామ్
రామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే
రామ హరే, కృష్ణ హరే, తవ నామ వదామి సదా నృహరే ॥ 1

మంథానాచల ధారణహేతో దేవాసుర పరిపాల విభో
కూర్మాకార శరీర నమో భక్తం తే పరిపాలయ మామ్
రామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే
రామ హరే, కృష్ణ హరే, తవ నామ వదామి సదా నృహరే ॥ 2

భూచోరక హర పుణ్యమతే క్రోడోద్ధృత భూ దేవ హరే
క్రోడాకార శరీర నమో భక్తం తే పరిపాలయ మామ్
రామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే
రామ హరే, కృష్ణ హరే, తవ నామ వదామి సదా నృహరే ॥ 3

హిరణ్యకశిపు చ్ఛేదనతో ప్రహ్లాదాభయదాయక హేతో
నృసింహాచ్యుత రూప నమో భక్తం తే పరిపాలయ మామ్
రామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే
రామ హరే, కృష్ణ హరే, తవ నామ వదామి సదా నృహరే ॥ 4



భవబంధన హరి వితతమతే పాదోదక విహతాఘ తతే
వటు పటు వేష మనోజ్ఞ నమో భక్తం తే పరిపాలయ మామ్
రామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే
రామ హరే, కృష్ణ హరే, తవ నామ వదామి సదా నృహరే ॥ 5

క్షితిపతి వంశ క్షయకర మూర్తేక్షితిపతి కర్తా హరిహర మూర్తే
భృగుకులరామ పరేశ నమో భక్తం తే పరిపాలయ మామ్
రామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే
రామ హరే, కృష్ణ హరే, తవ నామ వదామి సదా నృహరే ॥ 6

సీతావల్లభ దాశరథే దశరథ నందన లోకగురో
రావణమర్దన రామ నమో భక్తం తే పరిపాలయ మామ్
రామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే
రామ హరే, కృష్ణ హరే, తవ నామ వదామి సదా నృహరే ॥ 7

కృష్ణానంత కృపాజలధే కంసారే కమలేశ హరే
కాళియ మర్దన లోకగురో భక్తం తే పరిపాలయ మామ్
రామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే
రామ హరే, కృష్ణ హరే, తవ నామ వదామి సదా నృహరే ॥ 8

దానవపతిమానాపహర త్రిపుర విజయ మర్దన రూప
బుద్ధజ్ఞాయ చ బౌద్ధ నమో భక్తం తే పరిపాలయ మామ్
రామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే
రామ హరే, కృష్ణ హరే, తవ నామ వదామి సదా నృహరే ॥ 9

శిష్టజనావన దుష్టహర ఖగ తురగోత్తమ వాహన తే
కల్కిరూప పరిపాల నమో భక్తం తే పరిపాలయ మామ్
రామస్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే
రామ హరే, కృష్ణ హరే, తవ నామ వదామి సదా నృహరే ॥ 10

* * *



ఓం నమో బ్రహ్మణే, నమోఽస్త్వగ్నయే,
నమః పృథివ్యై, నమ ఓషధీభ్యః,
నమోవాచే, నమోవాచస్పతయే,
నమో విష్ణవే, బృహతే కరోమి ॥

మేఘశ్యామం పీతకౌశేయవాసం
శ్రీవత్సాంకం కౌస్తుభోఽద్భాసితాంగమ్,
పుణ్యోపేతం పుణ్డరీకాయతాక్షం
విష్ణుం వన్దే సర్వలోకైక నాథమ్ ॥

సశంఖ చక్రం సకిరీట కుణ్డలమ్
సపీతవస్త్రం నరసీరుహేక్షణం
సహార వక్షస్థల కౌస్తుభశ్రియం
నమామి విష్ణుం శిరసా చతుర్భుజమ్ ॥

* * *

# 2. చతుఃశ్లోకీ భాగవతము

## పుండరీకాక్షుండు బ్రహ్మకు ఉపదేశించుట

## స్కంధము 2 - అధ్యాయము 9

**శ్రీభగవానువాచ :**

శ్లో॥ జ్ఞానం పరమగుహ్యం మే యద్విజ్ఞానసమన్వితమ్,
సరహస్యం తదంగం చ గృహాణ గదితం మయా. 1

వ్యాస 2-9-31

**పుండరీకాక్షుం డిట్లనియె-**

క. వారిజభవ! శాస్త్రార్థ వి
చారజ్ఞానమును, భక్తి సమధిక సాక్షా
త్కారము లను నీమూఁడు ను
దారత నీమనమునందు ధరియింప నగున్.

పోతన 2-9-249

శ్లో॥ యావానహం యథాభావో యద్రూపగుణకర్మకః,
త థైవ తత్త్వవిజ్ఞాన మస్తు తే మదనుగ్రహాత్ ॥

అహ మే వాస మేవాఽగ్రే నాన్యద్యత్సదసత్పరమ్,
పశ్చాదహం యదే తచ్చ యోఽవశిష్యేత సోఽస్మ్యహమ్ ॥ 2,3

వ్యాస 2-9-32,33

సీ. పరికింప మత్స్వరూప స్వభావములును
మహిమావతార కర్మములుఁదెలియఁ
తత్త్వవిజ్ఞానంబు దలకొని మత్ప్రసా
దమున గల్గెడి నీకుఁగమలగర్భ!

సృష్టిపూర్వమునఁజర్చింప నే నొకరుండఁ
గలిగియుండుదు వీత కర్మి నగుచు
సమధికస్థూలసూక్ష్మ స్వరూపములఁద
త్కారణప్రకృతియుఁదగ మదంశ

క. మందు లీన మైన నద్వితీయుండ నై
యందు నాకు నన్య మొకటి లేదు
సృష్టికాలమందు సృజ్యమానం బగు
జగము మత్స్వరూప మగును వత్స!

క. అరయఁగఁగల్పప్రళయాం
తరము ననాద్యంతవిరహితక్రియతోడన్
బరిపూర్ణ నిత్యమహిమం
బరమాత్ముఁడ నై సరోజభవ! నే మందున్.

పోతన 2-9-250, 251

**శ్లో॥ ఋతే ర్థం యత్ప్రతీయేత న ప్రతీయేత చాత్మని**
**తద్విద్యాదాత్మనో మాయాం యథాభాసో యథా తమః ॥ 4**

వ్యాస 2-9-34

వ. అదియునుం గాక నీవు నన్నడిగిన యీ జగన్నిర్మాణ మాయా ప్రకారం బెఱింగింతు లేనియర్థంబు శుక్తిరజతభ్రాంతియుం బోలె నేమిటఁదోఁచి క్రమ్మఱఁదోఁచకమాను నదియె మదీయ మాయావిడంబనం బని యెఱుఁగు, మదియునుం గాక లేని యర్థంబు దృశ్యమానం బగుటకుం గల యర్థంబు దర్శనగోచరంబు గాకుండుటకును ద్విచంద్రాదికంబును దమఃప్రభాసంబును దృష్టాంతంబులుగాఁదెలియుము. పోతన 2-9-252

**శ్లో॥ యథా మహంతి భూతాని భూతేషూచ్చావచేష్వను**
**ప్రవిష్టాన్యప్రవిష్టాని తథా తేషు న తే ష్వహమ్ ॥ 5**

వ్యాస 2-9-35



వ. ఏ ప్రకారంబున మహాభూతంబులు భౌతికంబులైన ఘటపటాదు లందుం బ్రవేశించి యుండు నాప్రకారంబున నేను నీభూత భౌతికంబు లైన సర్వకార్యంబులందు సత్త్వాదిరూపంబులం బ్రవేశించి యుండుదు. భౌతికంబులు భూతంబులయందుఁగారణావస్థంబొందు చందంబున భూత భౌతికంబులు కారణావస్థం బొందిన నాయందు నభివ్యక్తంబులై యుండవు.

పోతన 2-9-252

**శ్లో॥ ఏతావదేవ జిజ్ఞాస్యం తత్త్వజిజ్ఞాసునాత్మనః,**
**అన్వయవ్యతిరేకాభ్యాం యత్స్యాత్సర్వత్ర సర్వదా. 6**

వ్యాస 2-9-36

వ. సర్వదేశంబులయందును సర్వకాలంబులయందును నేది బోధితంబై యుండు నట్టిదియ పరబ్రహ్మస్వరూపంబు. తత్త్వం బెఱుంగ నిచ్ఛయించిన మిముబోఁటి వారలకు నీచెప్పిన మదీయ తత్త్వాత్మకం బైన యర్థంబ యర్థం బని యెఱుంగుము. పోతన 2-9-252

**శ్లో॥ ఏతన్మతం సమాతిష్ఠ పరమేణ సమాధినా**
**భవాన్ కల్పవికల్పేషు న విముహ్యతి కర్హిచిత్ ॥ 7**

వ్యాస 2-9-37

వ. ఈ యర్థం బుత్కృష్టం బైనయది యేకాగ్రచిత్తుండవై యాకర్ణించి భవదీయచిత్తంబున ధరియించిన నీకు సర్గాదికర్మంబు లందు మోహంబు చెందకుండెడి.

పోతన 2-9-252

* * *



# 3. శ్రీభాగవత మహిమ

శ్లో॥ ధర్మః ప్రోజ్ఝితకైతవోఽత్ర పరమో నిర్మత్సరాణాం సతాం
వేద్యం వాస్తవమత్ర వస్తుశివదం తాపత్రయోన్మూలనమ్,
శ్రీమద్భాగవతే మహామునికృతే కిం వా పరైరీశ్వరః
సద్యోహృద్యవరుధ్యతేఽత్రకృతిభిశ్శుశ్రూషుభిస్తత్క్షణాత్ ॥
వ్యాస 1-1-2

నిగమకల్పతరోర్గళితం ఫలం
శుకముఖాదమృతద్రవసమ్మితమ్, 1
పిబత భాగవతం రసమాలయం
ముహురహో రసికా భువి భావుకాః ॥ 2
వ్యాస 1-1-3

ఇదం భాగవతం నామ పురాణం బ్రహ్మసమ్మితమ్
ఉత్తమశ్లోకచరితం చకార భగవానృషిః ॥ 3
వ్యాస 1-3-40



నైష్కర్మ్యమప్యచ్యుతభావవర్జితం
న శోభతే జ్ఞానమలం నిరంజనమ్,
కుతః పునశ్శశ్వదభద్రమీశ్వరే
న చార్పితం కర్మ యదస్యకారణమ్ ॥ 4
వ్యాస 1-5-12 & 12-12-54

తదేవ రమ్యం రుచిరం నవం నవం
తదేవ శశ్వన్మనసో మహోత్సవమ్,
తదేవ శోకార్ణవ శోషణం నృణాం
యదుత్తమశ్లోక యశోఽనుగీయతే ॥ 5
వ్యాస 12-12-51

సర్వవేదాంతసారం యద్బ్రహ్మాత్మైకత్వలక్షణమ్,
వస్త్వద్వితీయం తన్నిష్ఠం కైవల్యైకప్రయోజనమ్ ॥ 6
వ్యాస 12-13-12

సర్వవేదాన్తసారం యచ్ఛ్రీభాగవత ముచ్యతే,
తద్రసామృతతృప్తస్య నాన్యత్ర స్యాద్రతిః క్వచిత్. 7
వ్యాస 12-13-15

శ్రీమద్భాగవతం పురాణమమలం యద్వైష్ణవానాం ప్రియమ్
యస్మిన్ పారమహంస్య మేతదఖిలం జ్ఞానం పరం గీయతే,
యత్ర జ్ఞానవిరాగభక్తి సహితం నైష్కర్మ్యమావిష్కృతం
తచ్ఛృణ్వన్విపఠన్విచారణపరో భక్త్యా విముచ్యే న్నరః ॥ 8
వ్యాస 12-13-17

దారిద్ర్యదుఃఖజ్వర దాహితానాం
మాయాపిశాచీపరిమర్దితానామ్,
సంసారసిన్ధౌ పరిపాతితానాం
క్షేమాయ వై భాగవతం ప్రగర్జతి 9

కృష్ణప్రియం సకలకల్మషనాశనం చ
ముక్త్యేకహేతుమిహ భక్తివిలాసకారి,
సన్తః కథానకమిదం పిబతాదరేణ
లోకేహి తీర్థపరిశీలనసేవయా కిమ్ ॥ 10

అసారే సంసారే విషయవిషభఙ్గాకులధియః
క్షణార్థం క్షేమార్థం పిబత శుకగాథాతులసుధామ్
కిమర్థం వ్యర్థం భో వ్రజత కుపథే కుత్సితపథే
పరీక్షిత్సాక్షీ యచ్ఛ్రవణగతముక్త్యుక్తికథనే ॥ 11

రసప్రవాహసంస్థేన శ్రీశుకేనేరితా కథా
కణ్ఠేసమ్బధ్యతే యేన స వైకుణ్ఠప్రభుర్భవేత్ ॥ 12

ఇతి చ పరమగుహ్యం సర్వసిద్ధాన్తసిద్ధం
సపది నిగదితం తే శాస్త్రపుంజం విలోక్య
జగతి శుకకథాతో నిర్మలం నాస్తి కిఞ్చి
త్పిబ పరసుఖహేతోర్ద్వాదశస్కన్ధసారమ్ 13
(పద్మపురాణోత్తరఖణ్డము 6-13, 19, 101, 102, 103)

శ్లో॥ యః పఠేత్ ప్రియతో నిత్యం శ్లోకం భాగవతం సుత!
అష్టాదశపురాణానాం ఫలమాప్నోతి మానవః ॥ 14

యత్ర యత్ర భవేత్ పుణ్యం శాస్త్రం భాగవతం కలౌ,
తత్ర తత్ర సదైవాహం భవామి త్రిదశైః సహ ॥ 15
(స్కాన్దపురాణ, విష్ణుఖణ్డ, మార్గశీర్ష మాహాత్మ్యమ్.)

మ. లలితస్కంధము, గృష్ణమూలము, శుకాలాపాభిరామంబు మం
జులతా శోభితమున్, సువర్ణ సుమన స్సుజ్ఞేయమున్, సుందరో



జ్జ్వల వృత్తంబు, మహాఫలంబు, విమల వ్యాసాలవాలంబు నై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయమై ॥ 1
పోతన 1-20

క. నిగమములు వేయుఁజదివిన,
సుగమంబులు గావు ముక్తి సుభగత్వంబుల్
సుగమంబు భాగవత మను
నిగమంబుఁబఠింప ముక్తి నివసనము బుధా! 2
పోతన 1-7-139

వ. ఇట్లు భాగవత్ప్రోక్తంబును, ఋషి సంప్రదాయాగతంబును, పురుషోత్తమ స్తోత్రంబును, పరమ పవిత్రంబును, భవలతాలవిత్రంబును నైన భాగవత కథా ప్రపంచంబు శ్రద్ధాళుండవు భక్తుండవు నగు నీకు నుపన్యసించెద వినుము. 3
పోతన 3-8-271

వ. పురాణరత్నం బగు భాగవతంబు వినువారును, బఠియించువారును, లిఖియించువారును, నాయురారోగ్యైశ్వర్యంబులు గలిగి విష్ణుసాయుజ్యంబు నొందుదురు. 4
పోతన 12-13-45

* * *

# 4. శ్రీమద్భాగవత వైభవమ్

**(కౌశికసంహితాంతర్గతము)**

శ్లో॥ యైర్నశ్రుతం భాగవతం పురాణం
నారాధితోయైః పురుషః పురాణః,
హుతం ముఖేనైవ ధరామరాణాం
తేషాం వృథా జన్మ గతం నరాణామ్ ॥ 1

శృణ్వంతి యే భాగవతం పురాణం
తథార్చయం తే పురుషం పురాణమ్
సదైవ విప్రాన్నప్రదా నరా యే
తేషాం జనుః స్యాత్సఫలం సమగ్రమ్ ॥ 2

ఐహికాముష్మికసుఖం శ్రీమద్భాగవతశ్రుతేః
సాత్వికాశ్చ భవే ద్విప్రా భక్తిశ్రద్ధాపురస్సరమ్ ॥ 3

గాయత్రీ భాష్యభూతోఽసౌ వేదార్థపరిబృంహితః,
అర్థోఽయం బ్రహ్మసూత్రాణాం భారతార్థవినిర్ణయః ॥ 4

పురాణానాం సామరూపః సాక్షాద్భగవతోదితః,
గ్రంథోఽష్టాదశసాహస్రః శ్రీమద్భాగవతాభిధః ॥ 5

సద్బీజః ప్రణవాంకురో రవిమితస్కంధైర్యుతః కల్పవృట్
పంచత్రిత్రిమితాః ఖఖాభ్రవసుభూః శాఖాః ప్రశాఖా స్తథా,
శూన్యాకాశ ఖషడ్గరీషు సమితాః పత్రాణి యస్యస్ఫుటం
స శ్రీభాగవతాహ్వ ఇష్టఫలదో భక్త్యర్థితో రాజతే ॥ 6

(భావము : భాగవతరూప కల్పవృక్షమునకు పరమాత్మయే బీజముఓంకారమే అంకురము. 12 స్కంధములు 12 పెద్దకొమ్మలతోను, 335 అధ్యాయములు శాఖలతోను, 18000 శ్లోకములు రెమ్మలతోను 5,76,000 అక్షరములు ఆకులు, శ్రీమద్భాగవతము వేదకల్పవృక్షముగా విరాజిల్లు చున్నది.)

శ్లో॥ **'భా'** శబ్దో కీర్తివచనో **'గ'** శబ్దో జ్ఞానవాచకః
సర్వేష్టవచనో **'వ'** శ్చ **'తో'** విస్తారస్య వాచకః ॥ 7

ధర్మార్థకామమోక్షాంశ్చ ముక్తి వర్గ చతుష్టయీ
తే ప్రాప్యంతే యతోఽనేన తస్మాద్భాగవతం స్మృతమ్ ॥ 8

పాదాదిజానుపర్యంతం ప్రథమస్కంధ ఈరితః,
తతోర్ధ్వం కటిపర్యంతం ద్వితీయస్కంధ ఉచ్యతే ॥ 9

తృతీయో నాభిరిత్యుక్తః చతుర్థముదరం మతం,
పంచమో హృదయం ప్రోక్తం షష్ఠః కంఠం సబాహుకమ్ ॥ 10

సర్వలక్షణసంయుక్తం సప్తమో ముఖ ముచ్యతే,
అష్టమశ్చక్షుషీ విష్ణోః నవమో భ్రుకుటిః పరః ॥ 11

దశమో బ్రహ్మరంధ్రం చ మన ఏకాదశస్స్మృతః,
ఆత్మా తు ద్వాదశస్కంధః శ్రీకృష్ణస్య ప్రకీర్తితః ॥ 12

జీవన్ముక్తో న సందేహో జాయతే శ్రుతిమాత్రతః,
తస్మాదేషా సదా శ్రావ్యా శ్రీమద్భాగవతీ కథా ॥ 13

న యస్య తిష్ఠతే శాస్త్రం గృహే భాగవతం కలౌ,
స కథం వైష్ణవో జ్ఞేయః ఇత్థం ప్రాహన్వయం శివః ॥ 14

కలౌ నాస్తి కలౌ నాస్తి శ్రీమద్భాగవతం వినా,
శ్రేయసాం నిగమః శ్రేష్ఠో విద్యతే జగతీతలే ॥ 15

సర్వాన్ ధర్మాన్ పరిత్యజ్య శ్రీమత్ భాగవతం నరైః,
సేవనీయం ప్రయత్నేన న ధర్మోఽస్తి తతః పరమ్ ॥ 16


శ్లో॥ శ్రీమద్భాగవతేనైవ యస్య కాలోఽ నుగచ్ఛతి,
జీవన్ముక్త స్సవిజ్ఞేయో దేహాంతే కృష్ణరూపధృత్ ॥ 17

శ్రీమద్భాగవతా ద్భక్తిం భక్తేర్జ్ఞానం ప్రజాయతే,
జ్ఞానా న్మోక్ష మవాప్నోతి వేత్తి వేదాంతడిండిమః ॥ 18

శ్రీకృష్ణపూజాపూర్తిస్తు వినా భాగవతం న హి
వినాపి శ్రీహరేః పూజాం శ్రీభాగవతపాతతః ॥ 19

స్వర్గాదిఫలదా ధర్మాః సర్వే ప్రోక్తాః పురానఘ,
స్వసర్వేష్టప్రదోధర్మః శ్రీమద్భాగవతశ్రుతిః
కథాశ్రవా త్పరోధర్మో న భూతో న భవిష్యతి ॥ 20

* * *




## 5. బదరీలక్ష్మీనారాయణులు

భారతేఽ పివర్షే భగవాన్ నారాయణాఖ్య ఆకల్పాంతముపచిత ధర్మ జ్ఞానవైరాగ్యైశ్వర్యోప శమోపరమమాత్మోపలంభనమనుగ్రహా యాత్మవతా మనుకంపయా తపోఽ వ్యక్తగతిశ్చరతి.

తం భగవాన్నారదో వర్ణాశ్రమవతీభిర్భారతీభిః ప్రజాభిర్భగవత్ప్రోక్తా భ్యాం సాంఖ్యయోగాభ్యాం భగవదనుభవోపవర్ణనం సావర్ణే రుపదేక్ష్యమాణః పరమభక్తియోగేనోపసరతి.

ఇదం చాభిగృణాతి – ఓం నమో భగవతే – ఉపశమశీలాయఉపర– తానాత్మ్యాయ – నమోఽ కించనవిత్తాయ – ఋషిఋషభాయ – నారాయణాయ – పరమహంసాయ పరమగురవే – ఆత్మారామాధిపతయే– పరమహంసాయ పరమగురవే – ఆత్మారామాధిపతయే – నమో నమ ఇతి – గాయతి చేదమ్. వ్యాస 5–19–7 నుండి 10

సీ॥ భారతవర్షాధిపతియైన బదరికాశ్రమమున
నున్న నారాయణుండు
భూనాథ! యా మహాత్ముని నారదాదుల
భారతవర్షంబు ప్రజల ప్రేమఁ

బాయక చేరి యుపాస్తి సేయుచు సాంఖ్య
యోగంబు నుపదేశ ముచితవృత్తి
నంది యందఱును గృతార్థు లై యట్టి
నారాయణదేవు నారాధనంబు

ఆ. సేసి యాత్మఁజాలఁజింతించి తత్ప్రకా
శకము లైన మంత్రసంస్తవములఁ
బూజ జేసి ముక్తిఁపొందుచు నుండుదు
రచల మైన భక్తి ననుదినంబు.

పోతన 5(2)-19-52.

* * *

మ. ధరసింహాసనమై నభంబు గొడుగై, తద్దేవతల్ భృత్యులై
పరమామ్నాయము లెల్ల వందిగణమై బ్రహ్మాండ మాగారమై
సిరి భార్యామణియై, విరించి కొడుకై, శ్రీగంగ సత్పుత్రియై
వరుస న్నీ ఘనరాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా! 1


శా. భూతవ్రాతము నంబుజాసనుఁడవై పుట్టింతు, విష్ణుండవై
ప్రీతింబ్రోతు, హరుండవై చెఱుతు నిర్భేద్యుండవై, త్రైగుణో
పేతంబై, పరమాత్మవై నిలుచు నీ పెంపెవ్వరుం గాన ర
బ్జాతోద్భూత సుజాతపూజిత పదాబ్జశ్రేష్ఠ నారాయణా! 2

మ. పరమంబై, పరతత్త్వమై, సకల సంపత్సారమై, భవ్యమై
సురసిద్ధోరగ యక్ష పక్షి ముని రక్షోహృద్గుహాంత స్ఫురి
ద్వర సుజ్ఞాన సుదీపమై, శ్రుతి కథా వ్యాపారమై, సిద్ధమై
సరిలేకెప్పుడు నీదు నామమమరున్ సత్యంబు నారాయణా! 3

మ. ఘన భోగాస్పదులై, గతౌఘమతులై, కారుణ్యులై పుణ్యులై
ధనకీర్తిప్రదులై, దయాభిరతులై, ధర్మాత్ములై, నిత్యులై
మనుజాధీశ్వరులై, మనోజ్ఞ విభులై, మాన్యస్థులై, స్వస్థులై
వనరన్నొప్పెడువారు నీ పదనుతుల్ వర్ణింప నారాయణా! 4

పోతన - నారాయణ శతకము.

# 6. వ్యాస, శుక, పోతన స్తుతులు



## శ్రీవ్యాసభగవానుని స్తుతి

శ్లో॥ నమోఽస్తు తే వ్యాస విశాలబుద్ధే ఫుల్లారవిందాయత పత్ర నేత్ర ।
యేన త్వయా భారత తైల పూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయప్రదీపః ॥

శ్లో॥ నమశ్శృతి శిరఃపద్మషండమార్తాండ మూర్తయే,
బాదరాయణసంజ్ఞాయ మునయే శివవేశ్మవే ॥ 2

అష్టాదశ పురాణానాం కర్తారం చ మహామునిమ్,
బ్రహ్మసూత్రప్రణేతారం నౌమి సత్యవతీసుతమ్ ॥ 3

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥ 4

శ్లో॥ కృష్ణద్వైపాయనం వ్యాసం సర్వలోకహితే రతమ్
వేదాబ్జభాస్కరం వన్దే శమాది నిలయం మునిమ్. 5
సర్వపౌరాణిక కథాసంప్రదాయమహాగురుమ్,
కృష్ణద్వైపాయనం వన్దే పరాశర తనూభవమ్ ॥ 6

ఉ. ప్రాంశు పయోదనీల తనుభాసితు, నుజ్జ్వలదండధారుఁ, బి
గాంశు, జటాచ్ఛటాభరణు, నాగమపుంజపదార్థతత్త్వ ని
స్సంశయాకారుఁ, గృష్ణమృగచర్మ కృతాంబర కృత్యు, భారతీ
వంశ వివర్ధనుం, ద్రిదశ వందితు, సాత్యవతేయుఁగొల్చెదన్.



**శుకయోగీంద్రుని స్తుతి**

శ్లో॥ యోగీంద్రాయ నమస్తస్మై శుకాయ బ్రహ్మరూపిణే,
సంసారసర్పదష్టం యో విష్ణురాత మమూముచత్ ॥ 1
వ్యాస 12-13-20

క. సకలాగమార్థపారగుఁ,
దకలంక గుణాభిరాముఁడంచిత బృందా
రక వంద్య పాదయుగుఁడగు,
శుకయోగికి వన్దనంబు సొరిది నొనర్తున్. 2
పోతన 12-13-40

శ్లో॥ యం ప్రవ్రజంత మనుపేత మపేతకృత్యం
ద్వైపాయనో విరహకాతర ఆజుహావ,
పుత్రేతి తన్మయతయా తరవోఽభినేదు
స్తంసర్వభూత హృదయం మునిమానతోఽస్మి॥ 3
వ్యాస 1-2-2



మ. సముఁడై యెవ్వఁడు ముక్తకర్మచయుఁడై సన్యాసియైయొంటిఁబో
వ మహాభీతి నొహోకుమార! యనుచున్ వ్యాసుండు సీరంగ వృ
క్షములుం దన్మయతం బ్రతిధ్వనులు సక్కంజేసె మున్నట్టిభూ
తమయున్ మ్రొక్కెద బాదరాయణిఁదపోధన్యాగ్రణిన్ ధీమణిన్. 4
పోతన 1-2-53

శ్లో॥ పరీక్షితే కథాం వక్తుం సభాయాం సంస్థితే శుకే,
సుధాకుంభం గృహీత్వైవ దేవాస్తత్ర సమాగమన్ ॥
శుకం నత్వా వదన్సర్వే స్వకార్యకుశలాః సురాః,
కథాసుధాం ప్రయచ్ఛస్వ గృహీత్వైవ సుధామిమామ్ ॥

(శ్రీ పద్మపురాణోత్తరఖణ్డస్థమ్ - భాగవత మాహాత్మ్యమ్)

* * *



**శ్రీమదొంటిమిట్ట కోదండరామాలయమున గల**
**బమ్మెర పోతన శిలావిగ్రహము**

శ్లో॥ "ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు, వాహనంబులున్,
సొమ్ములుఁగొన్ని పుచ్చికొని, చొక్కి, శరీరము వాసి, కాలుచే
సమ్మెటవ్రేటులంబడక, సమ్మతితో హరికిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్."

(ఈపద్యము విగ్రహము క్రింది భాగమున చెక్కబడియున్నది)

మ. ఒనరన్ నన్నయ తిక్కనాదికవు లీ యుర్విం బురాణావళుల్
తెనుఁగుం జేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో
తెనుఁగుం జేయరు మున్ను భాగవతమున్ దీనిన్ దెనిగించి నా
జననంబున్ సఫలంబు చేసెదఁ బునర్జన్మంబు లేకుండఁగన్.
పోతన 1-19

### పోతనామాత్యుని స్తుతి

ఉ. ఎమ్మెలు సెప్పనేల జగమెన్నఁగఁబన్నగరాజశాయికిన్
సొమ్ముగ వాక్యసంపదలు సూఱలు సేసినవాని భక్తిలో
నమ్మినవాని భాగవతనైష్ఠికుఁడై తగువానిఁబేర్మితో
బమ్మెరపోతరాజుఁగవిపట్టపురాజుఁదలంచి మ్రొక్కెదన్ ॥
సింగనకృతము - పోతన 6-1-12

క. వాగీశాగోచరమగు
భాగవతాగమము రామభద్రుని పేరన్
ధీగరిమఁదెనుఁగు చేసిన
భాగవతుం బోతరాజు బ్రణుతింతు మదిన్ ॥
- తామరవల్లి తిమ్మయ్య.

* * *

## 7. ప్రధానదేవతావందనము

## పోతన పద్యములు

### విష్ణువు

శ్రీకైవల్యపదంబుఁజేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలనకళా సంరంభకున్ దానవో
ద్రేకస్తంభకుఁగేళిలోలవిలస ద్దృగ్జాలసంభూతనా
నాకంజాత భవాండకుంభకుమహానందాంగనాడింభకున్. 1-1

### ఈశ్వరుడు

ఉ. వాలిన భక్తిమ్రొక్కెద నవారిత తాండవ కేళికిన్ దయా
శాలికి శూలికిన్ శిఖరిజాముఖపద్మ మయూఖమాలికిన్
బాలశశాంకమౌళికిఁగపాలికిఁమన్మథగర్వపర్వతో
న్మూలికి నారదాది మునిముఖ్యమనస్సరసీరుహాళికిన్. 1-2

### బ్రహ్మ

ఉ. ఆతత సేవఁజేసెద సమస్తచరాచరభూతసృష్టి వి
జ్ఞాతకు భారతీహృదయ సౌఖ్యవిధాతకు వేదరాశి ని
ర్ణేతకు దేవతానికరనేతకుఁగల్మషజేతకున్ నత
త్రాతకు ధాతకున్ నిఖిలతాపసలోకశుభప్రదాతకున్. 1-3

వ. అని నిఖిల భువన ప్రధానదేవతావందనంబుఁజేసి. 1-4

### విఘ్నేశ్వరుడు

మ. ఆదరమొప్ప మ్రొక్కిదుదు నద్రిసుతాహృదయానురాగసం
పాదికి దోషభేదికిఁబ్రసన్న వినోదికి విఘ్నవల్లికా
చ్ఛేదికి మంజువాదికి నశేషజగజ్జననందవేదికిన్
మోదకఖాదికిన్ సమదమూషకసాదికి సుప్రసాదికిన్. 1-5

## సరస్వతి

ఉ. క్షోణితలంబునన్ నుదురు సోఁగకఁ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికిఁజంచరీక చయసుందరవేణికి రక్షితామర
శ్రేణికిఁదోయజాతభవ చిత్తవశీకరణైక వాణికిన్
వాణికి నక్షదామ శుక వారిజ పుస్తక రమ్యపాణికిన్. 1-6

శా. పుట్టం బుట్ట శరంబునన్ మొలువ నంభోయానపాత్రంబునన్
నెట్టం గల్గను గాళిఁగొల్వను బురాణింపన్ దొరంకొంటి మీఁ
దెట్టే వెంటఁజరింతుఁదత్సరణి నాకీవమ్మ! యోయమ్మ! మేల్
పట్టున్ నా కగుమమ్మ! నమ్మితిఁజుమీ బ్రాహ్మీ! దయాంభోనిధీ! 1-7

ఉ. శారద నీరదేందు ఘనసార పటీరమరాళమల్లికా
హార తుషారఫేన రజతాచల కాశఫణీశకుందమం
దార సుధాపయోధి సితతామరసామరవాహినీ శుభా
కారత నొప్పు నిన్ను మదిఁగానఁగ నెన్నఁడు గల్గు భారతీ. 1-8

ఉ. అంబ! నవాంబుజోజ్జ్వల కరాంబుజ శారదచంద్ర చంద్రికా
డంబరచారుమూర్తి, ప్రకటస్ఫుటభూషణరత్నదీపికా
చుంబితదిగ్విభాగ, శ్రుతిసూక్తివివిక్తనిజప్రభావ, భా
వాంబరవీథి విశ్రుతవిహారిణి, నన్ గృపఁజూడు భారతీ! 1-9

## పార్వతి

ఉ. అమ్మలఁగన్న యమ్మ, ముగురమ్మలమూలపుటమ్మ, చాల పె
ద్దమ్మ, సురారులమ్మ, కడుపాఱడివుచ్చినయమ్మ, దన్ను లో
నమ్మినవేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ, దుర్గ మా
యమ్మ, కృపాబ్ధి యిచ్చుత మహత్త్వకవిత్వ పటుత్వసంపదల్. 1-10



## లక్ష్మి

మ. హరికిన్ బట్టపుదేవి, పున్నెములప్రోవర్థంబు పెన్నిక్క, చం
దురు తోఁబుట్టువు భారతీగిరిసుతల్ దో నాడుపూఁబోఁడి, దా
మరలందుండెడి ముద్దరాలు, జగముల్ మన్నించునిల్లాలు భా
సురతన్ లేములు వాపుతల్లి సిరియిచ్చున్ నిత్యకల్యాణముల్. 1-11

## ప్రబంధహేతువు

తే. చేతులారంగ శివునిఁబూజింపఁడేని,
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని
దయయు సత్యంబు లోనుగాఁదలఁపఁడేనిఁ,
గలుగ నేటికిఁదల్లుల కడుపుఁజేటు. - పోతన 1-12

పోతనామాత్యుఁడు గంగలో స్నానముచేసి ఒక మంటప మధ్యంబున ధ్యానంబు సేయు సమయంబున శ్రీరామభద్రుఁడు దర్శనమునిచ్చుట. 1-13

సీ, మెఱుఁగు చెంగటనున్న మేఘంబుకైవడి
నువిదచెంగట నుండ నొప్పువాఁడు
చంద్రమండల సుధాసారంబుపోలిక
ముఖమునఁజిఱునవ్వు మొలచువాఁడు
వల్లీయుత తమాల వసుమతీజము భంగి
బలువిల్లు మూఁపునఁబరఁగువాఁడు
నీలనగాగ్ర సన్నిహిత భానునిభంగి
ఘనకిరీటము దలఁగలుగువాఁడు

ఆ. పుండరీకయుగముఁబోలు కన్నులవాఁడు,
వెడఁదయురమువాఁడు విపులభద్ర
మూర్తివాఁడు రాజముఖ్యుఁడొక్కరుఁడు నా,
కన్నుఁగవకు నెదురఁగానఁబడియె. 1-14

వ. ఏను నా రాజశేఖరుం దేటిజూచి భాషింప యత్నంబు సేయునెడ, నతఁడు దా రామభద్రుండ, మన్నామాంకితంబుగా శ్రీమహాభాగవతంబుఁ దెనుంగు సేయుము. నీకు భవబంధములు దెగునని యాన తిచ్చి తిరోహితుం డయిన సమున్మీలిత నయనుండ నై వెఱఁగుపడి చిత్తంబున. 1-15

## పోతనామాత్య ప్రతిజ్ఞ

క. పలికెడిది భాగవత మఁట!
పలికించు విభుండు రామభద్రుం డఁట! నేఁ
బలికిన భవహర మగు నఁట!
పలికెద, వేఱొండుగాథ పలుకఁగ నేలా? 1-16

ఆ. భాగవతము దెలిసి పలుకుట కష్టంబు,
శూలి కైనఁతమ్మిచూలి కైన
విబుధజనులవలన విన్నంత కన్నంత,
దెలిసి వచ్చినంత దేటపఱుతు. 1-17

క. కొందఱకుఁదెనుఁగు గుణమగుఁ,
గొందఱకును సంస్కృతంబు గుణమగు రెండుం
గొందఱకు గుణములగు నే,
నందఱ మెప్పింతుఁగృతుల నయ్యెయెడలన్. 1-18

## కృతిసమర్పణ

## (షష్ఠ్యంతములు)

ఉ. హారికి నందగోకులవిహారికిఁజక్రసమీరదైత్య సం
హారికి భక్తదుఃఖపరిహారికి గోపనితంబినీ మనో
హారికి దుష్టసంప దపహారికి ఘోషకుటీపయోఘృతా
హారికి బాలకగ్రహమహాసురదుర్వనితాప్రహారికిన్. 1-27



ఉ. శీలికి నీతిశాలికి వశీకృతశూలికి బాణహస్తిని
ర్మూలికి ఘోరనీరదవిముక్తశిలాహత గోపగోపికా
పాలికి వర్ణధర్మపరిపాలికి నర్జునభూజయుగ్మ సం
చాలికి మాలికిన్ విపులచక్రనిరుద్ధమరీచిమాలికిన్. 1-28

ఉ. క్షంతకు గాళియోరగ విశాలఫణోపరినర్తన క్రియా
రంతకు నుల్లసన్మగధరాజ చతుర్విధఘోరవాహినీ
హంతకు నింద్రనందన నియంతకు సర్వచరాచరావళీ
మంతకు నిర్జితేంద్రియ సమంచితభక్తజనానుగంతకున్. 1-29

ఉ. న్యాయికి భూసురేంద్రమృతనందనదాయికి రుక్మిణీ మన
స్స్థాయికి భూతసమ్మద విధాయికి సాధుజనానురాగ సం
ధాయికిఁబీతవస్త్ర పరిధాయికిఁబద్మభవాండ భాండ ని
ర్మాయికి గోపికానివహమందిరయాయికి శేషశాయికిన్. 1-30

* * *

# 8. శ్రీభాగవత ప్రశంస

ఉ. ఎయ్యది కర్మబంధములనెల్ల హరించు, విభూతికారణం
బెయ్యది, సన్మునీంద్రులకు నెల్ల గవిత్వ సమాశ్రయంబు ము
న్నెయ్యది, సర్వమంత్రముల నేలిన దెయ్యది, మోక్షలక్ష్మి రూ
పెయ్యది, దానిఁబల్కెద, సుహృద్యము, భాగవతాఖ్య మంత్రమున్.
పోతన 6-1-14

శ్రీభాగవతము మహాపురాణరత్నము. మోక్షప్రతిపాదకము. సర్వోపనిషత్తుల సారము ఇందుఁజెప్పఁబడినది. భారతీయ సంస్కృతికి దర్పణము. భక్తి జ్ఞాన వైరాగ్య తత్త్వములు ఇందు ప్రతిపాదింపబడినవి. శ్రీభాగవత రసామృత పానముచే మానవజన్మ సఫలమగును. శ్రీమన్నారాయణుడుప్రసన్నుడగును. తన్మూలమున భగవత్ప్రాప్తి రూపమగు మోక్షము కరతలామలక మగును.

శ్రీభాగవతము నిగమ కల్పతరు ఫలము. శుకముఖమునుండి రాలినది. అది రసమయము. అందు విడువవలసిన భాగములేదు. ఆ (కథా) శరీరము ఆపాతము ఆస్వాద యోగ్యమే.

శ్రీమన్నారాయణుడు సాధుజనసంరక్షణకు, దుష్టజన సంహారమునకు ధర్మసంస్థాపనమునకు, అనేక లీలావతారముల నెత్తెను. ఆయా అవతార వైభవములు శ్రీభాగవతమున బహుముఖముగ వర్ణింబడినవి. సర్వసులభుఁడగు శ్రీకృష్ణుని యవతార వైభవము సమగ్రముగ మనోహరముగ వర్ణింపబడినది.

పుండరీకాక్షుడు భాగవత సారమును నాలుగు శ్లోకములలో బ్రహ్మకుపదేశించెను. ఆతఁడు తన మానసపుత్రుడైన నారదునకు, ఆతఁడు పారాశర్యవ్యాసునకు ఉపదేశించెను. విష్ణుసేవా మహిమ, విష్ణుతత్త్వము, విష్ణుగుణముల తెలిపెడి భాగవతమును రచించి లోకమునకు తెలియచేయుమనియు, దీనివలన మనశ్శాంతి సంతోషము లభించుననియు, శ్రీమన్నారాయణునకు పరమప్రీతి కలుగుననియు విశదీకరించెను.


నారదోపదేశము ప్రకారము వ్యాసమహర్షి బ్రహ్మజ్ఞాని యగు శుకయోగికి, ఆయన ప్రాయోపవిష్టుడగు పరీక్షిన్మహారాజునకు ఏడు దినములలో భాగవతమంతయు యెఱిఁగించెను. పరీక్షిన్మహారాజు ముక్తుడయ్యెను. మానవజన్మకు ఫలము శ్రీమన్నారాయణస్మరణము. శ్రీహరి గుణకీర్తనము. అవి సర్వబంధముల తొలగించును. మోక్షంబు సిద్ధింపఁజేయును. శుకమహర్షి భాగవతమును ఉపదేశించునపుడు శ్రీసూతుడు (రోమహర్షణ నందనుడు) ను వినియున్నాడు. తరువాత నాతఁడు నైమిశారణ్యమున శౌనకాది మహర్షులకు వినిపించెను. ఈ విధముగ ప్రచారమునందిన సంస్కృత భాగవతము ఈనాడు మనకు లభించినది.

ఈ భాగవతమును శ్రీరామభక్తుడైన పరమపూజ్యుడైన పోతనామాత్యుడు భక్తిరస పరిప్లావితముగ తెనుఁగున రచించి తెలుగువారికి వీనుల విందొనరించినాడు. అనేక పురాణగ్రంథముల తెనుఁగొనరించిన నన్నయ తిక్కనాది మహాకవులు భాగవతమును దెనుఁగు చేయక విడుచుట తన పురాకృతశుభాధిక్యమే యని భావించినాడు. వ్యాస పోతనామాత్యుల రచనలు గంగా గోదావరీ ప్రవాహములు, సుమధుర తదమృతరసాస్వాదముచే ప్రతి మానవుడు సర్వశుభముల పొందగలడు.

శ్రీవ్యాసమహర్షి భాగవత ప్రారంభోప సంహారములందు "సత్యం పరం ధీమహి" యనుచు గాయత్రీ మహామంత్రములోని భాగమును స్వీకరించి యీ శ్రీభాగవతము గాయత్రీ మహామంత్రమునకు వివరణమని లోకమునకు చాటి చెప్పినాడు.

పురాణము లన్నింటికంటె విష్ణుభక్తి ప్రాశస్త్యమును సంపూర్ణముగ శ్రీమద్భాగవతమున వివరింపబడినది. వ్యాస భాగవత శ్లోక సంఖ్య 18 వేలు. పోతన భాగవతమున గద్య పద్య సంఖ్య 9 వేలు. వీటి మహిమ అద్వితీయము. భారతీయ వాఙ్మయమున ప్రామాణికమైన గ్రంథరాజము. యావద్భారతదేశ మహాజన హృదయములకు జూరగొనినది శ్రీమద్భాగవత మహాపురాణమే!

ఏ గృహమందు శ్రీమద్భాగవతము ఉండునో ఆ గృహమందు శ్రీకృష్ణ పరమాత్మ నివసించును. ఐహికాముష్మిక భోగ భాగ్యములు స్థిరముగ నుండును.



# 9. శ్రీ శ్రీనివాస నారాయణ స్తుతులు

## శ్రీమార్కండేయ కృతము

శ్లో॥ "భాస్వచ్చన్ద్రసమే యదీయనయనే భార్యా యదీయా రమా
యస్మాద్విశ్వసృజప్యభూద్యమికులం యద్ధ్యానయుక్తం సదా ।
నాథో యో జగతాం నగేన్ద్రదుహితుర్నాథోఽపి యద్భక్తిమాన్
తాతో యో మదనస్య యో దురితహా తం వేంకటేశం భజే ॥ 1

పాహి మాం వేఙ్కటాధీశ! ప్రణతార్తిప్రభఞ్జన!
ఆత్మబన్ధో! కృపాసిన్ధో! సతతం తే నమో నమః ॥ 2

నారాయణాద్రికృతవాస! హరే! నమస్తే
నారాయణాఖిలజగత్పతయే నమస్తే ।
కారుణ్యపూర్ణ! కమలాపతయే నమస్తే
కఞ్జాక్ష! రక్ష కమనీయతనో! నమస్తే ॥ 3

వినా వేఙ్కటేశం న నాథో న నాథః
సదా వేఙ్కటేశం స్మరామి స్మరామి ।
హరే! వేఙ్కటేశ! ప్రసీద ప్రసీద!
ప్రియం వేఙ్కటేశ! ప్రయచ్ఛ ప్రయచ్ఛ ॥ 4

అహం దూరతస్తే పదామ్భోజయుగ్మ –
ప్రణామేచ్ఛయాఽఽగత్య సేవాంకరోమి ।
సకృత్సేవయా నిత్యసేవాఫలం త్వం
ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో వేఙ్కటేశ! ॥ 5



అజ్ఞానినా మయా దోషానశేషాన్ విహితాన్ హరే ।
క్షమస్వ త్వం క్షమస్వ త్వం శేషశైలశిఖామణే!" ॥ 6

– శ్రీ మార్కణ్డేయపురాణే తీర్థఖణ్డే ద్వితీయోఽధ్యాయః

## ఓమ్ నమో నారాయణాయ

శ్లో॥ సాంద్రానందావబోధాత్మక మనుపమితం దేశకాలావధిభ్యాం
నిర్ముక్తం నిత్యముక్తం నిగమశతసహస్రేణ నిర్భాస్యమానమ్
అస్పష్టం దృష్టమాత్రే పునరురుపురుషార్థాత్మకం బ్రహ్మతత్త్వం
తత్తావద్భాతి సాక్షాద్గురుపవనపురే హంత భాగ్యం జనానామ్.

### తెలుగు అనువాదము

అందఱిభాగ్యమై శతసహస్రపర శ్రుతి భాస్యమై చిదా
నందఘనమ్ము బ్రహ్మము ననందగు తత్త్వము కన్న మాత్రలో
నందని మోక్ష మెట్టయెదురైన దహో! గురువాయుమందిర
మ్మం దిదె దేశకాలతులనాది విముక్తము నిత్యముక్తమై.

శ్లో॥ యోగీంద్రాణాం త్వదంగేష్వధికసుమధురం ముక్తిభాజాం నివాసో
భక్తానాం కామవర్ష ద్యుతరుకిసలయం నాథ! తే పాదమూలమ్
నిత్యం చిత్తస్థితం మే పవనపురపతే! కృష్ణ! కారుణ్యసింధో!
హృత్వా నిశ్శేషతాపాన్ ప్రదిశతు పరమానందసందోహలక్ష్మీమ్.

### తెలుగు అనువాదము

నిరతిన్ యోగులకుం త్వదంగతతి నెంతేఁదియ్యనై ముక్తిమం
దిరమై భక్తుల కోర్కులన్ గురియుచో నీ పాదమూలమ్ము స్వ
స్తరుపాళిన్ జిగురౌచుఁగృష్ణ! వెతయంతన్ బాపి నాభావ మం
దరుణజ్యోతి స్ఫురించి కూరుచుత బ్రహ్మానందరాజ్యేందిరన్.

(నారాయణీయము – నారాయణభట్టాత్రి – కల్లూరి వేంకటసుబ్రహ్మణ్య దీక్షితులు)

* * *

# 10. శ్రీమద్భాగవత మాహాత్మ్యమ్

## (పద్మపురాణము)

శ్లో॥ ఏకభాగే ఋషిగణా స్తదన్యత్ర దివౌకసః
వేదోపనిషదోఽన్యత్ర తీర్థాన్యత్ర స్త్రియోఽన్యతః ॥ 1

జయశబ్దో నమఃశబ్దః శంఖశబ్దస్తథైవ చ ।
చూర్ణలాజాప్రసూనానాం నిక్షేపః సుమహానభూత్ ॥ 2

విమానాని సమారుహ్య కియన్తో దేవనాయకాః ।
కల్పవృక్ష ప్రసూనాని సర్వాం స్తత్ర సమాకిరన్ ॥ 3
III-20, 21, 22

సీ. ఉపనిషద్వేదంబు లొకవంక నొకవంక.
దీర్థరాజంబులు స్త్రీలలామ
లొకవంక మునివరు లొకవంక సురలును
నొకవంకఁగులగిరు లొక్కవంక
సనకాదిమహనీయ సార్వభౌములు
భాగవతపురాణమ్మును బఠనచేయ
నారంభమొనరించినంతనే పుష్ప
వర్షంబును గురిసిరి సకలసురలు

గీ. తుములమయ్యెను దివ్యదుందుభినినాద,
మద్వితీయము జయశబ్ద మయ్యెనంత
శంఖనాదము లొప్పారె సరభసముగ,
నంద రపరిమితానంద మంది రచట. 1 (బు.వేం.26)

శ్లో॥ సదా సేవ్యా సదా సేవ్యా శ్రీమద్భాగవతీ కథా ।
యస్యాః శ్రవణమాత్రేణ హరేశ్చిత్తం సమాశ్రయేత్ ॥ 4

న గంగా న గయా కాశీ పుష్కరం న ప్రయాగకమ్ ।
శుకశాస్త్రకథాయాశ్చ ఫలేన సమతాం నయేత్ ॥ 5

శ్లో॥ వేదాదిర్వేదమాతా చ పౌరుషం సూక్తమేవ చ ।
త్రయీ భాగవతం చైవ ద్వాదశాక్షర ఏవ చ ॥ 6



ద్వాదశాత్మా ప్రయాగశ్చ కాలః సంవత్సరాత్మకః ।
బ్రాహ్మణాశ్చాగ్నిహోత్రం చ సురభిర్ద్వాదశీ తథా ॥ 7

తులసీ చ వస న్తశ్చ పురుషోత్తమ ఏవ చ ।
ఏతేషాం తత్త్వతః ప్రాజ్ఞైర్న పృథగ్భావ ఇష్యతే ॥ 8
III - 25, 32, 34, 35, 36

సీ. ఉచ్చైస్స్వనంబున నుప్పొంగి సనకాదు,
లిట్లని ఘోషించి రెలమిమిగుల
"సేవ్యంబు సేవ్యంబు సేవ్యంబు సేవ్యంబు,
భాగవతామరపాదపంబు"
గంగామహానది కాశీప్రయాగలు,
గయ దీనికిని సాటిగావు నిజము
ప్రణవంబు గాయత్రి బ్రాహ్మణప్రవరుఁడు,
భాగవతంబును బ్రహ్మ మొకటె

గీ. విష్ణుచింతన గోసేవ విధియుతమగు,
తులసివనసేవ యత్యంత మలఘుఫలము
నొసఁగు భాగవతామ్నాయ మొక్కటెయగు,న
దాని మహిమంబుఁదెలుపమాతరముకాదు. 2 (బు.వేం.27)

శ్లో॥ గ్రన్థోఽష్టాదశసాహస్రో ద్వాదశస్కన్ధసమ్మితః ।
పరీక్షిత్ శుక సంవాదః శృణు భాగవతం చ తత్ ॥ 9

తావత్ సంసారచక్రేఽస్మిన్ భ్రమతేఽజ్ఞానతః వుమాన్ ।
యావత్ కర్ణగతా నాస్తిశుకశాస్త్ర కథా క్షణమ్ ॥ 10

కిం శ్రుతైర్బహుభిః శాస్త్రైః పురాణైశ్చ భ్రమావహైః ।
ఏకం భాగవతం శాస్త్రం ముక్తిదానేన గర్జతి ॥ 11(III-26,27,28)

మ. శుకసర్వేశ్వరుఁడిచ్చె లోకములకున్ కుద్ధంబు జ్ఞానామృతం
బకలంకంబును బుణ్యభాగవత విఖ్యాతంబు సేవింపఁగన్
వికలస్వాంతత వీడి యెల్లరును సేవింపన్ మహాభాగ్యమౌ
నిఁక వేదంబులు శాస్త్రపంక్తులును వేఱే యేల? యూహింపఁగన్॥ 3
(బు.వేం.28)

# 11. శ్రీమద్భాగవత ప్రార్థన

శ్లో॥ శ్రీమద్భాగవతాఖ్య త్వం ప్రత్యక్షః కృష్ణ ఏవ హి
స్వీకృతోఽసి మయా నాథ ముక్త్యర్థం భవసాగరే ॥ 12
(కౌశిక సంహిత - 6-60)

ఆ. అతిరహస్య మైనహరిజన్మ కథనంబు
మనుజుఁడెవ్వఁడేని మాపు రేపుఁ
జాలభక్తితోడఁజదువుఁదా సంసార
దుఃఖరాశిఁబాసి తొలఁగి పోవు. పోతన 4

కం. అమ్మా! భాగవతగ్రం
థమ్మా! నీ వివిధభావతతి సర్వము స్ప
ష్టమ్ముగ నెఱుఁగఁగలమె! ము
ఖ్యమ్మగు భావమ్ము దెల్పు మంజలియిడుచున్. 5 (మి.గు.శ.19)

క. హరికథలు హరిపురాణము,
హరిసంకీర్తనలు కలుగ హరియింపవె? దు
ర్భరకలిదోషములెల్లను,
పరపదముఁదప్పు కిచ్చు భాగవతంబున్. 6 (బు.వేం.-14)

* * *

**శ్రీభాగవతగ్రంథ ప్రతిపాద్య శ్రీకృష్ణ ప్రార్థన**

మ. తరుణాబ్జారుణలోచనద్వయి కృపాధౌరేయ మై యొప్ప సా
గరకన్యాకుచకుంభపాళిఁబులకల్ గన్పట్ట మౌనీంద్రహృ
త్సరసీజంబులు సంచలింప మురళీసంజాతగీతామృత
స్ఫురణన్ రాల్ గరఁగం జరించుహరికైశోరంబు భావించెదన్. 7

చ. జలనిధికన్యకాఘనకుచస్థలిపచ్చలతాళి గోపికా
విలసితహారమధ్యమణి విశ్వజగద్వలయప్రకాశకో
జ్వలమహనీయరత్న మనివారితకాళియభోగిభోగమం
డలగిరివజ్రమై వెలయునందతనూజు భజింతు నామదిన్. 8

ఓమ్

శ్రీరస్తు అవిఘ్నమస్తు శుభమస్తు





శ్రీగణేశ శారదా గురుభ్యో నమః
శ్రీ సీతా-లక్ష్మణభరత-శత్రుఘ్న హనుమత్సమేత
శ్రీరామచన్ద్ర పరబ్రహ్మణే నమః
శ్రీరుక్మిణీసత్యభామాసమేతశ్రీకృష్ణపరబ్రహ్మణే నమః
ఓమ్ నమో భగవతే వాసుదేవాయ

# శ్రీమద్భాగవత మణిహారము

## 12. ప్రథమ స్కంధము

### శ్రీమహాభాగవతమునకు ప్రారంభము

### అధ్యాయము-1

ఓం విఘ్నేశ విధిమార్తాణ్డ చన్ద్రేన్ద్రోపేన్ద్రవన్దిత,
నమో గణపతే తుభ్యం బ్రహ్మణాం బ్రహ్మణస్పతే ॥

శ్లో॥ శ్రీరామచన్ద్ర శ్రితపారిజాతః సమస్తకళ్యాణగుణాభిరామః ।
సీతాముఖామ్భోరుహచఞ్చరీకో నిరన్తరం మఙ్గళమాతనోతు ॥

యో లీలాలాస్యసంలగ్నే గతోఽలోలోఽపి లోలతామ్ ।
తం లీలావపుషం బాలం వన్దే లీలార్థసిద్ధయే ॥

విశ్వసర్గ విసర్గాది నవలక్షణ లక్షితమ్,
శ్రీకృష్ణాఖ్యం పరంధామ జగద్ధామ నమామి తత్ ॥

శ్లో॥ జన్మాద్యస్య యతోఽ న్వయాదితరత
శ్చార్థేష్వభిజ్ఞః స్వరాట్
తేనే బ్రహ్మహృదా య ఆదికవయే
ముహ్యంతి యత్సూరయః ।
తేజోవారిమృదాం యథా వినిమయో
యత్ర త్రిసర్గోఽ మృషా
ధామ్నా స్వేన సదా నిరస్తకుహకం
సత్యం పరం ధీమహి ॥ 1

వ్యాస. 1-1-1

సీ. విశ్వజన్మస్థితి విలయంబు లెవ్వని
వలన నేర్పడు ననువర్తనమున
వ్యావర్తనమునఁగార్యములం దభిజ్ఞుఁడై
తాన రాజగుచుఁజిత్తమునఁజేసి
వేదంబు లజునకు విదితముల్ గావించె
నెవ్వఁడు బుధులు మోహింతు రెవ్వ
నికి నెండమావుల నీట గాచాదుల
నన్యోన్యబుద్ధి దా నడరునట్లు

ఆ. త్రిగుణసృష్టి యెందు దీపించి సత్యము
భంగిఁదోఁచు స్వప్రభానిరస్త
కుహకుఁడెవ్వఁడతనిఁగోరి చింతించెద
ననఘు విశ్వమయుని ననుదినంబు. 1

పోతన 1-1-32

వ. ఇట్లు "సత్యం పరం ధీమహి" యను గాయత్రీ ప్రారంభంబున గాయత్రీనామ బ్రహ్మరూపంబై మత్స్యపురాణంబులోన గాయత్రి నధికరించి



ధర్మవిస్తరంబును వృత్రాసుర వధంబును నెందుఁజెప్పంబడు నదియ భాగవతంబని పలుకుటం జేసి యీ పురాణంబు శ్రీమహాభాగవతంబన నొప్పుచుండు. 2

పోతన 1-1-33

శ్రీమద్భాగవత ప్రారంభ శ్లోకమున గాయత్రీమంత్రశబ్దములకు బర్యాయ పదములు ప్రయోగించి తన్మంత్రార్థమును శ్లోకమునందు గూర్చి <u>శ్రీమద్భాగవతము గాయత్రీస్తుతితో ప్రారంభింపఁబడినది.</u>

"**సవితుర్దేవస్య** – జన్మాద్యస్య, **వరేణ్యం** – పరం, అభిజ్ఞః, **భర్గః** – స్వరాట్, ధామ్నార స్వేన సదానిరస్తకుహకం, **తత్** – సత్యం, **ధీమహి. ధియోయోనః ప్రచోదయాత్,** తేనే బ్రహ్మహృదా య ఆదికవయే." అని యిట్లు గాయత్రీ మంత్రశబ్దములకు బర్యాయ పదములు ప్రయోగించి తన్మంత్రార్థమును ఈ శ్లోకమునందుఁగూర్చఁబడినది.

అట్లే, <u>శ్రీభాగవత సమాప్తియందును గాయత్రీస్తుతి చేయబడినది.</u>

శ్లో॥ కస్మై యేన విభాసితోఽ యమ తులో జ్ఞానప్రదీపః పురా
తద్రూపేణ చ నారదాయ మునయే కృష్ణాయ తద్రూపిణా ।
యోగీంద్రాయ తదాత్మనా చ భగవద్రాతాయ కారుణ్యత
స్తచ్ఛుద్ధం విమలం విశోక యమృతం **సత్యం పరం ధీమహి** ॥ 2

వ్యాస 12-13-18

శా. ఏబ్రహ్మం బతులంబునై వెలయు నెంతే జ్ఞానదీపంబుగా
నేబ్రహ్మం బగు నారదుండు మునులున్ కృష్ణుండు తద్రూపిగా
నేబ్రహ్మత్ములు యోగులున్ శుకుఁడునై యేపారు శుద్ధంబునౌ
**నాబ్రహ్మం బగుసత్యమున్ బరము** నేనద్దాని నర్చించెదన్. 3

(బు.వేం. – 7000)

"గాయత్ర్యాఖ్య శ్రీపరబ్రహ్మరూప మేత త్పురాణ మితి సిద్ధం
అత ఏవ భాగవతం నామ అన్యదితి నశంకనీయమ్."
"శ్రీనారాయణాఖ్యం తత్త్వం ధీమహీతి గాయత్ర్యైవ
యథోపక్రమముపసంహరన్ గాయత్ర్యాఖ్యా బ్రహ్మ
విద్యేయమితి దర్శయతి." **(శ్రీధరీయ వ్యాఖ్యానము)**

కావున, యీభాగవతమునందు జెప్పబడిన నారాయణతత్త్వమే గాయత్రీ బ్రహ్మవిద్య.

మరియు ధ్యానమ్ –

"ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ
నారాయణ స్సరసిజాసన సన్నివిష్టః.
కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటీ
హారీ హిరణ్మయవపు ర్ధృతశఙ్ఖచక్రః.

ప్రోద్యదాదిత్యవర్ణాభ స్సూర్యమండలమధ్యగః
చక్రశంఖరోంకస్థ దోర్ద్వయోః ధ్యేయ ఏవ చ."

శ్లో॥ ధర్మః ప్రోజ్ఝితకైతవోऽ త్ర పరమో నిర్మత్సరాణాం 'సతాం
వేద్యం వాస్తవమత్ర వస్తు శివదం తాపత్రయోన్మూలనమ్ ।
శ్రీమద్భాగవతే మహామునికృతే కిం వా పరైరీశ్వరః
సద్యోహృద్యవరుధ్యతేऽ త్ర కృతిభిఃశుశ్రూషుభిస్తత్క్షణాత్ ॥ 3
వ్యాస 1-1-2

సీ. శ్రీమంతమై మునిశ్రేష్ఠకృతం బైన
భాగవతంబు సద్భక్తితోడ
వినఁగోరువారల విమలచిత్తంబులఁ
జెచ్చెర నీశుఁడు చిక్కుఁగాక
యితరశాస్త్రంబుల నీశుండు చిక్కునే
మంచివారలకు నిర్మత్సరులకుఁ
గపటనిర్ముక్తులై కాంక్ష సేయక యిందుఁ
దగిలియుండుట మహాతత్త్వబుద్ధిఁ



తే. బరఁగ నాధ్యాత్మికాది తాపత్రయంబు,
నడఁచి పరమార్థభూతమై యధికసుఖద
మై సమస్తంబుఁగాకయు నయ్యునుండు,
వస్తువెఱుఁగంగఁదగు భాగవతమునందు. 4
పోతన 1-1-34

శ్లో॥ నిగమకల్పతరోర్గళితం ఫలం
శుకముఖాదమృతద్రవసంయుతమ్ ।
పిబత భాగవతం రసమాలయం
ముహురహో రసికా భువి భావుకాః ॥
వ్యాస 1-1-3

వేదకల్పవృక్షవిగళితమై శుక
ముఖసుధాద్రవమున మొనసి యున్న
భాగవతపురాణ ఫలరసాస్వాదన
పదవిఁగనుఁడు రసిక భావవిదులు ॥ 5
పోతన 1-1-35

## నైమిశారణ్యము

శ్లో॥ నైమిశేऽ నిమిష క్షేత్రే మునయశ్శౌనకాదయః ।
సత్రం స్వర్గాయ లోకాయ సహస్రసమమాసత ॥ 5
వ్యాస 1-1-4

క. పుణ్యంబై మునివల్లభ
గణ్యంబై కుసుమఫలనికాయోత్థిత షా
డ్గుణ్యంబై నైమిశాఖ్యా
రణ్యంబు నుతింపఁదగు నరణ్యంబులలోన్.

పోతన 1-1-36

### శౌనకాది ఋషుల ప్రశ్న

శ్లో॥ ప్రాయేణాల్పాయుషస్సర్వే కలావస్మిన్ యుగే జనాః ।
మందాస్సుమందమతయో మందభాగ్యాహ్యుపద్రుతాః ॥

వ్యాస 1-1-10

చ. అలసులు మందబుద్ధియుతు లల్పతరాయువు లుగ్రరోగ సం
కలితులు మందభాగ్యులు సుకర్మము లెవ్వియుఁజేయఁజాల రీ
కలియుగమందు మానవులు గావున నెయ్యది సర్వసౌఖ్య మై
యలవడు నేమిటం బొడము నాత్మకు శాంతి మునీంద్ర! చెప్పవే?

పోతన 1-1-42

శ్లో॥ భూరీణి భూరికర్మాణి శ్రోతవ్యాని విభాగశః ।
అతస్సాధోఽత్ర యత్సారం సముద్ధృహ్య మనీషయా ॥

బ్రూహి భద్రాయ భూతానాం యేనాత్మా సంప్రసీదతి ।
సూత జానాసి భద్రం తే భగవాన్ సాత్వతాం పతిః ॥

దేవక్యాం వసుదేవస్య జాతో యస్య చికీర్షయా ।
తన్నః శుశ్రూషమాణానామర్హస్యంగానువర్ణితుమ్ ॥

యస్యావతారో భూతానాం క్షేమాయ చ భవాయ చ ।
ఆపన్నః సంసృతిం ఘోరాం యన్నామ వివశో గృణన్ ॥ 10

వ్యాస 1-1-11 నుండి 14



సీ. ఎవ్వనియవతార మెల్లభూతములకు
సుఖమును వృద్ధియు సొరిదిఁజేయు
నెవ్వనిశుభనామ మేప్రొద్దు నుడువంగ
సంసారబంధంబు సమసిపోవు
నెవ్వనిచరితంబు హృదయంబుఁజేర్పంగ
భయమంది మృత్యువు పరువువెట్టు
నెవ్వనిపదనది నేపారు జలముల
సేవింప నైర్మల్యసిద్ధి గలుగుఁ

తే. దపసు లెవ్వనిపాదంబు దగిలి శాంతి
తెరువుఁగాంచిరి వసుదేవదేవకులకు
నెవ్వఁడుదయించెఁదత్కథలెల్ల వినఁగ
నిచ్చపుట్టెడు నెఱిఁగింపు మిద్ధచరిత.

క. భూషణములు వాణికి నఘ
పేషణములు మృత్యుచిత్తభీషణములు హృ
త్తోషణములు కల్యాణ వి
శేషణములు హరిగుణోపచితభాషణముల్.

పోతన 1-1-43, 44

శ్లో॥ శుద్ధికామో న శృణుయాద్యశః కలిమలాపహమ్ ।
తస్య కర్మాణ్యుదారాణి పరిగీతాని సూరిభిః ॥
బ్రూహి నః శ్రద్ధధానానాం లీలయా దధతః కలాః ।
అథాఖ్యాహి హరేర్ధీమన్నవతారకథాః శుభాః ॥

వ్యాస 1-1-17, 18

సీ. హరినామకథన దావానల జ్వాలలఁ
గాలవే ఘోరాఘ కాననములు

వైకుంఠదర్శన వాయుసంఘంబుచేఁ
దొలఁగవే బహుదుఃఖ తోయదములు
కమలనాభధ్యాన కంఠీరవంబుచేఁ
గూలవే సంతాప కుంజరములు
నారాయణస్మరణ ప్రభాకరదీప్తిఁ
దీఱవే షడ్వర్గ తిమిరతతులు

ఆ. నళిననయనభక్తి నావచేఁగాక సం
సార జలధిదాఁటి చనఁగరాదు
వేయునేల మాకు విష్ణుప్రభావంబు
దెలుపవయ్య సూత! ధీసమేత. 10

పోతన 1-148

* * *

## అధ్యాయము-2

## సూతమహర్షి నారాయణ కథా ప్రశంసచేయుట

**సూత ఉవాచ :**

శ్లో॥ యః స్వానుభావమఖిలశ్రుతిసారమేక
మధ్యాత్మదీపమతి తితీర్షతాం తమోఽన్ధమ్
సంసారిణాం కరుణయాఽఽహ పురాణగుహ్యం
తం వ్యాససూనుముపయామి గురుం మునీనామ్ ॥

వ్యాస 1-2-3

సీ. కార్యవర్గంబును గారణసంఘంబు
నధికరించి చరించు నాత్మతత్త్వ
మధ్యాత్మ మనఁబడు; నట్టి యధ్యాత్మముఁ
దెలియ సేయఁగజాలు దీపమగుచు
సకలవేదములకు సారాంశమై యేక
మై యసాధారణమగు ప్రభావ
రాజకంబైన పురాణమర్మంబును
గాఢసంసారాంధకారపటలి

తే. దాఁటగోరెడివారికి దయదలిర్ప,
నే తపోనిధి వివరించె నేర్పడంగ
నట్టి శుకనామధేయు మహాత్మగేయు
విమలవిజ్ఞాన రమణీయు వేడ్కఁగొలుతు.

పోతన 1-2-54

శ్లో॥ నారాయణం నమస్కృత్యం నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

వ్యాస 1-2-4

క. నారాయణునకు నరునకు
భారతికిని మ్రొక్కి వ్యాసు పదములకు నమ
స్కారము సేసి వచింతు ను
దారగ్రంథంబు దళిత తనుబంధంబున్.

పోతన 1-2-55

శ్లో॥ మునయః సాధు పృష్టోఽహం భవద్భిర్లోకమంగళమ్
యత్కృతః కృష్ణసంప్రశ్నో యేనాత్మా సుప్రసీదతి ॥ 15

స వై పుంసాం పరో ధర్మో యతో భక్తి రధోక్షజే
అహైతుక్య ప్రతిహతా యయాత్మా సుప్రసీదతి ॥

వాసుదేవే భగవతి భక్తియోగః ప్రయోజితః
జనయత్యాశు వైరాగ్యం జ్ఞానం చ యదహైతుకమ్ ॥

వ్యాస 1-2-5, 6, 7

వ. అని దేవతాగురు నమస్కారంబుచేసి సూతుం డిట్లనియె. మునీంద్రులారా! నన్ను మీరలు నిఖిలలోక మంగళంబైన ప్రయోజనం బడిగితిరి. ఏమిటం గృష్ణసంప్రశ్నంబు సేయంబడు నెవ్విధంబున నాత్మప్రసన్నంబగు నిర్విఘ్నయు నిర్హేతుకయునైన హరిభక్తి యేరూపంబునం గలుగు నది పురుషులకుఁ బరమధర్మం బగు. వాసుదేవునియందుఁబ్రయోగింపఁబడిన భక్తియోగంబు వైరాగ్య విజ్ఞానంబులం బుట్టించు.

పోతన 1-2-56

శ్లో॥ అతః పుంభిర్ద్విజశ్రేష్ఠా వర్ణాశ్రమ విభాగశః ।
స్వనుష్ఠితస్య ధర్మస్య సంసిద్ధిర్హరి తోషణమ్ ॥

తస్మాదేకేన మనసా భగవాన్ సాత్వతాం పతిః ।
శ్రోతవ్యః కీర్తితవ్యశ్చ ధ్యేయః పూజ్యశ్చ నిత్యశః ॥



యద నుధ్యాసినా యుక్తాః కర్మగ్రంథి నిబంధనమ్ ।
ఛిందంతి కోవిదా స్తస్య కో న కుర్యాత్కథారతిమ్ ॥ 20

శుశ్రూషోః శ్రద్దధానస్య వాసుదేవకథారతిః ।
స్యాన్మహత్సేవయా విప్రాః పుణ్యతీర్థ నిషేవణాత్ ॥

శృణ్వతాం స్వకథాః కృష్ణః పుణ్యశ్రవణ కీర్తనః ।
హృద్యంతస్థో హ్యభద్రాణి విధునోతి సుహృత్సతామ్ ॥

నష్టప్రాయేష్వభద్రేషు నిత్యం భాగవతసేవయా ।
భగవత్యుత్తమశ్లోకే భక్తిర్భవతి నైష్ఠికీ ॥

తదా రజ స్తమోభావాః కామలోభాదయశ్చ యే ।
చేత ఏతైరనావిద్ధం స్థితం సత్త్వేప్రసీదతి ॥

ఏవం ప్రసన్న మనసో భగవద్భక్తియోగతః
భగవత్తత్త్వ విజ్ఞానం ముక్తసంగస్య జాయతే ॥ 25

శ్లో॥ భిద్యతే హృదయగ్రంథిశ్ఛిద్యంతే సర్వ సంశయాః,
క్షీయం తే చాస్య కర్మాణి దృష్ట ఏవాత్మనీశ్వరే ॥

అతోవై కవయో నిత్యం భక్తిం పరమయా ముదా ।
వాసుదేవే భగవతి కుర్వంత్యాత్మప్రసాదినీమ్ ॥ 27

వ్యాస 1-2-14 నుండి 23

వ. ధర్మంబునకు భక్తి ఫలంబు. పురుషులు వర్ణాశ్రమ ధర్మభేదంబులం జేయు ధర్మంబునకు మాధవుండు సంతోషించుటయె సిద్ధి. ఏకచిత్తంబున నిత్యంబును గోవిందు నాకర్ణింపను వర్ణింపను దగు. చక్రాయుధధ్యానమను ఖడ్గంబున వివేకవంతు లహంకార నిబద్ధం బైన కర్మంబు ద్రుంచివైతురు. (భగవంతునియందు శ్రద్ధయు, నపవర్గదంబగు తత్కథాశ్రవణాదులం నత్యంతాసక్తియు, పుణ్యతీర్థావగాహన మహత్సేవాదులచే సిద్ధించు).

కర్మనిర్మూలన హేతువులైన కమలలోచనుకథలం దెవ్వండు రతిసేయు, విననిచ్చగించు, వాని కితరంబు లెవ్వియు రుచి పుట్టింపనేరవు. పుణ్య శ్రవణకీర్తనుండైన కృష్ణుండు దన కథలు వినువారి హృదయంబులందు నిలిచి శుభంబులాచరించు. అశుభంబులు నిరసించు. అశుభంబులు నష్టంబులయిన భాగవతశాస్త్ర సేవావిశేషంబున నిశ్చలభక్తి యుదయించు. భక్తి గలుగ రజస్తమోగుణ ప్రభూతంబులైన కామలోభాదులకు వశంబు గాక చిత్తంబు సత్త్వగుణంబునఁబ్రసన్నంబగు. ప్రసన్నమనస్కుండైన ముక్తసంగుండగు. ముక్తసంగుండైన నీశ్వర తత్త్వజ్ఞానంబు దీపించు. ఈశ్వరుండు గానంబడినఁజిజ్జడగ్రథన రూపంబైన యహంకారంబు భిన్నంబగు అహంకారంబు భిన్నంబైన నసంభావనాది రూపంబులగు సంశయంబులు విచ్ఛిన్నంబులగు. సంశయ విచ్ఛేదంబైన ననారబ్ధఫలంబు లైన కర్మంబులు నశించుం గావున.

క. గురుమతులు దపసు లంతః
కరణంబులు శుద్ధిచేయు ఘనతరభక్తిన్
హరియందు సమర్పింతురు
పరమానందమున భిన్న భవబంధనులై. 15

పోతన 1-2-56, 57

శ్లో॥ సత్త్వం రజ స్తమ ఇతి ప్రకృతేర్గుణాస్తై
ర్యుక్తః పరః పురుష ఏక ఇహాస్య ధత్తే ।
స్థిత్యాదయే హరివిరించిహరేతి సంజ్ఞాః
శ్రేయాంసి తత్ర ఖలు సత్త్వతనోర్నృణాం స్యుః ॥ 28

వ్యాస 1-3-24

**తరల.** పరమపూరుషుఁడొక్క డాద్యుఁడు పాలనోద్భవ నాశముల్
సొరిదిఁజేయు ముకుంద పద్మజశూలిసంజ్ఞలఁబ్రాకృత



స్ఫురిత సత్త్వరజస్తమంబులఁబొందు నందు శుభస్థితుల్
హరి చరాచరకోటి కిచ్చు ననంత సత్త్వ నిరూఢుఁడై. 29

పోతన 1-2-58

శ్లో॥ వాసుదేవపరా వేదా వాసుదేవపరా మఖాః ।
వాసుదేవపరా యోగా వాసుదేవపరాః క్రియాః ॥

వాసుదేవపరం జ్ఞానం వాసుదేవపరం తపః ।
వాసుదేవపరో ధర్మో వాసుదేవపరా గతిః ॥ 30

స ఏవేదం ససర్జాగ్రే భగవానాత్మమాయయా ।
సదసద్రూపయా చాసౌ గుణమయ్యాగుణో విభుః ॥

తయా విలసితేష్వేషు గుణేషు గుణవానివ
అన్తః ప్రవిష్ట ఆభాతి విజ్ఞానేన విజృమ్భితః ॥

శ్లో॥ యథా హ్యవహితో వహ్నిర్దారుష్వేకః స్వయోనిషు ।
నానేవ భాతి విశ్వాత్మా భూతేషు చ తథా పుమాన్ ॥ 33

వ్యాస 1-2-29 నుండి 33

వ. మోక్షమిచ్చుటంజేసి నారాయణుండు సేవ్యుండు. వేద యాగ యోగ క్రియాజ్ఞాన తపోగతి ధర్మంబులు వాసుదేవ పరంబులు. నిర్గుణుండైన పరమేశ్వరుండు గలుగుచు లేకుండుచు గుణంబులతోడం గూడిన తన మాయచేత నింతయు సృజించి, గుణవంతుని చందంబున నిజ మాయా విలసితంబులైన గుణంబులలోఁబ్రవేశించి, విజ్ఞాన విజృంభితుండై వెలుంగు. అగ్ని యొక్కరుండయ్యుఁబెక్కు మ్రాఁకులందుఁదేజరిల్లుచుఁబెక్కండ్రై తోఁచు తెఱంగున విశ్వాత్మకుండైన పురుషుం డొక్కండు. తనవలనం గలిగిన నిఖిల భూతంబులందు నంతర్యామి రూపంబున దీపించు. 34

పోతన 1-2-50

శ్లో॥ అసౌ గుణమయైర్భావై ర్భూతసూక్ష్మేంద్రియాత్మభిః ।
స్వనిర్మితేషు నిర్విష్టో భుఙ్క్తే భూతేషు తద్గుణాన్ ॥

భావయత్యేష సత్త్వేన లోకాన్ వై లోకభావనః ।
లీలావతారానురతో దేవతిర్యఙ్నరాదిషు ॥ 35

వ్యాస 1-2-34, 35

వ. మహాభూత సూక్ష్మేంద్రియంబులతోడంగూడి, గుణమయంబులైన భావంబులం దనచేత నిర్మితంబులైన భూతంబులందుఁదగులు వడక తద్గుణంబు లనుభవంబు సేయుచు లోకకర్తయైన యతండు దేవ తిర్యఙ్మనుష్యాదిజాతులందు లీల నవతరించి లోకంబుల రక్షించు.

పోతన 1-2-59

* * *

# అధ్యాయము-3

## భగవదవతారములు

**సూత ఉవాచ :**

శ్లో॥ జగృహే పౌరుషం రూపం భగవాన్మహదాదిభిః ।
సంభూతం షోడశకలమాదౌ లోకసిసృక్షయా ॥

యస్యాంభసి శయానస్య యోగనిద్రాం వితన్వతః ।
నాభిహ్రదాంబుజాదాసీద్బ్రహ్మా విశ్వసృజాం పతిః ॥

యస్యావయవసంస్థానైః కల్పితో లోకవిస్తరః ।
తద్వై భగవతో రూపం విశుద్ధం సత్త్వమూర్జితమ్ ॥

పశ్యంత్యదో రూపమదభ్రచక్షుషా ।
సహస్రపాదోరు భుజాననాద్భుతమ్ ॥
సహస్రమూర్ధశ్రవణాక్షినాసికం,
సహస్రమౌళ్యంబర కుండలోల్లసత్ ॥ 39

వ్యాస 1-3-1 నుండి 4

సీ. మహదహంకార తన్మాత్ర సంయుక్తుఁడై
చారుషోడశకళా సహితుఁడగుచుఁ
బంచమహాభూత భాసితుండై శుద్ధ
సత్త్వుఁడై సర్వాతిశాయి యగుచుఁ
జరణోరుభుజముఖ శ్రవణాక్షినాసా శి
రములు నానాసహస్రములు వెలుఁగ
నంబర కేయూర హార కుండల కిరీ
టాదులు పెక్కువే లమరు చుండఁ

తే. బురుషరూపంబు ధరియించి పరుఁడనంతుఁ
డఖిలభువనైక కర్తయైయలఘుగతిని

మానితాపార జలరాశిమధ్యమునను
యోగనిద్రావిలాసియై యొప్పుచుండు.

పోతన 1-3-60

శ్లో॥ ఏతే చాంశకలాః పుంసః కృష్ణ స్తు భగవాన్ స్వయమ్ ।
ఇంద్రారి వ్యాకులం లోకం మృడయంతి యుగే యుగే ॥ 40

జన్మ గుహ్యం భగవతో య ఏతత్ప్రయతో నరః ।
సాయం ప్రాతర్గృణన్ భక్త్యా దుఃఖ గ్రామాద్విముచ్యతే ॥

వ్యాస 1-3-28, 29

క. భగవంతుండగు విష్ణువు
జగముల కెవ్వేళ రాక్షసవ్యథ గలుగున్
దగ నవ్వేళల దయతో
యుగయుగమునఁబుట్టి కాచు నుద్యల్లీలన్ ॥ 20

ఆ. అతిరహస్యమైన హరిజన్మకథనంబు
మనుజుఁడెవ్వఁడేని మాపు రేపుఁ
జాలభక్తితోడఁజదివిన సంసార
దుఃఖరాశి, బాసి తొలఁగిపోవు.

పోతన 1-3-63, 64

శ్లో॥ ఏవం జన్మాని కర్మాణి హ్యకర్తురజనస్య చ ।
వర్ణయంతి స్మ కవయో వేదగుహ్యాని హృత్పతేః ॥

వ్యాస 1-3-35

చ. జననములేక, కర్మములజాడలఁబోక, సమస్తచిత్త వ
ర్తనుఁడగు చక్రికిన్ గవు లుదారపదంబుల జన్మకర్మముల్
వినుతులు సేయుచుండుదురు వేదరహస్యములందు, నెందుఁజూ
చిన మఱిలేవు జీవునికిఁజెప్పిన కైవడి జన్మకర్మముల్.

పోతన 1-3-66



శ్లో॥ స వా ఇదం విశ్వ మమోఘలీలః
సృజత్యవత్యత్తి న సజ్జతేఽస్మిన్ ।
భూతేషు చాంతర్హిత ఆత్మతంత్రః
షాడ్వర్గికం జిఘ్రతి షడ్గుణేశః ॥

వ్యాస 1-3-36

మ. భువనశ్రేణి నమోఘలీలుఁడగుచున్ బుట్టించు రక్షించు నం
తవిధింజేయు మునుంగఁడందు బహుభూతవ్రాతమం దాత్మతం
త్ర విహారస్థితుఁడై షడింద్రియ సమస్తప్రీతియున్ దవ్వులన్
దివిభంగిన్గొనుఁజిక్కఁడింద్రియములన్ ద్రిప్పున్ నిబంధించుచున్.

పోతన 1-3-67

శ్లో॥ న చాస్య కశ్చిన్నిపుణేన ధాతు
రవైతి జంతుః కుమనీష ఊతీః ।
నామాని రూపాణి మనోవచోభిః
సంతన్వతో నటచర్యామివాజ్ఞః ॥ 44

వ్యాస 1-3-37

చ. జగదధినాథు డైన హరి సంతతలీలలు నామరూపముల్
దగిలి మనోవచోగతులఁదార్కికచాతురి యెంతగల్గినన్
మిగిలి కుతర్కవాది దగ మేరలుచేసి యెఱుంగనేర్చునే
యగణిత నర్తనక్రమము నజ్ఞుఁడెఱింగి నుతింపనోవునే. 24

పోతన 1-3-68

శ్లో॥ స వేద ధాతుః పదవీం పరస్య
దురంతవీర్యస్య రథాంగపాణేః ।
యోఽమాయయా సంతతయాఽనువృత్త్యా
భజేత తత్పాదసరోజగంధమ్ ॥ 45

వ్యాస 1-3-38

ఉ. ఇంచుక మాయలేక మది నెప్పుడు వాయని భక్తితోడ న
ర్తించుచు నెవ్వఁడేని హరి దివ్యపదాంబుజ గంధరాశి సే
వించు నతం డెఱుంగు నరవిందభవాదులకైన దుర్లభో
దంచితమైన యా హరి యుదార మహాద్భుత కర్మమార్గముల్. 25

పోతన 1-3-69

శ్లో॥ అథేహ ధన్యా భగవంత ఇత్థం
యద్వాసుదేవేఽఖిలలోకనాథే
కుర్వంతి సర్వాత్మకమాత్మభావం
న యత్ర భూయః పరివర్త ఉగ్రః ॥

వ్యాస 1-3-39

మ. హరిపాదద్వయభక్తి మీవలన ని ట్లారూఢమై యుండునే
తిరుగంబాఱదు చిత్తవృత్తి హరిపై దీపించి మీ లోపలన్
ధరణీదేవతలార! మీరలు మహాధన్యుల్ సమస్తజ్ఞులున్
హరిచింతన్ మిముఁజెంద వెన్నఁడును జన్మాంతర్వ్యథా యోగముల్.

పోతన 1-3-70

* * *



## శ్రీమహాభగవత రచనాది వృత్తాంతము



**వ్యాసమహర్షి శుకునకు భాగవతము బోధించుట**

శ్లో॥ ఇదం భాగవతం నామ పురాణం బ్రహ్మసమ్మితమ్ ।
ఉత్తమశ్లోకచరితం చకార భగవాన్ ఋషిః ॥

నిశ్శ్రేయసాయ లోకస్య ధన్యం స్వస్త్యయనం మహత్ ।
తదిదం గ్రాహయామాస సుతమాత్మవతాం వరమ్ ॥

సర్వవేదేతిహాసానాం సారం సారం సముద్ధృతమ్ ।
స తు సంశ్రావయామాస మహారాజం పరీక్షితమ్ ॥

ప్రాయోపవిష్టం గంగాయాం పరీతం పరమర్షిభిః ।
తత్ర కీర్తయతో విప్రా విప్రర్షేర్భూరితేజసః ॥ 50

వ్యాస 1-3-40 నుండి 43



**శుకమహర్షి పరీక్షిన్నరేంద్రునకు భాగవతము చెప్పట**

సీ. పుణ్యకీర్తనుఁడైన భువనేశుచరితంబు
బ్రహ్మతుల్యం బైన భాగవతము
సకలపురాణరాజము దొల్లి లోకభ
ద్రముగఁధన్యముగ మోదముగఁబ్రీతి
భగవంతుఁడగు వ్యాసభట్టారకుఁడొనర్చి
శుకుఁడనియెడు తన సుతునిచేతఁ
జదివించె నింతయు సకలవేదేతిహా
సములలోపల నెల్ల సారమైన

ఆ. యీపురాణ మెల్ల నెలమి నాశుకయోగి
గంగనడుమ నిల్చి ఘనవిరక్తి
యొదవి మునులతోడ నుపవిష్టుఁడగు పరీ
క్షిన్నరేంద్రుఁడడుగఁజెప్పె వినుఁడు. 27

పోతన 1-3-71

## అధ్యాయము-4

**శౌనక ఉవాచ :**

శ్లో॥ సూత! సూత! మహాభాగ! వదనో వదతాం వర ।
కథాం భాగవతీం పుణ్యాం యదాహ భగవాన్ శుకః ॥
కస్మిన్ యుగే ప్రవృత్తేయం స్థానే వా కేన హేతునా
కుతః సంచోదితః కృష్ణః కృతవాన్ సంహితాం మునిః ॥ 52

వ్యాస 1-4-2,3

శా. సూతా! యే యుగవేళ నేమిటికి నెచ్చోటన్ మునిశ్రేష్ఠు నే
శ్రోతల్ గోరిరి యేమి హేతువునకై శోధించి లోకైక వి
ఖ్యాతిన్ వ్యాసుఁడు మున్ను భాగవతముం గల్పించె దత్పుత్రుఁడే
ప్రీతిన్ రాజున కీ పురాణకథఁజెప్పెన్ జెప్పవే యంతయున్.

పోతన 1-4-73

దృష్ట్వానుయాంతమృషిమాత్మజమప్యనగ్నం
దేవ్యో హ్రియా పరిదధుర్న సుతస్య చిత్రమ్
తద్వీక్ష్య పృచ్ఛతి మునౌ జగదుస్తవాస్తి
స్త్రీపుంభిదా న తు సుతస్య వివిక్తదృష్టే ॥

శ్లో॥ కథమాలక్షితః పౌరైః సంప్రాప్తః కురుజాంగలాన్ ।
ఉన్మత్తమూకజడవద్విచరన్ గజసాహ్వయే ॥ 54

వ్యాస 1-4-5, 6

**తరల.** శుకుఁడు గోఁచియులేక పైఁజనఁజూచి తోయములందు ల
జ్జకుఁజలింపక చీరలొల్లక చల్లులాడెడి దేవక
న్యకలు "హాశుక" యంచు వెన్కఁజనంగ వ్యాసునిజూచి యం
శుకములన్ ధరియించి సిగ్గున స్రుక్కి రందఱు ధీనిధీ ! 29

పోతన 1-4-75

శ్లో॥ శివాయ లోకస్య భవాయ భూతయే
య ఉత్తమశ్లోకపరాయణా జనాః ।
జీవంతి నాత్మార్థమసౌ పరాశ్రయం
ముమోచ నిర్విద్య కుతఃకళేబరమ్ ॥ 55

వ్యాస 1-4-12

ఉ. ఉత్తమకీర్తులైన మనుజోత్తము లాత్మహితంబు లెన్నఁడున్
జిత్తములందుఁగోరరు హసించియు, లోకులకెల్ల నర్థసం
పత్తియు భూతియున్ సుఖము భద్రముఁగోరుచు రన్యరక్షణా
త్యుత్తమమైనమేను విభుఁడూరక యేల విరక్తిఁబాసెనో. 30

పోతన 1-4-78

* * *

## వ్యాసుండు వ్యాకులచిత్తుండై చింతించుట

**శ్రీసూతః :**

శ్లో॥ వితర్కయన్ వివిక్తస్థ ఇదం ప్రోవాచ ధర్మవిత్ ।
ధృతవ్రతేన హి మయా ఛందాంసి గురవోఽగ్నయః 56

మానితా నిర్వ్యళీకేన గృహీతం చానుశాసనమ్ ।
భారతవ్యపదేశేన హ్యామ్నాయార్థశ్చ దర్శితః ॥

దృశ్యతే యత్ర ధర్మాది స్త్రీశూద్రాదిభిరప్యుత ।
తథాపి బత మే దైహ్యో హ్యాత్మా చైవాత్మనా విభుః ॥

అసంపన్న ఇవాభాతి బ్రహ్మవర్చస్యసత్తమః ।
కింవా భాగవతా ధర్మా న ప్రాయేణ నిరూపితాః ॥

ప్రియాః పరమహంసానాం త ఏవ హ్యచ్యుతప్రియాః ।
తస్యైవం ఖిలమాత్మానం మన్యమానస్య ఖద్యతః ॥ 60

వ్యాస 1-4-28 నుండి 32



సీ. వ్రతధారినై వేద వహ్ని గురుశ్రేణి
మన్నింతు విహితకర్మములఁగొఱఁత
పడకుండ నడుపుదు భారతమిషమునఁ
బలికితి వేదార్థ భావమెల్ల
మునుకొని స్త్రీశూద్ర ముఖరధర్మములందుఁ
దెలిపితి నేఁజెల్ల దీనఁజేసి
యాత్మ సంతసమంద దాత్మలో నీశుండు
సంతసింపకయున్న జాడదోఁచె

ఆ. హరికి యోగివరుల కభిలషితంబైన
భాగవత విధంబుఁబలుకనైతి
మోసమయ్యెఁదెలివి మొనయదు మఱచితి
ననుచు వగచుచున్న యవసరమున. 31

పోతన 1-4-83

* * *

## వ్యాసుని కడకు నారదుఁడు వచ్చుట

శ్లో॥ కృష్ణస్య నారదోఽభ్యాగాదాశ్రమం ప్రాగుదాహృతమ్।
తమభిజ్ఞాయ సహసా ప్రత్యుత్థాయాగతం మునిః ॥
పూజయామాస విధివన్నారదం సురపూజితమ్ ॥ 62

వ్యాస 1-4-33, 34

సీ. తనచేతి వల్లకీతంత్రీచయంబున
సతతనారాయణ శబ్దమొప్ప
నానన సంభూత హరిగీతరవసుధా
ధారల యోగీంద్రతతులు సొక్కఁ

గపిల జటాభార కాంతిపుంజంబుల
దిశలు ప్రభాతదీధితి వహింపఁ
దనులగ్నతులసికాదామ గంధంబులు
గగనాంతరాళంబుఁగప్పికొనఁగ

ఆ. వచ్చె మింటనుండి వాసవీనందను,
కడకు మాటలాడఁగడఁకతోడ
భద్ర విమలకీర్తిపారగుఁడారూఢ
నయ విశారదుండు నారదుండు. 32

క. కనియెన్ నారదుఁడంతన్
వినయైకవిలాసు నిగమ విభజన విద్యా
జనితోల్లాసున్ భవదుః
ఖ నిరాసున్ గురుమనోవికాసున్ వ్యాసున్.

వ. ఇట్లు నిజాశ్రమంబునకు వచ్చిన నారదునెఱింగి లేచి వ్యాసుండు విధివత్ క్రమంబునం బూజించిన నతండు లేనగవు నెగడెడి మొగంబుతోడ విపంచికాతంత్రి వ్రేల మీటుచు నిట్లనియె. 34

పోతన 1-4-34, 35, 36

* * *

## అధ్యాయము-5

**శ్రీనారదః :**

శ్లో॥ పారాశర్య మహాభాగ భవతః కచ్చిదాత్మనా ।
పరితుష్యతి శారీర ఆత్మా మానస ఏవ వా ॥ 63

జిజ్ఞాసితం సుసంపన్నమపి తే మహదద్భుతమ్ ।
కృతవాన్ భారతం యస్త్వం సర్వార్థపరిబృంహితమ్ ॥

శ్లో॥ జిజ్ఞాసితమధీతం చ బ్రహ్మ యత్తత్సనాతనమ్ ।
తథాపి శోచస్యాత్మాన మకృతార్థ ఇవ ప్రభో ॥ 65

వ్యాస 1-5-2 నుండి 4

ఉ. ధాతవు భారతశ్రుతివిధాతవు వేదపదార్థజాత వి
జ్ఞాతవు గామముఖ్యరిపుషట్కవిజేతవు బ్రహ్మతత్త్వ ని
ర్ణేతవు యోగినేతవు వినేతవు నీవు చలించి చెల్లరే
కాతరు కైవడిన్ వగవఁగారణమేమి? పరాశరాత్మజా! 35

పోతన 1-5-87

**శ్రీవ్యాసః :**

శ్లో॥ అస్త్యేవ మే సర్వమిదం త్వయోక్తం
తథాపి నాత్మా పరితుష్యతే మే ।
తన్మూలమవ్యక్తమగాధబోధం
పృచ్ఛామహే త్వాత్మభవాత్మభూతమ్ ॥

స వై భవాన్ వేద సమస్తగుహ్యా
ముపాసితో యత్పురుషః పురాణః ।
పరావరేశో మనసైవ విశ్వం
సృజత్యవత్యత్తి గుణైరసంగః ॥

వ్యాస 1-5-5, 6

వ. అనినఁబారాశర్యుం డిట్లనియె.

క. పుట్టితి వజుతనువునఁజే
పట్టితివి పురాణపురుష భజనము పదముల్
మెట్టితివి దిక్కులం దుది
ముట్టితివి మహాప్రబోధమున మునినాథా! 37

పోతన 1-5-88, 89

శ్లో॥ త్వం పర్యటన్నర్క ఇవ త్రిలోకీ
మంతశ్చరో వాయురివాత్మసాక్షీ !
పరావరే బ్రహ్మణి ధర్మతో వ్రతైః
స్నాతస్య మే న్యూనమలం విచక్ష్వ ॥

వ్యాస 1-5-7

వ. నారదమహర్షీ! నీవు సూర్యునిభంగి మూడులోకములం జరింతువు. వాయువు పగిది నఖిల జనులలోన మెలంగుదువు. సర్వజ్ఞుండ వగుటంజేసి.

క. నీ కెఱుఁగరాని ధర్మము
లోకములనులేదు బహువిలోకివి నీవున్
నాకొఱఁత యెట్టి దంతయు
నాకున్ వివరింపుమయ్య నారద! కరుణన్. 39

పోతన 1-5-90, 91

**శ్రీనారదః :**

శ్లో॥ భవతానుదితప్రాయం యశో భగవతోఽమలమ్ ।
యేనై వాసౌ న తుష్యేత్తు మన్యే తద్దర్శనం ఖిలమ్ ॥

యథా ధర్మాదయాశ్చార్థా మునివర్యానువర్ణితాః ।
న తథా వాసుదేవస్య మహిమా హ్యనువర్ణితః ॥ 70

వ్యాస 1-5-8, 9



ఉ. అంచితమైన ధర్మచయ మంతయుఁజెప్పితి వందులోన నిం
చించుకగాని విష్ణుకథలేర్పడఁజెప్పవు ధర్మముల్ ప్రపం
చించిన మెచ్చునే గుణవిశేషము లెన్నినఁగాక నీకు నీ
కొంచెము వచ్చుటెల్ల హరిఁగోరి నుతింపమి నార్యపూజితా! 40

పోతన 1-5-93

శ్లో॥ న యద్వచశ్చిత్రపదం హరేర్యశో
జగత్పవిత్రం ప్రగృణీత కర్హిచిత్ ।
తద్వాయసం తీర్థముశంతి మానసా
న యత్ర హంసా విరమంత్యుశిక్షయాః ॥

వ్యాస 1-5-10

మ. హరినామస్తుతి సేయు కావ్యము సువర్ణాంభోజ హంసావళీ
సురుచిభ్రాజితమైన మానససరస్స్ఫూర్తిన్ వెలుంగొందు శ్రీ
హరినామస్తుతి లేని కావ్యము విచిత్రార్థాన్వితంబయ్యు శ్రీ
కరమైయుండ దయోగ్య దుర్మదనదత్కాకోల గర్తాకృతిన్.

పోతన 1-5-94

శ్లో॥ తద్వాగ్విసర్గో జనతాఘవిప్లవో
యస్మిన్ ప్రతిశ్లోక మబద్ధవత్యపి ।
నామాన్యనన్తస్య యశోఽఙ్కితాని యత్
శృణ్వన్తి గాయంతి గృణన్తి సాధవః ॥ 72

వ్యాస 1-5-11

మ. అపశబ్దంబులఁగూడియున్ హరిచరిత్రాలాపముల్ సర్వపా
పపరిత్యాగము సేయుఁగావున హరిం భావించుచుం బాడుచున్
జపముల్ సేయుచు వీనులన్ వినుచు నశ్రాంతంబుఁగీర్తింపుచున్
దపసుల్ సాధులు ధన్యులౌదురుగదా తత్త్వజ్ఞ! చింతింపుమా. 42

పోతన 1-5-95

శ్లో॥ నైష్కర్మ్యమప్యచ్యుతభావవర్జితం
న శోభతే జ్ఞానమలం నిరంజనమ్ ।
కుతః పునశ్శశ్వదభద్రమీశ్వరే
న చార్పితం కర్మ యదప్యకారణమ్ ॥ 73

వ్యాస 1-5-12 & 12-12-54

వ. మునీంద్రా! నిర్గతకర్మంబైన నిరుపాధికంబైన జ్ఞానంబు గలిగినను హరిభక్తి లేకున్న శోభితంబుగాదు. ఫలంబుగోరక కర్మ మీశ్వరునకు సమర్పణంబు సేయకున్న నది ప్రశస్తంబై యుండదు. భక్తిహీనంబులైన జ్ఞానవాచా కర్మకౌశలంబులు నిరర్థకంబులు.

పోతన 1-5-96

క. హరిభక్తి లేనిజ్ఞానము
హరికి సమర్పింపనట్టి యఖిలకృతంబుల్
హరిభక్తి లేనిపలుకులు
కరము నిరర్థకము లెందుఁగావున వ్యాసా! 43

(బు.వేం.-65)

శ్లో॥ అథో మహాభాగ భవానమోఘ దృక్
శుచిశ్రవాః సత్యరతో ధృతవ్రతః ।
ఉరుక్రమస్యాఖిలబంధముక్తయే
సమాధినానుస్మర యద్విచేష్టితమ్.

వ్యాస 1-5-13

వ. కావున, మహానుభావుండవు, యథార్థదర్శనుండవు, సకల దిగంతధవళ కీర్తివి, సత్యరతుండవు, ధృతవ్రతుండవు నగు నీవు నిఖిల బంధమోచనంబు కొఱకు వాసుదేవుని లీలావిశేషంబులు భక్తితోడ వర్ణింపుము.

పోతన 1-5-96



శ్లో॥ త్యక్త్వా స్వధర్మం చరణాంబుజం హరే
ర్భజన్నపక్వోఽథ పతేత్తతో యది ।
యత్ర క్వవా భద్రమభూదముష్య కిం
కో వార్థఆప్తోఽభజతాం స్వధర్మతః ॥ 75

వ్యాస 1-5-17

చ. తనకులధర్మముల్ విడిచి దానవవైరి పదారవిందముల్
పనివడి సేవసేసి పరిపాకము వొందక యెవ్వఁడేనిఁజ
చ్చిన మఱుమేననైన నది సిద్ధివహించుఁదదీయ సేవఁబా
సినఁగులధర్మగౌరవము సిద్ధి వహించునె యెన్ని మేనులన్. 45

పోతన 1-5-98

శ్లో॥ తస్యైవ హేతోః ప్రయతేత కోవిదో
న లభ్యతే యద్భ్రమతాముపర్యధః ।
తల్లభ్యతే దుఃఖవదన్యతస్సుఖం
కాలేన సర్వత్ర గభీరరంహసా ॥

స వై జనో జాతు కథంచనావ్రజేత్
ముకుందసేవ్యన్యవదంగ సంసృతిమ్ ।
స్మరన్ ముకుందాంఘ్ర్యుపగూహనం పునః
విహాతుమిచ్ఛేన్న రసగ్రహో జనః ॥

వ్యాస 1-5-18, 19

వ. అది గావున నెఱుకగలవాఁడు హరిసేవకు యత్నంబు సేయందగు. కాలక్రమంబున సుఖదుఃఖంబులు ప్రాప్తంబులైనను హరిసేవ విడువందగదు. దానంజేసి బ్రహ్మాస్థావరపర్యంతంబు దిరుగుచున్న జనులకు నెయ్యది పొందరా దట్టిమేలు సిద్ధించు (కొఱకు) హరిసేవ సేయవలయు. హరిసేవకుం డగువాడు జననంబు నొందియు నన్యునిక్రియ సంసారంబునం జిక్కడు.

క్రమ్మఱ హరిచరణస్మరణంబుఁజేయుచు, భక్తిరస వశీకృతుండై విడువ నిచ్చగింపడు. మఱియును. 46

పోతన 1-5-99

శ్లో॥ ఇదం చ విశ్వం భగవానివేతరో
యతో జగత్ స్థాననిరోధసంభవాః ।
తద్ధి స్వయంవేద భవాం స్తథాపి మే
ప్రాదేశమాత్రం భవతః ప్రదర్శితమ్ ॥ 78

త్వమాత్మనాత్మానమవేహ్యమోఘదృ
క్పరస్య పుంసః పరమాత్మనః కలామ్ ।
అజం ప్రజాతం జగతశ్శివాయ త
న్మహాను భావాద్యుదయోఽధిగణ్యతామ్ ॥

ఇదం హి పుంస స్తపసశ్శ్రుతస్య
స్విష్టస్య సూక్తస్య చ బుద్ధిదత్తయోః
అవిచ్యుతోఽర్థః కవిభిర్నిరూపితోఁ
యదుత్తమశ్లోక గుణానువర్ణనమ్ ॥ 80

వ్యాస 1-5-20, 21, 22

సీ. విష్ణుండు విశ్వంబు విష్ణునికంటెను
వేఱేమియును లేదు విశ్వమునకు
భవవృద్ధి లయములా పరమేశుచేనగు
నీ వెఱుంగుదుగాదె నీ ముఖమున
నెఱిఁగింపఁబడ్డది యేకదేశమున నీ
భువనభద్రమునకై పుట్టినట్టి
హరికళాజాతుండ నని విచారింపుము
కావున, హరిపరాక్రమములెల్ల



ఆ. వినుతిసేయు మీవు వినికియుఁజదువును
దాన మతులనయముఁదపముధృతియుఁ
గలిమిచెల్ల ఫలముగాదె పుణ్యశ్లోకుఁ
గమలనాభుఁబొగడఁగలిగెనేని. 47

పోతన 1-5-100

* * *

## నారదుని పూర్వజన్మ వృత్తాంతము

శ్లో॥ అహం పురాతీతభవేఽభవం మతో
దాస్యాస్తు కస్యాశ్చన వేదవాదినామ్ ।
నిరూపితో బాలక ఏవ యోగినాం
శుశ్రూషణే ప్రావృషి నిర్వివక్షతామ్ ॥

వ్యాస 1-5-23

వ. మహాత్మా! నేను పూర్వకల్పంబునం దొల్లిటి జన్మంబున వేదవాదుల యింటిదాసికిం బుట్టి, పిన్ననాఁడు వారలచేఁబంపంబడి యొక వానకాలంబునఁ జాతుర్మాస్యంబున నేకస్థలనివాసంబు సేయ నిశ్చయించు యోగిజనులకుం బరిచర్య సేయుచు. పోతన 1-5-101

శ్లో॥ తత్రాన్వహం కృష్ణ కథాః ప్రగాయతాం
అనుగ్రహేణాశృణవం మనోహరాః ।
తాశ్శ్రద్ధయా మేఽనుపదం విశృణ్వతః
ప్రియశ్రవస్యంగ మమాభవద్రుచిః ॥

తస్మిం స్తదా లబ్ధరుచేర్మహామునే
ప్రియశ్రవస్యస్ఖలితా మతిర్మమ ।

యయా మమైతత్సదసత్స్వమాయయా
పశ్యేమయి బ్రహ్మణి కల్పితం పరే ॥

వ్యాస 1-5-26, 27

శా. వారల్ కృష్ణచరిత్రముల్ చదువఁగా వర్ణింపఁగా బాడఁగా
నా రావంబు సుధారసప్రతిమమై యశ్రాంతమున్ వీనులం
దోరంబై పరిపూర్ణమైన మది సంతోషించి నే నంతటన్
బ్రారంభించితి విష్ణుసేవ కితరప్రారంభ దూరుండనై.

పోతన 1-5-105

శ్లో॥ ఇత్థం శరత్ప్రావృషికావృతూహరేః
విశృణ్వతో మేఽ నుసవంయశోఽ మలమ్ ।
సంకీర్త్యమానం మునిభిర్మహాత్మభిః
భక్తిః ప్రవృత్తాత్మరజస్తమోఽ పహా ॥

వ్యాస 1-5-28

వ. ఇట్లు హరిసేవారతింజేసి ప్రపంచాతీతుండనై బ్రహ్మ రూపకుండనైన నాయందు స్థూలసూక్ష్మంబైన యీ శరీరంబు నిజమాయాకల్పితం బని యమ్మహాత్ములగు యోగిజనుల మూలంబున రజస్తమోగుణ పరిహారిణియైన భక్తి సంభవించె. అంత జాతుర్మాస్యంబు నిండిన నయ్యోగిజనులు యాత్రసేయువారలై యివ్విధంబున. 50

పోతన 1-5-106

శ్లో॥ తస్మైవం మేఽ నురక్తస్య ప్రశ్రితస్య హతైనసః ।
శ్రద్ధధానస్య బాలస్య దాంతస్యానుచరస్య చ ॥ 85
జ్ఞానం గుహ్యతమం యత్తత్సాక్షాద్భగవతోదితమ్ ।
అన్వవోచన్ గమిష్యంతః కృపయా దీనవత్సలాః ॥

వ్యాస 1-5-29, 30



మ. అపచారంబులులేక నిత్యపరిచర్యాభక్తియుక్తుండనై
చపలత్వంబును మాని నేఁగొలువఁగా సంప్రీతులై వారు ని
ష్కపటత్వంబున దీనవత్సలతతోఁగారుణ్యసంయుక్తులై
యుపదేశించిరి నాకు నీశ్వరరహస్యోదార విజ్ఞానమున్.

పోతన 1-5-107

శ్లో॥ యదత్ర క్రియతే కర్మ భగవత్పరితోషణమ్ ।
జ్ఞానం యత్తదధీనం హి భక్తియోగసమన్వితమ్ ॥

కుర్వాణా యత్ర కర్మాణి భగవచ్ఛిక్షయాఽ సకృత్ ।
గృణంతి గుణనామాని కృష్ణ స్యానుస్మరంతి చ ॥

నమో భగవతే తుభ్యం వాసుదేవాయ ధీమహి ।
ప్రద్యుమ్నాయానిరుద్ధాయ నమస్సంకర్షణాయ చ ॥

ఇతి మూర్త్యభిదానేన మంత్రమూర్తిమమూర్తికమ్ ।
యజతే యజ్ఞపురుషం స సమ్యగ్దర్శనః పుమాన్ ॥

వ్యాస 1-5-35 నుండి 38

వ. ఈశ్వరునియందుఁజేయఁబడు కర్మంబు విజ్ఞానహేతుకంబై యీశ్వర సంతోషణంబును, భక్తియోగంబునుం బుట్టించు. ఈశ్వర శిక్షంజేసి, కర్మంబులు సేయువారలు గృష్ణగుణనామవర్ణన స్మరణంబులు సేయుదురు. ప్రణవపూర్వకంబులుగా వాసుదేవ ప్రద్యుమ్న సంకర్షణానిరుద్ధమూర్తి నామంబులు నాలుగు భక్తిం బలికి నమస్కారంబుసేసి, మంత్రమూర్తియు మూర్తి శూన్యుండు నైన యజ్ఞపురుషునిం బూజించు పురుషుండు సమ్యగ్దర్శను డగు. 52

పోతన 1-5-108

* * *

## అధ్యాయము-6

**శ్రీకృష్ణభగవానువాచ :**

శ్లో॥ హంతాస్మిన్ జన్మని భవాన్ మా మా ద్రష్టుమిహార్హతి ।
అవిపక్వకషాయాణాం దుర్దర్శోఽహం కుయోగినామ్ ॥

సకృద్యద్దర్శితం రూపమేతత్కామాయ తేఽనఘ ।
మత్కామశ్శనకై స్సాధు సర్వాన్ ముంచతి హృచ్ఛయాన్ ॥

సత్సేవయాఽదీర్ఘయా తే జాతా మయి దృఢా మతిః ।
హిత్వాఽవద్యమిమం లోకం గంతా మజ్జనతామసి ॥

మతిర్మయి నిబద్ధేయం న విపద్యేత కర్హిచిత్ ।
ప్రజాసర్గనిరోధేఽపి స్మృతిశ్చ మదనుగ్రహాత్ ॥ 94

వ్యాస 1-6-22 నుండి 25

వ. వాగగోచరుండైన హరి నారదున కిట్లనియె .

ఉ. ఏల కుమార! శోషిలఁగ నీ జననంబున నన్నుఁగానఁగాఁ
జాలవు నీవు కామముఖ షట్కము నిర్దళితంబు సేసి ని
ర్మూలిత కర్ములైన మునిముఖ్యులు గాని కుయోగి గానఁగాఁ
జాలఁడు నీదుకోర్కి కొనసాగుటకై నిజమూర్తిఁజూపితిన్.

క. నావలని కోర్కి యూరక
పోవదు విడిపించు దోషపుంజములను మ
త్సేవం బుట్టును వైళమ
భావింపఁగ నాదుభక్తి బాలక! వింటే.

క. నాయందుఁగలుగు నీ మది
వాయదు జన్మాంతరముల బాలక! నీ వీ
కాయంబు విడిచి మీఁదట
మా యనుమతిఁబుట్టఁగలవు మద్భక్తుఁడవై. 55

మ. విను, మీ సృష్టి లయంబు నొంది యుగముల్ వెయ్యైన కాలంబు యా
మినియైపోయెడిఁబోవఁగాఁగలుగుఁజూ మీఁదం బునఃసృష్టియం
దు నిరూఢ స్మృతితోడఁబుట్టెదవు నిర్దోషుండవై నా కృపన్
ఘనతం జెందెదు శుద్ధసాత్త్వికులలో గణ్యుండవై యర్భకా!

పోతన 1-6-124 నుండి 127

శ్లో॥ ఏతావదుక్త్వోపరరామ తన్మహ
ద్భూతం నభోలింగమలింగమైశ్వరమ్ ।
అహం చ తస్మై మహతాం మహీయసే
శీర్ష్ణావనామం విదధేఽనుకంపితః 95

నామాన్యనంతస్య గతత్రపః పఠన్
గుహ్యాని భద్రాణి కృతాని చ స్మరన్ ।
గాం పర్యటంస్తుష్టమనా గతస్పృహః
కాలం ప్రతీక్షన్ విమదో విమత్సరః ॥

ఏవం కృష్ణ మతేర్బ్రహ్మ న్న సక్తస్యామలాత్మనః ।
కాలః ప్రాదురభూత్కాలే తటిత్సౌదామనీ యథా ॥

ప్రయుజ్యమానే మయి తాం శుద్ధాం భాగవతీం తనుమ్ ।
ప్రారబ్ధకర్మనిర్వాణో న్యపతత్పాంచభౌతికః ॥

కల్పాంత ఇదమాదాయ శయానేఽంభస్యుదన్వతః
అనుప్రాణం శిశయిషోర్విశేఽంతరహం విభోః

సహస్రయుగపర్యంత ఉత్థాయేదం సిసృక్షతః ।
మరీచిమిశ్రా ఋషయః ప్రాణేభ్యోఽహం చ జజ్ఞిరే. 100

శ్లో॥ అంతర్బహిశ్చ లోకాం స్త్రీన్ పర్యేమ్యస్కందితవ్రతః ।
అనుగ్రహాన్మహావిష్ణోరవ్యాహతగతిః క్వచిత్ ॥

దేవదత్తా మిమాం వీణాం స్వరబ్రహ్మవిభూషితామ్ ।
మూర్ఛయిత్వా హరికథాం గాయమానశ్చరామ్యహమ్ ॥ 102
వ్యాస 1-6-26 నుండి 33

వ. నేను (నారదుడు) మ్రొక్కి తత్కరుణకు సంతసించి మదము మత్సరము కామము, క్రోధము, లోభమోహంబులు, సిగ్గు విడిచి యనంతనామంబులు పఠియింపుచుఁబరమభద్రంబులైన భగవచ్చరిత్రంబులఁజింతింపుచు నిరంతరసంతుష్టుండనై కృష్ణునిం బుద్ధినిలిపి నిర్మలాంతఃకరణంబుతోడ విషయ విరక్తుండనై కాలమున కెదురు చూచుచు భూమిం దిరుగుచునుండ నంతఁగొంతకాలంబునకు మెఱుపు మెఱసిన తెఱంగున, మృత్యువు దోఁచినం బంచభూతమయంబై గర్మస్వరూపంబైన పూర్వదేహంబు విడిచి, హరికృపా వశంబున శుద్ధసత్త్వమయంబైన భాగవతదేహంబు సొచ్చితిని. అంతం ద్రైలోక్యంబు సంచరించి ప్రళయకాల పయోరాశి మధ్యంబున (శయనించు) నారాయణమూర్తియందు నిదురవోవ నిచ్ఛగించు బ్రహ్మ నిశ్వాసంబువెంట నతని లోపలం బ్రవేశించితిని. అంత సహస్ర యుగ పరిమితంబైన కాలంబు చనిన లేచి లోకంబులు సృజియింప నుద్యోగించు బ్రహ్మ ప్రాణంబులవలన మరీచి ముఖ్యులగు మునులు, నేనును జనియించితిమి. అందు నఖండిత బ్రహ్మచర్యుండనై యేను మూఁడు లోకంబుల బహిరంతరంబులయందు మహావిష్ణుని యనుగ్రహంబున నడ్డంబులేక యీశ్వరదత్తయై బ్రహ్మాభివ్యంజకంబులైన సప్తస్వరంబులు దనయంతన మ్రోయుచున్న యీ వీణాలాపరతింజేసి నారాయణ కథాగానంబు సేయుచుఁజరియింపుచుండుదు. 57
పోతన 1-6-128

శ్లో॥ ప్రగాయతస్స్వవీర్యాణి తీర్థపాదః ప్రియశ్రవాః ।
ఆహూత ఇవ మే శీఘ్రం దర్శనం యాతి చేతసి ॥
వ్యాస 1-6-34



ఆ. తీర్థపాదుఁడైన దేవుండు విష్ణుండు
దనచరిత్ర మేను దవిలి పాడఁ
జీరఁబడ్డవాని చెలువున నేతెంచి
ఘనుఁడు నా మనమునఁగానవచ్చు.
పోతన 1-6-129

శ్లో॥ ఏతదాతురచిత్తానాం మాత్రాస్పర్శేచ్ఛయా ముహుః ।
భవసింధుప్లవో దృష్టో హరిచర్యానువర్ణనమ్ ॥
వ్యాస 1-6-35

క. విను, మీ సంసారంబను
వననిధిలో మునిఁగి కర్మవాంఛలచే వే
దనఁబొందెడువానికి, వి
ష్ణుని గుణవర్ణనము తెప్పసుమ్ము మునీంద్రా! 59
పోతన 1-6-130

శ్లో॥ యమాదిభిర్యోగపథైః కామలోభహతో ముహుః ।
ముకుందసేవయా యద్వత్తథాత్మాఽద్ధా న శామ్యతి ॥ 105
సర్వం తదిదమాఖ్యాతం యత్పృష్టోఽహం త్వయానఘ ।
జన్మకర్మరహస్యం మే భవతశ్చాత్మ తోషణమ్ ॥
వ్యాస 1-6-36, 37

చ. యమ నియమాది యోగముల నాత్మ నియంత్రిత మయ్యు గామ రో
షములఁబ్రచోదితంబ యగు శాంతి వహింపదు, విష్ణుసేవచేఁ
గ్రమమున శాంతిఁగైకొనిన కైవడి, నాదుశరీర జన్మక
ర్మముల రహస్యమెల్ల మునిమండన! చెప్పితి నీవు కోరినన్. 60
పోతన 1-6-131

**శ్రీ సూత ఉవాచ :**

శ్లో॥ అహో దేవర్షి ర్ధన్యోఽయం యః కీర్తిం శార్ఙ్గధన్వనః ।
గాయన్మాద్యన్నిరా తంత్ర్యా రమయత్యాతురం జగత్ ॥
వ్యాస 1-6-39

క. వాయించు వీణ నెప్పుడు
ప్రోయించు ముకుంద గీతములు జగములకున్
జేయించుఁజెవులపండువు
మాయించు నఘాళి నిట్టి మతి మతి గలఁడే! 61
పోతన 1-6-38

* * *

## అధ్యాయము-7

శ్లో॥ అనర్థోపశమం సాక్షాద్భక్తియోగమధోక్షజే ।
లోకస్యాజానతో విద్వాం శ్చక్రే సాత్వతసంహితామ్ ॥ 108

యస్యాం వై శ్రూయమాణాయాం కృష్ణే పరమపూరుషే ।
భక్తిరుత్పద్యతే పుంసశ్శోకమోహభయాపహా ॥

శ్లో॥ స సంహితాం భాగవతీం కృత్వాఽనుక్రమ్య దాత్మజమ్ ।
శుకమధ్యాపయామాస నివృత్తినిరతం మునిమ్ ॥ 110
వ్యాస 1-7-6, 7, 8

మ. అవనీచక్రములోన నే పురుషుఁడేయామ్నాయమున్ విన్న మా
ధవుపై లోకశరణ్యుపై భవములం దప్పించఁగాఁజాలు భ
క్తివిశేషంబు జనించు నట్టి భువన క్షేమంకరంబైన భా
గవతామ్నాయము బాదరాయణుఁడు దాఁగల్పించె నేర్పొప్పగన్.

వ. ఇట్లు భాగవతంబు నిర్మించి మోక్షార్థియైన శుకునిచేఁజదివించె. నిర్వాణతత్పరుండును సర్వోపేక్షకుండునైన శుకయోగి భాగవతం బభ్యసించె.
పోతన 1-7-135, 136

శ్లో॥ ఆత్మారామాశ్చ మునయో నిర్గ్రంథా అప్యురుక్రమే ।
కుర్వంత్యహైతుకీం భక్తి మిత్థంభూతగుణో హరిః ॥
వ్యాస 1-7-10

క. ధీరులు నిరపేక్షులు నా
త్మారాములునైన మునులు హరిభజనము ని
ష్కారణము చేయుచుందురు
నారాయణుఁడట్టివాఁడు నవ్యచరిత్రా । 64
పోతన 1-7-137

శ్లో॥ హరేర్గుణాక్షిప్తమతిర్భగవాన్ బాదరాయణిః
అధ్యగా న్మహదాఖ్యానం నిత్యం విష్ణుజనప్రియః 112
వ్యాస 1-7-11

క. హరిగుణవర్ణన రతుఁడై
హరితత్పరుఁడైన బాదరాయణి శుభ త
త్పరతం బఠించెఁద్రిజగ
ద్వరమంగళమైన భాగవత నిగమంబున్ 65

క. నిగమములు వేయుఁజదివిన
సుగమంబులు గావు ముక్తి సుభగత్వంబుల్
సుగమంబు భాగవత మను
నిగమంబుఁబఠింప ముక్తినివసనము బుధా!
పోతన 1-7-138, 139

## అశ్వత్థామ ప్రవర్తనమునకు అర్జునుడు శ్రీకృష్ణుని ప్రార్థించుట

**అర్జున ఉవాచ :**

శ్లో॥ కృష్ణ! కృష్ణ! మహాబాహో భక్తానా మభయంకర ।
త్వమేకో దహ్యమానానామపవర్గోఽసి సంసృతేః ॥ 113

త్వమాద్యః పురుషః సాక్షాదీశ్వరః ప్రకృతేః పరః ।
మాయాం వ్యుదస్య చిచ్ఛక్త్యా కేవలే స్థిత ఆత్మని ॥

స ఏవ జీవలోకస్య మాయామోహితచేతసః ।
విధత్సే స్వేన వీర్యేణ శ్రేయో ధర్మాదిలక్షణమ్ ॥ 115

తథాయం చావతారస్తే భువో భారజిహీర్షయా ।
స్వానాం చానన్యభావానామనుధ్యానాయ చాసకృత్ ॥
వ్యాస 1-7-22 నుండి 25

సీ. పద్మలోచన! కృష్ణ! భక్తాభయప్రద!
వినుము! సంసారాగ్ని వేఁచుచున్న



జనుల సంసారంబు సంహరింపఁగ నీవు
దక్క నన్యులు లేరు దలఁచి చూడ
సాక్షాత్కరించిన సర్వేశ్వరుండవు
ప్రకృతికి నవ్వలి ప్రభుఁడ వాద్య
పురుషుండ వగు నీవు బోధముచే మాయ
నడఁతువు నిశ్శ్రేయసాత్మయందు

ఆ. మాయచేత మునిఁగి మనువారలకుఁగృప
సేసి ధర్మముఖ్యచిహ్నమయిన
శుభము సేయు దీవు సుజనుల నవనిలోఁ
గావఁబుట్టుదువు జగన్నివాస! 67
పోతన 1-7-146

## అర్జునుడు ద్రోణనందనుని హింసించు సమయమున హరి యిట్లనియె

**శ్రీసూత ఉవాచ :**

శ్లో॥ మైనం పార్థార్హసి త్రాతుం బ్రహ్మబంధుమిమం జహి!
యోఽసావనాగసః సుప్తానవధీన్నిశి బాలకాన్ ॥ 117

మత్తం ప్రమత్తమున్మత్తం సుప్తం బాలం జడం స్త్రియం ।
ప్రపన్నం విరథం భీతం న రిపుం హంతి ధర్మవిత్ ॥

స్వప్రాణాన్ యః పరప్రాణైః ప్రపుష్ణాత్యఘృణః ఖలః ।
తద్వధ స్తస్యహి శ్రేయో యద్దోషాద్యాత్యధః పుమాన్ ॥
వ్యాస 1-7-35, 36, 37

ఉ. మాఱు పడంగలేని యసమర్థుల సుప్తుల నస్త్రవిద్యలం
దేఱని పిన్నపాపల వధించె నిశీథమునందుఁగ్రూరుఁడై
పాఱఁడె వీఁడు? పాతకుఁడు ప్రాణభయంబున వెచ్చనూర్చుచుం
బాఱెడి వీనిఁగావకు కృపామతి నర్జున! పాపవర్జనా ॥ 68

చ. వెఱచినవాని, దైన్యమున వేఁదుఱు నొందినవాని, నిద్ర మై
మఱచినవాని, సౌఖ్యముగ మద్యము ద్రావినవాని, భగ్నుఁడై
పఱచినవాని, సాధుజడభావము వానిని, గావుమంచు వా
చఱచినవానిఁగామినులఁజంపుట ధర్మముగాదు ఫల్గునా!

శా. స్వప్రాణంబుల నెవ్వఁడేనిఁగరుణాసంగంబు చాలించి య
న్య ప్రాణంబులచేత రక్షణము సేయున్ వా డధోలోక దుః
ఖప్రాప్తుం డగు రాజదండమున సత్కల్యాణుఁడౌ నైన నీ
విప్రుం దండితుఁజేయు మేటికి మహావిభ్రాంతితోఁనుండఁగన్. 70

పోతన 1-7-153, 154, 155

**శ్రీభగవానువాచ :**

శ్లో॥ బ్రహ్మబంధుర్న హంతవ్య ఆతతాయీ వధార్హణః ।
మయైవోభయమామ్నాతం పరిపాహ్యనుశాసనమ్ ॥ 120

కురు ప్రతిశ్రుతుం సత్యం యత్తత్సాంత్వయతా ప్రియామ్ ।
ప్రియం చ భీమసేనస్య పాంచాల్యా మహ్యమేవ చ ॥

వ్యాస 1-7-53, 54

ఉ. అవ్వఁడుగాఁడు వీఁడు శిశుహంత దురాత్మకుఁడాతతాయి హం
తవ్యఁడు బ్రహ్మబంధుఁడగు దప్పదు నిక్కము "బ్రాహ్మణో న హం
తవ్య" యటంచు వేదవిదితం బగుఁగావున ధర్మదృష్టిఁగ
ర్తవ్యము వీనిఁగాచుట యథాస్థితిఁజూడుము పాండవోత్తమా!

వ. అని సరసాలాపంబు లాడి పవననందను నొడంబఱచి యర్జునుం జూచి ద్రౌపదికి నాకు భీమసేనునకును సమ్మతంబుగ మున్ను నీ చేసిన ప్రతిజ్ఞయు సిద్ధించునట్లు నాపంపు సేయమని నారాయణు డానతిచ్చెను. 72

పోతన 1-7-169, 170

* * *

# అధ్యాయము - 8

## శ్రీకృష్ణుం డుత్తరాగర్భస్థుండగు పరీక్షితునిఁరక్షించుట

**ఉత్తరోవాచ :**

శ్లో॥ పాహి! పాహి! మహాయోగిన్ దేవదేవ జగత్పతే ।
నాన్యం త్వదభయం పశ్యే యత్ర మృత్యుః పరస్పరమ్ ॥

అభిద్రవతి మామీశ శర స్తప్తాయసో విభో ।
కామం దహతు మాం నాథ మా మే గర్భో నిపాత్యతామ్ ॥

**సూత ఉవాచ :**

ఉపధార్య వచస్తస్యా భగవాన్ భక్తవత్సలః ।
అపాండవమిదం కర్తుం ద్రౌణేరస్త్రమబుధ్యత ॥

తర్హ్యేవాథ భృగుశ్రేష్ఠ పాండవాః పంచసాయకాన్ ।
ఆత్మనోఽభిముఖాన్ దీప్తానాలక్ష్యాస్త్రాణ్యుపాదదుః ॥ 125

వ్యసనం వీక్ష్య తత్తేషామనన్యవిషయాత్మనామ్ ।
సుదర్శనేన స్వాస్త్రేణ స్వానాం రక్షాం వ్యధాద్విభుః ॥

అంతస్థః సర్వభూతానామాత్మ యోగేశ్వరో హరిః ।
స్వమాయయావృణోద్గర్భం వైరాట్యాః కురుతంతవే ॥

యద్యప్యస్త్రం బ్రహ్మశిరస్త్వమోఘం చాప్రతిక్రియమ్ ।
వైష్ణవం తేజ ఆసాద్య సమశామ్యద్భృగూద్వహ ॥ 128

వ్యాస 1-8-9 నుండి 15

మ. ఇదె కాలానలతుల్యమైన విశిఖం బేతెంచె దేవేశ! నేఁ
డుదరాంతర్గత గర్భదాహమునకై యుగ్రాకృతిన్ వచ్చుచు
న్నది దుర్లోక్యము మానుపన్ శరణమన్యం బేమియున్ లేదు నీ
పదపద్మంబులె కాని యొం డెఱుఁగ నీ బాణాగ్ని వారింపవే ॥

క. దుర్భర బాణానలమున
గర్భములో నున్న శిశువు ఘన సంతాపా
విర్భావంబును బొందెడి
నిర్భర కృపఁగావుమయ్య నిఖిలస్తుత్యా!

క. చెల్లెలి కోడల నీ మే
నల్లుఁడు శత్రువులచేత హతుఁడయ్యెను సం
ఫుల్లారవిందలోచన
భల్లాగ్ని నణంచి శిశువు బ్రతికింపఁగదే! 75

ఆ. గర్భమందుఁగమలగర్భాండ శతములు
నిముడుకొన నటించు నీశ్వరేశ!
నీకు నొక్క మానినీ గర్భరక్షణ
మెంత బరువు నిర్వహింతు గాక!

వ. అనిన నాశ్రితవత్సలుండైన పరమేశ్వరుండు సుభద్ర కోడలి దీనాలాపంబు లవధరించి, యిది ద్రోణనందనుండు లోకమంతయు నపాండవం బయ్యెడు నని యేసిన దివ్యాస్త్రమని యెఱింగె. అంతఁబాండవుల కభిముఖుండై, ద్రోణనందను దివ్యాస్త్ర నిర్గత నిశిత మార్గణంబు డగ్గఱిన బెగ్గడిలక, వారును ప్రత్యస్త్రంబు లందుకొని పెనంగు సమయంబున.

మ. తన సేవారతిచింత గాని పరచింతా లేశమున్ లేని స
జ్జనులం బాండుతనూజులున్ మనుపు వాత్సల్యంబుతో ద్రోణనం
దను బ్రహ్మాస్త్రము నడ్డపెట్టఁబనిచెన్ దైత్యారి సర్వారి సా
ధన నిర్వక్రము రక్షితాఖిల సుధాంధశ్చక్రముం జక్రమున్.

మ. సకల ప్రాణిహృదంతరాళముల భాస్వజ్జ్యోతియై యుండు సూ
క్ష్మకళుండచ్యుతుఁడయ్యెడన్ విరటజా గర్భంబుఁదాఁజక్రహ
సక్తుఁడై వైష్ణవమాయఁగప్పి కురుసంతానార్థియై యడ్డమై
ప్రకటస్ఫూర్తినణంచె ద్రోణతనయు బ్రహ్మాస్త్రమున్ లీలతోన్. 79

పోతన 1-8-117 నుండి 183.

* * *



## కుంతీదేవి శ్రీకృష్ణుని స్తుతించుట

**కుంత్యువాచ :**

శ్లో॥ నమస్యే పురుషం త్వాద్యమీశ్వరం ప్రకృతేః పరమ్ ।
అలక్ష్యం సర్వభూతానామంతర్బహిరవస్థితమ్ ॥ 129

క. పురుషం డాద్యుఁడు ప్రకృతికి
బరుఁడవ్యయు డఖిల భూత బహిరంత ర్భా
సురుఁడు నవలోకనీయుఁడు
పరమేశ్వరుఁడైన నీకుఁబ్రణతులగు హరీ! 80

పోతన 1-8-185

శ్లో॥ మాయాయవనికాచ్ఛన్నమజ్ఞాఽధోక్షజమవ్యయమ్ ।
న లక్ష్యసే మూఢదృశాం నటో నాట్యధరో యథా ॥ 130

తథా పరమహంసానాం మునీనామమలాత్మనామ్ ।
భక్తియోగవిధానార్థం కథం పశ్యేమహి స్త్రియః ॥

శ్లో॥ కృష్ణాయ! వాసుదేవాయ! దేవకీనందనాయ! చ ।
నందగోపకుమారాయ గోవిందాయ నమోనమః ॥

నమః పంకజనాభాయ నమః పంకజమాలినే ।
నమః పంకజనేత్రాయ నమస్తే పంకజాంఘ్రయే ॥ 133

వ్యాస 1-8-19 నుండి 22

వ. మఱియు జవనిక మఱుపున నాట్యంబు సలుపు నటుని చందంబున మాయాజవనికాంతరాళంబున నిలువంబడి, మహిమచేఁబరమహంసలు, నివృత్త రాగద్వేషులు, నిర్మలాత్ములు నైన మునులకు నదృశ్యమానుండవై, పరిచ్ఛిన్నుండవు గాని నీవు మూఢదృక్కులు, గుటుంబవతులు నగు మాకు నెట్లు దర్శనీయుడ వయ్యెదు? శ్రీకృష్ణ! వాసుదేవ! దేవకీనందన!

నందగోపకుమార! గోవింద! పంకజనాభ! పద్మమాలికాలంకృత! పద్మలోచన! పద్మసంకాశచరణ! హృషీకేశ! భక్తి యోగంబునంజేసి నమస్కరించెద నవధరింపుము. 81

పోతన 1-8-186

శ్లో॥ యథా హృషీకేశ ఖలేన దేవకీ
కంసేన రుద్ధా సుచిరం శుచార్పితా ।
విమోచితాహం చ సహాత్మజా విభో
త్వయైవ నాథేన ముహుర్విపద్గణాత్ ॥

విషాన్మహాగ్నేః పురుషాద దర్శనా
దసత్సభాయా వనవాస కృచ్ఛ్రతః ।
మృధే మృధేఽనేకమహారథాస్త్రతో
ద్రౌణ్యస్త్రత శ్చాస్మ హరేఽభిరక్షితాః ॥ 135

వ్యాస 1-8-23, 24

సీ. తనయులతోడనే దహ్యమానంబగు
జతుగృహంబందును జావకుండఁ
గురురాజు వెట్టించు ఘోరవిషంబుల
మారుత పుత్రుండు మడియకుండ
ధార్తరాష్ట్రుఁడు సముద్ధతిఁజీర లొలువంగ
ద్రౌపదిమానంబు దలఁగకుండ
గాంగేయ కుంభజ కర్ణాది ఘనులచే
నా బిడ్డ లనిలోన నలఁగకుండ

తే. విరటపుత్రిక కడుపులో వెలయు చూలు
ద్రోణనందను శరవహ్నిఁద్రుంగకుండ
మఱియు రక్షించితివి పెక్కుమార్గములను
నిన్ను నేమని వర్ణింతు నీరజాక్ష!



**మత్తకోకిల :**
బల్లిదుండగు కంసుచేతను బాధ నొందుచు నున్న మీ
తల్లిఁగాచినభంగిఁగాచితి ధార్తరాష్ట్రులచేత నేఁ
దల్లడంబునఁజిక్క కుండఁగఁదావకీనగుణవ్రజం
బెల్ల సంస్తుతి సేసి చెప్పఁగ నెంతదాన జగత్పతీ! 83

పోతన 1-8-187, 188

శ్లో॥ జన్మైశ్వర్యశ్రుతశ్రీభిరేధమానమదః పుమాన్ ।
న చార్హత్యభిధాతుం వై త్వామకించనగోచరమ్ ॥ 136

వ్యాస 1-8-27

క. జననము నైశ్వర్యంబును
ధనమును విద్యయును గలమదచ్చున్న లకిం
చన గోచరుఁడగు నిన్నున్
వినుతింపఁగ లేరు నిఖిల విబుధస్తుత్యా! 84

పోతన 1-8-189

* * *

## కుంతీదేవి శ్రీకృష్ణుని స్తుతించుట

శ్లో॥ నమోఽకించనవిత్తాయ నివృత్తగుణవృత్తయే!
ఆత్మారామాయ శాంతాయ కైవల్యపతయే నమః ॥ 137

మన్యే త్వాం కాలమీశానమనాదినిధనం విభుమ్ ।
సమం చరన్తం సర్వత్ర భూతానాం యన్మిథః కలిః ॥

న వేదకశ్చిద్భగవంశ్చికీర్షితం
తవేహమానస్య నృణాం విడంబనమ్ ।
న యస్య కశ్చిద్దయితోఽస్తి కర్హిచి
ద్ద్వేష్యశ్చ యస్మిన్విషమా మతిర్నృణామ్ ॥

వ్యాస 1-8-28 నుండి 30

వ. భక్తధనుండును, నివృత్త ధర్మార్థ కామ విషయుండును, ఆత్మా రాముండును, రాగాది రహితుండును, కైవల్యదాన సమర్థుండును, కాలరూపకుండును, నియామకుండును. నాద్యంత శూన్యుండును, విభుండును, సర్వసముండును, సకలభూత నిగ్రహానుగ్రహకరుండునైన నిన్నుఁదలచి నమస్కరించెద నవధరింపుము. మనుష్యుల విడంబించు భవదీయ విలసనంబు నిర్ణయింప నెవ్వఁడు సమర్థుఁడు? నీకుఁబ్రియాప్రియులు లేరు. 85

పోతన 1-8-190

శ్లో॥ జన్మ, కర్మ చ విశ్వాత్మన్నజస్యాకర్తురాత్మనః ।
తిర్యఙ్నరర్షియాదస్సు తదత్యంతవిడంబనమ్ ॥ 140

వ్యాస 1-8-31

వ. జన్మ కర్మ శూన్యుండవైన నీవు తిర్యగాది జీవులయందు వరాహాది రూపంబులను, మనుష్యులందు రామాది రూపంబులను, ఋషులయందు వామనాది రూపంబులను, జలచరంబులయందు మత్స్యాది రూపంబులను నవతరించుట లోకవిడంబనార్థంబు గాని జన్మ, కర్మ సహితుండవగుటం గాదు. 86

పోతన 1-8-190

శ్లో॥ గోప్యాదదే త్వయి కృతాగసి దామ తావత్
యా తే దశాశ్రుకలిలాంజనసంభ్రమాక్షమ్ ।
వక్త్రం నినీయ భయభావనయా స్థితస్య
సా మాం విమోహయతి భీరపి యద్బిభేతి ॥ 141

వ్యాస 1-8-32

ఉ. కోపముతోడ నీవు దధికుంభము భిన్నము సేయుచున్నచో
గోపిక ద్రాటఁగట్టిన వికుంచిత సాంజన బాష్ప తోయధా



రా పరిపూర్ణ వక్త్రముఁగరంబులఁద్రాముచు వెచ్చ నూర్చుచుం
బాపఁడవై నటించుట గృపావర! నా మదిఁజోద్యమయ్యెడిన్.

పోతన 1-8-191

శ్లో॥ భారావతరణాయాన్యే భువో నావ ఇవోదధౌ ।
సీదంత్యా భూరిభారేణ జాతో హ్యాత్మ భువార్థితః ॥

వ్యాస 1-8-35

క. జలరాశిలో మునిఁగెడి
కలము క్రియన్ భూరిభార కర్శిత యగు నీ
యిలఁగావ నజుఁడు గోరినఁ
గలిగితి వని కొందఱంద్రు గణనాతీతా! 88

పోతన 1-8-194

శ్లో॥ భవేఽస్మిన్ క్లిశ్యమానానా మవిద్యాకామకర్మభిః ।
శ్రవణస్మరణార్హాణి కరిష్యన్నితికేచన ॥ 143

వ్యాస 1-8-26

తే. మఱచి యజ్ఞాన కామకర్మములఁదిరుగు
వేదనాతురులకుఁదన్నివృత్తిఁజేయ
శ్రవణచింతన వందనార్చనములిచ్చు
కొఱకు నుదయించి తండ్రు నిన్ గొందఱభవ.

పోతన 1-8-195

శ్లో॥ శృణ్వన్తిగాయన్తి గృణన్త్యభీక్ష్ణశః
స్మరన్తి నన్దన్తి తవేహితం జనాః ।
త ఏవ పశ్యన్త్యచిరేణ తావకం
భవప్రవాహో పరమం పదామ్బుజమ్ ॥

వ్యాస 1-8-37

మ. నినుఁజింతింపుచుఁబాడుచుం బొగడుచు న్నీ దివ్యచారిత్రముల్
వినుచుం జూతురుగాక లోకు లితరాన్వేషంబులం జూతురే
ఘన దుర్జన్మ పరంపరా హరణ దక్షంబై మహాయోగి వా
గ్వినుతంబైన భవత్పదాబ్జ యుగమున్ విశ్వేశ! విశ్వంభరా! 90

పోతన 1-8-96

శ్లో॥ శ్రీకృష్ణ కృష్ణసఖ వృష్ణ్యృషభావనిధ్రుగ్
రాజన్యవంశదహనానపవర్గవీర్య!
గోవిన్ద గోద్విజసురార్తిహరావతార
యోగీశ్వరాఖిలగురో భగవన్నమస్తే ॥ 145

వ్యాస 1-8-44

శా. శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగారరత్నాకరా!
లోకద్రోహి నరేంద్రవంశదహనా! లోకేశ్వరా! దేవతా
నీక బ్రాహ్మణ గోగణార్తి హరణా! నిర్వాణ సంధాయకా!
నీకున్ మ్రొక్కెదఁద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ! 91

పోతన 1-8-199

* * *

## అధ్యాయము-9

### ధర్మరాజు, శ్రీకృష్ణుడు శరతల్పగతుండగు భీష్మునికడ కేగుట

శ్లో॥ కృష్ణం చ తత్ర్పభావజ్ఞ ఆసీనం జగదీశ్వరమ్ ।
హృదిస్థం పూజయాయాస మాయయోపాత్తవిగ్రహమ్ ॥ 146

వ్యాస 1-9-10

క. మాయాంగీకృత దేహుం
డై యఖిలేశ్వరుఁడు మనుజుఁడై నాఁడనిఁప్ర
జ్ఞాయత చిత్తంబున గాం
గేయుఁడు పూజనము సేసెఁగృష్ణున్ జిష్ణున్.

పోతన 1-9-205

శ్లో॥ న హ్యస్య కర్హిచిద్రాజన్ పుమాన్ వేద విధిత్సితమ్ ।
యద్విజిజ్ఞాసయా యుక్తా ముహ్యంతి కవయోఽపిహి ॥

వ్యాస 1-9-16

ఆ. ఈశ్వరుండు విష్ణుఁడెవ్వేళ నెవ్వని
నేమిసేయుఁబురుషుఁడేమి యెఱుఁగు?
నతని మాయలకు మహాత్ములు విద్వాంసు
లఱఁగి మెలఁగుచుందు రంధులగుచు. 93

పోతన 1-9-211

శ్లో॥ సర్వాత్మనస్సమదృశో హ్యద్వయస్యానహంకృతేః ।
తత్కృతం మతివైషమ్యం నిరవద్యస్య న క్వచిత్ ॥

తథాప్యేకాంత భక్తేషు పశ్య భూపానుకంపితమ్ ।
యన్మేఽసూంస్త్యజత స్సాక్షాత్కృష్ణో దర్శనమాగతః ॥

వ్యాస 1-9-21, 22

వ. రాగాది శూన్యుండు, నిరహంకారుం డద్వయుండు, సమదర్శనుండు, సర్వాత్మకుండునైన యీశ్వరునకు నతోన్నతభావ మతివైషమ్యంబు లెక్కడివి? లేవు. అయిన భక్తవత్సలుండు గావున, నేకాంత భక్తులకు సులభుండై యుండు. 94

పోతన 1-9-212

## భీష్ముడు శ్రీకృష్ణుని స్తుతించుట

**శ్రీసూత ఉవాచ :**

శ్లో॥ భక్త్యావేశ్య మనో యస్మిన్ వాచా యన్నామకీర్తయన్ ।
త్యజన్ కళేబరం యోగీ ముచ్యతే కామకర్మభిః ॥ 150

స దేవదేవో భగవాన్ ప్రతీక్షతాం
కళేబరం యావదిదం హినోమ్యహమ్ ।
ప్రసన్నహాసారుణ లోచనోల్లసన్
ముఖాంబుజో ధ్యానపథశ్చతుర్భుజః ॥

వ్యాస 1-9-23, 24

సీ. అతిభక్తి నెవ్వనియందుఁజిత్తముఁజేర్చి
యెవ్వనినామ మూహించి పొగడి
కాయంబు విడుచుచుఁగామ కర్మాది ని
ర్మూలనుండై యోగి ముక్తినొందు
నట్టి సర్వేశ్వరుఁడఖిల దేవోత్తంసుఁ
డెవ్వేళఁబ్రాణంబు లేను విడుతు
నందాఁక నిదె మందహాసుఁడై వికసిత
వదనారవిందుఁడై వచ్చి నేఁడు

తే. నాల్గుభుజములుఁగమలాభనయనయుగము
నొప్పఁగన్నులముందట నున్నవాఁడు



మానవేశ్వర! నా భాగ్యమహిమఁజూడు
మేమి సేసితినో, పుణ్యమితనిఁగూర్చి. 95

పోతన 1-9-213

శ్లో॥ తదోపసంహృత్య గిరస్సహస్రణీ
ర్విముక్తసంగం మన ఆదిపూరుషే ।
కృష్ణే లసత్పీతపటే చతుర్భుజే
పురస్థితే మీలితదృగ్వ్యధారయత్ ॥ 152

విశుద్ధయా ధారణయా హతా శుభ
స్త దీక్షయైవాశు గతాయుధవ్యధః ।
నివృత్త సర్వేంద్రియవృత్తివిభ్రమ
స్తుష్టావ జన్యం విసృజన్ జనార్దనమ్ ॥ వ్యాస 1-9-30,31

శా. ఆలాపంబులు మాని చిత్తము మనీషాయత్తముం జేసి దృ
గ్జాలంబున్ హరిమోముపైఁబఱపి తత్కారుణ్య దృష్టిన్ విని
ర్మూలీభూత శరవ్యథా నిచయుఁడై మోదించి భీష్ముండు సం
శీలం బొప్ప నుతించెఁగల్మష గజశ్రేణీ హరిన్ శ్రీహరిన్.

వ. ఇట్లు పరమేశ్వరుండైన హరియందు నిష్కాముండై ధారణావతియైన బుద్ధిని సమర్పించి, పరమానందంబు నొంది, ప్రకృతి వలన నైన సృష్టి పరంపరలఁబరిహరించు తలంపున మందాకినీనందనుం డిట్లనియె.

పోతన 1-9-215, 216

శ్లో॥ త్రిభువనగమనం తమాలవర్ణం
రవికరగౌరవరామ్బరం దధానే ।
వపురలకకులావృతాననాబ్జే
విజయసఖే రతిరస్తుమేఽనవద్యా ॥ వ్యాస 1-9-33

మ. త్రిజగన్మోహన నీలకాంతి తను వుద్దీపింపఁ బ్రాభాత నీ
రజబంధు ప్రభమైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక
వ్రజ సంయుక్త ముఖారవింద మతిసేవ్యంబై విజృంభింప మా
విజయుం జేరెడు వన్నెలాఁడు మది నావేశించు నెల్లప్పుడున్.
పోతన 1-9-217

శ్లో॥ యుధి తురగరజో విధూమ్రవిష్వ
క్కచలులితశ్రమవార్యలంకృతాస్యే!
మమ నిశితశరైర్విభిద్యమాన
త్వచి విలసత్కవచేఽస్తు కృష్ణ ఆత్మా ॥ 155
వ్యాస 1-9-34

మ. హయ రింఖాముఖ ధూళిధూసర పరిన్యస్తాలకోపేతమై
రయజాత శ్రమతోయ బిందుయుతమై రాజిల్లు నెమ్మోముతో
జయముం బార్థున కిచ్చువేడ్క నని నాశస్త్రాహతిం జాల నొ
చ్చియుఁ బోరించు మహానుభావు మదిలోఁ జింతింతు నశ్రాంతమున్. 99
పోతన 1-9-218

శ్లో॥ సపది సఖివచో నిశమ్య మధ్యే
నిజపరయోర్బలయోరథం నివేశ్య!
స్థితవతి పరసైనికాయురక్ష్ణా
హృతవతి పార్థసఖే రతిర్మమాస్తు ॥ 156
వ్యాస 1-9-35

మ. నరుమాట ల్విని నవ్వుతో నుభయసేనా మధ్యమక్షోణిలోఁ
బరు లీక్షింప రథంబు నిల్పి పర భూపాలావళిం జూపుచుం
బర భూపాయువు లెల్లఁ జూపులన శుంభత్కేళి వంచించు నీ
పరమేశుండు వెలుంగుచుండెడు మనః పద్మాసనాసీనుఁడై.
పోతన 1-9-219



శ్లో॥ వ్యవహితపృతనాముఖం నిరీక్ష్య
స్వజనవధాద్విముఖస్య దోషబుద్ధ్యా ।
కుమతిమహరదాత్మవిద్యయా య
శ్చరణరతిః పరమస్య తస్య మేఽస్తు ॥ వ్యాస 1-9-36

క. తనవారిఁ జంపఁ జాలక
వెనుకకుఁ బో నిచ్చగించు విజయుని శంకన్
ఘన యోగవిద్య బాపిన
మునివంద్యుని పాదభక్తి మొనయున్ నాకున్. పోతన 1-9-220

శ్లో॥ స్వనిగమమపహాయ మత్ప్రతిజ్ఞా
మృత మధికర్తు మవప్లుతో రథస్థః ।
ధృతరథచరణోఽభ్యయాచ్చలద్గుః
హరిరివ హంతుమిభం గతోత్తరీయః ॥ 158

శ్లో॥ శితవిశిఖహతో విశీర్ణదంశః
క్షతజపరిప్లుత ఆతతాయినో మే ।
ప్రసభ మభిససార మద్వధార్థః
స భవతు మే భగవాన్ గతిర్ముకుందః ॥
వ్యాస 1-9-37, 38

సీ. కుప్పించి యెగసినఁ గుండలంబుల కాంతి
గగనభాగం బెల్లఁ గప్పికొనఁగ
నుఱికిన నోర్వక యుదరంబులో నున్న
జగముల వ్రేఁగున జగతి గదలఁ
జక్రంబుఁ జేపట్టి చనుదెంచు రయమునఁ
బై నున్న పచ్చని పటము జాఱ
నమ్మితి నాలావు నగుఁబాటు సేయక
మన్నింపు మని క్రీడి మఱలఁ దిగువఁ

తే. గరికి లంఘించు సింహంబుకరణి మెఱసి
"నేడుభీష్మునిఁజంపుదు నిన్నుఁగాతు
విడువు మర్జున!" యనుచు మద్విశిఖవృష్టిఁ
దెరలి చనుదెంచు దేవుండు దిక్కునాకు. 102

పోతన 1-9-221

శ్లో॥ విజయరథకుటుంబఅత్తతోత్రే
ధృతహయరశ్మిని తచ్ఛ్రియేక్షణీయే ।
భగవతి రతిరస్తు మే ముమూర్షోః
యమిహ నిరీక్ష్య హతా గతా స్సరూపమ్ ॥ 160

వ్యాస 1-9-39

మ. తనకున్ భృత్యుఁడు వీనిఁగాచుట మహాధర్మంబు వొమ్మంచు న
ర్జునసారథ్యము పూని పగ్గములు చేఁజోద్యమ్ముగాఁబట్టుచున్
మునికోల న్వడిఁజూపి ఘోటకముల న్మోదించి తాటింపుచున్
జనుల న్మోహము నొందఁజేయు పరమోత్సాహుం బ్రశంసించెదన్.

పోతన 1-9-222

శ్లో॥ లలితగతివిలాసవల్గుహాస
ప్రణయనిరీక్షణకల్పితోరుమానాః ।
కృతమనుకృతవత్య ఉన్మదాంధాః
ప్రకృతిమగన్ కిల యస్య గోపవధ్వః ॥ వ్యాస 1-9-40

క. పలుకుల నగవుల నడవుల
నలుకల నవలోకనముల నాభీరవధూ
కులముల మనముల తాలిమి
కొలుకులు వదలించు ఘనునిఁగొలిచెద మదిలోన్.

పోతన 1-9-223



శ్లో॥ మునిగణనృపవర్యసంకులేఽ న్తః
సదసి యుధిష్ఠిర రాజసూయ ఏషాం ।
అర్హణ ముపపేద ఈక్షణీయో
మమ దృశి గోచర ఏష ఆవిరాత్మా ॥ 162

క్షితిభరమవరోపితుం కురూణాం
శ్వసన ఇవాసృజదక్ష వంశవహ్నిమ్ ।
తమిమమహమనువ్రతార్తిహాంఘ్రిం
హృది పరిరభ్య జహామి మర్త్యనీడమ్ ॥

శ్లో॥ తమిమమహమజం శరీరభాజాం
హృది హృది ధిష్ఠిత మాత్మకల్పితానామ్ ।
ప్రతిదృశమివ నైకధార్కమేకం
సమధిగతోఽస్మి విధూతభేదమోహః ॥

వ్యాస 1-9-41 నుండి 43

ఆ. మునులు నృపులు సూడ మును ధర్మజుని సభా
మందిరమున యాగమండపమునఁ
జిత్రమహిమతోడఁజెలువొందు జగదాది
దేవుఁడమరు నాదు దృష్టియందు. 105

మ. ఒక సూర్యుండు సమస్తజీవులకుఁదా నొక్కొక్కఁడై తోఁచుపో
లిక నేదేవుఁడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్న జ
న్యకదంబంబులహృత్సరోరుహములన్ నానావిధానూనరూ
పకుఁడై యొప్పుచు నుండు నట్టిహరి నే బ్రార్థింతు శుద్ధుండ నై.

పోతన 1-9-224, 225

* * *

# అధ్యాయము-10

## ధర్మరాజు పరిపాలన

శ్లో॥ కామం వవర్ష పర్జన్యస్సర్వకామదుఘా మహీ ।
నిషి చుస్స్మ వ్రజాన్ గావః పయసోధస్స్వతీర్ముదా॥ 165

నద్యస్సముద్రా గిరయ స్సవనస్పతివీరుధః ।
ఫలంత్యోషధయస్సర్వాః కామమన్వృతు తస్య వై ॥

నాథయో వ్యాధయః క్లేశా దైవభూతాత్మహేతవః ।
అజాతశత్రావభవన్ జంతూనాం రాజ్ఞి కర్హిచిత్ ॥
వ్యాస 1-10-4, 5, 6

సీ. సంపూర్ణవృష్టిఁబర్జన్యుండు గురియించు
నిల యెల్లఁగోర్కుల నీనుచుండు
గోవులు వర్షించు ఘోషభూములఁబాలు
ఫలవంతములు లతా పాదపములు
పండు సస్యములు దప్పక ఋతువులనెల్ల
ధర్మమెల్లెడలను దనరి యుండు
దైవ భూతాత్మ తంత్రములగు రోగాది
భయములు సెందవు ప్రజల కెందుఁ

ఆ. గురుకులోత్తముండు కుంతీతనూజుండు
దానమాన ఘనుఁడు ధర్మజుండు
సత్యవాక్యధనుఁడు సకల మహీరాజ్య
విభవ భాజి యైన వేళయందు పోతన 1-10-231

## శ్రీకృష్ణుఁడు ద్వారకానగరమున కరుగుట

శ్లో॥ స వా అయం సఖ్యనుగీతసత్కథో
వేదేషు గుహ్యేషు చ గుహ్యవాదిభిః ।
య ఏక ఈశో జగదాత్మలీలయా
సృజత్యవత్యత్తి న తత్ర సజ్జ తే ॥ 167
వ్యాస 1-10-24

మ. తరుణీ! యాదవరాజు గాఁడితఁడు వేదవ్యక్తుఁడై యొక్కఁడే
వరుసన్ లోకభవస్థితి ప్రళయముల్ వర్తింపఁగాఁజేయు దు
స్తర లీలారతు డైన యీశుఁడితనిన్ దర్శించితిం బుణ్యభా
సుర నేనంచు నటించె నొక్క తె మహా శుద్ధాంతరంగంబునన్. 108
పోతన 1-10-236

శ్లో॥ యదా హ్యధర్మేణ తమోధియో నృపా
జీవంతి తత్రైష హి సత్త్వతః కిల ।
ధర్మం భగం సత్యమృతం దయాం యశో
భవాయ రూపాణి దధుర్యుగే యుగే ॥ వ్యాస 1-10-25

త. తామసగుణులగు రాజులు
భూమిం బ్రభవించి ప్రజలఁబొలియింపఁగ స
త్త్వామలతనుఁడై యీతఁడు
భామిని వారల వధించుఁబ్రతికల్పమునన్. పోతన 1-10-237

శ్లో॥ అహో బత శ్లాఘ్యతమం యదోః కులం
అహో అలం పుణ్యతమం మధోర్వనమ్ ।
యదేష పుంసామృషభః ప్రియశ్రవాః
స్వజన్మనా చంక్రమణేన చాంచతి ॥ 170

అహో బత స్వర్యశస స్తిరస్కరీ
కుశస్థలీ పుణ్యయశస్కరీ భువః ।
పశ్యంతి నిత్యం యదనుగ్రహేషితం
స్మితావలోకం స్వపతిం స్మ యత్ప్రజాః ॥

నూనం వ్రతస్నానహుతా దినేశ్వరః
సమర్చితో హ్యస్యగృహీతపాణిభిః ।
పిబంతి యా సఖ్యధరామృతం ముహుః
వ్రజస్త్రియః సంముముహుర్యదాశయాః ॥
వ్యాస 1-10-26, 27, 28

సీ. ఈ యుత్తమశ్లోకుఁడెలమి జన్మించిన
యాదవ కులమెల్ల ననఘ మయ్యె
నీపుణ్యవర్తనుఁడేప్రొద్దు నుండిన
మధురాపురము దొడ్డ మహిమ గనియె
నీపూరుషశ్రేష్ఠు నీక్షించి భక్తితో
ద్వారకావాసులు ధన్యులైరి
యీ మహాబలశాలి యెఱిఁగి శాసింపఁగ
నిష్కంటకం బయ్యె నిఖిలభువన

తే. మీ జగన్మోహనాకృతి నిచ్చగించి
పంచకర భల్లజాల విభజ్యమాన
వివశ మానసమై వల్లవీసమూహ
మితని యధరామృతము గ్రోలు నెల్ల ప్రొద్దు. 110

ఉ. ఈ కమలాక్షు నీ సుభగు నీ కరుణాంబుధిఁ బ్రాణనాథుఁగాఁ
జేకొని వేడ్కఁగాఁపురము సేయుచునుండెడి రుక్మిణీముఖా
ఏక పతివ్రతల్ నియతి నిర్మలమానసలై జగన్ను తా
స్తోక విశేష తీర్థములఁదొల్లిటిబాముల నేమి నోఁచిరో ।
పోతన 1-10-238, 239

* * *

## అధ్యాయము-11

**శ్రీసూత ఉవాచ :**

శ్లో॥ నతాః స్మ హే నాథ! తవాంఘ్రిపంకజం
విరించివైరించసురేంద్రవందితమ్
పరాయణం క్షేమమిహేచ్ఛతాం పరం
న యత్ర కాలః ప్రభవేత్పరః ప్రభుః ॥ 173
వ్యాస 1-11-6

శా. నీ పాదాబ్జము బ్రహ్మపూజ్యముగదా! నీ సేవ సంసార సం
తాపధ్వంసిని యౌఁగదా! సకల భద్రశ్రేణులం బ్రీతితో
నాపాదింతు గదా! ప్రపన్నులకుఁగాలాధీశ! కాలాంబుని
ర్వ్యాపారంబు గదయ్య! చాలరుగదా! వర్ణింప బ్రహ్మాదులున్. 112
పోతన 1-11-247

శ్లో॥ భవాయ న స్త్వం భవ విశ్వభావన
త్వమేవ మాతాత్మసుహృత్పితా పతిః
త్వం సద్గురుర్నః పరమం చ దైవతం ।
యస్యానువృత్త్యా కృతినో బభూవిమ ॥ 174
వ్యాస 1-11-7

ఉ. తండ్రులకెల్లఁదండ్రియగు ధాతకుఁదండ్రివి దేవ! నీవు మా
తండ్రివి తల్లివిం బతివి దైవమవున్ సఖివిన్ గురుండ వే
తండ్రులు నీక్రియం బ్రజల ధన్యులఁజేసిరి? వేల్పులైన నో
తండ్రి! భవన్ముఖాంబుజము ధన్యతఁగానరు మా విధంబునన్. 113
పోతన 1-11-250

* * *

## అధ్యాయము-12

### ఉత్తరకు పరీక్షిత్తు జన్మించుట

**శ్రీసూత ఉవాచ :**

శ్లో॥ మాతుర్గర్భగతో వీరస్స తదా భృగునందన!
దదర్శ పురుషం కంచిద్దహ్యమానోఽస్త్ర తేజసా ॥ 175

అంగుష్ఠమాత్రమమలం స్ఫురత్పురటమౌళినమ్ ।
అపీచ్యదర్శనం శ్యామం తటిద్వాససమచ్యుతమ్ ॥

శ్లో॥ శ్రీమద్దీర్ఘ చతుర్బాహుం తప్తకాంచనకుండలమ్ ।
క్షతజాక్షం గదాపాణిమాత్మనస్సర్వతో దిశమ్ ॥

పరిభ్రమంతముల్కాభాం భ్రామయంతం గదాం ముహుః ।
అస్త్ర తేజస్స్వగదయా నీహారమివ గోపతిః ॥

విధమంతం సన్నికర్షే పర్యైక్షత క ఇత్యసౌ ।
విధూయ తదమేయాత్మా భగవాన్ ధర్మగుబ్విభుః ॥

మిషతో దశమాస్యస్య తత్రై వాంతర్దధే హరిః ।
తతస్సర్వగుణోదర్కే సానుకూలగ్రహోదయే ॥ 180

జజ్ఞే వంశధరః పాండోర్భూయః పాండురివౌజసా ।
తస్య ప్రీతమనా రాజా విప్రైర్ధౌమ్యకృపాదిభిః ॥

వ్యాస 1-12-7 నుండి 13

వ. అంతం గొన్ని దినంబులకు నభిమన్యు కాంతాగర్భంబు నందున్న డింభకుండు దశమాస పరిచ్ఛేద్యుండై, గర్భాంతరాళంబున దురంతంబైన యశ్వత్థామ బాణానలంబున దందహ్యమానుండై తల్లడిల్లుచు.



ఉ. కుయ్యిడ శక్తిలే దుదర గోళములోపల నున్న వాఁడ ది
క్కెయ్యది? దా ననాథ నని యెప్పుడుఁదల్లి గణింప విందు నేఁ
డి య్యిషువహ్నివాయుటకు నెయ్యది మార్గము? నన్నుఁగావ నే
యయ్య గలండు? గర్భ జనితాపద నెవ్వఁడెఱుంగు దైవమా!

క. చిచ్చుఱకోల వశంబునఁ
జచ్చి బహిర్గతుఁడఁగాని సమయమునను దా
నుచ్చలిత గర్భవేదనఁ
జచ్చును మాతల్లి ఘోర సంతాపమునన్. 116

క. చెచ్చెర బాణ జ్వాలలు
వచ్చిన విష్ణుండు గావవచ్చు ననుచుఁదా
ముచ్చటలు సెప్పు సతులకు
నిచ్చలు మాయవ్వ నేఁడు నిజమయ్యెడినో! 117

శా. రాఁడా చూడ? సమస్త భూతములలో రాజిల్లువాఁడిచ్చటన్
లేఁడా? పాఱుని చిచ్చుఱమ్ము దొలఁగన్ లీలాగతిన్ ద్రోచి నా
కీఁడా? నేఁడభయప్రదాన మతఁడూహింపన్ నతత్రాత మున్
గాఁడా? యెందఱిఁగావఁడీ యెడల మత్కర్మంబు దా నెట్టిదో?

వ. అని గతాగత ప్రాణుండై శిశువు చింతించు సమయంబున.

సీ. మేఘంబు మీఁద క్రొమ్మెఱుఁగు కై వడిమేని
పై నున్న పచ్చని పటమువాఁడు
గండ భాగంబులఁగాంచన మణిమయ
మకరకుండల కాంతి మలయువాఁడు
శరవహ్ని నణఁగించు సంరంభమునఁజేసి
కన్నుల ననుఁగెంపు గలుగువాఁడు
బాలార్క మండల ప్రతిమాన రత్నర
హాటక విరాజిత కిరీటంబువాఁడు

తే. గంకణాంగద వనమాలికా విరాజ
మానుఁడసమానుఁడంగుష్ఠమాత్రదేహుఁ
డొక్కగదఁజేతఁదాల్చి నేత్రోత్సవముగ
విష్ణుఁడావిర్భవించె నవ్వేళ యందు. 120

వ. ఇట్లు భక్తపరాధీనుండైన పరమేశ్వరుం డావిర్భవించి, మంచు విరియించు మార్తాండు చందంబున శిశువునకు దశదిశలం దన చేతి యఖండిత మహోల్కాజాల సన్నిభంబైన గదాదండంబు మండలాకారంబుగ జిఱజిఱం ద్రిప్పి, విప్రుని చిచ్చఱమ్ము వేఁడిమి పోఁడిమి, జెఱచి, డింభకుని పరితాప విజృంభణంబు నివారించి, గర్భంబు కందకుండ రక్షించి యర్భకునికి నానందంబు గల్పించిన. 121

మ. గదఁజేఁబట్టి పరిభ్రమించుచు గదాఘాతంబునన్ దుర్భయ
ప్రదమై వచ్చు శరాగ్నిఁదుత్తుమురుగా భంజించి రక్షించు నీ
సదయుం డెవ్వఁడొకో? యటంచు మదిలోఁజర్చింపుచున్ శాబకుం
డెదురై చూడ నదృశ్యుఁడయ్యె హరిసర్వేశుండు విప్రోత్తమా!

వ. అంత ననుకూల శుభ గ్రహోదయంబును, సర్వ గుణోత్తర ఫలసూచకంబునైన మంచి లగ్నంబునం బాండవ వంశోద్ధారకుం డైన కుమారుండు జన్మించెను. 122

పోతన 1612-277 నుండి 286

* * *

## అధ్యాయము-15

### అర్జునుండు ద్వారకనుండి వచ్చి కృష్ణనిర్యాణమును దెలియఁజెప్పట

**శ్రీసూత ఉవాచ :**

శ్లో॥ ఏవం కృష్ణసఖః కృష్ణో భ్రాత్రా రాజ్ఞాఽఽ వికల్పితః ।
నానాశంకాస్పదం రూపం కృష్ణవిశ్లేషకర్శితః ॥ 182

శోకేన శుష్యద్వదనహృత్సరోజో హతప్రభః ।
విభుం తమేవానుధ్యాయన్నా శక్నోత్ప్రతిభాషితుమ్ ॥

కృచ్ఛ్రేణ సంస్తభ్య శుచః పాణినా మృజ్య నేత్రయోః ।
పరోక్షేణ సమున్నద్ధప్రణయాత్కంఠ్యకాతరః ॥ 184

శ్లో॥ సఖ్యం మైత్రీం సుహృత్త్వం చ సారథ్యాదిషు సంస్మరన్ ।
నృపమగ్రజమిత్యాహ బాష్పగద్గదయా గిరా ॥

వ్యాస 1-15-1 నుండి 4

వ. అని పలికిన గన్నీరు కరతలమునం దుడిచికొనుచు, గద్గదస్వరంబున మహానిధిఁగోలుపోయిన పేదచందంబున నిట్టూర్పుల నిగుడింపుచు, నర్జునుం డన్న (ధర్మజున) కిట్లనియె.

క. మన సారథి, మన సచివుఁడు,
మన వియ్యము, మన సఖుండు, మన బాంధవుఁడున్
మన విభుఁడు, గురువు, దేవర
మనలను దిగనాడి చనియె, మనుజాధీశా! 125

పోతన 1-15-355, 356

శ్లో॥ యో నో జుగోప వనమేత్య దురంతకృచ్ఛ్రా
ద్దుర్వాససోఽరిరచితాదయుతాగ్రభుగ్యః ।

శాకాన్నశిష్టముపయుజ్య యతస్త్రిలోకీం
తృప్తామమం స్త సలిలే వినిమగ్నసంఘః ॥ 186
వ్యాస 1-15-11

సీ. దుర్వాసుఁడొకనాఁడు దుర్యోధనుఁడు పంప
పదివేల శిష్యులు భక్తిఁగొలువఁ
జనుదెంచి మనము పాంచాలియుఁగుడిచిన
వెనుక నాహారంబు వేఁడుకొనినఁ
బెట్టెద ననవుఁడుఁబెట్టకున్న శపింతు
ననుచుఁదోయావగాహమున కేగఁ
గడవల నన్న శాకములు దీఱుట చూచి
పాంచాల పుత్రిక పర్ణశాల

తే. లోన వెఱచిన, విచ్చేసి లోనిలోని
శిష్ట శాకాన్న లవము ప్రాశించి, తపసి
కోప ముడిగించి, పరిపూర్ణ కుక్షిఁజేసె
నిట్టి త్రైలోక్య సంతర్పి యెందుఁగలఁడు? 126
పోతన 1-15-362

శ్లో॥ యత్తేజసా స భగవాన్యుధి శూలపాణి
ర్విస్మాపితస్స గిరిజోఽ స్త్రమదాన్నిజం మే।
అన్యేఽ పి చాహమమునైవ కళేబరేణ
ప్రాప్తో మహేంద్రభవనే మహదాసనార్థమ్ ॥ 187

తత్రైవ మే విహరతో భుజదండయుగ్మం
గాండీవలక్షణమరాతివధాయ దేవాః ।
సేంద్రాశ్రితాః యదనుభావితమాజమీఢ
తేనాహమద్య ముషితః పురుషేణ భూమ్నామ్ ॥
వ్యాస 1-15-12, 13



సీ. పందికై పోరాడ ఫాలాక్షుఁడెవ్వని
బలమున నా కిచ్చెఁబాశుపతము!
నెవ్వని లావున నీ మేన దేవేంద్రు
పీఠార్ధమున నుండు పెంపుఁగంటిఁ!
గాలకేయ నివాత కవచాది దైత్యులఁ
జంపితి నెవ్వని సంస్మరించి!
గోగ్రహణమునాఁడు కురుకులాంభోనిధిఁ
గడచితి! ఎవ్వని కరుణఁజేసి

ఆ. కర్ణ సింధురాజ కౌరవేంద్రాదుల
తలల పాగలెల్లఁదడవి తెచ్చి
యే మహాత్ము బలిమి నిచ్చితి! విరటుని
పుత్రి యడుగ బొమ్మపొత్తికలకు. పోతన 1-15-153

శ్లో॥ ప్రాయేణైతద్భగవత ఈశ్వరస్య విచేష్టితమ్ ।
మిథో నిఘ్నంతి భూతాని భావయంతి చ యన్మిథః ॥
వ్యాస 1-15-24

క. భూతములవలన నెప్పుడు
భూతములకు జన్మ మరణ పోషణములు ని
ర్ణీతములు సేయుచుండును
భూతమయుం డీశ్వరుండు భూపవరేణ్యా. 128
పోతన 1-15-375

శ్లో॥ జలౌకసాం జవే యద్వన్మహాంతోఽ దంత్యణీయసః ।
దుర్బలాన్బలినో రాజన్మహాంతో బలినో మిథః ॥ 190
వ్యాస 1-15-25

క. బలములుగల మీనంబులు
బలవిరహిత మీనములను భక్షించుక్రియన్
బలవంతులైన యదువులు
బలరహితులఁజంపి రహితభావముల నృపా!

పోతన 1-15-376

శ్లో॥ ఏవం బలిష్ఠైర్యదుభిర్మహద్భిరపరాన్విభుః ।
యదూన్యదుభిరన్యోన్యం భూభారాన్ సంజహార హ ॥ 191

శ్లో॥ దేశకాలార్థయుక్తాని హృత్తాపోపశమాని చ
హరంతి స్మరతశ్చిత్తం గోవిందాభిహితాని మే ॥ 192

వ్యాస 1-15-26, 27

మ. బలహీనాంగులకున్ బలాధికులకుం బ్రత్యర్థి భావోద్యమం
బులు గల్పించి, వినాశమున్నెఱపి, యీభూభారముం బాపి, ని
శ్చలబుద్ధిన్ గృతకార్యుఁడై చనియె నా సర్వేశ్వరుం డచ్యుతుం
డలఘుం డేమని చెప్పుదున్! భవదీయాయత్త మ్ముర్వీశ్వరా!

వ. మఱియు దేశకాలార్థ యుక్తంబులు, నంతఃకరణ సంతాప శమనంబులు నైన హరివచనంబులం దలంచి, చిత్తంబు పరాయత్తంబై యున్నది. 131

పోతన 1-15-377, 378

**శ్రీసూతః ఉవాచ :**

శ్లో॥ వాసుదేవాంఘ్ర్యనుధ్యానపరిబృంహితరంహసా ।
భక్త్యా నిర్మథితాశేషకషాయధిషణోఽర్జునః ॥ 193

గీతం భగవతా జ్ఞానం యత్తత్సంగ్రామ మూర్ధని ।
కాలకర్మతమోరుద్ధం పునరధ్యగమద్విభుః ॥

విశోకో బ్రహ్మసంపత్త్యా సంఛిన్నద్వైతసంశయః ।
లీనప్రకృతినైర్గుణ్యాదలింగత్వాదసంభవః ॥



నిశమ్య భగవన్మార్గం సంస్థాం యదుకులస్య చ ।
స్వః పథాయ మతిం చక్రే నిభృతాత్మా యుధిష్ఠిరః ॥

పృథాప్యుపశ్రుత్య ధనంజయోదితం
నాశం యదూనాం భగవద్గతిం చ తామ్ ।
ఏకాంతభక్త్యా భగవత్యధోక్షజే
నివేశితాత్మోపరరామ సంసృతేః ॥ 197

వ్యాస 1-15-29 నుండి 33

వ. గోవింద చరణారవింద చింతామలబుద్ధియై, శోకంబు వర్జించి, సదా ధ్యాన భక్తివిశేషంబులం గామక్రోధాదుల జయించి, తొల్లి తన కుభయ సేనామధ్యంబున ననంతుం డానతిచ్చిన గీతలు దలంచి కాలకర్మభోగాభి నివేశంబులచేత నావృత్తంబైన విజ్ఞానంబు గ్రమ్మఱ నధిగమించి, శోకహేతు వహంకార మమకారాత్మకంబైన ద్వైతభ్రమం బనియును, ద్వైత భ్రమంబులకుఁ గారణంబు దేహంబనియును, దేహంబునకు బీజంబు లింగంబనియును, లింగంబునకు మూలంబు గుణంబు లనియును, గుణములకు నిదానము ప్రకృతి యనియును, బ్రహ్మాహ మనియెడు జ్ఞానంబున లీనయై ప్రకృతి లేకుండు ననియు ప్రకృతి యడంగుటయ నైర్గుణ్యం బనియును, నైర్గుణ్యంబు వలనఁగార్యలింగ నాశంబనియును, గార్యలింగ నాశంబున నసంభవం బగుననియును, ప్రకృతిం బాసి క్రమ్మఱ స్థూలశరీర ప్రాప్తుండు గాక పురుషుండు సమ్యగ్భోగంబున నుండుననియును, నిశ్చయించి, యర్జునుండు విరక్తుండై యూరకుండె. 131

పోతన 1-15-378

శ్లో॥ యథా మత్స్యాదిరూపాణి ధత్తే జహ్యాద్యథా నటః ।
భూభారః క్షపితో యేన జహౌ తచ్చ కళేబరమ్ ॥ 198

యదా ముకుందో భగవా నిమాంమహీం
జహౌ స్వతన్వా శ్రవణీయసత్కథః ।
తదాహరేవాఽ ప్రతిబుద్ధచేతసామ్
అధర్మహేతుః కలిరన్వవర్తత ॥ 199

వ్యాస 1-15-35, 36

వ. యాదవరూప శరీరంబునంజేసి యీశ్వరుండు లోకకంటక శరీరంబులు సంహరించి నిజశరీరంబు విడిచె. సంహారమునకు నిజశరీర పరశరీరములు రెండు నీశ్వరునకు సమంబులు. నిజరూపంబున నుండుచు, రూపాంతరంబుల ధరించి క్రమ్మఱ నంతర్ధానంబునొందు నటునికై వడి లీలాపరాయణుం డైన నారాయణుండు మీన కూర్మాది రూపంబులు ధరియించుం బరిహరించు నని చెప్పి మఱియు నిట్లనియె.

క. ఏ దినమున వైకుంఠుఁడు
మేదినిపైఁదాల్చినట్టి మేను విడిచినాఁ
డా దినమున నశుభ ప్రతి
పాదకమగు కలియుగంబు ప్రాప్తంబయ్యెన్. 133

పోతన 1-15-380, 381

* * *

## అధ్యాయము-16

### పరీక్షిన్మహారాజు భూ ధర్మదేవతల సంవాదం బాలించుట

**ధరణ్యువాచ (భూదేవి యిట్లనియె) :**

శ్లో॥ సత్యం శౌచం దయా క్షాంతిస్త్యాగస్సంతోష ఆర్జవమ్ ।
శమో దమ స్తపస్సామ్యం తితిక్షోపరతిశ్శ్రుతమ్ ॥ 200

జ్ఞానం విరక్తిరైశ్వర్యం శౌర్యం తేజో బలం స్మృతిః ।
స్వాతంత్ర్యం కౌశలం కాంతిర్ధైర్యం మార్దవమేవ చ ॥

ప్రాగల్భ్యం ప్రశ్రయశ్శీలం సహ ఓజో బలం భగః ।
గాంభీర్యం స్థైర్యమాస్తిక్యం కీర్తిర్మానోఽ నహంకృతిః ॥

ఏతే చాన్యే చ బహవో యస్మిన్నిత్యా మహాగుణాః ।
ప్రార్థ్యామహత్త్వమిచ్ఛద్భిర్న వియంతిస్మ కర్హిచిత్ ॥ 203

శ్లో॥ తేనాహం గుణపాత్రేణ శ్రీనివాసేన సాంప్రతమ్ ।
శోచామి రహితం లోకం పాప్మనా కవినేక్షితమ్ ॥ 204

వ్యాస 1-16-27 నుండి 31

వ. సత్య శౌచ దయా క్షాంతి త్యాగ సంతోషార్జవంబులును, శమ దమ తపంబులును, సామ్యంబును, పరాపరాధసహనంబును, లాభంబుగలయెడ నుదాసీనుండై యుండుటయును, శాస్త్ర విచారంబును, విజ్ఞానవిరక్తులును, ఐశ్వర్య శౌర్యప్రభా దక్షత్వంబులును, స్మృతియును, స్వాతంత్ర్యమును, కౌశల కాంతి ధైర్య మార్దవ ప్రతిభాతిశయ ప్రశ్రయ శీలంబులును, జ్ఞానేంద్రియ కర్మేంద్రియ మనోబలంబులును, సౌభాగ్య గాంభీర్యంబులును, స్థైర్య, శ్రద్ధా కీర్తి, మాన, గర్వా భావంబులు ననియెడి ముప్పదితొమ్మిది గుణంబులు నవియునుంగాక బ్రహ్మణ్యతా శరణ్యతాది మహాగుణ సమూహంబును, కృష్ణదేవునియందు వర్తించును. 134

పోతన 1-16-400

శ్లో॥ ఆత్మానం చానుశోచామి భవంతం చామరోత్తమమ్ ।
దేవాన్నృషీన్ పితౄన్ సాధూన్ సర్వాన్వర్ణాశ్రమాం స్తథా ॥ 205
వ్యాస 1-16-32

క. గణనాతీతములగు స
ద్గుణములు గల చక్రి సనిన ఘోరకలి ప్రే
రణమునఁబాపసమూహ
ప్రణయుతులగు జనులఁజూచి వగచెదఁదంద్రీ! 135

క. దేవతలకు, ఋషులకుఁ బితృ
దేవతలకు, నాకు, నీకు, ధీయుతులకు నా
నావర్ణాశ్రమములకును
గోవులకును బాధయనుచుఁగుందెద ననఘా! 136
పోతన 1-16-401, 402

శ్లో॥ బ్రహ్మాదయో బహుతిథం యదపాంగమోక్ష
కామాస్తపస్సమచరన్భగవత్ప్రపన్నా ।
సా శ్రీస్స్వవాసమరవిందవనం విహాయ
యత్పాదసౌభగమలం భజతేఽనురక్తా॥ 206

తస్యాహమబ్జకులిశాంకుశకేతుకేతైః
శ్రీమత్పదైర్భగవతస్సమలంకృతాంగీ ।
త్రీనత్యరోచ ఉపలభ్య తతో విభూతిం
లోకాన్ స మాం వ్యసృజదుత్స్మయతీం తదంతే ॥

యో వై మమాతిభరమాసురవంశరాజ్ఞా
మక్షౌహిణీశతమపానుదదాత్మతంత్రః ।
త్వాం దుస్థమూనపదమాత్మని పౌరుషేణ
సంపాదయన్యదుషు రమ్యమభిభ్రదంగమ్ ॥ 208



కా వా సహేత విరహం పురుషోత్తమస్య
ప్రేమావలోకరుచిరస్మితవల్గుజల్పైః ।
స్థైర్యం స మానమహరన్మధుమానినీనాం
రోమోద్గమో మమ యదంఘ్రివిటంకితాయాః ॥ 209
వ్యాస 1-16-33 నుండి 36

సీ. బ్రహ్మాదు లెవ్వని భద్రకటాక్ష
వీక్షణము వాంఛింతురు సత్తపములఁ
గమలాలయము మాని కమల యెవ్వనిపాద
కమలంబు సేవించుఁగౌతుకమున
భవ్యచిత్తంబునఁబరమయోగీంద్రులు
నిలుపుదు రెవ్వని నియతితోడ
వేదంబు లెవ్వని విమలచారిత్రముల్
వినుతింపఁగా లేక వెగడు వడియె

ఆ. నట్టి వాసుదేవు నబ్జ వజ్రాంకుశ
చక్ర మీన శంఖ చాప కేతు
చిహ్నితంబులైన శ్రీచరణములింక
సోఁకవనుచు వగపు సోఁకెనయ్య. 137

క. హరిపాదంబులు సోఁకెడి
సిరికతమున నిఖిలభువన సేవ్యత్వముతో
స్థిరనైతి నిన్నిదినములు
హరి నా గర్వంబు మాన్పి యరిగె మహాత్మా!

క. లీలాకారము దాల్చెను
శ్రీలలనేశుండు ఖలుల శిక్షించి భవో

న్మూలనము సేయుకొఱకును
నాలుగుపాదముల నిన్ను నడిపించుటకున్. 139

ఉ. ఆ మధురోక్తు, లా నయము, లా దరహాసము, లా దయారసం,
బా మురిపెంబు, లా తగవు, లా గమనక్రియ, లా మనోహర
ప్రేమకరావలోకనము బ్రీతిఁగనుంగొనవేమి మాధవున్
గామిను లేల? నిర్దళితకర్ములు యోగులు వాయనేర్తురే?

క. మెల్లన నాపై యాదవ
వల్లభుఁడడుగిడఁగ మోహవశనై నే రం
జిల్లఁగ రోమాంచముక్రియ
మొల్లములై మొలుచు సస్యములు మార్గములన్.

వ. అని యిట్లు పూర్వవాహినియైన సరస్వతీతీరంబున ధర్మదేవుండును భూమియు వృషభ ధేను రూపంబుల భాషించుకొనిరి. 142

పోతన 1-16-403 నుండి 408

* * *

## అధ్యాయము-18

### పరీక్షిన్మహారాజు కలిని నిగ్రహించి ధర్మపరిపాలనంబు సేయుట

**శ్రీసూతః ఉవాచ :**

శ్లో॥ నోత్తమశ్లోకవార్తానాం జుషతాం తత్కథామృతమ్ ।
స్యాత్సంభ్రమోఽంతకాలేఽపి స్మరతాం తత్పదాంబుజమ్ ॥ 210

వ్యాస 1-18-4

క. హరివార్త లెఱుఁగువారికి
హరిపదములు తలఁచువారి కనవరతంబున్
హరికథలు వినెడివారికి
మరణాగత మోహసంభ్రమము లే దనఘా! 143

పోతన 1-18-436

**ఋషయ ఊచుః :**

శ్లో॥ సూత జీవ సమాస్సౌమ్య శాశ్వతీర్విశదం యశః ।
యస్త్వం శంససి కృష్ణస్య మర్త్యానామమృతం హి నః ॥ 211

శ్లో॥ కర్మణ్యస్మిన్న నాశ్వాసే ధూమధూమ్రాత్మనాం భవాన్ ।
ఆపాయయతి గోవిందపాదపద్మాసవం మధు ॥ 212

తులయామ లవేనాపి న స్వర్గం నాపునర్భవం ।
భగవత్సంగిసంగస్య మర్త్యానాం కిముతాశిషః ॥

కో నామ తృప్యేద్రసవిత్కథాయాం
మహత్తమైకాంతపరాయణస్య ।
నాంతం గుణానామగుణస్య జగ్ము
ర్యోగేశ్వరా యే భవపాద్మముఖ్యాః ॥

తతో భవాన్ వై భగవత్ప్రధానో
మహత్తమైకాంతపరాయణస్య ।

హరేరుదారం చరితం విశుద్ధం
శుశ్రూషతాం నో వితనోతు విద్వన్ ॥ 215
వ్యాస 1-18-11, 15

సీ. పౌరాణికోత్తమ! బ్రదుకుము పెక్కేండ్లు
తామరసాక్షుని ధవళయశము
మరణశీలురమైన మా కెఱింగించితి
కల్పితంబగు క్రతుకర్మమందుఁ
బొగలచే! బొగిలి యబుద్ధచిత్తులమైన
మము హరిపదపద్మ మధురసంబుఁ
ద్రావించితివి నీవు ధన్యుల మైతిమి
స్వర్గమేనియు నపవర్గమేని

తే. భాగవతసంగ లవభాగ్య ఫలము కీడె?
ప్రకృతిగుణహీనుఁడగు చక్రిభద్రగుణము
లీశ కమలాసనాదులు నెఱుఁగలేరు
వినియు వినఁజాల ననియెడి వెఱ్ఱిగలఁడె? 144

క. శ్రీపంబులు ఖండిత సం
తాపంబులు గల్మషాంధతమస మహోద్య
ద్దీపంబులు పాషండ దు
రాపంబులు విష్ణువంద నాలాపంబుల్ 145

క. పావనములు దురితలతా
లావనములు నిత్యమంగళ ప్రాభవ సం
జీవనములు లక్ష్మీసం
భావనములు వాసుదేవ పదసేవనముల్.
పోతన 1-18-441, 442, 443

శ్లో॥ స వై మహాభాగవతః పరీక్షి
ద్యేనాపవర్గాఖ్యమదభ్రబుద్ధిః ।



జ్ఞానేన వైయ్యాసికశబ్దితేన
భేజే ఖగేంద్రధ్వజపాదమూలమ్ ॥
వ్యాస 1-18-16

ఆ. పరమభాగవతుఁడు పాండవపౌత్రుండు
శుకుని భాషణముల శుద్ధబుద్ధి
యై విరాజమానుఁడై ముక్తియగు విష్ణు
పాదమూల మెట్లు పడసె? ననఘ!
పోతన 1-18-444

**శ్రీసూతః ఉవాచ :**

శ్లో॥ కుతః పునర్గృణతో నామ తస్య
మహత్తమైకాంతపరాయణస్య ।
యోఽనంతశక్తిర్భగవాననంతో
మహద్గుణత్వాద్యమనంతమాహుః ॥ 217

శ్లో॥ ఏతావతాలం నను సూచితేన
గుణైరసామ్యానతిశాయనస్య ।
హిత్వేతరాన్ ప్రార్థయతో విభూతి
ర్యస్యాంఘ్రిరేణుం జుషతేఽనభీప్సోః ॥ 218

అథాపి యత్పాదనఖావసృష్టం
జగద్విరించోపహృతార్హణాంభః ।
సేశం పునాత్యన్యతమో ముకుందా
త్కోనామ లోకే భగవత్పదార్థః ॥

యత్రానురక్తాస్సహసైవ ధీరా
వ్యపోహ్య దేహాదిషు సంగమూఢమ్ ।
వ్రజంతి తత్పారమహంస్యమంత్యం
యస్మిన్నహింసోపశమస్స్వధర్మః ॥

అహం హి పృష్టోఽర్యమణో భవద్భి
రాచక్ష ఆత్మావగమోఽత్ర యావాన్ ।

నభః పతం త్యాత్మసమం పతత్రిణ
స్తథా సమం విష్ణుగతిం విపశ్చితః ॥ 221
వ్యాస 1-18-19 నుండి 23

సీ. ఎవ్వని గుణజాల మెన్న జిహ్వాలులేక
నళినగర్భాదు లనంతుఁడంద్రు
కోరెదు విబుధేంద్రకోటి నొల్లక లక్ష్మి
ప్రార్థించె నెవ్వని పాదరజము
బ్రహ్మ యెవ్వని పాదపద్మంబు గడిగిన
జలము ధన్యత నిచ్చె జనుల కెల్ల
భగవంతుఁడనియెడి భద్రశబ్దమునకు
నెవ్వఁడర్థాకృతి నేపుమిగులు

ఆ. నే మహాత్ము నాశ్రయించి శరీరాది
సంగకోటినెల్ల సంహరించి
ప్రాభవమున మునులు పారమహంస్యంబు
నొంది తిరిగి రాకయుందు రెలమి. 148

చ. క్రమమున మింటికై యెగయుఁగాక విహంగము మింటిదైన పా
రము గననేర్చునే? హరిపరాక్రమ మోపినయంత గాఁగ స
ర్వము వివరింప నెవ్వఁడు ప్రవర్తకుఁడర్యములారఁ నాదు చి
త్తమునకు నెంత గానఁబడెఁదప్పకచెప్పెద మీకు నంతయున్.
పోతన 1-18-448, 449

శ్లో॥ ఇత్యుక్త్వా రోషతామ్రాక్షో నయస్యానృషిబాలకః ।
కౌశిక్యాప ఉపస్పృశ్య వాగ్వజ్రం విససర్జ హ ॥
ఇతో లంఘితమర్యాదం తక్షకస్సప్తమేఽ హని
ధక్ష్యతి స్మకులాంగారం చోదితో మే తతద్రుహమ్ ॥ 223
పోతన 1-18-36, 37



వ. శమీకమహాముని కుమారుడు శృంగి రోషించి కౌశికీ నదికిం జని
జలోపస్పర్శనంబు సేసి. 150

ఉ. ఓడక వింటికోపున మృతోరగముం గొనివచ్చి మాఱు మా
టాడకయున్న మజ్జనకు నంసతలంబునఁబెట్టి దుర్మద
క్రీడఁజరించు రాజు హరకేశవు లడ్డిననైనఁజచ్చుఁబో
యేడవనాఁడు తక్షకఫణీంద్ర విషానల హేతిసంహతిన్. 151
పోతన 1-18-469, 470

**పరీక్షిన్మహారాజు శృంగివలన శాపంబు నొందుట**

**శమీక మహామునీంద్రుని సంతాపము**

శ్లో॥ అలక్ష్యమాణే నరదేవనామ్ని
రథాంగపాణావయమంగ లోకః ।
తదా హి చోరప్రచురో వినంక్ష్య
త్యరక్ష్యమాణోఽ వివరూథవత్క్షణాత్ ॥ 224
వ్యాస 1-18-43

ఉ. కాపరిలేని గొఱ్ఱియలకైవడిఁ గంటక చోరకోటిచే
నేపరియున్న దీ భువన మీశుఁడు కృష్ణుఁడు లేమి నిట్టిచో
భూ పరిపాలనంబు సమబుద్ధి నితం డొనరింపఁజెల్లరే ।
యీ పరిపాటి ద్రోహమున కిట్లు శపింపఁగనేల? బాలకా!
పోతన 1-18-479

శ్లో॥ తదద్య నః పాపముపైత్యనన్వయం
యన్నష్ట నాథస్య వసోర్విలుంపకాత్ ।
పరస్పరం ఘ్నన్తి శపన్తి వృంజ తే
పశూన్స్త్రియోఽ ర్థాన్ పురుదస్యవో జనాః ॥
తదార్య ధర్మశ్చ విలీయతే నృణాం
వర్ణాశ్రమాచారయుతస్త్రయీమయః ।

తతోఽర్థకామాభినివేశితాత్మనాం
శునాం కపీనామివ వర్ణసంకరః ॥

ధర్మపాలో నరపతి స్స తు సమ్రాడ్బృహచ్ఛ్రవాః ।
సాక్షాన్మహాభాగవతో రాజర్షిర్హయమేధయాట్ ॥ 227

వ్యాస 1-18-44, 45, 46

సీ. పాపంబు నీ చేతఁ బ్రాపించె మనకింక
రాజు నశించిన రాజ్యమందు
బలవంతుఁడగువాఁడు బలహీను పశుదార
హయ సువర్ణాదుల నపహరించు
జార చోరాదులు సంచరింతురు ప్రజ
కన్యోన్య కలహంబు లతిశయిల్లు
వైదికంబై యున్న వర్ణాశ్రమాచార
ధర్మ మించుక లేక తప్పిపోవు

ఆ. నంతమీఁద లోకు లర్థ కామంబులఁ
దగిలి సంచరింప ధరణి నెల్ల
వర్ణ సంకరములు వచ్చును మర్కట
సారమేయ కులము మేరఁ బుత్ర! 153

పోతన 1-18-480

శ్లో॥ క్షుత్తృట్ఛ్రమయుతో దీనో నై వాస్మచ్ఛాపమర్హతి ।
అపాపేషు స్వభృత్యేషు బాలేనాఽపక్వబుద్ధినా ॥ 228

పాపం కృతం యద్భగవాన్ సర్వాత్మా క్షంతుమర్హతి ।
తిరస్కృతా విప్రలబ్ధాశ్శప్తాః క్షిప్తా హతా అపి ॥

నాస్య తత్ప్రతి కుర్వంతి తద్భక్తాః ప్రభవోఽపి హి ।
ఇతి పుత్రకృతాఘేన సోఽమతప్తో మహామునిః ॥ 230

వ్యాస 1-18-47, 48, 49



ఉ. భారతవంశజుం బరమభాగవతున్ హయమేధయాజి నా
చారపరున్ మహానయ విశారదు రాజకులైకభూషణున్
నీరము గోరి నేఁడు మన నేలకు వచ్చిన భక్తి నర్థి స
త్కారము సేసి పంపఁజనుఁగాక! శపింపఁగ నీకు ధర్మమే!

క. భూపతికి నిరపరాధమ
శాపము దా నిచ్చె బుద్ధిచాపలమున మా
పాపఁడు వీఁడొనరించిన
పాపము దొలఁగించు కృష్ణ! పరమేశ! హరీ! 155

క. పొడిచినఁదిట్టినఁగొట్టినఁ
బడుచుందురు గాని పరమ భాగవతులు దా
రొడఁబడరు మాఱు సేయఁగఁ
గొడుకా విభుఁడెగ్గుసేయఁగోరఁడు నీకున్.

పోతన 1-18-481, 482, 483

**శ్రీసూత ఉవాచ :**

శ్లో॥ స్వయం విప్రకృతో రాజ్ఞా నైవాఘం తదచింతయత్ ।
ప్రాయశస్సాధవో లోకేపరైర్ద్వంద్వేషు యోజితాః ॥

న వ్యథంతి న హృష్యంతి యత ఆత్మాఽగుణాశ్రయః ॥ 232

వ్యాస 1-18-50, 51

క. చెలఁగరు కలఁగరు సాధులు
మిళితములై పరులవలన మేలున్ గీడున్
నెలకొనిననైన నాత్మకు
నొలయవు సుఖ దుఃఖ చయము లుగ్రము లగుచున్. 157

వ. అని యిట్లు శమీక మహామునీంద్రుండు కొడుకు సేసిన పాపంబునకు సంతాపంబు నొందుచుండెను.

పోతన 1-18-484

## అధ్యాయము-19

### పరీక్షిన్మహారాజు విప్రశాపంబు నెఱింగి ప్రాయోపవిష్టుం డగుట

**శ్రీసూత ఉవాచ :**

శ్లో॥ అద్యైవరాజ్యం బలమృద్ధకోశం
ప్రకోపితబ్రహ్మకులానలో మే ।
దహత్వభద్రస్య పునర్న మేఽ భూత్
పాపీయసీ ధీర్ద్విజదేవగోభ్యః ॥ 233
వ్యాస 1-19-3

ఆ. రాజ ననుచుఁబోయి రాజ్యగర్వంబున
వనము కొఱకు వారి వనము సొచ్చి
దందశూకశవముఁదండ్రిపై వైచినఁ
బొలియఁదిట్ట కేల పోవు? సుతుఁడు. 158

క. గోవులకున్ బ్రాహ్మణులకు
దేవతలకు నెల్ల ప్రొద్దుఁదెంపున గీడుం
గావించు పాప మానస
మే విధమునఁబుట్టకుండ నే వారింతున్.
పోతన 1-19-488, 489

శ్లో॥ సంచితయన్నిత్థమథాశృణోద్యథా
మునేస్సుతోక్తో నిర్ఋతిస్తక్షకాఖ్యాత్ ।
స సాధు మేనే న చిరేణ తక్షకా
నలం ప్రసక్తస్య విరక్తికారణమ్ ॥ 234
వ్యాస 1-19-4

క. దామోదర పదభక్తిం
గామాదుల గెల్చినాఁడు గావునఁగరుణన్
భూమీశుఁడలుగఁడయ్యెను
సామర్థ్యము గలిగి దోష సంగిన్ శృంగిన్. 160
పోతన 1-19-491

శ్లో॥ అథో విహాయేమ మముం చ లోకం
విమర్శితౌ హేయతయా పురస్తాత్ ।
కృష్ణాంఘ్రిసేవా అధిమన్యమాన
ఉపావిశత్ప్రాయమమర్త్యనద్యామ్ ॥ 235
వ్యాస 1-19-5

వ. అంత మునికుమారుండు శపించిన వృత్తాంత మంతయు నిట్లు వితర్కించి, తక్షక వ్యాళ విషానల జ్వాలాజాలంబునం దనకు సప్తమ దినంబున మరణం బని యెఱింగి, భూలోక స్వర్గలోక భోగంబులు హేయంబులని తలంచి, రాజ్యంబు విసర్జించి, నిరశన దీక్షా కరణంబు సంకల్పించుకొనెను. పోతన 1-19-492.

శ్లో॥ యా వై లసచ్ఛ్రీతులసీవిమిశ్ర
కృష్ణాంఘ్రిరేణ్వభ్యధికాంబునేత్రీ ।
పునాతి లోకానుభయత్ర సేశాన్
కస్తాం న సేవేత మరిష్యమాణః ॥ 236
వ్యాస 1-19-6

మ. తులసీ సంయుత దైత్యజి త్పదరజస్స్తోమంబు కంటెన్ మహో
జ్జ్వలమై దిక్పతిసంఘ సంయుత జగత్సౌభాగ్య సంధాయియై
కలిదోషావళి నెల్లఁబాపు దివిషద్గంగా ప్రవాహంబు లో
పలికింబోయి మరిష్యమాణుఁడగుచుం బ్రాయోపవేశంబునన్. 162
పోతన 1-19-493

శ్లో॥ ఇతి వ్యవచ్ఛిద్య స పాండవేయః
ప్రాయోపవేశం ప్రతి విష్ణుపద్యామ్ ।
దధ్యౌ ముకుందాంఘ్రిమనన్యభావో
మునివ్రతో ముక్తసమస్తసంగః ॥
వ్యాస 1-19-7

క. చిత్తము గోవింద పదా
యత్తముఁగావించి మౌనియై తనలో నే
తత్తఱము లేక భూవర
సత్తముఁడు వసించె ముక్త సంగత్వమునన్.
పోతన 1-19-494

* * *

**పరీక్షిదువాచ :**

శ్లో॥ అహో వయం ధన్యతమా నృపాణాం
మహత్తమానుగ్రహణీయశీలాః ।
రాజ్ఞాం కులం బ్రాహ్మణపాదశౌచాత్
దూరాద్విసృష్టం బత గర్హ్యకర్మ ॥ 238
వ్యాస 1-19-13

ఉ. భూసురపాద రేణువులు పుణ్యులఁజేయు నరేంద్రులన్ ధరి
త్రీసురులార! మీ చరణరేణు కణంబులు మేనుసోక నా
చేసిన పాప మంతయు నశించెఁగృతార్థుఁడనైతి నెద్ది నేఁ
జేసిన ముక్తి పద్ధతికిఁచెచ్చెర బోవఁగవచ్చుఁజెప్పరే. 164
పోతన 1-19-498

శ్లో॥ మహర్షయోవై సముపాగతా యే
ప్రశస్య సాధ్విత్యనుమోదమానాః ।
ఊచుః ప్రజానుగ్రహశీలసారా
యదుత్తమశ్లోకగుణానురూపమ్ ॥ 239



న వా ఇదం రాజర్షివర్య చిత్రం
భవత్సు కృష్ణంసమనువ్రతేషు ।
యేఽధ్యాసనం రాజకిరీటజుష్టం
సద్యో జహుర్భగవత్పార్శ్వకామాః ॥
వ్యాస 1-19-19, 20

మ. క్షితినాథోత్తమ! నీ చరిత్రము మహాచిత్రంబు మీ తాత లు
గ్ర తపోధన్యులు విష్ణుపార్శ్వ పదవిన్ గామించి రాజన్య శో
భిత కోటీర మణిప్రభాన్విత మహాపీఠంబు వర్జించి రు
న్నతులై నీవు మహోన్నతుండవుగదా! నారాయణధ్యాయివై.

* * *

**రాజోవాచ :**

శ్లో॥ సమాగతాస్సర్వత ఏవ సర్వే
వేదా యథా మూర్తిధరాస్త్రిపృష్ఠే ।
నేహాథవాముత్ర చ కశ్చనార్థ
ఋతే పరానుగ్రహమాత్మశీలమ్ ॥ 241

శ్లో॥ తతశ్చ వః పృచ్ఛ్యమిమం హి పృచ్ఛే
విశ్రభ్య విప్రా ఇతికృత్యతాయామ్ ।
సర్వాత్మనా మ్రియమాణైశ్చ కృత్యం
శుద్ధం చ తత్రామృశతాభియుక్తాః ॥ 242
వ్యాస 1-19-23, 24

క. ఏడుదినంబుల ముక్తిం
గూడఁగ నేరీతి వచ్చు గురు సంసార
క్రీడన మేక్రియ నెడతెగుఁ
జూడుఁడు మా తండ్రులార! శ్రుతివచనములన్. 166

శా. ప్రాప్తానందులు బ్రహ్మబోధన కళాపారీణు లాత్మప్రభా
లుప్తాజ్ఞానులు మీర లార్యులు దయాళుత్వాభిరాముల్ మనో
గుప్తంబుల్ సకలార్థజాలములు మీకుం గానవచ్చుం గదా!
సప్తాహంబుల ముక్తి కేఁగెడు గతిన్ జర్చించి భాషింపరే.
పోతన 1-19-510, 511

వ. ఆసమయమున దైవయోగమున శుకమహర్షి పరీక్షిన్మహారాజును జూచుట కరుదెంచెను.

* * *

## శుకమహర్షి పరీక్షిన్మహారాజు నొద్ద కేతెంచుట

శ్లో॥ తత్రాగమద్భగవాన్ వ్యాసపుత్రో
యదృచ్ఛయా గామటమానోఽ నపేక్షః ।
అలక్ష్యలింగో నిజలాభతుష్టో
వృతఃస్త్రిబాలై రవధూతవేషః ॥ 243

శ్లో॥ తం ద్వ్యష్టవర్షం సుకుమారపాద
కరోరుబాహ్వంస కపోలగాత్రమ్ ।
చార్వాయతాక్షోన్నసతుల్యకర్ణ
సుభ్ర్వాననం కంబుసుజాతకంఠమ్ ॥ 244

నిగూఢజత్రుం పృథుతుంగవక్షస
ఆవర్తనాభిం వళివల్గూదరం చ ।
దిగంబరం వక్రవికీర్ణ కేశం
ప్రలంబ బాహుం స్వమరోత్తమాభమ్ ॥

శ్యామం సదాఽ పీచ్యవయోంగలక్ష్మ్యా
స్త్రీణాం మనోజ్ఞం రుచిరం స్మయేన ।



ప్రత్యుత్థితాస్తే మునయస్స్వాసనేభ్య
స్తల్లక్షణజ్ఞా అపి గూఢవర్చసమ్ ॥ 246
వ్యాస 1-19-25 నుండి 28

సీ. ప్రతినిమేషము పరబ్రహ్మంబు వీక్షించి
మదిఁజొక్కి వెలుపల మఱచువాఁడు
కమలంబు మీఁది భృంగముల కైవడిమోము
పై నెఱపిన కేశపటలివాఁడు
గిఱిప్రాసి మాయ నంగీకరించనిభంగి
వసనంబు గట్టక వచ్చువాఁడు
సంగి గాఁడని వెంటఁజాటు భూతములునా
బాలుర హాసశబ్దములవాఁడు

తే. మహిత పద జాను జంఘోరు మధ్య హస్త
బాహు వక్షో గళానన ఫాల కర్ణ
నాసికా గండమస్తక నయనయుగళుఁ
డైన యవధూతమూర్తి వాఁడరుగుదెంచె. 168

ఉ. ఈరని లోకులం గినిసి యెగ్గులు వల్కనివాఁడు, గోరికల్
గోరనివాఁడు, గూటువలఁగూడనివాఁడు, వృథాప్రపంచమున్
జేరనివాఁడు, దైవగతిఁజేరిన లాభము సూచి తుష్టుఁడై
నేరనివాని చందమున నేర్పులు సూపెడువాఁడు, వెండియున్.

ఆ. అ మ్మహాత్ము షోడశాబ్ద వయో రూప
గమన గుణ విలాస కౌశలములు
ముక్తికాంత సూచి మోహిత యగు నన
నితర కాంతలెల్ల నేమి చెప్ప! 170

వ. పాండవపౌత్రుండు శుకయోగికి పూజలు సేసి ఆహ్వానించెను.
పోతన 1-19-513 నుండి 515

శ్లో॥ ప్రశాంతమాసీనమకుంఠమేధసం
మునిం నృపో భాగవతోఽభ్యుపేత్య!
ప్రణమ్య మూర్ధ్నావహితః కృతాంజలి
ర్నత్వా గిరా సూనృతయాఽన్వపృచ్ఛత్ ॥ 247
వ్యాస 1-19-31

ఉ. ఫాలము నేలమోపి భయభక్తులతోడ నమస్కరించి భూ
పాలకులోత్తముండు కరపద్మములన్ ముకుళించి నేఁడు నా
పాలిటి భాగ్య మెట్టిదియో! పావనమూర్తివి పుణ్యకీర్తి వీ
వేళకు నీవువచ్చితి వివేక విభూషణ! దివ్యభూషణా!
పోతన 1-19-518

**రాజోవాచ :**

శ్లో॥ అహో అద్య వయం బ్రహ్మన్ సత్సేవ్యాః క్షత్రబంధవః ।
కృపయాఽతిథిరూపేణ భవద్భిస్తీర్థకాః కృతాః ॥ 248

శ్లో॥ యేషాం సంస్మరణాత్పుంసాం సద్యశ్శుద్ధ్యంతి వై గృహాః ।
కింపునర్దర్శనస్పర్శపాదశౌచాసనాదిభిః ॥ 249
వ్యాస 1-19-32, 33

మ. అవధూతోత్తమ! మంటి నేఁడు నినుడాయం గంటి నీవంటి వి
ప్రవరున్ బేర్కొను నంతటన్ భసితమౌపాపంబు నా బోఁటికిన్
భవదాలోకన భాషణార్చన పద ప్రక్షాళన స్పర్శనా
ది విధానంబుల ముక్తి చేపడుట చింతింపంగ నాశ్చర్యమే? 172
పోతన 1-19-519

శ్లో॥ సాన్నిధ్యాత్తే మహాయోగిన్ పాతకాని మహాంత్యపి ।
సద్యో నశ్యంతి వై పుంసాం విష్ణోరివ సురేతరాః ॥
వ్యాస 1-19-34



క. హరిచేతను దనుజేంద్రులు
ధర ద్రుగ్గెడుభంగి నీ పద స్పర్శముచే
గురు పాతకసంఘంబులు
పొరిమాలుఁగదయ్య యోగిభూషణ! వింటే!
పోతన 1-19-520

శ్లో॥ అపి మే భగవాన్ ప్రీతః కృష్ణః పాండుసుతప్రియః
పైతృష్వసేయప్రీత్యర్థం తద్గోత్రస్యాత్తబాంధవః ॥ 251
వ్యాస 1-19-35

మ. ఎలమిన్ మేనమఱందియై సచివుఁడై యే మేటి మా తాతలన్
బలిమిన్ గాచి సముద్రముద్రిత ధరం బట్టంబు గట్టించె న
య్యలఘుం డీశుండు చక్రి రక్షకుఁడు నా కన్యుల్ విపద్రక్షకుల్
గలరే? వేఁడెద భక్తి నా గుణనిధిం గారుణ్య వారాన్నిధిన్. 174
పోతన 1-19-521

శ్లో॥ అన్యథా తేఽవ్యక్తగతేర్దర్శనం నః కథం నృణామ్ ।
నితరాం మ్రియమాణానాం సంసిద్ధస్య వనీయసః ॥ 252

అతః పృచ్ఛామి సంసిద్ధిం యోగినాం పరమం గురుమ్ ।
పురుష స్యేహ యత్కార్యం మ్రియమాణస్య సర్వదా॥

యచ్ఛ్రోతవ్య మథో జాప్యం యత్కర్తవ్యం నృభిః ప్రభో ।
స్మర్తవ్యం భజనీయం వా బ్రూహి యద్వా విపర్యయమ్ ॥

నూనం భగవతో బ్రహ్మన్ గృహేషు గృహమేధినామ్ ।
న లక్ష్యతే హ్యవస్థానమపి గోదోహనం క్వచిత్ ॥ 255
వ్యాస 1-19-36 నుండి 39

సీ. అవ్యక్త మార్గుఁడ వైన నీ దర్శన
మాఱిడిఁబో నేర దభిమతార్థ
సిద్ధి గావించుట సిద్ధంబు నేఁడెల్లి
దేహంబు వర్జించు దేహధారి
కేమి చింతించిన నేమి జపించిన
నేమి గావించిన నేమి వినిన
నేమి సేవించిన నెన్నఁడు సంసార
పద్ధతిఁబాసినపదవి గలుగు

తే. నుండుమనరాదు గురుఁడవు యోగివిభుఁడ
వావుఁబితికినతడ వెంత యంతసేపు
గాని యొకదెస నుండవు కరుణతోడఁ
జెప్పవే తండ్రి! ముక్తికిఁజేరు తెరువు!! 175

వ. అని పరీక్షిన్న రేంద్రుండు బాదరాయణి నడిగె నని చెప్పెను. 176
పోతన 1-19-522, 523

క. రాజీవపత్ర లోచన! రాజేంద్ర కిరీటఘటిత రత్నమరీచి
భ్రాజిత పాదాంభోరుహ! భూజనమందార నిత్య పుణ్యవిచారా!

**మాలిని.**

అనుపమ గుణహారా! హన్యమానారివీరా!
జన వినుత విహారా! జానకీ చిత్త చోరా!
దనుజ ఘనసమీరా! దానవ శ్రీవిదారా!
ఘన కలుషకఠోరా! కంస గర్వాపహారా! 178

**ఇతి ప్రథమస్కన్ధః సమాప్తః**

హరిః ఓమ్

శ్రీకృష్ణార్పణమస్తు.

* * *

ఓమ్ నమో భగవతే వాసుదేవాయ

# శ్రీమద్భాగవత మణిహారము

## 13. ద్వితీయ స్కంధము

### అధ్యాయము-1

శ్లో॥ యస్య దీప్తిలవేనైవ దేవతా దేవతాం గతాః ।
వన్దే తం దేవదేవేశం సర్వదేవమయం హరిమ్ ॥

క. శ్రీమద్భక్త చకోరక
సోమ! వివేకాభిరామ! సురవినుత గుణ
స్తోమ! నిరలంకృతాసుర
రామా సీమంతసీమ! రాఘవరామా!

### శుకుఁడు పరీక్షితునకు ముక్తిమార్గంబుఁదెల్పుట

**శ్రీశుక ఉవాచ :**

శ్లో॥ వరీయానేష తే ప్రశ్నః కృతో లోకహితో నృప!
ఆత్మవిత్సంమతః పుంసాం శ్రోతవ్యాదిషు యః పరః ॥

శ్రోతవ్యాదీని రాజేంద్ర నృణాం సంతిః సహస్రశః ।
అపశ్యతా మాత్మ తత్త్వం గృహేషు గృహమేధినామ్ ॥

నిద్రయా హ్రియతే నక్తం వ్యవాయేన నవం వయః ।
దివాచార్థేహయా రాజన్కుటుంబభరణేన చ ॥

దేహాపత్యకళత్రాదిష్వాత్మసైన్యేష్వసత్స్వపి ।
తేషాం ప్రమత్తో నిధనం పశ్యన్నపి న పశ్యతి ॥ 4

వ్యాస 2-1-1 నుండి 4

వ. మహనీయ గుణగరిష్ఠులగు నమ్మునిశ్రేష్ఠులకు నిఖిల పురాణవ్యాఖ్యాన వైఖరీ సమేతుండైన సూతుం డిట్లనియె. అట్లు పరీక్షిన్నరేంద్రునకు శుకయోగీంద్రుం డిట్లనియె.

సీ. క్షితిపతి! నీ ప్రశ్న సిద్ధంబు మంచిది
యాత్మవేత్తలు మెత్తు రఖిలశుభద
మాకర్ణనీయంబు లయుతసంఖ్యలు గల
వందు ముఖ్యం బిది యఖిలవరము
గృహములలోపల గృహమేధులగు నరు
లాత్మతత్త్వము లేశమైన నెఱుఁగ
రంగనారతుల నిద్రాసక్తిఁజను రాత్రి
పోవుఁగుటుంబార్థబుద్ధి నహము

ఆ. పశు కళత్ర పుత్ర బాంధవ దేహాది
సంఘమెల్లఁ దమకు సత్యమనుచు
గాఁపురములు సేసి కడపటఁ జత్తురు
కనియుఁ గాన రంత్యకాలసరణి! 2

పోతన 2-1-2, 3

శ్లో॥ తస్మాద్భారత సర్వాత్మా భగవాన్ హరిరీశ్వరః ।
శ్రోతవ్యః కీర్తితవ్యశ్చ స్మర్తవ్యశ్చేచ్ఛతాఽభయమ్ ॥ 5

ఏతావాన్ సాంఖ్యయోగాభ్యాం స్వధర్మపరినిష్ఠయా ।
జన్మలాభః పరః పుంసామంతే నారాయణస్మృతిః ॥

ప్రాయేణ మునయో రాజన్నివృత్తావిధినిషేధతః ।
నైర్గుణ్యస్థా రమంతే స్మ గుణానుకథనే హరేః ॥ 7

వ్యాస 2-1-5 నుండి 7



క. కావున, సర్వాత్మకుఁడు మహావి
భవుఁడు విష్ణుఁడీఽశుఁడాకర్ణింపన్
సేవింపను, వర్ణింపను, భావింపను,
భావ్యుఁ డభవభాజికి నధిపా!

ఆ. జనుల కెల్ల శుభము సాంఖ్యయోగము దాని
వలన ధర్మనిష్ఠవలన నైన
నంత్యకాలమందు హరిచింతసేయుట
పుట్టువునకు ఫలము భూవరేంద్ర!

తే. అరసి నిర్గుణబ్రహ్మంబు నాశ్రయించి
విధి నిషేధము లొల్లని విమలమతులు
సేయుచుందురు హరిగుణ చింతనములు
మానసంబుల నెప్పుడు మానవేంద్ర! 5

పోతన 2-1-4 నుండి 6

శ్లో॥ ఇదం భాగవతం నామ పురాణం బ్రహ్మసమ్మితమ్ ।
అధీతవాన్ ద్వాపరాదౌ పితుర్ద్వైపాయనాదహమ్ ॥ 8

పరినిష్ఠితోఽపి నైర్గుణ్యేహ్యుత్తమ శ్లోకలీలయా।
గృహీతచేతా రాజర్షే ఆఖ్యానం యదధీతవాన్ ॥

తదహంతేఽభిధాస్యామి మహాపౌరుషికో భవాన్ ।
యత్ర శ్రద్ధధతా మాశు స్యాన్ముకుందే మతిస్సతీ ॥

ఏతన్నిర్విద్యమానానామిచ్ఛతామకుతోభయమ్ ।
యోగినాం నృప నిర్ణీతం హరేర్నామానుకీర్తనమ్ ॥

కిం ప్రమత్తస్య బహుభిః పరోక్షైర్హాయనై రిహ ।
వరం ముహూర్తం విదితం ఘటతే శ్రేయసే యతః ॥ 12

వ్యాస 2-1-8 నుండి 12

సీ. ద్వైపాయనుఁడు నాదుతండ్రి ద్వాపరవేళ
బ్రహ్మసమ్మితమైన భాగవతముఁ
బఠనంబు సేయించె బ్రహ్మతత్పరుఁడనై
యుత్తమశ్లోకలీలోత్సవమున
నాకృష్ట చిత్తుండనై పఠించితి నీవు
హరిపాద భక్తుండ వగుటఁజేసి
యెఱిఁగింతు వినవయ్య! యీ భాగవతమున
విష్ణుసేవాబుద్ధి విస్తరిల్లు

ఆ. మోక్షకామునకును మోక్షంబు సిద్ధించు
భవభయంబు లెల్లఁ బాసిపోవు
యోగి సంఘమునకు నుత్తమ వ్రతములు
వాసుదేవ నామవర్ణనములు. 6

తరల. హరి నెఱుంగక యింటిలో బహుహాయనంబులు మత్తుఁడై
పొరలుచుండెడి వెఱ్ఱి ముక్తికిఁ బోవనేర్చునె? వాఁడు సం
సరణముం బెడబాయఁ డెన్నఁడు సత్య మా హరినామ సం
స్మరణ మొక్క ముహూర్తమాత్రముసాలు ముక్తిదమౌ నృపా! 7

పోతన 2-1-7, 8

శ్లో॥ ఖట్వాంగో నామ రాజర్షిః జ్ఞాత్వేయత్తామిహాయుషః ।
ముహూర్తాత్సర్వముత్సృజ్య గతవా నభయం హరిమ్ ॥ 13

వ్యాస 2-1-13

క. గోవిందనామ కీర్తనఁ
గావించి భయంబు దక్కి ఖట్వాంగ ధరి
త్రీవిభుఁడు సూఱగొనియెను
గైవల్యము దొల్లి రెండు గడియల లోనన్. 8

పోతన 2-1-11



## శ్రీహరి విరాడ్రూపము

**రాజోవాచ :**

శ్లో॥ యథా సంధార్యతే బ్రహ్మన్ ధారణా యత్ర సమ్మతా ।
యాదృశీ వా హరేదాశు పురుషస్య మనోమలమ్ ॥ 14

**ఋషిరువాచ :**

శ్లో॥ జితాసనో జితశ్వాసో జితసంగో జితేంద్రియాః ।
స్థూలే భగవతో రూపే మన స్సంధారయేద్ధియా ॥

విషయస్తస్య దేహోఽయం స్థవిష్ఠస్య స్థవీయసామ్ ।
యత్రేదం దృశ్యతే విశ్వం భూతం భవ్యం భవచ్చ సత్ ॥ 16

శ్లో॥ అణ్డకోశే శరీరేఽస్మిన్ సప్తావరణ సంయుతే ।
వైరాజః పురుషో యోఽసౌ భగవాన్ ధారణాశ్రయః ॥ 17

పాతాళమేతస్య హి పాదమూలం
పఠన్తి పార్ష్ణిప్రపదే రసాతలమ్ ।
మహాతలం విశ్వసృజోఽథ గుల్ఫౌ
తలాతలం వై పురుషస్య జంఘే ॥

ద్వే జానునీ సుతలం విశ్వమూర్తే
రూరుద్వయం వితలం చాతలం చ ।
మహీతలం తజ్జఘనం మహీపతే
నభస్థలం నాభిసరో గృణన్తి ॥

ఉరస్థలం జ్యోతిరనీక మస్య
గ్రీవా మహర్వదనం వైజనోఽస్య ।
తపో రరాటీం విదురాదిపుంస
సత్యంతు శీర్షాణి సహస్రశీర్ష్ణః ॥

ఇంద్రాదయో బాహవ ఆహురుస్రాః
కర్ణౌ దిశః శ్రోత్రమముష్య శబ్దః ।
నాసత్యదస్రౌపరమస్యనాసే ।
ఘ్రాణోఽ స్యగంధో ముఖమగ్నిరిద్ధః ॥

ద్యౌరక్షిణీ చక్షురభూత్పతంగః
పక్ష్మాణి విష్ణోరహనీ ఉభేస్య ।
తద్భ్రూవిజృంభః పరమేష్ఠిధిష్ణ్య
మాపోఽ స్య తాలూరస ఏవ జిహ్వా ॥ 22

శ్లో॥ ఛందాంస్యనంతస్య శిరో గృణంతి
దంష్ట్రాయమస్నేహకళా ద్విజాని ।
హాసో జనోన్మాదకరీ చ మాయా
దురంతసర్గో యదపాంగమోక్షః ॥ 23

వ్రీడోత్తరోష్ఠోఽ ధర ఏవలోభో
ధర్మస్తనోఽ ధర్మపథశ్చపృష్ఠః ।
కస్తస్యమేఢ్రం వృషణౌ చ మిత్రౌ
కుక్షిస్సముద్రా గిరయోఽ స్థిసంఘాః ॥

నద్యోఽ స్య నాడ్యోథ తనూరుహాణి
మహీరుహా విశ్వతనోర్నృపేంద్ర ।
అనంతవీర్య శ్శ్వసితం మాతరిశ్వా
గతిర్వయః కర్మ గుణప్రవాహః ॥

ఈశస్య కేశాన్విదురంబువాహా
న్వాసస్తు సంధ్యాం కురువర్యభూమ్నః ।
అవ్యక్తమాహుర్హృదయం మనశ్చ
స చంద్రమాస్సర్వవికారకోశః ॥



విజ్ఞానశక్తిం మహి మామనంతి
సర్వాత్మనోఽ ంతఃకరణం గిరిత్రమ్ ।
అశ్వాశ్వతర్యుష్ట్రగజానఖాని
సర్వే మృగాః పశవః శ్రోణిదేశే ॥

వయాంసి తద్వ్యాకరణం విచిత్రం
మనుర్మనీషా మనుజో నివాసః ।
గంధర్వ విద్యాధరచారణాప్సర
స్స్వరస్మృతిర్వసురానీకవీర్యః ॥ 28

శ్లో॥ బ్రహ్మాననం క్షత్రభుజో మహాత్మా
విడూరురంఘ్రిశ్రితకృష్ణవర్ణః ।
నానాభిధాభిజ్యగణోపపన్నో
ద్రవ్యాత్మకః కర్మ వితానయోగః ॥ 29

ఇయానసావీశ్వరవిగ్రహస్య
యస్సన్నివేశః కథితోమయా తే ।
సంధార్యతేఽ స్మిన్ పురుషే స్థవిష్ఠే
మనస్స్వబుద్ధ్యానయతోఽ స్తి కించిత్ ॥

స సర్వధీవృత్త్యనుభూతసర్వ
ఆత్మాయథా స్వప్నజనేక్షితైకః ।
తం సత్యమానందనిధిం భజేత
నాన్యత్ర సజ్జేద్యత ఆత్మపాతః ॥ 31

వ్యాస 2-1-22 నుండి 39

## శ్రీహరి విరాడ్రూపము

క. ధారణ యే క్రియ నిలుచును?
ధారణ కే రూప? మెద్ది ధారణ యనఁగా?
ధారణ పురుషు మనోమల
మే రీతి హరించు? నాకు నెఱిఁగింపఁగదే. 9

వ. అనిన విని రాజునకు నవధూతవిభుం డిట్లనియె.

ఆ. పవనములు జయించి పరిహృత సంగుఁడై
యింద్రియముల గర్వమెల్ల మాపి
హరి విశాలరూపమందుఁజిత్తము సేర్చి
నిలుపవలయు బుద్ధినెఱపి బుధుఁడు. 11

వ. వినుము. భగవంతుండైన హరి విరాడ్విగ్రహంబునందు భూత భవిష్య ద్వర్తమానంబైన విశ్వంబు విలోక్యమానం బగు. ధరణీసలిల తేజ స్సమీరణ గగనా హంకారమహత్త్వంబు లనియెడి సప్తావరణంబులచేత నావృతంబగు మహాండకోశం బైన శరీరంబునందు ధారణాశ్రయంబైన వైరాజపురుషుండు దేజరిల్లు.

అ మ్మహాత్మునికిఁ బాదమూలంబు పాతాళంబు, పార్ష్ణిభాగ పాదాగ్ర భాగంబులు రసాతలంబు, గుల్ఫంబు మహాతలంబు, జంఘలు తలాతలంబు, జానుద్వయంబు సుతలంబు, ఊరువులు వితలాతలంబులు, జఘనంబు మహీతలంబు, నాభీవివరంబు నభస్తలంబు, వక్షంబు గ్రహ తారకా ముఖర జ్యోతిస్సమూహ సమేతంబగు నక్షత్ర లోకంబు, గ్రీవము మహర్లోకంబు, ముఖంబు జనలోకంబు, లలాటంబు తపోలోకంబు, శీర్షంబులు సత్యలోకంబు, బాహుదండంబు లింద్రాదులు, కర్ణంబులు దిశలు, శ్రవణేంద్రియంబు శబ్దంబు, నాసాపుటంబు లశ్వినీదేవతలు, ఘ్రాణేంద్రియంబు గంధంబు, వదనంబు వహ్ని, నేత్రంబు లంతరిక్షంబు, చక్షురింద్రియము సూర్యుండు, రేయింబగళ్లు ఱెప్పలు, భ్రూయుగ్మ విజృంభణంబు బ్రహ్మపదంబు, తాలువులు జలంబు, జిహ్వేంద్రియంబు రసంబు, భాషణంబులు సకల వేదంబులు, దంష్ట్రలు దండధారుండు, దంతంబులు పుత్రాది స్నేహకళలు, నగవులు జనోన్మాదకారిణియగు మాయ, కటాక్షంబులు దురంత సంసర్గంబులు, పెదవులు వ్రీడా లోభంబులు, స్తనంబులు ధర్మంబు, వెన్ను అధర్మమార్గంబు,



మేఢ్రంబు ప్రజాపతి, వృషణంబులు మిత్రావరుణులు, జఠరంబు సముద్రంబులు, శల్యసంఘంబులు గిరులు, నాడీ నివహంబులు నదులు, తనూరుహంబులు తరువులు, నిశ్వాసంబులు వాయువులు, కాలంబు గమనంబు, కర్మంబులు నానావిధ జంతు సన్నివహ సంవృత సంసరణంబులు, శిరోజంబులు మేఘంబులు, కట్టు పుట్టంబులు సంధ్యలు, హృదయంబు ప్రధానంబు, సర్వవికారంబులకు నాశ్రయభూతంబైన మనము చంద్రుడు, చిత్తంబు మహత్తత్త్వంబు, అహంకారంబు రుద్రుండు, అశ్వాశ్వత ర్యుష్ట్రగజంబులు, నఖంబులు, కటిప్రదేశంబు పశు మృగాదులు, విచిత్రంబులైన యాలాప నైపుణ్యంబులు పక్షులు, బుద్ధి మనువు, నివాసంబు పురుషుండు, షడ్జాదు లయిన సర్వవిశేషంబులు గంధర్వ విద్యాధరసిద్ధచారణాప్సర స్సమూహంబులు, స్మృతి ప్రహ్లాద ప్రముఖులు, వీర్యంబు దైత్యదానవానీకంబై యుండు.

మఱియు నమ్మహావిభునకు ముఖంబు బ్రాహ్మణులు, భుజంబులు క్షత్రియులు, ఊరులు వైశ్యులు, చరణంబులు శూద్రులు, నామంబులు నానావిధంబులైన వసు రుద్రాది దేవతాభిధానంబులు, ద్రవ్యంబులు హవిర్భాగంబులు, గర్మంబులు యజ్ఞప్రయోగంబులు. ఇట్టి సర్వమయుండైన పరమేశ్వరుని విగ్రహంబున ముముక్షుం డైన వాఁడు మనస్సంధానంబు సేయవలయునని చెప్పి వెండియు నిట్లనియె.

క. హరిమయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయము పనిలే దా
హరిమయము గాని ద్రవ్యము
పరమాణువు లేదు వంశపావన! వింటే. 13

సీ. కలలోన జీవుండు కౌతూహలంబునఁ
బెక్కు దేహంబులఁ బేరు వడసి
యింద్రియంబుల వెంట నెల్లవృత్తంబులు
నీక్షించి మఱి తన్ను నెఱుఁగు కరణి

నఖిలాంతరాత్మకుండగు పరమేశ్వరుఁ
డఖిల జీవుల హృదయములనుండి
బుద్ధివృత్తులనెల్ల బోద్ధయై వీక్షించు
బంధబద్ధుఁడు గాఁడు ప్రాభవమున

తే. సత్యుఁ డానందబహుళ విజ్ఞానమూర్తి
యతని సేవింప నగుఁ గాక యన్యసేవఁ
గలుగనేరవు కైవల్య గౌరవములు
పాయ దెన్నఁడు సంసారబంధ మధిప! 14

పోతన 2-1-13 నుండి 18

* * *

## అధ్యాయము - 2

శ్లో॥ సత్యాం క్షితౌ కిం కశిపోః ప్రయాసై
ర్బాహౌ స్వసిద్ధే హ్యుపబర్హణైః కిమ్ ।
సత్యంజలౌ కిం పురుధాన్న పాత్ర్యా
దిగ్వల్కలాదౌ సతి కిం దుకూలైః ॥ 32

చీరాణి కిం పథి న సంతి దిశంతి భిక్షాం
నోవాంఘ్రిపాః పరభృతస్సరితోవ్యశుష్యన్ ।
రుద్ధా గుహాః కిమజితోఽవతి నోపపన్నా
స్కస్మాద్భజంతి కవయో ధనదుర్మదాంధాన్ ॥

ఏవం స్వచిత్తే స్వతఏవ సిద్ధ
ఆత్మా ప్రియోఽర్థో భగవాననంతః ।
తన్నిర్వృతో నియత స్తం భజేత
సంసారహేతుపరమశ్చ యత్ర ॥ 34

వ్యాస 2-2-4 నుండి 6

సీ. కమనీయ భూమిభాగములు లేకున్నవే?
పడియుండుటకు దూదిపఱుపు లేల?
సహజంబులగు కరాంజలులు లేకున్నవే?
భోజన భాజన పుంజమేల?
వల్కలాశాజినావళులు లేకున్నవే?
కట్ట దుకూల సంఘాత మేల?
గొనకొని వసియింప గుహలు లేకున్నవే?
ప్రాసాద సౌధాది పటల మేల?

తే. ఫల రసాదులు గురియవే పాదపములు
స్వాదు జలముల నుండవే? సకలనదులుఁ

బొసఁగ భిక్షయుఁ బెట్టరే? పుణ్యసతులు
ధనమదాంధుల కొలువేల? తాపసులకు. 15

క. రక్షకులు లేనివారల
రక్షించెద ననుచుఁ జక్రి రాజై యుండన్
రక్షింపు మనుచు నొక నరు
నక్షముఁ బ్రార్థింపనేల? యాత్మజ్ఞునకున్.

పోతన 2-2-21, 22

శ్లో॥ కస్తాం త్వనాదృత్య పరానుచింతా
మృతేపశూనసతీం నామ యుంజ్యాత్ ।
పశ్యన్ జనం పతితం వైతరణ్యాం
స్వకర్మజాన్ పరితాపాన్ జుషాణమ్ ॥ 35

వ్యాస 2-2-7

మ. హరిఁ జింతింపక మత్తుఁడై, విషయ చింతాయత్తుఁడై చిక్కి, వా
సరముల్ ద్రొబ్బెదువాఁడు, కింకర గదాసంతాడితోరస్కుఁడై
ధరణీశోత్తమ! దండభృ న్నివసన ద్వారోపకంఠోగ్ర వై
తరణీ వహ్నిశిఖా పరంపరలచే దగ్ధుండు గాకుండునే? 17

క. మొత్తుదురు గదల మంటల
కెత్తుదు రడ్డంబు దేహ మింతింతలుగా
నొత్తుదు రసిపత్రికలను
హత్తుదురు కృతాంతభటులు హరి విరహితులన్. 18

వ. మఱియు హరి చరణకమల గంధ రసాస్వాదనం బెఱుంగని వారలు నిజకర్మ బంధంబున దండధర ద్వార దేహళీ సమీప జాజ్వల్యమాన వైతరణీ తరంగిణీ దహన దారుణజ్వాలా జాల దందహ్యమాన దేహులం గూడి శిఖి శిఖావగాహంబుల నొందు చుండుదురు. పోతన 2-2-24, 25, 26



## శ్రీహరి దివ్యసుందర తేజోరూపము

శ్లో॥ కేచిత్స్వదేహాంతర్హృదయావకాశే
ప్రాదేశమాత్రం పురుషం వసంతమ్ ।
చతుర్భుజం కంజరథాంగశంఖ
గదాధరం ధారణయా స్మరంతి ॥ 36

ప్రసన్నవక్త్రం నలినాయతేక్షణం
కదంబకింజల్కపిశంగవాససమ్ ।
లసన్మహారత్నహిరణ్మయాంగదం
స్ఫురన్మహారత్నకిరీటకుండలమ్ ॥

ఉన్నిద్రహృత్పంకజకర్ణికాలయే
యోగేశ్వరస్థాపితపాదపల్లవమ్ ।
శ్రీలక్ష్మణం కౌస్తుభరత్నకంధర
మమ్లానలక్ష్మ్యా వనమాలయాచితమ్ ॥ 38

శ్లో॥ విభూషితం మేఖలయాంగులీయకై
ర్మహాధనై ర్నూపురకంకణాదిభిః ।
స్నిగ్ధామలైః కుంచితనీలకుంతలై
ర్విరోచమానాననహాసపేశలమ్ ॥ 39

అదీనలీలాహసితేక్షణోల్లస
ద్భ్రూభంగసంసూచితభూర్యనుగ్రహమ్ ।
ఈక్షేత చింతామయమేవమీశ్వరం
యావన్మనోధారణయావతిష్ఠతే ॥

ఏకైకశోఽంగాని ధియానుభావయే
త్పాదాదియావద్ధసితం గదాభృతః ।

జితం జితం స్థానమపోహ్య ధారయే
త్పరం పరం శుధ్యతి ధీర్యథా తథా ॥

యావన్న జాయేత పరావరేఽస్మి
న్విశ్వేశ్వరే ద్రష్టరి భక్తియోగః ।
తావత్ స్థవీయః పురుషస్య రూపం
క్రియావసానే ప్రయతః స్మరేత ॥ 42

వ్యాస 2-2-8 నుండి 14

వ. మఱియు విజ్ఞానసంపన్నులై మను ప్రసన్ను లెంతయు మాయాపన్నులు గాక విన్నాణంబునం దమ తమ హృదయాంతరాళంబులం బ్రాదేశమాత్ర దివ్యదేహుండును, దిగిభరాజ శుండా దండ సంకాశదీర్ఘ చతుర్బాహుండును, భోగైశ్వర్యప్రదుండును, కంజాత శంఖచక్రగదాధరుండును, కందర్పకోటి సమాన సుందరుండును, రాకా విరాజమాన రాజమండల సన్నిభ వదనుండును, సౌభాగ్యసదనుండును, ప్రభాతకాల భాసమాన భాస్కరబింబ ప్రతి విరాజిత పద్మరాగ రత్నరాజి విరాజమాన కిరీట కుండలుండును, శ్రీవత్స లక్షణ లక్షిత వక్షోమండలుండును, రమణీయ కౌస్తుభరత్న ఖచిత కంఠికాలంకృత కంధరుండును, నిరంతర పరీమళ మిళిత వన మాలికా బంధురుండును, నానావిధ గంభీర హార కేయూర కటక కంకణ మేఖ లాంగుళీయక విభూషణవ్రాత సముజ్జ్వలుండును, నిటలతట విలంబమాన విమల స్నిగ్ధ నీల కుంచిత కుంతలుండును, తరుణ చంద్ర చంద్రికా ధవళ మందహాసుండును, పరిపూర్ణ కరుణావలోకన భ్రూభంగ సూచిత సుభగ చింతితానుగ్రహ లీలావిలాసుండును, మహాయోగిరాజవిలసిత హృదయ కమల కర్ణికామధ్య సంస్థాపిత చరణ కిసలయుండును, (సంతతానంద మయుండును), సహస్రకోటి సూర్యసంఘాత సన్నిభుండును, మహావిభుండు నైన పరమేశ్వరుని మనోధారణావశంబున నిలిపికొని, తదీయ గుల్భ చరణ జాను జంఘాద్యవయవంబులు క్రమంబున నొకటి నొకటినిఁబ్రతిక్షణంబును



ధ్యానంబు సేయుచు నెంతకాలంబునకుఁబరిపూర్ణ నిశ్చల భక్తియోగంబు సిద్ధించునంతకాలంబునుం దదీయ చింతాతత్పరులై యుండుదురు. అని మఱియు నిట్లనియె. 19

పోతన 2-2-26

## దేహమువిడుచు యతీశుండు చేయవలసిన సాధనము

శ్లో॥ స్థిరం సుఖం చాసన మాశ్రితో యతి
ర్యదా జిహాసురిమమంగలోకమ్ ।
కాలే చ దేశే చ మనో న సజ్జే
త్ప్రాణాన్నియచ్ఛే న్మనసా జితాసుః ॥ 43

మనస్స్వబుద్ధ్యామలయా నియమ్య
క్షేత్రజ్ఞ ఏతాం నినయేత్తమాత్మని ।
ఆత్మానమాత్మన్యవరుధ్య ధీరో
లబ్ధోపశాంతిర్విరమేత కృత్యాత్ ॥ 44

వ్యాస 2-2-15, 16

సీ. ఆసన్న మరణార్థియైన యతీశుండు
కాలదేశములను గాచికొనఁడు
తనువు విసర్జించు తలఁపు జనించిన
భద్రాసనస్థుఁడై ప్రాణపవను
మనసుచేత జయించి, మానసవేగంబు
బుద్ధిచే భంగించి, బుద్ధిఁదెచ్చి
క్షేత్రజ్ఞుతోఁగూర్చి, క్షేత్రజ్ఞు నాత్మలోపలఁ
జేర్చి, యాత్మను బ్రహ్మమందుఁ

తే. గలిపి యొక్కటి గావించి, గారవమున
శాంతితోడ నిరూఢుఁడై సకలకార్య

నివహ మెల్లను దిగనాడి నిత్యసుఖము
వలయు నని చూచు నటుమీఁద వసుమతీశ! 20

పోతన 2-2-27

శ్లో॥ ఇత్థం మునిస్తూపరమేద్వ్యవస్థితో
విజ్ఞానదృగ్వీర్యసురంధితాశయః ।
స్వపార్ష్ణినాపీడ్య గుదం తతోఽనిలం
స్థానేషు షట్సూన్నమయేజ్జితక్లమః ॥ 45

శ్లో॥ నాభ్యాం స్థితం హృద్యధిరోప్య తస్మా
దుదానగత్యోరసి తం నయేన్మునిః ।
తతోఽనుసంధాయ ధియా మనస్వీ
స్వతాలుమూలం శనకైర్నయేత ॥ 46

తస్మాద్భ్రువోరంతరమున్నయేత
నిరుద్ధసప్తాస్వయనోఽనపేక్షః ।
స్థిత్వా ముహూర్తార్ధమకుంఠదృష్టి
ర్నిర్భిద్య మూర్ధ న్విసృజేత్పరం గతః ॥

వ్యాస 2-2-19 నుండి 21

సీ. అంఘ్రిమూలమున మూలాధార చక్రంబుఁ
బీడించి, ప్రాణంబు బిగియఁబట్టి
నాభీతలముఁజేర్చి, నయముతో మెల్లన
హృత్సరోజము మీఁది కెగయఁబట్టి
యటమీఁద నురమందు హత్తించి, క్రమ్మఱఁ
దాలుమూలమునకుఁదఱిమి నిలిపి
మమతతో భ్రూయుగ మధ్యంబుఁజేర్చి,
దృక్కర్ణ నాసాస్య మార్గములు మూసి,



తే. యిచ్చలేని యోగి యొక్క ముహూర్తార్ధ
మింద్రియానుషంగ మింతలేక
ప్రాణములను వంచి, బ్రహ్మరంధ్రము చించి,
బ్రహ్మమందుఁగలయుఁబౌరవేంద్ర! పోతన 2-2-29

## సద్యోముక్తి

శ్లో॥ యది ప్రయాస్యన్నృపపారమేష్ఠ్యం
వైహాయసానాముత యద్విహారమ్ ।
అష్టాధిపత్యం గుణసన్నిపాతే
సహైవ గచ్ఛేన్మనసేంద్రియైశ్చ ॥ 48

యోగేశ్వరాణాం గతిమాహురంత
ర్బహిస్త్రిలోక్యాః పవనాంతరాత్మనామ్ ।
న కర్మభిస్తాం గతిమాప్నువంతి
విద్యాతపోయోగసమాధిభాజామ్ ॥ 49

వ్యాస 2-2-23, 23

వ. మఱియు దేహత్యాగకాలంబున నింద్రియంబులతోడి సంగంబులు విడువనివాఁడు వానితోడన (గుణసముదాయ రూపంబటు) బ్రహ్మాండంబునందు ఖేచర సిద్ధ విహారయోగ్యంబు నణిమాది సకలైశ్వర్య సమేతంబునైన పరమేష్ఠిపదంబుఁజేరు. విద్యాతపో యోగసమాధి భజనంబు సేయుచుఁ బవనాంతర్గత లింగశరీరులైన యోగీశ్వరులకు బ్రహ్మాండ బహిరంతరాళంబులు గతియని చెప్పుదురు. ఏరికిని గర్మంబులనట్టి గతిం బొంద శక్యంబుగాదు. పోతన 2-2-30

శ్లో॥ న యత్ర శోకో న జరా న మృత్యు
ర్నార్తిర్న చోద్వేగ ఋతే కుతశ్చిత్ ।

యచ్చిత్తతోదః కృపయానిదంవిదాం
దురంతదుఃఖప్రభవానుదర్శనాత్ ॥ 50

శ్లో॥ తేనాత్మనాత్మానముపైతి శాంత
మానంద మానంద మయోవసానే ।
ఏతాం గతిం భాగవతీం గతో య
స్స వై పునర్నేహ విషజ్జతేఽంగ ॥ 51

వ్యాస 2-2-27, 31

సీ. ఇలమీఁద మనువు లీ రేడ్వురుఁజనువేళ
దివసమై యెచ్చోటఁదిరుగుచుండు
మహనీయ సిద్ధ విమానసంఘము
లెందు దినకరప్రభములై తేజరిల్లు
శోక జరామృత్యు శోషణ భయదుఃఖ
నివహంబు లెందు జనింపకుండు
విష్ణుపద ధ్యాన విజ్ఞాన రహితుల
శోకంబు లెందుండి చూడవచ్చు.

ఆ. పరమ సిద్ధయోగి భాషణామృత మెందు
శ్రవణపర్వ మగుచు జరుగుచుండు
నట్టి బ్రహ్మలోకమందు వసించును
రాజవర్య! మఱల రాఁడు వాఁడు. 23

పోతన 2-2-31

## భక్తి - ముక్తి

**శ్రీశుక ఉవాచ :**

శ్లో॥ ఏతే సృతీ తే నృప వేద గీతే
త్వయాభిపృష్టే చ సనాతనే చ ।



యే వై పురా బ్రహ్మణ ఆహ పృష్ట
ఆరాధితో భగవాన్వాసుదేవః ॥

శ్లో॥ న హ్యతోఽన్యశ్శివః పంథా విశతస్సంసృతావిహ ।
వాసుదేవే భగవతి భక్తియోగో యతో భవేత్ ॥ 53

వ్యాస 2-2-32, 33

ఆ. పరమ భాగవతులు పాటించు పథ మిది
యా పథమున యోగి యరిగెగేని
మగుడి రాఁడు వాఁడు మఱి సంశయము లేదు
కల్పశతములైన కౌరవేంద్ర! 24

వ. వినుము! నీవడిగిన సద్యోముక్తియుఁగ్రమముక్తియు ననియెడు నీ రెండుమార్గంబులు వేదగీతంబులందు వివరింపంబడియె. వీనిం దొల్లి భగవంతుండైన వాసుదేవుండు బ్రహ్మచేత నారాధితుండై చెప్పె. సంసార ప్రవిష్టుండైన వానికిఁదపోయోగాదులైన మోక్ష మార్గంబులు పెక్కు గలవు. అందు భక్తిమార్గంబుకంటె సులభంబు లేదు. పోతన 2-2-33, 34

## శుకుఁడు పరీక్షిత్తునకు భక్తిమార్గంబె ముఖ్యంబని తెలుపుట

శ్లో॥ భగవాన్ బ్రహ్మకార్త్స్న్యేన త్రిరన్వీక్ష్య మనీషయా ।
తదధ్యవస్యత్కూటస్థో రతిరాత్మ న్యతోభవేత్ ॥ 54

వ్యాస 2-2-34

మ. విను మంభోజభవుండు మున్ను మదిలో వేదంబు మున్మాఱు మ
ర్మనయజ్ఞత్వము దోఁపనంతయుఁబరామర్శించి మోక్షంబు ద
క్కిన మార్గంబులవెంట లేదనుచు భక్తింజింతసేసెన్ జనా
ర్దను నాత్మాకృతి నిర్వికారుఁడగుచున్ దన్మార్గ నిర్ణేతయై ॥ 26

పోతన 2-2-35

శ్లో॥ భగవాన్ సర్వభూతేషు లక్షితస్స్వాత్మనా హరిః ।
దృశ్యైర్బుధ్యాది భిర్ద్రష్టా లక్షణైరనుమాపకైః ॥ 55

తస్మాత్సర్వాత్మనా రాజన్ హరిస్సర్వత్ర సర్వదా।
శ్రోతవ్యః కీర్తితవ్యశ్చ స్మర్తవ్యోభగవాన్ నృణామ్ ॥

పిబంతి యే భగవత ఆత్మనస్సతాం
కథామృతం శ్రవణపుటేషు సంభృతమ్ ।
పునంతి తే విషయవిదూషితాశయం
వ్రజంతి తచ్చరణసరోరుహాంతికమ్ ॥ 57

వ్యాస 2-2-35 నుండి 27

సీ. అఖిలభూతములందు నాత్మరూపంబున
నీశుండు హరి యుండు నెల్లప్రొద్దు
బుద్ధ్యాది లక్షణంబులఁగానఁబడును
మహాసేవనీయుఁడహర్నిశంబు
వందనీయుఁడు భక్తవాత్సల్య సంతత
నియతుఁడై సతతంబు నియతబుద్ధి
నాత్మరూపకుఁడగు హరి కథామృతములు
గర్ణపుటంబులఁగాంక్షదీరఁ

తే. గ్రోలుచుండెడి ధన్యులు గుటిల బహుళ
విషయ మలినీకృతాంగముల్ వేగ విడిచి
విష్ణుదేవుని చరణారవిందయుగము
కడకుఁజనుదురు సిద్ధంబు కౌరవేంద్ర. 27

పోతన 2-2-36

* * *

## అధ్యాయము - 3

శ్లో॥ అకామస్సర్వకామో వా మోక్షకామ ఉదారధీః ।
తీవ్రేణ భక్తి యోగేన యజేత పురుషం పరమ్ ॥ 58

ఏతావానేవ యజతామిహ నిశ్శ్రేయసోదయః ।
భగవత్యచలోభావో యద్భాగవతసంగతః ॥

జ్ఞానం యతః ప్రతినివృత్త గుణోర్మి చక్ర
మాత్మప్రసాద ఉభయత్ర గుణేష్వసంగః ।
కైవల్యసమ్మతపథస్త్వథ భక్తియోగః
కో నిర్వృతో హరికథాను రతిం న కుర్యాత్ ॥

వ్యాస 2-3-10, 11, 12

క. కామింపకయును సర్వము
గామించియునైన ముక్తిఁగామించి తగన్
లో మించి పరమపురుషుని
నేమించి భజించుఁదత్త్వనిపుణుం డధిపా!

మ. అమరేంద్రాదులఁగొల్చుభంగి జనుఁడా యబ్జాక్షు సేవింపఁగా
విమలజ్ఞాన విరక్తి ముక్తు లొదవున్ వేయేల భూనాథ! త
త్కమలాధీశ కథా సుధారస నదీ కల్లోలమాలా పరి
భ్రమ మెవ్వారికి నైనఁగర్ణయుగళీ పర్వంబు గాకుండునే? 29

పోతన 2-3-39, 40

శ్లో॥ ఆయుర్హరతి వై పుంసాముద్యన్న స్తమయన్న సౌ ।
తస్య తే యత్ క్షణోనీత ఉత్తమశ్లోకవార్తయా ॥ 61

వ్యాస 2-3-17

సీ. వాసుదేవశ్లోక వార్త లాలింపుచుఁ
గాల మే పుణ్యుండు గడుపుచుండు

నతనియాయువు దక్క నన్యుల యాయువు
నుదయాస్తమయముల నుగ్రకరుఁడు
వంచించి కొనిపోవువాఁడది యెఱుఁగక
జీవింతుఁబెక్కేండ్లు సిద్ధమనుచు
నంగనా పుత్ర గేహారామ విత్తాది
సంసార హేతుక సంగసుఖముఁ

తే. దగిలివర్తింపఁగాలము తఱి యెఱింగి
దండధర కింకరులు వచ్చి తాడనములు
సేసి కొనిపోవఁబుణ్యంబు సేయ నైతిఁ
బాపరతి నైతి నని బిట్టుఁబలవరించు. 30

పోతన 2-3-47

శ్లో॥ తరవః కిం న జీవంతి భస్త్రాః కిం న శ్వసంత్యుత? ।
న ఖాదంతి న మేహంతి కిం గ్రామ్యాః పశవో పరే? ॥ 62

శ్వ విడ్వరాహోష్ట్రఖరైస్సంస్తుతః పురుషః పశుః ।
న యత్కర్ణపథోపేతం జాతు నామ గదాభృతః ॥ 63

వ్యాస 2-3-18, 19

సీ. అలరు జొంపములతో నభ్రంకషంబులై
బ్రతుకవే? వనములఁబాదపములు
ఖాదన మేహనాకాంక్షలఁబశువులు
జీవింపవే? గ్రామసీమలందు
నియతిమై నుచ్ఛ్వాస నిశ్వాస పవనముల్
ప్రాపింపవే? చర్మ భస్త్రికలును
గ్రామసూకర శునక శ్రేణు లింటింటఁ
దిరుగవే? దుర్యోగ దీనవృత్తి



తే. నుష్ట్రఖరములు మోయవే యురుభరములు
పుండరీకాక్షు నెఱుఁగని పురుషపశువు
లడవులందు, నివాసములందుఁబ్రాణ
విషయ భర వృత్తితో నుంట విఫల మధిప! 31

పోతన 2-3-49

శ్లో॥ బిలే బతోరుక్రమవిక్రమాన్ యే న
శృణ్వతః కర్ణపుటే నరస్య ।
జిహ్వాసతీ దార్దురికేవ సూత
న చోపగాయత్యురుగాయగాథాః ॥ 64

భారః పరం పట్టకిరీటజుష్ట
మప్యుత్తమాంగం న నమేన్ముకున్దమ్ ।
శావౌ కరౌ నోకురుతస్సపర్యాం
హరేర్లసత్కాంచనకంకణౌ వా ॥

బర్హాయితే తే నయనే నరాణాం
లింగాని విష్ణోర్న నిరీక్షతో యే ।
పాదౌ నృణాం తౌ ద్రుమజన్మభాజౌ
క్షేత్రాణి నానువ్రజతో హరేర్యౌ ॥

జీవన్ శవో భాగవతాంఘ్రిరేణుం
న జాతు మర్త్యోఽభిలభేత యస్తు ।
శ్రీవిష్ణుపద్యా మనుజస్తులస్యాః
శ్వసన్ శవో యస్తు న వేద గంధమ్ ॥ 67

వ్యాస 2-3-20 నుండి 23

సీ. విష్ణు కీర్తనములు వినని కర్ణంబులు
కొండల బిలములు కువలయేశ!
చక్రి పద్యంబులు చదువని జిహ్వలు
కప్పల జిహ్వలు కౌరవేంద్ర!

శ్రీమనోనాథు వీక్షింపని కన్నులు
కేకి పింఛాక్షులు కీర్తిదయిత!
కమలాక్షు పూజకుఁగాని హస్తంబులు
శవము హస్తంబులు సత్యవచన!

ఆ. హరి పద తులసీదళామోదరతి లేని
ముక్కు పందిముక్కు మునిచరిత్ర!
గరుడగమను భజనగతి లేని పదములు
పాదపముల పాదపటల మనఘ! 32

పోతన 2-3-50

శ్లో॥ తదశ్మసారం హృదయం బతేదం
యద్గృహ్యమాణైర్హరినామధేయైః ।
న విక్రియేతాథ యదా వికారో
నేత్రే జలం గాత్రరుహేషు హర్షః ॥ 68

వ్యాస 2-3-24

సీ. నారాయణుని దివ్య నామాక్షరములపైఁ
గరఁగని మనములు కఠిన శిలలు
మురవైరి కథలకు ముదితాశ్రు రోమాంచ
మిళితమై యుండని మేను మొద్దు
చక్రికి మ్రొక్కని జడుని యౌదల నున్న
కనక కిరీటంబు గట్టె మోపు
మాధవార్పితముగా మనని మానవు సిరి
వన దుర్గ చంద్రికా వైభవంబు

ఆ. కైటభారి భజన గలిగియుండనివాడు
గాలిలోన నుండి కదలు శవము
కమలనాభు పదము గననివానిఁబ్రతుకు
పసిఁడికాయలోని ప్రాణి బ్రతుకు. 33

పోతన 2-3-51

# అధ్యాయము - 4

**శ్రీ సూత ఉవాచ :**

శ్లో॥ ఆత్మజాయాసుతాగారపశుద్రవిణబంధుషు ।
రాజ్యే చావికలే నిత్యం నిరూఢాం మమతాం జహౌ ॥ 69

పప్రచ్ఛచే మమేవార్థం యన్మాం పృచ్ఛతసత్తమాః ।
కృష్ణానుభావశ్రవణే శ్రద్ధధానో మహామనాః ॥

సంస్థాం విజ్ఞాయ సన్న్యస్య కర్మత్రైవర్గికం చ యత్ ।
వాసుదేవే భగవతి హ్యాత్మభావం దృఢం గతః ॥ 71

వ్యాస 2-4-2, 3, 4

వ. పరీక్షిన్మహారాజు గందళిత హృదయుండై నిర్మలమతి విశేషంబున. 34

ఆ. సుతుల, హితుల, విడిచి, చుట్టాల విడిచి, యి
ల్లాలి విడిచి, పశు గృహాళి విడిచి,
రాజు హృదయ మిడియె రాజీవనయనుపై
ధనము విడిచి, జిడ్డుఁదనము విడిచి, 35

వ. ఇట్లు మృత్యుభయము నిరసించి, ధర్మార్థకామంబులు సన్న్యసించి, పురుషోత్తమునందుఁజిత్తంబు విన్యసించి, హరిలీలా లక్షణంబు లుపన్యసింపు మను తలంపున నరేంద్రుం డిట్లనియె. 36

పోతన 2-4-52, 53, 54

**రాజోవాచ :**

శ్లో॥ సమీచీనం వచో బ్రహ్మన్ సర్వజ్ఞస్య తవానఘ ।
తమో విశీర్యతే మహ్యం హరేః కథయతః కథాః ॥ 72

భూయ ఏవ వివిత్సామి భగవానాత్మమాయయా ।
(యథావతీర్ణో భగవాన్ పరిరక్షతి సత్పథమ్) ।
యథేదం సృజతే విశ్వం దుర్విభావ్యమధీశ్వరైః ॥

యథా గోపాయతి విభుర్యథా సంయచ్ఛతే పునః ।
యాం యాం శక్తిముపాశ్రిత్య పురుశక్తిః పరః పుమాన్ ॥

ఆత్మానం క్రీడయన్ క్రీడన్కరోతి వికరోతి చ ।
నూనం భగవతో బ్రహ్మన్ హరేరద్భుతకర్మణః ।
దుర్విభావ్యమివాభాతి కవిభిశ్చాపి చేష్టితమ్ ॥

యథాగుణాంస్తు ప్రకృతేర్యుగపత్క్రమశోఽపి వా।
బిభర్తి భూరిశస్త్వేకః కుర్వన్కర్మాణి జన్మభిః ॥

విచికిత్సితమేతన్మే బ్రవీతు భగవాన్ యథా ।
శాబ్దే బ్రహ్మణి నిష్ణాతః పరస్మింశ్చ భవాన్ ఖలు ॥ 77

వ్యాస 2-4-5 నుండి 10

క. సర్వాత్ము వాసుదేవుని
సర్వజ్ఞుఁడవైన నీవు సంస్తుతిసేయన్
సర్వభ్రాంతులు వదలె మ
హోర్వీసురవర్య! మానసోత్సవ మగుచున్. 37

సీ. ఈశుండు హరి విష్ణుఁడీ విశ్వమంతయుఁ
బుట్టించు రక్షించుఁబొలియఁజూచి
బహుశక్తియుతుఁడగు భగవంతుఁడవ్యయుఁ
డాది నే శక్తుల నాశ్రయించి
బ్రహ్మ శక్రాది రూపముల వినోదించెఁ
గ్రమముననో యేకకాలముననొ
ప్రకృతిగుణంబులఁబట్టి గ్రహించుట
యేకత్వమున నుండు నీశ్వరుండు



ఆ. భిన్నమూర్తి యగుచుఁబెక్కువిధంబుల
నేల యుండు నితని కేమి వచ్చె
నుండకున్నఁదాపసోత్తమ! తెలుపవే!
వేడ్కతోడ నాకు వేదవేద్య! 38

వ. అనిన నుత్తరానందను వచనంబులకు నిరుత్తరుండు గాక సదుత్తర ప్రదాన కుతూహలుండై లోకోత్తర గుణోత్తరుండైన తాపసోత్తముండు దన మనంబున శ్రీహృషీకేశుని యీ క్రింది విధమున స్తుతించెను.

పోతన 2-4-55, 56, 57

## శ్రీశుక కృత హృషీకేశ స్తుతి

**శ్రీశుక ఉవాచ :**

శ్లో॥ నమః పరస్మై పురుషాయ భూయసే
సదుద్భవస్థాననిరోధలీలయా ।
గృహీతశక్తిత్రితతాయ దేహినా
మన్తర్భవాయానుపలభ్యవర్త్మనే ॥ 78

వ్యాస 2-4-12

మ. పరుఁడై యీశ్వరుఁడై మహామహిముఁడై ప్రాదుర్భవస్థాన సం
హరణ క్రీడనుఁడై త్రిశక్తియుతుఁడై యంతర్గత జ్యోతియై
పరమేష్ఠి ప్రముఖామరాధిపులకున్ బ్రాపింప రాకుండు దు
స్తర మార్గంబునఁదేజరిల్లు హరికిం దత్త్వార్థినై మ్రొక్కెదన్. 40

పోతన 2-4-58

శ్లో॥ భూయో నమస్సద్వృజినచ్ఛిదేఽసతా
మసంభవాయాఖిలసత్త్వమూర్తయే ।
పుంసాం పునః పారమహంస్య ఆశ్రమే
వ్యవస్థితానామనుమృగ్యదాశుషే ॥ 79

నమో నమస్తేస్త్వృషభాయ సాత్వతాం
విదూరకాష్ఠాయ ముహుః కుయోగినామ్ ।
నిరస్తసామ్యాతిశయేన రాధసా
స్వధామని బ్రహ్మణి రంస్యతే నమః ॥
వ్యాస 2-4-13, 14

వ. మఱియు సజ్జన దురిత సంహరణుండును, దుర్జన నివారకుండును, నఖిల సత్త్వరూపకుండును, పరమహంసాశ్రమ ప్రవర్తమాన మునిజన హృదయకమల కర్ణికా మధ్యదీపకుండును, సాత్వత శ్రేష్ఠుండును, పరమభక్తియుక్తసులభుండును, భక్తిహీన జన దుర్లభుండును, నిరతిశయ నిరుపమ నిరవధిక ప్రకారుండును, నిజస్వరూప బ్రహ్మ విహారుండును, నైన యప్పరమేశ్వరునకు నమస్కరించెద. పోతన 2-4-59

శ్లో॥ యత్కీర్తనం యత్స్మరణం యదీక్షణం
యద్వన్దనం యచ్ఛ్రవణం యదర్హణమ్ ।
లోకస్య సద్యో విధునోతి కల్మషం
తస్మై సుభద్రశ్రవసే నమో నమః ॥ 81
వ్యాస 2-4-15

ఉ. ఏ విభు వందనార్చనము లే విభు చింతయు నామకీర్తనం
బే విభు లీల లద్భుతము లెవ్వని సంశ్రవణంబు సేయ దో
షావలిఁబాసి లోకము శుభాయతవృత్తిఁజెలంగు నండ్రు నే
నా విభు నాశ్రయించెద నఘౌఘ నివర్తను భద్రకీర్తనున్. 42
పోతన 2-4-60

శ్లో॥ విచక్షణా యచ్చరణోపసాదనా
త్సంగం వ్యుదస్యోభయతోఽన్తరాత్మనః ।
విందంతి హి బ్రహ్మగతిం గతక్లమా
స్తస్మై సుభద్రశ్రవసే నమో నమః ॥ 82
వ్యాస 2-4-16



ఉ. ఏ పరమేశు పాదయుగ మెప్పుడుఁగోరి భజించి నేర్పరుల్
లోపలి బుద్ధిలో నుభయలోకము లందుల సక్తిఁబాసియే
తాపములేక బ్రహ్మగతిఁదారు గతశ్రములై జరింతురే
నా పరమేశు మ్రొక్కెద నఘౌఘ నివర్తను భద్రకీర్తనున్.
పోతన 2-4-61

శ్లో॥ తపస్వినో దానపరా యశస్వినో
మనస్వినో మంత్రవిదస్సుమంగళాః ।
క్షేమం న విందంతి వినా యదర్పణం
తస్మై సుభద్రశ్రవసే నమో నమః ॥ 83
వ్యాస 2-4-17

చ. తపములు సేసియైన మఱి దానము లెన్నియుఁజేసియైన నే
జపములు సేసియైన ఫలసంచయ మెవ్వనిఁజేర్పకున్న హే
యపదములై దురంత విపదంచిత రీతిగ నొప్పుచుండు న
య్యపరిమితున్ భజించెద నఘౌఘ నివర్తను భద్రకీర్తనున్. 44
పోతన 2-4-62

శ్లో॥ కిరాతహూణాంధ్రపుళిందపుల్కసా
ఆభీరకంకా యవనాః కషాదయః ।
యేఽన్యే చ పాపాయదుపాశ్రయాశ్రయాః
శుధ్యంతి తస్మై ప్రభవిష్ణవే నమః ॥ 84
వ్యాస 2-4 -18

మ. యవన వ్యాధ పుళింద హూణ శక కంకాభీర చండాల సం
భవులుం దక్కిన పాపవర్తనులు నే భద్రాత్ము సేవించి భా
గవత శ్రేష్ఠుల డాసి శుద్ధతనులన్ గల్యాణులై యుందు రా
యవికారుంబ్రభవిష్ణునాదుమదిలో నశ్రాంతమున్మ్రొక్కెదన్.
పోతన 2-4-63

శ్లో॥ స ఏష ఆత్మాత్మవతామధీశ్వర
స్త్రయీమయో ధర్మమయ స్తపోమయః ।
గతవ్యళీకై రజశంకరాదిభి
ర్వితర్క్యలింగో భగవాన్ ప్రసీదతు ॥
వ్యాస 2-4-19

మ. తపముల్ సేసినచో మనోనియతినో దానవ్రతప్రీతినో
జపమంత్రంబులనో శ్రుతిస్మృతులనో సద్భక్తినో యెట్లు ల
బ్ధపదుండౌ నని బ్రహ్మరుద్రముఖరుల్ భావింతు రెవ్వాని న
య్యపవర్గాధిపుఁడాత్మమూర్తి సులభుండౌఁగాక నాకెప్పుడున్. 46
పోతన 2-4-64

శ్లో॥ శ్రియఃపతి ర్యజ్ఞ పతిః ప్రజాపతి
ర్ధియాంపతి ర్లోకపతి ర్ధరాపతిః ।
పతిర్గతి శ్చాంధకవృష్ణిసాత్వతాం
ప్రసీదతాం మే భగవాన్ సతాం గతిః ॥ 86
వ్యాస 2-4-20

క. శ్రీపతియు యజ్ఞపతియుఁబ్ర
జాపతియున్ బుద్ధిపతియు జగదధిపతియున్
భూపతియు యాదవ శ్రే
ణీపతియుం గతియు నైన నిపుణు భజింతున్. 47
పోతన 2-4-65

శ్లో॥ ప్రచోదితా యేన పురా సరస్వతీ
వితన్వతాఽజస్య సతీం స్మృతిం హృది ।
స్వలక్షణా ప్రాదురభూత్కిలాస్యతః
స మే ఋషీణామృషభః ప్రసీదతామ్ ॥ 87
వ్యాస 2-4-22



మ. జగ దుత్పాదనబుద్ధి బ్రహ్మకు మదిన్ సంధింప నూహించి యే
భగవంతుండు సరస్వతిం బనుప నా పద్మాస్య దా నవ్విభున్
మగనింగా వరియించి తద్భువన సామ్రాజ్యస్థితిన్ సృష్టిపా
రగుఁజేసెన్ మును బ్రహ్మ నట్టిఘను నారంభింతు సేవింపఁగన్.
పోతన 2-4-67

శ్లో॥ యదంఘ్ర్యభిధ్యానసమాధిధౌతయా
ధియానుపశ్యంతి హి తత్త్వమాత్మనః ।
వదంతి చైతత్కవయో యథారుచం
స మే ముకుందో భగవాన్ ప్రసీదతామ్ ॥ 88
వ్యాస 2-4-21

మ. అణువో కాక కడు న్మహావిభవుఁడో యచ్ఛిన్నుఁడో భిన్నుఁడో
గుణియో నిర్గుణియోయటంచువిబుధుల్ గుంఠీభవతత్త్వమా
ర్గణులై యే విభు పాదపద్మ భజనోత్కర్షంబులన్ దత్త్వవీ
క్షణముం జేసెద రట్టి విష్ణుఁబరమున్ సర్వాత్ము సేవించెదన్. 49
పోతన 2-4-66

శ్లో॥ భూతై ర్మహద్భిః య ఇమాః పురోవిభుః
నిర్మాయ శేతే యదమూషు పూరుషః ।
భుఙ్క్తే గుణాన్ షోడశ షోడశాత్మకః
సోఽలంకృషీష్ట భగవాన్ వచాంసి మే ॥ 89
వ్యాస 2-4-23

సీ. పూర్ణుఁడయ్యును మహాభూత పంచక యోగ
మున మేనులను బురములు సృజించి
పురములలోనుండి పురుషభావంబున
దీపించు నెవ్వఁడు ధీరవృత్తిఁ

బంచభూతములను బదునొకం డింద్రియ
ములంబ్రకాశింపించి భూరిమహిమ
షోడశాత్మకుండనంశోభిల్లి జీవత్వ
నృత్య వినోదంబు నెఱపుచుండు

తే. నట్టి భగవంతుండవ్యయుండచ్యుతుండు
మానసోదిత వాక్పుష్ప మాలికలను
మంజు నవరస మకరంద మహిమ బుట్ట
శిష్టహృద్భావలీలలంజేయుంగాత. 50

– పోతన 2-4-68

శ్లో॥ నమ స్తస్మై భగవతే వేదవ్యాసాయ వేధసే ।
వపుర్జ్ఞానమయం సౌమ్యా యన్ముఖాంబురుహాసవమ్ ॥
ఏతదేవాత్మభూరాజన్నారదాయానుపృచ్ఛతే ।
వేదగర్భోఽభ్యధాత్సాక్షాత్ యదాహ హరిరాత్మనః ॥ 91

– వ్యాస 2-4-24, 25

ఉ. మానధనుల్ మహాత్ములు సమాధినిరూఢులు యన్ముఖాంబుజ
ధ్యాన మరంద పానమున నాత్మభయంబులంబాపి ముక్తులై
లూనత నొంద రట్టి మునిలోకశిఖామణికిన్ విశంకటా
జ్ఞాన తమో నభోమణికి సాధుజనాగ్రణి కేను మ్రొక్కెదన్.

వ. అని యిట్లు హరి గురువందనంబుసేసిశుకయోగీంద్రుం డిట్లనియె.

మ. అవిరోధంబున నీవు నన్నడుగు నీయర్థంబు మున్ బ్రహ్మ మా
ధవుచేతన్ విని నారదుం డడిగినన్ దథ్యంబుగాంజెప్పె మా
నవ లోకేశ్వర! నారదుండు వెనుకన్ నాకుం బ్రసాదించె సం
శ్రవణీయంబు మహాద్భుతంబు వినుమా సందేహవిచ్ఛేదమున్. 53

– పోతన 2-4-69, 70, 71

* * *

## అధ్యాయము - 5

### నారదుండు బ్రహ్మను ప్రపంచ ప్రకారం బడుగుట

**నారద ఉవాచ :**

శ్లో॥ దేవ! దేవ! నమస్తేఽస్తు భూతభావన పూర్వజ ।
తద్విజానీహి యజ్జ్ఞానమాత్మతత్త్వనిదర్శనమ్ ॥

యద్రూపం యదధిష్ఠానం యతస్సృష్టమిదం ప్రభో ।
యత్సంస్థం యత్పరం యచ్చ తత్తత్త్వం వద తత్త్వతః ॥ 93

వ్యాస 2-5-1, 2

వ. నారదుండు బ్రహ్మ కిట్లనియె.

మ. చతురాస్యుండవు వేల్పుపెద్దవు జగత్సర్గానుసంధాయి వీ
శ్రుతిసంఘాతము నీ ముఖాంబుజములన్ శోభిల్లు శబ్దార్థ సం
యుతమై సర్వము నీ కరామలకమై యుండుం గదా! భారతీ
సతి యిల్లాలంట నీకు నో జనక! నాసందేహమున్ బాపవే! 55

శా. ప్రారంభాది వివేక మెవ్వండొసంగున్? బ్రారంభ సంపత్తి కా
ధారం బెయ్యది? యేమి హేతువు? యదర్థం బేస్వరూపంబు సం
సారానుక్రమ మూర్ణనాభి పగిదిన్ సాగింతు వెల్లప్పుడున్
భారం బెన్నండు లేదు నీమనువు దుష్ప్రాపంబు వాణీశ్వరా! 56

పోతన 2-5-73, 74

శ్లో॥ నాహం వేద పరం త్వస్మిన్నాపరం న సమం విభో ।
నామరూపగుణై ర్భావ్యం సదసత్కించిదన్యతః ॥ 94

స భవానాచరద్ఘోరం యత్తపస్సు సమాహితః ।
తేన ఖేదయసే నస్త్వం పరాంశంకాం ప్రయచ్ఛసి ॥

ఏతన్మే పృచ్ఛతస్సర్వం సర్వజ్ఞ సకలేశ్వర ।
విజానీహి తథై వాహం త్వయా బుద్ధ్యేఽనుశాసితః ॥ 96

వ్యాస 2-5-6, 7, 8

మ. సదసత్సంగతి నామ రూప గుణ దృశ్యంబైన విశ్వంబు నీ
హృదధీనంబు గదా! ఘనుల్ సములు నీ కెవ్వారునున్ లేరు నీ
పద మత్యున్నత మిట్టి నీవు తపముల్ ప్రావీణ్య యుక్తుండవై
మది నే యీశ్వరుఁగోరి చేసితివి తన్మార్గంబు సూచింపవే.

శా. అంభోజాసన! నీకు నీశుఁడు గలం డంటేనిఁ దత్పక్షమం
దంభోజాతభవాండ మే విభుని లీలాపాంగ సంభ్రాంతిచే
సంభూతంబగు వర్తమానమగు సంఛన్నంబగున్ ద ద్విభున్
సంభావింపఁగ వచ్చునే తలఁప నే చందంబు వాఁడాకృతిన్.

క. తోయజ సంభవ! నా కీ
తోయము వివరింపు చాలఁదోఁచిన నే నా
తోయము వారికి నన్యుల
తోయములం జెందకుండ ధ్రువ మెఱిఁగింతున్. 59

వ. దేవా! భూత భవిష్య ద్వర్తమానంబులగు వ్యవహారంబులకు నీవ విభుండవు. నీ వెఱుంగని యర్థం బించుకయు లేదు. విశ్వ ప్రకారంబు వినిపింపుము. 60

పోతన 2-5-76 నుండి 79

**శ్రీ బ్రహ్మోవాచ :**

శ్లో॥ సమ్యక్కారుణికస్యేదం వత్స తే విచికిత్సితమ్ ।
యదహం చోదితో ధర్మే భగవద్వీర్యదర్శనే ॥ 97



నాత్యంతమనృతం తచ్చ యథా మాం ప్రబ్రవీషి భో ।
అవిజ్ఞాయ పరం మత్త ఏతావత్త్వం యతోఽసి మే ॥

వ్యాస 2-5-9, 10

వ. అనిన విని వికసితముఖుండై విరించి యిట్లనియె.

క. రారా? బుధులు విరక్తులు
గారా? యీరీతి నడుగఁగా నేరరు వి
స్మేరావహము భవన్మత
మౌరా! నాపైడి మర్మ మడిగితి వత్సా!

శా. నానా స్థావర జంగమ ప్రకరముల్ నాయంత నిర్మింప వి
న్నాణం బేమియు లేక తొట్రుపడఁగా నాకున్ సమస్తాను సం
ధానారంభ విచక్షణత్వము మహోదారంబుగా నిచ్చె ము
న్నే నా యీశ్వరు నాజ్ఞఁగాక జగము ల్నిర్మింప శక్తుండనే. 62

పోతన 2-5-80, 81

శ్లో॥ యేన స్వరోచిషా విశ్వం రోచితం రోచయామ్యహమ్ ।
యథార్కోఽగ్ని ర్యథా సోమో యథర్క్ష గ్రహతారకాః ॥ 99

శ్లో॥ తస్మై నమో భగవతే వాసుదేవాయ ధీమహి ।
యన్మాయయా దుర్జయయా మాం వదంతి జగద్గురుమ్ ॥ 100

విలజ్జమానయా యస్య స్థాతుమీక్షాపథేఽముయా ।
విమోహితా వికత్థం తే మమాహమితి దుర్ధియః ॥

వ్యాస 2-5-11, 12, 13

**బ్రహ్మ నారదున కిట్లనియె :**

మ. అనఘా! విశ్వమునెల్ల దీప్తముగఁజేయన్ నే సమర్థుండనే?
యిన చంద్రానల తారకాగ్రహ గణం బే రీతి నా రీతి నె

వ్వని దీప్తిం బ్రతిదీప్త మయ్యె భువనవ్రాతంబు ద ద్దీప్తిచే
ననుదీప్తంబగునట్టి యీశ్వరునకే నశ్రాంతమున్ మ్రొక్కెదన్.

మ. వినుమా! యీశ్వరు దృష్టిమార్గమున నావేశింప శంకించి సి
గ్గున సంకోచము నొందు మాయవలనం గుంఠీభవ త్ప్రజ్ఞచే
నను లోకేశ్వరుఁడంచు మ్రొక్కు మతిహీన వ్రాతముం జూచి నే
ననిశంబున్నగి ధిక్కరింతు హరిమాయాకృత్యమంచున్ సుతా! 64
పోతన 2-5-82, 83

**శ్రీ బ్రహ్మోవాచ :**

శ్లో॥ ద్రవ్యం కర్మ చ కాలశ్చ స్వభావో జీవ ఏవ చ ।
వాసుదేవాత్పరో బ్రహ్మన్నత్వన్యోఽర్థోఽస్తితత్త్వతః ॥ 102

నారాయణపరా వేదా దేవా నారాయణాంగజాః ।
నారాయణపరా లోకా నారాయణపరా మఖాః ॥

నారాయణపరో యోగో నారాయణపరం తపః ।
నారాయణపరం జ్ఞానం నారాయణపరా గతిః ॥ 104

శ్లో॥ తస్యాపి ద్రష్టురీశస్య కూటస్థస్యాఖిలాత్మనః ।
సృజ్యం సృజామి సృష్టోఽహమీక్షయైవాభిచోదితః ॥ 105

సత్త్వం రజ స్తమ ఇతి నిర్గుణస్య గుణా స్తతః ।
స్థితిసర్గనిరోధేషు గృహీతా మాయయా విభోః ॥

కార్యకారణకర్తృత్వే ద్రవ్యజ్ఞానక్రియాశ్రయాః ।
బధ్నంతి నిత్యదా ముక్తం మాయినం పురుషం గుణాః ॥

స ఏష భగవాన్ లింగై స్త్రిభిరేభిరధోక్షజ ।
స్వలక్షితగతిర్బ్రహ్మన్ సర్వేషాం మమ చేశ్వరః ॥



కాలం కర్మ స్వభావం చ మాయేశో మాయయా స్వయా ।
యదృచ్ఛయాత్మని ప్రాప్తం విబుభూషురుపాదదే ॥

కాలాద్గుణవ్యతికరః పరిణామస్స్వభావతః ।
కర్మణో జన్మ మహతః పురుషాధిష్ఠితాదభూత్ ॥

మహతస్తు వికుర్వాణాద్రజస్సత్త్వోపబృంహితాత్ ।
తమః ప్రధాన స్త్వభవద్ద్రవ్యజ్ఞానక్రియాత్మకః ॥

సోఽహంకార ఇతి ప్రోక్తో వికుర్వన్ సమభూ త్త్రిధా ।
వైకారికస్తైజసశ్చ తామసశ్చేతి యద్భిదా ।
ద్రవ్యశక్తిః క్రియాశక్తిర్జ్ఞానశక్తిరితి ప్రభో ॥

తామసాదపి భూతాదేర్వికుర్వాణాదభూన్నభః ।
తస్య మాత్రాగుణశ్శబ్దో లింగం యద్ద్రష్టృదృశ్యయోః ॥

నభసోఽథ వికుర్వాణాదభూత్స్పర్శగుణోఽనిలః ।
పరాన్వయాచ్ఛబ్దవాంశ్చ ప్రాణ ఓజస్సహో బలమ్ ॥ 114

శ్లో॥ వాయోరపి వికుర్వాణాత్కాలకర్మస్వభావతః ।
ఉదపద్యత తేజో వై రూపవత్స్పర్శశబ్దవత్ ॥ 115

తేజసస్తు వికుర్వాణాదాసీదంభోరసాత్మకమ్ ।
రూపవత్స్పర్శవచ్చాంభో ఘోషవచ్చ పరాన్వయాత్ ॥

విశేషస్తు వికుర్వాణాదంభసోగంధవానభూత్ ।
పరాన్వయాద్రసస్పర్శశబ్దరూపగుణాన్వితః ॥

వైకారికాన్మనో జజ్ఞే దేవా వైకారికా దశ ।
దిగ్వాతార్క ప్రచేతోశ్వివహ్నీంద్రోపేంద్రమిత్రకాః ॥

తైజసాత్తు వికుర్వాణాదింద్రియాణి దశాభవన్ ।
జ్ఞానశక్తిః క్రియాశక్తిర్బుద్ధిః ప్రాణశ్చ తైజసౌ ॥

శ్రోత్రత్వగ్ఘ్రాణదృగ్జిహ్వావాగ్దోర్మేఢ్రాంఘ్రిపాయవః ।
యద్రై తేఽసంగతా భావా భూతేంద్రియమనోగుణాః ॥

యదాయతననిర్మాణే న శేకుర్బ్రహ్మసత్తమ ।
తదా సంహత్య చాన్యోన్యం భగవచ్ఛక్తిచోదితాః ॥

సదసత్త్వముపాదాయ చోభయం సంసృజుర్హ్యదః ।
వర్షాయుతసహస్రాంతే తదండముదకే శయమ్ ॥ 122

వ్యాస 2-5-14 నుండి 34

వ. మఱియు దేహంబునకు ద్రవ్యంబులైన మహాభూతంబులును, జన్మనిమిత్తంబులైన కర్మంబులును, కర్మక్షోభకంబైన కాలంబును, కాలపరిణామహేతువైన స్వభావంబును, భోక్తయైన జీవుండును, వాసుదేవుండుగా నెఱుంగుము. వాసుదేవ వ్యతిరిక్తంబులేదు, సిద్ధంబు. (నారాయణ నియామ్యంబులు లోకంబులు) దేవతలు నారాయణ శరీర సంభూతులు. వేదయాగ తపోయోగగతి విజ్ఞానంబులు నారాయణ పరంబులు. (జ్ఞానసాధ్యంబగు ఫలంబు నారాయణాధీనంబు) కూటస్థుండు, సర్వాత్మకుండు, సర్వద్రష్టయు నైన యీశ్వరుని కటాక్ష విశేషంబున సృజియింపంబడి, ప్రేరితుండనై సృజ్యంబైన ప్రపంచంబుసృజింపుచుండుదు. నిర్గుణుండైన యీశ్వరునివలన రజస్సత్త్వ తమోగుణంబులు ప్రభూతంబులై యుత్పత్తి స్థితి లయంబులకుఁబాలుపడి, కార్యకారణ కర్తృత్వ భావంబులందు ద్రవ్యంబులైన మహాభూతంబులు, జ్ఞానమూర్తులైన దేవతలు, క్రియారూపంబులైన యింద్రియంబులు, నాశ్రయంబులుగా నిత్య ముక్తుండయ్యును, మాయాసమన్వితుండైన జీవుని బంధించు. జీవులకు నావరణంబులై యుపాధిభూతంబులైన మూఁడు లింగంబులం జేసి పరులకు లక్షితంబుగాక తనకు లక్షితంబులైన తత్త్వంబు గల యీశ్వరుం డివ్విధంబునం గ్రీడించుచుండు. 65



క. ఆ యీశుఁడనంతుఁడు హరి
నాయకుఁడీ భువనములకు నాకున్ నీకున్
మాయకుఁ బ్రాణివ్రాతము
కేయెడలన్ లేదు నీశ్వ రేతరము సుతా! 66

వ. వినుము, మాయావిభుండైన యీశ్వరుండు దన మాయఁజేసి దైవయోగంబునం బ్రాప్తంబులైన కాల జీవాదృష్ట స్వభావంబులు వివిధంబులు సేయ నిశ్చయించి గైకొనియె. ఈశ్వరాధిష్ఠితంబైన మహత్తత్త్వంబువలన (నగుకాలంబున గుణవ్యతికరంబున, స్వభావంబునఁబరిణామంబునుఁ జీవాదృష్టభూతంబైన కర్మంబున జన్మంబును నయ్యె రజస్సత్త్వంబులచే నుపబృంహితమై వికారంబునొందిన మహత్తత్త్వంబు వలనం) దమః ప్రధానంబై ద్రవ్యజ్ఞానక్రియాత్మకం బగు నహంకారంబు గలిగె. అదియు రూపాంతరంబు నొందుచు, ద్రవ్య శక్తియైన తామసంబుఁ క్రియాశక్తియైన రాజసంబు, జ్ఞానశక్తియైన సాత్త్వికంబును నన మూఁడు విధంబు లయ్యె. అందు భూతాదియైన తామసాహంకారంబువలన నభంబు నలిగె. నభంబునకు సూక్ష్మరూపంబు, ద్రష్టృదృశ్యంబులకు బోధకంబైన శబ్దంబు గుణం బగు. నభంబువలన వాయువు గలిగె. వాయువునకుఁ బరాన్వయంబున శబ్దంబు స్పర్శంబు నను రెండు గుణంబులు గలిగియుండును. అది దేహంబునం దుండుటం జేసి ప్రాణరూపంబై యింద్రియ మన శ్శరీర పాటవంబులైన యోజ స్సహోబలంబులకు హేతువై వర్తించు. వాయువు వలన రూప స్పర్శ శబ్దంబు లనియెడి గుణంబులు మూఁటి తోడఁదేజంబు గలిగె. తేజంబువలన రస రూప స్పర్శ శబ్దంబు లనియెడు నాలుగు గుణంబులతోడ జలంబు గలిగె. జలంబువలన గంధ రస రూప స్పర్శ శబ్దంబు లనియెడి గుణంబు లయిదింటితోడం బృథివి గలిగె. వైకారికంబైన సాత్త్వికాహంకారంబు వలనఁజంద్ర దైవతంబైన మనంబు గలిగె.

మఱియు దిక్కులు, వాయువు, అర్కుండు, ప్రచేతస్సు, అశ్వినులు, వహ్ని, ఇంద్రుండు, ఉపేంద్రుండు, మిత్రుండుఁబ్రజాపతియు ననియెడి దశదేవతలు గలిగిరి. తైజసంబైన రాజసాహంకారంబువలన దిగ్దైవతంబైన శ్రవణేంద్రియంబుఁ వాయుదైవతంబైన త్వగింద్రియంబు, సూర్యదైవతంబైన నయనేంద్రియంబు, ప్రచేతో దైవతంబైన రసనేంద్రియంబు, అశ్వినీ దైవతంబైన ఘ్రాణేంద్రియంబు, వహ్ని దైవతంబైన వాగింద్రియంబు, ఇంద్ర దైవతంబైన హస్తేంద్రియంబు, ఉపేంద్రదైవతంబైన పాదేంద్రియంబు, మిత్ర దైవతంబైన గుదేంద్రియము, ప్రజాపతిదైవతంబైన గుహ్యేంద్రియంబు ననియెడి దశేంద్రియంబులును, బోధజన కాంతఃకరణైకభాగంబైన బుద్ధియుఁ గ్రియాజన కాంతఃకరణంబైన ప్రాణంబును గలిగె. ఇట్టి శ్రోత్రాదులగు దశేంద్రియంబులతోఁగూడిన భూతేంద్రియ మనోగుణంబులు వేర్వేఱుగ (బ్రహ్మాండ శరీరనిర్మాణంబునం దసమర్థంబులగునవుడు భగవచ్ఛక్తి ప్రేరితంబు లగుచు నేకీభవించి సమిష్టి వృష్ట్యాత్మకత్వంబు నంగీకరించి చేతనాచేతనంబులం గల్పించె.) అట్టి యండంబు వర్షాయుత సహస్రాంతంబు దనుక (జలంబునం దుండె. కాల కర్మ స్వభావంబులం దగులువడక సమస్తమును జీవయుక్తముగఁజేయు నీశ్వరుండచేతనంబును సచేతనంబుగ నొనర్చె) అంతఁగాలకర్మ స్వభావ ప్రేరకుండైన పరమేశ్వరుండు జీవ రూపంబున మహావరణ జలమధ్య స్థితంబైన బ్రహ్మాండంబులోను చొచ్చి సవిస్తరంబు గావించి (యట్టి యండంబు భేదించి నిర్గమించె. ఎట్లంటేని)67

పోతన 2-5-84 నుండి 86

శ్లో॥ కాలకర్మస్వభావస్థో జీవోఽ జీవమజీవయత్ ।
స ఏవ పురుష స్తస్మాదండం నిర్భిద్యనిర్గతః ।
సహస్రోర్వంఘ్రిబాహ్వక్షస్సహస్రాననశీర్షవాన్ ॥ 123

యస్యేహావయవైర్లోకాన్కల్పయంతి మనీషిణః ।
కట్యాదిభిరధస్సప్త సప్తోర్ధ్వం జఘనాదిభిః ॥



పురుషస్య ముఖం బ్రహ్మ క్షత్ర మేతస్య బాహవః ।
ఊర్వోర్వైశో భగవతః పద్భ్యాం శూద్రో వ్యజాయత ॥

భూర్లోకః కల్పితః పద్భ్యాం భువర్లోకశ్చ నాభితః ।
హృదా స్వర్లోక ఉరసా మహర్లోకో మహాత్మనః ॥ 126

శ్లో॥ గ్రీవాయాం జనలోకస్తు తపోలోక స్తనద్వయాత్ ।
మూర్ధతస్సత్యలోకస్తు బ్రహ్మలోకస్సనాతనః ॥ 127

తత్కట్యామతలం క్లుప్తమూరుభ్యాం వితలం విభోః ।
జానుభ్యాం సుతలం శుద్ధం జంఘాభ్యాం తు తలాతలమ్ ॥

మహాతలం తు గుల్ఫాభ్యాం ప్రపదాభ్యాం రసాతలమ్ ।
పాతాళం పాదతలత ఇతి లోకమయః పుమాన్ ॥

భూర్లోకః కల్పితః పద్భ్యాం భువర్లోకస్తు నాభితః ।
స్వర్లోకః కల్పితో మూర్ధ్నా ఇతి వా లోక కల్పనా ॥ 130

వ్యాస 2-5-35 నుండి 42

క. భువనాత్మకుఁడా యీశుఁడు
భువనాకృతితోడ నుండు బ్రహ్మాండంబున్
వివరముతోఁబదునాలుగు
వివరంబులుగా నొనర్చె విశదంబులుగన్. 68

మ. బహు పాదోరు భుజాననేక్షణ శిరః ఫాల శ్రవో యుక్తుఁడై
విహరించున్ బహుదేహి దేహగతుఁడై విద్వాంసులూహించి త
ద్బహురూపావయవంబులన్ భువన సంపత్తిన్ విచారింతు రా
మహనీయాద్భుతమూర్తి యోగిజన హృన్మాన్యుండు మేధానిధీ!69

వ. వినుము. చతుర్దశ లోకంబులందు మీఁది యేడు లోకంబులు, శ్రీమహావిష్ణువునకుం గటిప్రదేశంబున నుండి యూర్ధ్వదేహమనియును,

గ్రింది యేడు లోకంబులు జఘనంబున నుండి యధోదేహ మనియునుం బలుకుదురు. ప్రపంచ శరీరకుం దగు భగవంతుని ముఖంబు వలన బ్రహ్మకులంబు, బాహువులవలన క్షత్రియకులంబు, ఊరువులవలన వైశ్యకులంబు, పాదంబువలన శూద్రకులంబు జనియించె నని చెప్పుదురు. భూలోకంబు గటిప్రదేశంబు, భువర్లోకంబు నాభి, సువర్లోకంబు హృదయంబు, మహర్లోకంబు వక్షంబు. జన లోకంబు గ్రీవ, తపోలోకంబు స్తనద్వయంబు, సనాతనంబును బ్రహ్మ నివాసంబును నైన సత్యలోకంబు శిరంబు, కటిప్రదేశం బతలంబు, తొడలు వితలంబు, జానువులు సుతలంబు, జంఘలు దలాతలంబు, గుల్ఫంబులు మహాతలంబు, పాదాగ్రంబులు రసాతలంబు, పాదతలంబు పాతాళంబు నని (లోకమయుంగా) భావింతురు. కొందఱు మఱియుం బాదతలంబువలన భూలోకంబును, నాభివలన భువర్లోకంబును, శిరంబువలన స్వర్లోకంబును గలిగె నని లోకకల్పనంబు నెన్నుదురు. పోతన 2-5-87 నుండి 89 70

* * *

## అధ్యాయము - 6

**బ్రహ్మోవాచ :**

శ్లో॥ ధర్మస్య మమ తుభ్యం చ కుమారాణాం భవస్య చ ।
విజ్ఞానస్య చ సత్త్వస్య పరస్యాత్మా పరాయణమ్ ॥ 131

అహం భవాన్ భవశ్చైవ త ఇమే మునయోఽగ్రజాః ।
సురాసురా నరా నాగాః ఖగా మృగసరీసృపాః ॥

గంధర్వాప్సరసో యక్షా రక్షో భూతగణోరగాః ।
పశవః పితరస్సిద్ధా విద్యాధ్రాశ్చారణా ద్రుమాః ॥

అన్యే చ వివిధా జీవా జలస్థలనభౌకసః ।
గ్రహర్క్ష కేతవస్తారా స్తటిత స్తనయిత్నవః ॥

సర్వం పురుష ఏవేదం భూతం భవ్యం భవచ్చయత్ ।
తేనేదమావృతం విశ్వం వితస్తిమధితిష్ఠతి ॥

శ్లో॥ స్వధిష్ణ్యం ప్రతపన్ప్రాణో బహిశ్చ ప్రతపత్యసౌ ।
ఏవం విరాజం ప్రతపం స్తపత్యంతర్బహిః పుమాన్ ॥ 136

వ్యాస 2-6-12 నుండి 17

ఆ. నీల కంధరునకు నీకు నాకు సనత్కు
మార ముఖ్య సుత సమాజమునకు
ధర్మ సత్త్వ బుద్ధి తత్త్వములకు నీశ్వ
రాత్మ వినుము పరమమైన నెలవు. 71

సీ. నర సురాసుర పితృ నాగ కుంజర మృగ
గంధర్వ యక్ష రాక్షస మహీజ
సిద్ధ విద్యాధర జీమూత చారణ
గ్రహ తార కాప్సరోగణ విహంగ

భూత తటి ద్వసు పుంజంబులును నీవు
ముక్కంటియును మహామునులు నేను
సలిల నభస్థ్సల చరములు మొదలైన
వివిధ జీవులతోడి విశ్వమెల్ల

ఆ. విష్ణుమయము పుత్ర! వేయేల బ్రహ్మాండ
మతని జేనలోన నణఁగి యుండు
బుద్ధి నెఱుఁగరాదు భూత భవ ద్భవ్య
లోకమెల్ల విష్ణులోన నుండు.

క. మండలములోన భాస్కరుఁ
డుండుచు జగములకు దీప్తి నొసగెడి క్రియ బ్ర
హ్మాండములోపల నచ్యుతఁ
డుండుచు బహిరంతరముల నొగి వెలిఁగించున్. 73

పోతన 2-6-90, 91, 92

శ్లో॥ యదాస్య నాభ్యాం నళినాదహమాసం మహాత్మనః ।
నావిందం యజ్ఞసంభారాన్పురుషావయవాదృతే ॥ 137

వ్యాస 2-6-23

ఉ. అట్టి యనంతశక్తి జగదాత్ముని నాభి సరోజమందు నేఁ
బుట్టి యజింపఁగా మనసు పుట్టిన యజ్ఞ పదార్థ జాతముల్
నెట్టన గానరామికిని నిర్మలమైన తదీయ రూపమున్
గట్టిగ బుద్ధిలో నిలిపి కంటి నుపాయము నామనంబునన్. 74

పోతన 2-6-93

**గమనిక: (ద్వితీయ స్కంధమున ఈ పద్యమునుండి వెలిగందల నారయ కవిత్వమని ముద్రిత ప్రతులలోఁగలదు. ఇట్లే మఱియు కొన్ని తాళపత్ర ప్రతులలో కూడ గలదని పెద్దల అభిప్రాయము)**



శ్లో॥ ఇతి సంభృతసంభారః పురుషావయవైరహం ।
తమేవ పురుషం యజ్ఞం తేనై వాయజమీశ్వరమ్ ॥

వ్యాస 2-6-28

క. యజ్ఞాంగి యజ్ఞ ఫలదుఁడు
యజ్ఞేశుఁడు యజ్ఞభోక్త యగు భగవంతున్
యజ్ఞపురుషుఁగా మానస
యజ్ఞముఁగావించితిం దదర్పణబుద్ధిన్. 75

పోతన 2-6-95

శ్లో॥ నారాయణే భగవతి తదిదం విశ్వమాహితమ్ ।
గృహీతమాయోరుగుణస్సర్గాదావగుణస్స్వతః ॥

సృజామి తన్నియుక్తోఽహం హరో హరతి తద్వశః ।
విశ్వం పురుష రూపేణ పరిపాతి త్రిశక్తిధృత్ ॥ 140

శ్లో॥ ఇతి తేఽభిహతం తాత యదేతదనుపృచ్ఛసి ।
నాన్యద్భగవతః కించిద్భావ్యం సదసదాత్మకమ్ ॥ 141

న భారతీ మేఽఙ్గ మృషోపలక్ష్యతే
న కర్హిచిన్మే మనసో మృషా గతిః ।
న మే హృషీకాణి పతంత్యసత్పథే
యన్మే హృదౌత్కంఠ్యవతా ధృతో హరిః ॥ 142

వ్యాస 2-6-31 నుండి 34

క. అగుణుం దగు పరమేశుఁడు
జగములు గల్పించు కొఱకుఁజతురత మాయా
సగుణుండగుఁగావున హరి
భగవంతుం డనఁగఁబరఁగె భవ్య చరిత్రా! 76

క. విశ్వాత్ముఁడు విశ్వేశుఁడు
విశ్వమయుం డఖిలనేత విష్ణుం డజుఁడీ

విశ్వములోఁదా నుండును
విశ్వము దనలోనఁజాల వెలుఁగుచు నుండన్.

చ. అతని నియుక్తిఁజెంది సచరాచర భూతసమేత సృష్టి నే
వితతముగా సృజింతుఁబ్రభవిష్ణుఁడు విష్ణుఁడు బ్రోచుఁబార్వతీ
పతిలయమొందఁజేయు హరిపంకరుహోదరుఁడాదిమూర్తియ
చ్యుతుఁడు త్రిశక్తియుక్తుఁడగుచుండును నింతకుఁదాన మూలమై.

క. విను వత్స! నీవు న న్నడి
గిన ప్రశ్నకు నుత్తరంబు గేవల పరమం
బను బ్రహ్మం బీ యఖిలం
బున కగు నాధారహేతుభూతము సుమ్మీ! 79

క. హరి భగవంతుఁడనంతుఁడు
గరుణాంబుధి సృష్టికార్య కారణ హేతు
స్ఫురణుం డ వ్విభుకంటెం
బరుఁడన్యుఁడు లేఁడు తండ్రి! పరికింపంగన్. 80

పోతన 2-6-99 నుండి 103

శ్లో॥ నాహం న యూయం యదృతాం గతిం విదు
ర్న వామదేవః కిముతాపరే సురాః ।
యన్మాయయా మోహిత బుద్ధయ స్త్విదం
వినిర్మితం స్వాత్మసమం విచక్ష్మహే ॥ 143

వ్యాస 2-6-37

మ. విను, వే యేటికిఁదాపసప్రవర! య వ్విశ్వాత్ముఁడీశుండు దాఁ
దన మాయా మహిమాంతముం దెలియఁగాఁదథ్యంబు దాఁజాలఁడ
న్నను నేనైనను మీరలైన సురలైనన్ వామదేవుండు నై
నను నిక్కం బెఱుఁగంగఁజాలుదుమె! విజ్ఞాన క్రియా యుక్తులన్. 81

పోతన 2-6-106



శ్లో॥ యస్యావతారకర్మాణి గాయంతి హ్యస్మదాదయః ।
న యం విందంతి తత్త్వేన తస్మై భగవతే నమః ॥

స ఏష ఆద్యః పురుషః కల్పే కల్పే సృజత్యజః ।
ఆత్మన్యేవాత్మనాత్మానం సంయచ్ఛతి చ పాతి చ ॥

విశుద్ధం కేవలజ్ఞానంప్రత్యక్సమ్యగవస్థితమ్ ।
సత్యం పూర్ణమనాద్యం తం నిర్గుణం నిత్యమద్వయమ్ ॥ 146

వ్యాస 2-6-38, 39, 40

చ. తలకొని యమ్మహాత్మకుఁడు దాల్చిన య య్యవతారకర్మముల్
వెలయఁగ నస్మదాదులము వేయి విధంబుల సన్నుతింతు మ
య్యలఘు ననంతునిం జిదచి దాత్మకు నాద్యు ననీశు నీశ్వరున్
దెలియఁగ నేర్తుమే! తవిలి దివ్యచరిత్రున కేను మ్రొక్కెదన్.

మ పరమాత్ముం డజుఁడీజగంబు ప్రతికల్పంబందు గల్పించుఁదాఁ
బరిరక్షించును ద్రుంచునట్టి యనఘున్ బ్రహ్మాత్మునిత్యున్ జగ
ద్భరితున్ గేవలు నద్వితీయుని విశుద్ధజ్ఞాను సర్వాత్ము నీ
శ్వరు నాద్యంతవిహీను నిర్గుణుని శశ్వన్మూర్తిఁజింతించెదన్. 83

పోతన 2-6-109, 110

శ్లో॥ ఋషే విందంతి మునయః ప్రశాంతాత్మేంద్రియాశయాః ।
యదా తదేవాసత్తర్కై స్తిరోధీయేత విప్లుతమ్ ॥ 147

వ్యాస 2-6-41

చ. సరసగతిన్ మునీంద్రులు ప్రసన్నశరీర హృషీక మానస
స్ఫురణ గలప్పు డ వ్విభుని భూరికళా కలిత స్వరూపముం
దరమిడి చూతు రెప్పుడు కుతర్క తమోహరి చేత నజ్ఞతన్
బొరసిన యప్పు డ వ్విభుని మూర్తిఁగనుంగొనలేరు నారదా!

పోతన 2-6-111

శ్లో॥ ఆద్యోవతారః పురుషః పరస్య
కాలస్య భావస్సదసన్మనశ్చ ।
ద్రవ్యం వికారో గుణ ఇంద్రియాణి
విరాట్స్వరాట్ స్థాన్ను చరిష్ణ భూమ్నః ॥ 148

శ్లో॥ అహం భవో యజ్ఞ ఇమే ప్రజేశా
దక్షాదయో యే భవదాదయశ్చ ।
స్వర్లోకపాలాః ఖగలోకపాలా
నృలోకపాలా స్తలలోకపాలాః ॥ 149

గంధర్వవిద్యాధరచారణేశా
యే యక్షరక్షోరగనాగనాథాః ।
యే వా ఋషీణామృషభాః పితౄణాం
దైత్యేంద్రసిద్ధేశ్వరదానవేంద్రాః ॥

అన్యే చ యే ప్రేతపిశాచభూత
కూశ్మాండయాదోమృగపశ్వధీశాః ।
యత్కించ లోకే భగవన్మహస్వ
దోజస్సహస్వద్బలవత్క్ష మావత్ ॥ 151

వ్యాస 2-6-42 నుండి 45

వ. అని వెండియు నిట్లను. అనఘా! ఇమ్మహనీయ తేజోనిధి మొదలి యవతారంబు సహస్ర శీర్షాది యుక్తంబయి ప్రకృతి ప్రవర్తకం బగు నాదిపురుష రూపంబగు. అందుఁగాలస్వభావంబులను శక్తు లుదయించె. అందుఁగార్యకారణ రూపంబైన ప్రకృతి జనించెఁ. బ్రకృతివలన మహత్తత్త్వం బును, దానివలన నహంకార త్రయంబును బుట్టె. అందు రాజసాహంకారం బువలన నింద్రియంబులును, సాత్త్వికాహంకారంబువలన నింద్రియ



గుణప్రధానంబు లైన యధిదేవతలును, తామసాహంకారంబువలన భూతకారణంబులైన శబ్ద స్పర్శ రూప రసగంధ తన్మాత్రంబులును బొడమె. పంచతన్మాత్రంబువలన గగనా నిలవహ్ని సలిల ధరాధికమైన భూత పంచకంబుఁగలిగె. అందు జ్ఞానేంద్రియంబులైన త్వక్ చక్షు శ్రోత్ర జిహ్వా ఘ్రాణంబులును, కర్మేంద్రియంబులైన వాక్ పాణిపాద పాయు ఉపస్థలును, మనంబును జనియించె. అన్నింటి సంఘాతంబున విశ్వరూపుండైన విరాట్పురుషుండు పుట్టె. అతనివలన స్వయంప్రకాశుం డైన స్వరాట్టు సంభవించె. అందుఁజరాచర రూపంబుల స్థావర జంగమాత్మకం బైన జగత్తు గలిగె. అందు సత్త్వరజస్తమో గుణాత్మకులమైన విష్ణుం డును హిరణ్యగర్భుండ నైన యేనును, రుద్రుండును గలిగితిమి. అందు సృష్టి జనన కారణుండైన చతుర్ముఖుండు పుట్ట, వానివలన దక్షాదులగు ప్రజాపతులు దొమ్మండ్రు గలిగిరి. అందు భవత్ప్రముఖులైనసనక సనందాది యోగీంద్రులును, నాకలోక నివాసు లయిన వాసవాదులును, ఖగలోక పాలకు లగు గరుడాదులును, నృలోక పాలకు లగు మను మాంధాతృ ప్రభృతులును, తలలోకపాలకు లగు ననంత వాసుకి ప్రభృతులును, గంధర్వ సిద్ధ విద్యాధర చారణ సాధ్య రక్షోయక్షోరగ నాగలోకపాలురును, మఱియు ఋషులును, పితృదేవతలును, దైత్య దానవ భూత ప్రేత పిశాచ కూశ్మాండ పశు మృగాదులు నుద్భవించిరి. ఇట్టి జగత్ప్రథమోద్భవంబు మహత్తత్త్వ సృష్టి యనంబడు. ద్వితీయం బండ సంస్థితం బనం దగు. తృతీయంబు సర్వభూతస్థం బన నొప్పు. అందైశ్వర్య తేజోబల సంపన్నులైన పురుషులు సర్వాత్ముండైన నారాయణుని యంశ సంభవులుగా నెఱుంగుము. తత్పుండరీకాక్షుని లీలావతారంబు లనంతంబులు. తత్కర్మంబులు లెక్కవెట్ట నెవ్వరికి నలవిగాదు. ఐనను నాకుఁదోఁచినంత నీ కెఱింగించెద. వినుము. 85

పోతన 2-6-112

## శ్రీమన్నారాయణుని లీలావతారములు

**శ్రీ బ్రహ్మోవాచ :**

శ్లో॥ శ్రీహ్రీవిభూత్యాత్మవదద్భుతార్ణం(ర్ణం)ర్థం
తత్త్వం పరం రూపవదస్వరూపమ్ ।
ప్రాధాన్యతో యానృష ఆమనంతి
లీలావతారాన్పురుషస్య భూమ్నః ॥ 152

ఆపీయతాం కర్ణకషాయశోషా ।
ననుక్రమిష్యేత ఇమాన్ సుపేశాన్ ॥

వ్యాస 2-6-46, 47

ఉ. అన్య కథానులాపము లహర్నిశమున్ వినునట్టి సత్క్రియా
శూన్యములైన కర్ణముల సూరిజన స్తుత సర్వలోకస
మ్మాన్యములై తనర్చుహరిమంగళదివ్యకథామృతంబు సౌ
జన్యతఁగ్రోలు మయ్య! బుధసత్తమ! యే వివరించి చెప్పెదన్.

వ. అని పలికి నారదుం జూచి మఱియు నిట్లనియె. 87

పోతన 2-6-113, 114

* * *

## అధ్యాయము - 7

1.వరాహావతారము 2.యజ్ఞావతారము 3.కపిలావతారము 4.దత్తాత్రేయావతారము 5.సనక సనందన సనత్కుమార సనత్సుజాత బ్రహ్మమానసపుత్రులు 6.నరనారాయణావతారము 7.ధ్రువావతారము 8.పృథుని యవతారము 9.వృషభావతారము 10.హయగ్రీవావతారము 11.మత్స్యావతారము 12.కూర్మావతారము 13.నృసింహావతారము 14.ఆదిమూలావతారము (గజేంద్రుని రక్షించెను) 15.వామనావతారము 16.హంసావతారము (భాగవతమహాపురాణం బుపదేశించె.) 17.మన్వవతారము 18.ధన్వంతరి అవతారము 19.పరశురామావతారము 20.శ్రీరామావతారము 21.కృష్ణావతారము 22.వ్యాసావతారము 23.బుద్ధావతారము 24.కల్క్యవతారము. 88

ఈ క్రింద శ్రీరామావతారము మఱియు కల్క్యవతారములు మాత్రమే వివరింపబడినవి.

### శ్రీరామావతారము

శ్లో॥ అస్మత్ప్రసాదసుముఖః కలయా కలేశ
ఇక్ష్వాకువంశ అవతీర్య గురోర్ని దేశే ।
తిష్ఠన్ వనం సదయితానుజ ఆవివేశ
యస్మిన్ విరుధ్య దశకంధర ఆర్తిమార్ఛత్ ॥ 154

యస్మా ఆదాదుదధిరూఢభయాంగవేపో
మార్గం సపద్యరిపురం హరవద్దిధక్షోః ।
దూరే సహృన్మథితరోషసుశోణదృష్ట్యా
తాతప్యమాన మకరోరగనక్రచక్రః ॥

వక్షస్థ్సలస్పర్శరుగ్ణమహేంద్రవాహ
దంతైర్విడంబితకకుబ్జుష ఊఢహాసమ్ ।

సద్యోఽ సుభిస్సహ వినేష్యతి దారహర్తు
ర్విస్ఫూర్జితైర్ధనుష ఉచ్చరతోఽ ధిసైన్యే ॥ 156
వ్యాస 2-7-23, 24, 25

సీ. తోయజహిత వంశ దుగ్ధ పారావార
రాకా విహార కైరవహితుండుఁ
గమనీయ కోసల క్ష్మాభృ త్సుతాగర్భ
శుక్తి సంపుట లసన్మౌక్తికంబు
నిజపాద సేవక ప్రజ దుఃఖ నిబిడాంధ
కార విస్ఫురిత పంకరుహసఖుఁడు
దశరథేశ్వర కృతాధ్వర వాటికా ప్రాంగ
ణాకర దేవతానోకహంబుఁ

తే. జటుల దానవ గహన వైశ్వానరుండు
రావణాటోప శైల పురందరుండు
నగుచు లోకోపకారార్థ మవతరించె
రాముఁడై చక్రి లోకాభిరాముఁడగుచు ॥ 90

క. చిత్రముగ భరతలక్ష్మణ
శత్రుఘ్నుల కర్థి నగ్రజన్ముం డగుచున్
ధాత్రిన్ రాముఁడు వెలసెఁబ
విత్రుఁడు దుష్కృతలతా లవిత్రుం డగుచున్ ॥

వ. అంత

సీ. కిసలయ ఖండేందు బిస కుంద పద్మాబ్జ
పద ఫాల భుజరద పాణి నేత్రఁ
గాహళ కరభ చక్ర వియ త్పులిన శంఖ
జంఘోరు కుచ మధ్య జఘన కంఠ



ముకుర చందన బింబ శుక గజ శ్రీకార
గండ గంధోష్ఠ వా గ్గమనకర్ణఁ
జంప కేందు స్వర్ణ శఫర ధను ర్నీల
నాసాననాంగ దృగ్భ్రూ శిరోజ

తే. నలిసుధావర్త కుంతల హాసనాభి
కలిత జనకావనీపాల కన్యకా ల
లామఁబరిణయమయ్యె లలాటనేత్ర
కార్ముకధ్వంస ముంకువ గాఁగ నతఁడు. 92

క. రామున్ మేచకజలద
శ్యామున్ సుగుణాభిరాముసద్వైభవసు
త్రామున్ దుష్టనిశాటవి
రాముం బొమ్మనియెఁబంక్తిరథుఁడడవులకున్.

వ. ఇట్లు వచించిన

చ. అరుదుగ లక్ష్మణుండు జనకాత్మజయుం దనతోడ నేఁగుదే
నరిగి రఘూత్తముండు ముదమారఁగఁజొచ్చెఁదరక్షు సింహ సూ
కర కరి పుండరీక కపి ఖడ్గ కురంగ వృకాహి భల్లకా
సర ముఖ వన్యసత్త్వచయ చండతరాటవి దండకాటవిన్.

క. ఆ వనమున వసియించి నృ
పావన నయశాలి యిచ్చె నభయములు జగ
త్పావన మునిసంతతికిఁగృ
పావన నిధి యైన రామభద్రుం డెలమిన్.

క. ఖరకర కుల జలనిధి హిమ
కరుఁడగు రఘురామ విభుఁడు గఱకతితోడన్
ఖరుని వధించెను ఘన భీ
కర శరముల నఖిలజనులుఁగర మరు దందన్. 96

క. హరిసుతుఁబరిచరుఁగాఁగొని
హరిసుతుఁదునుమాడి పనిచె హరిపురమునకున్
హరివిభునకు హరిమధ్యను
హరిరాజ్యపదంబు నిచ్చె హరివిక్రముఁడై 97

వ. అంత సీతానిమిత్తంబునం ద్రిలోకకంటకుం డగు దశకంఠుం దును మాడుటకునై కపిసేనాసమేతుం డయి చని ముందట నతిదుర్గమం బయిన సముద్రంబు పేర్చి తెరువు సూపకున్న నలిగి.

మ. వికట భ్రూకుటి ఫాలభాగుఁడగుచున్ వీరుండు క్రోధారుణాం
బకుఁడై చూచినయంత మాత్రమున న ప్పాథోధి సంతప్తతో
యకణ గ్రాహ తిమింగిల ప్లవ ధులీ వ్యాళ ప్రవాళోర్మికా
బక కారండవ చక్రముఖ్యజలసత్త్వ శ్రేణితో నింకినన్.

వ. అ య్యవసరంబున సముద్రుండు గరుణాసముద్రుం డగు శ్రీరామభద్రుని శరణంబు సొచ్చినం గరుణించి యెప్పటియట్ల నిలిపి నలునిచే సేతువు బంధింపించి త న్మార్గంబునం జని.

మ. పురముల్ మూఁడును నొక్కబాణమున నిర్మూలంబుగావించు శం
కరు చందంబున నేర్చి రాఘవుఁడు లంకాపట్టణం బిద్ధ గో
పుర శాలాంగణ హర్మ్య రాజభవన ప్రోద్య త్ప్రతోళీకపా
ట రథాశ్వ ద్విప శస్త్రమందిర నిశాట శ్రేణితో వ్రేల్మిడిన్.

క. రావణు నఖిలజగ ద్వి
ద్రావణుఁబరిమార్చి నిలిపె రక్షోవిభుఁగా
రావణు ననుజన్ముని నై
రావణసీతకీర్తి మెఱసి రాఘవుఁడెలమిన్. 102

సీ. ధర్మసంరక్షకత్వ ప్రభావుం డయ్యు
ధర్మవిధ్వంసకత్వమునఁబొదలి
ఖర దండ నాభిముఖ్యముఁబొంద కుండియు
ఖరదండ నాభిముఖ్యమున మెఱసి
పుణ్యజనావన స్ఫూర్తిఁబెంపొందియుఁ
బుణ్యజనాంతక స్ఫురణఁదనరి
సంతతాశ్రిత విభీషణుఁడు గాకుండియు
సంత తాశ్రిత విభీషణత నొప్పి

తే. మించెఁదనకీర్తిచేత వాసించె దిశలు
దరమె? నుతియింప జగతి నెవ్వరికినైనఁ
జారుతరమూర్తి నవనీశ చక్రవర్తిఁ
బ్రకట గుణసాంద్రు దశరథ రామచంద్రు. 103

వ. అట్టి శ్రీరామావతారంబు జగత్పావనంబును నస్మత్ప్రసాద కారణంబును నై నుతికెక్కె. పోతన 2-7-155 నుండి 172



## కల్క్యవతారము

శ్లో॥ యర్హ్యాలయేష్వపి సతాం న హరేః కథాస్స్యుః
పాషండినో ద్విజజనా వృషలా నృదేవాః ।
స్వాహా స్వధా వషడితి స్మ గిరో న యత్ర
శాస్తా భవిష్యతి కలేర్భగవాన్ యుగాంతే ॥ 157
వ్యాస 2-7-38

మ. వనజాక్ష స్తవ శూన్యు లై మతి వషట్స్వాహాస్వధావాక్యశో
భనరాహిత్యులు సూనృతేతరులునుం బాషండులు న్నైన వి
ప్రనికాయంబును శూద్రభూపులుఁగలిం బాటిల్లినం గల్కియై
జననం బంది యధర్మము న్నడఁచు సంస్థాపించు ధర్మం బిలన్. 105
పోతన 2-7-198

శ్లో॥ విష్ణోర్ను వీర్యగణనాం కతమోఽర్హతీహ
యః పార్థివాన్యపి కవిర్విమమే రజాంసి ।
చస్కంభ యస్స్వరంహసాఽస్ఖలతా త్రిపృష్ఠం
యస్మాత్త్రిసామ్యసదనాదురుకంపయానమ్ ॥ 158
వ్యాస 2-7-40

చ. అమరఁద్రివిక్రమస్ఫురణ నందిన యమ్మహితాత్ముపాదవే
గమున హతంబు లైనత్రిజగంబుల కావల వెల్గు సత్యలో
కము చలియించినం గరుణఁగైకొని కాచి ధరించుపాదప
ద్మము తుదినున్న యప్రతిహతం బగు శక్తిగణింప శక్యమే. 106
పోతన 2-7-200

**హరిమాయ - తత్తరణోపాయము**

శ్లో॥ నాంతం విదామ్యహమమీ మునయోఽగ్రజాస్తే
మాయా బలస్య పురుషస్య కుతోఽపరే యే ।
గాయన్ గుణాన్ దశశతానన ఆదిదేవ
శ్శేషోఽధునాపి సమవస్యతి నాస్య పారమ్ ॥
వ్యాస 2-7-41

మ. హరి మాయాబల మే నెఱుంగ నఁట శక్యంబే! సనందాది స
త్పురుషవ్రాతము కైన బుద్ధి నితరంబున్ మాని సేవాధిక
స్ఫురణం దచ్చరితానురాగ గుణ విస్ఫూర్తిన్ సహస్రాస్య సు
స్థరతంబొల్పగుశేషుఁడుం దెలియఁడన్నన్‌జెప్పనే లొండొరున్. 160
పోతన 2-7-201

శ్లో॥ యేషాం స ఏష భగవాన్ దయయేదనంత
స్సర్వాత్మనాశ్రితపదో యది నిర్వ్యలీకమ్ ।
తే దుస్తరామతితరంతి చ దేవమాయాం
నైషాం మమాహమితి ధీః స్వసృగాలభక్ష్యే ॥ 160
వ్యాస 2-7-42

చ. ఇతరము మాని తన్ను మది నెంతయు నమ్మి భజించువారి నా
శ్రిత జన సేవితాంఘ్రి సరసీరుహుఁడైన సరోజనాభుఁడం
చిత దయతోడ నిష్కపట చిత్తమునం గరుణించునట్టి వా
రతులదురంత మై తనరు నవ్విభు మాయఁదరింతు రెప్పుడున్. 108
పోతన 2-7-202



శ్లో॥ తే వై విదంత్యతితరంతి చ దేవమాయాం
స్త్రీశూద్రహూణశబరా అపి పాపజీవాః ।
యద్యద్భుతక్రమపరాయణశీలశిక్షా
స్తిర్యగ్జనా అపి కిము శ్రుతధారణా యే ॥
వ్యాస 2-7-46

మ. అనఘా! వీరల నెన్న నేమిటికిఁదిర్య గ్జంతు సంతాన ప
క్షి నిశాటాటవికాఘజీవ నివహ స్త్రీ శూద్ర హూణాదులై
నను నారాయణ భక్తియోగ మహితానందాత్ములైరేని వా
రనయంబున్ దరియింతు రవ్విభుని మాయావైభవాంభోనిధిన్. 109
పోతన 2-7-205

శ్లో॥ శశ్వత్ప్రశాంతమభయం ప్రతిబోధమాత్రం
శుద్ధం సమం సదసతః పరమాత్మతత్త్వమ్ ।
శబ్దో న యత్ర పురుకారకవాన్ క్రియార్థో
మాయా పరైత్యభిముఖే చ విలజ్జమానా ॥ 162
వ్యాస 2-7-47

క. శశ్వత్ప్రశాంతు నభయుని
విశ్వాత్ముఁబ్రబోధమాత్రు విభు సంశుద్ధున్
శాశ్వతు సము సదసత్పరు
నీశ్వరుఁజిత్తమున నిలుపు మెపుడు మునీంద్రా! 110
పోతన 2-7-207

శ్లో॥ స శ్రేయసామపి విభుర్భగవాన్ యతోఽస్య
భావస్వభావవిహితస్య సతః ప్రసిద్ధిః ।
దేహే స్వధాతువిగమేఽనువిశీర్యమాణే
వ్యో మేవ తత్ర పురుషో న విశీర్యతేఽజః ॥ 163
వ్యాస 2-7-49

ఉ. సర్వఫల ప్రదాతయును సర్వశరణ్యుఁడు సర్వశక్తుఁడున్
సర్వజగ త్ప్రసిద్ధుఁడును సర్వగతుం డగు చక్రపాణి యీ
సర్వశరీరులున్ విగమసంగతిఁజెంది విశీర్యమాణు లై
పర్వినచో నభంబుగతి బ్రహ్మము దాఁజెడకుండు నెప్పుడున్.
పోతన 2-7-210

శ్లో॥ సోఽయంతేఽభిహితస్తాత భగవాన్ విశ్వభావనః ।
సమాసేన హరేర్నాన్యదన్యస్మాత్సదసచ్చ యత్ ॥ 164

ఇదం భాగవతం నామ యస్మే భగవతోదితమ్ ।
సంగ్రహోఽయం విభూతీనాం త్వమేతద్విపులీకురు ॥

**రాజోవాచ :**

యథా హరౌ భగవతి నృణాం భక్తిర్భవిష్యతి ।
సర్వాత్మన్యఖిలాధార ఇతి సంకల్ప్య వర్ణయ ॥ 166
వ్యాస 2-7-50 నుండి 52

ఉ. కారణకార్య హేతువగు కంజదళాక్షుని కంటె నన్యు లె
వ్వారును లేరు తండ్రి! భగవంతు ననంతుని విశ్వభావనో
దారుని సద్గుణావళు లుదాత్తమతిన్ గొనియాడకుండినన్
జేరవు చిత్తముల్ ప్రకృతిఁజెందని నిర్గుణమైన బ్రహ్మమున్.

మ. నిగమార్థ ప్రతిపాదక ప్రకటమై నిర్వాణ సంధాయిగా
భగవంతుండు రచింప భాగవత కల్పక్ష్మాజమై శాస్త్రరా
జి గరిష్ఠంబగు నీ పురాణకథ సంక్షేపంబుగాఁజెప్పితిన్
జగతి న్నీవు రచించు దీని నతివిస్తారంబుగాఁబుత్రకా! 113
పోతన 2-7-211, 212

శ్లో॥ నృజన్మని న తుష్యేత కిం కాయమనునశ్వరైః ।
కృష్ణే యద్యపవర్గేశే భక్తిస్స్యాదనపాయినీ ॥
వ్యాస 2-7-53



చ. పురుషభవంబునొందుట యపూర్వము జన్మములందు నందు భూ
సురకులమందుఁబుట్టు టతిచోద్యము నిట్లగుటన్ మనుష్య ల
స్థిర మగు కార్యదుర్దశల చేత నశింపక విష్ణుసేవనా
పరతఁదనర్చి నిత్య మగుభవ్యపథంబునఁబొందు టొప్పదే. 114
పోతన 2-7-213

శ్లో॥ కింస్యాద్వర్ణాశ్రమాచారైః కిం దానైః కిం తపశ్శ్రుతైః ।
సర్వాఘఘ్నోత్తమశ్లోకే నచేద్భక్తిరధోక్షజే ॥ 168
వ్యాస 2-7-54

మ. ఉపవాస వ్రత శౌచ శీల మఖ సంధ్యోపాసనాగ్నిక్రియా
జపదానాధ్యయనాదికర్మముల మోక్షప్రాప్తి సేకూర ద
చ్చపుభక్తిన్ హరి బుండరీకనయనున్ సర్వాతిశాయిన్ రమా
ధిపుఁబాపఘ్నుఁబరేశు నచ్యుతుని నర్థిం గొల్వ లేకుండినన్. 115
పోతన 2-7-214

శ్లో॥ లీలాం వర్ణయతోఽముష్య ఈశ్వరస్యానుమోదితః ।
శృణ్వత శ్శ్రద్ధయా నిత్యం మాయయాత్మాన ముహ్యతి ॥ 169
వ్యాస 2-7-55

క. వనజాక్షుమహిమ నిత్యము
వినుతింపుచు నొరులు వొగడ వినుచున్ మదిలో
ననుమోదించుచు నుండెడు
జనములు దన్మోహవశతఁజనరు మునీంద్రా! 116
పోతన 2-7-215

* * *

## అధ్యాయము - 8

### పరీక్షితుఁడు శుకునిఁబ్రపంచోద్భవాదికం బడుగుట

**రాజోవాచ :**

శ్లో॥ బ్రహ్మణా చోదితో బ్రహ్మన్ గుణాఖ్యానేఽగుణస్య చ
యస్మై యస్మై యథా ప్రాహ నారదో దేవదర్శనః ॥ 170

ఏతద్వేదితుమిచ్ఛామి తత్త్వం వేదవిదాం వర ।
హరేరద్భుతవీర్యస్య కథా లోకసుమంగళాః ॥

కథయస్వ మహాభాగ యథాహమఖిలాత్మని ।
కృష్ణే నివేశ్య నిస్సంగం మనస్త్యక్ష్యే కళేబరమ్ ॥

శృణ్వతశ్శ్రద్ధయా నిత్యం గృణతశ్చ స్వచేష్టితమ్ ।
కాలేన నాతిదీర్ఘేణ భగవాన్ విశతే హృది ॥ 173

శ్లో॥ ప్రవిష్టః కర్ణరంధ్రేణ స్వానాం భావసరోరుహమ్ ।
ధునోతి శమలం కృష్ణస్సలిలస్య యథా శరత్ ॥ 174

ధౌతాత్మా పురుషః కృష్ణపాదమూలం న ముంచతి ।
ముక్తసర్వపరిక్లేశః పాంథస్స్వశరణం యథా ॥ 175

వ్యాస 2-8-1 నుండి 6

సీ. విను, శుకయోగికి మనుజేశుఁడిట్లను
మునినాథ! దేవదర్శనము గలుగఁ
నారదమునికిఁబంకేరుహభవుఁడెఱింగించిన
తెఱఁగు సత్కృప దలిర్ప
గణుతింప సత్త్వాది గుణ శూన్యుఁడగు
హరి కమలాక్షు లోకమంగళము లైన
కథలు నా కెఱింగింపఁగైకొని నిస్సంగ
మైన నా హృదయాబ్జమందుఁగృష్ణు

తే. భవ్యచరితుని నాద్యంత భావశూన్యుఁ
జిన్మయాకారు ననఘు లక్ష్మీసమేతు
నిలిపి యస్థిర విభవంబు నిఖిల హేయ
భాజనం బైన యీ కళేబరము విడుతు. 117

పోతన 2-8-217

వ. అదియునుంగాక యెవ్వఁడు శ్రద్ధాభక్తియుక్తుండై కృష్ణ గుణకీర్తనంబులు వినుచుం బలుకుచుండునట్టివాని హృదయపద్మంబు నందుఁగర్ణరంధ్ర మార్గంబునం బ్రవేశించి, కృష్ణుండు విశ్రమించి, సలిలగతం బైన కలుషంబును శరత్కాలంబు నివారించు చందంబున నాత్మగతంబయిన మాలిన్యంబు నపకర్షించును. 118

పోతన 2-8-218

శ్లో॥ యదధాతుమతో బ్రహ్మన్ దేహారంభోఽస్య ధాతుభిః ।
యదృచ్ఛయా హేతునా వా భవంతో జానతే యథా ॥ 176

ఆసీద్యదుదరాత్పద్మం లోకసంస్థానలక్షణమ్ ।
యావానయం వై పురుష ఇయత్తావయవైః పృథక్ ।
తావానసావితి ప్రోక్తస్సంస్థావయవవానివ ॥

అజస్సృజతి భూతాని భూతాత్మా యదనుగ్రహాత్ ।
దదృశే యేన తద్రూపం నాభిపద్మసముద్భవః ॥

స చాపి యత్ర పురుషో విశ్వస్థిత్యుద్భవాప్యయః ।
ముక్త్వాత్మమాయాం మాయేశశ్శేతే సర్వగుణాశ్రయః ॥ 179

వ్యాస 2-8-7 నుండి 10

వ. అదియునుం గాక సకల భూతసంసర్గ శూన్యంబైన యాత్మకు భూతసంగమం బే ప్రకారంబునం గలిగె? అది నిర్నిమిత్తంబునం జేసియో, కర్మంబునం జేసియో, యా క్రమంబు నా కెఱింగింపుము. 119

సీ. ఎవ్వని నాభియం దెల్ల లోకాంగ
సంస్థాన కారణ పంకజంబు వొడమె
నం దుదయించి సర్వావయవ స్ఫూర్తిఁ
దనరారునట్టి పితామహుండు
గణఁగి యెవ్వని యనుగ్రహమున నిఖిల
భూతముల సృజించె నుత్కంఠతోడ
నట్టి విధాత యే యనువున సర్వేశు
రూపంబు గనుఁగొనె రుచిర భంగి

తే. నా పరంజ్యోతియైన పద్మాక్షునకును
నళినజునకుఁబ్రతీక విన్యాస భావ
గతులవలనను భేదంబు గలదె? చెపుమ?
యతి దయాసాంద్ర? యోగికులాబ్ధిచంద్ర! 120

పోతన 2-8-220, 221

**శ్రీసూత ఉవాచ :**

శ్లో॥ ఆహ భాగవతం నామ పురాణం బ్రహ్మసమ్మితమ్ ।
బ్రహ్మణే భగవత్ప్రోక్తం బ్రహ్మకల్ప ఉపాగతే ॥ 180

వ్యాస 2-8-28

వ. బ్రహ్మరాతుండైన శుకయోగి బ్రహ్మ నారద సంవాదంబును, నేక సంప్రదాయానురాగతంబును, గతానుగతిక ప్రకారంబునునై తొల్లి సర్వేశ్వరుండు బ్రహ్మకల్పంబున బ్రహ్మ కుపదేశించిన భాగవత పురాణంబు వేదతుల్యంబు పరీక్షిన్మహారాజున కెఱింగింతు, విను, మని జెప్పె నని సూతుండు శౌనకాది మునులకుం జెప్పెను. 121

పోతన 2-8-222

## అధ్యాయము - 9

**శ్రీశుక ఉవాచ :**

శ్లో॥ ఆత్మమాయామృతే రాజన్! పరస్యానుభవాత్మనః ।
న ఘటేతార్థసంబన్ధః స్వప్నద్రష్టురివాంజసా ॥

బహురూప ఇవాభాతి మాయయా బహురూపయా ।
రమమాణో గుణేష్వస్యామమాహమితి మన్యతే ॥ 182

వ్యాస 2-9-1, 2

సీ. భూపాలకోత్తమ! భూతహితుండు
సుజ్ఞాన స్వరూపకుం డైన యట్టి
ప్రాణికి దేహసంబంధ మెట్లగు నన్న
మహి నొప్పు నీశ్వర మాయలేక
కలుగదు, నిద్రలోఁగలలోనఁదోఁచిన
దేహబంధంబుల తెఱఁగు వలెను
హరి యోగమాయా మహత్త్వంబునం
బాంచభౌతిక దేహ సంబంధుఁడగుచు

తే. నట్టి మాయాగుణంబుల నాత్మ యోలి
బాల్య కౌమార యౌవన భావములను
నర సుపర్వాది మూర్తులఁబొరసి యేను
నాయ దిది యను సంసార మాయఁదగిలి. 122

పోతన 2-9-223

శ్లో॥ యర్హి వావ మహిమ్ని స్వే పరస్మిన్ కాలమాయయోః ।
రమేత గతసంమోహస్త్యక్త్వోదాస్తే తతో భయమ్ ॥ 183

వ్యాస 2-9-3

వ. వర్తింపు చిట్లున్న జీవునికి భగవద్భక్తియోగంబున ముక్తి సంభవించుట యెట్లన్న నెప్పుడేని జీవుండు ప్రకృతి పురుషాతీత మయిన బ్రహ్మస్వరూపంబు నందు మహిత ధ్యాననిష్ఠుం డగునప్పుడు విగతమోహుండై యహంకార మమకారాత్మకంబైన సంసరణంబు దొలంగి ముక్తుండై యుండు. 123

పోతన 2-9-224

## వైకుంఠ పురవర్ణన

శ్లో॥ ప్రవర్తతే యత్ర రజస్తమస్తయో
స్సత్త్వం చ మిశ్రం న చ కాలవిక్రమః ।
న యత్ర మాయా కిముతాపరే హరే
రనువ్రతా యత్ర సురాసురార్చితాః ॥ 184

శ్యామావదాతాః శతపత్రలోచనాః
పిశంగవస్త్రాస్సురుచస్సువేశసః ।
సర్వే చతుర్బాహవ ఉన్మిషన్మణి
ప్రవేకనిష్కాభరణాస్సువర్చసః ॥

ప్రవాలవైదూర్యమృణాళవర్చసః
పరిస్ఫురత్కుండలమౌలిమాలినః ।
భ్రాజిష్ణుభిర్యః పరితో విరాజతే
లసద్విమానావలిభిర్మహాత్మనామ్ ॥

విద్యోతమానః ప్రమదోత్తమాద్యుభి
స్సవిద్యుదభ్రావళిర్యథా నభః ।
శ్రీర్యత్ర రూపిణ్యురుగాయ పాదయోః
కరోతి మానం బహుధా విభూతిభిః ॥

ప్రేంఖంశ్రితా యా కుసుమాకరానుగై
ర్విగీయమానా ప్రియకర్మ గాయతీ ।



దదర్శ తత్రాఖిలసాత్వతాంపతిం
శ్రియః పతిం యజ్ఞపతిం జగత్పతిమ్ ॥

సునందనంద ప్రబలార్హణాదిభి
స్స్వపార్షదముఖ్యైః పరిసేవితం విభుమ్ ।
భృత్యప్రసాదాభిముఖం దృగాసవం
ప్రసన్నహాసారుణలోచనాననమ్ ॥ 189

శ్లో॥ కిరీటినం కుండలినం చతుర్భుజం
పీతాంబరం వక్షసి లక్షితం శ్రియా ।
అధ్యర్హణీయాసనమాస్థితం పరం
వృతం చతుష్షోడశపంచశక్తిభిః ॥ 109

యుక్తం భగస్స్వైరితరత్రచాధ్రువై ।
స్స్వఏవధామన్ రమమాణమీశ్వరమ్ ॥

తద్దర్శనాహ్లాదపరిప్లుతాంతరో
హృష్యత్తనుః ప్రేమభరాశ్రులోచనః ।
ననామ పాదాంబుజమస్య విశ్వసృ
ద్యత్పారమహంస్యేన పథాభిగమ్యతే ॥

తం ప్రీయమాణం సముపస్థితం కవిం
ప్రజావిసర్గే నిజశాసనార్హణమ్ ।
బభాష ఈషత్స్మితశోచిషా గిరా
ప్రియః ప్రియం ప్రీతమనాః కరే స్పృశన్ ॥ 193

వ్యాస 2-9-10 నుండి 19

సీ. సూర్య చంద్రానల స్ఫురణలఁజొరనీక
నిజ దీధితి స్ఫూర్తి నివ్వటిల్ల

దివ్య మణిప్రభా దీపిత సౌధ విమాన
గోపుర హర్మ్య మండపములు
ప్రసవ గుచ్ఛ స్వచ్ఛ భరిత కామిత ఫల
సంతాన పాదప సముదయములు
కాంచన దండ సంగత మారు తోద్ధూత
తరళ విచిత్ర కేతన చయములు

తే. వికచ కైరవ దల దరవింద గత మ
రందరస పాన మోది తేందిందిర ప్ర
భూత మంజుల నినద ప్రబుద్ధ రాజ
హంస శోభిత వర కమలాకరములు. 124

సీ. వలనొప్పఁగా **"న దైవం కేశవా త్పరం"**
బని పల్కు రాజ కీరావళియును
మహిమ **"సర్వం విష్ణుమయం జగత్తు"**ని
చదివెడు శారికా సముదయంబు
నేపారఁగా **"జితం తే పుండరీకాక్ష!"**
యని లీలఁబాడు పికావళియును
లలి మీఱఁగా **"మంగళం మధుసూదన"**
యని పల్కు కేకు లనారతంబు

తే. తవిలి శ్రౌషడ్వషట్స్వధేత్యాది శబ్ద
కలితముగ మ్రోయు మధుప నికాయములును
గలిగి యఖిలైక దివ్యమంగళ విలాస
మహిమఁజెన్నొందు వైకుంఠ మందిరంబు. 125

వ. మఱియుం బయోధరావళీ విభాసిత నభంబుం బోలె వెలుంగుచున్న యద్దివ్య ధామంబునందు.



సీ. సలలితేందీవర శ్యామాయమానోజ్జ్వ
లాంగులు నవ్య పీతాంబరులును
ధవళారవింద సుందర పత్రనేత్రులు
సుకుమార తనులు భాసుర వినూత్న
రత్న విభూషణ గ్రైవేయ కంకణ
హార కేయూర మంజీర ధరులు
నిత్య యౌవనులు వినిర్మల చరితులు
రోచిష్ణులును హరిరూప ధరులు

తే. నగు సునందుండు నందుండు నర్హణుండు
ప్రబలుఁడును మొదలగు నిజపార్శ్వచరులు
మఱియు వైదూర్య విద్రుమామల మృణాళ
తుల్యగాత్రులుఁదను భక్తితో భజింప. 127

సీ. క్షాళితాఖిల కల్మషప్రజామర నదీ
జనక కోమల పదాబ్జములవాని
నఖిల సంప త్కార ణాపాంగ లక్ష్మీ వి
లాసిత వక్షస్థలంబువానిఁ
బద్మ మిత్రామిత్ర భాసిత కరుణా
తరంగిత చారు నేత్రములవాని
భువన నిర్మాణ నైపుణ భవ్య నిజ
జన్మకారణ నాభి పంకజమువాని

తే. నహి హితాహిత శయన వాహనములవాని
సేవితామర తాపసశ్రేణివాని
నఖిల లోకంబులకు గురుండైనవానిఁ
గాంచెఁబరమేష్ఠి కన్నుల కఱవు దీఱ.

క. కమనీయ రూపరేఖా
రమణీయతఁజాల నొప్పు రమణీమణి య
క్కమలాలాయ దన మృదు కర
కమలంబుల విభుని పాదకమలము లొత్తన్. 129

వ. వెండియు,

శా. శ్రీ కాంతాతిలకంబు రత్న రుచి రాజి ప్రేంఖిత స్వర్ణ డో
లాకేళిన్ విలసిల్లి త త్కచ భరాలంకార స్రగ్గంధ లో
భాకీర్ణ ప్రచర న్మధువ్రత మనో జ్ఞాలోల నాదంబు ల
స్తోకానుస్వర లీల నొప్పఁగ నిజేశున్ వేడ్కతోఁబాడఁగన్.

వ. అట్టి నిత్యవిభూతియందు

మ. సతత జ్ఞాన రమా యశో బల మహైశ్వర్యాది యుక్తుం జగ
త్పతి యజ్ఞేశు ననంతు నచ్యుతు దళ త్పం కేరుహాక్షుం శ్రియః
పతి నాద్యంత వికార దూరుఁగరుణా పాథోనిధిన్ సాత్వతాం
పతి వర్ధిష్ణు సహిష్ణు విష్ణు గుణ విభ్రాజిష్ణు రోచిష్ణునిన్. 131

మ. దరహాసామృత పూరితాస్య నిజభక్త త్రాణ పారాయణు
న్నరుణాంభోరుహ పత్రలోచనునిఁబీతావాసుఁద్రైలోక్యసుం
దరు మంజీర కిరీట కుండల ముఖోద్య ద్భూషు యోగీశ్వరే
శ్వరు లక్ష్మీయుత వక్షుఁజిన్మయు దయాసాంద్రున్ చతుర్బాహునిన్.

వ. మఱియు (ననర్ఘ రత్నమయ సింహాసనాసీనుండు సునంద నంద కుముదాది సేవితుండు) ప్రకృతి పురుష మహ దహంకారంబు లను చతుశ్శక్తులును, కర్మేంద్రియ జ్ఞానేంద్రియ మనో మహాభూతం బులను షోడశశక్తులును, పంచతన్మాత్రలును, పరివేష్టింపఁగోట్యర్క ప్రభా భాసితుండును, స్వేత రాలభ్యస్వాభావిక సమస్తైశ్వ ర్యాతిశయుండును, (స్వ స్వరూపంబునం



గ్రీడించు సర్వేశ్వరుండు నైన పరమపురుషుం బుండరీకాక్షు నారాయణుం జూచి సాంద్రానంద కందలిత హృదయార విందుండు, రోమాంచ కంచుకిత శరీరుండు, నానంద బాష్పధారాసిక్త కపోలుండు నగుచు.

క. వర పరమహంస గమ్య
స్ఫురణం దనరారు పరమపురుషుని పద పం
కరుహములకు నజుఁడు చతు
శ్శిరములు సోకంగ నతులు సేసిన హరియున్. 134

చ. ప్రియుఁడగు బొడ్డుతమ్మి తొలి బిడ్డని, వేలుపు పెద్ద, భూత సం
చయములఁబుట్టఁజేయు నిజ శాసనపాత్రు, నుపస్థితున్, మదిన్
దయ దళుకొత్తఁబల్కెఁబ్రమదస్మిత చారు ముఖారవిందుఁడై
నయమునఁబాణిపంకజమునన్ హరి యాతని దేహమంటుచున్. 135

పోతన 2-9-227 నుండి 240

**శ్రీభగవానువాచ :**

శ్లో॥ వరం వరయ భద్రం తే వరేశం మాభివాంఛితమ్ ।
బ్రహ్మన్ శ్రేయః పరిశ్రామః పుంసాం మద్దర్శనావధిః ॥ 194

మనీషితానుభావోఽయం మమ లోకావలోకనమ్ ।
యదుపశ్రుత్య రహసి చకర్థ పరమం తపః ॥

ప్రత్యాదిష్టం మయా తత్ర త్వయి కర్మవిమోహితే ।
తపో మే హృదయం సాక్షాదాత్మాహం తపసోఽనఘ ॥

సృజామి తపసైవేదం గ్రసామి తపసా పునః ।
బిభర్మి తపసా విశ్వం వీర్యం మే దుశ్చరం తపః ॥ 197

వ్యాస 2-9-21 నుండి 24

చ. సరసిజగర్భ! నీయెడఁబ్రసన్నత నొంది మదీయ లోక మే
నిరవుగఁజూపు టెల్లను సహేతుక భూరి దయాకటాక్ష వి
స్ఫురణను గాని నీదగు తపో విభవంబునఁగాదు నీ తప
శ్చరణము నాదువాక్యముల సంగతిఁగాదె! పయోరుహాసనా!

క. తప మనఁగ నాదుహృదయము
దప మను తరువునకు ఫల వితానము నే నా
తపముననే జననస్థి
త్యుపసంహరణము లొనర్చుచుండుదుఁదనయా! 137

క. కావున, మద్భక్తికిఁదప
మే విధమున మూలధనము యిది నీ మది రా
జీవభవ! యెఱిఁగి తప మిటు
కావించుట విగత మోహకర్ముఁడ వింకన్. 138

పోతన 2-9-243,244,245

## బ్రహ్మదేవుఁడు శ్రీహరిని తత్త్వార్థంబు నడుగుట

**శ్రీ బ్రహ్మోవాచ :**

శ్లో॥ భగవన్ సర్వభూతానామధ్యక్షోఽవస్థితోగుహామ్ ।
వేద హ్యప్రతిరుద్ధేన ప్రజ్ఞానేన చికీర్షితమ్ ॥ 198

తథాపి నాథమానస్య నాథ నాథయ నాథితమ్ ।
పరావరే యథా రూపే జానీయాం తే త్వరూపిణః ॥

యథాత్మమాయాయోగేన నానాశక్త్యుపబృంహితమ్ ।
విలుంపన్ విసృజన్ గృహ్ణన్ బిభ్రదాత్మానమాత్మనా ॥

క్రీడస్యమోఘసంకల్ప ఊర్ణనాభిర్యథోర్ణుతే ।
తథా తద్విషయాంధేహి మనీషాం మయి మాధవ ॥



భగవచ్ఛిక్షితమహం కరవాణి హ్యతంద్రితః ।
నేహమానః ప్రజాసర్గం బద్ధ్యేయం యదనుగ్రహాత్ ॥

యావత్సఖాసఖ్యురివేశ తే కృతః
ప్రజావిసర్గే విభజామి భో జనమ్ ।
అవిక్లబస్తే పరికర్మణి స్థితో
మా మే సమున్నద్ధమదోఽజమానినః ॥ 203

వ్యాస 2-9-25 నుండి 30

వ. దేవా! సర్వ భూతాంతర్యామివై భగవంతుండవైన నీకు నమస్కరించి మదీయ వాంఛితంబు విన్నవించెద నవధరింపుము. అవ్యక్తరూపంబులై వెలుంగు భవదీయ స్థూల సూక్ష్మ రూపంబులును, నానా శక్త్యుపబృంహితంబులైన బ్రహ్మాది రూపంబులును, నీయంత నీవే ధరియించి జగదుత్పత్తి స్థితి లయంబులం దంతు కీటకంబునుం బోలెం గావింపుచు నమోఘ సంకల్పుండవై లీలావిభూతిం గ్రీడించు మహిమంబు దెలియునట్టి పరిజ్ఞానంబుఁ గృపసేయుము. భవదీయ శాసనంబున జగన్నిర్మాణంబు గావించు నపుడు బ్రహ్మాభి మానంబునం జేసి యవశ్యంబును మహ దహంకారంబులు నా మదిం బొడముం గావునం ద త్పరిహారార్థంబు వేఁడెద. నన్నుం గృపాదృష్టి విలోకించి దయసేయు మని విన్నవించెను. 139

పోతన 2-9-248

## చతుఃశ్లోకీ భాగవతము

## శ్రీమన్నారాయణుండు బ్రహ్మకు భాగవతం బుపదేశించుట

**శ్రీ భగవానువాచ :**

శ్లో॥ "అహమేవాసమేకోఽగ్రే నాన్యద్యత్సదసత్పరమ్ ।
పశ్చాదహం యదేతచ్చ యోఽవశిష్యేత సోఽస్మ్యహమ్ ॥ 204

ఋతేఽర్థం యత్ప్రతీయేత న ప్రతీయేత చాత్మని ।
తద్విద్యాదాత్మనో మాయాం యథాభాసో యథా తమః ॥

యథా మహంతి భూతాని భూతేషూచ్చా వచేష్వను ।
ప్రవిష్టాన్యప్రవిష్టాని తథా తేషు న తేష్వహమ్ ॥

ఏతావదేవ జిజ్ఞాస్యం తత్త్వజిజ్ఞాసునాత్మనః ।
అన్వయవ్యతిరేకాభ్యాం యత్స్యాత్సర్వత్ర సర్వదా" ॥ 207

వ్యాస 2-9-33 నుండి 36

**గమనిక :** (చతుఃశ్లోకీ భాగవతము 15, 16, 17 పేజీలలో వివరింపబడినది. యీ నాలుగు శ్లోకములలో సర్వోపనిత్సారము మఱియు భాగవతసారము నిమిడియుండుటచే నిత్యపారాయణార్హమని పెద్దల అభిప్రాయము.)

**శ్రీశుక ఉవాచ :**

శ్లో॥ సంప్రదిశ్యైవమజనో జనానాం పరమేష్ఠినమ్ ।
పశ్యత స్తస్య తద్రూపమాత్మనో న్యరుణద్ధరిః ॥ 208

అంతర్హితేంద్రియార్థాయ హరయే విహితాంజలిః ।
సర్వభూతమయో విశ్వం ససర్జేదం స పూర్వవత్ ॥

ప్రజాపతిర్ధర్మపతిరేకదా నియమాన్ యమాన్ ।
భద్రం ప్రజానామన్విచ్ఛన్నాతిష్ఠ త్స్వార్థకామ్యయా ॥ 210

వ్యాస 2-9-38 నుండి 40

సీ. అవనీశ! బ్రహ్మ యి ట్లంతర్హితుండైనఁ
బుండరీకాక్షుని బుద్ధి నిలిపి
యానందమును బొంది యంజలి గావించి
త త్పరిగ్రహమునఁదనదు బుద్ధి



గైకొని పూర్వప్రకారంబునను సమస్త
ప్రపంచం బెల్లఁదగ సృజించి
మఱియొకనాఁడు ధర్మప్రవర్తకుఁడౌచు
నఖిల ప్రజాపతి యైన కమల

తే. గర్భుఁడాత్మహితార్థమై కాక సకల
భువనహిత బుద్ధి నున్నత స్ఫురణ మెఱసి
మానితంబైన యమ నియమముల రెంటి
నాచరించెను సమ్మోదితాత్ముఁడగుచు. 140

పోతన 2-9-253

శ్లో॥ తుష్టం నిశామ్య పితరం లోకానాం ప్రపితామహమ్ ।
దేవర్షిః పరిపప్రచ్ఛ భవాన్ యన్మా నుపృచ్ఛతి ॥ 211

తస్మాదిదం భాగవతం పురాణం దశలక్షణమ్ ।
ప్రోక్తం భగవతా ప్రాహ పీతః పుత్రాయ భూతకృత్ ॥

నారదః ప్రాహ మునయే సరస్వత్యాస్తటే నృప ।
ధ్యాయతే బ్రహ్మ పరమం వ్యాసాయాఽమితతేజసే ॥

యదుతాఽహం త్వయా పృష్టో వై రాజా త్పురుషాదిదమ్ ।
యథాఽసీ త్తదుపాఖ్యాస్యే ప్రశ్నానన్యాంశ్చ కృత్స్నశః ॥

వ్యాస 2-9-43 నుండి 46

సీ. అవనీశ! నీవు న న్నడిగినపగిది నతఁడు
దంట్రి నడుగఁబితామహుండు
భగవంతుఁడాశ్రిత పారిజాతము హరి
గృహతోడఁదన కెఱిఁగించినట్టి

లోకమంగళ చతుఃశ్లోక రూపంబును
దశ లక్షణంబులఁదనరు భాగ
వతము నారదున కున్నతిఁజెప్పె నాతఁడు
చారు సరస్వతీ తీరమునను

తే. హరిపద ధ్యాన పారీణుఁడాత్మవేది
ప్రకట తేజస్వి యగు బాదరాయణునకుఁ
గోరి యెఱిఁగించె నమ్మహోదారుఁడెలమి
నాకుఁనెఱిఁగించె నెఱిగింతు నీకు నేను. 141

వ. అదియుంగాక యిపుడు విరాట్పురుషునివలన నీ జగంబు లే విధంబున జనియించె, ననియెడి మొదలైన కొన్ని ప్రశ్నలు న న్నడిగితివి. ఏను నన్నింటికి నుత్తరం బగునట్లుగా న మ్మహాభాగవతం బుపన్యసించెద. ఆకర్ణింపుము. 142

పోతన 2-9-257, 258

* * *

## అధ్యాయము - 10

### శ్రీమద్భాగవత పురాణము - దశలక్షణములు

**బాదరాయణిరువాచ :**

శ్లో॥ అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణ మూతయః ।
మన్వంతరేశానుకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥ 215

దశమస్య విశుద్ధ్యర్థం నవానామిహ లక్షణమ్ ।
వర్ణయంతి మహాత్మనః శ్రుతేనార్థేన చాంజసా ॥ 216

వ్యాస 2-10-1, 2

వ. అ మ్మహాపురాణంబు చతుఃశ్లోక రూపంబున దశ లక్షణంబుల సంకుచిత మార్గంబుల నొప్పు. అందు దశ లక్షణంబు లెయ్యవి? యనిన సర్గంబును, విసర్గంబును, స్థానంబును, పోషణంబును, ఊతులును, మన్వంతరంబులును, ఈశాను చరితంబును, నిరోధంబును, ముక్తియు, నాశ్రయంబు ననం బది తెఱంగులయ్యె. దశమ విశుద్ధ్యర్థంబు తక్కిన తొమ్మిది లక్షణంబులు సెప్పంబడె. 143

పోతన 2-10-259

**దశలక్షణములు :**

1. సర్గము= మహ దహంకార పంచతన్మాత్ర ఇంద్రియ భూతపంచ ప్రపంచ సృష్టి. 2.విసర్గము= విరాట్పురుషుని వలనం జనించిన చరాచర భూతసృష్టి. 3.స్థానము= శ్రీహరి అవతారము లెత్తి జగత్తును పాలించుట. 4.పోషణము= శ్రీహరి నిజభక్త జనోద్ధరణము చేయుట. 5.ఊతులు= కర్మవాసనలు, పుణ్యపాపములు. 6.మన్వంతరములు= 14 మనువుల చరిత్రలు వారి ధర్మములు. 7. ఈశానుకథలు= శ్రీహరి అవతార కథలు, భక్తుల చరిత్రలు. 8.నిరోధము= శ్రీమన్నారాయణుని యోగనిద్ర, దుష్టశిక్షణ, శిష్టరక్షణ. 9.ముక్తి= అవిద్య త్యజించి, నిశ్చలభక్తిచే, స్వస్వరూపమున శ్రీహరి

రూపమొందుట. 10.ఆ(శయము= సృష్టి స్థితి లయము లెవ్వని వలన గలిగినవో ఆతcడే (పరమాత్మయే) ఆ(శయము. 144

శ్లో॥ నిరోధోఽస్యానుశయనమాత్మనస్సహశక్తిభిః ।
ముక్తిర్హిత్వాన్యథారూపం స్వరూపేణ వ్యవస్థితిః ॥ 217

ఆభాసశ్చ నిరోధశ్చ యతస్త్వధ్యవసీయతే ।
స ఆ(శయః పరం (బహ్మ పరమాత్మేతి శబ్ద్యతే ॥ 218

వ్యాస 2-10-6, 7

సీ. వసుమతీనాథ! సర్వస్వామియైన గో
విందుండు చిదచి దానందమూర్తి
సలిలత స్వోపాధి శక్తిసమేతుcడై
తనరారు నాత్మీయ ధామమందు
ఫణిరాజ మృదుల తల్పంబుపై సుఖలీల
యోగని(ద్రారతి నున్న వేళ
నఖిల జీవులు నిజ వ్యాపార శూన్యులై
యున్నత తేజంబు లురలుకొనగc

తే. జరగు నయ్యవస్థా విశేషంబు లెల్ల
విదిత మగునట్లు పలుకుట యది నిరోధ
మన నిది యవాంతర(ప్రళయం బనంగc
బరcగు నిcక ముక్తిగతి విను పార్థివేం(ద! 145

సీ. జీవుండు భగవత్కృపా వశంబునcజేసి
దేహ ధర్మంబులై ధృతి ననేక
జన్మానుచరిత దృశ్యము లైన య
జ్జరా మరణంబు లాత్మధర్మంబు లైన
ఘన పుణ్యపాప నికాయ నిర్మోచన
స్థితి నొప్పి పూర్వసంచితము లైన



యపహత పాప్మవత్త్వా ద్యష్టతద్గుణ
వంతుcడై తగ భగవ చ్ఛరీర

తే. భూతుcడై పారతం(త్ర్యాత్మ బుద్ధి నొప్పి
దివ్యమా ల్యానులేపన భవ్యగంధ
కలిత మంగళ దివ్య వి(గహవిశిష్టుc
డగుచు హరిరూప మొందుటే యనఘ! ముక్తి. 146

పోతన 2-10-266, 267

శ్లో॥ యోఽధ్యాత్మికోఽయం పురుషస్సోఽసావేవాధిదైవికః ।
యస్త(త్రోభయవిచ్ఛేదస్సస్మృతో హ్యాధిభౌతికః ॥ 219

ఏకమేకతరాభావే యదా నోపలభామహే ।
(త్రితయం త(త యో వేద స ఆత్మా స్వా(శయా(శయః ॥

పురుషోఽండం వినిర్భిద్య యదాసౌ స వినిర్గతః ।
ఆత్మనోఽయనమన్విచ్ఛన్నపోఽ(స్రాక్షీచ్ఛుచిశ్శుచీః ॥

తాస్వవాత్సీత్స్వసృష్టాను సహ(స్రపరివత్సరాన్ ।
తేన నారాయణో నామ యదాపః పురుషోద్భవాః ॥

(ద్రవ్యం కర్మ చ కాలశ్చ స్వభావో జీవ ఏవ చ ।
యదను(గహతస్సంతి న సంతి యదుపేక్షయా ॥ 223

శ్లో॥ ఏకో నానాత్వమన్విచ్ఛన్ యోగతల్పాత్సముత్థితః ।
వీర్యం హిరణ్మయం దేహం మాయయా వ్యసృజత్త్రిధా ॥ 224

అధిదైవమథాధ్యాత్మమధిభూతమితి (ప్రభుః ।
యదేకం పౌరుషం వీర్యం (త్రిధాఽభిద్యత తచ్ఛృణు ॥ 225

వ్యాస 2-10-8 నుండి 14

వ. మఱియు నుత్పత్తి స్థితి లయంబు లెందు నగుచుఁబ్రకాశింపఁబడు నది యాశ్రయం బనంబడు. అదియ పరమాత్మ. బ్రహ్మ శబ్దవాచ్యంబు నదియ ప్రత్యక్షానుభవంబున విదితంబు సేయుకొఱకు నాత్మ యాధ్యాత్మికాది విభాగంబు సెప్పంబడియె. అది యెట్లనిన నాత్మ యాధ్యాత్మి కాధిదైవి కాధిభౌతికంబులఁద్రివిధం బయ్యె. అందు నాధ్యాత్మికంబు చక్షురాది గోళ కాంతర్వర్తియై యెఱుంగం బడు. చక్షురాది కరణాభిమానియై ద్రష్టయైన జీవుండె యాధిదైవికుం డనందగు. చక్షురాద్యధిష్ఠా నాభిమాన దేవతయు, సూర్యాది తేజోవిగ్రహుండు నగుచు నెవ్వనియందు నీ యుభయ విభాగంబునుం గలుగు నతండె యాధిభౌతికుండు, విరాడ్విగ్రహుండు నగుం గావున, ద్రష్టయు దృక్కు దృశ్యంబు ననందగు మూఁటియందు నొకటి లేకున్న నొకటి గానరాదు. ఈ త్రితయంబు నెవ్వఁడెఱుంగు నతండు సర్వ లోకాశ్రయుండై యుండు. అతండె పరమాత్మయు. అమ్మహాత్ముండు లీలార్థంబై జగత్సర్జనంబు సేయు తలంపున బ్రహ్మాండంబు నిర్భేదించి తనకు సుఖస్థానంబు నపేక్షించి మొదల శుద్ధంబులగు జలంబుల సృజియించె. స్వతః పరిశుద్ధుండు గావున స్వ సృష్టం బగు నేకార్ణ వాకారంబైన జలరాశియందు శయనంబు సేయుటం జేసి,

శ్లో॥ ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః ।
తా యస్యాయతనం పూర్వం తేన నారాయణ స్స్మృతః ॥

అను ప్రమాణము చొప్పున నారాయణ శబ్దవాచ్యుండు గావున నతని ప్రభావంబు వర్ణింప దుర్లభంబు. ఉపాదానభూతంబైన ద్రవ్యంబును, ద్రివిధంబైన కర్మంబును, గళా కాష్ఠా ద్యుపాధి భిన్నంబైన కాలంబును, జ్ఞానాధికంబగు జీవస్వభావంబును, భోక్తయగు జీవుండును, నెవ్వని యనుగ్రహంబునంజేసి వర్తింపుచుండు, నెవ్వని యుపేక్షంజేసి వర్తింపకుండు, నట్టి ప్రభావంబుగల సర్వేశ్వరుండు దా నేకమయ్యు ననేకంబుగాఁదలంచి యోగతల్పంబునం బ్రబుద్ధుండై యుండు. అట మీఁద స్వ సంకల్పంబునం



జేసి తన హిరణ్మయంబైన విగ్రహంబు నధిదైవంబు నధ్యాత్మకంబు నధిభూతంబు నను సంజ్ఞాయుతంబైన త్రివిధంబుగా సృజియించె. 147

పోతన 2-10-268

శ్లో॥ అంతశ్శరీర ఆకాశాత్పురుషస్య విచేష్టతః ।
ఓజస్సహోబలం జజ్ఞే తతః ప్రాణో మహానసుః ॥ 226

అనుప్రాణంతి యం ప్రాణాః ప్రాణంతం సర్వజంతుషు ।
అపానం తమసానంతి నరదేవమివానుగాః ॥

ప్రాణేన క్షిపతా క్షుత్తృడంతరా జాయతే విభోః ।
పిపాసతో జక్షతశ్చ ప్రాఙ్ముఖం నిరభిద్యత ॥

ముఖతస్తాలునిర్భిన్నం జిహ్వా తత్రోపజాయతే ।
తతో నానారసో జజ్ఞే జిహ్వయా యోఽధిగమ్యతే ॥ 229

వ్యాస 2-10-15 నుండి 18

సీ. అట్టి విరా డ్విగ్రహాంత రాకాశంబు
వలన నోజ స్సహోబలము లయ్యెఁ
బ్రాణంబు సూక్ష్మరూప క్రియాశక్తిచే
జనియించి ముఖ్యాసు వనఁగఁబరఁగె
వెలువడి చను జీవి వెనుకొని ప్రాణముల్
చనుచుండు నిజనాథు ననుసరించు
భటుల చందంబునఁబాటిల్లు క్షుత్తును
భూరి తృష్ణయు మఱి ముఖము వలనఁ

తే. దాలుజిహ్వాదికంబు లుద్భవము నొందె
నందు నుదయించె జిహ్వయు నందు రసము
లెల్లనుదయించి జిహ్వచే నెఱుఁగఁబడును
మొనసి పలుక నపేక్షించు ముఖమువలన. 148

పోతన 2-10-269

శ్లో॥ అమునీ భగవద్రూపే మయా తే హ్యనువర్ణి తే ।
ఉభే అపి న గృహ్ణంతి మాయాసృష్టే విపశ్చితః ॥ 230

స వాచ్యవాచకతయా భగవాన్ బ్రహ్మ రూపధృత్ ।
నామరూపక్రియా ధత్తే సకర్మాకర్మకః పరః ॥ 231

వ్యాస 2-10-35, 36

సీ. అలఘు తేజోమయం బైన రూపం బిది
క్షితినాథ నాచేతఁజెప్పఁబడియె
మానిత స్థూల సూక్ష్మ స్వరూపంబుల
వలన నొప్పెడు భగవ త్స్వరూప
మ మ్మహాత్మకుని మాయా బలంబునఁజేసి
దివ్యమునీంద్రులు దెలియలేరు
వసుధేశ వాచ్యమై వాచకంబై నామ
రూపముల్ గ్రియలును రూఢిఁదాల్చి

ఆ. యుండునట్టి యీశ్వరుండు నారాయణుం
డఖిలధృతి జగ న్నియంతయైన
చిన్మయాత్మకుండు సృజియించు నీ ప్రజా
పతుల ఋషులను బితృతతుల నపుడు. 149

పోతన 2-10-274

శ్లో॥ ఇత్థం భావేన కథితో భగవాన్ భగవత్తమః ।
నేత్థం భావేన హి పరం ద్రష్టుమర్హంతి సూరయః ॥ 232

నాస్య కర్మణి జన్మాదౌ పరస్యాను విధీయతే ।
కర్తృత్వప్రతిషేధార్థం మాయయారోపితం హి తత్ ॥ 233

వ్యాస 2-10-44, 45



క. ఈపగిదిని విశ్వము సం
స్థాపించును మనుచు నణఁచు ధర్మాత్మకుఁడై
దీపిత తిర్య జ్నర సుర
రూపంబులు దానె తాల్చి రూఢి దలిర్పన్.

సీ. హరియందు నాకాశ, మాకాశమున వాయు,
వనిలంబు వలన హుతాశనుండు,
హవ్యవాహనునందు నంబువు, లుదకంబు
వలన వసుంధర, గలిగె ధాత్రి
వలన బహుప్రజావళి యుద్భవం బయ్యె,
నింతకు మూలమై యెసఁగునట్టి
నారాయణుఁడు చిదానంద స్వరూపకుం
డవ్యయుఁడజరుఁడనంతుఁడాఢ్యుఁ

తే. డాది మధ్యాంత శూన్యుం డనాదినిధనుఁ
డతనివలనను సంభూత మైన యట్టి
సృష్టి హేతు ప్రకార మీక్షించి తెలియఁ
జాల రెంతటి మునులైన జనవరేణ్య! 151

వ. అదియునుం గాక,

మ. ధరణీశోత్తమ! భూతసృష్టి నిటు సంస్థాపించి రక్షించు నా
హరి కర్తృత్వము నొల్లఁడాత్మగత మాయారోపితం జేసి తా
నిరవద్యుండు నిరంజనుండు పరుఁడున్ నిష్కించనుం డాఢ్యుఁడున్
నిరపేక్షుండును నిష్కళంకుఁడగుచున్ నిత్యత్వమున్ బొందెడిన్. 153

పోతన 2-10-277 నుండి 280

ఉ. రామ! గుణాభిరామ! దినరాజ కులాంబుధిసోమ! తోయద
శ్యామ! దశానన ప్రబల సైన్య విరామ! సురారిగోత్ర సు

త్రామ! సుబాహు బాహుబల దర్పతమః పటు తీవ్ర ధామ! ని
ష్కామ! కుభృల్లలామ! గరకంఠ సతీ సుత నామ! రాఘవా!

క. అమరేంద్రసుత విదారణ!
కమలాప్త తనూజ రాజ్యకారణ! భవ సం
తమస దినేశ్వర! రాజో
త్తమ! దైవత సార్వభౌమ! దశరథరామా!

**మాలిని.** నిరుపమ గుణజాలా! నిర్మలానంద లోలా!
దురిత ఘన సమీరా! దుష్ట దైత్య ప్రహారా!
శరధి మద విశోషా! చారు సద్భక్త పోషా!
సరసిజ దళనేత్రా! సజ్జన స్తోత్ర పాత్రా! 156

పోతన 2-10-286 నుండి 288

*ఇతి ద్వితీయస్కన్ధః సమాప్తః*
*హరిః ఓమ్*
*శ్రీకృష్ణార్పణమస్తు.*

* * *

*ఓమ్ నమో భగవతే వాసుదేవాయ*

# శ్రీమద్భాగవత మణిహారము

## 14. తృతీయ స్కంధము

శ్లో॥ యస్య భాసా విభాతీదం సర్వం సదసదాత్మకమ్ ।
సర్వాధారం సదానన్దం స్వాత్మానం తం హరిం భజే ॥

క. శ్రీమహిత వినుత దివిజ
స్తోమ! యశస్సీమ! రాజసోమ! సుమేరు
స్థేమ వినిర్జిత భార్గవ
రామ! దశానన విరామ! రఘుకులరామా!

* * *

### అధ్యాయము - 2

### ఉద్ధవుండు విదురునకు కృష్ణాదుల వృత్తాంతంబు దెలియఁజేయుట

**ఉద్ధవ ఉవాచ :**

శ్లో॥ యన్మర్త్యలీలౌపయికం స్వయోగ
మాయాబలం దర్శయతా గృహీతమ్ ।
విస్మాపనం స్వస్య స సౌభగర్ధేః
పరం పదం భూషణ భూషణాంగమ్ ॥ 1

యద్ధర్మసూనోర్బత రాజసూయే
నిరీక్ష్య దృక్స్వస్త్యయనం త్రిలోకః ।
కార్త్స్న్యేన చాద్యేహగతం విధాతు
రర్వాక్సృతౌ కౌశలమిత్యమన్యత ॥ 2

శ్లో॥ యస్యానురాగప్లుతహాసరాస
లీలావలోక ప్రతిలబ్ధమానాః ।

ప్రజస్త్రియో దృగ్భిరను ప్రవృత్త
ధియోఽవతస్థుః ఖిలకృత్యశేషాః ॥ 3
వ్యాస 3-2-12, 13, 14

సీ. మర్త్యవికాసైక మానమై తనకును
విస్మయ జనకమై వెలయు నట్టి
యాత్మీయ యోగ మాయాశక్తిఁజేపట్టి
చూపుచు నత్యంత సుభగుఁడగుచు
భూషణంబులకును భూషణంబై వివే
కముల కెల్లను బరాకాష్ఠ యగుచు
సకల కల్యాణ సంస్థానమై సత్యమై
తేజరిల్లెడు నట్టి దివ్యమూర్తి

తే. తాన తనమూర్తి నిజశక్తిఁదగ ధరింప
యమతనూభవు రాజసూయాధ్వరంబు
నందు నెవ్వని శుభమూర్తి నఖిల జనులు
నిండు వేడుకఁజూచి వర్ణించి రెలమి. 1

క. ప్రకటముగఁగమలభవ సృ
ష్టికిఁగారణ మి మ్మహాత్ముఁడే యనుచును ను
త్సుకులై తన్మూర్తిని ద
ప్పక చూచిరి కాదె త త్సభా జను లెల్లన్. 2

వ. మఱియు శాంతోగ్రరూపధరుం డైన సర్వేశ్వరుండు శాంతరూపుండు గావునఁ, బరకృతాపరాధ నిపీడ్యమాన మానసుం డయ్యు ననుకంపాయత్త చిత్తుండై వర్తించు. పరాపరుండును, ప్రకృతి కార్యం బయిన మహత్తత్త్వ రూపుండును, జనన విరహితుం డయ్యును దారువులవలన ననలంబు దోఁచు చందంబున జననంబు నొందుచుండు. అట్టి సరోజనాభుని హాస రాస లీలానురాగ విలోకన ప్రతిలబ్ధమాన లైన గోపకామినులు ద న్మూర్తి దర్శ నానుషక్త మనీషలం గలిగి వర్తించిరి. 3
పోతన 3-2-89, 90, 91

## అధ్యాయము - 5

## విదుర మైత్రేయ సంవాదము

**విదుర ఉవాచ :**

శ్లో॥ సుఖాయ కర్మాణి కరోతి లోకో
న తైస్సుఖంవాన్యదుపారమం వా ।
విందేత భూయ స్తతఏవ దుఃఖం
యదత్ర యుక్తం తు భవాన్ వదేన్నః ॥ 4

జనస్య కృష్ణాద్విముఖస్య దైవా
దధర్మశీలస్య సుదుఃఖితస్య ।
అనుగ్రహాయేహ చరంతి నూనం
భూతాని భవ్యాని జనార్దనస్య ॥ 5
వ్యాస 3-5-2, 3

వ. ఇట్లు మైత్రేయుఁగనుంగొని యమ్మునీంద్రుని పాదంబులకుం బ్రణమిల్లి ముకుళితహస్తుండై విదురుఁడు ఇట్లనియె. మునీంద్రా! లోకంబున సకలజనంబులు మనంబులు ఘనంబు లగు సౌఖ్యము లందం దలంచి త త్ఫల ప్రాప్తి హేతువులైన కర్మంబు లాచరించి దైవోపహతులై త త్కర్మంబులచేత నిష్ఫలారంభు లగుదురు. కర్మంబులు బంధ కరంబులు, దుఃఖహేతువులుం గాని సౌఖ్యదాయకంబులై పాపనిష్కృతిఁజేయ నోపవు. అది యట్లుండె.

భూరి దుఃఖానుసారం బైన సంసార చక్రంబునం బరిభ్రమింపుచుం గామ విమోహితులై పూర్వ కర్మానుగతంబులైన శరీరంబులు దాల్చుచుఁ జచ్చుచు మరలం బుట్టుచు నెంతకాలంబునకుం బాపనిష్కృతిఁగానక మాతృ యౌవన వన కుఠారులై జనియించి వర్తించు మూఢాత్ములం బశుప్రాయుల రక్షించుకొఱకుఁగాదె నారాయణ పరాయణు లైన మీవంటి పుణ్యాత్ములు లోకంబునం జరియించుట. 4
పోతన 3-5-181

శ్లో॥ కస్సృప్నుయా త్త్రీర్థపదాఽభిధానాత్
సత్రేషు వః సూరిభిరీడ్యమానాత్ ।
యః కర్ణనాడీం పురుషస్య యాతో
భవప్రదాం గేహరతిం ఛినత్తి ॥ 6

వ్యాస 3-5-11

**తరల :** సతతమున్ సరసీరుహోదర సత్కథామృత పూరమున్
శ్రుతి పుటాంజలి చేత నిమ్ముల జుఱ్ఱియుం దనివోదు భా
రత కథామిష మూని విష్ణుఁబరాశర ప్రియ సూతి స
న్మతి నుతించినచోట సన్మునినాథ! నా మది నుబ్బుదున్. 5

పోతన 3-5-185

శ్లో॥ సా శ్రద్ధధానస్య వివర్ధమానా
విరక్తి మన్యత్ర కరోతి పుంసామ్ ।
హరేః కథానుస్మృతినిర్వృతస్య
సమస్తదుఃఖాప్యయమాశు ధత్తే ॥

శ్లో॥ తాన్ శోచ్యశోచ్యానవిదోఽనుశోచే
హరేః కథాయాం విముఖా నరా యే ।
క్షిణోతి దేవోఽనిమిషస్తు తేషా
మాయుర్వృథా వాదగతిస్మృతీనామ్ ॥ 8

వ్యాస 3-5-13, 14

క. సరసిరుహోదరు మంగళ
చరితామృత మాత్మఁగ్రోలు జనుఁడితర కథా
గరళము గ్రోలునె? హరి సం
స్మరణము జీవులకు నఖిల సౌఖ్యద మనఘా! 6



క. శ్రీ వనితాధిప నామక
థా విముఖుల కిహము పరము దవ్వై పిదపం
బోవుదురు నరకమునకున్
వావిరి నే వాటిఁజూచి వగతు మునీంద్రా!

క. ఏ నరుఁడే నొక నిమిషం
బైన వృథావాద గతిని హరిపదకమల
ధ్యానా నందుఁడు గాఁడే
నానరునకు నాయు వల్పమగు మునినాథా! 8

పోతన 3-5-191, 192, 193

**దేవా ఊచుః :**

శ్లో॥ నమామి తే దేవ పదారవిన్దం
ప్రపన్న తాపోపశమాతపత్రమ్ ।
యన్మూలకేతాయతయోఽంజసోరు
సంసారదుఃఖం బహిరుత్ క్షిపన్తి ॥ 9

వ్యాస 3-5-38

**దండకము :** శ్రీనాథ నాథా! జగన్నాథ! నమ్రైకరక్షా విపక్ష! క్షమా భృత్సహస్రాక్ష! నీరేజపత్రేక్షణా! దేవదేవా! భవద్దాస వర్గానుతాపంబులం బాపఁగా నోపు దివ్యాత పత్రంబు నాఁబోల్చు యుష్మత్పదాంభోజ మూలంబు పుణ్యాలవాలం బుగాఁబొంది యోగీంద్రు లుద్దామ సంసార తాపంబులం బాయఁగా మీఁటి వర్తింతురో తండ్రి యీశా! 9

పోతన 3-5-203

* * *

# అధ్యాయము - 7

**మైత్రేయ ఉవాచ :**

శ్లో॥ సవై నివృత్తిధర్మేణ వాసుదేవానుకంపయా ।
భగవద్భక్తియోగేన తిరోధత్తే శనైరిహ ॥ 10

యదేంద్రియోపరమోఽథ ద్రష్టాత్మని పరే హరౌ ।
విలీయంతే యథాక్లేశాస్సంసుప్తస్యేవ కృత్స్నశః ॥

అశేషసంక్లేశశమం విధత్తే
గుణానువాద శ్రవణం మురారేః ।
కిం వా పునస్త చ్చరణారవింద
పరాగసేవారతిరాత్మలబ్ధా ॥ 12

వ్యాస 3-7-12, 13, 14

వ. జీవునకు నవిద్యా మహిమం జేసి, కర్మ బంధనాదికంబు సంప్రాప్తం బగుం గాని సర్వ భూతాంతర్యామి యైన యీశ్వరునకుఁ బ్రాప్తంబు గానేర దని వెండియు. 10

చ. నరునకు నాత్మ దేహజ గుణంబులఁబాపఁగ నోవుఁబంకజో
దర చరణారవింద మహితస్ఫుట భక్తియ యింద్రియంబు లీ
శ్వర విషయంబు లైన మది సంచిత నిశ్చల తత్త్వమైనచో
సరసిజ నేత్రు కీర్తనమె చాలు విపద్దశలం జయింపఁగన్. 11

చ. హరి చరణారవింద యుగళార్చన సన్నుతి భక్తి యోగముల్
నిరతము గల్గువారె భవ నీరజ గర్భుల కందరాని భా
సుర పద మందుఁజేరుదురు సూరి జనస్తవనీయ! యట్టి స
త్పురుషుల పూర్వజన్మ ఫలమున్ గణుతింపఁదరంబె యేరికిన్.

పోతన 3-7-241, 242, 243

# అధ్యాయము - 8

**మైత్రేయ ఉవాచ :**

శ్లో॥ సత్సేవనీయో బత పూరువంశో
యల్లోకపాలో భగవత్ప్రధానః ।
బభూవిదేహాజితకీర్తిమాలాం
పదేపదే నూతనయస్యభీక్ష్ణమ్ ॥ 13

సోఽహం నృణాం క్షుల్లసుఖాయ దుఃఖం
మహద్గతానాం విరమాయ తస్య ।
ప్రవర్తయే భాగవతం పురాణం
యదాహ సాక్షాద్భగవానృషిభ్యః ॥ 14

వ్యాస 3-8-1, 2

చ. ఇలఁగల మానవావళికి నెల్ల నుతింప భజింప యోగ్యమై
వెలసిన పూరువంశము పవిత్రము సేయఁగ బుట్టి సద్గుణా
కలిత యశః ప్రసూన లతికా తతికిం బ్రతి వాసరంబు పెం
పలరఁగఁబ్రోదివెట్టుదు గదయ్య ముకుంద కథామృతంబునన్.

తే. అల్పతర మైన సుఖముల నందుచున్న
జనుల దుఃఖంబు మాన్పంగఁజాలునట్టి
పుండరీకాక్షు గుణ కథా ప్రోక్తమైన
వితత నిగమార్థ మగు భాగవతము నీకు. 14

పోతన 3-8-262, 263

శ్లో॥ ఆసీనముర్వ్యాం భగవంతమాద్యం
సంకర్షణం దేవమకుంఠసత్త్వమ్ ।
వివిత్సవస్తత్త్వమతః పరస్య
కుమారముఖ్యా మునయోఽన్వపృచ్ఛన్ ॥ 15

స్వమేవ ధిష్ణ్యం బహుమానయంతం
యం వాసుదేవాభిధమామనంతి ।

ప్రత్యగ్ధృతాక్షాంబుజకోశమీష
దున్మీలయంతం విబుధోదయాయ ॥

స్వర్ధున్యుదార్ద్రైః స్వజటాకలాపై
రుపస్పృశంతశ్చరణోపధానమ్ ।
పద్మం యదర్చంత్యహిరాజకన్యా
స్సప్రేమ నానాబలిభిర్వరార్థాః ॥

ముహుర్గృణంతోవచసానురాగ
స్ఖలత్పదేనాస్య కృతాని తజ్జ్ఞాః ।
కిరీట సాహస్రమణిప్రవేక
ప్రద్యోతితోద్దామఫణాసహస్రమ్ ॥ 18

వ్యాస 3-8-3 నుండి 6

వ. ఎఱింగింతు విను మని యిట్లనియె. 15

సీ. అ మ్మహాభాగవతామ్నాయ మొకనాఁడు
గైకొని పాతాళ లోకమందు
నప్రతిహత బుద్ధియై వాసుదేవాఖ్యఁ
బొలుచు సంకర్షణ మూర్తి దివ్య
పురుషుఁడు దనుఁదాను బుద్ధిలోఁజూచుచు
సలలిత ధ్యాన ముకుళిత నేత్రుఁ
డై సనకాభ్యుదయార్థంబు గను విచ్చి
చూచిన వారు సంస్తుతు లొనర్ప

తే. నమర గంగావగాహనులై మహేంద్ర
కన్య లార్ద్ర జటాబంధ కలిత లగుచు
భర్తృవాంఛానుబుద్ధి నప్పరమపురుషుఁ
గదియ నేతెంచి తత్పాదకమలయుగము. 16



క. సేవించి భక్తితో నా
నావిధ పూజోపహార నతి నుతులను నా
దేవుని హృదయము వడిసిరి
యా వేళ సనందనాదు లమ్మహితాత్మున్.

మ. ఘన సాహస్ర కిరీటరత్న విలసత్కాంత ప్రసిద్ధ ప్రభా
జనితోదగ్ర రుచి ప్రకాశిత ఫణా సాహస్రుఁడౌ దేవతా
వన దీక్షాచణురూపకృత్యము లొగిన్ వాంఛన్ బ్రశంసించి వా
రనురాగ స్ఖలితోక్తులొప్ప నడుగన్ హర్షించి యా దేవుఁడున్. 18

పోతన 3-8-264 నుండి 267

శ్లో॥ ప్రోక్తం కిలైతద్భగవత్త మేన
నివృత్తధర్మాభిరతాయ తేన
సనత్కుమారాయ స చాహపృష్ట
స్సాంఖ్యాయనాయాథ ధృతవ్రతాయ ॥ 19

సాంఖ్యాయనః పారమహంసముఖ్యో
వివక్షమాణో భగవద్విభూతీః ।
జగాద సోఽస్మద్గురవేఽన్వితాయ
పరాశరాయాథ బృహస్ప తేశ్చ ॥

ప్రోవాచ మహ్యం స దయాలునోక్తో
మునిః పులస్త్యేన పురాణమాద్యం ।
సోఽహం తవై తత్కథయామివత్స
శ్రద్ధాళవే నిత్యమనువ్రతాయ ॥ 21

వ్యాస 3-8-7, 8, 9

తే. భూరి నిగమార్థ సార విచార మగుచుఁ
దనరు నీ భాగవతము సాదరతఁబలికె
నలినభవసూతియైన సనత్కుమార
కునకు నెఱిఁగించె సాంఖ్యాయనునకు నతఁడు. 19


క. పరఁగ నతం డంతఁబరా
శరునకు నుపదేశమిచ్చె సన్మతి నతఁడున్
సుర గురున కొసఁగె నాతఁడు
గరమరుదుగ నాకుఁజెప్పెఁగైకొని యేనున్. 20

క. నీ కిప్పుడు వివరించెద
నాకర్ణింపుము సరోరుహాక్షుం డగు సు
శ్లోకుని చరితామృత పరి
షేకుఁడవై ముదము గదురఁజెలఁగుము విదురా! 21

వ. ఇట్లు భగవ త్ప్రోక్తంబును, ఋషి సంప్రదాయాగతంబును, పురుషోత్తమ స్తోత్రంబును, పరమ పవిత్రంబును, భవ లతా లవిత్రంబును నైన భాగవత కథా ప్రపంచంబు శ్రద్ధాళుండవు భక్తుండవు నగు నీకు నుపన్యసించెద, వినుము. 22

పోతన 3-8-268 నుండి 271

**శ్రీమద్భాగవత ప్రవచన గురుసంప్రదాయము**



23

వ్యాస 3-8-3 నుండి 9

## అధ్యాయము - 9

## మంజుస్తోత్రము

**(బ్రహ్మ శ్రీహరిని స్తుతించుట)**

**బ్రహ్మోవాచ :**

శ్లో॥ జ్ఞాతోఽసి మేఽద్య సుచిరాన్నను దేహభాజాం
న జ్ఞాయతే భగవతో గతిరిత్యవద్యమ్ ।
నాన్యత్త్వదస్తి భగవన్ యది తన్నశుద్ధం
మాయాగుణవ్యతికరాత్త్వమురుర్విభాసి ॥ 22

రూపం యదేతదవబోధరసోదయేన
శశ్వన్నివృత్తతమసః సదనుగ్రహాయ ।
ఆదౌ గృహీతమవతారశతైకబీజం
యన్నాభిపద్మభవనాదహమావిరాసమ్ ॥

నాతః పరం పరమ యద్భవతః స్వరూప
మానందమాత్రమవికల్పమవిద్ధవర్చః ।
పశ్యామి విశ్వసృజమేకమవిశ్వమాత్మన్
భూతేంద్రియాత్మకమద స్త ఉపాశ్రితోఽస్మి ॥ 24

వ్యాస 3-9-1 నుండి 3

సీ. నలినాక్ష! మాయాగుణ వ్యతికరమునఁ
జేసి కార్యం బైన సృష్టి రూప
మునఁబ్రకాశించు నీ ఘనరూప విభవంబు
రూపింప దేహధారులకు దుర్వి
భావ్యంబు దలపోయ భగవంతుఁడవు నైన
పద్మాక్ష! నీ స్వరూపంబు కంటె
నన్య మొకటి సత్యమై బోధకం బైన
యది లేదు కాన, నీ యతుల దివ్య

తే. మయిన రూపంబు నాకుఁబ్రత్యక్ష మయ్యెఁ
నదియుఁగాక వివేకోదయమునఁజేసి
వరద! నీ రూప మజ్ఞాన గురు తమో ని
వారకం బయ్యె నాకు శశ్వత్ప్రదీప! 24

క. ఘన సత్పురుషానుగ్రహ
మునకై యమితావతార మూలం బగుచుం
తనరెడి నీరూపము శో
భనమగు భవదీయ నాభి పద్మము వలనన్.

క. జననం బందిన నాచే
ననయము మొదలనె గృహీత మయ్యె జగత్పా
వన మగు నీదు స్వరూపము
ఘన రుచిరంబై స్వయంప్రకాశక మగుటన్. 26

పోతన 3-9-294 నుండి 296

శ్లో॥ యే తు త్వదీయచరణాంబుజకోశగంధం
జిఘ్రంతి కర్ణవివరైః శ్రుతివాతనీతమ్ ।
భక్త్యా గృహీతచరణాః పరయా చ తేషాం
నాపైషి నాథ హృదయాంబురుహాత్స్వపుంసామ్ ॥ 25

వ్యాస 3-9-5

వ. కొందఱు గృతార్థులైన మహాత్ములు భవదీయ శ్రీచరణారవింద కోశగంధంబు వేదమారుతానీతం బగుటం జేసి తమ తమ కర్ణకుహరంబుల చేతం గ్రహించుదురు. వారల హృదయకమలంబు లందు భక్తి పారతంత్ర్యం బున గృహీత పాదారవిందంబులు గలిగి ప్రకాశింతువు. 27

పోతన 3-9-297

శ్లో॥ యావత్పృథక్త్వమిదమాత్మన ఇంద్రియార్థ
మాయాబలం భగవతో జన ఈశ పశ్యేత్ ।



తావన్న సంసృతిరసౌ ప్రతిసంక్రమేత
వ్యర్థాపి దుఃఖనివహం వహతి క్రియార్థా ॥ 26

వ్యాస 3-9-9

వ. జీవుండు భవదీయ మాయాపరిభ్రామ్యమాణుండై యాత్మ వేఱని యెప్పుడు దెలియునంతకాలంబు నిరర్థకంబై దుస్తరంబైన సంసార సాగరంబు దరియింపం జాలకుండు. 28

పోతన 3-9-297

శ్లో॥ నాతిప్రసీదసి తథోపచితోపహారై
రారాధితస్సురగణైర్హృది బద్ధకామైః ।
యత్సర్వభూతదయయాఽసదలభ్యయైకో
నానాజనేష్వవహితస్సుహృదంతరాత్మా ॥

వ్యాస 3-9-12

చ. అరయ సమస్త భూత హృదయంబుల యందు వసించి యేకమై
పరఁగిన యంతరాత్మ సఖిభావ సుధర్ముఁడవున్ బరా పరే
శ్వరుఁడవు నై తనర్చుచును సజ్జనదుర్లభమైన యట్టి సు
స్థిరమగు సర్వభూత దయచేఁబొడగానఁగ వత్తు వచ్యుతా! 29

పోతన 3-9-300

శ్లో॥ పుంసామతో వివిధకర్మభిరధ్వరాద్యై
ర్దానేనచోగ్రతపసా వ్రతచర్యయా చ ।
ఆరాధనం భగవత స్తవ సత్క్రియార్థో
ధర్మోఽర్పితః కర్హిచిద్మ్రియతే న యత్ర ॥ 28

వ్యాస 3-9-13

మ. క్రతు దానో గ్రతప స్సమాధి జప సత్కర్మాగ్ని హోత్రాఖిల
వ్రత చర్యాదుల నాదరింప నఖిల వ్యాపార పారాయణ

స్థితి నొప్పారెడి నీ పదాబ్జ యుగళీ సేవాభిపూజా సమ
ర్పిత ధర్మం డగు వాని భంగి నసురారీ! దేవ చూడామణీ! 30

పోతన 3-9-301

శ్లో॥ శశ్వత్స్వరూపమహసైవ నిషిద్ధభేద
మోహాయ బోధధిషణాయ నమః పరస్మై ।
విశ్వోద్భవస్థితిలయేషు నిమిత్తలీలా
రాసాయ తే నమ ఇదం చకృమేశ్వరాయ ॥ 29

వ్యాస 3-9-14

తే. తవిలి శశ్వత్స్వరూప చైతన్య భూరి
మహిమచేత నపాస్త సమస్త భేద
మోహుఁడ వఖిల విజ్ఞానములకు నాశ్ర
యుండవగు నీకు మ్రొక్కెదనో రమేశ!

క. జనన స్థితి నిలయంబుల
కనయంబును హేతు భూత మగు మాయా లీ
లను జెంది నటన సలిపెడు
ననఘాత్మక! నీ కొనర్తు నభినందనముల్. 32

పోతన 3-9-302, 303

శ్లో॥ యస్యావతారగుణకర్మవిడంబనాని
నామాని యేఽసువిగమే వివశా గృణంతి ।
తేఽనేక జన్మశమలం సహసైవ హిత్వా
సంయాంత్యపావృతమృతం తమజం ప్రపద్యే ॥ 30

వ్యాస 3-9-15

సీ. అనఘాత్మ! మరి భవ దవతార గుణకర్మ
ఘన విడంబన హేతుకంబు లైన



రమణీయ మగు దాశరథి వసుదేవ కు
మా రాది దివ్య నామంబు లోని
వెలయంగ మనుజులు వివశాత్ములై
యవసాన కాలంబున సంస్మరించి
జన్మ జన్మాంతర సంచిత దురితంబుఁ
బాచి కైవల్య సంప్రాప్తు లగుదు

తే. రట్టి దివ్యావతారంబు లవధరించు
నజుఁడ వగు నీకు మ్రొక్కెద ననఘ చరిత!
చిర శుభాకార! నిత్య లక్ష్మీ విహార!
భక్తమందార! దుర్భవ భయ విదూర! 33

పోతన 3-9-304

శ్లో॥ తిర్యఙ్మనుష్యవిబుధాదిషు జీవయోని
ష్వాత్మేచ్ఛయాత్మకృతసేతుపరీప్సయా యః ।
రేమే నిరస్తరతిరప్యపలబ్ధదేహా
స్తస్మై నమో భగవతే పురుషోత్తమాయ ॥ 31

వ్యాస 3-9-19

సీ. అమర తిర్య ఙ్మను ష్యాది చేతన యోను
లందు నాత్మేచ్ఛచేఁజెంది నట్టి
కమనీయ శుభమూర్తి గలవాఁడవై ధర్మ
సేతువనంగఁబ్రఖ్యాతి నొంది
విషయ సుఖంబుల విడచి సంతత నిజా
నందానుభవ సమున్నతిఁదనర్తు
వది గాన పురుషోత్తమాఖ్యఁజెన్నొందుదు
వట్టి నిన్నెప్పుడు నభినుతింతు

తే. నర్థి భవదీయ పాదంబు లాశ్రయింతు
మహిత భక్తిని నీకు నమస్కరింతు
భక్తజనపోష పరితోష! పరమపురుష!
ప్రవిమలాకార! సంసారభయవిదూర! 34

పోతన 3-9-308

శ్లో॥ ఏష ప్రసన్నవదనో రమయాత్మశక్త్యా
యద్యత్కరిష్యతి గృహీతగుణావతారః ।
తస్మిన్ స్వవిక్రమమిదం సృజతోఽపి చేతో
యుంజీత కర్మశమలం చ యథా విజహ్యామ్ ॥ 32

నాభిహ్రదాదిహ సతోఽంభసి యస్య పుంసో
విజ్ఞానశక్తి రహమాసమనంతశక్తేః ।
రూపం విచిత్రమిదమస్య వివృణ్వతో మే
మారీరిషిష్ట నిగమస్య గిరాం విసర్గః ॥ 33

వ్యాస 3-9-23, 24

సీ. తలకొని పంచభూత ప్రవర్తకమైన
భూరి మాయాగుణ స్ఫురణఁజిక్కు
వడక లోకంబులు భవదీయ జఠరంబు
లో నిల్పి ఘన సమాలోల చటుల
సర్వంకషోర్మి భీషణ వార్ధి నడుమను
ఫణిరాజ భోగ తల్పంబునందు
యోగనిద్రారతి నుండఁగ నొక కొంత
కాలంబు చనఁగ మేల్కనిన వేళ

తే. నలఘు భవదీయ నాభితోయజమువలనఁ
గణఁగి ముల్లోకములు నుపకరణములుగఁ



బుట్టఁజేసితి వతుల విభూతి మెఱసి
పుండరీకాక్ష! సంతత భువనరక్ష! 35

క. నిగమస్తుత లక్ష్మీపతి
జగదంతర్యామి వగుచు సర్గము నెల్లన్
దగు భవ దైశ్వర్యంబున
నగణిత సౌఖ్యానుభవము నందింతు గదే! 36

పోతన 3-9-309, 310

శ్లో॥ య ఏ తేన వుమా న్నిత్యం స్తువం స్తోత్రేణ మాం భజేత్ ।
త స్యాన్వహం ప్రసీదేయం సర్వకామవరేశ్వరః ॥ 34

వ్యాస 3-9-40

క. అనుదినమును ద్రిజగ త్పా
వన మగు నీ మంగళ స్తవముఁబఠియింపన్
వినినను జనులకు నేఁబొడ
గనఁబడుదు నవాప్త సకల కాముఁడ నగుచున్. 37

పోతన 3-9-327

**మంజు స్తోత్రము సమాప్తము**

* * *

## అధ్యాయము - 11

### మైత్రేయుండు విదురునకు కాల లక్షణం బెఱింగించుట

**మైత్రేయ ఉవాచ :**

శ్లో॥ చరమస్సద్వి శేషాణామనేకోఽసంయుతస్తు యః ।
పరమాణుస్స విజ్ఞేయో నృణామైక్య భ్రమో యతః ॥ 35

శ్లో॥ సతేవ పదార్థస్య స్వరూపావస్థితస్య యత్ ।
కైవల్యం పరమం మహా నవి శేషో నిరంతరః ॥ 36

ఏవం కాలోఽప్యనుమితస్సౌక్ష్మ్యేస్థౌల్యే చ సత్తమ ।
సంస్థానభుక్తిర్భగవానవ్యక్తోవ్యక్తభుగ్విభుః ॥

సకాలః పరమాణుర్వై యో భుం క్తే పరమాణుతామ్ ।
సతో విశేషభుగ్యస్తు సకాలః పరమో మహాన్ ॥

అణుర్ద్వౌపరమాణూస్యాత్త్రసరేణుస్త్రయోఽణవః ।
జాలార్కరశ్మ్యవగతఃఖమేవానుపతన్నగామ్ ॥

త్రసరేణుత్రికం భుంక్తే యః కాలస్సత్రుటిస్స్మృతః ।
శతభాగస్తు వేధస్స్యాత్తైస్త్రిభిస్తులవస్స్మృతః ॥

నిమేషస్త్రిలవోజ్ఞేయ ఆమ్నాతస్తేత్రయః క్షణః ।
క్షణాన్ పంచ విదుః కాష్ఠాం లఘుతాం దశపంచ చ ॥

లఘూని వై సమామ్నాతా దశపంచ చ నాడికా ।
తే ద్వే ముహూర్తః ప్రహరః షడ్యామస్సప్త వా నృణామ్ ॥

ద్వాదశార్ధపలోన్మానం చతుర్భిశ్చతురంగులైః ।
స్వర్ణమాషైః కృతచ్ఛిద్రం యావత్ప్రస్థజలప్లుతమ్ ॥

యామాశ్చత్వారశ్చత్వారో మర్త్యానామహనీ ఉభే ।
పక్షః పక్షః పంచదశాహాని శుక్లః కృష్ణశ్చ మానద ॥

శ్లో॥ తయోస్సముచ్చయో మాసః పితౄణాం తదహర్నిశమ్ ।
ద్వౌ తావృతుష్షడయనం దక్షిణం చోత్తరం దివః ॥ 45

శ్లో॥ అయనే అహనీ ప్రాహుర్వత్సరో ద్వాదశ స్మృతః ।
సంవత్సరశతం నౄణాం పరమాయుర్నిరూపితమ్ ॥ 46

గ్రహర్క్ష తారాచక్రస్థః పరమాణ్వాదినా జగత్ ।
సంవత్సరావసానేన పర్యేత్యనిమిషో విభుః ॥

సంవత్సరః పరివత్సర ఇడావత్సర ఏవ చ ।
అనువత్సరో వత్సరశ్చ విదురైవం ప్రభాష్యతే ॥

యస్సృజ్యశక్తిమురుధోచ్ఛ్వసయన్ స్వశక్త్యా
పుంసోఽభ్రమాయ దివి ధావతి భూతభేదః ।
కాలాఖ్యయా గుణమయం క్రతుభిర్వితన్వం
స్తస్మై బలిం కురత వత్సరపంచకాయ ॥ 49

వ్యాస 3-11-1 నుండి 15

సీ. భువిఁదన కాద్యాంశమునకు నంతము నన్య
వస్తు యోగంబు నే వలన లేక
ఘట పటాదిక జగత్కార్యంబునకు నిజ
సమవాయ కారణత్వమునఁబరఁగి
జాల సూర్య మరీచి సంగత గగనస్థ మగు
త్రసరేణు షడంశ మరయఁ
బరమాణు వయ్యెఁదత్పరమాణువం దర్కగతి
యెంత తడవు దత్కాలమగును

తే. సూక్ష్మ కాలంబు విను మది సూర్య మండ
లంబు ద్వాదశ రాశ్యాత్మకం బనంగఁ
గలుగు జగమున నొకయేఁడు గడచి చనినఁ
గాల మెంతగు నది మహత్కాల మనఘ! 38

వ. అందుఁబరమాణుద్వయం బొక్కయణువగు. అణు త్రితయం బొక్క త్రసరేణు వగు. అవి మూఁడు కూడ నొక్క త్రుటియగు. ఆ త్రుటిశతం బొక్క వేధ యనం బరఁగు. అట్టి వేధలు మూఁడు గూడ నొక లవం బనం దగు. అవి మూఁడైన నొక్క నిమేషం బనం జను. నిమేష త్రయంబు నొక్క క్షణం బగు. తత్క్షణ పంచకం బొక్క కాష్ఠ యనంబరఁగు. అవి పది యైన నొక్క లఘు వన నొప్పు. అట్టి లఘు పంచదశకం బొక్క నాడి యనం బరఁగు. అట్టి నాడికాద్వయం బొక్క ముహూర్తం బయ్యె. అట్టి నాడికా లాఱైన నేడైన మనుష్యులకు నొక్క ప్రహరం బగు. అదియ యామం బనం జను. దివస పరిమాణ విజ్ఞేయం బగు. నాడికోన్మాన (ఉన్మానము= కొలతపాత్ర) లక్షణం బెఱింగింతు.

షట్పల తామ్రంబునం బాత్రంబు రచియించి, చతుర్మాష సువర్ణంబునం జతురంగుళాయామ శలాకంబు గల్పించి, దానం దత్పాత్రమూలంబున ఛిద్రంబు గల్పించి, తచ్ఛిద్రంబునం బ్రస్థమాత్ర తోయంబు పరిపూర్ణము నొందు నంత కాలం బొక్క నాడిక యగు. యామంబులు నాలుగు సన నొక్క పగలగు. రాత్రియు నిప్పగిదిని జరుగు. అట్టి యహర్నిశంబులు గూడ మర్త్యుల కొక దినం బగు. అవి పదియే నైన నొక్క పక్షంబగు. శుక్ల కృష్ణ నామంబులం బరఁగిన పక్షంబులు రెండుఁగూడ నొక్క మాసం బగు. అది పితృదేవతలకు నొక్క దివసంబగు. అట్టి మాసంబులు రెండైన నొక్క ఋతు వగు. షణ్మాసంబు లరిగిన నొక్క యయనం బగు. దక్షిణోత్తర నామంబులం బరఁగిన యట్టి యయనంబులు రెండు గూడి ద్వాదశ మాసంబు లయిన యొక్క సంవత్సరం బగు. అట్టి సంవత్సర (ఆదిదేవతలకు నొక్క దివసంబు) శతంబు నరులకుం బరమాయు వై యుండు.

కాలాత్ముండును నీశ్వరుండును, నైన సూర్యుండు గ్రహ నక్షత్ర తారాచక్రస్థుండై పరమాణ్వాది సంవత్సరాంతం బైన కాలంబునం జేసి ద్వాదశ రాశ్యాత్మకం బైన జగంబున సౌర, బార్హస్పత్య, సావన, చాంద్ర,



నాక్షత్ర, మానభేదంబులం గానంబడుచున్న వాఁడై సంవత్సర, పరీవత్స రానువత్సర, వత్సర, నామంబుల సృజ్యమైన బీజాంకురముల శక్తిం గాలరూపం బైన స్వశక్తి చేత నభిముఖంబుగాఁ జేయుచుం, బురుషులకు నాయురాది వ్యయంబులం జేసి విషయాసక్తి నివర్తింపం జేయుచుం గోరికలు గలవారికి యజ్ఞముఖంబులం జేసి గుణమయంబు లైన స్వర్గాది ఫలంబుల విస్తరింపం జేయుచు, గగనంబునం బరువు వెట్టు. వత్సర పంచక వర్తకుం డగు మార్తాండునకుం బూజ గావింపుము. అని మైత్రేయుండు పలికెను. 39

పోతన 3-11-345, 346

శ్లో॥ సంధ్యాసంధ్యాంశయోరంతర్యత్సర్గో యతో లయః ।
తమేవాహుర్యుగం తజ్జ్ఞా యత్ర ధర్మోవిధీయతే ॥ 50
ధర్మశ్చతుష్పాన్మనుజాన్ కృతే సమనువర్తతే ।
స ఏవాన్యేష్వధర్మేణ వ్యేతి పాదేన వర్ధతా ॥ 51

వ్యాస 3-11-20, 21

వ. సంధ్యాంశ మధ్యంబునందు ధర్మ మతిశయించును. సంధ్యాంశమందు ధర్మ మల్పమై కానఁబడుచుండు.

మఱియు ధర్మదేవత కృతయుగంబున నాలుగు పాదంబులును, త్రేతయందు మూఁడు పాదంబులును, ద్వాపరంబునం బాద ద్వయంబును, గలియుగంబున నేకపాదంబును గలిగి సంచరించు. 40

క. పాద విభేదంబున మ
ర్యాదలును దఱుఁగు నధర్మ మాకొలఁదినె యు
త్పాదిల్లి వృద్ధిఁబొందు ధ
రాదివిజులు పాపబుద్ధి రతు లగుదు రిలన్. 41

పోతన 3-11-349, 350, 351

## బ్రహ్మకల్పంబు - ద్వితీయపరార్థంబు - వరాహకల్పంబు

**మైత్రేయ ఉవాచ :**

శ్లో॥ తస్యైవ చాంతే కల్పోఽభూద్యం పాద్మమసచక్షతే ।
యద్ధరేర్నాభిసరసః ఆసీల్లోక సరోరుహమ్ ॥ 52

అయం తు ప్రథమః కల్పో ద్వితీయస్యాపి భారత ।
వారాహ ఇతి విఖ్యాతో యత్రాసీత్సూకరో హరిః ॥

కాలోఽయం ద్విపరార్థాఖ్యో నిమేష ఉపచర్యతే ।
అవ్యాకృతస్యానంతస్య హ్యనాదేర్జగదాత్మనః ॥

కాలోఽయం పరమాణ్వాది ద్విపరార్ధాంత ఈరితః ।
నైవేశితుః ప్రభుర్భూమ్న ఈశ్వరో ధామ మానినామ్ ॥

వికారైషోడశైర్యుక్తో విశేషాదిభిరావృతః ।
అండకోశో బహిరయం పంచాశత్కోటివిస్తృతః ॥

దశోత్తరాధికైర్యత్ర ప్రవిష్టః పరమాణువత్ ।
లక్ష్యంతేఽంతర్గతాశ్చాన్యే కోటిశో హ్యండరాశయః ॥

తదాహురక్షరం బ్రహ్మ సర్వకారణకారణమ్ ।
విష్ణోర్ధామ పరం సాక్షాత్పురుషస్య మహాత్మనః ॥ 58

వ్యాస 3-11-35 నుండి 41

క. విను మెన్నఁడు పంకజ నా
భుని నాభీ సరసియందు భువనాశ్రయ మై
తనరిన పద్మము వొడమును
ననఘా! యది పద్మకల్ప మన విలసిల్లున్. 42

వ. పూర్వ పరార్ధాదినిం గలిగిన బ్రహ్మకల్పంబుఁజెప్పితి. ఇంక ద్వితీయ పరార్థంబు మొదల నెన్నఁడేని హరి సూకరాకారంబు (వరాహరూపము) దాల్చు నది వరాహకల్పం బనం దగు. అట్టి వరాహకల్పం బిపుడు వర్తమానం బగుచున్నది. వెండియు 43

సీ. దీపింపఁగాలస్వరూపుఁడైనట్టి
పద్మాక్షుఁడనంతుఁడనాదిపురుషుఁ
డఖిల విశ్వాత్మకుఁడగు నీశునకుఁబర
మాణ్వాది యుగ పరార్థాంత మగుచు
జరుగు నీ కాలంబు చర్చింప నొక్క
నిమేషకాలం బయి మెలఁగుచుండుఁ
గాన నీశ్వరునకుఁగర్తగాఁజాల ది
క్కాలంబు విను మది గాక దేహ

తే. మందిరార్థాది కర్మాభిమాన శీలు
రైన వారికి నాశ్రయం బగుటఁజేసి
యరయు హరి దద్గుణ వ్యతికరుఁడు గాన
కాల మమ్మేటి కెన్నఁడుఁగర్త గాదు. 44

వ. మఱియు షోడశ వికార యుక్తం బై పృథివ్యాది పంచభూత పరివృతంబై దశావరణంబులు గలిగి పంచాశ త్కోటివిస్తీర్ణంబై బ్రహ్మాండ కోశంబు దనరుచుండు. 45

చ. హరి పరమాణు రూపమున నందు వసించి విరాజమానుఁడై
సరి వెలుఁగొందు నిమ్ముల నసంఖ్యములైన మహాండకోశముల్
నెఱిఁదన యందు డింద నవనీరజ నేత్రుఁడనంతుఁడాద్యుఁడ
క్షరుఁడు పరాపరుం డఖిల కారణ కారణుఁడప్రమేయుఁడై.

క. నిరతిశయోజ్జ్వల తేజః
స్ఫురణన్ దనరారు పరమపురుషుని విష్ణుం
బురుషోత్తమువర్ణింపను
సరసిజభవభవులకై న శక్యమె చెపుమా! 47

పోతన 3-11-360 నుండి 365

## అధ్యాయము - 13

### యజ్ఞవరాహమూర్తిని బ్రహ్మాదులు స్తుతియించుట

**మైత్రేయ ఉవాచ :**

నమో నమస్తేఽఖిలమంత్రదేవతా
ద్రవ్యాయ సర్వక్రమతవే క్రియాత్మనే ।
వైరాగ్యభక్త్యాత్మజయానుభావిత
జ్ఞానాయ విద్యాగురవే నమో నమః ॥ 59

వ్యాస 3-13-41

క. హవ రూపివి హవ నేతవు
హవ భోక్తవు నిఖిల హవ ఫలాధారుఁడవున్
హవ రక్షకుండ వగు నీ
కవితథమగు నుతు లొనర్తు మయ్య ముకుందా! 48

తే. సత్త్వగుణమున సద్భక్తి సంభవించు
భక్తి యుతముగఁజిత్తంబు భవ్య మగును
హృదయ పద్మంబు నం దోలి నెఱుఁగఁబడిన
యట్టి నీకు నమస్కారమయ్య వరద! 49

పోతన 3-13-426, 427

శ్లో॥ తస్మిన్ ప్రసన్నే సకలాశిషాం ప్రభౌ
కిం దుర్లభం తాభిరలం లవాత్మభిః ।
అనన్యదృష్ట్యా భజతాం గృహాశయః
స్వయం విధత్తే స్వగతిం పరః పరామ్ ॥ 60

వ్యాస 3-13-51

చ. హరి నిజదానకోటికి గుహాశయుఁడై రమియించు, నట్టి స
త్పురుషుల కిష్టవస్తు పరిపూర్ణ మనోరథ సిద్ధిగల్గు, సు
స్థిరమగుచున్న మోక్ష మఱచేతిది యై చెలువారు నన్న న
స్థిరతర తుచ్ఛ సౌఖ్యములు సేకురుటల్ మఱి చెప్ప నేటికిన్. 50

పోతన 3-13-440

శ్లో॥ కో నామ లోకే పురుషోఽర్థసారవిత్
పురా కథానాం భగవత్కథాసుధామ్ ।
ఆపీయ కర్ణాంజలిభిర్భవాపహాం
కథం విరజ్యేత వినా నరేతరమ్ ॥ 61

వ్యాస 3-13-52

ఉ. కాన, సరోజలోచను జగత్ స్తవనీయ కథా సుధా రసం
బానిన యట్టి జిహ్వ యసదన్య కథా లవణోదకంబులన్
బానము సేయఁజూచునె సుపర్వ మహీజ మరంద పాన లా
భాను భవంబు నొందు మధుపప్రభు వేఁగునె వేఁపచెట్లకున్. 51

పోతన 3-13-441

* * *

## అధ్యాయము - 15

### సనకసనందాదులు శ్రీమన్నారాయణుని స్తుతియించుట

**కుమారా ఊచుః :**

శ్లో॥ కామం భవః స్వవృజినైర్నిరయేషు నస్స్యా
చ్చేతోఽ లివద్యది ను తే పదయో రమేత ।
వాచశ్చ నస్తులసివద్యది తేఽ ంఘ్రిశోభాః
పూర్యేత తే గుణగణైర్యది కర్ణరంధ్రః ॥ 62

వ్యాస 3-15-49

చ. అలరు భవత్పాదాంబుజయుగార్పిత మై పొలుపొందునట్టియా
తులసి పవిత్రమైన గతిఁదోయజనాభ! భవత్కథా సుధా
కలితము లైన వాక్కుల నకల్మష యుక్తిని విన్నఁగర్ణముల్
విలసితలీలమై భువిఁబవిత్రము లై విలసిల్లు మాధవా! 52

పోతన 3-15-547

శ్లో॥ ప్రాదుశ్చకర్థ యదిదం పురుహూత రూపమ్
తేనేశనిర్వృతిమవాపురలం దృశో నః ।
తస్మా ఇదం భగవతే నమ ఇద్విధేమ
యోఽ నాత్మనాం దురుదయో భగవాన్ప్రతీతః ॥ 63

వ్యాస 3-15-50

చ. మహిత యశో విలాసగుణ మండన! సర్వ శరణ్య! యింద్రియ
స్పృహులకుఁగానరాక యతసీకుసుమద్యుతి నొప్పుచున్న మీ
సహజ శరీర మిప్పుడు భృశంబుగఁజూచి మదీయ దృక్కులిం
దహహా! కృతార్థతం బొరసెనచ్యుత! మ్రొక్కెదమాదరింపవే!

పోతన 3-15-548

## అధ్యాయము - 16

**శ్రీభగవానువాచ :**

శ్లో॥ యత్సేవయా చరణపద్మపవిత్రరేణుం
సద్యః క్షతాఖిలమలంప్రతిలబ్ధశీలమ్ ।
న శ్రీర్విరక్తమపి మాం విజహాతి యస్యాః
ప్రేక్షాలవార్థ ఇతరే నియమాన్వహంతి ॥ 64

శ్లో॥ నాహం తథాద్మి యజమానహవిర్వితానే
చ్యోతద్ఘృతప్లుతమదన్ హుతభుఙ్ముఖేన ।
యద్బ్రాహ్మణస్య ముఖతశ్చరతోఽ నుఘాసం
తుష్టస్య మయ్యవహితైర్నిజకర్మ పాకైః ॥ 65

వ్యాస 3-16-7, 8

క. ధరణిసురోత్తమసేవా
పరిలబ్ధం బైన యట్టి పాతక నాశం
కర నిఖిలభువన పూత
స్ఫురితాంఘ్రి సరోజ తోయములు గల నన్నున్. 54

క. అలఘుమతి విరక్తునిఁగా
దలఁపక నిజ శుభ కటాక్ష దామక కలితా
ఖిల సంపద్విభవ శ్రీ
లలనా రత్నం బురస్థలంబును జెందున్.

చ. క్రతువులు సేయుచో శిఖిముఖంబున వ్రేలుచు నట్టి తద్ఘృత
ప్లుత చరు భక్షణన్ ముదముఁబొందదు నిస్పృహధర్మమార్గసం
గతుఁడగు భూసురోత్తమ ముఖంబున వేడ్కభుజించు న య్యవి
సృత కబళంబునన్ మనము తృప్తి వహించినరీతి నిచ్చలున్. 56

పోతన 3-16-554 నుండి 556

శ్లో॥ యే బ్రాహ్మణాన్మయి ధియా క్షిపతోఽర్చయంత
స్తుష్యద్ధృదః స్మితసుధోక్షితపద్మవక్త్రాః ।
వాణ్యానురాగకలయాత్మజవద్గృణంత
స్సంబోధయంత్యహమివాహముపాహృతస్తైః ॥ 66

వ్యాస 3-16-11

చ. ధరణిసురోత్తముల్ బహువిధంబులఁదమ్ముఁబరాభవించినన్
దరహసితాస్యులై యతిముదంబున నిచ్చలుఁబూజసేయుచున్
సరస వచో విలాసముల సన్నుతి సేయుచుఁదండ్రి నాత్మజుల్
గర మనురక్తిఁబిల్చుగతిఁగైకొని పిల్చినవారు నా సముల్.

క. వినుఁడయ్యనఘచరిత్రుల,
కనయముఁబ్రియతముఁడ నగుచుఁనమ్ముడు వోదున్
ముని నన్ను భృగువు దన్నినఁ,
గనలక పరితోషయుక్తిఁగైకొంటిఁగదే ! 58

పోతన 3-16-559, 560

**కుమారా ఊచుః :**

శ్లో॥ యస్త్వాం వివిక్తచరితై రనువర్తమానాం
నాత్యాద్రియత్పరమభాగవతప్రసంగః ।
తం త్వాం ద్విజానుపథపుణ్యరజః పునీతః
శ్రీవత్సలక్ష్మ కిమగా భగభాజనస్త్వమ్ ॥ 67

ధర్మస్య తే భగవత స్త్రియుగ త్రిభిస్స్వైః
పద్భిశ్చరాచరమిదం ద్విజదేవతార్థమ్ ।
నూనం భృతం తదభిఘాతి రజస్తమశ్చ
సత్త్వేన నో వరదయా తనువా నిరస్య ॥

న త్వం ద్విజోత్తమకులం యదిహాత్మగోపం
గోప్తా వృష స్స్వర్హణేన చ సూనృతేన



తర్హ్యేవ నంక్ష్యతి శివ స్తవ వేద పంథా
లోకోఽగ్రహీష్యదృషభస్య హి తత్ప్రమాణమ్ ॥ 69

తత్తేఽనభీష్టమివ సత్త్వనిధేర్విధిత్సోః
క్షేమం జనాయ నిజశక్తిభిరుద్ధృతారేః ।
నైతావతా త్ర్యధిపతే తవ విశ్వభర్తు
స్తేజః క్షతం త్వవనతస్య స తే వినోదః ॥ 70

వ్యాస 3-16-21 నుండి 24

మ. చిర భాగ్యోదయ! దేవ దేవ! లలిత శ్రీవత్స లక్ష్మాంగ! యీ
వర విప్రానుపదైక పుణ్యరజ మే వర్ణింప నీ మేని కా
భరణం బంటివి సర్వలోకులకు విప్రశ్రేణిమాహాత్మ్య మీ
వెఱుఁగం జెప్పుటకై ధరించితి గదా! యెన్నన్ బవిత్రాకృతిన్.

వ. అదియునుం గాక. 60

సీ. ధర్మమూర్తివి! జగత్కర్తవు! నగు నీవు
ప్రోవంగఁదగువారిఁబ్రోవ వేని
నవిరళ వేదోక్తమగు ధర్మమార్గ
మసన్మార్గ మగుఁగాన సత్త్వగుణ వి
శిష్టుఁడ వగుచు నీ జీవరాసుల సేమ
మరసి రక్షించు నీ దైనశక్తి
చేతను ధర్మ విఘాతుల దండించు
నీకు నంచిత మైన నిగమధర్మ

తే. మార్గ నాశకరంబులు మదికి నింపు
గావు, విప్రులయందు సత్కరుణ మెఱసి
ఘనతఁబలికిన వినయవాక్యములు నీకు
యుక్తమగుచుండు సతతంబు భక్తవరద! 61

వ. అట్లైనం బరులంయెడ వినయంబులు పలికినం బ్రాభవహాని యగు నని తలంచితి వేని.

తే. విశ్వమున కెల్లఁగర్తవు! విశ్వనిధివి!
విశ్వసంరక్షకుండవై వెలయు నీకు
గడఁగి ప్రాభవహాని యెక్కడిది? దలఁప
వినయములు నీకు లీలలై వెలయుఁగాన. 63

పోతన 3-16-570 నుండి 574

* * *

## అధ్యాయము - 23

### కర్దమప్రజాపతి యోగప్రభావంబుచే విమానంబు గల్పించి భార్యతోఁగూడి విహరించుట

**మైత్రేయ ఉవాచ :**

శ్లో॥ ప్రియాయాః ప్రియమన్విచ్ఛన్ కర్దమో యోగమాస్థితః।
విమానం కామగం క్షత్తస్తర్హ్యేవావిరచీకరత్॥ 71

సర్వకామదుఘం దివ్యం సర్వరత్న సమన్వితమ్।
సర్వర్ధ్యుపచయోదర్కం మణిస్తంభై రుపస్కృతమ్॥

దివ్యోపస్కరణోపేతం సర్వకాలసుఖావహమ్।
పట్టికాభిః పతాకాభిర్విచిత్రాభిరలంకృతమ్॥

స్రగ్భిర్విచిత్రమాల్యాభిర్మంజుశింజత్షడంఘ్రిభిః।
దుకూలక్షౌమకౌశేయైర్నానావస్త్రైర్విరాజితమ్॥ 74

వ్యాస 3-23-12 నుండి 15

సీ. దివ్య మణిస్తంభ దీప్తిఁజెన్నొందుచు
మరకత స్థలముల మహిమ దనర
వరవజ్ర కుడ్య కవాటశోభితములై
విద్రుమ దేహళీ వీథు లమరఁ
గొమరొప్పు నవశాతకుంభ కుంభములపై
హరినీల శకల విస్ఫురణ మెఱయఁ
దగఁబద్మరాగంపు మొగడలఁజెన్నొందు
వైడూర్యవలభులు వన్నెచూపఁ

తే. దరళతర ధూతకేతు పతాక లొలయ
మంజు శింజ త్సమంచిత మధుప కలిత

సురుచి రాలంబమాన ప్రసూనరాజి
మాలికల నొప్పు వివిధ గృహాళిఁదనరి. 64

క. మఱియును దుకూల చీనాం
బర కౌశేయాది వివిధపట పరివృత మం
దిర సుభగాకారం బై
కరమొప్పు విచిత్ర పట్టికాలంకృతమై. 65

పోతన 3-23-801, 802

శ్లో॥ తత్ర తత్ర వినిక్షిప్త నానాశిల్పోపశోభితమ్।
మహామరకతస్థల్యా జుష్టం విద్రుమవేదిభిః॥ 75

ద్వార్షు విద్రుమ దేహళ్యా భాతం వజ్రకవాటవత్।
శిఖరేష్వింద్రనీలేషు హైమకుంభైరధిశ్రితమ్॥

చక్షుష్మత్పద్మ రాగాగ్ర్యైర్వజ్రభిత్తిషు నిర్మితైః।
జుష్టం విచిత్రవైతానైర్మహార్హైర్హేమతోరణైః॥

హంస పారావతవ్రాతై స్తత్ర తత్ర వికూజితమ్।
కృతిమాన్మన్యమానైస్స్వానధిరుహ్యావరుహ్య చ॥ 78

వ్యాస 3-23-17 నుండి 20

మ. లలితోద్యాన వనాంత సంచరణ లీలాలోల హంసాళి కో
కిల పారావత చక్రవాక శుక కే కీందింది రానీక ము
త్కలికం గృత్రిమ పక్షులన్ నిజ విహంగశ్రేణి యంచున్గుతూ
హలియై పల్కుచు నాడుచుండుఁబ్రతిశాఖారోహణవ్యాప్తులన్. 66

వ. వెండియు.

క. ఘన సౌధాంతర శయ్యా
సన కేళీగృహ కృతకజగతీధర శో
భన చంద్రకాంత చారుభ
వన ఫలభరితావనీజవంతము లగుచున్.

క. సకలర్తు శోభితంబును
సకల శుభావహము సకల సంపత్కరమున్
సకలోప భోగయోగ్యము
సకలేప్సిత కామదంబు సదలంకృతమున్. 69

పోతన 3-23-803 నుండి 806

**(గమనిక:-** కర్దమప్రజాపతి నిజయోగ మాయా ప్రభావంబుచే కల్పించిన యద్భుత దివ్యసుందర విచిత్రాలంకారమగు విమాన నిర్మాణ కౌశలము నేటి విజ్ఞాన శాస్త్రజ్ఞులు గమనించదగిన విషయము. వివరములు వ్యాస 3-23-12 నుండి 50; పోతన 3-23-800 నుండి 816 చదువదగినవి.)

* * *

## అధ్యాయము - 24

### దేవహూతి గర్భంబున విష్ణుఁడు గపిలాచార్యుండుగా నుదయించుట

**శ్రీ భగవానువాచ (కపిలుండు కర్దమునితో బలుకుట) :**

శ్లో॥ మయా ప్రోక్తం హి లోకస్య ప్రమాణం సత్యలౌకికే।
అథాజని మయా తుభ్యం యదవోచమృతం మునే॥ 79

శ్లో॥ ఏతన్మే జన్మలోకేఽస్మిన్ ముముక్షూణాం దురాశయాత్।
ప్రసంఖ్యానాయ తత్త్వానాం సమ్మతాయాత్మదర్శనే॥ 80

ఏష ఆత్మపథో వ్యక్తో నష్టః కాలేన భూయసా।
తం ప్రవర్తయితం దేహమిమం విద్ధి మయా ధృతమ్॥

గచ్ఛ కామం మయాఽఽపృష్టోమయి సన్న్యస్తకర్మణా।
జిత్వా సుదుర్జయం మృత్యుమమృతత్వాయ మాం భజ॥

మామాత్మానం స్వయంజ్యోతిస్సర్వభూతగుహాశయమ్।
ఆత్మన్యేవాత్మనావీక్షన్ విశోకోఽభయమృచ్ఛసి॥

మాత్ర ఆధ్యాత్మికీం విద్యాం శమనీం సర్వకర్మణామ్।
వితరిష్యే యథాచాసౌ భయం చాతితరిష్యతి॥ 84

వ్యాస 3-24-35 నుండి 40

సీ. నాచేతఁబూర్వంబునం బ్రతిశ్రుత మైన
వచనముల్ దప్పక వరమునీంద్ర!
నీ యింటఁబుట్టితి నిర్హేతుకస్థితి
భూరిదయాగుణంబున నవాప్త
సకలకాముఁడ నేను సన్మునివేషంబు
ధరియించు టెల్ల నాకొఱకుఁగాదు
విను మహాత్మకులైన మునులకుఁబరమాత్మ
గురు సద్వివేకంబు నరసిచూపు

తే. తత్త్వబోధంబుకొఱకును దాల్పఁబడిన
యంచిత వ్యక్తమార్గమైనట్టి దేహ
మని తలంపుము మత్పదధ్యానశక్తి
ధీపరాయణ మహిమంబు తేజరిల్లు. 70

క. సమధికనిష్ఠం గృతయో
గమునన్ సన్న్యస్త సకలకర్ముఁడ వై మో
హముఁబాసి భక్తిచే మో
క్షముకై భజియింపు నను వికారరహితుఁడవై.

క. ననుఁబరమేశుఁబరంజ్యో
తిని ననఘు ననంతు దేవదేవు సకలభూ
తనికాయ గుహాశయు నా
ద్యుని నజు నాద్యంతశూన్యు దురితవిదూరున్.

క. తిరముగ భవదీయాంతః
కరణ సరోజాత కర్ణికాతలమున సు
స్థిరుఁజేసి యింద్రియంబుల
నిరసించి మనోంబకమున నెఱిఁ గనుమనఘా! 73

పోతన 3-24-850 నుండి 853

### ఏకాంత భక్తియోగము

**శ్రీ మైత్రేయ ఉవాచ :**

శ్లో॥ మనో బ్రహ్మణి యుంజానో యత్తత్సదసతోః పరమ్।
గుణావభాసే విగుణ ఏకభక్త్యానుభావితే॥ 85

నిరహంకృన్నిర్మమశ్చ నిర్ద్వంద్వస్సమదృక్ స్వదృక్।
ప్రత్యక్ప్రశాంతధీర్ధరః ప్రశాంతోర్మి రివోదధిః॥ 86

శ్లో॥ వాసుదేవే భగవతి సర్వజ్ఞే ప్రత్యగాత్మని।
పరేణ భక్తియోగేన లబ్ధాత్మాముక్తబంధనః॥ 87

ఆత్మానం సర్వభూతేషు భగవంతమవస్థితమ్।
అపశ్యత్సర్వభూతాని భగవత్యపి చాత్మని॥

ఇచ్ఛాద్వేషవిహీనేన సర్వత్ర సమచేతసా।
భగవద్భక్తియోగేన ప్రాప్తా భాగవతీ గతిః॥ 89

వ్యాస 3-24-43 నుండి 47

వ. పరబ్రహ్మంబుఁజిత్తమున నిల్పి, యహంకారంబు విడిచి, మమత్వంబు నిరసించి, దయాగుణంబునం జేసి సకలభూతంబులందు సమత్వంబు భజియించి, శాంతిశేముషీ గరిష్ఠుండగుచు, నిస్తరంగంబగు వార్ధిచందంబున ధీరుండై నిఖిల ప్రపంచంబును వాసుదేవమయంబుగాఁదలంపుచు భక్తియోగంబున భాగవతగతిం బొందె. 74

పోతన 3-24-857

* * *

## అధ్యాయము - 25

### దేవహూతి పుత్రుండైన కపిలాచార్యునివలనం దత్త్వజ్ఞానంబు వడయుట

**శ్రీ (కపిల) భగవానువాచ :**

శ్లో॥ ప్రసంగమజరం పాశమాత్మనః కవయో విదుః।
స ఏవ సాధుషు కృతో మోక్షద్వార మపావృతమ్॥ 90

తితిక్షవః కారుణికా స్సుహృదస్సర్వదేహినామ్।
అజాతశత్రవశ్శాంతాస్సాధవస్సాధుభూషణాః॥

మయ్యనన్యేన భావేన భక్తిం కుర్వంతి యే దృఢామ్।
మత్కృతేత్యక్తకర్మాణ స్త్యక్తస్వజన బాంధవాః॥ 92

శ్లో॥ మదాశ్రయకథా హృష్టా శ్శృణ్వంతి కథయంతి చ।
తపంతి వివిధాస్తాపా నైతాన్మద్గతచేతసః॥ 93

త ఏతే సాధవస్సాధ్వి సర్వసంగవివర్జితాః।
సంగస్తేష్వథ తేప్రార్థ్యః సర్వదోషహరా హి తే॥

సతాం ప్రసంగాన్మమ వీర్యసంవిదో
భవంతి హృత్కర్ణరసాయనాః కథాః।
తజ్జోషణాదాశ్వపవర్గవర్త్మని
శ్రద్ధా రతిర్భక్తిరనుక్రమిష్యతి॥ 95

వ్యాస 3-25-20 నుండి 25

వ. విద్వాంసులుసంగం బింద్రియార్థా ద్యసద్విషయంబుగ నొనరింపబడిన జీవునకు నశిథిలంబగు బంధంబునకుఁగారణం బగుననియు, నదియె సద్విషయంబైన నంతఃకరణ సంయమన హేతుభూతం బగుచు సాధుజనులకు ననర్గళ మోక్షద్వారం బగుననియుఁదెలియుదురు. (సహనశీలురును) సమస్తశరీరధారులకు సుహృత్తులును, బరమశాంతులును, గారుణికులునై

మదర్థంబుగఁబరిత్యక్తకర్ములు, విసృష్ట స్వజన బంధుజనులునై మత్పదా
శ్రయులును, మద్గుణ ధ్యానపారీణులును, మత్కథా ప్రసంగ సఫలిత
శ్రవణులును నగుచు నుండు పరమ భాగవతోత్తములఁదాపత్రయంబు
తపింపంజేయంజాలదు. అట్టి సర్వసంగ వివర్జితులగు పరమభాగవతజనుల
సంగం బపేక్షణీయంబు. (అది సకలదోష నివారకంబగు. అట్టి సత్సంగంబున
సర్వప్రాణి హృత్కర్ణ రసాయనంబులగు మదీయ కథాప్రసంగంబులు
గలుగు.) మద్గుణాకర్ణనంబునంజేసి శీఘ్రంబుగఁగ్రమంబున గైవల్య
మార్గదంబులగు శ్రద్ధాభక్తులుదయించు. 75

పోతన 3-25-866

శ్లో॥ నైకాత్మతాం మే స్పృహయంతి కేచి
న్మత్పాదసేవాభిరతౌ మదీహాః।
యేఽన్యోన్యతో భాగవతాః ప్రసజ్య
సభాజయంతో మమ పౌరుషాణి.॥ 96

వ్యాస 3-25-34

చ. అమలినభక్తిఁగొందఱు మహాత్ములు మచ్చరణారవింద యు
గ్మము హృదయంబునన్ నిలిపి కౌతుకులై యితరేతరానులా
పముల మదీయ దివ్యతను పౌరుషముల్ గొనియాడుచుండి మో
క్షము మదిఁగోరనొల్ల రనిశంబు మదర్పిత సర్వకర్ములై. 76

శ్లో॥ పశ్యంతి మే రుచిరాణ్యేవ సంతః।
ప్రసన్నవక్త్రారుణలోచనాని।
రూపాణి దివ్యాని వరప్రదాని
సాకం వాచం స్పృహణీయాం వదంతి॥ 97

తైర్దర్శనీయావయవై రుదార
విలాసహాసేక్షితవామసూక్తైః।
హృతాత్మనో హృతప్రాణాంశ్చ భక్తి
రనిచ్ఛతో గతిమణ్వీం ప్రయుఙ్క్తే॥ 98

వ్యాస 3-25-35, 36



సీ. పరికింపఁగొందఱు భాగవతోత్తముల్
ఘనతకెక్కిన పురాతనములైన
చారు ప్రసన్న వక్త్రారుణలోచన
ములుగల్గి వరదాన కలితములుగఁ
దనరు మద్దివ్యావతార వైభవములు
మది నొప్పఁదమ యోగమహిమఁజేసి
యనుభవింపుచుఁదదీ యాలాపముల సన్ను
తింపుచుఁదివుటఁద ద్దివ్యవిలస

తే. దవయ వోదార సుందర నవవిలాస
మందహాస మనోహర మధురవచన
రచనచే నపహృత మనఃప్రాణులగుచు
నెలమి నుందురు నిశ్శ్రేయసేచ్ఛలేక. 77

పోతన 3-25-871

శ్లో॥ నకర్హి చిన్మత్పరాశ్శాంతరూపే
నంక్ష్యంతి నో మేఽనిమిషో లేఢి హేతిః।
యేషామహం ప్రియ ఆత్మా సుతశ్చ
సఖా గురుస్సుహృదో దైవమిష్టమ్॥ 99

వ్యాస 3-25-38

మ. వినుమదిగాక యీ భువి దివిం బలుమాఱుఁజరించునాత్మఁదా
ధన పశు పుత్ర మిత్ర వనితాతతిపైఁదగులంబు మాని న
న్ననఘుని విశ్వతోముఖు ననన్యగతిన్ భజియించె నేని వా
నిని ఘనమృత్యురూప భవనీరధి నేఁదరియింపఁజేయుదున్. 78

పోతన 3-25-876

శ్లో॥ నాన్యత్ర మద్భగవతః ప్రధానపురుషేశ్వరాత్।
ఆత్మనస్సర్వభూతానాం భయం తీవ్రం నివర్తతే॥ 100

మద్భయాద్వాతి వాతోఽ యం సూర్యస్తపతి మద్భయాత్।
వర్షతీంద్రో దహత్యగ్నిర్మృత్యుశ్చరతి మద్భయాత్॥

జ్ఞానవైరాగ్య యుక్తేన భక్తి యోగేన యోగినః।
క్షేమాయ పాదమూలం మే ప్రవిశంత్యకుతోభయమ్॥

శ్లో॥ ఏతావానేవ లోకేఽ స్మిన్ పుంసాం నిశ్రేయసోదయః।
తీవ్రేణ భక్తి యోగేనమనో మయ్యర్పితం స్థిరమ్॥ 103

వ్యాస 3-25-41 నుండి 44

సీ. రూఢిఁబ్రధానపూరుష నాయకుండును
భగవంతుఁడును జగత్ప్రభుఁడ నైన
నాకంటె నన్యులఁగైకొని తగిలిన
యాత్మలు భవభయం బందు నెపుడుఁ
గావున, నాయాజ్ఞ గడవంగ నోడుటఁ
జేసి వాయువు వీచు, శిఖి వెలుంగు,
నినుఁడు దపించుఁ, దా నింద్రుండు వర్షించు,
భయమంది మృత్యువు పరువువెట్టుఁ,

తే. గాన, విజ్ఞాన వైరాగ్యకలితమైన
భక్తి యోగంబునంజేసి పరమపదము
కొఱకు నయ్యోగివరులు మచ్చరణభజను
లగుచుఁజరియింపుదురు నిర్భయాత్ములగుచు. 79

క. గురుభక్తిం జిత్తము మ
త్పరమై విలసిల్లు నంత పర్యంతము స
త్పురుషుల కిహలోకంబునఁ
జిరతర మోక్షోదయంబు సేకుఱుచుండున్. 80

పోతన 3-25-877, 878

* * *

## అధ్యాయము - 26

### కపిలుఁడు దేవహూతికి తత్త్వలక్షణంబు బోధించుట

శ్లో॥ జ్ఞానం నిశ్శ్రేయసార్థాయ పురుషస్యాత్మదర్శనమ్।
యదాహుర్వర్ణయే తత్తే హృదయగ్రంథిభేదనమ్॥ 104

శ్లో॥ అనాదిరాత్మా పురుషో నిర్గుణః ప్రకృతేః పరః।
ప్రత్యగ్ధామా స్వయంజ్యోతి ర్విశ్వం యేన సమన్వితమ్॥ 105

న జాయతే న మ్రియతే సహదేహాద్యుపాధిభిః।
నిమిత్తైరాత్త తద్ధర్మాయథా స్వప్నే తదీక్షితా॥

స ఏష ప్రకృతిం సూక్ష్మాం దైవీం గుణమయీం విభుః।
యదృచ్ఛయై వోపగతా మభ్యపద్యత లీలయా॥

గుణై ర్విచిత్రాస్సృజతీం సరూపాః ప్రకృతిం ప్రజాః।
విలోక్య ముముహే సద్యః స ఇవ జ్ఞానగుహయా॥

ఏవం పరాభిధ్యానేన కర్తృత్వం ప్రకృతేః పుమాన్।
కర్మసు క్రియమాణేషు గుణై రాత్మని మన్యతే॥

తదస్య సంసృతిర్బంధః పారతంత్ర్యం చ తత్కృతమ్।
భవత్యకర్తురీశస్య సాక్షిణో నిర్వృతాత్మనః॥

కార్యకారణకర్తృత్వే కారణం ప్రకృతిం విదుః।
భోక్తృత్వే సుఖదుఃఖానాం పురుషం ప్రకృతేః పరమ్॥ 111

వ్యాస 3-26-2 నుండి 9

వ. అవ్వా! యివ్విధంబున భక్తియోగప్రకారంబు సెప్పితి. ఇఁకఁదత్త్వ లక్షణంబు వేఱువేఱ యెఱిఁగింతు. ఏతత్త్వగుణంబుల నెఱింగి నరులు ప్రకృతిగుణంబుల వలన విముక్తులగుదురు; హృదయగ్రంథి విచ్ఛేదకంబు నాత్మదర్శనరూపంబు నగు; నా జ్ఞానం బాత్మ నిశ్శ్రేయసకారణంబు గావున, దాని నెఱింగింతు. అందు నాత్మ స్వరూపంబెట్టి దనిన, ననాదియుఁ,

బురుషుండును, సత్త్వాదిగుణ శూన్యుండును, బ్రకృతి గుణ విలక్షణుండును, ప్రత్యక్ స్వయంప్రకాశుండును నెవ్వండు, ఎవ్వనితోడ నీవిశ్వంబు సమన్వితం బగు, నతండు గుణత్రయాత్మకంబు, నవ్యక్తంబు, భగవత్సంబంధియు నగు ప్రకృతియందు (యదృచ్ఛచే) లీలావశంబునం బ్రవేశించిన, నాప్రకృతి గుణత్రయమయంబై, సరూపంబైన ప్రజాసర్గంబుఁజేయం గనుంగొని, యప్పుడు మోహితుండై, విజ్ఞానతిరోధానంబునంజేసి గుణత్రయాత్మకంబైన ప్రకృత్యధ్యాసంబున నన్యోన్యమేళనంబగుటయు, నంతం బ్రకృతిగుణంబుఁ దనయందు నారోపించుకొని, క్రియమాణంబులగు కార్యంబుల వలనం గర్తృత్వంబు గలిగి, సంసారబద్ధుండై, పారతంత్ర్యంబు గలిగియుండు. కర్తృత్వ శూన్యుండగు నీశ్వరుండు సాక్షియగుటంజేసి యాత్మకుం గార్యకారణ కర్తృత్వంబులు ప్రకృత్యధీనంబులనియు, సుఖదుఃఖ భోక్తృత్వంబులు ప్రకృతి విలక్షణుండైన పురుషుని వనియు నెఱుంగుదురు. 81

పోతన 3-26-880

* * *

## అధ్యాయము - 27

**శ్రీ భగవానువాచ :**

శ్లో॥ ప్రకృతిస్థోఽపి పురుషో నాజ్యతే ప్రాకృతైర్గుణైః।
అవికారాదకర్తృత్వాన్నిర్గుణత్వాజ్జలార్కవత్॥ 112

స ఏష యర్హి ప్రకృతేర్గుణేష్వభివిషజ్జతే।
అహంకారవిమూఢాత్మా కర్తాస్మీత్యభిమన్యతే॥

తేన సంసారపదవీం మనసాభ్యేత్య నిర్వృతః।
ప్రాసంగికైః కర్మదోషైస్సదసన్మిశ్రయోనిషు॥

అర్థే హ్యవిద్యమానేఽపి సంసృతిర్న నివర్తతే।
ధ్యాయతో విషయానస్య స్వప్నేఽనార్థాగమో యథా॥ 115

శ్లో॥ అత ఏవ శనైశ్చిత్తం ప్రసక్తమసతాం పథి।
భక్తియోగేన తీవ్రేణ విరక్త్యా చ నయేద్వశమ్॥ 116

యమాదిభిర్యోగమార్గైరభ్యసన్ శ్రద్ధయాన్వితః।
మయి భావేన సత్యేన మత్కథాశ్రవణేన చ॥

సర్వభూతసమత్వేన నిర్వైరేణాప్రసంగతః।
బ్రహ్మచర్యేణ మౌనేన స్వధర్మేణ బలీయసా॥

యదృచ్ఛయోపస్థితేన సంతుష్టో మితభుఙ్మునిః।
వివిక్తశరణశ్శాంతో మైత్రః కరుణ ఆత్మవాన్॥ 119

వ్యాస 3-27-1 నుండి 8

సీ. జననుత! సత్త్వ రజస్తమోగుణ మయ
మైన ప్రకృతికార్య మగు శరీర
గతుఁడయ్యుఁబురుషుండుగణఁగి ప్రాకృతములు
నగు సుఖదుఃఖమోహములవలనఁ

గర మనురక్తుండు గాఁడు, వికార
హీనుఁడుఁద్రిగుణరహితుఁడు నగుచు
బలసి నిర్మల జల ప్రతిబింబితుండైన
దినకరుభంగి వర్తించు నట్టి

తే. యాత్మ ప్రకృతిగుణంబులయందుఁదగులు
వడి, యహంకారమూఢుఁలై తొడరి, యేనుఁ
గణఁగి నిఖిలంబునకు నెల్ల కర్తనని ప్ర
సంగవశతను బ్రకృతిదోషములఁబొంది. 82

క. సుర తిర్యఙ్మనుజ స్థా
వరరూపము లగుచుఁగర్మవాసనచేతన్
బరపైన మిశ్రయోనులఁ
దిరముగ జనియించి సంసృతిం గైకొని తాన్.

క. పూని చరింపుచు విషయ
ధ్యానంబునఁజేసి స్వాప్నికార్థాగమ సం
ధానము రీతి నసత్పథ
మానసుఁడగుచున్ భ్రమించు మతిలోలుండై. 84

వ. అట్లు గావున 85

తే. పూని, మోక్షార్థియగు వాఁడు, దీని తీవ్ర
భక్తియోగంబుచేత విరక్తిఁబొంది
మనము వశముగఁజేసి యమనియమాది
యోగమార్గ క్రియాభ్యాసముక్తిఁజేసి. 86

సీ. శ్రద్ధాగరిష్ఠుఁడై సత్యమైనట్టి మ
ద్భావంబు మత్పాదసేవనంబు
వర్ణిత మత్కథాకర్ణనంబును సర్వ
భూతసమత్వ మజాతవైర



మును, బ్రహ్మచర్యంబు, ఘనమౌన, మాదిగాఁ
గల నిజధర్మసంగతులఁజేసి
సంతుష్టుఁడును, మితాశనుఁడు, నేకాంతియు,
మననశీలుఁడు, వీతమత్సరుండు,

తే. నగుచు మిత్రత్వమునఁగృపఁదగిలి యాత్మ
కలిత విజ్ఞానియై బంధకంబులైన
ఘనశరీర పరిగ్రహోత్కంఠయందు
నాగ్రహముచేసి వర్తింపనగును మఱియు. 87

పోతన 3-27-895 నుండి 900

శ్లో॥ యథైనమధ్యాత్మరతః కాలేన బహుజన్మనా।
సర్వత్ర జాతవైరాగ్య ఆబ్రహ్మభువనాన్మునిః॥ 120

మద్భక్తః ప్రతిబుద్ధార్థో మత్ప్రసాదేన భూయసా।
నిశ్శ్రేయసం స్వసంస్థానం కైవల్యాఖ్యం మదాశ్రయమ్॥

ప్రాప్నోతి హి తతో ధీరస్స్వదృశా ఛిన్నసంశయమ్।
యద్గత్వాన నివర్తేత యోగీ లింగవినిర్గమైః॥

యదా న యోగోపచితాసు చేతో
మాయాసు సిద్ధస్య విషజ్జతేఽంబ
అనన్యహేతుష్వథ మే గతిస్స్యా
దాత్యంతికీ యత్ర న మృత్యుహాసః॥ 123

వ్యాస 3-27-27 నుండి 30

సీ. అధ్యాత్మతత్పరుం డగువాఁడు పెక్కు
జన్మంబులఁబెక్కు కాలంబులందు
బ్రహ్మపద ప్రాప్తిపర్యంతమును బుట్టు
సర్వార్థ వైరాగ్యశాలి యగుచుఁ

బూని నా భక్తులచే నుపదేశింపఁ
బడిన విజ్ఞానసంపత్తిచేతఁ
బరఁగఁ(బ్రబుద్ధుఁడై బహువారములు భూరి
మత్ప్రసాద ప్రాప్తిమతిఁదనర్చు

తే. నిజపరిజ్ఞాన విచ్ఛిన్న నిఖిల సంశ
యుండు నిర్ముక్తలింగదేహుండు నగుచు
ననఘ! యోగీంద్రహృద్ధేయ మగు మదీయ
దివ్యధామంబు నొందు సందీప్తుఁడగుచు. 88

వ. మఱియు నణిమా ద్యష్టైశ్వర్యంబులు మోక్షంబున కంతరాయంబులు గావున, వానియందు విగతసంగుండును, మదీయ చరణసరోజస్థిత లలితాంతరంగుండును నగువాఁడు మృత్యుదేవత నపహరించి మోక్షంబు నొందునని కపిలుండు చెప్పెను. 89

పోతన 3-27-905 నుండి 910

* * *

## అధ్యాయము - 29

### కపిలుండు దేవహూతికి భక్తియోగము తెలియఁజేయుట

### భక్తిభేదాః

**శ్రీ భగవానువాచ :**

శ్లో॥ భక్తియోగో బహువిధో మార్గైర్భామిని భావ్యతే।
స్వభావగుణమార్గేణ పుంసాం భావో విభిద్యతే॥ 124

వ్యాస 3-29-8

క. నలినాయతాక్షి! విను జన
ముల ఫలసంకల్ప భేదమునఁజేసి మదిం
గల భక్తియోగ మహిమం
బలవడఁగ ననేక విధము లనఁదగు నవియున్. 90

పోతన 3-29-942, 943

వ. వివరించెద. తామస రాజస సాత్త్వికభేదంబులం ద్రివిధంబై యుండు. అందుఁదామస భక్తి ప్రకారం బెట్టిదనిన.

శ్లో॥ అభిసన్ధాయ యో హింసాం దమ్భం మాత్సర్యమేవ చ।
సంరమ్భీ భిన్నదృగ్భావం మయి కుర్యాత్సతామసః॥ 125

వ్యాస 3-29-9

తే. సతత హింసాతిదంభ మాత్సర్య రూప
తమములను, జేయుచును భేదదర్శి యగుచు
బరఁగ నాయందు గావించు భక్తిదలఁప
దామసం బనఁదగు వాఁడు తామసుండు. 92

పోతన 3-29-944

శ్లో॥ విషయానభిసన్ధాయ యశఐశ్వర్యమేవ చ।
అర్చ్యాదావర్చయేద్యో మాం పృథగ్భావస్సరాజసః॥

వ్యాస 3-29-10

క. ఘన విషయ ప్రావీణ్యము
లను సుమహైశ్వర్య యశములకుఁబూజాద్య
ర్థుని నను నర్థి భజించుట
చను రాజస యోగ మనఁగ సౌజన్యనిధీ!

పోతన 3-29-945

శ్లో॥ కర్మనిర్హారముద్దిశ్య పరస్మిన్వా తదర్పణమ్।
యజేద్యష్టవ్యమితి వా పృథగ్భావస్స సాత్త్వికః॥

వ్యాస 3-29-11

చ. అనుపమ పాపకర్మ పరిహారముకై భజనీయుఁడైన శో
భన చరితుం డితం డనుచు భావమునం దలపోసి భక్తిచే
ననితర యోగ్యతన్ భగవదర్పణబుద్ధి నొనర్చి కర్మముల్
జనహితకారియై నెగడ సాత్త్విక యోగ మనంగఁజొప్పడున్. 94

పోతన 3-29-946

శ్లో॥ మద్గుణశ్రుతిమాత్రేణ మయి సర్వగుణాశ్రయే।
మనోగతిరవిచ్ఛిన్నా యథా గఙ్గామ్భసోఽమ్బుధౌ॥ 128

వ్యాస 3-29-12

చ. మనుసుత! మద్గుణ శ్రవణమాత్ర లభించినయట్టి భక్తిచే
ననఘుఁడ సర్వశోభన గుణాశ్రయుఁడన్ బరమేశ్వరుండ నై
తనరిన నన్నుఁజెందిన యుదాత్త మనోగతు లవ్యయంబులై
వననిధిగామియైన సురవాహినిఁబోలు ఫలించు నిమ్ములన్. 95

పోతన 3-29-947

శ్లో॥ లక్షణం భక్తియోగస్య నిర్గుణస్యహ్యుదాహృతమ్।
అహైతుక్యవ్యవహితా యా భక్తిః పురుషోత్తమే॥ 129

వ్యాస 3-29-13



క. హేయగుణ రహితుఁడనఁగల
నాయందలి భక్తి లక్షణముఁదెలిపితి నన్
బాయక నిర్హేతుకముగఁ
జేయు మదీయ వ్రతైక చిరతర భక్తిన్. 96

పోతన 3-29-948

శ్లో॥ సాలోక్యసార్ష్టి సామీప్యసారూప్యైకత్వమిత్యుత।
దీయమానం న గృహ్ణంతి జనా మత్సేవనం వినా॥

స ఏవ భక్తి యోగాఖ్య ఆత్యన్తిక ఉదాహృతః।
యేనాతివ్రజ్య త్రిగుణాన్మద్భావాయోపపద్యతే॥ 131

వ్యాస 3-29-14, 15

వ. నిష్కాములైన మదీయ భక్తులకు నట్టి భక్తియోగంబు సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యంబులకు, సాధనంబు గావున మహాత్ములగువారు తమ మనోరథ ఫలదాయకంబులైనను మదీయ సేవా విరహితంబులైన యితర కర్మంబుల నాచరింపనొల్లరు దీని నాత్యంతిక భక్తియోగంబని చెప్పుదురు. సత్త్వరజస్తమోగుణ హీనుండైన జనుండు మత్సమానాకారతం బొందు. అని చెప్పెను. 97

పోతన 3-29-949

శ్లో॥ ఆధ్యాత్మికానుశ్రవణాన్నామసంకీర్తనేన చ।
ఆర్జవేనార్య సంగేన నిరహంక్రియయా తథా॥ 132

వ్యాస 3-29-19

క. హరి మంగళ గుణకీర్తన
పరుఁడై తగ నార్జనమున భగవత్పరులన్
గర మనురక్తి భజించుట
నిరహంకారమున నుంట నిశ్చలుఁడగుటన్.

పోతన 3-29-952

శ్లో॥ అహం సర్వేషు భూతేషు భూతాత్మావస్థితస్సదా।
తమవజ్ఞాయ మాంమర్త్యః కురుతేఽర్చావిడంబనమ్॥ 133
యో మాం సర్వేషు భూతేషు సంతమాత్మానమీశ్వరమ్।
హిత్వార్చాం భజతే మౌఢ్యాద్భస్మన్యేవ జుహోతి నః॥
వ్యాస 3-29-22, 23

చ. అనిశము సర్వభూత హృదయాంబుజవర్తి యనం దనర్చు నీ
శు నను నవజ్ఞ సేసి మనుజుం డొగి మత్ప్రతిమార్చనా విడం
బనమున మూఢుఁడై యుచిత భక్తిని నన్ను భజింపఁడేని య
మ్మనుజుఁడు భస్మకుండమున మానక వేల్చినయట్టివాఁడగున్. 99
పోతన 3-29-955

**శ్రీ భగవానువాచ :**

శ్లో॥ జీవాశ్శ్రేష్ఠా హ్యజీవానాం తతః ప్రాణభృతశ్శుభే।
తతస్సచిత్తాః ప్రవరాస్తతశ్చేంద్రియవృత్తయః॥ 135

శ్లో॥ తత్రాపి స్పర్శవేదిభ్యః ప్రవరా రసవేదినః।
తేభ్యో గంధవిదశ్శ్రేష్ఠాస్తతశ్శబ్దవిదో వరాః॥ 136

రూపభేదవిదస్తత్ర తతశ్చోభయతోదితః।
తేషాం బహుపదాశ్శ్రేష్ఠాశ్చతుష్పాదా స్తతో ద్విపాత్॥ 137
వ్యాస 3-29-29 నుండి 31

సీ. తరళాక్షి! విను మచేతన దేహములకంటెఁ
జేతనదేహముల్ శ్రేష్ఠ మందుఁ
బ్రాణవంతంబులై స్పర్శన జ్ఞానంబు
గలుగు చైతన్య వృక్షములకంటె
ఘన రసజ్ఞాన సంకలిత చేతన లుత్త
ములు, రసజ్ఞానంబు గలుగువాని



కంటె గంధజ్ఞాన కలిత భృంగంబులు
గడు శ్రేష్ఠములు, వానికంటె శబ్ద

తే. వేదు లగుదురు శ్రేష్ఠులు, వెలయు శబ్ద
విదులకంటెను మఱి రూప వేదులైన
వాయసాదులు శ్రేష్ఠముల్, వానికంటె
వరుస బహుపాదు లుత్తముల్ వానికంటె. 100

క. తలఁపఁజతుష్పదు లధికులు
బలకొని మఱి వానికంటెఁబాదద్వయముం
గల మనుజు లలఘుతము లి
మ్ముల వారలయందు వర్ణములు నాల్గరయున్. 101
పోతన 3-29-957, 958

శ్లో॥ తతో వర్ణాశ్చ చత్వారస్తేషాం బ్రాహ్మణ ఉత్తమః।
బ్రాహ్మణేష్వపి వేదజ్ఞో హ్యర్థజ్ఞోఽభ్యధికస్తతః॥ 138

శ్లో॥ అర్థజ్ఞాత్సంశయచ్ఛేత్తా తతశ్శ్రేయాన్ స్వకర్మకృత్।
ముక్తసంగస్తతో భూయాన్నదోగ్ధా ధర్మమాత్మనః॥ 139

తస్మాన్మయ్యర్పితా శేషక్రియార్థాత్మా నిరంతరః।
మయ్యర్పితాత్మనః పుంసో మయి సన్న్యస్తకర్మణః॥

న పశ్యామి పరం భూతమకర్తుస్సమదర్శనాత్।
మనసైతాని భూతాని ప్రణమేద్బహుమానయన్॥ 141
వ్యాస 3-29-32 నుండి 35

వ. అందు

సీ. తలఁప బ్రాహ్మణులుత్తములు వారికంటెను
వేదవేత్తలు, వేదవిదుల కంటె

విలసిత వేదార్థ విదులు, వారలకంటె
సమధిక శాస్త్రసంశయము మాన్పు
మీమాంసకులు, మఱి మీమాంసకులకంటె
నిజధర్మ విజ్ఞాన నిపుణు, లరయ
వారికంటెను సంగవర్జిత చిత్తులు,
దగ వారికంటె సద్ధర్మపరులు

తే. ధార్మికులకంటె నుత్తమోత్తముఁడు వినుము
మత్సమర్పిత సకలకర్మస్వభావ
మహిమములుగల్గి యితర కర్మములు విడిచి
సమత వర్తించు నప్పుణ్యతముఁడు ఘనుఁడు. 102

వ. అట్టివాని

క. కని సకల భూతగణములు
మనమున నానందజలధి మగ్నము లగుచున్
ఘన బహుమాన పురస్సర
మనయముఁబాటిల్ల వినుతు లర్థిం జేయున్. 103

పోతన 3-29-959 నుండి 962

శ్లో॥ ఈశ్వరో జీవకలయా ప్రవిష్టో భగవానితి।
భక్తియోగశ్చ యోగశ్చ మయా మానవ్యుదీరతః॥ 142

తయోరేకతరేణైవ పురుషః పురుషం వ్రజేత్।
ఏతద్భగవతో రూపం బ్రహ్మణః పరమాత్మనః॥

పరం ప్రధానపురుషోద్దైవం కర్మవిచేష్టితమ్।
రూపభేదాస్పదం దివ్యం కాల ఇత్యభిధీయతే।



భూతానాం మహదాదీనాం యతో భిన్నదృశాం భయమ్।
యోఽన్తః ప్రవిశ్య భూతాని భూతైరత్త్యఖిలాశ్రయః॥

స విష్ణ్వాఖ్యోఽధియజ్ఞోఽసౌ కాలః కలయతాం ప్రభుః।
న చాస్య కశ్చిద్దయితో న ద్వేష్యో న చ బాంధవః॥ 146

వ్యాస 3-29-36 నుండి 40

వ. అంత నీశ్వరుండు జీవస్వరూపానుప్రవిష్టుండై యుండు. అట్టి భగవంతుం జూచి భక్తియోగంబుననైన, యోగంబున నైనం బురుషుండు పరమాత్మం బొందు. ప్రకృతి పురుషాత్మకంబును దద్వ్యతిరిక్తంబుననైన దైవంబునై కర్మవిచేష్టితం బగుచునుండు. అదియ భగవద్రూపంబు. ఇట్టి భగవద్రూపంబు రూపభేదాస్పదం బగుచు నద్భుత ప్రభావంబు గల కాలం బనియుఁజెప్పంబడు. అట్టి కాలంబు మహదాదితత్త్వంబులకును, దత్తత్త్వాభిమానులగు జీవులకును భయావహం బగుటంజేసి సకల భూతంబులకు నాశ్రయంబగుచు, నంతర్గతంబై భూతంబులచేత భూతంబుల గ్రహింపుచు, యజ్ఞఫలప్రదాత గావున వశీకృత భూతుండై ప్రభుత్వంబు భజియించి విష్ణుండు ప్రకాశింపుచుండు....చరాత్మకం బగు సకల ప్రపంచంబు భగవదధీనంబయి యుండు. 104

(వ్యాస 3-29-36 నుండి 46)
పోతన 3-29-963

* * *

## అధ్యాయము - 31

### కపిలుండు దేవహూతికిఁబిండోత్పత్తిక్రమము తెలుపుట

**శ్రీ భగవానువాచ :**

శ్లో॥ కర్మణా దైవనేత్రేణ జంతుర్దేహోపపత్తయే।
స్త్రియఃప్రవిష్ట ఉదరం పుంసో రేతః కణాశ్రయః॥ 147

కలిలం త్వేకరాత్రేణ పంచరాత్రేణ బుద్బుదమ్।
దశాహేన చ కర్కంధుః పేశ్యండం వా తతః పరమ్॥

మాసేన తు శిరోద్వాభ్యాం బాహ్వంఘ్ర్యాద్యంగవిగ్రహమ్।
నఖరోమాస్థిచర్మాణి లింగచ్ఛిద్రోద్భవస్త్రిభిః॥

చతుర్భిర్ధాతవస్సప్త పంచభిః క్షుత్తృడుద్భవః।
షడ్భిర్జరాయుణా వీతః కుక్షౌ భ్రామ్యతి దక్షిణే॥

సప్తమే జన్మకర్మాణి గతాని స్మరతే ఋషిః।
జగత్యాం నిజదేహస్య మాయయా బంధమాత్మనః॥

మాతుర్జగ్ధాన్నపానాద్యై రేధద్ధాతురసంమతే।
శేతే విణ్మూత్రయోర్గర్తే నజంతుర్జంతుసంభవే॥ 152

క్రిమిభిః క్షతసర్వాంగ స్సౌకుమార్యాత్ప్రతిక్షణమ్।
మూర్ఛామాప్నోత్యురుక్లేశ స్తత్రత్యైఃక్షుధితై ర్ముహుః॥

శ్లో॥ కటుతీక్ష్ణోష్ణలవణక్షారామ్లాదిభిరుల్బణైః।
మాతృభుక్తైరుపస్పృష్టస్సర్వాంగోత్థితవేదనః॥ 154

ఉల్బేన సంవృతస్తస్మిన్నాంత్రైశ్చ బహిరావృతమ్।
ఆస్తే కృత్వా శిరః కుక్షౌ భుగ్నపృష్ఠశిరోధరః।
అకల్యస్స్వాంగచేష్టాయాం శకుంత ఇవ పంజరే॥

తత్ర లబ్ధస్మృతిర్దైవాత్కర్మజన్మశతోద్భవమ్।
స్మరన్దీర్ఘమనుచ్ఛ్వాసం శర్మ కిన్నామ విందతే॥

ఆరభ్య సప్తమాన్మాసాల్లబ్ధబోధోఽ తి వేపితః।
నైకత్రాస్తే సూతివాతైర్విష్ఠాభూరివ సోదరః॥

నాథమాన ఋషిర్భీతస్సప్తవర్ధిః కృతాంజలిః।
సంస్తౌతి తం విక్లబయా వాచా యేనోదరేఽ ర్పితః॥ 158

వ్యాస 3-31-1 నుండి 12

సీ. కైకొని మఱి పూర్వకర్మానుగుణమున
శశ్వ త్ప్రకాశకుం డీశ్వరుండు
ఘటకుండు గావునఁగ్రమ్మఱ జీవుండు
దేహసంబంధంబుఁదివిరి తాల్ప
దొరఁకొని పురుష రేతో బిందుసంబంధి
యై వధూగర్భంబునందుఁజొచ్చి
కైకొని యొకరాత్రిఁగలిలంబు పంచరా
త్రముల బుద్బుదమును దశమదివస

తే. మందుఁగర్కంధువై యుండు నంతమీఁదఁ
బేశి యగు నంతమీఁదటఁబేర్చియుండ
కల్పమగు నొక్కనెల మస్తకమును మాస
యమళ మైనను గరచరణములుఁబొడము. 105

వ. మఱియు మాసత్రయంబున నఖ రోమాస్థి చర్మంబులు లింగచ్ఛిద్రంబులును గలిగి, నాలవమాసంబున సప్తధాతువులు, పంచమమాసంబున క్షుత్తృష్ణలు గలిగి, షష్ఠమాసంబున మావిచేత బొదువంబడి, తల్లి కుక్షిని దక్షిణభాగంబునం దిరుగుచు. మాతృభుక్తాన్నపానంబులవలనఁదృప్తిం బొందుచు, సమస్తధాతువులును గలిగి జంతు సంకీర్ణంబగు విణ్మూత్ర

గర్తంబందుఁదిరుగుచుఁ, గ్రిమిభక్షిత శరీరుండై మూర్ఛలం బొందుచుఁ, దల్లిభక్షించిన కటుతిక్తోష్ణ లవణక్షారామ్ల ద్యుల్బణంబులైన రసంబులచేతఁ బరితప్తాంగుండగుచు, జరాయువునఁగప్పంబడి, బహిః ప్రదేశంబునందు నాంత్రంబులచేత బద్ధుండై, కుక్షియందు శిరంబు మోపికొని, భగ్నంబైన పృష్ఠ గ్రీవోదరుండై, స్వాంగచలనంబునందు నసమర్థుండగుచుఁ, బంజరంబులందు బద్ధశకుంతంబు చందంబున నుండి, దైవకృతంబైన జ్ఞానంబునం బూర్వజన్మ దుష్కర్మశతంబులం దలంపుచు, దీర్ఘోచ్ఛ్వాసంబు సేయుచు, నే సుఖంబునుంబొందక వర్తించు. అంత నేడవమాసంబున లబ్ధజ్ఞానుండై చేష్టలు గలిగి, విట్క్రిమిసోదరుండై. యొకదిక్కున నుండక సంచరింపుచుఁబ్రసూతి మారుతంబులచేత నతివేపితుండగుచు, యాచమానుండును దేహాత్మదర్శియుఁబునర్గర్భవాసంబునకు భీతుఁడు నగుచు బంధనభూతంబులగు సప్తధాతువులచే బద్ధుండై, కృతాంజలి పుటుండును దీనవదనుండునై, జీవుండు దా నెవ్వనిచే నుదరంబున వసియింప నియమింపంబడెనట్టి సర్వేశ్వరునిట్లని స్తుతియించు. 106

పోతన 3-31-983

## గర్భస్థుండగు జీవుండు భగవంతుని స్తుతియించుట

**జీవ ఉవాచ :**

శ్లో॥ యస్త్వత్ర బద్ధ ఇవ కర్మభిరావృతాత్మా
భూతేంద్రియాశయమయీమవలంబ్య మాయామ్।
ఆస్తే విశుద్ధమవికారమఖండబోధ
మాతప్యమానహృదయేఽవసితం నమామి॥ 159

వ్యాస 3-31-14

సీ. ఎవ్వఁడు నిఖిలభూతేంద్రియమయ మగు
మాయావలంబన మహిత కర్మ



బద్ధుఁడై వర్తించుపగిది దందహ్య
మానంబగు జీవచిత్తంబునందు
నవికారమై శుద్ధమై యఖండ జ్ఞాన
మున నుండు వానికి ముఖ్యచరితు
నకు నకుంఠితశౌర్యునకుఁబరంజ్యోతికి
సర్వజ్ఞునకుఁగృపాశాంతమతికిఁ

తే. గడఁగియుఁబ్రకృతిపురుషులకంటెఁబరముఁ
డైనవానికి మ్రొక్కెద నస్మదీయ
దుర్భరోదగ్ర భీకరగర్భనరక
వేదనలు మాన్చి శాంతిఁగావించుకొఱకు. 107

పోతన 3-31-986

(గమనిక: గర్భోత్పత్తిరీతి, గర్భస్థ శిశువిచారము, శ్రౌతకర్మలవలన గర్భవృద్ధి గర్భ (పతనములేకుండ) ధారణ గర్భరక్షణ యజ్ఞమువలన ప్రజాసృష్టి ఇత్యాది విషయములు "సాంగ వేదార్థవాచస్పతి" బ్రహ్మశ్రీ వేదమూర్తులు ఉప్పులూరి గణపతిశాస్త్రిగారిచే రచియింపబడిన "వేదసార రత్నావళి" ప్రథమభాగములో 8వ అధ్యాయములో సంపూర్ణముగ వివరింపబడినవి. ఈ గ్రంథము రెండు భాగములు. శ్రీ అన్నవరం వీరవేంకటసత్యనారాయణ స్వామివారి దేవస్థానము 1974వ సంవత్సరమున ప్రచురించిరి. పాఠకులు "వేదసార రత్నావళి" చదివి శ్రుతి స్మృతి పురాణాదులలో చెప్పబడిన విషయములను, తెలిసికొని ఆచరించినచో భగవదనుగ్రహమునకు పాత్రులై, సర్వశుభములు పొందగలరు.)

**కపిల ఉవాచ :**

శ్లో॥ సత్యం శౌచం దయా మౌనం బుద్ధిర్హ్రీశ్శ్రీర్యశః క్షమా।
శమో దమో భగశ్చేతి యత్సంగాద్యాతి సంక్షయమ్॥ 160
తేష్వశాంతేషు మూఢేషు ఖండితాత్మస్వసాధుషు।
సంగం న కుర్యాచ్ఛోచ్యేషు యోషిత్క్రీడామృగేషు చ॥

న తథాస్య భవేన్మోహో బంధశ్చాన్యప్రసంగతః।
యోషిత్సంగాద్యథా పుంసో యథా తత్సంగిసంగతః॥ 162

వ్యాస 3-31-34 నుండి 36

సీ. జనయిత్రి! సత్యంబు శౌచంబు దయయును
ధృతియు మౌనంబు బుద్ధియును సిగ్గు
క్షమయును యశమును శమదమ భగములు
మొదలుగాఁగల గుణంబులు నశించు
జనుల కసత్సంగమున నని యెఱిఁగించి
వెండియు నిట్లను వినుము మూఢ
హృదయులు శాంతివిహీనులు దేహాత్మ
బుద్ధులు నంగనా మోహపాశ

తే. బద్ధకేళీమృగంబుల పగిదిఁదగిలి
పరవశ సాంత్వముల శోచ్యభావులైన
వారిసంగతి విడువంగవలయు నందు
నంగనాసంగమము దోషమంద్రు గాన. 108

పోతన 3-31-997

శ్లో॥ సంగం న కుర్యాత్ప్రమదాసు జాతు
యోగస్య పారం పరమారురుక్షుః।
మత్సేవయా ప్రతిలబ్ధాత్మలాభో
వదంతి యా నిరయద్వారమస్య॥ 163

యోఽ పయాతి శనైర్మాయా యోషిద్దేవవినిర్మితా।
తామీక్షేతాత్మనో మృత్యుం తృణైఃకూపమివావృతమ్

యాం మన్యతే పతిం మోహాన్మన్మాయామృషభాయతీమ్।
స్త్రీత్వం స్త్రీసంగతః ప్రాప్తో విత్తాపత్యగృహప్రదమ్॥



తమాత్మనో విజానీయాద్విత్తాపత్యగృహాత్మకమ్।
దైవోపసాదితం మృత్యుం మృగయోర్గాయనం యథా॥

దేహేన జీవభూతేన లోకాల్లోకమనువ్రజన్।
భుంజాన ఏవ కర్మాణి కరోత్యవిరతం పుమాన్॥ 167

వ్యాస 3-31-40 నుండి 44

తే. రూఢి నా మాయ కామినీరూపమునను
బురుషులకు నెల్ల మోహంబుఁబొందఁజేయుఁ
గానఁబురుషులు సతుల సంగంబు మాని
యోగవృత్తిఁజరింపుచు నుండవలయు. 109

క. ధీరతతో మత్పద సర
సీరుహ సేవానురక్తిఁజెందిన వారల్
నారీ సంగము నిరయ
ద్వారముగా మనములందుఁదలఁపుదు రెందున్.

క. హరిమాయా విరచితమై
తరుణీరూపంబుఁదాల్చి ధరఁబర్విన బం
ధుర తృణపరివృత కూపము
కరణి నదియు మృత్యురూపకం బగు మఱియున్. 111

చ. ధన పశు పుత్ర మిత్ర వనితా గృహ కారణభూతమైన యీ
తనువున నున్న జీవుఁడు పదంపడి యెట్టి శరీర మెత్తి తా
ననుగతమైన కర్మఫల మందక పోవఁగరాదు మిన్ను వ్రాఁ
కిన భువిఁదూఱినన్ దిశల కేగిన నెచ్చటనైన దాఁగినన్.

పోతన 3-31-999 నుండి 1002

* * *

## అధ్యాయము - 33

### దేవహూతి కపిలుని స్తోత్రంబు సేయుట

**మైత్రేయ ఉవాచ :**

శ్లో॥ సత్త్వం భృతో మే జఠరేణ నాథ
కథం ను యస్యోదర ఏతదాసీత్।
విశ్వం యుగాంతే వటపత్ర ఏక
శ్శేతే స్మ మాయాశిశురంఘ్రిపానః॥ 168
వ్యాస 3-33-4

తే. అతుల భూరి యుగాంతంబునందుఁగపట
శిశువవై యొంటిఁకుక్షినిక్షిప్త నిఖిల
భువననివహుండ వై మహాంభోధినడుమఁ
జారు వటపత్రతల్ప సంస్థాయి వగుచు. 113
పోతన 3-33-1021

శ్లో యన్నామధేయశ్రవణానుకీర్తనా
ద్యత్ప్రహ్వణాద్యత్స్మరణాదపి క్వచిత్।
శ్వాదోఽపి సద్యస్సవనాయ కల్పతే
కుతః పునస్తే భగవన్ను దర్శనాత్॥ 169

అహో బత శ్వపచోఽతో గరీయాన్
యజ్జిహ్వాగ్రే వర్తతే నామ తుభ్యమ్।
తేపుస్తపస్తే జుహువుస్సస్ను రార్యా
బ్రహ్మానూచుర్నామ గృణంతి యే తే॥ 170
వ్యాస 3-33-6,7

క. ధీమహిత! భవ న్మంగళ
నామ స్మరణాను కీర్తనము గల హీనుల్
శ్రీమంతు లగుదు రగ్ని
ష్టోమాది కృదాళికంటె శుద్ధులు దలఁపన్. 114

వ. అదియునుం గాక

క. నీ నామస్తుతి శ్వపచుం
డైనను జిహ్వాగ్రమందు ననుసంధింపన్
వానికి సరి భూసురుఁడున్
గానేరఁడు చిత్ర మది జగంబుల నరయన్. 115
పోతన 3-33-1026 నుండి 1028

శ్లో॥ తం త్వాద్ధాహంబ్రహ్మపరం పుమాంసం
ప్రత్యక్స్రోతస్యాత్మని సంవిభావ్యమ్।
స్వతేజసా ధ్వస్తగుణప్రవాహం
వన్దే విష్ణుం కపిలం వేదగర్భమ్॥ వ్యాస 3-33-8

వ. అది గావునఁ, బరబ్రహ్మంబవు. పరమపురుషుండవు. ప్రత్యఙ్మనోవిభావ్యుండవు. సమస్తజన పాపనివారక స్వయంప్రకాశుండవు. వేదగర్భుండవు. శ్రీమహావిష్ణుండవు నగు నీకు వందనంబు లాచరించెద. అని స్తుతియించినఁ బరమపురుషుండు మాతృవత్సలుండు నగు కపిలుండు కరుణారస సాంద్రహృదయకమలుండై జనని కిట్లనియె.
పోతన 3-33-1030

**శ్రీ భగవాన్ కపిల ఉవాచ :**

శ్లో॥ మార్గేణానేన మాతస్తే సుసేవ్యేనోదితేన మే।
అస్థితేన పరాం కాష్ఠామచిరాదవరోత్స్యసి॥ 172

శ్రద్ధత్స్వైతన్మతం మహ్యం జుష్టం యద్బ్రహ్మవాదిభిః।
యేన మామభయం యాయా మృత్యుమృచ్ఛంత్యతద్విదః॥ 173
వ్యాస 3-33-10, 11

తే. తవిలి సుఖరూపమున మోక్షదాయకంబు
నైన యీ యోగమార్గ మే నంబ! నీకు
నెఱుఁగ వివరించి చెప్పితి నిది దృఢంబు
గాఁగ భక్తి ననుష్ఠింపు కమలనయన! 117

క. జీవన్ముక్తి లభించుం
గావున నేమఱక తలంపుఁగైకొని దీనిన్
వావిరి నొల్లనివారికిఁ
దావల మగు మృత్యుభయము దవ్వగు సుఖమున్ 118

(గమనిక: దేవహూతికి జీవన్ముక్తి లభించిన స్థలమును **"సిద్ధపదం"** అని అందురు. అది పరమ పవిత్ర క్షేత్రంగా ప్రసిద్ధికెక్కినది.)

పోతన 3-33-1031, 1032

## కపిలుండు కరుణతో జనని కిట్లనియె

**మైత్రేయ ఉవాచ :**

శ్లో॥ విశుద్ధేన తదాత్మానమాత్మనా విశ్వతోముఖమ్।
స్వానుభూత్యా తిరోభూతమాయాగుణవిశేషణమ్॥ 174

భక్తిప్రవాహయోగేన వైరాగ్యేణ బలీయసా।
యుక్తానుష్ఠానజాతేన జ్ఞానేన బ్రహ్మహేతునా॥

బ్రహ్మణ్యవస్థితమతిర్భగవత్యాత్మసంశ్రయే।
నివృత్తిజీవాపత్తిత్వాద్వీతక్లేశాఽఽప్తనిర్వృతిః॥

నిత్యారూఢసమాధిత్వాత్పరావృత్తగుణభ్రమా।
న సస్మార తదాత్మానం స్వప్నదృష్టమివోత్థితః॥

తద్దేహః పరతః పోషోఽప్యకృశస్త్వాధ్యసంభవాత్।
బభౌ మలైరవచ్ఛన్నస్సధూమ ఇవ పావకః॥

స్వాంగం తపోయోగమయం ముక్తకేశం గతాంబరమ్।
దైవగుప్తం న బుబుధే వాసుదేవే ప్రవిష్టధీః॥ 179

వ్యాస 3-33-24 నుండి 29

సీ. అనయంబు నాత్మనాయకుఁడును, విశ్వతో
ముఖుఁ, డనంతుఁడు, పరముఁడు, నజుండు,
చతురుండు, నిజపరిజ్ఞాన దీపాంకుర
మహిమ నిరస్త సమస్తభూరి
మాయాంధకారుఁడమేయుఁడీశ్వరుఁ
డగు నా పరబ్రహ్మంబునం దవిరత
బద్ధ తత్త్వజ్ఞాన పరతచే నిర్ముక్త
జీవభావమున విశిష్ట యోగ

తే. భవ్యసంప్రాప్త నిర్మల బ్రహ్మభావ
ములను గలిగి సమాధిచే నెలమిఁదనరు
నపునరావృత్త మగు త్రిగుణ ప్రధాన
తత్త్వముల నొప్పి సంతతోదార నియతి. 119

తే. కలలఁదోచిన వస్తుసంఘముల మేలు
కని కనుంగొనఁగా లేని మనుజు పోల్కి
బొలఁతి దనయాత్మ మఱచి యిమ్ముల సధూమ
మైన పావకుగతినుండె నంతలోన.

క. గురుయోగ శక్తిచే నం
బరతలమున కెగసి సత్కృపామయుఁడగు నా
పరవాసుదేవు చరణాం
బురుహయుగ న్యస్తచిత్తము గలది యగుచున్. 121

పోతన 3-33-1039 నుండి 1041

శ్లో॥ కపిలోఽపి మహాయోగీ భగవాన్ పితురాశ్రమాత్।
మాతరం సమనుజ్ఞాప్య ప్రాగుదీచీం దిశం యయౌ॥

సిద్ధచారణగంధర్వైర్మునిభిశ్చాప్సరోగణైః।
స్తూయమానస్సముద్రేణ దత్తార్హణనికేతనః॥

ఆస్తే యోగం సమాస్థాయ సాంఖ్యాచార్యైరభిష్టుతః।
త్రయాణామపి లోకానాముపశాంత్యై సమాహితః॥

వ్యాస 3-33-33 నుండి 35

వ. కపిలుండు తల్లిచేత ననుజ్ఞాతుండై సిద్ధచారణగంధర్వాప్సరోమునినివహ సంస్తూయమానుం డగుచు, సముద్రునిచేత దత్తార్హణ పూజాని కేతనంబులు వడసి, సాంఖ్యాచార్యాభిష్టుతంబగు యోగంబు నవలంబించి లోకత్రయ శాంతికొఱకు సమాహితుండై స్వపిత్రాశ్రమంబు విడిచి యుదగ్భాగంబునకుం జనియె.

ఇది కపిల దేవహూతి సంవాదం బత్యంత పావనంబు కపిల ప్రణీతంబు నైన యోగంబు. దీనిని పఠించువారు వినువారు శ్రీమన్నారాయణుని చరణారవిందంబులం బొందుదురని మైత్రేయుండు విదురున కెఱింగించె.

పోతన 3-33-1042

చ. జనకసుతా మనో విమలసారస కోమల చంచరీక చం
దన శరదిందు కుంద హర తార మరాళ పటీర చంద్రికా
వినుత యశోవిశాల! రఘువీర! దర స్మిత పద్మపత్రలో
చన! నిట లాంబక ప్రకటచాప విఖండన! వంశమండనా! 123

**తరల.** పరమపావన! విశ్వభావన! బాంధవప్రకరావనా!
శరధి శోషణ! సత్యభాషణ! సత్కృపామయ భూషణా!
దురిత తారణ! సృష్టికారణ! దుష్టలోక విదారణా!
ధరణీపాలన! ధర్మశీలన! దైత్యమర్దన ఖేలనా!

**మాలిని.** దివిజగణ శరణ్యా! దీపి తానంతపుణ్యా!
ప్రవిమల గుణజాతా! భక్త లోకానుపాలా!
భవతిమిర దినేశా! భానుకోటి ప్రకాశా!
కువలయ హితకారీ! ఘోర దైత్య ప్రహారీ! 125

పోతన 3-33-1043 నుండి 1045

***ఇతి తృతీయస్కన్ధః సమాప్తః***

**హరిః ఓమ్**

**శ్రీకృష్ణార్పణమస్తు**

ఓమ్ నమో భగవతే వాసుదేవాయ

# శ్రీమద్భాగవత మణిహారము

## 15. చతుర్థ స్కంధము

శ్లో॥ అధ్రువాయ కృతో యత్నో ధ్రువాయ పరికల్పితః।
ధ్రువస్య యత్ప్రసాదేన వాసుదేవం నతోఽస్మితమ్॥

క. శ్రీవిలసిత ధరణీతన
యా వదనసరోజ వాసరాధిప! సితరా
జీవదళనయన! నిఖిల ధ
రావరనుత! సుగుణధామ! రాఘవరామా!

## అధ్యాయము - 4

దక్షప్రజాపతి యజ్ఞము, దాక్షాయణి (సతీదేవి) నవమానించుట

**శ్రీ దేవ్యువాచ :**

శ్లో॥ న యస్య లోకేఽస్త్యతిశాయనః ప్రియ
స్తథాఽప్రియో దేహభృతాం ప్రియాత్మనః।
తస్మిన్ సమస్తాత్మని ముక్తవైరకే
ఋతే భవంతం కమతః ప్రతీపయేత్॥ 1

దోషాన్ప రేషాం హి గుణేషు సాధవో
గృహ్ణంతి కేచిన్న భవాదృశా ద్విజ।
గుణాంశ్చ ఫల్గూన్బహులీకరిష్ణవో
మహత్తమాస్తేష్వవిదద్భవానఘమ్॥ 2

శ్లో॥ నాశ్చర్యమేతద్యదసత్సు సర్వదా
మహద్వినిందా కుణపాత్మవాదిషు।

సేర్ష్యం మహాపూరుష పాదపాంసుభి
ర్నిరస్తతేజస్సు తదేవ శోభనమ్॥ 3

వ్యాస 4-4-11 నుండి 13

వ. దక్షతనయ సతీదేవి, దక్షుని వధియింతు మనుచు లేచిన భూతగణంబుల నివారించి, రోషావ్యక్తభాషణంబుల నిట్లనియె. "లోకంబున శరీరధారులై జీవులకుఁబ్రియాత్మకుండైన యీశ్వరునకుఁబ్రియాప్రియులు, నధికులును లేరు. అట్టి సకల కారణుండు నిర్మత్సరుండునైన రుద్రునందు నీవు దక్క నెవ్వండు ప్రతికూలంబాచరించు? అదియునుంగాక మిముబోఁటివారలు పరులవలని గుణంబులందు దుర్గుణంబులన యాపాదింతురు. మఱియుం గొందఱు మధ్యస్థు లయినవారలు పరుల గుణంబులయందు దోషంబుల నాపాదింతురు. కొందఱు సాధువర్తనంబు గలవారల పరుల దోషంబులనైన గుణంబులుగా ననుగ్రహింతురు. మఱియుం గొందఱుత్తమోత్తములు పరులయందు దోషంబుల నాపాదింపక తుచ్ఛగుణంబులు గలిగినను సద్గుణంబులుగాఁగైకొందురు. అట్టి మహాత్ములయందు నీవు పాపబుద్ధిం గల్పించితివి", అని వెండియు నిట్లను. "మహాత్ములగువారల పాదధూళిచే నిరస్త ప్రభావులై జడస్వభావంబుగల దేహంబు నాత్మయని పల్కు కుజనులగువారు మహాత్ముల నిందించుటాశ్చర్యంబు గాదు. అదియు వారి కనుచితంబగు, అని వెండియు నిట్లనియె. పోతన 4-4-87

శ్లో॥ యద్ద్వ్యక్షరం నామ గిరేరితం నృణాం
సకృత్ప్రసంగాదఘమాశుహంతి తత్।
పవిత్రకీర్తిం తమలంఘ్యశాసనం
భవానహో ద్వేష్టి శివం శివేతరః॥ 4

యత్పాదపద్మం మహతాం మనోఽళిభి
ర్నిషేవితం బ్రహ్మరసాసవార్థిభిః।



లోకస్య యద్వర్షతి చాశిషోఽర్థిన
స్తస్మైభవాన్ ద్రుహ్యతి విశ్వబంధవే॥ 5

వ్యాస 4-4-14, 15

సీ. అనయంబు **'శివ'** యను నక్షరద్వయ మర్థి
వాక్కునఁబలుక భావమునఁదలంప
సర్వజీవుల పాపసంఘముల్ చెడునట్టి
మహితాత్మునందు నమంగళుండ
వగు నీవు విద్వేషి వగుట కాశ్చర్యంబు
నందదే! వినుము, నీ వదియుఁగాక
చర్చింప నెవ్వని చరణపద్మంబుల
సరసి బ్రహ్మానంద మను మరంద

తే. మతులభక్తినిఁదమ హృదయంబు లనెడి
తుమ్మెదలచేతఁ గ్రోలి సంతుష్టచిత్తు
లగుదు రత్యంత విజ్ఞాను లట్టి దేవు
నందు ద్రోహంబు సేసితేమందు నిన్ను? 2

క. మఱియును న మ్మహితాత్ముని
చరణ సరోజాతయుగము సకలజగంబుల్
నెఱిఁగొలువఁగోరు కోర్కులు
దరమిడి వర్షించు నతనిఁదగునే తెగడన్. 3

శ్లో॥ కిం వా శివాఖ్యమశివం న విదుస్త్వదన్యే
బ్రహ్మాదయస్తమవకీర్య జటాః శ్మశానే।
తన్మాల్యభస్మ నృకపాల్యవసత్ పిశాచై
ర్యేమూర్ధభి ర్దధతి తచ్చరణావసృష్టమ్॥ 6

వ్యాస 4-4-16

చ. పరఁగఁజితాస్థిభస్మనృకపాల జటాధరుఁడున్ బరేత భూ
చరుఁడు పిశాచయుక్తుఁడని శర్వు నమంగళుఁగాఁదలంప రె
వ్వరు నొకఁడీవు దక్క మఱి వాక్పతిముఖ్యులు నమ్మహాత్ము స
చ్చరణసరోజ రేణువులు సమ్మతిఁదాల్తురు మస్తకంబులన్. 4
పోతన 4-4-90

శ్లో॥ కర్ణౌ పిధాయ నిరయాద్యదకల్ప ఈశే
ధర్మావిత ర్యసృణిభిర్నృభిరస్యమానే।
ఛింద్యాత్ ప్రసహ్య రుశతీ మసతాం ప్రభుశ్చే
జ్జిహ్వా మసూనపి తతో విసృజేత్ సధర్మః॥ 7
వ్యాస 4-4-17

చ. నెలకొని ధర్మపాలన వినిర్మలు భర్గుఁదిరస్కరించు న
క్కలుషుని జిహ్వఁగోయఁదగుఁగా కటు సేయఁగ నోపఁడేనిఁదాఁ
బొలియుట యొప్పు రెంటికిఁబ్రభుత్వము చాలమిఁగర్ణ రంధ్రముల్
బలువుగ మూసికొంచుఁజనఁబాడియఁటందురు ధర్మవర్తనుల్. 5
పోతన 4-4-91

శ్లో॥ అత స్తవోత్పన్న మిదం కళేబరం
న ధారయిష్యే శితికంఠగర్హిణః।
జగ్ధస్య మోహాద్ధి విశుద్ధి మంధసో
జుగుప్సిత స్యోద్గిరణం ప్రచక్షతే॥ 8
వ్యాస 4-4-18

మ. జనుఁడజ్ఞానమునన్ భుజించిన జుగుప్సంబైన యన్నంబు స
య్యన వెళ్ళించి పవిత్రుఁడైనగతి దుష్టాత్ముండవై యీశ్వరున్
ఘను నిందించిన నీ తనూభవ యనంగా నోర్వ నీ హేయ భా
జన మైనట్టి శరీరమున్ విడిచి భాస్వచ్ఛుద్ధి ప్రాపించెదన్. 6
పోతన 4-4-93



శ్లో॥ నై తేన దేహేన హరేకృతాగసో
దేహోద్భవేనాల మలం కుజన్మనా।
వ్రీడా మమాభూత్కుజనప్రసంగత
స్తజ్జన్మ ధిగ్యోమహతామహృద్యకృత్॥ 9

గోత్రం త్వదీయం భగవాన్వృషధ్వజో
దాక్షాయణీత్యాహ యదా సుదర్మనాః।
వ్యపేతనర్మస్మితమాశు తద్ధ్యహం
వ్యుత్స్రక్ష్య ఏతత్కుణపం త్వదంగజమ్॥ 10
వ్యాస 4-4-22, 23

ఉ. నీలగళాపరాధి యగు నీకుఁదనూభవ నౌట చాలదా?
చాలుఁగుమర్త్య! నీదు తనూజాత ననన్ మది సిగ్గు పుట్టెడి
న్నేల, ధరన్ మహాత్ములకు నెగ్గొనరించెడి వారి జన్మముల్
గాలుపనే; తలంప జనకా! కుటిలాత్మక! యెన్ని చూడఁగన్.

చ. వరవృషకేతనుండు భగవంతుఁడు నైన హరుండు నన్ను నా
దర పరిహాస వాక్యముల దక్షతనూభవ! యంచుఁబిల్వ నేఁ
బురబురఁబొక్కుచున్ ముదముఁబొందక నర్మవచః స్మితంబులన్
దొఱఁగుదు నీ తనూజ నను దుఃఖముకంటెను జచ్చుటొప్పగున్. 8
పోతన 4-4-95, 96

* * *

## అధ్యాయము - 5

### శివుఁడు వీరభద్రునిచే దక్షయజ్ఞంబు ధ్వంసంబు చేయించుట

**మైత్రేయ ఉవాచ :**

శ్లో॥ కృద్ధ స్సుదష్టోష్ఠపుటస్సధూర్జటి
ర్జటాం తటిద్వహ్నిసటోగ్రరోచిషమ్।
ఉత్కృత్యరుద్రస్సహసోత్థితోహస
న్గంభీరనాదో విససర్జ తాం భువి॥ 11

వ్యాస 4-5-2

శా. ఆద్యుం డుగ్రుఁడు నీలకంఠుఁడిభదైత్యారాతి దష్టోష్ఠుఁడై
మాద్యద్భూరిమృగేంద్రఘోషమున భీమప్రక్రియన్ నవ్వుచున్
విద్యు ద్వహ్ని శిఖా సముచ్చయరుచిన్ వెల్గొందు చంచజ్జటన్
సద్యః క్రోధముతోడఁబుచ్చివయిచెన్ క్ష్మాచక్రమధ్యంబునన్. 9

పోతన 4-5-106

* * *

## అధ్యాయము - 7

### ఈశ్వరుండు బ్రహ్మాదులచేఁ బ్రార్థితుం డయి దక్షాదుల ననుగ్రహించుట

శ్లో॥ భూయా ననుగ్రహ అహో భవతా కృతో మే
దండస్త్వయామయి భృతో యదపి ప్రలబ్ధః।
న బ్రహ్మబంధుషు చ వాం భగవన్నవజ్ఞా
తుభ్యం హరేశ్చ కుత ఏవ ధృతవ్రతేషు॥ 12

శ్లో॥ విద్యాతపో వ్రతపరాఙ్ముఖతస్తు విప్రాన్
బ్రహ్మాత్మతత్త్వ మవితుం ప్రథమం త్వమస్రాక్।
తద్బ్రాహ్మణాన్ పరమసర్వవిపత్సు పాసి
పాలఃపశూనివ విభో ప్రగృహీతదండః॥ 13

వ్యాస 4-7-13, 14

క. విను, నీ కపరాధుఁడ నగు
నను దండించు టది దండనము గాదు మది
న్నను రక్షించుటగా మన
మునఁదలఁతును దేవ! యభవ! పురహర! రుద్రా! 10

సీ. అనఘాత్మ! నీవును నబ్జనాభుండును
పరికింప బ్రాహ్మణాభాసులైన
వారల యెడల నెవ్వలను నుపేక్షింప
రఁట, దృఢవ్రతచర్యులైన వారి
యెడ నీ కుపేక్ష యెక్కడిది? సర్గాదిని
నామ్నాయ సంప్రదాయ ప్రవర్త
నము నెఱింగించుట కమర విద్యాతపో
వ్రత పరాయణులైన బ్రాహ్మణులను

తే. వరుసఁబుట్టించితివి గాన వారి నెపుడుఁ
గేల దండంబుఁబూని గోపాలకుండు
బలసి గోవుల రక్షించు పగిది నీవు
నరసి రక్షింపుచుందు గదయ్య! రుద్ర! పోతన 4-7-159, 160

# అధ్యాయము - 8

## ధ్రువ చరిత్ర

### ధ్రువునకు నారదోపదేశము

**శ్రీనారద ఉవాచ :**

శ్లో॥ జనన్యాభిహితః పంథాస్సవై నిశ్శ్రేయసస్య తే।
భగవాన్వాసుదేవ స్తం భజ తత్ప్రవణాత్మనా॥ 14

ధర్మార్థకామమోక్షాఖ్యం య ఇచ్ఛేచ్ఛ్రేయ ఆత్మనః।
ఏకమేవ హరేస్తత్ర కారణం పాదసేవనమ్॥ 15

వ్యాస 4-8-42, 43

క. నారదుఁడిట్లను ననఘ! కు
మారక! విను, నిన్ను మోక్షమార్గంబునకున్
బ్రేరేచిన వాఁడిప్పుడు
ధీరజనోత్తముఁడు వాసుదేవుం డగుటన్. 12

వ. నీవు నమ్మహాత్ముని నజస్ర ధ్యానప్రవణ చిత్తుండ వై భజియింపుము.

క. పురుషుఁడు దవిలి చతుర్విధ
పురుషార్థశ్రేయ మాత్మఁబొందెద ననినన్
ధరఁదత్ప్రాప్తికి హేతువు
హరిపదయుగళంబు దక్క నన్యము గలదే? 14

పోతన 4-8-242 నుండి 244

శ్లో॥ ప్రసాదాభిముఖం శశ్వత్ప్రసన్నవదనేక్షణమ్।
సునాసం సుభ్రువం చారుకపోలం సురసుందరమ్॥ 16

శ్లో॥ తరుణం రమణీయాంగ అరుణౌష్ఠేక్షణాధరమ్।
ప్రణతాశ్రయణం నృమ్ణం శరణ్యం కరుణార్ణవమ్॥

శ్రీవత్సాంకం ఘనశ్యామం పురుషం వనమాలినమ్।
శంఖచక్రగదాపద్మైరభివ్యక్తచతుర్భుజమ్॥ 18

వ్యాస 4-8-47 నుండి 49

సీ. ఆశ్రిత సత్ప్రసా దాభిముఖుండును
స్నిగ్ధప్రసన్నాననేక్షణుండు
సురుచిర నాసుండు సుభ్రూయుగుండును
సుకపోలతలుఁడును సుందరుండు
హరినీల సంశోభితాంగుండుఁదరుణుండు
నరుణావలోక నోష్ఠాధరుండు
గరుణాసముద్రుండు పురుషార్థనిధియును
ప్రణతాశ్రయుండు శోభనకరుండు

తే. లలిత శ్రీవత్సలక్షణ లక్షితుండు
సర్వలోకశరణ్యుండు సర్వసాక్షి
పురుషలక్షణ యుక్తుండు పుణ్యశాలి
యసిత మేఘనిభ శ్యాముఁడవ్యయుండు. 15

పోతన 4-8-249

శ్లో॥ కిరీటినం కుండలినం కేయూరవలయాన్వితమ్।
కౌస్తుభాభరణగ్రీవం పీతకౌశేయవాససమ్॥ 19

కాంచీకలాపపర్యస్తం లసత్కాంచననూపురమ్।
దర్శనీయతమం శాంతం మనోనయనవర్ధనమ్॥ 20

పద్భ్యాం నఖమణిశ్రేణ్యా విలసద్భ్యాం సమర్చతామ్।
హృత్పద్మకర్ణికాధిష్ణ్యమాక్రమ్యాత్మన్యవస్థితమ్॥ 21

శ్లో॥ స్మయమానమభిధ్యాయేత్సానురాగావలోకనమ్।
నియతేనైకభూతేన మనసా వరదర్షభమ్॥ 22

వ్యాస 4-8-50 నుండి 53

సీ. హార కిరీట కేయూర కంకణ ఘన
భూషణుఁడాశ్రిత పోషణుండు
లాలిత కాంచీకలాప శోభిత కటి
మండలుం డంచిత కుండలుండు
మహనీయ కౌస్తుభమణి ఘృణి చారుగ్రై
వేయకుం డానందదాయకుండు
సలలిత ఘన శంఖ చక్ర గదా పద్మ
హస్తుఁడు భువనప్రశస్తుఁడజుఁడుఁ

తే. గమ్రసౌరభ వనమాలికాధరుండు
హతవిమోహుండు నవ్య పీతాంబరుండు
లలిత కాంచననూపు రాలంకృతుండు
నిరతిశయ సద్గుణుఁడు దర్శనీయతముఁడు. 16

క. సరస మనో లోచన ము
త్కరుఁడును హృత్పద్మ కర్ణికానివసిత వి
స్ఫుర దురు నఖమణి శోభిత
చరణ సరోజాతుఁడతులశాంతుఁడు ఘనుఁడున్. 17

పోతన 4-8-251, 252

శ్లో॥ ఏవం భగవతో రూపం సుభద్రం ధ్యాయతో మనః।
నిర్వృత్యా పరయా తూర్ణం సంపన్నం న నివర్తతే॥

జప్యశ్చ పరమో గుహ్యః శ్రూయతాం మే నృపాత్మజ।
యం సప్తరాత్రం ప్రపఠన్పుమాన్పశ్యతి ఖేచరాన్॥ 24



శ్లో॥ "ఓం నమో భగవతే వాసుదేవాయ"।
మంత్రేణానేన దేవస్య కుర్యాద్ద్రవ్యమయీం బుధః॥ 25

సపర్యాం వివిధైర్ద్రవ్యైర్దేశకాలవిభాగవిత్।
సలిలైశ్శుచిభిర్వన్యైర్మాల్యైర్మూలఫలాదిభిః॥ 26

వ్యాస 4-8-54 నుండి 57

వ. అయిన పురుషోత్తముం బూజింపుచు హృదయగతుండును, సానురాగ విలోకనుండును, వరద శ్రేష్ఠుండును నగు నారాయణు నేకాగ్రచిత్తంబున ధ్యానంబు సేయుచుం బరమ నివృత్తిమార్గంబున ధ్యానంబుసేయఁబడ్డ పురుషోత్తముని దివ్యమంగళ స్వరూపంబు చిత్తంబునం దగిలిన మరల మగుడనేరదు. అదియునుంగాక యే మంత్రకంబేని సప్తవాసరంబులు పఠియించిన ఖేచరులం గనుంగొను సామర్థ్యంబు గలుగునట్టి ప్రణవ యుక్తంబగు ద్వాదశాక్షర కలితంబును, దేశకాల విభాగవేది బుధానుష్ఠితంబునునైన "వాసుదేవ మంత్రంబునం" జేసి. 18

పోతన 4-8-253

శ్లో॥ శస్త్రైర్దూర్వాంకురైశ్చాన్యైస్తులస్యా ప్రియయా ప్రభుమ్।
లబ్ధ్వా ద్రవ్యమయీమర్చాం క్షిత్యంబ్వాదిషు చార్చయేత్॥

ఆహృతాత్మా మునిశ్శాంతో యతవాఙ్మితవన్యభుక్।
స్వేచ్ఛావతారచరితైరచిన్త్యం నిజమాయయా॥ 28

వ్యాస 4-8-58, 59

సీ. దూర్వాంకురంబుల దూర్వాంకురశ్యాము
జలజంబులను జారుజలజనయనుఁ
దులసీదళంబులఁదులసికాదాముని
మాల్యంబులను వినిర్మలచరిత్రుఁ

బత్రంబులను బక్షిపత్రునిఁగడు వన్య
మూలంబులను నాది మూలఘనుని
నంచిత భూర్జత్వగాది నిర్మిత
వివిధాంబరంబులను బీతాంబరధరు

తే. దనరుభక్తిని మృచ్ఛిలా దారు రచిత
రూపములయందుఁగాని, నిరూఢమైన
సలిలములయందుఁగాని, సుస్థలములందుఁ
గాని, పూజింపవలయు నక్కమలనాభు. 19

క. ధృతచిత్తుఁడు శాంతుండు ని
యతపరిభాషణుఁడు సుమహితాచారుఁడు వ
ర్ణిత హరిమంగళగుణుఁడును
మితవన్యాశనుఁడు నగుచుమెలఁగుచు మఱియున్. 20

పోతన 4-8-254, 255

శ్లో॥ కరిష్యత్యుత్తమశ్లోకస్తంధ్యాయేద్ధృదయంగమమ్।
పరిచర్యా భగవతో యావత్యః పూర్వసేవితాః।
తా మంత్రహృదయేనైవ ప్రయుంజ్యాన్మంత్రమూర్తయే॥ 29

ఏవం కాయేన మనసా వచసా చ మనోగతమ్।
పరిచర్యమాణో భగవాన్భక్తిమత్పరిచర్యయా॥

పుంసామమాయినాం నమ్యగ్భజతాం భావవర్ధనః।
శ్రేయో దిశత్యభిమతం యద్ధర్మాదిషు దేహినామ్॥

విరక్తశ్చేంద్రియరతౌ భక్తియోగేన భూయసా।
తం నిరంతరభావేన భజేతాత్మా విముక్తయే॥ 32

శ్లో॥ ఇత్యుక్తస్తం పరిక్రమ్య ప్రణమ్య చ నృపార్భకః।
యయౌ మధువనం పుణ్యం హరేశ్చరణచర్చితమ్॥ 33

వ్యాస 4-8-60 నుండి 64



వ. ఉత్తమశ్లోకుండగు పుండరీకాక్షుండు నిజమాయా స్వేచ్ఛావతార చరితంబులచేత నచింత్యంబుగా నెద్ది సేయు, నద్ది హృదయగతంబుగా ధ్యానంబు సేయందగు. మఱియుం గార్యబుద్ధింజేసి చేయంబడు పూజా విశేషంబుల వాసుదేవ మంత్రంబున సర్వేశ్వరునికి సమర్పింపవలయు. ఇట్లు మనోవాక్కాయ కర్మంబులచేత మనోగతంబగునట్లుగా భక్తియుక్తంబు లైన పూజలచేతం బూజింపంబడి, సర్వేశ్వరుండు మాయాభిభూతులుగాక సేవించు పురుషులకు ధర్మాది పురుషార్థంబు నభిమతార్థంబు నిచ్చు. విరక్తుండగువాఁడు నిరంతరభావంబైన భక్తియోగంబునంజేసి మోక్షంబు కొఱకు భజియించు. అని చెప్పిన విని ధ్రువుండు నారదునకుం బ్రదక్షిణ పూర్వకంబుగా నమస్కరించి (మహర్షి జనసేవ్యంబై సకలసిద్ధుల నొసంగుచు) భగవత్పాద సరోజాలంకృతంబైన మధువనంబునకుం జనియె. 21

పోతన 4-8-256

* * *

## అధ్యాయము - 9

### ధ్రువుఁడు భగవంతుని స్తుతియించుట

**ధ్రువ ఉవాచ :**

శ్లో॥ యోఽ న్తః ప్రవిశ్య మమ వాచమిమాం ప్రసుప్తాం
సంజీవయత్యఖిలశక్తిధరస్స్వధామ్నా।
అన్యాంశ్చ హస్తచరణశ్రవణత్వగాదీ
న్ప్రాణాన్నమోభగవతే పురుషాయ తుభ్యమ్॥ 34

శ్లో॥ ఏకస్త్వమేవ భగవన్నిదమాత్మశక్త్యా
మాయాఖ్యయోరుగుణయా మహదాద్యశేషమ్।
సృష్ట్వాఽనువిశ్య పురుషస్తదసద్గుణేషు
నానేవ దారుషు విభావసువద్విభాసి॥ 35

వ్యాస 4-9-6,7

వ. దేవా! నిఖిల శక్తిధరుండవు, నంతః ప్రవిష్టుండవునైన నీవు లీనంబులైన మదీయ వాక్యంబులం బ్రాణేంద్రియంబులం గరచరణ శ్రవణ త్వగాదులను జిచ్ఛక్తిచేఁగృపంజేసి జీవింపంజేసిన భగవంతుండవును, పరమపురుషుండవు నైన నీకు నమస్కరింతు. నీ వొక్కరుండ వయ్యును మహదాద్యంబైన యీ యశేషవిశ్వంబు మాయాఖ్యంబైన యాత్మీయ శక్తిచేతం గల్పించి యందుం బ్రవేశించి యింద్రియంబులందు వసింపుచు (తత్తద్దేవతా రూపంబులచే) నానాప్రకారంబుల దారువులం దున్న వహ్నిచందంబునం బ్రకాశింతువు. అదియునుంగాక- 22

పోతన 4-9-280

శ్లో॥ త్వద్దత్తయా వయునయేదమచేష్ట విశ్వం
సుప్తః ప్రబుద్ధ ఇవ నాథ భవత్ప్రపన్నః।
తస్యాపవర్గ్యశరణం తవ పాదమూలం
విస్మర్యతే కృతవిదా కథమార్తబంధో॥ 36

నూనం విమృష్టమతయస్తవ మాయయా తే
యే త్వాం భవాప్యయవిమోక్షణమన్యహేతోః।
అర్చంతి కల్పకతరుం కుణపోపభోగ్య
మిచ్ఛంతి యత్స్పర్శజం నరకేఽపి నృణామ్॥ 37

వ్యాస 4-9-8, 9

చ. వరమతి నార్త బాంధవ! భవ ద్ఘన బోధ సమేతుఁడై భవ
చ్చరణము బొందినట్టి విధి సర్గము సుప్తజనుండు బోధమం
దరయఁగఁజూచురీతిఁగను నట్టి ముముక్షు శరణ్య మైన నీ
చరణములం గృతజ్ఞుఁడగు సజ్జనుఁడెట్లు దలంపకుండెడిన్. 23

సీ. మహితాత్మ! మఱి జన్మ మరణ ప్రణాశన
హేతుభూతుండవు నిద్ధ కల్ప
తరువవు నగు నిన్నుఁదగ నెవ్వరే నేమి
పూని నీ మాయా విమోహితాత్ము
లగుచు ధర్మార్థ కామాదుల కొఱకుఁదా
మర్థింపుచుం ద్రిగుణాభ మైన
దేహోప భోగ్యమై దీపించు సుఖముల
నెనయంగ మది నిచ్ఛయింతు రట్టి

తే. విషయ సంబంధ జన్య మై వెలయు సుఖము
వారికి నిరయమందును వఱలు దేవ!
భూరి సంసారతాప నివార గుణ క
థామృతాపూర్ణ! యీశ! మాధవ! ముకుంద! 24

పోతన 4-9-281, 282

**ధ్రువ ఉవాచ :**

శ్లో॥ యా నిర్వృతి స్తనుభృతాం తవ పాదపద్మ
ధ్యానాద్భవజ్జనకథాశ్రవణేన వా స్యాత్ ।

సా బ్రహ్మణి స్వమహిమన్యపి నాథ మా భూత్కి
న్త్వంతకాసి లులితాత్పతతాం విమానాత్ ॥ 38
వ్యాస 4-9-10

మ. అరవిందోదర! తావకీన చరణ ధ్యానానురా గోల్లస
చ్చరి తాకర్ణనజాత భూరి సుఖముల్ స్వానందక బ్రహ్మమం
దరయన్ లేవఁట దండభృద్ధతవిమా నాకీర్ణులై కూలు నా
సురలోకస్థులఁజెప్పనేల? సుజన స్తోమైక చింతామణీ! 25
పోతన 4-9-283

శ్లో॥ కల్పాంత ఏతదఖిలం జఠరేణ గృహ్ణన్
శేతే పుమాన్ స్వదృగనంతసఖస్తదంకే ।
యన్నాభిసింధురుహకాంచనలోకపద్మ
గర్భే ద్యుమాన్భగవతే ప్రణతోఽస్మి తస్మై ॥ 39
వ్యాస 4-9-14

సీ. సర్వేశ! కల్పాంత సమయంబునందు నీ
యఖిల ప్రపంచంబు నాహరించి
యనయంబు శేష సహాయుండ వై శేష
పర్యంకతలమునఁబవ్వళించి
యోగనిద్రారతి నుండి నాభీసింధు
జ స్వర్ణలోక కంజాతగర్భ
మందుఁజతుర్ముఖు నమరఁబుట్టింపుచు
రుచి నొప్పు బ్రహ్మస్వరూపి వైన

తే. నీకు మ్రొక్కెద నత్యంతనియమ మొప్ప
భవ్యచారిత్ర! పంకజపత్ర నేత్ర!
చిరశుభాకార! నిత్యలక్ష్మీవిహార!
యవ్యయానంద! గోవింద! హరి! ముకుంద! 26
పోతన 4-9-287



**శ్రీ భగవానువాచ :**

శ్లో॥ ఇష్ట్వా మాం యజ్ఞహృదయం యజ్ఞైః పుష్కలదక్షిణైః ।
భుక్త్వా చేహాశిషస్సత్యా అంతే మాం సంస్మరిష్యసి ॥ 40

శ్లో॥ తతో గంతాసి మత్స్థానం సర్వలోకనమస్కృతమ్ ।
ఉపరిష్టాదృషిభ్యాస్త్వం యతో నావర్తతే గతః ॥ 41

**మైత్రేయ ఉవాచ :**

శ్లో॥ ఇత్యర్చితస్స భగవానతిదిశ్యాత్మనః పదమ్ ।
బాలస్య పశ్యతో ధామ స్వమాయాద్గరుడధ్వజః ॥ 42
వ్యాస 4-9-24 నుండి 26

సీ. అనఘాత్మ! మరి నీవు యజ్ఞ రూపుం డనఁ
దగు నన్ను సంపూర్ణ దక్షిణంబు
లగు మఖంబులచేత నర్చించి సత్యంబు
లగు నిహసౌఖ్యంబు లనుభవించి
యంత్యకాలమున న న్నాత్మఁదలంపుచు
మఱి సర్వలోక నమస్కృతమును
మహిఁబునరావృత్తి రహితంబు సప్తర్షి
మండలోన్నత మగు మామకీన

తే. పదముఁదగఁబొందఁగల వని పరమపురుషుఁ
డతని యభిలషి తార్థంబు లర్థి నిచ్చి
యతఁడు గనుఁగొనుచుండంగ నాత్మపురికి
గరుడగమనుఁడు వేంచేసెఁగౌతుకమున. 27
పోతన 4-9-291

* * *

## అధ్యాయము-20
## యాగంబున నారాయణుండు ప్రసన్నుండై పృథుచక్రవర్తి ననుగ్రహించుట

**శ్రీ భగవానువాచ :**

శ్లో॥ అతః కాయమిమం విద్వానవిద్యాకామకర్మభిః ।
ఆరబ్ధ ఇతి నైవాఽస్మిన్ ప్రతిబుద్ధోఽనుషజ్జతే ॥ 43

శ్లో॥ అసంసక్త శ్శరీరేఽస్మిన్నమునోత్పాదితో గృహే ।
అపత్యే ద్రవిణే వాపి కః కుర్యాన్మమతాం బుధః ॥ 44

ఏకశ్శుద్ధస్స్వయం జ్యోతిర్నిర్గుణోఽసౌ గుణాశ్రయః ।
సర్వగోఽసంవృతస్సాక్షీ నిరాత్మాత్మాత్మనః పరః ॥

య ఏవం సంతమాత్మానమాత్మసంవేద పూరుషః ।
నాజ్యతే ప్రకృతి స్థోఽపి తద్గుణైస్సమయి స్థితః ॥

యస్స్వధర్మేణ మాం నిత్యం నిరాశీః శ్రద్ధయాన్వితః ।
భజతే శనకైస్తస్య మనో రాజన్ప్రసీదతి ॥

పరిత్యక్తగుణస్సమ్యగ్దర్శనో విశదాశయః ।
శాంతిం మే సమవస్థానం బ్రహ్మ కైవల్యమశ్నుతే ॥

ఉదాసీన మివాధ్యక్షం ద్రవ్యజ్ఞాన క్రియాత్మనామ్ ।
కూటస్థమిమమాత్మానం యో వేదాప్నోతి సోఽభవమ్ ॥

భిన్నస్య లింగస్య గుణప్రవాహో
ద్రవ్యక్రియాకారకచేతనాత్మనః ।
దృష్టాసు సంపత్సు విపత్సు సూరయో
న విక్రియం తే మయి బద్ధసౌహృదాః ॥

సమస్సమానోత్తమమధ్యమాధమ
స్సుఖే చ దుఃఖే చ జితేంద్రియాశయః ।
మయోపక్లప్తాఖిలలోకసంయుతో
విధత్స్వ వీరాఖిలలోకరక్షణమ్ ॥ 51

శ్లో॥ శ్రేయః ప్రజాపాలనమేవ రాజ్ఞో
యత్సాంపరాయే సుకృతాత్ పష్ఠమంశమ్ ।
హర్తాన్యథా హృతపుణ్యః ప్రజానా
మరక్షితా కరహారోఽఘమత్తియత్ ॥ 52

ఏవం ద్విజాగ్ర్యానుమతానువృత్త
ధర్మ ప్రధానోఽన్యతమోఽవితాఽస్యాః ।
హ్రస్వేన కాలేన గృహోపయాతాన్
దృష్టాసి సిద్ధానసురక్తలోకః ॥

వరం చ మత్కంచన మానవేంద్ర
వృణీష్వ తేఽహం గుణశీలయంత్రితః ।
నాహం మఖైర్వై సులభస్తపోభి
ర్యోగేన వా యత్సమచిత్తవర్తీ ॥ 54

వ్యాస 4-20-5 నుండి 16

వ. ఈ శరీరం బవిద్యా కామకర్మంబులచేత నారబ్ధం బని తెలిసిన పరమజ్ఞాని యీ దేహంబునందు ననుషక్తుండు గాకుండుట (సహజంబన) దేహోత్పాదితంబు లైన గృహదారాదుల యందు మమత్వంబు లేకుంటం జెప్పనేల? ఇట్టి దేహంబునం దున్న యాత్మ యేకంబును, శుద్ధ స్వరూపంబు (స్వయంజ్యోతియు) నిర్గుణంబును, గుణాశ్రయంబును, వ్యాప్యవ్యాపకం బును, నసంవృతంబును, సాక్షి భూతంబును, (నిరాత్మకంబును) నగు. దీని దేహంబునకంటె వేఱుగా నెవ్వండు దెలియువాఁడు మత్పరుండగుటం జేసి దేహధారియై యుండియుఁద ద్గుణంబులం బొరయక వర్తించుమతియు నెవ్వండేని స్వధర్మాచారపరుండును నిష్కాముండును, శ్రద్ధాయుక్తుండునునైన నెల్లప్పుడు భజియించు నట్టివాని మనంబు (క్రమంబునఁ) బ్రసన్నంబగు. అట్లు ప్రసన్న మనస్కుండును త్రిగుణాతీతుండును సమ్యగ్దర్శనుండు నైన యతండు (మదీయ సమవస్థానరూప శాంతి నొందు.) అదియ కైవల్యపదం

బనంబడు. కూటస్థం బైన యీ యాత్మ యుదాసీన భూతంబైనను, దీని ద్రవ్య జ్ఞాన క్రియా మనంబులకు నీశ్వరుంగా నెవ్వండు దెలియు, వాఁడు భవంబు నొందకుండు. ఈ సంసారము ద్రవ్య క్రియా కారక చేతనాత్మకం బగుటం జేసి, ప్రభిన్న దేహోపాధికంబు గావునఁ, బ్రాప్తంబు లైన యాపత్సంపదలయందు మత్పరులైన మహాత్ములు వికారంబు నొందరు. కావున, నీవు సుఖదుఃఖముల యందు సమచిత్తుండవును, సమానోత్తమ మధ్య మాధముండవును, జితేంద్రియాశయుండవును నై (వినిష్పాది తాఖిలామాత్యాది సంయుతుండవై) యఖిలలోక రక్షణంబు సేయుము. అని వెండియు నిట్లనియె. 28

సీ. పార్థివోత్తములకుఁబ్రజల రక్షించుట
పరమధర్మం బగు నరవరేణ్య!
ధరణీశులకుఁబ్రజాపరిపాలనంబునఁ
బూని లోకులు సేయు పుణ్యమందు
షష్ఠాంశ మర్థిని సంప్రాప్త మగునట్లు
ప్రజలఁబ్రోవని రాజు ప్రజలచేత
నపహృత సత్పుణ్యుఁడై వారు గావించు
ఘన పాపఫలము దా ననుభవించుఁ

తే. గాన నీవును విప్రవరానుమతము
సాంప్రదాయిక విధము నై జరుగు ధర్మ
మహిమఁజేపట్టి యర్థకామములఁజెందు
సమత నమ్మూటియందు నాసక్తి లేక.

వ. ఇవ్విధంబున. 30

క. జనులకు ననురక్తుఁడ వై
జననాయక! నీవు ధరణి సమచిత్తుఁడ నై
యనయముఁబరిపాలించిన
సనకాదులఁగాంతు వాత్మసదనమునందున్. 31

పోతన 4-20-541 నుండి 544

## అధ్యాయము-21

## పృథుచక్రవర్తి ప్రజలకు ధర్మానుశాసనంబు చేయుట

**రాజోవాచ :**

శ్లో॥ యత్పాదసేవాభిరుచిస్తపస్వినా
మశేషజన్మోపచితం మలం ధియః ।
సద్యః క్షిణోత్యన్వహమేధతీ సతీ
యథా పదాంగుష్ఠవినిస్సృతా సరిత్ ॥ 55

వినిర్ధుతా శేషమనోమలః పుమా
నసంగవిజ్ఞాన విశేషవీర్యవాన్ ।
యదంఘ్రిమూలే కృతకేతనః పున
ర్న సంసృతిం క్లేశవహాం ప్రపద్యతే ॥

తమేవ యూయం భజతాత్మవృత్తిభి
ర్మనోవచః కాయగుణైః స్వకర్మభిః ।
అమాయినః కామదుఘాంఘ్రిపంకజం
యథాధికారావసితార్థ సిద్ధయః ॥

అసావిహానేకగుణో గుణోఽధ్వరః
పృథగ్విధద్రవ్యగుణక్రియోక్తిభిః ।
సంపద్యతేఽర్థాశయలింగనామభి
ర్విశుద్ధవిజ్ఞానఘనస్స్వరూపతః ॥ 58

వ్యాస 4-21-30 నుండి 33

వ. (పృథుచక్రవర్తి భగవంతుండు గలఁడని ప్రజలను ధర్మ మార్గాన ప్రవర్తింపచేయుటయే రాజధర్మమని, మనోవాక్కాయ కర్మలద్వారా శ్రీహరిని ధ్యానించి, స్తుతించి, సేవించవలెననీ శాసనము చేసెను.) 32

ఉ. భూరి తపోభిరామ మునిపూజన మెవ్వని పాదపద్మ సే
వారతి వృద్ధిఁబొంది యనివారణఁబూర్వ భవానుసార సం
సార మహోగ్ర తాపము భృశంబుగఁబాపఁగ నోపుఁద త్పదాం
భోరుహజాత దేవనదిఁబోలి యశేష మనోఘహారియై.

వ. మఱియు.

చ. అనుపమభక్తి నెవ్వని పదాంబుజమూలము మందిరంబుగా
ననయముఁబొందువాఁడు నిహతాఖిల భూరి మనోమలుండు స
ద్వినుత విరక్తి బోధ ధృతి వీర్య విశేష సమన్వితుండు దా
ననఁదగి భూరి సంసృతి మహత్తర దుఃఖము నందఁడెన్నఁడున్.

క. నారాయణుండు జగదా
ధారుండగు నీశ్వరుండు దలఁప నతనికిన్
లే రెందు సములు నధికులు
ధీరోత్తముఁడతఁడు నద్వితీయుం డగుటన్. 35

వ. అదియునుం గాక 36

ఉ. కర్మవశంబునం జగము గల్గును హెచ్చు నడంగు నన్నచోఁ
గర్మము బుద్ధిఁజూడ జడకార్యము గాని ప్రపంచ కల్పనా
కర్మమునందుఁగర్త యనఁగా విలసిల్లఁగ జాలదీ జగ
త్కర్మక కార్యకారణము గావున, నీశుఁడు విష్ణుఁడారయన్. 37

వ. కావున, మీర లవ్యాసుదేవుని నధికారానుసారంబున నిశ్చితార్థఫలసిద్ధి గలవారలై మనోవాక్కాయ కర్మంబుల నిష్కపట వృత్తిందగిలి వినుతి నతి పరిచర్యాపూర్వకంబుగాఁగామదుఘంబులైన యతని పాదపంకజంబులు భజియింపుఁడు. 38

పోతన 4-21-578 నుండి 584



**పృథు రువాచ :**

శ్లో॥ బ్రహ్మణ్యదేవః పురుషః పురాతనో
నిత్యం హరిర్యచ్చరణాభివందనాత్ ।
అవాప లక్ష్మీమనపాయినీం యశో
జగత్పవిత్రం చ మహత్తమాగ్రణీః ॥ 59

వ్యాస 4-21-37

చ. అరయఁగ నే ధరామర పదాంబుజ రేణువు లర్థిఁదాల్చి య
ప్పరమ పురాణపూరుషుఁడు బ్రాహ్మణదేవుఁడు నైనయట్టి యీ
శ్వరుఁడు సదానపాయినిని సాగరకన్యను సర్వలోక వి
స్ఫురిత పవిత్రకీర్తియును బొంది విభూతిఁదనర్చెఁగావునన్. 39

పోతన 4-21-588

శ్లో॥ యద్బ్రహ్మ నిత్యం విరజం సనాతనం
శ్రద్ధాతపో మంగళమౌనసంయమైః ।
సమాధినా బిభ్రదిహార్థదృష్టయే
యత్రేదమాదర్శ ఇవావభాసతే ॥

తేషామహం పాద సరోజరేణు
మార్యా వహేయాధికిరీటమాయుః ।
యం నిత్యదా బిభ్రత ఆశు పాపం
నశ్యత్యముం సర్వగుణా భజంతి ॥ 61

శ్లో॥ గుణాయనం శీలధనం కృతజ్ఞం
శ్రద్ధాశ్రయం సంవృణుతే ను సంపదః ।
ప్రసీదతు బ్రహ్మకులం గవాం చ
జనార్దనస్సానుచరశ్చ మహ్యమ్ ॥ 62

వ్యాస 4-21-41 నుండి 43

సీ. ఏ వేదమం దేని యీ విశ్వమెల్లను
దర్పణ ప్రతిబింబిత ప్రభూష
నివహంబు కైవడిఁదవిలి ప్రకాశించు
నట్టి విరజమును నవ్యయంబు
నగుచు సనాతనం బగు వేదమే ధరా
దేవతాజనములు దినముఁదగిలి
మహిత శ్రద్ధా తపో మంగళ మౌన సం
యమ సమాధులఁబొలుపారు చుండి

తే. యర్థ సదసద్విచారు లై యధికరింతు
రట్టి వారల పదరజం బర్థిఁదాల్చు
నలఘులకు సర్వ పాపక్షయంబు నఖిల
సద్గుణావాప్తియును నగుఁజతురులార! 40

వ. కావున, నట్టి విప్రపాద సరోజరేణువు లేనును గిరీటంబున ధరియింతు. ఇట్లు బ్రాహ్మణ భజనంబునం జేసి యవాప్త సకల గుణుండు, శీలధనుండు, కృతజ్ఞుండు, శ్రద్ధాయుక్తుండునైన మహాత్ము నఖిల సంపదలు ప్రాపించు. కావున, గోబ్రాహ్మణ కులంబును, ననుచర సమేతుండైన జనార్ధనుండును నాయెడం బ్రసన్ను లయ్యెదరు గాక. అని పలుకుచున్న పృథుచక్రవర్తిం గనుంగొని పితృ దేవ ద్విజ నత్పురుషులు సంతుష్టాంతరంగులై సాధువాదంబుల నభినందించిరి. 41

పోతన 4-21-593, 594

* * *

# అధ్యాయము-22

## పృథుచక్రవర్తి యొద్దకు సనకాదు లరుగుదెంచుట

**పృథు రువాచ :**

శ్లో॥ కిం తస్య దుర్లభతరమిహ లోకే పరత్ర చ ।
యస్య విప్రాః ప్రసీదంతి శివో విష్ణుశ్చ సానుగః ॥ 63

అధనా అపి తే ధన్యాస్సాధవో గృహమేధినః ।
యద్గృహాహ్యర్హ వర్యాంబుతృణభూమీశ్వరావరాః ॥

వ్యాళాలయద్రుమా ఏతేఽ ప్యరిక్తాఖిల సంపదః ।
యద్గృహా స్తీర్థపాదీయపాదతీర్థవివర్జితాః ॥ 65

వ్యాస 4-22-8, 10, 11

క. భువి నెవ్వనియెడ విప్రులు
భవుఁడును విష్ణుఁడుఁదదీయభక్తులును బ్రస
న్న వదను లగుదురు వానికి
భువిని దివి నసాధ్యకర్మములు లే వనఘా! 42

చ. అరయ ధరిత్రి నెవ్వనిగృహంబు మహార్హజనోపభోగ్య వి
స్ఫురితతృణాంబుభృత్యగృహభూముల సారెఁదనర్చు నట్టిమం
దిరపతి పేద యైన జగతిం గడు ధన్యుఁడటంద్రు గాన సు
స్థిరమతి మీరు వచ్చుట నశేషశుభంబుల నేను బొందెదన్.

చ. వరమతులార! యెవ్వని నివాసముఁదీర్థపదాంతరంగు లై
పరఁగినయట్టి భాగవత పాదజలంబులు సోఁకవేని త
త్పురుషుఁడు భూరిసంపదలఁబొంపిరిపోయిన నైన వానిమం
దిర మురగప్రకీర్ణజగతీజముఁబోలు నటంద్రు కోవిదుల్. 44

పోతన 4-22-608, 610, 612

**సనత్కుమార ఉవాచ :**

శ్లో॥ సాధు పృష్టం మహారాజ సర్వభూతహితాత్మనా ।
భవతా విదుషా చాపి సాధూనాం గతి రీదృశీ ॥ 66

సంగమః ఖలు సాధూనా ముభయేషాం చ సమ్మతః ।
యత్సంభాషణసంప్రశ్న స్సర్వేషాం వితనోతి శమ్ ॥ 67

వ్యాస 4-22-18, 19

మ. ధరణీశోత్తమ! సర్వభూత హితచేతస్కుండ వై ధర్మసు
స్థిరభాగ్యోదయశాలి వై యెసఁగు నీచే సాధులోకోత్తరో
త్తర సంప్రశ్నము సేయఁగాఁబడె మహాత్మా! సాధులోకైక స
చ్చరితంబుం దలపోయ నిట్టిద కదా చర్చింప లోకత్రయిన్. 45

తే. ధరణి సజ్జనసంగంబు దలఁప నుభయ
సమ్మతం బగు వారలు సలుపునట్టి
సరస సంభాషణ ప్రశ్న సరణి నిఖిల
జనములకు సుఖకరమగు జనవరేణ్య! 46

పోతన 4-22-616, 617

శ్లో॥ అస్త్యేవ రాజన్ భవతో మధుద్విషః
పాదారవిందస్య గుణానువాదనే ।
రతిస్సదా యా వితనోతి నైష్ఠికీ
కామం కషాయం మల మంతరాత్మనః ॥ 68

శాస్త్రేష్వియానేవ సునిశ్చితో నృణాం
క్షేమస్య సధ్ర్యగ్విమృశేషు హేతుః ।
అసంగ ఆత్మవ్యతిరిక్త ఆత్మన్
దృఢా రతిర్బ్రహ్మణి నిర్గుణే చ యా ॥ 69

వ్యాస 4-22-20, 21



వ. మోక్షసాధనోపదేశకాముండైన పృథుచక్రవర్తికి సనత్కుమారుం డిట్లనియె. 47

సీ. ధరణీశ! మధునిషూదనుఁడైన యట్టి నా
రాయణు లలిత పాదారవింద
వర గుణధ్యాన ధీపరిణతత్వంబున
సకలాత్మ మలవిమోచనమునైన
రతియును, నిత్యవైరాగ్యంబు, మొదలనే
లోకోత్తరుఁడ వైన నీకుఁగలవు
సమ్యగ్విచార! శాస్త్రములందు జనులకు
సేమంబునకును నిశ్చితములైన

తే. యాత్మ కన్యము లగువానియందు వీత
రాగత దలంప నిర్గుణబ్రహ్మమైన
యాత్మయందుల రతియును ననఁగ నివియ
హేతువులు బుద్ధిఁజింతింప నిద్ధచరిత! 48

పోతన 4-22-619

శ్లో॥ సా శ్రద్ధయా భగవద్ధర్మచర్యయా
జిజ్ఞాసయాధ్యాత్మిక యోగనిష్ఠయా ।
యోగేశ్వరోపాసనాయా చ నిత్యం
పుణ్యశ్రవః కథయా పుణ్యయా చ ॥ 70

అర్థేంద్రియారామసగోష్ఠ్యతృష్ణయా
తత్సమ్మతానామపరిగ్రహేణ చ ।
వివిక్తరుచ్యాపరితోష ఆత్మ
న్వినా హరే ర్గుణపీయూషపానాత్ ॥ 71

శ్లో॥ అహింసయా పారమహంస్యచర్యయా
స్మృత్యా ముకుందాచరితాగ్ర్యసీధునా ।
యమై రకామై ర్నియమై రనిందయా
నిరీహయా ద్వంద్వతితిక్షయా చ ॥ 72

హరేర్ముహుస్తత్పరకర్ణపూర
గుణాభిధానేన విజృంభమాణయా ।
భక్త్యా హ్యసంగ స్సదసత్యనాత్మని
స్యాన్నిర్గుణే బ్రహ్మణి చాంజసా రతిః ॥ 73

వ్యాస 4-22-22 నుండి 25

వ. కావున, శ్రద్ధయు, భగవద్ధర్మచర్యయుఁ, ద ద్విశేషజిజ్ఞాసయు, నాధ్యాత్మిక యోగనిష్ఠయు, యోగేశ్వరోపాస్తియుఁ, బుణ్యశ్రవణుండైన నారాయణు కథాలాపంబు, నర్థేంద్రియారాము లైనవారలతోడి సంగతియందు విరక్తియు, వారల కభిమతంబులైన యర్థకామంబులందు ననాకాంక్షయు, సర్వేశ్వరుని గుణకీర్తనామృత పానంబు దక్క, నితరపదార్థ వైరాగ్యంబు నొంది, యాత్మారామతం గలిగి, విజనస్థలంబులందుల రుచిగలుగుటయు, నహింసయు, శమాది ప్రధానవృత్తియు నాత్మహితానుసంధానంబును, భగవత్కథానుస్మరణంబును, నకామ్యంబులైన యమనియమంబులు (నితరభక్తిమార్గా గర్హణంబును యోగక్షేమార్థ క్రియారాహిత్యంబును) శీతోష్ణాది ద్వంద్వసహిష్ణుతయు భాగవత కర్ణాలంకారభూతంబు లగు భగవద్గుణాభిధానంబులు నను వీనిచేత విజృంభమాణం బైన భక్తియోగం బునం జేసి, యనాత్మయందు నసంగంబును, (గార్యకారణ రూపం బగు) నిర్గుణ బ్రహ్మంబునందు రతియు నెప్పుడు గలుగు నప్పుడు సదాచార్యానుగ్రహ వంతుఁడైన పురుషుండు (బ్రహ్మనిష్ఠులతోడఁ) జెలిమి సేయుచు నీషణ త్రయంబు వర్జించి ప్రకృతిం జేరక జ్ఞానవైరాగ్య వేగంబునం జేసి. 49

పోతన 4-22-620



## పృథుచక్రవర్తి జ్ఞానవైరాగ్యవంతుఁడగుచు ముక్తినొందుట

శ్లో॥ కర్మాణి చ యథాదేశం యథాకాలం యథాబలమ్ ।
యథోచితం యథావిత్తమకరోద్బ్రహ్మసాత్కృతమ్ ॥ 74

ఫలం బ్రహ్మణిసన్న్యస్య నిర్విషంగస్సమాహితః ।
కర్మాధ్యక్షం చ మన్వాన ఆత్మానం ప్రకృతేః పరమ్ ॥

గృహేషు వర్తమానోఽపి ససామ్రాజ్యశ్రియాన్వితః ।
నాసజ్జతేంద్రియార్థేషు నిరహంమతిరర్కవత్ ॥ 76

వ్యాస 4-22-50 నుండి 52

సీ. కర్మంబులను యథాకాల దేశోచిత
బలవిత్తములుగాఁగఁబరఁగు ధర్మ
ములను బ్రహ్మార్పణబుద్ధినిఁజేసి ని
రాసక్తుఁడగుచు సమాహితుండు
ప్రకృతికంటెను దన్నుఁబర మైన యాత్మను
గర్మసంచయ సాక్షిఁగాఁగ బుద్ధి
నర్థిఁదలంపుచు నాచరింపుచు నట్లు
మెఱసి సామ్రాజ్య లక్ష్మీసమేత

తే. మందిరోద్యాన వనభూములందు రాజ్య
గరిమ వర్తింపఁగా నహంకారరహితుఁ
డగుచుఁదన చిత్తమున నింద్రియార్థములను
దగులకయ యుండె నాతండు తరణిపగిది. 50

పోతన 4-22-641

* * *

## అధ్యాయము-24

## శ్రీరుద్రగీత

### బ్రహ్మ సనకాదులకు తెలిపిన శ్రీహరి స్తోత్రంబును (యోగాదేశ మను స్తోత్రము) రుద్రుఁడు ప్రచేతసులకు ఎఱింగించుట

**శ్రీరుద్ర ఉవాచ :**

శ్లో॥ స్వధర్మనిష్ఠః శతజన్మభిః పుమాన్
విరించతామేతి తతః పరం హి మామ్ ।
అవ్యాకృతం భాగవతోఽథ వైష్ణవః
పదం యథాహం విబుధాః కలాత్యయే ॥ 77

వ్యాస 4-24-29

వ. స్వధర్మనిరతుండైన పురుషుం డనేక జన్మాంతర సుకృత విశేషంబులం జతుర్ముఖత్వంబు నొంది, తదనంతరంబునం బుణ్యాతిరేకంబున నన్నుం బొంది, యధికారాంతంబున నేను దేవతాగణంబులు నవ్యాకృతం బైన యే హరిపదంబులు వొందుదు మట్టి పదంబు భాగవతుండు దనంతనె పొందుం గావున మీరు భాగవత తత్త్వంబు నొందుటం జేసి నాకుం బ్రియులై యుండుదురు. 51

పోతన 4-24-699

శ్లో॥ నమః పంకజనాభాయ భూతసూక్ష్మేంద్రియాత్మనే ।
వాసుదేవాయ శాంతాయ కూటస్థాయ స్వరోచిషే ॥ 78

సంకర్షణాయ సూక్ష్మాయ దురంతాయాంతకాయ చ ।
నమో విశ్వప్రబోధాయ ప్రద్యుమ్నా యాంతరాత్మనే ॥

నమో నమోఽనిరుద్ధాయ హృషీకేశేంద్రియాత్మనే ।
నమః పరమ హంసాయ పూర్ణాయ నిభృతాత్మనే ॥ 80

శ్లో॥ స్వర్గాపవర్గద్వారాయ నిత్యం శుచిషదే నమః ।
నమో హిరణ్యవీర్యాయ చాతుర్హోత్రాయ తంతవే ॥ 81

నమ ఊర్జ ఇషే త్రయ్యాః పతయే యజ్ఞ రేతసే ।
తృప్తిదాయ చ జీవానాం నమస్సర్వరసాత్మనే ॥

సర్వసత్త్వాత్మదేహాయ విశేషాయ స్థవీయసే ।
నమస్త్రైలోక్యపాలాయ సహ ఓజో బలాయ చ ॥

అర్థలింగాయ నభసే నమోఽంతర్బహిరాత్మనే ।
నమః పుణ్యాయ లోకాయ చాముష్మైభూరివర్చసే ॥

ప్రవృత్తాయ నివృత్తాయ పితృదేవాయ కర్మణే ।
నమోఽధర్మవిపాకాయ మృత్యవే దుఃఖదాయినే ॥

సమస్త ఆశిషామీశమనవే కారణాత్మనే ।
నమో ధర్మాయ బృహతే కృష్ణాయాకుంఠమేధసే ॥

పురుషాయ పురాణాయ సాంఖ్యయోగేశ్వరాయ తే ।
శక్తిత్రయ సమేతాయ మీఢుషేఽహంకృతాత్మనే ।
చేతస్సాకూతిరూపాయ నమో వాచో విభూతయే ॥ 87

వ్యాస 4-24-34 నుండి 43

సీ. పంకజనాభాయ, సంకర్షణాయ, శాం
తాయ, విశ్వప్రబోధాయ, భూత
సూక్ష్మేంద్రియాత్మనే, సూక్ష్మాయ, వాసుదే
వాయ, పూర్ణాయ, పుణ్యాయ, నిర్వి
కారాయ, కర్మనిస్తారకాయ, త్రయీ
పాలాయ, త్రైలోక్యపాలకాయ,
సోమరూపాయ, తేజోబలాఢ్యాయ, స్వ
యం జ్యోతిషే, దురంతాయ, కర్మ

తే. సాధనాయ, పురాపురుషాయ, యజ్ఞ
రేతసే, జీవతృప్తాయ, పృథ్వీరూప
కాయ, లోకాయ, నభసే,ఽ ంతకాయ, విశ్వ
యోనయే, విష్ణవే, జిష్ణవే, నమోఽ స్తు. 52

సీ. స్వర్గాపవర్గ సుద్వారాయ, సర్వర
సాత్మనే, పరమహంసాయ, ధర్మ
పాలాయ, సద్ధిత ఫలరూపకాయ, కృ
ష్ణాయ, ధర్మాత్మనే సర్వశక్తి
యుక్తాయ, ఘనసాంఖ్య యోగీశ్వరాయ హి
రణ్యవీరాయ రుద్రాయ, శిష్ట
నాథాయ, దుష్టవినాశాయ, శూన్య ప్ర
వృత్తాయ, కర్మణే, మృత్యవే, వి

తే. రా ట్చరీరాయ, నిఖిల ధర్మాయ, వాగ్వి
భూతయే, నివృత్తాయ సత్పుణ్య భూరి
వర్చసే, ఽ ఖిల ధర్మదేహాయ, చాత్మ
నే, ఽ నిరుద్ధాయ, నిభృతాత్మనే, నమోఽ స్తు. 53

తే. సర్వ సత్త్వాయ, దేవాయ, సన్నియామ
కాయ, బహిరంతరాత్మనే, కారణాత్మ
నే, ఽ సమస్తార్థ లింగాయ, నిర్గుణాయ,
వేధసే, జితాత్మక సాధవే, నమోఽ స్తు. 54

వ. అని మఱియుఁ బ్రద్యుమ్నుండవు, నంతరాత్మవు, సమస్త శేష కారణుం
డవు, చాతుర్హోత్రరూపుండవు, నంతకుండవు, సర్వజ్ఞుండవు, జ్ఞానక్రియా
రూపుండవు, నంతఃకరణ వాసివియు నైన నీకు నమస్కరింతు. 55

పోతన 4-24-702 నుండి 705



శ్లో॥ దర్శనం నో దిదృక్షూణాం దేహి భాగవతార్చితమ్ ।
రూపం ప్రియతమం స్వానాం సర్వేంద్రియగుణాంజసమ్ ॥ 88

స్నిగ్ధప్రావృడ్ఘనశ్యామం సర్వసౌందర్యసంగ్రహమ్ ।
చార్వాయతచతుర్బాహుం సుజాతరుచిరాననమ్ ॥

పద్మకోశపలాశాక్షం సుందరభ్రు సునాసికమ్ ।
సుద్విజం సుకపోలాస్యం సమకర్ణ విభూషణమ్ ॥

ప్రీతిప్రహసితాపాంగ మలకై రుపశోభితమ్ ।
లసత్పంకజ కింజల్కదుకూలం మృష్టకుండలమ్ ॥ 91

వ్యాస 4-24-44 నుండి 47

క. అనఘా! దేవ! భవత్పద
వనరుహ సందర్శనేచ్ఛ వఱలిన మాకున్
విను, వైష్ణవసత్కృతమై
యెనయు భవద్దర్శనంబు నీవె! మహాత్మా! 56

వ. అది యెట్టిదనిన

క. అనఘ! సకలేంద్రియగుణాం
జనమును భక్తప్రియంబు జలదశ్యామం
బును సౌందర్య సమగ్రము
ననుపమమును నిత్యమంగళావహ మగుచున్.

వ. మఱియును. 59

సీ. అళికులోపమ లసదలకశోభిత మగు
నమృతాంశు రేఖానిభాననమును
సమకర్ణ దివ్యభూషా ప్రభాకలితంబు
సుందర భ్రూనాస సురుచిరంబు

లలిత కుందకుట్మల సన్నిభ ద్విజ
పూరిత స్నిగ్ధ కపోలయుగము
పద్మపలాశ శోభన లోచనంబును
మందస్మితాపాంగ సుందరమును

తే. సస్మితాలోక సతత ప్రసన్న ముఖము
కంబుసుందర రుచిర మంగళగళంబు
హార మణికుండల ప్రభాపూర కలిత
చారు మృగరాజ సన్నిభ స్కంధ యుతము. 60

పోతన 4-24-706 నుండి 710

శ్లో॥ క్షణార్ధేనాపి తులయే న స్వర్గం నాపునర్భవమ్ ।
భగవత్సంగిసంగస్య మర్త్యానాం కిముతాశిషః ॥ 92

వ్యాస 4-24-57

క. హరి! మీ భక్తజనులతో
నిరుపమగతిఁజేయు సఖ్యము నిమిషార్ధముతో
సరిగాదు మోక్షమనిన న
చిరశుభ మగు మర్త్యసుఖముఁజెప్పఁగ నేలా? 61

పోతన 4-24-715

శ్లో॥ అథానఘాంఘ్రేస్తవ కీర్తితీర్థయో
రంతర్బహిస్స్నానవిధూతపాప్మనామ్ ।
భూతేష్వనుక్రోశసుసత్త్వశీలినాం
స్యాత్సంగమోఽనుగ్రహ ఏష న స్తవ ॥ 93

వ్యాస 4-24-58

క. దురితవినాశక పదపం
కరుహా! భవత్కీర్తి తీర్థకణచయ బాహ్యాం



తరసేక ధూతకల్మష
పురుషులు ధరమీఁదఁదీర్ఘభూతులుగారే? 62

వ. అట్టి భూతదయా సమేతులు, రాగాది విరహితచిత్తులు, నార్జవాది గుణయుక్తులు నైన భాగవతజనుల సంగంబు మాకుం గలుగంజేయుము. ఇదియ మమ్మనుగ్రహించుట. 63

పోతన 4-24-716, 717

వ. (శ్రీహరి మంగళస్తవంబు నెవ్వండు ప్రభాతమున లేచి ప్రాంజలియు, శ్రద్ధాసమన్వితుండు నై చదువు, విను, వినిపించు, వాఁడు సమస్తాభీష్టంబులం బొంది కర్మబంధ విముక్తుండగు.)

## ప్రచేతస్కులు శ్రీజనార్దనుని స్తుతియించుట

**ప్రచేతస ఊచుః :**

శ్లో॥ నమో నమః క్లేశవినాశనాయ
నిరూపితో దారగుణాహ్వయాయ ।
మనో వచోవేగ పురోజవాయ
సర్వాక్షమార్గై రగతాధ్వనే నమః ॥ 94

శుద్ధాయ శాన్తాయ నమ స్స్వనిష్ఠయా
మనస్యపార్థం విలసద్ద్వయాయ ।
నమో జగత్ స్థానలయోదయేషు
గృహీతమాయాగుణవిగ్రహాయ ॥

నమో విశుద్ధసత్త్వాయ హరయే హరిమేధసే ।
వాసుదేవాయ కృష్ణాయ ప్రభవే సర్వసాత్త్వతామ్ ॥

నమః కమలనాభాయ నమః కమలమాలినే ।
నమః కమలనేత్రాయ నమస్తే కమలాంఘ్రయే ॥ 97

శ్లో॥ నమః కమలకింజల్క పిశంగామలవాససే ।
సర్వభూతనివాసాయ నమోఽ యుంక్ష్మహి సాక్షిణే ॥ 98
వ్యాస 4-30-22 నుండి 26

సీ. కేశవ! సంతత క్లేశనాశుఁడవు
కోరి మనో వా గగోచరుఁడవు
నిద్ధమనోరథ హేతుభూతోదార
గుణనాముఁడవు సత్త్వగుణుఁడ వఖిల
విశ్వోద్భవ స్థితి విలయార్థ ధారిత
విపుల మాయాగుణ విగ్రహు డవు
మహితాఖిలేంద్రియ మార్గ నిరధిగత
మార్గుండ వతిశాంత మానసుఁడవు

తే. తవిలి సంసారహారి మేధస్కుఁడవును
దేవదేవుఁడవును వాసుదేవుఁడవును
సర్వభూతనివాసిని సర్వసాక్షి
వైన నీకు నమస్కారమయ్య! కృష్ణ! 64

వ. మఱియును 65

ఉ. తోయరుహోదరాయ, భవదుఃఖహరాయ నమోనమః పరే
శాయ, సరోజకేసర పిశంగ వినిర్మల దివ్య నవ్య వ
స్త్రాయ, పయోజసన్నిభ పదాయ, సరోరుహ మాలికాయ, కృ
ష్ణాయ, పరాపరాయ, సుగుణాయ, సురారి హరాయ, వేధసే.
పోతన 4-30-916 నుండి 918

* * *

# అధ్యాయము-31

## పురంజనోపాఖ్యానము

**శ్రీనారద ఉవాచ :**

శ్లో॥ యథా తరోర్మూలనిషేచనేన
తృప్యన్తి తత్ స్కన్ధభుజోపశాఖాః ।
ప్రాణోపహారాశ్చ యథేన్ద్రియాణాం
తథైవ సర్వార్హణమచ్యుతేజ్యా ॥ 99
వ్యాస 4-31-14

మ. కమలాధీశ్వరుఁబూజసేయుట సమగ్రప్రీతిఁబ్రాణోపహా
రము సర్వేంద్రియ తృప్తిహేతువును సర్వక్ష్మాజ మూలాభిషే
కము శాఖాభుజపుష్టిదంబు నగు రేఖన్ సర్వదేవార్హణ
క్రమమై యొప్పుధరావరేణ్యు సుతులారా! బుద్ధి నూహించినన్. 67
పోతన 4-31-952

శ్లో॥ దయయా సర్వభూతేషు సంతుష్ట్యా యేన కేన చిత్ ।
సర్వేన్ద్రియోపశాన్త్యా చ తుష్యత్యాశు జనార్దనః ॥
వ్యాస 4-31-20

వ. జనార్దనుండు సర్వభూతదయాళువులును, ఎంతమాత్రంబు సంభవించు నంతమాత్రంబున సంతుష్టచిత్తులును, సర్వేంద్రియోప శాంతులును నగు పురుషులయెడ సంతుష్టుం డగు. 68
పోతన 4-31-957

(ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్కంధములు భగవత్తత్త్వ మహిమలను ప్రతిపాదించునవి.)

క. అని శుకుఁడు పరీక్షిత్తున,
కనుకంపం జెప్పె నీ యుపాఖ్యానంబున్
వినువాఁడైశ్వర్యాయు
ర్ధన కీర్తి స్వస్తిగతులఁదగఁ(బాపించున్. 69

పోతన 4-31-970

చ. సరస వచోవిలాస! గుణసాగర! సాగరమేఖలా మహీ
భరణ ధురంధరప్రకట భవ్య భుజా భుజగేంద్ర! రాజ శే
ఖర! ఖర దూషణప్రముఖ గాఢ తమఃపటల ప్రచండ భా
స్కర! కఱకంఠకార్ముక విఖండన ఖేలన! భక్తపాలనా!

క. శరవిదళిత సారంగా!
సరసదయాపాంగ! భక్తజలధి తరంగా!!
దురితధ్వాంత పతంగా!
వర జనకసుతాభిషంగ! వననిధి భంగా!!

**మాలిని.**

సురవిమత విదారీ! సుందరీ శంబరారీ!
సరసవినుత సూరీ! సర్వలోకోపకారీ!
నిరుపమగుణహారీ! నిర్మలానందకారీ!
గురు సమరవిహారీ! ఘోరదైత్య ప్రహారీ! 72

పోతన 4-31-972 నుండి 974

**ఇతి చతుర్థస్కన్ధః సమాప్తః**

**హరిః ఓమ్**

**శ్రీకృష్ణార్పణమస్తు.**

ఓమ్ నమో భగవతే వాసుదేవాయ

# శ్రీమద్భాగవత మణిహారము

## 16. పంచమ స్కంధము

## (ఆంధ్రీకరణము - గంగన)

## ప్రథమాశ్వాసము

శ్లో॥ యత్రామీ లోకవిస్తారాస్తారా ఇవ విహాయసి ।
భాసన్తే తమహం వన్దే సతాం గోపాలమాలయమ్ ॥

క. శ్రీకర! కరుణాసాగర!
ప్రాకట లక్ష్మీకళత్ర! భవ్యచరిత్రా!
లోకాతీత గుణాశ్రయ!
గోకులవిస్తార! నన్దగోపకుమారా!

### అధ్యాయము-1

**రాజోవాచ :**

శ్లో॥ మహతాం ఖలు విప్రర్షేహ్యుత్తమ శ్లోకపాదయోః ।
ఛాయానిర్వృతచిత్తానాం న కుటుంబే స్పృహా మతిః ॥ 1

సంశయోఽయం మహాన్ బ్రహ్మన్ దారాగారసుతాదిషు ।
సక్తస్య యత్సిద్ధి రభూ త్కృష్ణే చ మతి రచ్యుతా ॥ 2

వ్యాస 5-1-3,4

వ. ఉత్తమశ్లోకుండైన పుండరీకాక్షుని పాదచ్ఛాయం జేసి నిర్వృతచిత్తులైన మహాత్ములు కుటుంబంబునందు నిస్పృహత చేయుదురు. (కాన ప్రియవ్రతునకు సంసారంబునందుఁదగులంబు కలుగు టెట్లు?) దారాగార సుతాదులందుఁ

దగులంబు గలవానికి నెట్లు సిద్ధి గలుగు? శ్రీహరియం దస్ఖలితమతి యెట్లు కలుగు? ఈ సంశయంబు తేటపఱుపుము? 1

**శ్రీశుక ఉవాచ :**

గద్యమ్

**బాఢముక్తం కింతుభగవత ఉత్తమశ్లోకస్య శ్రీమచ్చరణారవింద మకరందరసావేశితచేతసః భాగవత పరమహంస దయితకథాం కథంచి దంతరాయవిహతామపి స్వాం శివతమాం పదవీం న ప్రాయేణ హిన్వంతి 3**

**వ్యాస 5-1-5**

క. హరి చరణాంబుజ మకరం
ద రసావేశిత మనః ప్రధానుం డగు స
త్పురుషుఁడొకవేళ విఘ్నముఁ
బొరసినఁదన పూర్వమార్గమును విడువఁడిలన్. 2

పోతన 5-1-5

* * *

## అధ్యాయము-5

### ఋషభావతారము

### ఋషభుండు పుత్రులకు నీతి నుపదేశించుట

**ఋషభదేవ ఉవాచ :**

శ్లో॥ నాయం దేహో దేహభాజాం నృలోకే
కష్టాన్ కామానర్హతి విడ్భుజాం యే ।
తపో దివ్యం పుత్రకా యేన సత్త్వం
శుద్ధ్యేద్యస్మాద్బ్రహ్మసుఖం హ్యనంతమ్ ॥ 4

వ్యాస 5-5-1

ఆ. తనయులార! వినుఁడు ధరలోనఁబుట్టిన
పురుషులకును, శునకములకు లేని
కష్టములను దెచ్చుఁగానఁ, గామంబుల
వలన బుద్ధి సేయవలదు మీరు. 3

చ. నరులకు నే తపంబున ననంతసుఖంబులు గల్గుచుండు శ్రీ
కరమతి నా తపంబుఁదగఁగైకొని చేసిన బ్రహ్మసౌఖ్యముం
దిరముగఁగల్గు వృద్ధులను, దీనులఁబ్రోవుఁడు, దుష్టవర్తనన్
జరుగుచునుండు కాముకుల సంగతిఁబోకుఁడు, మీఁద మేలగున్.

పోతన 5-5-67, 68

శ్లో॥ మహత్సేవాం ద్వారమాహుర్విముక్తే
స్తమోద్వారం యోషితాం సంగిసంగమ్ ।
మహాన్తస్తే సమచిత్తాః ప్రశాన్తా
విమన్యవః సుహృదః సాధవో యే ॥ 5

వ్యాస 5-5-2

వ. (అంగనాసక్తులగు కాముకుల సంగంబు నిరయరూపం బైన సంసారం బగు. మహత్సంగంబు మోక్షద్వారం బగు.) శత్రు మిత్ర వివేకంబు లేక సమచిత్తులు, శాంతులు (క్రోధరహితులు) సకలభూత దయాపరులు (సాధులు) నగు వారలు మహాత్ము లనందగుదురు. అట్టి మహాత్ములు నాయందలి స్నేహంబె ప్రయోజనంబుగాఁగల్గియుందురు. 5

పోతన 5-5-69

శ్లో॥ గురుర్న స స్స్యాత్స్వజనో న స స్యాత్
పితా న సస్స్యాజ్జననీ న సా స్యాత్ ।
దైవం న తత్స్యాన్న పతిశ్చ సస్యా
న్న మోచయేద్యః సముపేతమృత్యుమ్ ॥ 6

వ్యాస 5-5-18

వ. పితృ గురు (జననీ) బంధు (పతి) దైవంబులలో నెవ్వఁడైనను (సంసారరూప) మృత్యురహితంబైన మోక్షమార్గంబుఁజూపకుండెనేని వారెవ్వరును హితులు గానేరరు. 6

పోతన 5-5-73

శ్లో॥ భూతేషు వీరుద్భ్య ఉదుత్తమా యే
సరీసృపాస్తేషు సబోధనిష్ఠాః ।
తతో మనుష్యాః ప్రమథా స్తతోఽపి
గంధర్వసిద్ధా విబుధానుగా యే ॥ 7

దేవాసురేభ్యోమఘవత్ప్రధానా
దక్షాదయో బ్రహ్మసుతాశ్చ తేషామ్ ।
భవః పరస్సోఽథ విరించ వీర్యః
స మత్పరోఽహం ద్విజదేవదేవః ॥ 8

వ్యాస 5-5-21, 22



సీ. భూతజాలములందు భూజముల్ వర్యముల్
భూరుహంబులకంటె భోగికులము,
భోగిసంతతికన్న బోధనిష్ఠులు, బోధ
మాన్యులకన్నను మనుజవరులు,
వీరికన్నను సిద్ధ విబుధ గంధర్వులు,
వారికన్న నసురుల్, వారికన్న
నింద్రాదిదేవత, లిందరికన్నను
దక్షాది సన్మునుల్ దలఁప నెక్కు

తే. డంతకన్నను భర్గుఁడా, యభవుకన్నఁ
గమలభవుఁడెక్కుఁ, డాతనికంటె విష్ణుఁ
డధికుఁ, డాతఁడు విప్రుల నాదరించుఁ
గాన, విప్రుఁడు దైవంబు మానవులకు. 7

పోతన 5-5-74

శ్లో॥ న బ్రాహ్మణైస్తులయే భూతమన్య
త్పశ్యామి విప్రాః కిమతః పరం తు ।
యస్మిన్నృభిః ప్రహుతం శ్రద్ధయాహ
మశ్నామి కామం న తథాగ్నిహోత్రే ॥ 9

వ్యాస 5-5-23

క. భూసురులకు సరి దైవం
బీ సచరాచరమునందు నెఱుఁగను నాకున్
భూసురులు గుడుచు నప్పటి
యా సంతోషంబు దోఁచ దగ్నులయందున్. 8

పోతన 5-5-75

శ్లో॥ ధృతా తనూరుశతీ మే పురాణీ
యేనేహ సస్త్వం పరమం పవిత్రమ్ ।
శమో దమస్సత్యమనుగ్రహశ్చ
తప స్తితిక్షానుభవశ్చ యత్ర ॥

మత్తోఽ ప్యనంతాత్పరతః పరస్తా
త్స్వర్గాపవర్గాధిపతేర్న కించిత్ ।
యేషాం కిముస్యాదితరేణ తేషా
మకించనానాం మయి భక్తిభాజామ్ ॥ 11

వ్యాస 5-5-24, 25

సీ. *మంగళం బైన బ్రహ్మస్వరూపంబును
వేదరూపంబున నాదిరూప
మగుచున్న నాదు దేహము బ్రాహ్మణోత్తముల్
ధరియింతు రెప్పుడు తత్త్వబుద్ధి
శమదమానుగ్రహ సత్య తప స్తితి
క్షలు గల్గు విప్రుండు సద్గురుండు
గాన, మిక్కిలి భక్తిగల్గి యకించను
లైన భూసురుల దేహములవలన

(* మంగళ స్వరూపులైన బ్రాహ్మణులు నా రూపంబు గావున శమదమానుగ్రహంబు గలవారు మేదినీసురులు గావున ఇట్లు సచ్చరిత్రులై యకించనులైన భూమీ సుపర్వులు నారూపంబుగా నెఱింగి యేకాగ్రచిత్తులై పూజించువారలు నాకును ప్రియంబుచేసినవా రగుదురు. ఈ విధం బెరింగినవారు మోక్షమార్గంబును జెందుదురు.)



తే. నందుచుండును నాదుదేహంబు గాఁగ
నెఱిఁగి వరులగు విప్రుల నెల్ల భక్తిఁ
బూజ సేయుటయే నన్నుఁబూజసేయు
టనుచు వినుపించి మఱియు ని ట్లనుచుఁబలికె. 9

క. ఈ తెఱఁగుఁదెలిసి భూసుర
జాతిం బూజించునట్టి జనుఁడును మాయా
తీతుం డై నిక్కంబుగ
భూతలమున మోక్షమార్గమును బొడగాంచున్.

పోతన 5-5-76, 77

* * *

## అధ్యాయము-9

### జడభరతోపాఖ్యానము

**శ్రీశుక ఉవాచ :**

అథ కస్యచిద్ద్విజవరస్యాంగిరసప్రవరస్య శమదమతపస్స్వాధ్యా యాధ్యయ నాధ్యాపనసంతోషతితిక్షాప్రశయత్యాగవిద్యా ననసూయాత్మ జ్ఞానానందయుక్తస్యాత్మసదృశ శ్రుత శీలాచార రూపౌదార్యగుణా నవసోదర్యా అంగజా బభూవుః. మిధునం చ యవీయస్యాం భార్యాయామ్ ॥ 12

యస్తు తత్ర పుమాం స్తం పరమభాగవతం రాజర్షి ప్రవరం భరత ముత్సృష్టమృగశరీరం చరమశరీరేణ విప్రత్వం గత మాహుః ॥ 13

వ్యాస 5-9-1, 2

సీ. హరిణదేహముఁబాసి యంతనాంగిరసాహ్వ
యుండు శుద్ధుఁడుఁబవిత్రుండు ఘనుఁడు
శమదమ ఘనతప స్స్వాధ్యాయ నిరతుండు
గుణగరిష్ఠుఁడు నీతికోవిదుండు
నైన బ్రాహ్మణునకు నాత్మజుండై పుట్టి
సంగంబువలనను జకితుఁడగుచుఁ
గర్మబంధముల ఖండింపఁజాలునీ
శ్వరుని నచ్యుతు నజు శ్రవణమనన

తే. ములను హరిచరణధ్యానములను విఘ్న
భయముననుజేసి మనమందుఁబాయనీక
నిలిపి సంస్తుతిసేయుచు నిలిచియుండె
భరితయశుఁడైనభరతుండు పార్థివేంద్ర! 11

పోతన 5-9-119

* * *

## అధ్యాయము-12

### వృషలరాజ భృత్యులు కాళిబలికి భరతునిఁగొంపోవుట

**రహూగణ ఉవాచ :**

శ్లో॥ నమో నమః కారణవిగ్రహాయ
స్వరూపతుచ్ఛీకృతవిగ్రహాయ ।
నమోఽ వధూతద్విజబంధులింగ
నిగూఢనిత్యానుభవాయ తుభ్యమ్ ॥ 14

వ్యాస 5-12-1

ఉ. కారణవిగ్రహంబు నురుకాయము నీ యవధూతవేషమున్
భూరి ధరామరత్వమును బూర్వసమాగమ మాత్మభావముం
జారు విహార మత్యతుల శాంతిగుణంబును గూఢవర్తనం
బారయఁగల్గ నీకు ననయంబును మ్రొక్కెదఁబెక్కుభంగులన్. 12

పోతన 5-12-156

శ్లో॥ యదాహ యోగేశ్వర దృశ్యమానం
క్రియాఫలం సద్వ్యవహార మూలమ్ ।
న హ్యంజసా తత్త్వవిమర్శనాయ
భవా నముష్మిన్ భ్రమతే మనో మే ॥ 15

వ్యాస 5-12-4

తే. కానవచ్చిన ఫలములు కర్మమూల
ము లగుటను జేసి సంసారములను జిత్త
మెపుడు వర్తించుచుండఁగా నెఱుఁగ లేవు
తత్త్వయోగంబు మిగుల నిత్యం బటంచు. 13

పోతన 5-12-160

శ్లో॥ జ్ఞానం విశుద్ధం పరమార్థ మేక
మనంతరం త్వబహిర్బ్రహ్మసత్యం ।
ప్రత్యక్ప్రశాంతం భగవచ్ఛబ్ద సంజ్ఞం
యద్వాసుదేవం కవయో వదంతి ॥ 16

వ్యాస 5-12-11

వ. బాహ్యాభ్యంతరంబులఁగలిగి స్వప్రకాశంబై భగవచ్ఛబ్ద వాచ్యంబు విశుద్ధంబుఁబరమార్థంబు జ్ఞానరూపంబు నైన బ్రహ్మంబొకటియే సత్యంబు. జగత్తసత్యం బగు. (బ్రహ్మము సత్యము. జగత్తు అసత్యము.) 14

పోతన 5-12-161

**బ్రాహ్మణ ఉవాచ :**

శ్లో॥ రహూగణై త త్తపసా న యాతి
న చేజ్యయా నిర్వపణాద్గృహాద్వా ।
న చ్ఛందసా నోతజలాగ్నిసూర్యై
ర్వినా మహత్పాదరజోభిషేకమ్ ॥ 17

యత్రోత్తమశ్లోకగుణానువాదః
ప్రస్తూయతే గ్రామకథావిఘాతః ।
నిషేవ్యమాణోఽనుదినం ముముక్షో
ర్మతిం సతీం యచ్ఛతి వాసుదేవే ॥ 18

వ్యాస 5-12-12, 13

సీ. ధరలోన బ్రహ్మంబు తపమున దానంబులను
గృహధర్మంబులను జలాగ్ని
సోమ సూర్యులచేత శ్రుతులచే నైనను
బరమభాగవతుల పాదసేవఁ
బొందినమాడ్కిని బొందంగ రా దని
పలుకుదు రార్యులు పరమమునులు



ఘన తపో బాహ్యసౌఖ్యములకు విముఖులు
నై పుణ్యులు హరిగుణానువాద

తే. మోదితాత్ములు నగు బుధపాదసేవ
ననుదినంబును జేసిన నంతమీఁద
మోక్షమార్గంబునకును బద్మాక్షునందుఁ
బట్టువడి యందు నెప్పుడు పరఁగ బుద్ధి. 15

పోతన 5-12-162

శ్లో॥ తస్మాన్నరోఽసంగ సుసంగజాత
జ్ఞానాసినైవేహ వివృక్ణ మోహః ।
హరిం తదీహాకథనశ్రుతాభ్యాం
లబ్ధస్మృతిర్యాత్యతిపారమధ్వనః ॥ 19

వ్యాస 5-12-16

వ. నరుఁడ వృద్ధసంసేవంజేసి సంసారమోహంబును బాసి హరిధ్యాన కథలచే లబ్ధజ్ఞానుండై పుండరీకాక్షునిం బూజింపుచుం బరలోకంబును బొందు. 16

పోతన 5-12-163

వ. నరేంద్రా! భరతుని చరిత్రం బెవ్వరు సెప్పిన, నెవ్వరు వినిన, నట్టివారలఁ బుండరీకాక్షుండు రక్షించు. ఆయు రభివృద్ధియు, ధన ధాన్య సమృద్ధియు నగుచుండ, స్వర్గోపభోగంబులం బొందుదురు. 17

పోతన 5-13, 14-180

మ. నర దేవాసుర యక్ష రాక్షస మునీంద్ర స్తుత్య! దివ్యాంబరా
భరణాలంకృత భక్తవత్సల! కృపాపారీణ! వైకుంఠ మం
దిర! బృందావన భాసుర ప్రియధరిత్రీనాథ! గోవింద! శ్రీ
కర! పుణ్యాకర! వాసుదేవ! త్రిజగత్కల్యాణ! గోపాలకా!

క. పరమపదవాస! దుష్కృత
హర! కరుణాకర! మహాత్మ! హతదితిసుత! భా
సురగోపికా మనోహర!
సరసిజదళనేత్ర! భక్తజననుత గాత్రా! 16

మాలిని. సరస హృదయవాసా! చారు లక్ష్మీవిలాసా!
భరిత శుభచరిత్రా! భాస్కరాబ్జారినేత్రా!
నిరుపమ ఘనగాత్రా! నిర్మల జ్ఞానపాత్రా!
గురుతర భవదూరా! గోపికా చిత్తచోరా! 17

పోతన 5-14-181 నుండి 183

ఇతి పంచమస్కన్ధః ప్రథమాశ్వాసః సమాప్తః
హరిః ఓమ్
శ్రీకృష్ణార్పణమస్తు.

ఓమ్ నమో భగవతే వాసుదేవాయ

# శ్రీమద్భాగవత మణిహారము

## 16. పంచమ స్కంధము

## (ఆంధ్రీకరణము - గంగన)

## ద్వితీయాశ్వాసము

క. శ్రీకాంతా హృదయప్రియ!
లోకాలోకప్రచార! లోకేశ్వర! సు
శ్లోక భవభయనివారక!
గోకులమందార! నందగోపకుమారా!

## అధ్యాయము-17

### కర్మక్షేత్రం బగు భారతదేశము

**శ్రీశుక ఉవాచ :**

తథైవాలకనందా దక్షిణేన తు బ్రహ్మసదనాద్బహూని గిరి కూటాన్యతిక్రమ్య హేమకూట హిమకూటాని అతిరభసతరరంహసా లుఠంతీ భారతమభివర్షం కర్మక్షేత్రం దక్షిణస్యాం దిశి జలధిమను ప్రవిశతి. 1

వ్యాస 5-17-10

వ. అలకనందయని ప్రఖ్యాతిగాంచిన యమ్మహానదీ ప్రవాహంబు బ్రహ్మ సదన దక్షిణద్వారంబున వెడలి, యత్యంత దుర్గమంబులైన భూధరంబులఁ గడచి, హేమకూట హిమకూట నగరంబుల నుత్తరించి, యతివేగంబునఁ గర్మక్షేత్రంబగు భారతవర్షంబుఁబావనంబు సేయుచు దక్షిణ లవణాంబుధిం గలయు. 1

పోతన 5-17-34

అన్యే చనదా నద్యశ్చ వర్షే వర్షే సంతి బహుశో మేర్వాదిగిరి దుహితర శ్శతసహస్రశః ॥

అత్రాపి జంబూద్వీపే – భారతమేవ వర్షం కర్మక్షేత్రమన్యా న్యష్టవర్షాణి స్వర్గిణాం పుణ్య శేషోపభోగస్థానాని భౌమస్వర్గపదాని వ్యపదిశంతి ॥ 3

వ్యాస 5-17-11,12

సీ. జగతిలో మేరు వాదిగఁబర్వతములకుఁ
బుత్రిక లైనట్టి పుణ్యతీర్థ
ములు వేల సంఖ్యలు గలవు జంబూద్వీప
మందు భారతవర్ష మరయఁగర్మ
భూమి; తక్కినవర్షముల దివంబుననుండి
భువికి వచ్చినవారు పుణ్యశేష
ములు భుజింపుచు నుంద్రు భూస్వర్గ
మనఁదగు నా వర్షమున నుండునట్టి వార

ఆ. లయుతసంఖ్య వత్సరాయువు లయుత మా
తంగబలులు దేవతాసమాను
లతుల వజ్రదేహు లధికప్రమోదితు
లప్రమత్తు లార్యు లనఘు లధిప! 2

పోతన 5-17-35

* * *

## అధ్యాయము-19

**శ్రీశుక ఉవాచ :**

కింపురుషే వర్షే భగవంతమాదిపురుషం లక్ష్మణాగ్రజం సీతాభిరామం రామం తచ్చరణసన్నికర్షాభిరతః పరమభాగవతోత్తమో హనుమాన్ సహ కింపురుషైరవిరతభక్తిరుపాస్తే. అర్ష్టిషేణేన సహ గంధర్వైరనుగీయమానాం పరమకల్యాణీం భర్తృభగవత్కథాం సంశృణోతి స్వయం చేదం గాయతి ఓం నమో భగవతే – ఉత్తమ శ్లోకాయ – నమ ఆర్యలక్షణశీలవ్రతాయ – నమ ఉపశిక్షితాత్మనే నమ ఉపాసితలోకాయ – నమస్సాధువాదనికర్షణాయ నమో బ్రహ్మణ్య దేవాయ మహాపురుషాయ – మహారాజాయ నమ ఇతి. 4

శ్లో॥ యత్తద్విశుద్ధానుభవైకమాత్రం
స్వేతేజసా ధ్వస్తగుణవ్యవస్థం ।
ప్రత్యక్ప్రశాంతం సుధియోపలంభనం
హ్యానామరూపం నిరహం ప్రపద్యే ॥ 5

శ్లో॥ మర్త్యావతారస్త్విహ మర్త్యశిక్షణం
రక్షోవధాయైవ న కేవలం విభోః ।
కుతోఽన్యథా స్యాద్రమతస్స ఆత్మన్
సీతాకృతాని వ్యసనానీశ్వరస్య ॥ 6

న వై స ఆత్మాత్మవతాం సుహృత్తమః
సక్తస్త్రిలోక్యాం భగవాన్వాసుదేవః ।
న స్త్రీకృతం కశ్మలమశ్ను వీత
న లక్ష్మణం చాపి విహాతు మర్హతి ॥

న జన్మ నూనం మహతో న సౌభగం
న చాపి బుద్ధిర్నాకృతిస్తోషహేతుః ।
తైర్యద్విసృష్టానపి నో వనౌకస
శ్చకార సఖ్యే బత లక్ష్మణాగ్రజః ॥

సురోఽసురోవాథ నరోఽథ వా నరః
సర్వాత్మనా యస్సుకృతజ్ఞముత్తమమ్ ।
భజేత రామం మనుజాకృతిం హరిం
య ఉత్తరాననయత్కోసలాన్ దివమ్ ॥ 9

వ్యాస 5-19-1 నుండి 6

క. ఉత్తర కురుభూములకును
హత్తుకొని వరాహదేహుఁడధిపతియైనన్
సత్తుగ భూపతి యతనిన్
జిత్తములో నిలిపి పూజసేయుచునుండున్. 3

క. అరయఁగ సీతాలక్ష్మణ
పరివృతుఁడై వచ్చి రామభద్రుఁడు గడిమిం
బరఁగు నధిదేవతగఁగిం
పురుష మహావర్ష మునకు భూపవరేణ్యా! 4

ఆ. అట్టి రామభద్రు నంజనీసుతుఁడు కిం
పురుషగణముఁగూడి పూజచేసి
త త్ప్రకాశక ప్రధానమంత్రస్తోత్ర
పఠనములను దగ నుపాస్తి సేయు. 5

పోతన 5-19-49 నుండి 51

చూ. భారతేఽప్యస్మిన్ వర్షే సరిచ్ఛైలాస్సంతి బహవః - మలయో మంగళ ప్రస్థో మైనాకస్త్రికూట ఋషభః కూటరః కోల్ల స్సహ్యో వేదగిరిరృశ్యమూక శ్శ్రీశైలో వేంకటో మహేంద్రో వారిధరో వింధ్యశ్శుక్తిమానృక్షగిరిః పారియాత్రో ద్రోణశ్చిత్ర కూటో గోవర్ధనో రైవతకః కుకుంభో నీలః కాకముఖ ఇంద్రకీలో రామగిరిరితి చ - అన్యేచ శతసహస్రశైలాః తేషాం నితమ్బప్రభవా నదా నద్యశ్చ సంత్యసంఖ్యాతాః ॥

ఏతాసామపో భారత్యః ప్రజానామభిరేవ పునంతీనామాత్మనా చోపస్పృశంతి చంద్రపటా తామ్రపర్ణీ అవటోదా కృతమాలా వైహాయసీ కావేరీ వేణీ పయస్వినీ పయోదా శర్కరావర్తా తుంగభద్రా కృష్ణవేణీ భీమరథీ



గోదావరీ నిర్వింధ్యా పయోష్ణీతాపి రేవా శిలా సురసా నర్మదా చర్మణ్వతీ, సింధు శ్శోణశ్చ నదౌ - మహానదీ వేదస్మృతిరృషికుల్యా త్రిసమా కౌశికీ, మందాకినీ యమునా సరస్వతి దృషద్వతీ గోమతీ సరయూర్భోగవతీ సుషమా శతద్రు శ్చంద్రభాగా మరుద్వృధా వితస్తా అసిక్నీ విశ్వేతి మహానద్యః ॥11

అస్మిన్నేవ వర్షే పురుషైర్లబ్ధజన్మభిశ్శుక్లలోహిత కృష్ణవర్ణేన ప్రారబ్ధేన కర్మణా దివ్యమానుష నారకగతయో బహ్వ్య ఆత్మన ఆను పూర్వ్యేణ సర్వా హ్యేవ సర్వేషాం విధీయంతే. యథావర్ణ విధాన మపవర్గశ్చాపి భవతి ॥ 12

యోఽసౌ భగవతి సర్వభూతాత్మన్యనాత్మ్యేఽనిరుక్తేఽనిల యనే పరమాత్మని వాసుదేవే అనన్యనిమిత్తభక్తియోగలక్ష్మణో నానాగతినిమిత్తావిద్యా గ్రంథిరంధనద్వారేణ భవతి యథాపి మహాపురుష పురుషప్రసంగః. నేతదేవ హి దేవా గాయంతి ॥ 13

వ్యాస 5-9-15 నుండి 18

క. భారత వర్ష మునందుల
సారాంశము లైన పుణ్యశైలంబులు గం
భీర ప్రవాహములు గల
వారయ నెఱిఁగింతు వాని నవనీనాథా! 6

వ. మలయపర్వతమును, మంగళప్రస్థమును, మైనాకంబును,ద్రికూటంబును, ఋషభపర్వతంబును, గూటరమును, గోల్లమును, సహ్యాపర్వతంబును, వేదగిరియును, ఋష్యమూకపర్వతమును, శ్రీశైలంబును, వేంకటాద్రియును, మహేంద్రంబును, వారిధరంబును, వింధ్యపర్వతంబును, శుక్తిమత్పర్వతంబును, ఋక్షగిరియుఁ, బారియాత్రంబను, ద్రోణ పర్వతంబును, జిత్రకూటంబును, గోవర్ధనాద్రియును, రైవతకంబును, గుకుంభంబును, నీలగిరియుఁ, గాకముఖంబును, నింద్రకీలంబును, రామగిరియు నాదిగాఁ గల పుణ్యపర్వతంబులనేకంబులు గలవు.

ఆ పర్వత పుత్రిక లైన చంద్రపటయుఁదామ్రపర్ణియు, నవటోదయుఁ, గృతమాలయు, వైహాయసియుఁ, గావేరియు, వేణియుఁ, బయస్వినియుఁ, బయోదయు, శక్కరావర్తయుఁ, దుంగభద్రయుఁ, గృష్ణవేణియు, భీమరథియుఁ

గోదావరియు, నిర్వింధ్యయుఁ, బయోష్ణియుఁ, దాపియు, రేవానదియు, శిలానదియు, సురసయుఁ, జర్మణ్వతియు, వేదస్మృతియు, ఋషికుల్యయుఁ, త్రిసమయుఁ, గౌశికియు, మందాకినియు, యమునయు, సరస్వతియు, దృషద్వతియు, గోమతియు, సరయువును, భోగవతియు, సుషమయు, శతద్రువును, జంద్రభాగయుఁ, మరుద్వృధయు, వితస్తయు, నసిక్నియు, విశ్వయు, నను నీ మహానదులును, నర్మద, సింధువు, నశోణ యను నదంబులును నయిన మహా ప్రవాహంబు లీ భారతవర్షంబునం గలవు. అందు సుస్నాతులైన మానవులు ముక్తిం జెందుదురు.

మఱియు నీ భారతవర్షంబున జన్మించిన పురుషులు శుక్ల లోహిత కృష్ణవర్ణ రూపంబు లగు త్రివిధకర్మంబులం జేసి క్రమంబుగ దేవ మనుష్య నరకగతులను త్రివిధగతులఁబొందుదురు. వినుము. రాగద్వేషాదిశూన్యుఁడును (నవాఙ్మానస గోచరుఁడును, ననాధారుండునగు శ్రీవాసుదేవమూర్తి యందుఁజిత్తంబునిలిపి భక్తియోగంబున నారాధించెడు మహాత్ము లవిద్యాగ్రంథిదహనంబుగావించుటం జేసి పరమభాగవతోత్తములు పొందెడు నుత్తమగతినిం జెందుదురు. కావున, భారతవర్షంబు మిగుల నుత్తమం బని) మహాపురుషు లిట్లు స్తుతింపుదురు. 7

పోతన 5-19-53, 54

శ్లో॥ అహో బతైషాం కిమకారి శోభనం
ప్రసన్న ఏషాం స్విదుత స్వయం హరిః
యైర్జన్మలబ్ధం నృషు భారతాజిరే
ముకుందసేవౌపయికం స్పృహా హి నః ॥ 14

పోతన 5-19-19

ఉ. భారతవర్ష జంతువుల భాగ్యము లేమని చెప్పవచ్చు! నీ
భారతవర్ష మందు హరి పల్మఱు బుట్టుచు జీవకోటికిం
ధీరతతోడఁదత్త్వ ముపదేశము సేయుచుఁజెల్మిసేయుచు
న్నారయ బాంధవాకృతిఁగృతార్థులఁసేయుచునుండు నెంతయున్. 8

పోతన 5-19-55



శ్లో॥ యద్యత్ర నస్స్వర్గసుఖావశేషితం
స్విష్టస్య సూక్తస్య కృతస్య శోభనమ్ ।
తేనాబ్జనాభే స్మృతిమజ్జన్మ నస్స్యా
ద్వర్షే హరిర్యద్భజతాం శం తనోతి ॥ 15

వ్యాస 5-19-26

క. తన జన్మకర్మములనుం
గొనియాడెడివారి కెల్లఁగోరిన వెల్లన్
దనియఁగ నొసఁగుచు మోక్షం
బనయముఁగృపసేయుఁగృష్ణుఁడవనీనాథా! 9

పోతన 5-19-56

శ్లో॥ కిం దుష్కరైర్నః క్రతుభిస్తపోవ్రతై
ర్దానాదిభిర్వాద్యుజయేన ఫల్గునా ।
న యత్ర నారాయణపాదపంకజ
స్మృతిః ప్రమృష్టాఽతిశయేంద్రియోత్సవాత్ ॥ 16

కల్పాయుషాం స్థానజయాత్పునర్భవాత్
క్షణాయుషాం భారతభూజయో వరః
క్షణేన మర్త్యేన కృతం మనస్విన
స్సన్న్యస్య సంయాంత్యభయం పదం హరేః ॥

న యత్ర వైకుంఠకథాసుధాపగా
న సాధవో భగవతాస్తదాశ్రయాః ।
న యత్ర యజ్ఞేశమఖామహోత్సవా
స్సురేశలోకోఽపి న వై స సేవ్యతామ్ ॥ 18

శ్లో॥ ప్రాప్తా నృజాతిం త్విహ యే చ జంతవో
జ్ఞానక్రియాద్రవ్యకలాపసంభృతామ్ ।
న చేద్యతేరన్న పునర్భృతాయ తే
భూయో వనౌకా ఇవ యాంతి బంధనమ్ ॥ 19

యైశ్శ్రద్ధయా బర్హిషి భాగశో హవి
ర్నిరు ప్తమిష్టం విధిమంత్ర వస్తుతః ।
ఏకః పృథఙ్నామభిరాహుతో ముదా
గృహ్ణాతి పూర్ణస్స్వయమాశిషాం ప్రభుః ॥

సత్యం దిశత్యర్థితమర్థితో నృణాం
నై వార్థదో యత్పునరర్థితా యతః ।
స్వయం విధత్తే భజతామనిచ్ఛతా
మిచ్ఛాపిధానం నిజపాదపల్లవమ్ ॥ 21

వ్యాస 5-19-20 నుండి 25

వ. ఇట్లు భారతవర్షంబునందుల జనంబులకు నెద్దియు నసాధ్యంబు లేదు. నారాయణ స్మరణంబు సకల దురితంబుల నడంచు. తన్నామస్మరణ రహితంబులైన యజ్ఞ తపోదానాదులు దురితంబుల నడంపలేవు. బ్రహ్మకల్పాంతంబు బ్రతికెడి యితర స్థానంబునం బునర్జన్మభయంబున భీతిల్లుచు నుండుటకన్న, భారతవర్షంబునందు క్షణమాత్రంబు మనంబున సర్వసంగ పరిత్యాగంబు చేసిన పురుష శ్రేష్ఠునకు శ్రీమన్నారాయణ పదప్రాప్తి యతిసులభంబుగ సంభవించు. కావున, నట్టి యుత్తమమగు నీ భారతవర్షంబె కోరుచుండుదురు. మఱియు నెక్కడ వైకుంఠుని కథావాసన లేకుండు, నే దేశంబున సత్పురుషులైన పరమభాగవతులు లేకుండుదు, రే భూమిని యజ్ఞేశ్వరుని మహోత్సవంబులు లేకయుండు, నది సురేంద్రలోకం బైన నుండం దగదు. జ్ఞానానుష్ఠాన ద్రవ్య కలాపంబుచేత మనుష్య జాతిం బొంది, తపంబున ముక్తిం బొందకుండెనేని, మృగంబుల మాడ్కి నతండు దనకుం దానె బంధనంబు నొందు. భారతవర్షంబు నందుఁ బ్రజలచేత శ్రద్ధాయుక్తంబుగా ననుష్ఠింపంబడ్డ యజ్ఞంబుల యందు వేల్వంబడ్డ హవిస్సులను బెక్కు నామంబులం బుండరీకాక్షుండంది, తనమీఁది భక్తియధికంబుగాఁజేయు. అట్టి భారతవర్షంబు నందలి ప్రజల మీఁదం గరుణించి (సర్వేశ్వరుం) డిహ పర సౌఖ్యంబుల నొసఁగుచుండు. 10

పోతన 5-19-57

* * *

# అధ్యాయము-21

## ఖగోళవిషయము

## సూర్యునిరథంబు

**శ్రీశుక ఉవాచ :**

చూ. ఏవం ముహూర్తేన చతుస్త్రింశల్లక్షయోజనాన్యష్ట శతాధికాని సౌరోరథస్త్రయీమయశ్చతసృషు పరివర్తితే పురీషు - యస్యైకం చక్రం ద్వాదశారం షణ్ణేమిత్రినాభి సంవత్సరాత్మకం సమామనంతి ॥

తస్యాక్షో మేరోర్మూర్ధని కృతమానసోత్తరే కృతేతరభాగో యత్ర ప్రోతం రవిరథచక్రం తైలయంత్రచక్రవన్మానసోత్తరగిరౌ పరిభ్రమతి ॥ 23

తస్మిన్నక్షే కృతమూలోద్వితీయోక్షస్తురీయమానేన సంయమితస్తైల యంత్రాక్షవద్ధ్రువే కృతోపరిభాగః ॥

రథనీడస్తు షట్త్రింశల్లక్షయోజనాయతస్తురీయభాగవిశాలస్తు తావాన్ రవిరథయుగః - యత్రహయాశ్ఛందోనామానస్సప్తారుణ యోజితా వహంతి - దేవమాదిత్యం - పురస్తాత్సవితురరుణః పశ్చాచ్చ నియుక్త స్సౌత్యకర్మణి కిలాస్తే ॥ 25

చూ. తథా వాలఖిల్యా ఋషయోఽంగుష్ఠ పర్వమాత్రాః - షష్టి సహస్రాణి పురతస్సూర్యం సూక్తవాకాయ నియుక్తాస్సంస్తువంతి ॥ 26

తథాన్యేచర్షయో గంధర్వాప్సరో నాగాగ్రామణ్యో యాతుధానా దేవా ఇత్యేకైకశో గణాస్సప్తచతుర్దశరథస్తోమాని మాసి మాసి భగవంతం సూర్యమాత్మానం నానానామానః పృథఙ్నామానః పృథక్కర్మభిర్ద్వంద్వశ ఉపాసతే ॥ 27

లక్షోత్తరసార్ధ నవకోటియోజనపరిమండలం భూవలయం యస్య కక్షేణ ద్విశత గవ్యూత్యుత్తర ద్విసాహస్ర యోజనాని స భుంక్తే ॥ 28

వ్యాస 5-21-11 నుండి 17

సీ. ఇను రథంబున నున్న యిరుసొక్కటియు మేరు
శిఖరంబునందును జేరియుండు
నొనరcజక్రము మానసోత్తరపర్వతం
బందులcదిరిగెడు నా రథంబు
నిరుసున నున్న రెండిరుసులు దగులంగc
బవనపాశంబుల బద్ధమగుచు
ధ్రువమండలంబునందుల నంటి యుండcగా
సంచరించుచునుండు సంతతంబు

తే. నట్టి యరదంబు ముప్పదియారులక్ష
లందు నంటిన కాcడియు నన్ని యోజ
నముల విస్తార మై తురంగముల కంధ
రములcదగులుచు వెలుcగొందు రమణతోడ 11

పోతన 5-21-81, 82

**పుండరీకాక్షుని దివ్యదేహము (ధ్రువునింగా నెఱుంగవలెను)**

చూ. ఏతదుహవై భగవతో విష్ణోస్సర్వదేవతామయం రూపం అహరహస్సంధ్యాయాం ప్రయతో వాగ్యతో నిరీక్షమాణ ఉపతిష్ఠేత నమో జ్యోతిర్లోకాయ కాలాయనాయ అనిమిషాం పతయే - మహా పురుషాయాభిధీ మహీతి ॥ 29

శ్లో॥ గ్రహర్క్ష తారామయమాదిదైవతం
పాపాపహమ్మంత్రకృతాం త్రికాలమ్ ।
నమస్యతః స్మరతో వాత్రికాలే
నశ్యేత తత్కాలజమాశు పాపమ్ ॥ 30

వ్యాస 5-23-8, 9



సీ. ఇట్టి దివ్యశరీర మెవ్వcడు ప్రతిదినం
బందు సంధ్యాకాల మతులభక్తి
మనమందు నిలిపి యేమఱక మిక్కిలి
ప్రయత్నంబున నియతుcడై తత్త్వబుద్ధి
మౌనవ్రతంబునcబూని వీక్షింపుచు
నీ సంస్తవంబుcదా నెంతొ ప్రేమ
జపియించి కడుcబ్రశస్తమును మునీంద్ర
సేవ్యమును జ్యోతిస్స్వరూపమునవెలుcగు

ఆ. విపుల శింశుమార విగ్రహంబునకు వం
దనము వందనంబు లనుచు నిలిచి
సన్నుతించె నేని సకలార్థ సిద్ధులc
బొందు మీcద ముక్తిcజెందు నధిప. 12

పోతన 5-23-97

* * *

## అధ్యాయము-23

### ధ్రువుఁడు - శింశుమారచక్రము

**శ్రీశుక ఉవాచ :**

సీ. ఆ శింశుమారాఖ్య మగు చక్రమున భాగ
వతుఁడైన ధ్రువుఁడింద్ర వహ్ని కశ్య
ప ప్రజాపతి యను ప్రముఖులతోఁగూడి
బహుమానముగ విష్ణుపదముఁజేరి
కణఁకనిచ్చలుఁబ్రదక్షిణముగాఁదిరుగుచుఁ
జెలఁగియుండును గల్పజీవి యగుచు
ననఘుఁడుత్తానపాదాత్మజుఁడార్యుఁడు
నైన యా ధ్రువుని మహత్త్వమెల్లఁ

తే. దెలిసి వర్ణింప బ్రహ్మకు నలవిగాదు
నే నెఱింగిన యంతయు నీకు మున్ను
తెలియఁబలికితిఁగ్రమ్మఱఁదలఁచి కొనుము
జితరిపువ్రాత! శ్రీపరీక్షిన్నరేంద్ర! 13

పోతన 5-23-92

(వ్యాస 5-23-21)

* * *

## అధ్యాయము-25

### శేషుండు

**శ్రీశుక ఉవాచ :**

చూ. తస్య మూలదేశే త్రింశద్యోజన సాహస్రాంతర ఆస్తే యా వైకలా
భగవతస్తామసీ సమాఖ్యాతానంత ఇతి సాత్త్వతీయాయం ద్రష్టృదృశ్యయో
స్సన్నికర్షణాదహమితి చాభిమానలక్షణా త్సంకర్షణ ఇత్యాచక్షతే ॥ 31

యస్యేదం క్షితిమండలం భగవతోఽనంతమూర్తేః సహస్ర శిరస
ఏకస్మిన్నేవశీర్షణి ధ్రియమాణం సిద్ధార్థ ఇవ లక్ష్యతే ॥ 32

వ్యాస 5-25-1, 2

సీ. పాతాళలోకంబు పాతున శేషుండు
వెలయంగ ముప్పదివేల యోజ
నంబుల వెడలుపునను దోఁక జుట్టఁగా
జుట్టుకయుండు విష్ణుని మహోగ్ర
మైన శరీరంబు దానై యనంతాఖ్య
సంరక్షణుం దుండు సంతతంబు
నట్టి యనంతనామాభిధానుని మస్త
కమున సిద్ధార్థంబుకరణి ధరణి

ఆ. *యంత నా విభుండు నఖిలలోకంబుల
సంహరింపఁగోరి చండకోప
వశత సృజనఁజేయు వరుస నేకాదశ
రుద్రమూర్తు లనెడు రౌద్రమతుల. 14

---

(* "దేరియుండు బ్రహ్మదేవుని దై-నందిన ప్రళయమునందు నాగవిభుని-వలన నుదయ మైన వార లేకాదశ - రుద్రమూర్తులధికరౌద్రమతులు.)

ఆ. అట్టి రుద్రమూర్తులతుల త్రినేత్రులు
నఖిలశూలహస్తు లగుచు నుందు
రందు నున్న ఫణికులాధిపుల్ శేషుని
పాదపంకజముల భక్తిఁజేరి.

ఆ. నమ్రులగుచు ననుదినంబును మౌళి ర
త్నములచేతఁగడు ముదంబు నొంది
కోరికలు దలిర్ప నీరాజనంబుల
నిచ్చుచుందు రెపుడు మచ్చికలను. 16

పోతన 5-25-121 నుండి 123

వ. అట్టి శేషుని స్వాయంభువుం డగు నారదుండు తుంబురు ప్రభృతు లగు ఋషిశ్రేష్ఠులతోఁజేరుకొని కమలాసనుని సభాస్థానంబునందు నిట్లు స్తుతించుచుండిరి. 17

పోతన 5-25-124

శ్లో॥ ఉత్పత్తిస్థితిలయహేతవోఽస్యకల్యా
సత్త్వాద్యాః ప్రకృతిగుణా యదీక్షయాఽఽసన్ ।
యద్రూపం ధ్రువమకృతం యదేకమాత్మన్
నానాధాత్కథము హ వేద తస్య వర్త్మ ॥ 33

మూర్తిం నఃపురుకృపయా బభారసత్త్వం
సంశుద్ధం సదసదిదం విభాతి యత్ర ।
యల్లీలాలం మృగపతిరాదధేఽనవద్యా
మాదాతుం స్వజనమనాంస్యుదారవీర్యః ॥

యన్నానుశ్రుతమనుకీర్తయేదకస్మా
దార్తో వా యది పతితః ప్రలంభనాద్వా ।



హంత్యంహస్సపది నృణామ శేషమన్యం
కం శేషాద్భగవత ఆశ్రయేన్ముముక్షుః ॥

మూర్ధన్యర్పితమణివత్సహస్రమూర్ధ్నో
భూగోళం సగిరిసరిత్సముద్రసత్త్వమ్ ।
ఆనంత్యాదవిదితవిక్రమస్య భూమ్నః
కో వీర్యాణ్యపి గణయేత్సహస్రజిహ్వః ॥

ఏవం ప్రభావో భగవాననంతో
దురంతవీర్యోరుగుణానుభావః ।
మూలే రసాయాః స్థిత ఆత్మతంత్రో
యో లీలయా క్ష్మాం స్థితయే బిభర్తి ॥ 37

వ్యాస 5-25-9 నుండి 13

సీ. ఓలిమై నెవ్వని లీలావినోదముల్
జన్మ సంరక్షణ క్షయములకును
హేతువు లగుచుండు నెవ్వనిచూపుల
జనియించె సత్త్వ రజస్తమంబు
లెవ్వని రూపంబు లేకమై బహువిధం
బులను జగత్తులఁబ్రోచుచుండు
నెవ్వనినామంబు లెఱుఁగక తలఁచిన
యంతన దురితంబు లడఁగుచుండు

తే. నట్టి సంకర్షణాఖ్యుండు నవ్యయుండు
నైన శేషుని వినుతిసేయంగఁదరమె?
తలఁప నెప్పుడు వాఙ్మనంబులకు నింక
మూఁడులోకంబులందును భూతతతికి. 18

అ. మఱియుఁబెక్కుగతుల మాబోఁటివారలఁ
బ్రోవదలఁచి శేషమూర్తి సాత్త్వి
కస్వభావ మొందెఁగణఁకతో నట్టి శే
షునకు మ్రొక్కుచుందు ననుదినంబు.

వ. మఱియు నా శేషుని నెవ్వండేనియు నాకస్మికంబుగ నైనను, నార్తుండగుచు నైనను స్మరించినమాత్రమున నఖిలపాపంబుల బాసి సకల శ్రేయస్సులం బొందు. అట్టి శేషుని నే ముముక్షువు లాశ్రయించి (ధ్యానం బొనర్చి భవబంధ నిర్ముక్తులగుదురు.) అతని ఫణంబులయందు భూగోళం బణుమాత్రం బగుచు నుండు. అతని మహిమలు గణుతింప సహస్రజిహ్వలు గల పురుషుఁడైన నోపండని పలుకుచుందురు. ఆ యనంతుఁడు పాతాళంబున నుండి సకలలోక హితార్థంబు భూమిని ధరియించు. అని లోక తిర్యఙ్మనుష్య గతులను, లోకస్థితియందు శుకయోగీంద్రుండు వినిపించె. 20

పోతన 5-25-125 నుండి 127

* * *

## అధ్యాయము-26

### శుకయోగి పరీక్షిత్తునకు నరకలోకవర్ణనము దెలుపుట

**శుకయోగీంద్రుండిట్లనియె :**

వ. తామిస్రంబును, అంధతామిస్రంబును, రౌరవంబును, మహారౌరవంబును, కుంభీపాకంబును, కాలసూత్రంబును, అసిపత్రవనంబును,సూకరముఖంబును, అంధకూపంబును, క్రిమిభోజనంబును, సందంశమును, [1]తప్తోర్మియును, వజ్రకంటక శాల్మలియు, వైతరణియు, పూయోదమును, ప్రాణరోధంబును, విశసంబును, లాలాభక్షణమును, సారమేయాదనంబును, అవీచి, అయః పానంబును, [2]రేతఃపానంబును, నను నేకవింశతి మహానరకంబులును, మఱియును, క్షారగర్దమంబును, రక్షోగణ భోజనంబును, శూలప్రోతమును, దందశూకంబును, అవటనిరోధనంబును, [3]అపర్యావర్తనంబును, సూచీముఖంబు నన (సప్తవిధనరకంబుల తోడి) యష్టావింశతి నరకంబులు గలవని కొందఱు నొడువుదురు. 21

పోతన 5-26-135

(వ్యాస 5-26-6, 7)

(గమనిక:- మానవుడు పై నరకములవలన కలుగు దోషములను దెలిసికొని వానిని జీవితములో జేయకుండ సత్యధర్మమార్గములో నడచుకొనుట వలన సర్వశుభములు పొందగలడు.) 1.'తప్తసూర్మి' - మూలగ్రంథం.
2. మూలమున లేదు. ప్రక్షిప్తం. దీనిచే ఒక సంఖ్య పెరిగింది.
3. 'పర్యావర్తన' మని మూలం.

**శ్రీశుక ఉవాచ :**

**చూడుడు:-** యస్త్విహ పరవిత్తాపత్యకళత్రాణ్యపహరతి స హి కాలపాశ బద్ధోఽ యమపురుషైరతిభయానకైస్తామిస్రనరకే బలాన్ని పాత్యతే - అనశ నాద్రిపాత నలగుడతాడనసంతర్జనాదిభిర్యాతనాభిర్యాత్య మనో జంతుర్యత్ర

కశ్మల మాసాదిత ఏకదైవ మూర్ఛాముపయాతి తమిస్రప్రాయే ॥ 38

వ్యాస 5-26-8

క. పర విత్త కళత్రంబులఁ,
బరికింపక యపహరించు పాపాత్ముఁడు దు
ష్కర పాశబద్ధుఁడై యమ
పురుషులచే నధికబాధఁబొందుచునుండున్. 22

వ. మఱియు నివ్విధంబున బాధితుండగుచుఁదామిస్రనరకంబునం బడి యనశనాద్రిపాతన దంతతాడన తర్జనాది బాధలం జెంది కడుభయంబున మూర్ఛలం బొందుచుండు. 23

పోతన 5-26-136, 137

చూ:- యస్త్విహవై సర్వాభిగమ స్తమముత్ర నిరయే వర్తమానం వజ్రకంటశాల్మలిమారోప్య నిష్కర్షంతి ॥ 39

వ్యాస 5-26-20

ఆ. సర్వజంతుజాల సంగమ మొందెడు
వానిఁబట్టి కట్టి వజ్ర దంష్ట్ర
కములు గలుగునట్టి ఘనతర శాల్మలీ
తరువులందుఁజేర్చి దంతు రెపుడు. 24

పోతన 5-26-148

చూ:- యస్త్విహ వా అనృతం వదతి సాక్ష్యే ద్రవ్యవినిమయే వా - కథంచిత్సవై ప్రేత్య నరకే - అవీచిమత్యధశ్శిరా నిరవకాశే యోజనశతోచ్ఛ్రాయాద్గిరిమ్మూర్ధ్న స్సంపాత్యతే - యత్ర జలమివ స్థలమశ్మపృష్ఠమవభాసతే తదవీచిమత్ - తత్ర తిలశో విశీర్యమాణం శిరా నమ్రియమాణః పునరారోపితో నిపతతి ॥40

వ్యాస 5-26-27



సీ. లంచంబుఁగొని సాక్షి వంచించి యనృతంబు
పలికెడు పాపాత్ముఁబట్టి కట్టి
యంత మాన కవీచి యను నరకమునందు
శతయోజనోన్నతశైలశిఖర
మునఁదలక్రిందుగా నునిచి యథోముఖంబుగఁ
బడద్రొబ్బిన బొబ్బ లిడుచుఁ
గల్లోలములు లేని కమలాకరముఁబోలెఁ
జదరమైయున్న పాషాణమందుఁ

తే. బడినయంతన దేహంబు పగిలి పెక్కు
తునకలైపాసి యది గూడికొనుచునుండ
దండియాకులతను బొందుచుండుఁగాని
చావు లేకుండు నాదుష్టజంతువునకు. 25

పోతన 5-26-155

చూ:- యస్త్విహ వై విప్రో రాజన్యో వైశ్యో వా సోమపీథ స్తత్కళత్రం వా సురాం వ్రతస్థో వా పిబతి ప్రమాదతః - తేషాం నిరయం నీతానామురసి పదాక్రమ్యాస్యే వహ్నినా ద్రవమాణం కాలాయసం నిషించంతి ॥ 41

వ్యాస 5-26-28

ఆ. సోమయాజిభార్యఁగామించి పొందిన
వానిఁగపట మద్యపాన సోమ
పాన మనుదినంబుఁబానంబు సేయు విట్
క్షత్రియులను బట్టి సంభ్రమమున. 26

ఆ. ఱొమ్ముఁద్రొక్కి మోము ఱిమ్మ పట్టఁగ మోఁది
యనల ముఖమునందు నగ్ని వర్ణ
ముగను గాంచి వక్త్రమున నిండఁగా నుక్కు
నీరు వోతు రేచి నిష్ఠురముగ. 27

పోతన 5-26-155, 156

చూ:- యే త్విహవై బాలానంధాన్వాన్యాని దుర్బలాన్య పటకుసూలగుల్మాదిషు భూతాని నిరుంధంతి - తథాముత్ర తేష్వే వోపవేశ్య - సగరేణ వహ్నినా ధూమే నిరుంధతి ॥ 42

వ్యాస 5-26-33

ఆ. ఎనయ దొడ్లలోన నిండ్లలో నైనను
బశు పతంగ హరిణపంక్తి నెల్లఁ
బట్టి హింససేయు పాపాత్ము విషవహ్ని
ధూమశిఖల ద్రొబ్బుదురు నృపాల!

పోతన 5-26-158

చూ:- యస్త్విహ వా అతిథీ నభ్యాగతాన్ గృహమాగతాన్ వా గృహపతిరస కృదుపగతమన్యుర్దిధక్షురివ పాపేన చక్షుషా నిరీక్షతే - తస్య చాపి నిరయే పాపదృష్టేరక్షిణీ వజ్రతుండాగృధ్రకంక కాకబకాదయః ప్రసహ్యోరు బలాహ్యు త్పాటయంతి ॥ 43

వ్యాస 5-26-34

క. తన యింటికి వచ్చిన మను
జుని నతిథిం గ్రోధదృష్టిఁజూచిన వానిం
గనుఁగవల వజ్ర దంష్ట్రలఁ
దనరిన యా కంక గృధ్రతతి భక్షించున్. 29

పోతన 5-26-159

చూ:- స చాపి ప్రేత్యసంపాదనోత్కర్షసంస్మరణశమల గ్రహః సూచీముఖే నరకే నిపతతి - యత్ర హ విత్తగ్రహం పాపపురుషం ధర్మరాజపురుషా స్తంతువాయా ఇవ సర్వతోఽ ంగేషు సూత్రైః పరివయంతి ॥ 44

వ్యాస 5-26-35



మ. ధనవంతుం డగు మానవుండు గడఁకన్ ధర్మోపకారంబులన్
ఘనతం జేయక యుండెనేని యమలోకంబందు సూచీముఖం
బను నా దుర్గతిఁబట్టి త్రోచి నిధికాపై యున్న భూతం బటం
చును బాశంబులఁబట్టి కట్టి వడితో నొప్పింతు రత్యుగ్రులై. 30

పోతన 5-26-160

చూ:- ఏవంవిధా నరకా యమాలయే సంతి సహస్రశః - తేషు సర్వేషు చ సర్వఏవా ధర్మవర్తినో యే కేచిదిహోదితాశ్చావనీపతే పర్యాయేణ విశంతి - తథైవ ధర్మానువర్తినః ఇతరత్ర - ఇహ తు పునర్భవ ఉభయశేషాభ్యాం నివిశంతి ॥ 45

వ్యాస 5-26-36

ఆ. నరవరేణ్య! యిట్టినరకముల్ యమలోక
మందుఁగలవు మఱి సహస్ర సంఖ్య
లందు శమనదూత లనిశంబు బాధింతు
రవని ధర్మదూరు లైన నరుల.

ఆ. ధర్మవంతులెల్లఁదప్పక స్వర్గంబు
నందు భోగసమితిఁబొందుచుందు
రెలమిఁబుణ్యపాపముల శేషములవల్లఁ
బుట్టుచుందు రవనిఁబుణ్యచరిత! 32

వ. నరేంద్రా! మోక్షమార్గంబు మున్నె వినిపించితి. ఇప్పుడు నీ కెఱింగించి నవెల్లను బ్రహ్మాండకోశంబునం జతుర్దశకోశంబులు గలవని పురాణంబులు పలుకుచుండు. అట్టి బ్రహ్మాండంబు శ్రీమన్నారాయణుని స్థూలశరీరం బగుటంజేసి, బ్రహ్మాండం బెవ్వరు వర్ణింతు, రెవ్వరు విందురు, వారలకు సకలశ్రేయస్సులుం గలుగు. ఈశ్వర స్థూలశరీరంబుఁదెలిసినవారికి శ్రద్ధాభక్తులం జేసి సూక్ష్మదేహంబు నెఱుంగవచ్చు. 33

పోతన 5-26-161 నుండి 163

చ. జలజభవాది దేవముని సన్నుత! తీర్థపదాంబుజాత! ని
ర్మల నవరత్ననూపుర విరాజిత! కౌస్తుభభూషణాంగ! యు
జ్జ్వల తులసీకురంగ మద వాసనవాసిత దివ్యదేహ! శ్రీ
నిలయ శరీర! కృష్ణ! ధరణీధర! భానుశశాంకలోచనా!

క. శ్రీతరుణీ హృదయస్థిత!
పాతకహర! సర్వలోకపావన! భువనా
తీత గుణాశ్రయ! యతి వి
ఖ్యాత! సురార్చిత పదాబ్జ! కంసవిదారీ!

**మత్తకోకిల.**

దండితారిసమూహ! భక్తనిధాన! దానవిహార! మా
ర్తాండమండల మధ్యసంస్థిత! తత్త్వరూప! గదాసి కో
దండ శంఖ సుదర్శనాంక! సుధాకరార్క సునేత్ర! భూ
మండలోద్ధరణార్తపోషణ! మత్తదైత్యనివారణా! 36

పోతన 5-26-164 నుండి 166

**ఇతి పంచమస్కన్ధః ద్వితీయాశ్వాసః సమాప్తః**

**హరిః ఓమ్**

**శ్రీకృష్ణార్పణమస్తు.**

ఓమ్ నమో భగవతే వాసుదేవాయ

# శ్రీమద్భాగవత మణిహారము

## 17. షష్ఠ స్కంధము

## (అంత్రీకరణము - గంగన)

## ఇష్టదేవతా ప్రార్థన

శ్లో॥ వన్దే గోవిన్దదేవస్య నామ నారాయణం సదా ।
అబుద్ధ్వాపి యదుచ్చార్య ముక్తః పాపోఽ ప్యజామిలః ॥

శా. శ్రీవత్సాంకిత కౌస్తుభస్ఫురిత లక్ష్మీచారు వక్షస్థల
శ్రీ విభ్రాజితు నీలవర్ణు శుభరాజీవాక్షుఁగంజాతభూ
దేవేంద్రాది సమస్తదేవ మకుటోద్దీప్తోరు రత్న ప్రభా
వ్యావిద్ధాంఘ్రిసరోజు నచ్యుతుఁగృపావాసుం బ్రశంసించెదన్.

ఉ. మోదకహస్తునిన్ సమదమూషకవాహను నేకదంతు లం
బోదరు నంబికాతనయు నూర్జితపుణ్యు గణేశు దేవతా
హ్లాదగరిష్ఠు దంతిముఖు నంచిత భక్త ఫల ప్రదాయకున్
మోదముతోడ హస్తములు మోడ్చి భజించెద నిష్టసిద్ధికిన్. 2

ఉ. కల్లతనంబు గాక పొడగట్టిన పూర్వపురీతి నేఁడు నా
యుల్లమునందు నుండుము సమున్నత తేజముతోడ భక్తిరం
జిల్లిన చూపు గూడ విధిఁజెందిన ప్రోడ! బుధాళి నీడ! మా
తల్లి! దయామతల్లి ప్రణతద్రుమకల్పవల్లి భారతీ!

క. వ్యాసుని భగవత్పదసం
వాసుని నాగమ పురాణ వర విష్ణుకథా
వాసుని నిర్మల కవితా
భ్యాసుని పదపద్మయుగము భావింతు మదిన్. 4

ఉ. ఎమ్మెలు సెప్పనేల? జగమెన్నఁగఁబన్నగరాజశాయికిన్
సొమ్ముగ వాక్యసంపదలు సూఱలు చేసినవాని భక్తిలో
నమ్మినవాని భాగవత నైష్ఠికుఁడై తగువానిఁబేర్మితో
బమ్మెర పోతరాజు కవిపట్టపురాజుఁదలంచి మ్రొక్కెదన్. 5

శ్లో॥ హంసాయ సత్త్వనిలయాయ సదాశ్రయాయ
నారాయణాయ నిఖిలాయ నిరాశ్రయాయ ।
సత్సంగ్రహాయ సగుణాయ నిరీశ్వరాయ
సంపూర్ణ పుణ్యపతయే హరయే నమస్తే ॥

ఆ. పలుకఁగలిగె మొదల భాగవతార్థంబు
భర్త కృష్ణుఁడాయె భాగ్య మొదవె
నమృతరసము గోర నలరు చింతామణి
పాత్ర సంభవించు భంగి నిపుడు.

ఆ. భాగవతము తేటపఱుప నెవ్వఁడు సాలు
శుకుఁడు దక్క నరుని సకుఁడు దక్క
బుద్ధిఁదోచినంత బుధులచే విన్నంత
భక్తి నిగిడినంత పలుకువాఁడ. 8

* * *

# అధ్యాయము-1

## కథాప్రారంభము

**రాజోవాచ :**

శ్లో॥ అధునేహ మహాభాగ యథైవ నరకాన్నరః ।
నానోగ్రయాతనాన్నేయాత్తన్మే వ్యాఖ్యాతుమర్హసి ॥ 1

వ్యాస 6-1-7

తే. కడిఁది వేదనలకుఁగారణం బై యుండు
గుఱుతులేని నరక కూపరాశి
పాలుగాక, నరుఁడు బ్రతికెడు మార్గంబు
పరమపుణ్య! తెలియఁబలుకవయ్య! 1

పోతన 6-1-41

**శ్రీశుక ఉవాచ :**

శ్లో॥ న చేదిహైవాపచితిం యథాఽంహసః
కృతస్య కుర్యాన్మన ఉక్తిపాణిభిః ।
ధ్రువం స వై ప్రేత్య నరకానుపైతి
యే కీర్తితా మే భవత స్తిగ్మయాతనాన్ ॥ 2

తస్మాత్పురై వాశ్విహ పాపనిష్కృతౌ
యతేత మృత్యోరవిపద్యతాత్మనా ।
దోషస్య దృష్ట్వా గురులాఘవం యథా
భిషక్చికిత్సేత రుజాం నిదానవిత్ ॥ 3

వ్యాస 6-1-7, 8

క. కట్టా! త్రికరణములచేఁ
బుట్టిన దురితముల నవుడ పొలియింపని యా

కట్టఁడి దేహం బుడిగినఁ
గొట్టాడును బిట్టు నరకకూపంబులలోన్.

ఉ. కావునఁ, గాలకింకర వికారముఁగానకమున్న, మృత్యు దు
ర్భావన చిత్తమున్ వెడఁగుపాటును జెందకమున్న, మేనిలో
జీవము వెల్గుచుండి తన చెల్వము దప్పకమున్న, మున్నుగాఁ
భావనచిత్తుఁడై యఘముఁబాయు తెఱం గొనరింపఁగాఁదగున్. 3

క. కాలం బెడగని పాపము
మూలముఁజెఱుపంగవలయు మును రోగములన్
దేలిన దోషము నెఱుఁగుచు
వాలాయము దానినడఁచు వైద్యునిభంగిన్. 4

పోతన 6-1-43 నుండి 45

**బాదరాయణిరువాచ :**

శ్లో॥ కర్మణా కర్మనిర్హారో న హ్యాత్యంతిక ఇష్యతే ।
అవిద్వదధికారిత్వాత్ప్రాయశ్చితం విమర్శనమ్ ॥ 4

వ్యాస 6-1-11

క. కర్మము కర్మముచేతను
నిర్మూలము గాదు తెలియనేరక తా నే
కర్మము సేసినఁదత్ప్రతి
కర్మం బొనరింపవలయుఁగలుషవిదూరా!

పోతన 6-1-48

శ్లో॥ నాశ్నతః పథ్యమేవాన్నం వ్యాధయోఽభి భవన్తి హి ।
ఏవం నియమకృద్రాజన్ శనైః క్షేమాయ కల్పతే ॥

వ్యాస 6-1-12



క. హితముగల కుడుపు మఱి రు
గ్వితతులఁబొడమంగనీని విధమున నతిస
ద్వ్రతుఁడైనవాఁడు నిర్మల
మతిచే నఘరాశి నెల్ల మట్టము సేయున్. 6

పోతన 6-1-49

శ్లో॥ తపసా బ్రహ్మచర్యేణ శమేన చ దమేన చ ।
త్యాగేన సత్య శౌచాభ్యాం యమేన నియమేన చ ॥ 6

శ్లో॥ దేహవాగ్బుద్ధిజం ధీరా ధర్మజ్ఞా శ్రద్ధయాన్వితాః ।
క్షపం త్యఘం మహదపి వేణుగుల్మమివానలః ॥ 7

వ్యాస 6-1-13, 14

చ. తపమున బ్రహ్మచర్యమున దానములన్ శమ సద్దమంబులన్
జపముల సత్య శౌచముల సన్నియమాది యమంబులన్ గృపా
నిపుణులు ధర్మవర్తనులు నిక్కము హృత్తను వాక్యజంపుఁబా
పవుగుదిఁద్రుంతు రగ్ని శతపర్వ వనంబుల నేర్చుకైవడిన్ ॥ 7

పోతన 6-1-50

శ్లో॥ కేచిత్కేవలయా భక్త్యా వాసుదేవపరాయణాః ।
అఘం ధున్వంతి కార్త్స్న్యేన నీహారమివ భాస్కరః ॥

న తథా హ్యఘవాన్ రాజన్ పూయేత తపఆదిభిః ।
యథా కృష్ణార్పితప్రాణ స్తత్పూరుషనిషేవయా ॥

సధ్రీచీనో హ్యయం లోకే పంథాః క్షేమోఽకుతో భయః ।
సుశీలా స్సాధవో యత్ర నారాయణ పరాయణాః ॥ 10

వ్యాస 6-1-15 నుండి 17

ఉ. కొందఱు పుణ్యవర్తనులు గోపకుమార పదారవిందజా
నంద మరందపాన కలనా రత షట్పదచిత్తు లౌచు గో
విందపరాయణుల్ విమలవేషులు దోష మడంతు రాత్మలం
జెందిన భక్తిచేత రవి చేకొని మంచు నడంచుకైవడిన్.

క. హరిభక్తిచేతఁ గొందఱు
బరిమార్తురు మొదలు ముట్టఁ బాపంబులని
ష్ఠురతర కరముల సూర్యుం
డరుదుగఁబెనుమంచుపీఁచ మణఁచినభంగిన్. 9

సీ. హరికి నర్థముఁబ్రాణ మర్పితంబుగ నుండు
వాని కైవల్య మెవ్వనికి లేదు
వనజలోచను భక్తవరుల సేవించిన
వాని కైవల్య మెవ్వనికి లేదు
వైకుంఠ నిర్మల ప్రతిపరుం డై నట్టి
వాని కైవల్య మెవ్వనికి లేదు
సరసిజోదరు కథా శ్రవణలోలుండైన
వాని కైవల్య మెవ్వనికి లేదు

తే. లేదు తపముల బ్రహ్మచర్యాది నిరతి
శమ దమాదుల సత్యశౌచముల దాన
ధర్మ మఖముల సుస్థిరస్థాన మైన
వైష్ణవజ్ఞాన జనిత నిర్వాణపదము. 10

తే. అరయ నెన్నఁడుఁజేటు లేనట్టి ముక్తి
వర్త్మమీ లోకమందు నెవ్వనికిఁగలదు?
సాధులును బుణ్యశీలురు సజ్జనులును
హరిపరాయణ తత్పరు లగుటఁగాక. 11

పోతన 6-1-52, 53, 55, 56



శ్లో॥ సకృన్మనః కృష్ణపదారవిందయో
ర్నివేశితం తద్గుణరాగి యైరిహ।
న తే యమం పాశభృతశ్చ తద్భటాన్
స్వప్నేఽపి పశ్యంతి హి చీర్ణ నిష్కృతాః॥ 11

అత్ర చోదాహరంతీమమితిహాసం పురాతనమ్।
దూతానాం విష్ణుయమయోస్సంవాదం తు నిబోధ మే॥ 12

వ్యాస 6-1-19, 20

చ. సతతముఁగృష్ణ పాదజలజంబులయందు మనంబు నిల్పు సు
వ్రతులు తదీయ శుద్ధ గుణరాగులు కాలుని యుగ్రపాశ సం
హతుల ధరించు తత్సుభటవర్గములం గలలోనఁగాన రే
గతులను దుష్టకర్మములు గైకొని వారలఁజెందనేర్చునే? 12

వ. కావున, నీ యర్థంబునకుం బురాతనం బగు నొక్క యితిహాసంబు గలదు. అది విష్ణుదూత యమదూత సంవాదం బనంబడు. దాని నెఱింగింతు ఆకర్ణింపుము. 13

పోతన 6-1-58, 59

## అజామిళోపాఖ్యానము

శ్లో॥ కన్యాకుబ్జే ద్విజః కశ్చిద్దాసీపతిరజామిళః।
నామ్నా నష్టసదాచారో దాస్యాస్సంసర్గదూషితః॥ 13

బంధ్యక్షైః కైతవై శ్చౌర్యైర్గర్హితాం వృత్తిమాశ్రితః।
బిభ్రత్కుటుంబమశుచిర్యాతయామాస దేహినః॥

ఏవం నివసత స్తస్య లాలయానస్య తత్సుతాన్।
కాలోత్యగాన్మహాన్ రాజన్నష్టాశీత్యాయుతాస్సమాః॥

తస్య ప్రవయసః పుత్రా దశ తేషాం తు యోఽవయః ।
బాలో నారాయణో నామ్నా పిత్రోశ్చ దయితో భృశమ్ ॥ 16

వ్యాస 6-1-21 నుండి 24

సీ. నరనాథ! వినుము, కన్యాకుబ్జపురమునఁ
గలఁడు బ్రాహ్మణుఁడజామిళుఁడనంగఁ
బాతకుం డతుల నిర్భాగ్యుం డవజ్ఞుండు
నష్టసదాచారి కష్టరతుఁడు
జూదంబులందు దుర్వాదంబులందును
జౌర్యంబునందు మచ్చరము గలిగి
తొత్తాత్మపత్నిగా మత్తుఁడై వరియించి
కొడుకులఁబదుగురఁబడసి చాల

తే. మోహజలధిలోన మునిఁగి ముచ్చట దీఱ
బాల లాలనాది లీలఁదగిలి
పెద్దకాల మతఁడు పెంపార సుఖియించి
ఫలిత మెల్లఁదొలఁగి పతితుఁడయ్యె. 14

పోతన 6-1-60

శ్లో॥ భుంజానః ప్రపిబన్ ఖాదన్ బాలకం స్నేహయంత్రితః ।
భోజయన్ పాయయన్ మూఢో న వేదాగతమంతకమ్ ॥ 17

స ఏవం వర్తమానోఽజ్ఞో మృత్యుకాల ఉపస్థితే ।
మతిం చకార తనయే బాలే నారాయణాహ్వయే ॥ 18

వ్యాస 6-1-26, 27

క. అత్యంత పాన భోజన
కృత్యంబులఁబొత్తు గలిగి క్రీడలఁద త్సాం
గత్యంబు వదల కాగత
మృత్యువుఁగన నేరఁడయ్యె మిక్కిలి జడుఁడై.



తే. తెలియ కీ రీతి నతఁడు వర్తింపుచుండ
భయద మగు మృత్యుకాలంబు ప్రాప్తమైన
భూరివాత్సల్యవృత్తి న ప్పుత్రుఁదలఁచి
యాత్మఁబ్రలపించు నారాయణా! యటంచు. 16

పోతన 6-1-65, 66

శ్లో॥ దూరే క్రీడనకాసక్తం పుత్రం నారాయణాహ్వయమ్ ।
ప్లావితేన స్వరేణోచ్చైరాజుహావాకులేంద్రియః ॥ 19

నిశమ్య మ్రియమాణస్య ముఖతో హరికీర్తనమ్ ।
భర్తుర్నామ మహారాజ పార్షదా స్సహసాపతన్ ॥

వికర్షతోఽ రతర్హృదయా ద్దాసీపతి మజామిళమ్ ।
యమదూతాన్ విష్ణుదూతా వారయామాసు రోజసా ॥ 21

వ్యాస 6-1-29 నుండి 31

క. దూరమున నాడు బాలుఁడు
బోరనఁదన చిత్తసీమఁబొడగట్టిన నో
నారాయణ! నారాయణ!
నారాయణ! యనుచు నాత్మనందను నొడివెన్. 17

చ. మరణపువేళ నద్దనుజమర్దను సంస్మరణంబు సేయఁద
త్పరిసరవర్తు లాత్మపరిపాలకు నామము నాలకించి ని
ష్ఠురగతి నేగుదెంచి పొడసూపి యదల్చిరి కాలుదాసులన్
ఖరతరభాషులన్ వికట కల్పిత వేషుల దీర్ఘరోషులన్.

క. దాసీభర్త నజామిళ
భూసురుఁదత్తనువువలన బోరన వెలికిం
దీసిన యమ భటులఁదొలఁగఁ
ద్రోసిరి శ్రీవరుని కూర్మిదూతలు కడిమిన్. 19

పోతన 6-1-72 నుండి 74

## అధ్యాయము-2

### విష్ణుదూత యమదూతల సంవాదము

**విష్ణుదూతా ఊచుః :**

శ్లో॥ స్తేనస్సురాపో మిత్రద్రుగ్బ్రహ్మహా గురుతల్పగః ।
స్త్రీ రాజపితృహంతారో యే చ పాతకినోఽపరే ॥ 22

సర్వేషామప్యఘవతామిదమేవ సునిష్కృతమ్ ।
నామవ్యాహరణం విష్ణోర్యత స్తద్విషయా మతిః ॥

న నిష్కృతైరుదితై ర్బ్రహ్మవాదిభి
స్తథా విశుధ్యత్యఘవాన్ వ్రతాదిభిః ।
యథా హరేర్నామపదైరుదాహృతై
స్తదుత్తమశ్లోకగుణానులంబకమ్ ॥

నైకాంతికం తద్ధికృతేఽఘనిష్కృతేఽ
మనః పునర్ధావతి చేదసత్పథే ।
తత్కర్మనిర్హారమభీప్సతాం హరే
ర్గుణానువాదః ఖలు సత్త్వభావనః ॥

అథైనం మాపనయత కృతాశేషాఘనిష్కృతమ్ ।
యదసౌ భగవన్నామ మ్రియమాణస్సమగ్రహీత్ ॥ 26

వ్యాస 6-2-9 నుండి 13

సీ. బ్రహ్మహత్యానేక పాపాటవుల కగ్ని
కీలలు హరినామ కీర్తనములు
గురుతల్ప కల్మష క్రూరసర్పములకుఁ
గేకులు హరినామ కీర్తనములు
తపనీయ చౌర్య సంతమసంబునకు సూర్య
కిరణముల్ హరినామ కీర్తనములు
మధుపాన కిల్బిష మదనాగ సమితికిఁ
గేసరుల్ హరినామ కీర్తనములు

గీ. మహిత యోగోగ్ర నిత్యసమాధి విధుల
నలరు బ్రహ్మాది సురలకు నందరాని
భూరి నిర్వాణ సామ్రాజ్య భోగభాగ్య
ఖేలనంబులు హరినామ కీర్తనములు. 20

సీ. ముక్తికాంతైకాంతమోహనకృత్యముల్
గేలిమై హరినామకీర్తనములు
సత్యలోకానందసౌభాగ్యయుక్తముల్
గేలిమై హరినామకీర్తనములు
మహితనిర్వాణసామ్రాజ్యాభిషిక్తముల్
గేలిమై హరినామకీర్తనములు
బహుకాలజనితతపఃఫలసారముల్
గేలిమై హరినామకీర్తనములు

తే. పుణ్యమూలంబు లనపాయపోషకంబు
లభిమతార్థంబు లజ్ఞానహరణకరము
లాగమాంతోపలబ్ధంబు లమృతసేవ
లార్తశుభములు హరినామకీర్తనములు.

క. కామంబు పుణ్యమార్గ
స్థేమంబు మునీంద్రసాంద్ర చేతస్సరసి
ధామంబు విష్ణునిర్మల
నామంబుఁదలంచువాఁడు నాథుఁడు గాడే. 22

పోతన 6-2-117 నుండి 119

శ్లో॥ సాంకేత్యం పారిహాస్యం వా స్తోభం హేళనమేవ వా ।
వైకుంఠనామగ్రహణమశేషాఘహరం విదుః ॥ 27

వ్యాస 6-2-14

గీ. బిడ్డపేరుఁబెట్టి పిలుచుట, విశ్రామ
కేళి నైన, మిగుల గేలి నైన,
పద్య గద్య గీత భావార్థముల నైనఁ,
గమలనయనుఁదలఁపఁగలుషహరము. 23

పోతన 6-2-121

శ్లో॥ పతితః స్ఖలితో భగ్నః సన్దష్టస్తప్త ఆహతః ।
హరిరిత్యవశేనాహ పుమాన్నార్హతి యాతనామ్ ॥

వ్యాస 6-2-15

ఉ. కూలినచోటఁ, గొట్టుపడి కుందినచోట, మహాజ్వరాదులం
బ్రేలిన చోట, సర్పముఖ పీడల నందినచోట, నార్తులై
తూలినచోట, విష్ణు భవదూరునిఁబేర్కొనిరేని, మీఁద న
క్కాలుని యాతనావితతిఁగానరు, పూనరు, దుఃఖభావముల్. 

పోతన 6-2-122

శ్లో॥ అజ్ఞానాదథవా జ్ఞానాదుత్తమశ్లోకనామ యత్ ।
సంకీర్తతమఘం పుంసో దహత్యేధో యథానలః ॥ 29

వ్యాస 6-2-18

కం. హరి నెఱుఁగని యా బాలుఁడు
హరిభక్తులతోడఁగూడి హరి యనువాఁడున్
సరి యై దోషము లడఁచును
గరువలితో నగ్ని తృణముఁగాల్చిన భంగిన్. 25

పోతన 6-2-124



శ్లో॥ యథాగదం వీర్యతమముపయుక్తం యదృచ్ఛయా ।
అజానతోఽప్యాత్మగుణం కుర్యాన్మంత్రోఽప్యుదాహృతః ॥ 30

వ్యాస 6-2-19

ఉ. అరయఁగవీర్యవంత మగు నౌషధమెట్లుయదృచ్ఛఁగొన్నఁద
చ్చారు గుణంబు రోగములఁజయ్యనఁబాపినమాడ్కిఁబుణ్య వి
స్ఫారుని నంబుజోదరునిఁబామరుఁడజ్ఞుఁడవజ్ఞఁబల్కినన్
వారక తత్ప్రభావము ధ్రువంబుగ నాత్మగుణంబు జూపదే!

మ. నిరతంబై, నిరవద్యమై, నిఖిల చిన్నిర్మాణమై, నిత్యమై,
నిరహంకార గుణాఢ్యమై, నియమమై, నిర్దోషమైనట్టి, శ్రీ
హరి నామస్మరణామృతం బితఁడు ప్రత్యక్షంబు సేవించెఁదా
మరణాంతరంబున నిట్టి సజ్జనుని ధర్మం బేల వ్యర్థం బగున్? 27

పోతన 6-2-125, 127

**శ్రీశుక ఉవాచ :**

శ్లో॥ నాతః పరం కర్మనిబన్ధకృన్తనం
ముముక్షతాం తీర్థపదానుకీర్తనాత్ ।
న యత్పునః కర్మసు సజ్జతే మనో
రజస్తమోభ్యాం కలిలం తతోఽన్యథా ॥ 31

వ్యాస 6-2-47

క. కర్మంబులెల్లఁబాయను
మర్మము దలఁపంగ లేదు మధురిపు పేరే
పేర్మిని నొడువుటకంటెను
దుర్మదమునఁజిత్త మెన్నిత్రోవలఁజన్నన్. 28

పోతన 6-2-155

శ్లో॥ య ఏవం పరమం గుహ్యమితిహాసమఘాపహమ్ ।
శృణుయాచ్ఛ్రద్ధయా యుక్తో యశ్చభక్త్యానుకీర్తయేత్ ॥ 32

శ్లో॥ న వై స నరకం యాతి నేక్ష్యతే యమకింకరైః ।
యద్యప్యమంగళో మర్త్యో విష్ణులోకే మహీయతే ॥ 33

మ్రియమాణో హరేర్నామ గృణన్ పుత్రోపచారితమ్ ।
అజామిళోఽప్యగా న్ముక్తిం కిముత శ్రద్ధయా గృణన్ ॥ 34

వ్యాస 6-2-48 నుండి 50

ఉ. పాండవవంశ పాలన! నృపాలన! యీ యితిహాస మెవ్వఁడే
నొండొక భక్తి లేక విను నొప్పుమెయిం బఠియించు నాతఁడు
ద్దండత ముక్తికామినికిఁదానక మై దనుజారిలోకమం
దుండు మహావిభూతి యమదూతల చూడ్కి కగోచ రాకృతిన్.

తే. అరయ పుత్రోపచారిత మైన విష్ణు
నామ మవసానకాలంబునను భజించి
శార్ఙ్గి నిలయంబుఁజేరె నజామిళుండు
నిట్లుసద్భక్తిఁదలఁచిన నేమిచెప్ప? 30

క. కోరినవారల కెల్లను
జేరువ కైవల్యపదము సిరివరుని మదిం
గోరనివారలకెల్లను
దూరము మోక్షాప్తి యెన్ని త్రోవలనైనన్. 31

పోతన 6-2-156 నుండి 158

* * *

## అధ్యాయము-3

**యమ ఉవాచ :**

శ్లో॥ ధర్మం తు సాక్షాద్భగవత్ప్రణీతం
న వై విదుర్ఋషయో యే చ దేవాః ।
న సిద్ధముఖ్యా అసురా మనుష్యాః
కుతో ను విద్యాధరచారణాదయః ॥ 35

వ్యాస 6-3-19

క. భగవత్ప్రణిహిత ధర్మం
బగపడదెవ్వారి మతికి ననిమిష గరుడో
రగ సిద్ధ సాధ్య నర సుర
ఖగ తాపస యక్ష దివిజ ఖనరులకైనన్. 32

క. ఎన్నఁడుఁదెలియఁగ నేరరు
పన్నగపతిశాయి తత్త్వభావము మేనం
గన్నులవేల్పును డాపల
చ న్నమరిన వేల్పు ముదుకచదువుల వేల్పున్.

పోతన 6-3-175, 176

శ్లో॥ స్వయంభూర్నారదశ్శంభుః కుమారః కపిలో మనుః ।
ప్రహ్లాదో జనకో భీష్మో బలిర్వైయాసకిర్వయమ్ ॥ 36

ద్వాదశామీ విజానీమో ధర్మం భాగవతం భటాః ।
గుహ్యం విశుద్ధం దుర్బోధం యద్జ్ఞాత్వాఽమృతమశ్నుతే ॥

వ్యాస 6-3-20, 21

సీ. వరమహాద్భుతమైన వైష్ణవజ్ఞానంబు
తిరముగా నెవ్వరు తెలియఁగలరు?

దేవాదిదేవుండు త్రిపురసంహరుఁడొండెఁ
గమలసంభవుం డొండెఁగార్తికేయ
కపిల నారదు లొండె గంగాత్మజుం డొండె
మను వొండె బలి యొండె జనకుఁడొండెఁ
బ్రహ్లాదుఁడొండె నేర్పాటుగా శుకుఁడొండె
భాసురతరమతి వ్యాసుఁడొండెఁ

తే. గాక యన్యుల తరమె? యీ లోకమందు
నీ సుబోధంబు సద్బోధ మీ పదార్థ
మీ సదానంద చిన్మయ మీ యగమ్య
మీ విశుద్ధంబు గుహ్యంబు నీ శుభంబు. 34

క. ఈ పన్నిద్దఱు తక్కఁగ
నోపరు తక్కొరులు తెలియ నుపనిష దుచిత
శ్రీపతినామ మహాద్భుత
దీపిత భాగవతధర్మ దివ్యక్రమమున్ ॥ 35

పోతన 6-3-177, 178

శ్లో॥ ఏతావనేవ లోకేఽస్మిన్ పుంసాం ధర్మః పరః స్మృతః ।
భక్తియోగో భగవతి తన్నామగ్రహణాదిభిః ॥ 38

నామోచ్చారణమాహాత్మ్యం హరేః పశ్యత పుత్రకాః ।
అజామిలోఽపి యేనై వ మృత్యుపాశాదముచ్యత ॥ 39

వ్యాస 6-3-22, 23

తే. ఏది జపియింప నమృతమైయెసంగుచుండు
నేది సద్ధర్మపథ మని యెఱుఁగఁదగిన
దదియె సద్భక్తి యోగంబు నావహించు
మూర్తిమంతంబు దా హరికీర్తనంబు.



తే. కంటిరే మీరు సుతులార! కమలనేత్రు
భవ్య మగు నామకీర్తనఫలము నేఁడు
దవిలి మృత్యుపాశబంధములవలన
జాణతనమున వీడె నజామిళుండు. 37

పోతన 6-3-179, 180

శ్లో॥ ఏతావతాలమఘనిర్హరణాయ పుంసాం
సంకీర్తనం భగవతో గుణకర్మనామ్నమ్ ।
విక్రుశ్య పుత్రమఘవాన్ యదజామిళోఽపి
నారాయణేతి మ్రియమాణ ఉపైతి ముక్తిమ్ ॥ 40

వ్యాస 6-3-24

ఉ. ఏటికి జాలిఁబొందు? నరు లీ క్రియఁగృష్ణుని కీర్తనంబు పా
పాటవులం దహింపఁగల దౌటకు సందియమేల? యిప్పు డీ
తూఁటరి దోసకారి పెనుదోషి యజామిళుఁడంతమొందుచుం
బాటిగ విష్ణునామమును బల్కుచుఁగేవల ముక్తి కేగఁడే? 38

పోతన 6-3-181

శ్లో॥ ప్రాయేణ వేద తదిదం న మహాజనోఽయం
దేవ్యా విమోహిత మతిర్బత మాయయాలమ్ ।
త్రయ్యాం జడీకృతమతిర్మధుపుష్పితాయాం
వైతానికే మహతి కర్మణి యుజ్యమానః ॥ 41

వ్యాస 6-3-25

త. ఇంతయును దథ్య మని మది
నెంతయుఁదెలియంగలేరు హీనాత్ములు దు
ర్దాంతతర ఘటిత మాయా
క్రాంతాత్యంత ప్రకాశ గౌరవ జడులై. 39

పోతన 6-3-182

శ్లో॥ జిహ్వా న వక్తి భగవద్గుణనామధేయం
చేతశ్చ న స్మరతి తచ్చరణారవిన్దమ్ ।
కృష్ణాయ నో నమతి యచ్ఛిర ఏకదాపి
తానానయధ్వమసతోఽ కృతవిష్ణుకృత్యాన్ ॥ 42
వ్యాస 6-3-29

**మంగళమహాశ్రీవృత్తము.**

ఈ విధమునన్ విబుధు లేకతమ చిత్తముల నేకతము లేక హరి నీశున్
భావమున నిల్పి తగు భాగవతయోగ పరిపాకమున నొందుదురు వారిన్
దేవలదు దండనగతిన్ జనదు మాకు గుఱుతింపఁ సఘముల్ దలఁగు మీఁదన్
శ్రీవరుని చక్రము విశేషగతిఁగాఁచు సురసేవితులు ముక్తిఁగడుఁబెద్దల్.
పోతన 6-3-184

**శ్రీశుక ఉవాచ :**

శ్లో॥ తస్మాత్సంకీర్తనం విష్ణోర్జగన్మంగళమంహసామ్ ।
మహతామపి కౌరవ్యవిద్ధ్యైకాంతికనిష్కృతమ్ ॥ 43

శృణ్వతాం గృణతాం వీర్యాణ్యుద్దామాని హరేర్ముహుః ।
యథానుజాతయా భక్త్యా శుద్ధ్యేన్నాత్మా వ్రతాదిభిః ॥ 44
వ్యాస 6-3-31, 32

సీ. శ్రుత్యంత విశ్రాంత మత్యనుక్రమణీయ
భగవ త్ప్రసంగతుల్ భాగవతులు
సనకాదిముని యోగిజన సదానందైక
పరమ భాగ్యోదయుల్ భాగవతులు
కృష్ణపద ధ్యాన కేవ లామృతపాన
పరిణామ యుతులు శ్రీభాగవతులు
బహుపాతకానీక పరిభవ ప్రక్రియా
పరుషోగ్ర మూర్తులు భాగవతులు



తే. భావ తత్త్వార్థ వేదులు భాగవతులు
బ్రహ్మవాదానువాదులు భాగవతులు
సిరులు దనరంగ నెన్నడుఁ జేటులేని
పదవి నొప్పారువారు వో భాగవతులు. 41
పోతన 6-3-186

శ్లో॥ కృష్ణాంఘ్రి పద్మమధులిణ్న పునర్విసృష్ట
మాయాగుణేషు రమతే వృజినావహేషు ।
అన్యస్తు కామహత ఆత్మరజః ప్రమార్ష్టు
మీహేత కర్మ యత ఏవ రజః పునస్స్యాత్ ॥ 45

ఇత్థం స్వభర్తృగదితం భగవన్మహత్త్వం
సంస్మృత్య విస్మితధియో యమకింకరాస్తే ।
తే చాచ్యుతాశ్రయ జనం ప్రతి శంకమానా
ద్రష్టుం చ బిభ్యతి తతః ప్రభృతి స్మ రాజన్ ॥

ఇతిహాసమిమం గుహ్యం భగవాన్ కుంభసంభవః ।
కథయామాస మలయ ఆసీనో హరిమర్చయన్ ॥ 47
వ్యాస 6-3-33 నుండి 35

క. అది గాన విష్ణుభక్తులఁ
గదియఁగఁజనవలదు మీరు కరివరదు లస
త్పదపద్మ వినతి విముఖులఁ
దుది నంటఁగఁగట్టి తెండు ధూర్తులు వారల్. 42

సీ. ఏకసక్కెమునకైన నిందిరారమణునిఁ
బలుకంగలేని దుర్భాషితులను
గలలోననైన శ్రీకాంతుని సత్పాద
కమలముల్ సూడని కర్మదృశుల

నవ్వుచు నైనఁగృష్ణప్రశంసకుఁజెవిఁ
దార్పనేరని దుష్కథాప్రవణుల
యాత్రోత్సవంబుల నైన నీశుని గుడి
త్రోవఁద్రొక్కఁగలేని దుష్పదులును.

ఆ. బరమ భాగవతుల పాదధూళి సమస్త
తీర్థసార మనుచుఁదెలియలేని
వారి వారివారి వారిఁజేరిన వారిఁ
దొలుత గట్టితెందు దూతలార! 43

ఆ. ఎల్ల పాపములకు నిల్లైన యింటిలో
బద్ధ తృష్ణు లగుచు బుద్ధిఁదగిలి
పరమహంస కులము గుఱితప్పి వర్తించు
ధూర్తజనులఁదెందు దూతలార!

తే. అరయఁదనదు జిహ్వ హరిపేరు నుడువదు
చిత్త మతని పాదచింతఁజనదు
తలఁపఁదమకు ముక్తి తంగేటి జున్నొకో?
సకల విష్ణు భక్తులకును బోలె.

ఆ. పద్మనయను మీఁది భక్తి యోగం బెల్ల
ముక్తి యోగ మనుచు మొద లెఱుంగు
వారి వారివారి వారిఁజేరినవారి
త్రోవఁబోవవలదు దూతలార! 46

వ. మఱియు శుకుండిట్లనియె. శ్రీకృష్ణనామ సంకీర్తనంబు జగన్మంగళం బనియును, జగన్మోహనం బనియును, జగజ్జేగీయమానం బనియును, నిఖిల మాయాగుణ విచ్ఛేదకం బనియును, ఉద్దామంబులగు హరి వీర్యంబుల నాకర్ణించువారల చిత్తంబు లతినిర్మలంబు లగు భంగిం దక్కిన వ్రతాచరణం



బులుం గావనియు, శ్రీకృష్ణ పదపద్మంబులు హృత్పద్మంబుల నిలుపువార లన్య పాపకర్మంబు లగు నవిద్యా వ్యసనంబులం బొరయనేర రనియును, నిజస్వామి యైన యమధర్మ రాజుచేతఁగీర్తింపఁబడ్డ భగవన్మహత్త్వంబు నాకర్ణించి, విస్మితులై కాలకింకరులు నాఁటనుండియు వైష్ణవజనంబులం దేఱిచూడ వెఱతురు. నరేంద్రా! పరమగుహ్యంబగు నీ యితిహాసంబును బూర్వకాలంబున సకల విజ్ఞానగోచరుండైన కుంభసంభవుండు సకల దుఃఖనిలయంబును, సకల పుణ్యనిలయంబును నైన మలయంబునఁ బురాణ పురుషుండైన పురుషోత్తము నారాధనంబు సేయుచుండి నా కెఱింగించెను. 47

పోతన 6-3-187 నుండి 192

* * *

## అధ్యాయము-4

### దక్షుఁడు కావించిన హంసగుహ్యంబను స్తవరాజము

దక్షప్రజాపతి లక్ష్మీకాంతుని సంతుష్టుం జేయువాఁడై యతి ఘోరం బైన తపంబు సేయుచు శ్రీహరిం బ్రసన్నుం జేసి హంస గుహ్యం బను స్తవరాజంబున స్తుతియించెను. 48

వ్యాస 6-4-23 నుండి 34

స్థలనిర్ణయము పోతన 6-4-213 నుండి 221

(పాఠకులీస్తోత్రము చదివి అందులోని విషయములు
తెలిసికొనుట శుభకరము)

* * *

## అధ్యాయము-8

### శ్రీమన్నారాయణకవచము

**రాజోవాచ :**

శ్లో॥ యేన గుప్తస్సహస్రాక్షస్సవాహాన్రిపుసైనికాన్
క్రీడన్నివ వినిర్జిత్య త్రిలోక్యా బుభుజే శ్రియమ్ ॥ 48

శ్లో॥ భగవంస్తన్మమాచక్ష్వ వర్మ నారాయణాత్మకమ్ ।
యథాతతాయినశ్శత్రూన్ యేన గుప్తోఽ జయన్మృథే ॥ 49

**శ్రీశుక ఉవాచ :**

శ్లో॥ వృతః పురోహితస్త్వాష్ట్రో మహేంద్రాయానుపృచ్ఛతే ।
నారాయణాఖ్యం వర్మాహ తదిహైకమనాశ్శృణు ॥ 50

**విశ్వరూప ఉవాచ :**

శ్లో॥ ధౌతాంఘ్రిపాణి రాచమ్య సపవిత్ర ఉదఙ్ముఖః ।
కృతస్వాంగకరన్యాసో మంత్రాభ్యాం వాగ్యతశ్శుచిః ॥
నారాయణమయం వర్మ సన్నహ్యేద్భయ ఆగతే ।
దైవభూతాత్మకర్మభ్యో నారాయణమయః పుమాన్ ॥
పాదయోర్జానునోరూర్వోరుదరే హృద్యథోరసి ।
ముఖే శిరస్యానుపూర్వ్యాదోంకారాదీని విన్యసేత్ ॥
**ఓం- నమో నారాయణా** యేతి విపర్యయమథాపి వా ।
కరన్యాసం తతః కుర్యాత్ ద్వాదశాక్షరవిద్యయా ॥
ప్రణవాదియకారాంతమంగుళ్యంగుష్ఠపర్వసు ॥
న్యసేద్ధృదయ ఓంకారం వికారమనుమూర్ధని ।
షకారం తు భ్రువోర్మధ్యే ణకారం శిఖయా న్యసేత్ ॥
వేకారం నేత్ర యోర్యుంజ్యాన్నకారం సర్వసంధిషు ।
మకారమస్త్రముద్దిశ్య మంత్రమూర్తిర్భవేద్బుధః ।
సవిసర్గం ఫడంతం తు సర్వదిక్షు వినిర్దిశేత్ ॥

**ఓమ్ విష్ణవే నమః -**

శ్లో॥ ఇత్యాత్మానం పరం ధ్యాయేద్ధ్యేయం షట్ఛక్తిభిర్యుతం ।
విద్యా తేజస్తపోమూర్తిమిమం మంత్రముదాహరేత్ ॥ 58

శ్లో॥ ఓం-హరిర్విదధ్యాన్మమ సర్వరక్షాం
న్యస్తాంఘ్రిపద్మః పతగేంద్రపృష్ఠే ।
దరారిచర్మాసిగదేషు చాప
పాశాన్ దధానోఽ ష్టగుణోఽ ష్ట బాహుః ॥

జలేషు మాం రక్షతు మత్స్యమూర్తి
ర్యాదోగణేభ్యో వరుణస్య పాశాత్ ।
స్థలేషు మాయావటువామనోఽ వ్యా
త్త్రివిక్రమః ఖేఽ వతు విశ్వరూపః ॥

దుర్గేష్వటవ్యాజిముఖాదిషు ప్రభుః
పాయాన్నృసింహోఽ సురయూధపారిః ।
విముంచతో యస్య మహాట్టహాసం
దిశో వినేదుర్న్యపతంశ్చ గర్భాః ॥

రక్షత్వసౌ మాఽ ధ్వనియజ్ఞకల్ప
స్స్వదంష్ట్రయోన్నీతధరో వరాహః ।
రామోఽ ద్రికూటేష్వథ విప్రవాసే
సలక్ష్మణోఽ వ్యాద్భరతాగ్రజో మామ్ ॥

మాముగ్రధర్మాదఖిలాత్ప్రమాదా
న్నారాయణః పాతు నరశ్చ హాసాత్ ।
దత్తస్త్వయోగాదథ యోగనాథః
పాయాద్గణేశః కపిలః కర్మబంధాత్ ॥

సనత్కుమారోఽ వతు కామదేవా
ద్ధయాననో మాం పథి దేవహేళనాత్ ।
దేవర్షివర్యః పురుషార్చనాంతరా
త్కూర్మో హరిర్మాం నిరయాదశేషాత్ ॥ 64



శ్లో॥ ధన్వన్తరిర్భగవాన్ పాత్వపథ్యా
ద్ద్వంద్వాద్భయా దృషభో నిర్జితాత్మా ।
యజ్ఞశ్చ లోకాదుత తత్కృతాన్నో
బలో గణాత్ క్రోధవశా దహీంద్రః ॥ 65

ద్వైపాయనో భగవాన్ సంప్రమోహా
ద్బుద్ధశ్చ పాషండగణాత్ప్రమాదాత్ ।
కల్కిఃకలేః కాలమలాత్ప్రమాదా
ద్ధర్మావనాయోరుకృతావతారః ॥

మాం కేశవో గదయా ప్రాతరవ్యా
ద్గోవింద ఆసంగవమాత్తవేణుః ।
నారాయణః ప్రాహ్ణ ఉదాత్తశక్తి
ర్మధ్యందినే విష్ణురరీన్ద్రపాణిః ॥

దేవోఽ పరాహ్ణే మధుహోగ్రధన్వా
సాయం త్రిధామావతు మాధవో మామ్ ।
దోషే హృషీ కేశ ఉతార్ధరాత్రే
నిశీథ ఏకోఽ వతు పద్మనాభః ॥

శ్రీవత్సధామాపరరాత్ర ఈశః
ప్రత్యూష ఈశోఽ సిధరో జనార్దనః ।
దామోదరోఽ వ్యాదనుసంధ్యం ప్రభాతే
విశ్వేశ్వరో భగవాన్ కాలమూర్తిః ॥

చక్రం యుగాన్తానలతిగ్మనేమి
భ్రమత్సమంతాద్భగవత్ప్రయుక్తం ।
దందగ్ధి దందగ్ధ్యరిసైన్యమాశు
కక్షం యథా వాయుసఖో హుతాశః ॥ 70

శ్లో॥ గదేఽ శనిస్పర్శనవిస్ఫులింగే
నిష్పిండి నిష్పిండ్యజితప్రియాసి ।

కూశ్మాండవైనాయకయక్షరక్షో
భూతగ్రహాంశ్చూర్ణయ చూర్ణ యారీన్ ॥ 71

త్వం యాతుధానప్రమథప్రేతమాతృ
పిశాచవిప్రగ్రహఘోరదృష్టీన్
దరేంద్ర విద్రావయ కృష్ణపూరితో
భీమస్వనారేర్హృదయాని కంపయ ॥

త్వం తిగ్మధారాసివరారిసైన్య
మీశప్రయుక్తో మమ ఛింధి ఛింధి ॥
చక్షూంషి చర్మన్ శతచంద్ర ఛాదయ
ద్విషామఘోనాం హర పాపచక్షుషామ్ ॥

యన్నో భయం గ్రహేభ్యోఽ భూత్కేతుభ్యోనృభ్య ఏవ చ ।
సరీసృపేభ్యో దంష్ట్రిభ్యో భూతేభ్యోఽ ఘేభ్య ఏవ చ ॥

సర్వాణ్యేతాని భగవన్నా మరూపాస్త్రకీర్తనాత్ ।
ప్రయాంతు సంక్షయం సద్యో యేఽ న్యే శ్రేయః ప్రతీపకాః ॥

గరుడో భగవాంస్తోత్రస్తోభశ్ఛందోమయః ప్రభుః ।
రక్షత్వ శేషకృచ్ఛ్రేభ్యో విష్వక్సేనస్య వాహనం ॥

సర్వాపద్భ్యో హరేర్నామ రూపయానాయుధాని నః ।
బుద్ధీంద్రియమనః ప్రాణాన్ పాంతు పార్షదభూషణాః ॥

యథా హి భగవానేవ వస్తుతస్సదసచ్చ యత్ ।
సత్యేనానేన నస్సర్వే యాంతు నాశముపద్రవాః ॥ 78

శ్లో॥ యథైకాత్మ్యానుభావానాం వికల్పరహితస్స్వయమ్ ।
భూషణాయుధలింగాఖ్యాధత్తే శక్తిస్స్వమాయయా ॥ 79

తేనైవ సత్యమానేన సర్వజ్ఞో భగవాన్ హరిః ।
పాతు సర్వస్వరూపేణ సదా సర్వత్ర సర్వగః ॥



విదిక్షు దిక్షూర్ధ్వమధస్సమంతా
దంతర్బహిర్భగవాన్నారసింహః ।
ప్రహాపయన్ లోకభయం స్వనేన
స్వతేజసా గ్రస్త సమస్తతేజాః ॥ 81

**శ్రీ విశ్వరూప ఉవాచ :**

శ్లో॥ మఘవన్ని దమాఖ్యాతం వర్మ నారాయణాత్మకం ।
విజేష్యస్యంజసా యేన దంశితోఽ సురయూథపాన్ ॥ 82

ఏతద్ధారయమాణస్తు యం యం పశ్యతి చక్షుషా ।
పదా వా సంస్పృశేత్సద్యస్సాధ్వసాత్స విముచ్యతే ॥

న కుతశ్చిద్భయం తస్య విద్యాం ధారయతో భవేత్ ।
రాజదస్యుగ్రహాదిభ్యో వ్యాధ్యాదిభ్యశ్చ కర్హిచిత్ ॥

ఇమాం విద్యాం పురా కశ్చిత్కౌశికో ధారయన్ ద్విజః ।
యోగధారణయా స్వాంగం జహౌ స మరుధన్వని ॥

తస్యోపరి విమానేన గంధర్వపతి రేకదా ।
యయౌ చిత్రరథస్స్త్రీభిర్వృతో యత్ర ద్విజక్షయః ॥

గగనాన్న పతత్సద్యస్సవిమానో హ్యవాక్ఛిరాః ।
స వాలఖిల్యవచనాదస్థీన్యాదాయ విస్మితః ।
ప్రాప్య ప్రాచీసరస్వత్యాంస్నాత్వా థామ స్వమన్వగాత్ ॥ 87

శ్లో॥ య ఇదం శృణుయాత్కాలే యో ధారయతి చాదృతః ।
తం నమస్యంతి భూతాని ముచ్యతే సర్వతో భయాత్ ॥ 88

**శ్రీశుక ఉవాచ :**

శ్లో॥ ఏతాం విద్యామధిగతో విశ్వరూపాచ్ఛతక్రతుః ।
త్రైలోక్యలక్ష్మీం బుభుజే వినిర్జిత్య మృధేఽ సురాన్ ॥ 89

వ్యాస 6-8-1 నుండి 42

## శ్రీనారాయణ కవచము
## పారాయణము చేయుటకు సంకల్ప విధానము

మనుజుడు శుచియై ఉత్తరముఖముగా కూర్చుండి ఆచమనము ప్రాణాయామము సంకల్పము చేసికొని యిట్లు కవచము ధరింపవలె. ఓమ్ అస్య శ్రీనారాయణకవచ మహామంత్రస్య శ్రీవేదవ్యాసో భగవాన్ ఋషిః । త్రిష్టుప్ ఛందః । పరమాత్మా శ్రీమన్నారాయణో దేవతా । శ్రీమహావిష్ణు ప్రీత్యర్థే శ్రీనారాయణకవచే స్తోత్రరూపే వినియోగః ॥

**అంగన్యాసము :**

ఓంఓం పాదాభ్యాంనమః । ఓంనం జానుభ్యాం నమః
ఓంమం ఊరుభ్యాంనమః । ఓంనాం ఉదరాయనమః
ఓంరాం హృదేనమః । ఓంయం ఉరసేనమః
ఓం ణాం ముఖాయనమః । ఓంయం శిరసేనమః

**కరన్యాసము :**

ఓం ఓం దక్షిణ తర్జన్యైనమః । ఓం నం దక్షిణమధ్యమాయై నమః । ఓంమం దక్షిణ అనామికాయైనమః । ఓంభం దక్షిణ కనిష్ఠికాయైనమః । ఓం గం వామతర్జన్యై నమః । ఓం వం వామమధ్యమా యైనమః । ఓంతం వామానామికాయైనమః । ఓంవాం వామకనిష్ఠికాయౌనమః । ఓం సుం దేం దక్షిణాంగుష్ఠాయనమః । ఓంవాం యం వామాంగుష్ఠాయనమః

**హృదయాదిన్యాసము :**

ఓంఓం హృదయాయనమః । ఓంవిం శిరసేస్వాహా
ఓంష్ణం భ్రూమధ్యాయ శ్రౌషట్ । ఓం ణం శిఖాయైవషట్
ఓం వేం నేత్రత్రయాయవౌషట్ । ఓం నం కవచాయహుమ్
ఓంమం అస్త్రాయఫట్ । భూర్భువస్సువరోమితి దిగ్బంధః 49
(మి.గు.శ.)

# శ్రీమన్నారాయణకవచము - ఆంధ్రీకరణము
## అధ్యాయము-8

ఉ. నావుడుఁబాండవ్వయుఁడు నమ్మినభక్తి జగన్నివాసు రా
జీవదళాక్షుఁగృష్ణుఁదనచిత్తమునన్ భజియించి పల్కె నో
దేవగణార్చితాంఘ్రియుగదివ్యమునీశ్వర విశ్వరూపుఁడ
ప్పావన మైనవిద్య సురపాలున కేక్రియ నిచ్చెఁజెప్పవే. 50

ఉ. ఎందును రక్షితుం డగుచు నింద్రుఁడు లీలయపోలె వైరిసే
నం దునుమాడి దేవతలు నమ్మి సుఖింపఁగ నిష్టసంపదం
జెంది సమస్తలోకములఁజేకొని యేలె మునీంద్ర! దాని నే
విందు సుఖంబుఁగందు నిఁక వీనులు సంతస మందఁబల్కవే.

### శ్రీమన్నారాయణ కవచ ప్రారంభము

క. వరనారాయణకవచము
నరిభీకరవజ్రకవచ మాశ్రితసంప
త్పరిణామకర్మసువచము
పురుహూతున కెట్లు మౌని బోధించెఁదగన్. 52

వ. అనినం బరీక్షిజ్జనపాలునకు మునినాథుం డిట్లనియె.

సీ. వినవయ్య! నరనాథ మునినాథుఁడింద్రున
కనుఁగొంద నారాయణాఖ్య మైన
కవచంబు విజయసంకల్పంబు నప్రమే
యస్వరూపంబు మహాఫలంబు
మంత్రగోప్యము హరిమాయావిశేషంబు
సాంగతతోడ నెఱుంగఁజేసె
దాని నే వినిపింతుఁబూని తదేకాగ్ర
చిత్తంబుతోడుతఁజిత్తగింపు

తే. మొనర ధౌతాంఘ్రిపాణియైయుత్తరంబు
ముఖముగా నుత్తమాసనమున వసించి
కృతనిజాంగకరన్యాస మతిశయిల్ల
మహితనారాయణాఖ్యవర్మము నొనర్చె. 54

వ. ఇట్లు నారాయణకవచంబు ఘటియించి పాదంబులను, జానువులను, నూరువులను, నుదరంబునను, హృదయంబునను, నురంబునను, ముఖంబునను, శిరంబునను, నిట్లష్టాంగంబులం బ్రణవపూర్వకంబైన యష్టాక్షరీమంత్రరాజంబు విన్యాసంబుసేసి ద్వాదశాక్షరవిద్య చేతం గరన్యాసంబు సేసి, మంత్రమూర్తియై భగవచ్ఛబ్దవాచ్యం బైన ప్రణవాది యకారాంతమగు మహామంత్రంబుచేత నంగుళ్యంగుష్ఠ సర్వ సంధులయందు న్యసించి, మఱియు హృదయంబున నోంకారంబు వికారంబు మూర్ధంబున, షకారంబు భ్రూమధ్యంబునందు, ణకారంబు శిఖ యందు, వేకారంబు నేత్రంబులయందు, నకారంబు సర్వసంధులయందు, మఱియు నస్త్రము నుద్దేశించి, మకారంబు నుపన్యసించెనేని, మంత్రమూర్తి యగు మఱియును నస్త్రాయఫట్టనుమంత్రంబున దిగ్బంధనంబు సేసి, పరమేశ్వరునిం దన భావంబున నిల్పి విద్యామూర్తియుఁదపోమూర్తియు నగు షట్ఛక్తిసంయుతం బయిన నారాయణ కవచాఖ్యమైన మంత్రరాజంబు నిట్లని పఠియించె. 55

చ. గరుడునిమూఁపుపైఁబదయుగంబు ఘటిల్లఁగ శంఖచక్రవ
ర్మరుచిరశార్ఙ్గ ఖడ్గశరరాజితపాశగదాదిసాధనో
త్కరనికరంబు లాత్మకరకంజములన్ ధరియించి భూతిసం
భరితమహాష్టబాహుఁడు కృపామతితో ననుఁగాచుఁగావుతన్.

ఆ. ప్రకటమకరవరుణపాశంబులందుల
జలములందు నెందుఁబొలియకుండఁ
గాచుఁగాక నన్ను ఘనుఁడొక్కఁడైనట్టి
మత్స్యమూర్తి విద్యమానకీర్తి.



క. వటుఁడు సమాశ్రితమాయా
నటుఁడు, బలిప్రబలశోభనప్రతిఘటనో
ద్భటుఁడు త్రివిక్రమదేవుఁడు,
చటులస్థలమందు నన్ను సంరక్షించున్. 58

చ. అడవుల, సంకటస్థలుల, నాజిముఖంబుల, నగ్నికీలలం,
దెడరుల నెల్లనాకు నుతి కెక్కఁగ ది క్కగుఁగాక, శ్రీనృసిం
హుఁడు! సురశత్రుయూథపవధోగ్రుఁడు విస్ఫురితాట్టహాసవ
క్త్రుఁడు ఘనదంష్ట్ర పావకవిధూతదిగంతరుఁడప్రమేయుఁడై.

చ. అరయఁగ నెల్లలోకములు నంకిలి నొంద మహార్ణవంబులో
నొరగి నిమగ్నమైన ధర నుద్ధతిఁగొమ్మున నెత్తినట్టియా
కిరిపతి యగ్నికల్పుఁడురుఖేలుఁడు నూర్జితమేదినీమనో
హరుఁడుకృపావిధేయుఁడు సదాధ్వములన్ననుఁగాచుగావుతన్.

క. రాముఁడు, రాజకులైకవి
రాముఁడు, భృగుసత్కలాభిరాముఁడు, సుగుణ
స్తోముఁడు, నను రక్షించును
శ్రీమహితోన్నతుఁడు నద్రిశిఖరములందున్. 61

సి. తాటక మర్దించి తపసిజన్నముఁగాచి
హరివిల్లు విఱిచి ధైర్యమున మెఱసి
ప్రబలు లైనట్టి విరాధకబంధోగ్ర
ఖరదూషణాదిరాక్షసులఁదునిమి
వానరవిభు నేలి వాలిఁగూలఁగ నేసి
జలరాశిగర్వంబుఁజక్కఁజేసి
సేతువు బంధించి చేరి రావణకుంభ
కర్ణాదివీరులఁగడిమిఁద్రుంచి

తే. యలవిభీషణు లంకకు నధిపుఁజేసి
భూమిసుతఁగూడి సాకేతపురమునందు
రాజ్యసుఖములు గైకొన్న రామవిభుఁడు
వరుస ననుఁబ్రోచుచుండుఁబ్రవాసగతుల. 62

వ. మఱియు నఖిల ప్రమాదంబు లైన యభిచారకర్మంబు వలన నారాయణుండును, గర్వంబువలన నరుండును, యోగభ్రంశంబు వలన యోగనాథుండయిన దత్తాత్రేయుండును, గర్మబంధంబువలన గణేశుండైన కపిలుండును, గామదేవునివలన సనత్కుమారుండును, మార్గంబుల దేవహేళనంబు సేయుటవలన శ్రీహయగ్రీవమూర్తియును, దేవతానమస్కార తిరస్కారదేవపూజాచ్ఛిద్రంబులవలన నారదుండును, నశేషనిరయంబుల వలనఁగూర్మంబును, నపథ్యంబువలన భగవంతుండైన ధన్వంతరియును, ద్వంద్వంబువలన నిర్జితాత్ముండైన ఋషభుండును, జనాపవాదంబువలన నగ్ని దేవుండును, జననమరణాదులం గలుగఁజేయు కర్మంబులవలన బలభద్రుండును, గాలంబువలన యముండును, సర్పగణంబులవలన శేషుండును, నప్రబోధంబువలన ద్వైపాయనుండును, బాషండ సమూహంబువలన బుద్ధదేవుండును, శనైశ్చరునివలనఁగల్కియు నై ధర్మరక్షణపరుం డయిన మహావతారుండు నన్ను రక్షించుంగాతఁ బ్రాహ్ణ మధ్యాహ్నాపరాహ్ణ సాయంకాలంబులను, బ్రదోషార్ధ రాత్రాపరరాత్రప్రత్యూషానుసంధ్యలను బ్రభాతంబునను, గదాద్యాయుధంబుల ధరియించి కేశవనారాయణ గోవింద విష్ణు మధుసంహర త్రివిక్రమ వామన హృషీ కేశ పద్మనాభ శ్రీవత్సధామ సర్వేశ్వరేశ జనార్దన విశ్వేశ్వరకాలమూర్తు లను నామరూపంబులు గల దేవుండు నన్ను రక్షించుంగాక! ప్రళయకాలానలాతి తీక్ష్ణసంభ్రమ భ్రమణనిర్వక్రవిక్రమనక్రీకృతదనుజచక్రం బైన సుదర్శన నామచక్రంబ! మహావాయుప్రేరితుం డై హుతాశనుండు నీరసతృణాటవుల భస్మీ భూతంబు సేయుభంగి భగవత్ప్రయుక్తంబ వై మద్వైరిసైన్యంబుల దగ్ధంబు



గావింపుము! జగత్సంహారకాలపటుఘటితచటుల మహో త్పాతగర్జారవతర్జన దశదిశాభివర్జితఘనఘనాంతర నిష్ఠ్యూత నిష్ఠుర కోటిశతకోటిసంస్పర్శస్ఫుర ద్విస్ఫులింగనిర్గమానర్గళ భుగభుగాయ మాన మూర్తివిస్ఫూర్తి నారాయణకర కమలవర్తి గదాయుధోత్తమ మదీయవైరి తండోపతండంబుల భండనంబునం జండగతిం బిండి పిండిగాఁగూశ్మాండ వైనాయకయక్షరక్షభూతగ్రహంబులు చూర్ణంబులుగాఁగొండొక వినోదంబు సలుపుము! దరేంద్రంబ వైన పాంచ జన్యంబ! సర్వలోకజిష్ణుం డైన శ్రీకృష్ణుని నిఖిల పుణ్యైక సదనపదన నిష్ఠ్యూతనిశ్శ్వాసాధరవేణు పరిపూరితంబ వై యున్మత్తభూతప్రేత పిశాచ విప్రగహాది క్రూరదుర్గ్రహంబులు విద్రావణంబులుగా నస్మ త్పరవీరమండలం బుల గుండియలతో దదీయ మానినీదుర్భరగర్భంబులు గర్భస్థార్భక నిర్భేదంబులుగా నవియ బ్రహ్మాండభాండభీకరం బయిన భూరినాదంబున మోదింపు మతితీవ్ర ధారాదళిత నిశాతకోటి కఠోరకంఠకరాళర క్తధారాధౌత మలీమసవిసరంబ వైన నందకమహాసి శేఖరంబ! జగదీశప్రేరితంబ వై మద్విడ్విషమవ్యూహంబుల మెండు గడికండలుగఁజెండి చెండాడుము! నిష్కళంక నిరాతంకసాంద్ర చంద్ర మండలపరిమండిత సర్వాంగలక్షణ విచక్షణధర్మనిరతంబ వైనచర్మంబ! దుర్మద మద్వైరిలోకభీకరాలోకంబులను సమాకులనిబిడనీరంధ్రనిష్ఠుర తమఃపటల పటుఘటనంబులం గుటిల పఱుపుము! నిఖిలపాపగ్రహంబుల వలనను సకల నరమృగసర్పక్రోడ భూతాదులవలనను నగు భయంబులు భగవన్నామరూపయాన దివ్యాస్త్రంబుల వలనం బొందకుండుఁగాక! బృహద్రథంతరాదిసామంబులచేత స్తోత్రంబు సేయంబడుచున్న ఖగేం ద్రుండు రక్షణదక్షుండై నన్ను రక్షించుఁగాక! శ్రీహరి నామరూప వాహన దివ్యాయుధషార్ష దోత్తమప్రముఖంబు లస్మదీయ బుద్ధీంద్రియ మనః ప్రాణంబుల సంరక్షించు! భగవంతుండయిన శేషుండు సర్వోప ద్రవంబుల నాశంబు సేయు జగదైక్యభావం బయిన ధ్యానంబుల గల వానికి వికల్పరహితుండై భూషణాయుధలింగాఖ్య లగు శక్తులం దన

మాయచేత ధరియించి తేజరిల్లుచుండు లక్ష్మీకాంతుండు వికల్ప విగ్రహంబులవలన నన్ను రక్షించుంగాక! లోకభయంకరాట్టహాస భాసుర వదన గహ్వరుండగుచు సమస్తతేజోహరణధురీణ తేజఃపుంజ సంజాత దివ్యనృసింహాతారుం డగు నప్పరమేశ్వరుండు సర్వదిగ్భా గంబులవలన, సమస్తబహిరంతరంబులవలన నన్ను, రక్షించుచుండుం గాత! మని నారాయణాత్మకకవచప్రభావం బితిహాస రూపంబున నింద్రుండు దెలిసికొని ధ్యానంబుసేసి తద్విద్యాధారణమహిమ వలన నరాతుల నిర్జించెం గావున నెవ్వరేని నిర్మలాత్ము లగువార లేతద్విద్యాధారణులై యనుదినంబును బఠియించిన నతిఘోరరణంబుల నత్యుత్కటసంకటంబులను సర్వగ్రహ నిగ్రహకర్మ మారణకర్మాది దుష్కర్మజన్యక్లేశంబులను వదలి యవ్యాకుల మనస్కులై విజయంబు నొందుదురు. మఱియును సర్వరోగంబులకు నగమ్యశరీరులై సుఖంబు నొందురు రదియునుం గాక.

సీ. అతిభక్తిఁగౌశికుండను బ్రాహ్మణుండు దొల్లి
యీవిద్య ధరియించి యెలమి మించి
మరుభూమియందు నిర్మలచిత్తుఁడై యోగ
ధారణంబున బిట్టు తనువు విడిచె
దానిపై నొకఁడు గంధర్వవరేణ్యుండు
చిత్రరథాఖ్యుఁడజేయుఁడొంటి
చదలఁజనంగఁదచ్ఛాయ తదస్థిపైఁ
గదిసిన నాతఁడు గళవళించి

ఆ. యువిదపిండుతోడ నవవిమానముతోడఁ
దనదు విద్యతోడ ధరణిఁద్రెళ్ళి
తివిచి లేవలేక తికమక గుడువంగ
వాలఖిల్యమౌని వానిఁజూచి.



క. నారాయణకవచసమా,
ధారణపుణ్యాస్థి దీని దగ్గఱ నీకుం
గూరెడినె విష్ణుభక్తుల,
వారక చేరంగ నెట్టివారికిఁదరమే!

**ఇంద్రవజ్రము.**

సంధించి నీయంగకసంధు లెల్లన్
బంధించి తన్మంత్రబలంబుపేర్మి
న్నందంబు మాన్పింపఁదదన్యమేదీ
సింధుప్రవాహోన్నతిచేతఁదీరున్.

వ. కావున, నీ పుణ్యాశల్యంబులు భక్తియుక్తుండవై కొని పోయి ప్రాఙ్ముఖంబునఁబ్రవహించెడు సరస్వతీజలంబుల నిక్షేపణంబు సేసి కృతస్నానుండవై యాచమనంబు సేసిన నీ సర్వాంగబంధనంబులుడుగు ననిన నతం డట్ల చేసి తన విమానం బెక్కి నిజస్థానంబున కరిగెం గావున.

క. అనుదినము దీని నెవ్వరు
వినిరేనిఁబఠించిరేని విస్మయ మొదవన్
ఘనభూతజాల మెల్లను
మునుకొని వారలను గాంచి మ్రొక్కుచునుండున్.

ఆ. విశ్వరూపువలన నైశ్వర్యకరమైన
యిట్టివిద్యఁదాల్చి యింద్రుఁడపుడు
మూఁడులోకములకు మూద లైనట్టిశ్రీ
ననుభవించి మించె నధికమహిమ.

పోతన 6-8-294 నుండి 313

## భాగవతము - హయగ్రీవ బ్రహ్మవిద్య

శ్లో॥ వేదాన్ యుగాంతే తమసా తిరస్కృతాన్
రసాతలా ద్యోనృతరంగవిగ్రహః ।
ప్రత్యాదదే వై కవయేఽభియాచతే
తస్మైనమస్తేఽవితథే హితాయ ॥ 90
వ్యాస 5-18-6

శ్రీహరి హయగ్రీవావతారమెత్తి పాతాళమునందు దాఁచఁబడిన వేదములను బ్రహ్మకొసఁగెను. శ్రీమద్భాగవతము ఆ వేదార్థమును భగవత్తత్త్వమును మహిమను భక్తి జ్ఞాన వైరాగ్యములను బోధించి మోక్షమును ప్రసాదించును.

దధీచిముని శ్రేష్ఠుడు అశ్వినీదేవతలకు బ్రహ్మవిద్య నుపదేశించెను. అశ్వశిరస్కుఁడై త్వష్ట యను ప్రజాపతికి నారాయణ కవచమునుపదేశించెను. అందువలన నారాయణ కవచమునకు హయగ్రీవ బ్రహ్మవిద్య యను పేరు గలిగెను. ఇందు వృత్రాసుర వధయుఁగలదు. కావున శ్రీమద్భాగవతమును హయగ్రీవ బ్రహ్మవిద్య యని విజ్ఞుల అభిప్రాయము. సిద్ధాంతము.

శ్లో॥ దధ్యఙ్ఙాథర్వణ స్త్వష్ట్రే వర్మాభేద్యం మదాత్మకమ్ ।
విశ్వరూపాయ యత్ప్రాదాత్త్వష్టా యత్వమథా స్తతః ॥ 91
వ్యాస 6-9-49

"అథర్వణాయాశ్వినౌ దధీచేఽశ్వ్యగ్ం శిరః ।
ప్రత్యైరయతమ్" - ఛాందోగ్యోపనిషత్తు ॥

బ్రహ్మవిద్యనారాయణ కవచము నుపదేశించుటవలన ఇంద్రుఁడాముని అశ్వశిరమును ఖండించెను. తరువాత అశ్వినీదేవతలు యథాపూర్వముగ ఆ ముని శిరస్సును దెచ్చి ఆయనకు సంధించిరి.

* * *

# అధ్యాయము-9

## వృత్రాసురవృత్తాంతము

### స్తుతియించుచున్న దేవతలకు వైకుంఠుండు ప్రసన్నుఁడగుట

**శ్రీశుక ఉవాచ :**

శ్లో॥ ఇతి తేషాం మహారాజ సురాణాముపతిష్ఠతామ్ ।
ప్రతీచ్యాం దిశ్యభూదావిశ్శంఖచక్రగదాధరః ॥ 92

ఆత్మతుల్యైష్షోడశభిర్వినా శ్రీవత్స కౌస్తుభౌ ।
పర్యుపాసితమున్ని ద్రశరదంబురుహేక్షణమ్ ॥

దృష్ట్వా తమవనౌ సర్వ ఈక్షణాహ్లాదవిక్లబాః ।
దండవత్పతితా రాజన్ శనై రుత్థాయ తుష్టువుః ॥
వ్యాస 6-9-27 నుండి 29

సీ. తగు శంఖ చక్ర గదాధరుం డగువాని
శ్రీవత్సకౌస్తుభశ్రీలవానిఁ
గమనీయమాణిక్య ఘనకిరీటమువాని
దివ్యవిభూషణదీప్తివాని
మండితకేయూర కుండలంబులవాని
సిరి యురస్థ్సలమునఁజెలఁగువానిఁ
దనుఁబోలు సేవకతండంబు గలవాని
జిలుఁగైన పచ్చనివలువవానిఁ

ఆ. దెల్ల దమ్మివిరులఁదెగడుకన్నులవాని
నవసుధాద్రవంపు నవ్వువానిఁ
గనియె వేల్పుపిండు కప్పరపాటుతోఁ
గన్నులందు నున్న కఱవు దీఱ.

సీ. తన సేవకులలోనఁదడఁబడు రూపంబు
శ్రీవత్సకౌస్తుభశ్రీలఁదెలుప
వికచాబ్జములతోడ వీడ్వడు కన్నుల
కడల దైవాఱెడు కరుణఁదెలుప
నెల్ల లోకములకు నిల్లైన భాగ్యంబుఁ
గాఁపురం బుండెడు కమల దెలుప
మూఁడుమూర్తులకును మొదలైన తేజంబు
ధాతఁబుట్టించిన తమ్మి దెలుప

ఆ. బుద్ధిఁబోల్పరాని పుణ్యంబుఁద త్పాద
కమల జనిత యైన గంగ దెలుప
నప్రమేయుఁడభవుఁడవ్యక్తుఁడవ్యయుఁ
డాదిపురుషుఁడఖిలమోది యొప్పె.

వ. ఇట్లు జగన్మోహనాకారుండైన నారాయణుని కృపావ లోక నాహ్లాద స్వభావ చరితులై సాష్టాంగ దండప్రమాణంబు లాచరించి, ఫాలభాగ పరికీలిత కరకమలులై యిట్లనిరి. పోతన 6-9-332 నుండి 334

**దేవా ఊచుః :**

శ్లో॥ నమస్తే యజ్ఞవీర్యాయ వయసే ఊతయే నమః ।
నమస్తే అస్తచక్రాయ నమస్సుపురుహూతయే ॥

యత్తే గతీనాం తిసృణామీశితుః పరమం పదమ్ ।
నార్వాచీనో విసర్గస్య ధాతర్వేదితుమర్హతి ॥

చూ:- ఓం నమస్తే అస్తు భగవన్నారాయణ వాసుదేవాది పురుష మహానుభావ పరమమంగళ పరమకల్యాణ పరమకారుణిక పరమహంసపరివ్రాజకైః పరమేణాత్మయోగసమాధినా పరిభావిత పరిస్ఫుటిత పారమహంస్య ధర్మేణోద్ఘాటితతమఃకపాటద్వారే హ్యపా వృతాత్మలోకే స్వయముపలబ్ధనిజ సుఖానుభవో భవాన్ ॥



దురవబోధ ఇవ తవ విహారయోగో యదశరణోఽ శరీర ఇదం జగదనపేక్షి తాస్మత్సమవాయసాహాయ్యః ఆత్మనై వా విక్రియమాణేన సగుణ మగుణస్స్వయం సృజసి పాసి హరసి ॥ వ్యాస 6-9-30 నుండి 33

ఆ. దుర్గమంబు అయిన స్వర్గాదిఫలములఁ
బుట్టఁజేయఁజాలునట్టిగుణము
గలిగి మెలంగుచున్న ఘనుఁడవైనట్టి నీ
కరయ మ్రొక్కువార మాదిపురుష.

సీ. దండంబు యోగీంద్రమండలసుతునకు
దండంబు శార్ఙ్గ కోదండునకును
దండంబు మండితకుండలద్వయునకు
దండంబు నిష్ఠురభండనునకు
దండంబు మత్తవేదండరక్షకునకు
దండంబు రాక్షసఖండనునకు
దండంబు పూర్ణేందుమండల ముఖునకు
దండంబు తేజఃప్రచండునకును

తే. దండ మద్భుతపుణ్యప్రధానునకును
దండ ముత్తమవైకుంఠధామునకును
దండ మాశ్రితరక్షణతత్పరునకు
దండ మురుభోగినాయకతల్పునకును.

ఆ. అకట! దిక్కుల కెల్ల దిక్కైన, మాకు
నొక్క దిక్కును లేదు కాలూఁద నైన,
దిక్కు గావయ్య! నేఁడు మా దిక్కుఁజూచి
దిక్కు లేకున్నవారల దిక్కు నీవ.

ఆ. పరమపురుష! దుఃఖభంజన! పరమేశ!
భక్తవరద! కృష్ణ! భవవిదూర!
జలరుహాక్ష! నిన్ను శరణంబు వేఁడెద
మభయ మిచ్చి కావవయ్య! మమ్ము.

వ. నమస్తే! భగవన్నారాయణ వాసుదేవ! యాదిపురుష! మహానుభావ! పరమమంగళ! పరమకల్యాణ! దేవ! పరమకారుణికులయిన పరమహంస లగు పరివ్రాజకులచేత నా చరితంబు లగు పరమ సమాధిభేదంబులం బరిభావితపరిస్ఫుటం బయిన పరమహంస ధర్మంబు చేత నుద్ఘాటితం బగు. తమః కవాటద్వారంబున నపావృతం బయిన యాత్మలోకంబున నుపలబ్ధమాత్రుండ వై నిజసుఖానుభవుండ వై యున్న నీ వాత్మసమవేతంబులై యపేక్షింపంబడని యా శరీరంబులకు నుత్పత్తిస్థితి లయ కారణుండ వై యుండుదువు. పోతన 6-1-335, 336, 339, 341, 342, 343

శ్లో॥ మఘవన్ యాత భద్రం వో దధ్యఞ్చ మృషిసత్తమమ్ ।
విద్యావ్రత తపస్సారం గాత్రం యాచత మాచిరమ్ ॥

స వా అధిగతో దధ్యఙ్ఙశ్విభ్యాం బ్రహ్మనిష్కళమ్ ।
యద్వా అశ్వశిరో నామ తయోరమరతాం వ్యధాత్ ॥

దధ్యఙ్ఙాథర్వణస్త్వష్ట్రే వర్మాభేద్యం మదాత్మకమ్ ।
విశ్వరూపాయ యత్ప్రాదాత్త్వష్టా యత్త్వమథా స్తతః ॥

యుష్మభ్యం యాచితోఽశ్విభ్యాం ధర్మజ్ఞోఽఙ్గాని దాస్యతి ।
తతస్తై రాయుధశ్రేష్ఠో విశ్వకర్మ వినిర్మితః ॥

యేన వృత్రశిరోహర్తా మత్తేజ ఉపబృంహితః ।
తస్మిన్ వినిహతే యూయం తేజోఽస్త్రాయుధసంపదః ।
భూయః ప్రాప్స్యథ భద్రం వో న విషీదంతి మత్పరాః ॥

వ్యాస 6-9-47 నుండి 51



వ. కావున మీకు (ఇంద్రాదిదేవతలు) శుభం బయ్యెడు. దధీచి యను ఋషిసత్తముండు గలండు. అతని శరీరంబు మద్విద్యాతిశయ మహత్త్వంబునం దేజో విశేషంబున సారంబై యున్న యదతని నడిగి, తచ్ఛరీరంబుఁ బుచ్చికొనుండు. అతండు పూర్వకాలంబున నశ్వినీ దేవతలకు నశ్వశిరో నామం బను బ్రహ్మస్వరూపంబగు నిష్కళంకం బైన విద్య నుపదేశించిన, వారలు జీవన్ముక్తిత్వంబు నొందిరి. మఱియుఁద్వష్ట పుత్రుండైన విశ్వరూపునకు మదాత్మకంబైన యభేద్య కవచంబు నిచ్చె. కావున. నతం డతివదాన్యుడు. అశ్వినీ దేవతలచేత యాచింపంబడి, దేహంబు వంచింపక మీ కిచ్చు. అతని శల్యంబులు విశ్వకర్మ నిర్మితంబులై శతధారలు గల యాయుధ శ్రేష్ఠంబై, మత్తేజోబృంహితంబై, వృత్రాసుర శిరోహరణ కారణంబై యుండు. దానంజేసి మీరు పునర్లబ్ధ తేజోఽస్త్రాయుధ సంపదలు గలిగి వెలింగెదరు. విశేషించియు మద్భక్తవరులైనవారలే లోకంబుల నెవ్వరికి నజేయులు. కావున, మీకు భద్రం బయ్యెడు. అని భూతభావనుండైన భగవంతుం డదృశ్యుం డయ్యె. అప్పుడు ఇంద్రాది దేవతలు దధీచిముని కడకుం జనిరి. 78

పోతన 6-9-347

* * *

## అధ్యాయము-11

**వృత్ర ఉవాచ :**

శ్లో॥ సురేంద్ర కస్మాన్న హినోషి వజ్రం
పురః స్థితే వైరిణి మ య్యమోఘమ్ ।
మా సంశయిష్ఠా న గదేవ వజ్రం
స్యాన్నిష్ఫలం కృపణార్థేవ యాచ్ఞా ॥ 103

నన్వేష వజ్రస్తవ శక్రతేజసా
హరేర్దధీచస్తపసా చ తేజితః ।
తేనై వ శత్రుం జహి విష్ణు యంత్రితో
యతో హరి ర్విజయః శ్రీర్గుణా స్తతః ॥ 104

వ్యాస 6-11-19, 20

సీ. సందేహ మేటికి? జంభారి! వేవేగ
భిదురంబు వ్రేయు మాభీలభంగి
నతిలోభి నడిగిన యర్థరాశియుఁబోలెఁ
గడపకు మిది వృథ గాదు సుమ్ము
మురమర్దనుని తేజమున నా దధీచి వీ
ర్యాతిశయంబుల నధిక మైన
యది గాన హరిచే నియంత్రితోన్నతుఁడవై
గెలువుము శత్రుల గీ టణంచి

ఆ. యెందు గలఁడు విష్ణుఁడంచు జయశ్రీలు
పొందు గాఁగ వచ్చి పొందుచుండుఁ
గాన భక్తవరదుఁగమలాక్షు సర్వేశు
పదములందు మనము పదిలపఱతు. 79

పోతన 6-11-397

## వృత్రాసుర వృత్తాంతము

**వృత్ర ఉవాచ :**

శ్లో॥ అహం సమాధాయ మనో యథాహ
సంకర్షణ స్తచ్చరణారవిందే ।
త్వద్వజ్రరంహోలులితగ్రామ్యపాశో
గతిం మునే ర్యామ్యపవిద్ధలోకః ॥ 105

పుంసాం కిలై కాంతధియాం స్వకానాం
యాస్సంపదో దివి భూమౌ రసాయామ్ ।
నరాతి యద్ద్వేష ఉద్వేగ ఆధి
ర్మదః కలిర్వ్యసనం సంప్రయాసః ॥

త్రైవర్గికాయాసవిఘాత మస్మ
త్పతిర్విధత్తే పురుషస్య శక్ర ।
తతోఽనుమేయో భగవత్ప్రసాదో
యో దుర్లభోఽకించనగోచరోఽన్యైః ॥

అహం హరే తవ పాదైకమూల
దాసానుదాసో భవితాస్మి భూయః ।
మనః స్మరేతాసుపతేర్గుణాం స్తే
గృణీతవాక్కర్మ కరోతు కాయః ॥

శ్లో॥ న నాకపృష్ఠం న చ పారమేష్ఠ్యం
న సార్వభౌమం న రసాధిపత్యమ్ ।
న యోగసిద్ధీ రపునర్భవం వా
సమంజసత్వాం విరహయ్య కాంక్షే ॥ 109

వ్యాస 6-11-21 నుండి 25

వ. ఇట్లు వజ్రధారలం ద్రెంపఁబడిన విషయభోగంబులు గల వాఁడనై శరీరంబు విడిచి, భగవ ద్ధామంబునుం బొందెద. నారాయణుని దాసుండ నైన నాకు స్వర్గమర్త్యపాతాళంబులం గల సంపద్భోగంబులు నిచ్చయింపఁ బడవు. త్రైవర్గికాయాస రహితంబైన మహైశ్వర్యంబు ప్రసాదించును. గావున ననుపమేయం బైన భగవత్ప్రసాదం బన్యుల కగోచరంబు. అద్దేవుని పాదైకమూలంబుగా నుండు దాసులకు దాసానుదాసుండనై యున్నవాఁడ, అని య ప్పరమేశు నుద్దేశించి. 80

చ. అరయఁగ భక్తపాలనము లై న భవచ్చరితంబు లాత్మ సం
స్మరణము సేయ వాక్కు నిను సన్నుతి సేయ శరీరమెల్లఁగిం
కర పరివృత్తి సేయ మదిఁగాంక్ష యొనర్చెదఁగాని, యొల్లనే
నరిది ధ్రువోన్నత స్థలము, నబ్జజు పట్టణ, మింద్ర భోగమున్. 81

పోతన 6-11-398, 399

శ్లో॥ అజాతపక్షా ఇవ మాతరం ఖగాః ।
స్తన్యం యథా వత్సతరాః క్షుధార్తాః ।
ప్రియం ప్రియేవ వ్యుషితం విషణ్ణా
మనోఽరవిన్దాక్ష దిదృక్షతే త్వామ్ । 110

వ్యాస 6-11-26

ఉ. ఆఁకలి గొన్న క్రేపులు రయంబున, నీఁకలు రాని పక్షులుం
దీకొని తల్లికిన్, మఱి విదేశగతుం డగు భర్త కంగజ
వ్యాకులచిత్త యైన జవరాలును, దత్తఱ మందు భంగి నో
శ్రీకర! పంకజాక్ష! నినుఁజేరఁగ నామది గోరెడుం గదే! 82

పోతన 6-11-400

శ్లో॥ మహోత్తమశ్లోకజనేషు సఖ్యం
సంసారచక్రే భ్రమతః స్వకర్మభిః ॥



త్వన్మాయయాఽఽత్మాత్మజదారగేహే
ష్వాసక్తచిత్తస్య న నాథ భూయాత్ ॥ 111

వ్యాస 6-11-27

క. నాకును సఖ్యము పుణ్య
శ్లోకులతోఁగాని, తత్త్వశూన్యులు, సంసా
రైక విమోహులతోడం
గాకుండ నొనర్పుమయ్య, కంజదళాక్షా. 83

పోతన 6-11-401

* * *

## అధ్యాయము-16

**జీవ ఉవాచ :**

శ్లో॥ నిత్యస్యార్థస్య సంబంధో హ్యనిత్యో దృశ్యతే నృప । 112
యావదస్య హి సంబంధో మమత్వం తావదేవ హి ॥

ఏవం యోనిగతో జీవ స్సనిత్యో నిరహంకృతః ।
యావద్యత్రోపలభ్యేత తావత్స్వత్వం హి తస్య తత్ ॥

ఏష నిత్యోఽవ్యయ స్సూక్ష్మ ఏక స్సర్వాశ్రయస్స్వదృక్ ।
ఆత్మమాయాగుణైర్విశ్వ మాత్మానం సృజతి ప్రభుః ॥

న హ్యస్యాతిప్రియః కశ్చిన్నాప్రియ స్స్వః పరోఽపి వా ।
ఏక స్సర్వధియాం ద్రష్టా కర్తౄణాం గుణదోషయోః ॥ 115

వ్యాస 6-16-7 నుండి 10

**బాలుండిట్లనియె :**

సీ. ఒక్కఁడై నిత్యుడై, యెక్కడఁగడలేక
సొరిది జన్మాదుల శూన్యుఁడగుచు
సర్వంబునందుండి సర్వంబుఁదనయందు
నుండంగ సర్వాశ్రయుం డనంగ
సూక్ష్మమై స్థూలమై సూక్ష్మాదికములకు
సామ్యమై స్వప్రకాశమున వెలిఁగి
యఖిలంబుఁజూచుచు నఖిలప్రభావుఁడై
యఖిలంబుఁదనయందు నడఁచికొనుచు

తే. నాత్మ మాయాగుణంబుల నాత్మమయము
గాఁగ విశ్వంబు దనసృష్టి ఘనతఁజెందఁ
జేయుచుండును సర్వసంజీవనుండు
రమణ విశ్వాత్ముఁడైన నారాయణుండు. 84

క. పతు లెవ్వరు? సతు లెవ్వరు?
సుతు లెవ్వరు? మిత్ర శత్రు సుజనప్రియ సం
గతు లెవ్వరు? సర్వాత్మక
గతుఁడై గుణసాక్షి యైన ఘనుఁడొక్కనికిన్. 85

పోతన 6-16-464, 465

### చిత్రకేతూపాఖ్యానము

### చిత్రకేతుండు తపమాచరించి భగవత్ప్రసాదంబు నొందుట

వ. చిత్రకేతుండు గాఢపంకంబునం బడిన యేనుంగునుంబోలె గృహాంధ కూపంబు వెడలి, కాళిందీనదికిం బోయి యందు విధిపూర్వ కంబుగఁ గృతస్నానుండై, మౌనంబుతోడ నారదునకు నమస్కరించిన, నతండు ప్రసన్నుండై, భగవన్మంత్రంబు విధిపూర్వకంబుగా నతనికి నుపదేశించి యంగిరసుతోడం గూడి బ్రహ్మలోకంబునకుం జనియె. చిత్రకేతుండు నిరాహారుండై సమాధినియతుం డై నారాయణ రూపం బైన విద్య నారాధించి సప్తరాత్రంబున నప్రతిహతం బైన విద్యాధరాధిపత్యంబును, భాస్వ ద్రత్న దివ్యవిమానంబును, నారాయణానుగ్రహంబునఁబొందె. 86

వ్యాస 6-16-18 నుండి 25

పోతన 6-16-466

**శ్రీశుక ఉవాచ :**

శ్లో॥ మృణాళగౌరం శితివాససం స్ఫుర
త్కిరీటకేయూరకటిత్రకంకణమ్ ।
ప్రసన్నవక్త్రారుణలోచనం వృతం
దదర్శ సిద్ధేశ్వరమండలైః ప్రభుమ్ ॥ 116

తద్దర్శనధ్వస్తసమస్తకిల్బిష
స్స్వచ్ఛా మలాంతః కరణోఽభ్యయాన్మునిః ।
ప్రవృద్ధభక్త్యా పరయాశ్రులోచనః
ప్రహృష్టరోమా తమనాదిపూరుషమ్ ॥

స ఉత్తమశ్లోకపదాబ్జవిష్టరం
ప్రేమాశ్రులేశై రుపసేచయన్ముహుః ।
ప్రేమోపరుద్ధాఖిలవర్ణనిర్గమో
న చాశకత్తం ప్రసమీడితుం చిరమ్ ॥ 118

వ్యాస 6-16-30 నుండి 32

సీ. తార హార పటీర ధవళదేహమువాని
రమణీయ నీలాంబరంబువాని
మణికిరీట స్ఫుర న్మస్తకంబులవానిఁ
గంకణ కేయూరకములవానిఁ
గర్బురమయ దీ ప్త కటిసూత్రములవానిఁ
దరళ యజ్ఞోపవీతములవాని
నతిసుప్రసన్న వక్త్రాంబుజంబులవానిఁ
దరుణ వివృత్త నేత్రములవాని

ఆ. సిద్ధమండలంబు సేవింపఁబుణ్యప్ర
సిద్ధి వెలసినట్టి యిద్ధచరితుఁ
బద్మలోచనునకుఁబాదపీఠం బైన
ఘనునిఁబన్న గేంద్రుఁగాంచె నతఁడు. 87

పోతన 6-16-467

## భగవత్తత్త్వము

**చిత్రకేతు రువాచ :**

శ్లో॥ అజితజిత స్సమ మతిభిః
సాధుభిర్భవాన్ జితాత్మభిర్భగవన్ ।
విజితాస్తేఽపి చ భవతా
కామాత్మనాం యదాత్మదోఽతికరుణః ॥ 119

తవ విభవః ఖలు భగవన్
జగదుత్పత్తిస్థితిలయాదీని ।



విశ్వసృజస్తేఽంశాంశా
స్తత్ర ముధా స్పర్ధంతే పృథగభిమత్యా ॥

పరమాణుపరమమహతో
స్త్వమాద్యంతాంతరవర్తీ త్రయవిధురః ।
ఆదావంతేఽపి చ సత్త్వానాం
యద్ధ్రువం తదేవాంతరాళేఽపి॥

క్షిత్యాది భిరేష కిలావృతః సప్తభిర్దశగుణోత్తరైరండకోశః ।
యత్ర పతత్యణుకల్పః సహాండకోటిభి స్తదనంతః ॥ 122

వ్యాస 6-16-34 నుండి 37

క. అజితుఁడ వై భక్తులచే
విజితుఁడ వైనాఁడ విపుడు వేడుక వారున్
విజితులు నీచేఁగోర్కులు
భజియింపనివారు నిన్నుఁబడయుటను హరీ! 88

ఉ. నీ విభవంబు లీ జగము నిండుట యుండుట నాశ మొందుటల్
నీ విమలాంశజాలములు నెమ్మి జగంబు సృజించువార లో
దేవ! భవద్గుణాంబుధుల తీరముఁగానక యీశ! బుద్ధితో
వావిరిఁజర్చ సేయుదురు వారికి వారలు దొడ్డవార లై.

క. పరమాణువు మొదలుగఁగొని
పరమము తుది గాఁగ మధ్య పరికీర్తనచే
స్థిరుదవు ద్విగుణహరుండవు
సర సత్త్వాద్యంత మధ్య సర్వసుగతి వై.

తే. ఉర్వి మొదలగు నేడు నొండొంటికంటె
దశగుణాధికమై యుండు దాన నంద
నాశమొందెడు నాయంశ కోటులెన్న
యందు నణుమాత్రమగు ననంతాఖ్యుఁడతఁడు. 91

పోతన 6-16-471 నుండి 474

## అధ్యాయము-18

### సవితృవంశాది ప్రవచన కథ

**దితి ఉవాచ :**

శ్లో॥ వరం వరయ వామోరు ప్రీతస్తేఽహ మనిందితే ।
స్త్రీణాం భర్తరి సుప్రీతే కః కామ ఇహ చాగమః ॥ 123

పతిరేవ హి నారీణాం దైవతం పరమం స్మృతమ్ ।
మానస స్సర్వభూతానాం వాసుదేవ శ్రియః పతిః ॥ 124

శ్లో॥ స ఏవ దేవతాలింగైర్నామరూపవికల్పితైః ।
ఇజ్యతే భగవాన్ పుంభిస్త్రీభిశ్చ పతిరూపధృత్ ॥ 125

తస్మాత్పతివ్రతా నార్య శ్రేయస్కామాస్సుమధ్యమే ।
యజన్త్యనన్యభావేన పతిమాత్మానమీశ్వరమ్ ॥

సోఽహం త్వయార్చితో భద్రే ఈదృగ్భావేన భక్తితః ।
కిం తే సంపాదయే కామమసతీనాం సుదుర్లభమ్ ॥ 127

వ్యాస 6-18-32 నుండి 36

వ. కశ్యపప్రజాపతి బరమప్రీతుండై సతికి నిట్లనియె. "ఓ తన్వీ! నీకు బ్రసనున్నుండనైతి. వరంబుగోరుము ఇచ్చెద. నాథుండు ప్రసన్నుండైన స్త్రీలకుం గోరిక సంభవించుట కేమి గొఱంత? సతికిం బతియెదైవంబు సర్వభూతంబుల మానసంబులకు వాసుదేవుండె భర్త. నామ రూపవికల్పితు లైన సకల దేవతామూర్తులచేతను, బురుషులచేతను భర్తృరూపధరుండైన భగవంతుండు సేవింపఁబడుచుండు, విశేషించి, స్త్రీలచేతఁబతిరూపంబున భజియింపఁబడుచుండు. కావునఁ, బతివ్రత లైన సుందరులు శ్రేయస్కామలై యేకచిత్తంబున నాత్మేశ్వరుండైన యప్పరమేశ్వరుని భర్తృభావంబున సేవించు చుండుదురు. ఏనును నీకీ భావంబున వరదుండనైతి. దుశ్శీలలైన వనితలకుంబొందరాని వరంబు నీ కిచ్చెద" వేఁడుము. 92

పోతన 6-18-513

శ్లో॥ వరదో యది మే బ్రహ్మన్ పుత్రమింద్రహణం వృణే ।
అమర్త్యం హతపుత్రాహం యేన మే ఘాతితౌ సుతౌ ॥ 128

వ్యాస 6-18-37

ఆ. వరము గోర నాకు వరదుండ వేనియు
నింద్రుఁద్రుంచునట్టి యిద్ధ బలుని
నమిత తేజుఁదనయు నమరత్వ సంప్రాప్తు
నెందుఁజెడనివాని, నిమ్ము నాథ! 93

పోతన 6-18-514

### పుంసవనవ్రతము

(కశ్యపప్రజాపతి తన సతియైన దితికి "పుంసవనవ్రతము" ఒక్క సంవత్సరము ఆచరింపుమని ఆ వ్రత మాచరించు విధానమంతయు దెలియజేసెను. ఈ వ్రతము చేయుటవలన ఇంద్రహంత యగు పుత్రుండు గలుగునని చెప్పెను. ఈ వ్రతమును గురించి వ్యాస 6-18-45 నుండి 63 వరకు, పోతన 6-18-520 మఱియు శ్రీ బులుసు వేంకటేశ్వరులుగారి నిర్వచనాంధ్ర మహాభాగవతమున పేజీ 193లో పద్యములు 1836 నుండి 1845 వరకు పాఠకులు చదివి తెలుసుకొనవలెను.) 94

క. రాజీవరాజ పూజ్య, శ్రీజిత గోపీకటాక్ష సేవాంతర వి
భ్రాజితమూర్తి! మదోద్ధత, రాజుకులోత్పాద రామరాజాఖ్యనిధీ!

**తరల.**

మురవిదారణ! ముఖ్యకారణ! మూలతత్త్వ విచారణా!
దురిత తారణ! దుఃఖవారణ! దుర్మదాసుర మారణా!

గిరివిహారణ! కీర్తిపూరణ కీర్తనీయ మహారణా!
ధరణి ధారణ! ధర్మ తారణ! తాపస స్తుతి పారణా!

**తోటకము :**

కరుణాకర! శ్రీకర! కంబుకరా!
శరణాగత సంగత జాడ్యహరా!
పరిరక్షిత శిక్షిత భక్తమురా!
కరిరాజ శుభప్రద! కాంతిధరా! 97

పోతన 6-18-527 నుండి 529

**ఇతి షష్ఠస్కన్ధః సమాప్తః**

**హరిః ఓమ్**

**శ్రీకృష్ణార్పణమస్తు.**

ఓమ్ నమో భగవతే వాసుదేవాయ

# శ్రీమద్భాగవత మణిహారము

## 18. సప్తమ స్కంధము

శ్లో॥ స్వభక్తపక్షపాతేన తద్విపక్షవిదారణమ్ ।
నృసింహమద్భుతం వన్దే పరమానందవిగ్రహమ్ ॥

నరసింహవపుర్భీమం స్తమ్భసమ్భవమద్భుతమ్ ।
భక్తత్రాణాయ బిభ్రాణం వాసుదేవముపాస్మహే ॥

క. శ్రీమ ద్విఖ్యాతి లతా
క్రామిత రోదోంతరాళ! కమనీయ మహా
జీమూత తులితదేమ
శ్యామల రుచిజాల! రామచంద్రనృపాలా!

### అధ్యాయము-1

#### కథాప్రారంభము

**రాజో ఉవాచ :**

శ్లో॥ సమః ప్రియసుహృద్బ్రహ్మన్ భూతానాం భగవాన్ స్వయమ్ ।
ఇంద్రస్యార్థే కథం దైత్యానవధీద్విషమో యథా ॥ 1

న హ్యస్యార్థస్సురగణైః సాక్షాన్ని శ్రేయసాత్మనః ।
నై వాసురేభ్యో విద్వేషో నోద్వేగశ్చాగుణస్య హ ॥

ఇతి నస్సుమహాభాగ నారాయణగుణాన్ప్రతి ।
సంశయస్సుమహాన్ జాత స్తం భవాంశ్ఛేత్తుమర్హతి ॥ 3

వ్యాస 7-1-1 నుండి 3

సీ. సర్వభూతములకు సముఁడు నెచ్చెలి ప్రియుం
డైన వైకుంఠుఁడనంతుఁడాఢ్యుఁ
డింద్రునికొఱకు దైత్యేంద్రుల నేటికి
విషమునికై వడి వెదకి చంపె?
నసురులఁజంపంగ నమరులచేఁదన
కయ్యెడిలాభ మెంతైనఁగలదె?
నిర్వాణనాథుండు నిర్గుణుం డగు తన
కసురులవలని భయంబుఁబగయుఁ

ఆ. గలుగనేర దట్టిఘనుఁడు దైత్యులఁజంపి
సురలఁగాఁచుచునికి చోద్య మనుచు
సంశయంబు నాకు జనియించె మునినాథ!
ప్రజ్ఞ మెఱసి తెలియఁబలుకవయ్య! 1

పోతన 7-1-3

**శ్రీశుక ఉవాచ :**

శ్లో॥ సాధు పృష్టం మహాభాగ హరేశ్చరితమద్భుతమ్ ।
యద్భాగవతమాహాత్మ్యం భగవద్భక్తివర్ధనమ్ ॥ 4

గీయతే పరమం పుణ్యమృషిభిర్నారదాదిభిః ।
నత్వా కృష్ణాయ మునయే కథయిష్యే హరేః కథామ్ ॥

నిర్గుణోఽపి హ్యజోఽవ్యక్తో భగవాన్ ప్రకృతేః పరః ।
స్వమాయాగుణమావిశ్య బాధ్యబాధకతాం గతః ॥

సత్త్వం రజ స్తమ ఇతి ప్రకృతేర్నాత్మనో గుణాః ।
న తేషాం యుగపద్రాజన్ హ్రాస ఉల్లాస ఏవ వా ॥

జయకాలే తు సత్త్వస్య దేవర్షీ న్రజసోఽసురాన్ ।
తమసో యక్షరక్షాంసి తత్కాలానుగుణోఽభజత్ ॥ 8

వ్యాస 7-1-4 నుండి 8



శా. నీ సంప్రశ్నయు వర్ణనీయము గదా! నిక్కంబు రాజేంద్ర! ల
క్ష్మీసంభావ్యుని సచ్చరిత్రము మహాచిత్రంబు చింతింపఁద
ద్దాసాఖ్యానము లొప్పు విష్ణుచరణధ్యాన ప్రధానంబు లై
శ్రీసంధానము లై మునీశ్వరవచో జేగీయమానంబులై. 2

క. చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతా లవిత్రంబులు స
న్మిత్రంబులు మునిజనవన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.

వ. నరేంద్రా! కృష్ణద్వైపాయనునకు నమస్కరించి, హరి కథనంబులు సెప్పెద వినుము. వ్యక్తుండు గాక, గుణంబులు లేక, ప్రకృతింజెందక, భవంబుల నొందక పరమేశ్వరుండు దన మాయవలననైన గుణంబుల నావేశించి బాధ్యబాధకత్వంబుల నొందు. అతండు గుణరహితుండు. సత్త్వ రజస్తమంబులు ప్రకృతిగుణంబులు. ఆ గుణంబులకు నొక్కొక్క కాలంబున హానివృద్ధులు గలవు. ఆ యీశ్వరుండు సత్త్వంబున దేవఋషులను, రజోగుణంబున నసురులను దమో గుణంబున యక్ష రక్షో గణంబులను విభజించె. సూర్యుండు పెక్కెడలం గానంబడియు నొక్కరుండైన తెఱంగునఁ ద ద్విభుండును సర్వగతుం డయ్యును భిన్నుండు గాఁడు. తత్త్వవిదులైన పెద్దలు దమలోనం బరమాత్మస్వరూపంబున నున్న యీశ్వరు న వ్విధంబున నెఱుంగుదురు. జీవాత్మకుఁబరుండైన సర్వమయుండు దనమాయచేత విశ్వంబున్ సృజియింపం గోరి రజంబును, గ్రీడింపంగోరి సత్త్వంబును, నిద్రింపం గోరి తమంబును, నుత్పాదించి చరమైన కాలంబును సృజియించు, ఆ కాలమున సర్వదర్శనుండైన యీశ్వరుండును కాలాహ్వయుండునునై హరి సత్త్వగుణంబైన దేవానీకంబునకు వృద్ధియు, రజ స్తమో గుణులైన రాక్షసులకు హానియుం జేయుచుండు.

పోతన 7-1-7

**నారద ఉవాచ :**

శ్లో॥ నిందన స్తవ సత్కారన్యక్కారార్థం కళేబరమ్ ।
ప్రధాన పరయో రాజన్న వివేకేన కల్పితమ్ ॥ 9

తస్మాద్వైరానుబంధేన నిర్వైరేణ భయేన వా
స్నేహాత్కామేన వా యుంజ్యాత్కథంచిన్నేక్షతే పృథక్ ॥

యథా వైరానుబంధేన మర్త్య స్తన్మయతామియాత్ ।
న తథా భక్తియోగేన త్వితి మే నిశ్చితా మతిః ॥

కీటః పేశస్కృతా రుద్ధః కుడ్యాయాం తమనుస్మరన్ ।
సంరంభభయయోగేన విందతే తత్స్వరూపతామ్ ॥

ఏవం కృష్ణే భగవతి మాయామనుజ ఈశ్వరే ।
వై రేణ పూతపాప్మానస్తమాపురనుచింతయా ॥

కామాత్ ద్వేషాద్భయాత్స్నేహాద్యథా భక్త్యేశ్వరే మనః ।
అవేశ్య తదఘం హిత్వా బహవ స్తద్గతిం గతాః ॥

గోప్యః కామాద్భయాత్కంసో ద్వేషాచ్చైద్యాదయో నృపాః ।
సంబన్ధాద్వృష్ణయస్స్నేహాద్యూయం, భక్త్యా వయం నృప ॥

కతమోఽపి న వేనస్స్యాత్పంచానాం పురుషం ప్రతి ।
తస్మాత్కేనాప్యుపాయేన మనః కృష్ణే నివేశయేత్ ॥

మాతృష్వసేయో వశ్చైద్యో దంతవక్త్రశ్చ పాండవ ।
పార్షదప్రవరౌ విష్ణోర్విప్రశాపాత్పదచ్యుతౌ ॥ 17

వ్యాస 7–1–24 & 28 నుండి 35

వ. దూషణ భూషణ తిరస్కార సత్కారంబులు శరీరంబునకుంగాని పరమాత్మకు లేవు. సర్వభూతాత్మకుండైన యీశ్వరునకు వైషమ్యంబు లేదు. 5



ఆ. అలుక నైనఁజెలిమి నైనఁగామంబున
నైన బాంధవమున నైన భీతి
నైనఁదగిలి తలఁప నఖిలాత్ముఁడగు హరిఁ
జేరవచ్చు వేఱుసేయఁడతఁడు. 6

క. వైరానుబంధనంబునఁ,
జేరిన చందమున విష్ణుఁజిరతరభక్తిం
జేరఁగరా దని తోఁచును,
నారాయణ భక్తియుక్తి నా చిత్తమున్.

క. కీటకముఁదెచ్చి భ్రమరము
పాటవమున బంభ్రమింప భ్రాంతంబై త
త్కీటము భ్రమరరూపముఁ
బాటించి వహించుఁగాదె! భయయోగమున్.

వ. ఇవ్విధంబున.

శా. కామోత్కంఠత గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాలముఖ్య నృపతుల్ సంబంధులై వృష్ణులున్
బ్రేమన్ మీరలు భక్తి నేము నిదె చక్రిం గంటి మెట్టైన ను
ద్దామ ధ్యానగరిష్ఠుఁడైన హరిఁజెందన్వచ్చు ధాత్రీశ్వరా!

## శ్రీహరి ద్వారపాలకులకు సనకసనందనాదులవలన శాపంబు గల్గుట

వ. మఱియుం బెక్కండ్రు కామ, ద్వేష, భయ, స్నేహ, సేవా తిరేకంబులఁ జిత్తంబు హరిపరాయత్తంబుగాఁజేసి సద్గతిం జెందిరి. మీ తల్లికిఁజెల్లెలి కొడుకు లైన శిశుపాల దంతవక్త్రులు దొల్లి విష్ణు మందిర ద్వారపాలకులు. విప్రశాపంబునఁబదభ్రష్టులై భూతలంబున జన్మించిరి.

పోతన 7–1–13 నుండి 19 11

## అధ్యాయము-2

**హిరణ్యకశిపురువాచ :**

శ్లో॥ అమ్బామ్బ హే వధూః పుత్రా వీరం మార్హథ శోచితుమ్ ।
రిపో రభిముఖే శ్లాఘ్యః శూరాణాం వధ ఈప్సితః ॥ 18

భూతానా మిహ సంవాసః ప్రపాయామివ సువ్రతే ।
దై వేనైకత్ర నీతానా మున్నీ తానాం స్వకర్మభిః ॥ 19
వ్యాస 7-2-20, 21

వ. హిరణ్యకశిపుడు తల్లియైన దితి నవలోకించి యిట్లనియె.

శా. నీరాగారనివిష్ట పాంథులక్రియన్ నిక్కంబు సంసారసం
చారుల్ వత్తురు గూడి విత్తురు సదాసంగంబు లే దొక్కచో
శూరుల్ పోయెడిత్రోవఁబోయెను భవత్సూనుండు దల్లీ మహా
శూరుం డాతఁడు తద్వియోగమునకున్ శోకింప నీ కేటికిన్. 12
పోతన 7-2-38

శ్లో॥ నిత్య ఆత్మావ్యయశ్శుద్ధస్సర్వగస్సర్వవిత్పరః ।
దత్తేఽసావాత్మనో లింగం మాయయా విసృజన్ గుణాన్ ॥ 20

యథాంభసా ప్రచలతా తరవోఽపి చలా ఇవ ।
చక్షుషా భ్రామ్యమాణేన దృశ్యతే చలతీవ భూః ॥

ఏవం గుణైర్భ్రామ్యమాణే మనస్య వికలః పుమాన్ ।
యాతి తత్సామ్యతాం భద్రే హ్యలింగో లింగవానివ ॥ 22
వ్యాస 7-2-22 నుండి 24

వ. హిరణ్యాక్షుఁడు మరణించగా హిరణ్యకశిపుండు దుఃఖితుండై, తల్లియైన దితి కిట్లనియె. 13

సీ. సర్వజ్ఞుఁడీశుండు సర్వాత్ముఁడవ్యయుఁ
డమలుండు సత్యుఁడనంతుఁడాఢ్యుఁ
డాత్మరూపంబున నశ్రాంతమును దన
మాయాప్రవర్తన మహిమవలన
గుణములఁగల్పించి గుణసంగమంబున
లింగశరీరంబు లీలఁదాల్చి
కంపిత జలములోఁగదలెడిక్రియఁదోఁచు
పాదపంబులభంగి భ్రామ్యమాణ

ఆ. చక్షువుల ధరిత్రి చలితయై కానంగఁ
బడినభంగి వికల భావరహితుఁ
డాత్మమయుఁడు కంపితాంతరంగంబునఁ
గదలినట్ల తోఁచుఁగదలఁడతఁడు. 14
పోతన 7-2-37, 39

### బాలవేషము దాల్చిన యముండు దెలిపెడు సుయజ్ఞోపాఖ్యానము

**యమ ఉవాచ :**

శ్లో॥ య ఇచ్ఛయేశస్సృజతీదమవ్యయో
య ఏవ రక్షత్యవలుంపతే చ యః ।
తస్యా బలాః క్రీడనమాహురీశితు
శ్చరాచరం నిగ్రహసంగ్రహే ప్రభుః ॥ 23

పథి చ్యుతం తిష్ఠతి దిష్టరక్షితం
గృహస్థితం తద్విహతం వినశ్యతి ।
జీవత్యనాథోఽపి తదీక్షితో వనే
గృహేఽపి గుప్తో విహతో న జీవతి ॥

శ్లో॥ భూతాని తై స్తైర్నిజయోనికర్మభి
ర్భవంతి కాలే న భవంతి సర్వశః ।
న తత్ర హాత్మా ప్రకృతావపి స్థిత
స్తస్యాగుణైరన్యతమో నిబధ్యతే ॥ 25

ఇదం శరీరం పురుషస్య మోహాజం
యథా పృథగ్భౌతిక మీయతే గృహమ్ ।
తథౌదకైః పార్థివతైజసైర్జనః
కాలేన జాతో వికృతో వినశ్యతి ॥ 26

యథానలో దారుషు భిన్న ఈయతే
యథానిలో దేహగతః పృథక్ స్థితః ।
యథా నభస్సర్వగతం న సజ్జతే
తథా పుమాన్ సర్వగుణాశ్రయః పురః ॥ 27

వ్యాస 7-2-39 నుండి 43

క. ఎవ్వఁడు సృజించుఁబ్రాణుల
నెవ్వఁడు రక్షించుఁద్రుంచు నెవ్వఁడనంతుం
డెవ్వఁడు విభుఁడెవ్వఁడు వాఁ
డివ్విధమున మనుచుఁబెనుచు హేలారతుఁడై. 15

ఆ. ధనము వీథిఁబడిన దైవవశంబున
నుండుఁబోవు మూల నున్న నైన
నడవి రక్షలేని యబలుండు వర్ధిల్లు
రక్షితుండు మందిరమునఁజచ్చు.

క. కలుగును మఱి లేకుండును
గల భూతము లెల్లఁగాలకర్మవశములై
యిలఁబడియుఁబ్రకృతిఁద ద్గుణ
కలితుఁడు గాఁడాత్మమయుఁడగమ్యుఁడు దలఁపన్. 17

సీ. పాంచభౌతిక మైన భవనంబు దేహంబు
పురుషుండు దీనిలోఁబూర్వకర్మ
వశమున నొకవేళ వర్తించు దీపించు
తఱి యైన నొకవేళ తలఁగిపోవు



చెడునేని దేహంబు చెడుఁగాని పురుషుండు
చెడఁడాతనికి నింతచేటు లేదు
పురుషునికిని దేహపుంజంబునకు వేఱు
గాని యేకత్వంబు గానరాదు.

ఆ. దారువుల వెలుంగు దహనుని కై వడిఁ
గాయములఁజరించు గాలిభంగి
నాళలీన మైన నభము చాడ్పున వేఱు
దెలియ వలయు దేహి దేహములకు. 18

పోతన 7-2-48 నుండి 51

**హిరణ్యకశిపురువాచ :**

శ్లో॥ అతశ్శోచత మా యూయం పరం నాత్మానమేవ వా ।
క ఆత్మాకః పరో వాత్ర స్వీయః పారక్య ఏవ వా ।
స్వపరాభినివేశేన వినా జ్ఞానేన దేహినామ్ ॥ 28

వ్యాస 7-2-61

వ. హిరణ్యకశిపుండు దన తల్లినిఁదమ్ముని, భార్యలం జూచి యిట్లనియె.

క. పరులెవ్వరు? దా మెవ్వరు?
పరికింపఁగ నేక మగుట భావింపరు త
త్పరమజ్ఞానము లేమినిఁ
బరులును మే మనుచుఁదోఁచుఁబ్రాణుల కెల్లన్. 20

వ. అని తెలియం బలికిన, హిరణ్యకశిపుని వచనంబులు విని, దితి కోడండ్రునుం దానును శోకంబు మాని, తత్త్వవిలోకనంబు గలిగి, లోకాంతర గతుఁడైన కొడుకునకు (హిరణ్యాక్షుడు) వగవక చనియె. 21

పోతన 7-2-68 నుండి 70

* * *

## అధ్యాయము-3

### హిరణ్యకశిపుడు బ్రహ్మను ప్రార్థించి వరము లడుగుట

**హిరణ్యకశిపురువాచ :**

శ్లో॥ కల్పాంతే కాలసృష్టేన యోఽంధేన తమసా వృతమ్ ।
అభివ్యనజ్జగదిదం స్వయంజ్యోతిస్స్వరోచిషా ॥ 29

ఆత్మనా త్రివృతాచేదం సృజత్యవతి లుంపతి ।
రజస్సత్త్వతమోధామ్నే పరాయ మహతే నమః ॥ 30

వ్యాస 7-3-28, 29

సీ. కల్పాంతమున నంధకార సంభృతమైన
జగము నెవ్వఁడు దనసంప్రకాశ
మున వెలుఁగింపుచు మూఁడుభంగుల రజ
స్సత్త్వ తమోగుణ జనకుఁడగుచుఁ
గల్పించు రక్షించుఁగడపటఁబ్రహరించు
నెవ్వఁడాద్యుఁడు సర్వహేతు వగుచు
శోభితుండై స్వయంజ్యోతి యై యొక్కట
విలసిల్లు నెవ్వఁడు విభుత మెఱసి

ఆ. సమయ మైన మానస ప్రాణ బుద్ధీంద్రి
యములతోడ నెవ్వఁడలఘుమహిమ
నడరు నట్టి సచ్చిదానందమయునకు
మహితభక్తి నే నమస్కరింతు. 22

పోతన 7-3-87

శ్లో॥ యది దాస్యస్యభిమతాన్వరాన్మే వరదోత్తమ ।
భూతేభ్యస్త్వద్విసృష్టేభ్యో మృత్యుర్మాభూన్మమ ప్రభో ॥ 31

నాంతర్బహిర్ది వా న క్తమన్యస్మాదపి చాయుధైః ।
న భూమౌ నాంబరే మృత్యుర్న నరైర్న మృగైరపి ॥

వ్యసుభిర్వాసుమద్భిర్వా సురాసురమహోరగైః ।
అప్రతిద్వన్ద్వతాం యుద్ధే హ్యైకపత్యం చ దేహినామ్ ॥

సర్వేషాం లోకపాలానాం మహిమానం యథాత్మనః ।
తపోయోగ ప్రభావానాం యన్నరిష్యతి కర్హిచిత్ ॥ 34

వ్యాస 7-3-37 నుండి 40

క. కోరినవార కోర్కులు
నేరుపుతో నిచ్చి మనుప నీక్రియ నన్యుల్
నేరరు కరుణాత్మక
నేఁగోరెద నీ విచ్చెదేనిఁగోరిక లభవా! 23

శా. గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశస్థలిన్ దిక్కులన్
రేలన్ ఘస్రములన్ దమః పటలి భూరి గ్రాహ రక్షో మృగ
వ్యాళాదిత్య నరాది జంతు కలహవ్యాప్తిన్ సమస్తాస్త్రశ
స్త్రాళిన్ మృత్యువులేని జీవనము లోకాధీశ! యిప్పించవే! 24

పోతన 7-3-89, 90

* * *

## అధ్యాయము-4

### దేవతలు మునీశ్వరులు శ్రీమహావిష్ణుని ప్రార్థించుట

శ్లో॥ ఓన్న మో భగవతే వాసుదేవాయ మహాత్మనే ।
విశుద్ధానుభవానందసందోహాయ యతోఽభయః ॥ 35

శ్లో॥ తేషామావిరభూద్వాణిహ్యరూపా మేఘనిస్వనా ।
సన్నాదయంతీ కకుభస్సాధూనా మభయంకరా ॥ 36

వ్యాస 7-4-24, 25

ఉ. ఎక్కడ నున్నవాఁడు? జగదీశ్వరుఁడాత్మమయుండు మాధవుం
డెక్కడికేఁగి శాంతులు మునీశులు భిక్షులు రారు గ్రమ్మఱన్
దిక్కుల నెల్ల నెక్కుడు తుదిం జొర దిక్కగు నట్టి దిక్కుకై
మ్రొక్కెద మేము హస్తయుగముల్ ముకుళించి మదీయరక్షకున్. 25

పోతన 7-4-108

**బ్రహ్మోవాచ :**

శ్లో॥ మాభైష్ట విబుధశ్రేష్ఠాస్సర్వేషాం భద్రమస్తు వః ।
మద్దర్శనం హి భూతానాం సర్వశ్రేయోపపత్తయే ॥ 37

జ్ఞాతం మే తస్య దౌరాత్మ్యం దై తేయాపశదస్య యత్ ।
తస్య శాంతిం కరిష్యామి కాలస్తావత్ప్రతీక్ష్యతామ్ ॥

యథా వేదేషు దేవేషు గోషు విప్రేషు సాధుషు ।
ధర్మే మయి చ విద్వేషస్స వా ఆశు వినశ్యతి ॥

నిర్వైరాయ ప్రశాంతాయ స్వసుతాయ మహాత్మనే ।
ప్రహ్లాదాయ యదా ద్రుహ్యేద్ధనిష్యేఽపి వరోర్జితమ్ ॥ 40

వ్యాస 7-4-26 నుండి 29

వ. దేవతలు, కిన్నర సిద్ధ సాధ్య ముని నాయకులు అందరు హృషీ కేశుని ఆశ్రయభిక్ష నర్థించగా, అంత మేఘరవసమాన గంభీర నినదంబున దిశలు మ్రోయించుచు, సాధులకు నభయంబు గావింపుచు, దృశ్యమానుండునుం గాక పరమేశ్వరుం డైన హరి యిట్లనియె. 26

మ. భయముం జెందకుండయ్య! నిర్జరవరుల్ భద్రంబుమీకయ్యెడిన్
జయమున్ లాభము భూతసంతతికి మత్సందర్శన ప్రాప్తిన
వ్యయ మై చేరు నెఱుంగుదున్ దితిసుత వ్యాపార భాషావిప
ర్యయముం గాలముఁగూడఁజంపెదఁజనుం డందాఁక మీ త్రోవలన్. 27

ఆ. శుద్ధ సాధులందు సురలందు శ్రుతులందు
గోవులందు విప్రకోటియందు
ధర్మపదవియందుఁతప్పి నాయందు వాఁ
డెన్నఁడలుగు నాఁడె హింసఁజెందు.

క. కన్నకొడుకు శమ దమ సం
పన్నుని నిర్వైరుఁడనక ప్రహ్లాదుని వాఁ
డెన్నఁడు రోషంబున నా
పన్నత నొందించు నాఁడె పట్టి వధింతున్.

శా. వేధోదత్త వరప్రసాద గరిమన్ వీఁడింతవాఁడై మిమ్ముం
బాధం బెట్టుచునున్న వాఁడని మదిన్ భావింతు భావించి నే
సాధింపం దటికాదు కావునఁగడున్ సైరించితిన్ మీఁదటన్
సాధింతున్ సురలార! మీరు సనుఁడా శంకింప మీ కేటికిన్? 30

పోతన 7-4-109 నుండి 113

### ప్రహ్లాదచరిత్ర

**హరి రువాచ :**

శ్లో॥ తస్య దైత్యపతేః పుత్రాశ్చత్వారః పరమాద్భుతాః ।
ప్రహ్లాదోఽభూన్మహాం స్తేషాం గుణైర్మహదుపాసకః ॥ 41

బ్రహ్మణ్యశ్శీలసంపన్న స్సత్యసంధో జితేంద్రియః ।
ఆత్మవత్సర్వభూతానామేకః ప్రియసుహృత్తమః ॥ 42

శ్లో॥ దాసవత్సన్న తార్యాంఘ్రిః పితృవద్దీనవత్సలః ।
భ్రాతృవత్సదృశస్సిగ్ధో గురుష్వీశ్వరభావనః ।
విధ్యార్థజనరూపాద్యైర్మానసంభవివర్జితః ॥ 43

వ్యాస 7-4-31 నుండి 33

వ. హిరణ్యకశిపునకు విచిత్రచరిత్రులు నలువురు పుత్రులుద్భవించిరి. అందు ప్రహ్లాదుడు ప్రథముడు. అతఁడు బ్రహ్మణ్యుఁడు శీలవంతుండు, సత్యసంధుఁడు జితేంద్రియుఁడు, సర్వభూతప్రియసుహృదుండు, సద్గుణ సంపన్నుండు. 31

సీ. తనయందు నఖిలభూతములందు నొకభంగి
సమహితత్వంబున జరగువాఁడు
పెద్దల బొడగన్న భృత్యునికై వడి
చేరి నమస్కృతుల్ సేయువాఁడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన
మాతృభావన సేసి మఱలువాఁడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను
దీనులఁగావఁజింతించువాఁడు

తే. సఖులయెడ సోదరస్థితి జరుగువాఁడు
దైవతములంచు గురువులఁదలఁచువాఁడు
లీలలందును బొంకులు లేనివాఁడు
లలిత మర్యాదుఁడైన ప్రహ్లాదుఁడధిప! 32

పోతన 7-4-114, 115



బ్రహ్మోవాచ :

శ్లో॥ నోద్విగ్నచిత్తో వ్యసనేషు నిస్పృహః
శ్రుతేషు దృష్టేషు గుణేష్వవస్తుదృక్ ।
దాంతేంద్రియ ప్రాణశరీరధీస్సదా
ప్రశాంతకామో రహితాసురోఽసురః ॥ 44

శ్లో॥ యస్మిన్ మహాగుణా రాజన్ దృశ్యం తే కవిభిర్ముహుః ।
న తేఽధునాపి ధీయం తే యథా భగవతీశ్వరే ॥ 45

యం సాధు గాథా సదసి రిపవోఽపి సురానృప ।
ప్రతిమానం ప్రకుర్వంతి కిముతాన్యే భవాదృశాః ॥

గుణైరలమసంఖ్యేయైర్మాహాత్మ్యం తస్య సూచ్యతే ।
వాసుదేవే భగవతి యస్య నై సర్గికీ రతిః ॥ 47

వ్యాస 7-4-34 నుండి 37

సీ. ఆకారజన్మవిద్యార్థవరిష్ఠుఁడై
గర్వసంస్తంభసంగతుఁడు గాఁడు
వివిధమహానేక విషయసంపన్నుఁడై
పంచేంద్రియములచేఁబట్టువడఁడు
భవ్యవయోబలప్రాభవోపేతుఁడై
కామరోషాదులఁగ్రందుకొనఁడు
కామినీప్రముఖభోగము లెన్ని గలిగిన
వ్యసనసంసక్తి నావంకఁబోఁడు

ఆ. విశ్వమందుఁగన్న విన్న యర్థములందు
వస్తుదృష్టిఁజేసి వాంఛ యిడఁడు
ధరణినాథ! దైత్యతనయుండు హరిపర
తంత్రుఁడై హతాన్యతంత్రుఁడగుచు. 33

ఆ. సద్గుణంబు లెల్ల సంఘంబు లై వచ్చి
యమరరాజతనయునందు నిలిచి
పాసి చనవు విష్ణుంబాయనివిధమున
నేఁడుఁగలిగి యుండు నిర్మలాత్మ. 34

మ. పగవారైన సురేంద్రులున్ సభలలోఁబ్రహ్లాదసంకాశులన్
సుగుణోపేతుల నెందు మే మెఱుఁగ మంచున్ వృత్త బంధంబులన్
బొగడంజొత్తురు సత్యవీంద్రులక్రియన్ భూనాథ! మీబోఁటి స
ద్భగవద్భక్తులు దైత్యరాజ తనయున్ బాటించి కీర్తింపరే! 35

క. గుణనిధి యగు ప్రహ్లాదుని
గుణము లనేకములు గలవు గురుకాలమునన్
గణుతింప నశక్యంబులు
ఫణిపతికి బృహస్పతికిని భాషాపతికిన్.

వ. ఇట్లు సద్గుణగరిష్ఠుం డయిన ప్రహ్లాదుండు భగవంతుండయిన వాసుదేవునియందు సహజసంవర్ధమాన నిరంతర ధ్యానరతుండై.

పోతన 7-4-117 నుండి 121

## ప్రహ్లాదుని విష్ణుభక్తి

**బ్రహ్మోవాచ :**

శ్లో॥ న్య స్తక్రీడనకో బాలో జడవత్తన్మనస్తయా ।
కృష్ణగ్రహగృహీతాత్మా న వేద జగదీదృశమ్ ॥ 48

ఆసీనః పర్యటన్నశ్నన్ శయానః ప్రపిబన్ బ్రువన్ ।
నానుసందధ ఏతాని గోవిందపరిరంభితః ॥

క్వచిద్రుదతి వైకుంఠచింతాశబళచేతనః ।
క్వచిద్ధసతి తచ్చింతా హ్లాద ఉద్గాయతి క్వచిత్ ॥



క్వచిత్తద్భావనాయుక్త స్తన్మయోఽనుచకార హ ।
నదతి క్వచిదుత్కంఠో విలజ్జో నృత్యతి క్వచిత్ ॥ 51

శ్లో॥ క్వచిదుత్పులకస్తూష్ణీమాస్తే సంస్పర్శనిర్వృతః ।
అస్పందప్రణయానందసలిలామీలితేక్షణః ॥ 52

స ఉత్తమశ్లోకపదారవిందయో
ర్నిషేవయాఽకించన సంగలబ్ధయా ।
తన్వన్ పరాం నిర్వృతిమాత్మనో ముహు
ర్దుస్సంగదీనస్య మనశ్శమం వ్యధాత్ ॥

తస్మిన్మహాభాగవతే మహాభాగే మహాత్మని
హిరణ్యకశిపూ రాజన్నకరోదఘమాత్మజే ॥ 54

వ్యాస 7-4-38 నుండి 44

సీ. శ్రీవల్లభుఁడు దన్నుఁజేరినయట్లైనఁ
జెలికాండ్ర నెవ్వరిఁజేర మఱచు
నసురారి దనప్రోల నాడినయట్లైన
నసురబాలురతోడ నాడ మఱచు
భక్తవత్సలుఁడు సంభాషించినట్లైనఁ
బరభాషలకు మాఱుపలుక మఱచు
సురవంద్యుఁదనలోనఁజూచినయట్లైనఁ
జొక్కి సమస్తంబుఁజూడ మఱచు

తే. హరిపదాంభోజయుగచింతనామృతమున
నంతరంగంబు నిండినట్లైన నతఁడు
నిత్యపరిపూర్ణుఁడగుచు నన్నియును మఱచి
జడతలేకయునుండును జడునిభంగి. 38

శా. పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషింపుచున్ హాస లీ
లానిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షింపుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం
ధానుం డై మఱచెన్ సురారిసుతుఁడేతద్విశ్వమున్ భూవరా!

సీ. వైకుంఠచింతావర్జితచేష్టుఁడై
యొక్కఁడు నేడుచు నొక్కచోట
నశ్రాంతహరిభావనారూఢచిత్తుఁడై
యుద్ధతుఁడై పాడు నొక్కచోట
విష్ణుఁడింతియ కాని వేఱొండు లేదని
యొత్తిలి నగుచుండు నొక్కచోట
నలినాక్షుఁడను నిధానముఁగంటి నేఁడని
యుబ్బి గంతులువైచు నొక్కచోటఁ

ఆ. బలుకు నొక్కచోటఁబరమేశుఁగేశవుఁ
బ్రణయహర్ష జనిత బాష్పసలిల
మిళిత పులకుఁడై నిమీలిత నేత్రుఁడై
యొక్కచోట నిలిచి యూరకుండు. 40

వ. ఇట్లు పూర్వజన్మ పరమభాగవత సంసర్గ సమాగతం బైన ముకుంద చరణారవింద సేవాతిరేకంబున నఖర్వ నిర్వాణ భావంబు విస్తరింపుచు, నప్పటిప్పటికి దుర్జనసంసర్గ నిమిత్తంబునం దన చిత్తం బన్యాయత్తంబు గానీక, నిజాయత్తంబు సేయుచు నప్రమత్తుండును, సంసార నివృత్తుండును, బుధజన విధేయుండును, మహాభాగధేయుండును, సుగుణ మణిగణ గరిష్ఠుండును, బరమ భాగవత శ్రేష్ఠుండును, గర్మబంధలతా లవిత్రుండును (బవిత్రుండును నైన పుత్రునియందు విరోధించి సురవిరోధి యనుకంప లేక చంపం బంపె.) 41

పోతన 7-4-122 నుండి 125



**నారదునకు ధర్మజుం డిట్లనియె :**

శ్లో॥ పుత్రాన్ విప్రతికూలాంశ్చ పితరః పుత్రవత్సలాః ।
ఉపాలభంతే శిక్షార్థం నై వాఘమపరే యథా ॥

శ్లో॥ కిముతానుపశాన్ సాధూన్ తాదృశాన్ గురుదేవతాన్ ।
ఏతత్కౌతూహలం బ్రహ్మన్నస్మాకం విధమ ప్రభో ।
పితుః పుత్రాయ యో ద్వేషో మరణాయ ప్రయోజితః ॥ 56

వ్యాస 7-4-46, 47

ఉ. బాలుఁబ్రభావిశాలు, హరి పాదపయోరుహ చింతనక్రియా
లోలుఁ, గృపాళు, సాధు గురు లోక పదానత ఫాలు, నిర్మల
శ్రీలు, సమస్త సభ్య నుతశీలు, విఖండిత మోహవల్లికా
జాలునదేల, తండ్రి వడిఁజంపఁగ బంపె? మునీంద్ర! సెప్పవే. 42

పోతన 7-4-127

* * *

## అధ్యాయము-5

**నారద ఉవాచ :**

శ్లో॥ ఏకదా సురరాట్పుత్రమంకమారోప్య పాండవ!
పప్రచ్ఛ కథ్యతాం వత్స మన్యతే సాధు యద్భవాన్ ॥ 57
వ్యాస 7-5-4

ఉ. మోదముతోడ దైత్యకులముఖ్యుఁడు రమ్మని చీరఁబంచె బ్ర
హ్లాదకుమారకున్ భవ మహార్ణవ తారకుఁగామ రోష లో
భాది విరోధివర్గ పరిహారకుఁగేశవ చింతనామృతా
స్వాద కఠోరకున్ గలుషజాల మహోగ్రవనీ కుఠారకున్. 43

శా. ఉత్సాహప్రభు మంత్రశక్తి యుతమే యుద్యోగ మారూఢ సం
విత్సంపన్నుఁడ వైతివే? చదివితే వేదంబులున్ శాస్త్రముల్?
వత్సా! రమ్మని చేరఁజీరి కొడుకున్ వాత్సల్య సంపూర్ణుఁడై
యుత్సంగాగ్రము జేర్చి దానవవిభుం డుత్కంఠ దీపింపఁగన్.
పోతన 7-5-137, 139

**ప్రహ్లాద ఉవాచ :**

శ్లో॥ తత్సాధు మన్యేఽసురవర్య దేహినాం
సదా సముద్విగ్నధియామసద్గ్రహాత్ ।
హిత్వాత్మపాతం గృహమంధకూపం
వనం గతో యద్ధరిమాశ్రయేత ॥ 58
వ్యాస 7-5-5

ఉ. ఎల్లశరీరధారులకు నిల్లనుచీఁకటినూతిలోపలం
ద్రెల్లక మీరు మే మను మతిభ్రమణంబున భిన్ను లై ప్రవ
ర్తిల్లక సర్వము న్నతనిదివ్యకళామయ మంచు విష్ణునం
దుల్లముఁజేర్చి తారడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ. 45
పోతన 7-5-142

**శ్రీనారద ఉవాచ :**

శ్లో॥ శ్రుత్వా పుత్రగిరో దైత్యః పరపక్షే సమాహితాః ।
జహాస బుద్ధిర్బాలానాం భిద్యతే పరబుద్ధిభిః ॥ 59
... ... ... ... ... ... ... ... ...

వత్స ప్రహ్లాద! భద్రం తే సత్యం కథయ మా మృషా ।
బాలానతికుతస్తుభ్యమేష బుద్ధివిపర్యయః ॥

బుద్ధిభేదః పరకృత ఉతాహో తే స్వతోఽభవత్ ।
భణ్యతాం శ్రోతుకామానాం గురూణాం కులనందన ॥ 61
వ్యాస 7-5-6 నుండి 10

శా. నాకుంజూడఁగ జోద్యమయ్యెడుఁగదా! నాతండ్రి యీబుద్ధి దా
నీకున్ లోపలఁదోఁచెనో? పరులు దుర్నీతుల్ పఠింపించిరో?
యేకాంతంబున భార్గవుల్ పలికిరో? యీ దానవశ్రేణికిన్
వైకుంఠుండు కృతాపరాధుఁడతనిన్ వర్ణింప నీ కేటికిన్. 46

మ. సురలం దోలుటయో! సురాధిపతులన్ స్రుక్కించుటో! సిద్ధులం
బరివేధించుటయో! మునిప్రవరులన్ బాధించుటో! యక్ష కి
న్నర గంధర్వ విహంగ నాగపతుల న్నాశంబు నొందించుటో!
హరి యంచున్ గిరి యంచు నేల చెడ? మోహాంధుండ వై పుత్రకా! 47
పోతన 7-5-145, 146

**ప్రహ్లాద ఉవాచ :**

శ్లో॥ పరస్వాత్మేత్యసద్గ్రాహః పుంసాం యన్మాయయాకృతః ।
విమోహితధియాం దృష్టస్తస్మై భగవతే నమః ॥ 62

స యదానువృతః పుంసాం పశుబుద్ధిర్విభిద్యతే ।
అన్య ఏష తదాన్యోఽహమితి భేదగతాఽసతీ ॥

స ఏష ఆత్మా స్వపరేత్యబుద్ధిభి
ర్దురన్వయానుక్రమణో నిరూప్యతే ।
ముహ్యన్తి యద్వర్త్మని వేదవాదినో
బ్రహ్మాదయో హ్యేష భినత్తి మే మతిమ్ ॥

యథా భ్రామ్యత్యయో బ్రహ్మన్ స్వయమాకర్ష సన్నిధౌ ।
తథా మే భిద్యతే చేతశ్చక్రపాణేర్యదృచ్ఛయా ॥ 65
వ్యాస 7-5-11 నుండి 14

వ. మోహనిర్మూలనంబు సేసి, యెవ్వనియందుఁదత్పరులైన యెఱుక గల పురుషులకుఁబరులు దా రనియెడు మాయాకృతంబైన యసద్గ్రాహ్యంబు గానంబడ దట్టి పరమేశ్వరునకు నమస్కరించెద.

శా. అజ్ఞుల్గొందఱు మేము దామనుచు మాయంజెంది సర్వాత్మకుం
బ్రజ్ఞాలభ్యు దురన్వయక్రమములన్ భాషింపఁగా నేర రా
జిజ్ఞాసాపథమందు మూఢులు గదా! చింతింప బ్రహ్మాది వే
దజ్ఞుల్ తత్పరమాత్ము విష్ణు నితరుల్ దర్శింపఁగా నేర్తురే? 49

తే. ఇను మయస్కాంత సన్నిధి నెట్లు భ్రాంత
మగు హృషీకేశుసన్నిధి నా విధమునఁ
గరఁగుచున్నది దైవయోగమునఁజేసి
బ్రాహ్మణోత్తమ! చిత్తంబు భ్రాంత మగుచు. 50

సీ. మందారమకరందమాధుర్యమునఁదేలు
మధుపంబు వోవునే మదనములకు?
నిర్మలమందాకినీ వీచికలఁదూఁగు
రాయంచ సనునె తరంగిణులకు?
లలితరసాలపల్లవఖాది యై చొక్కు
కోయిల సేరునే కుటజములకుఁ?



బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరకం
బరుగునే సాంద్రనీహారములకు?

తే. నంబుజోదరదివ్యపాదారవింద,
చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరంబుఁజేర నేర్చు,
వినుతగుణశీల మాటలు వేయు నేల? 51
పోతన 7-5-147 నుండి 150

**నారద ఉవాచ :**

శ్లో॥ ఏతావద్బ్రాహ్మణాయోక్త్వా విరరామ మహామతిః ।
తం సునిర్భర్త్స్య కుపితస్సదీనో రాజసేవకః ॥ 66

అనీయతామరే వేత్రమస్మాకమయశస్కృతః ।
కులాంగారస్య దుర్బుద్ధేశ్చతుర్థోఽస్యోదితో దమః ॥ 67

శ్లో॥ దై తేయ చందనవనే జాతోఽయం కంటకద్రుమః ।
యన్మూలోన్మూలపరశోర్విష్ణోర్నాళాయితోఽర్భకః ॥ 68

ఇతి తం వివిధోపాయైర్భీషయంస్తర్జనాదిభిః ।
ప్రహ్లాదం గ్రాహయామాస త్రివర్గస్యోపపాదనమ్ ॥

తత ఏవం గురుర్జ్ఞాత్వా జ్ఞాతోపాయచతుష్టయమ్ ।
దైత్యేంద్రం దర్శయామాస మాతృమృష్టమలంకృతమ్ ॥

ప్రణమంతం పదోర్బాలం ప్రతినంద్యాశిషాసురః ।
పరిష్వజ్య చిరం దోర్భ్యాం పరమాం ప్రాప నిర్వృతిమ్ ॥ 71
వ్యాస 7-5-15 నుండి 20

వ. అనిన విని రోషించి, రాజసేవకుండైన పురోహితుండు ప్రహ్లాదుం జూచి, తిరస్కరించి యిట్లనియె. 52

ఉ. పంచశర ద్వయస్కుఁడవు బాలుఁడ వించుక గాని లేవు భా
షించెదు తర్కవాక్యములఁజెప్పిన శాస్త్రములోని యర్థ మొ
క్కించుకయైనఁజెప్ప వసురేంద్రుని ముందట మాకు నౌదలల్
వంచుకొనంగఁజేసితివి వైరి విభూషణ! వంశభూషణా!

చ. తనయుఁడు గాఁడు శాత్రవుఁడు దానవభర్తకువీఁడు దైత్య చం
దనవనమందుఁగంటకయుత క్షితిజాతముభంగిఁబుట్టినాఁ
డనవరతంబు రాక్షసకులాంతకుఁబ్రస్తుతి సేయుచుండు దం
డనమునఁగాని శిక్షలకు డాయఁడు పట్టుఁడు కొట్టుఁడుద్ధతిన్.

వ. అని బుజ్జగించి ప్రహ్లాదుని దానవేంద్రుని సన్నిధికిందోడి తెచ్చిన. 55

సీ. అడు గడ్గునకు మాధవానుచింతన సుధా
మాధుర్యమున మేను మఱచువాని
సంభోజగర్భాదు లభ్యసింపఁగలేని
హరిభక్తి పుంభావ మైనవాని
మాతృగర్భముఁజొచ్చి మన్నది మొదలుగాఁ
జిత్త మచ్యుతుమీఁదఁజేర్చువాని
నంకించు తనలోన నఖిల ప్రపంచంబు
శ్రీవిష్ణుమయ మని చెలఁగువాని

తే. వినయ కారుణ్య బుద్ధివివేక లక్ష
ణాది గుణముల కాటపట్టయిన వాని
శిష్య బుధలోక సంభావ్యుఁజేరి గురుఁడు
ముందటికి ద్రొబ్బి తండ్రికి మ్రొక్కు మనుచు. 56

క. శిక్షించితి మన్యము లగు
పక్షంబులు మాని నీతిపారగుఁడయ్యెన్.
రక్షోవంశాధీశ్వర!
వీక్షింపుము నీ కుమార విద్యాబలమున్. 57

పోతన 7-5-151 నుండి 153, 159 నుండి 161



**హిరణ్యకశిపురువాచ :**

శ్లో॥ ప్రహ్లాద ఉచ్యతాం తాత స్వధీతం కించిదుత్తమమ్ ।
కాలేనై తావతాయుష్మన్ యదశిక్షద్గురోర్భవాన్ ॥ 72

వ్యాస 7-5-22

శా. చోద్యం బయ్యెడు నింతకాల మరిగెన్ శోధించి యే మేమి సం
వేద్యాంశంబులు సెప్పిరో? గురువు లే వెంటం బఠింపించిరో?
విద్యాసార మెఱుంగఁగోరెద భవ ద్విజ్ఞాత శాస్త్రంబులోఁ
బద్యం బొక్కటి చెప్పి సార్థముగఁదాత్పర్యంబు భాషింపుమా!

శా. నిన్నున్ మెచ్చరు నీతిపాఠ మహిమ న్నీతోడి దైత్యార్భకుల్
గన్నా రన్నియుఁజెప్ప నేర్తురుగదా! గ్రంథార్థముల్ దక్షులై
యన్నా! యెన్నఁడు నీవు నీతిమతి వౌ దంచున్ మహావాంఛతో
నున్నాఁడ న్ననుఁగన్నదండ్రి! భవదీయోత్కర్ష ముంజూపవే? 59

పోతన 7-5-163, 164

(గమనిక:- పై శ్లోకములోను, పద్యములలోను హిరణ్యకశిపుని పుత్రవాత్సల్యము విశదీకరింపబడినది. మఱియు యీ క్రింది రెండు శ్లోకములలో ప్రహ్లాదుడు సమాధానముగా నవవిధభక్తిని గూర్చి తెలియఁజెప్పినాడు. విష్ణుభక్తి విషయములో పోతనగారు భక్త్యతిశయమును వారి కవితారీతిని బహు సుందరముగాను అత్యంత మధురముగాను సొగసుగాను విస్తరించి వర్ణించినారు. ప్రహ్లాద భక్తి ప్రపంచమున కంతకు ఒకేఒక మంగళకరమగు అఖండజ్యోతియై ప్రకాశించుచున్నది.) 60

**ప్రహ్లాద ఉవాచ :**

శ్లో॥ శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణమ్ పాదసేవనమ్ ।
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్ ॥ 73

ఇతి పుంసార్పి తా విష్ణౌ భక్తి శ్చేన్నవలక్షణా ।
క్రియతే భగవత్యద్ధాతన్మన్యేఽ ధీతముత్తమమ్ ॥ 74
వ్యాస 7-5-23, 24

(శ్లో॥ శ్రీవిష్ణోః శ్రవణే పరీక్షిదభవద్వైయాసకిః కీర్తనే
ప్రహ్లాదః స్మరణే తదంఘ్రిభజనేలక్ష్మీః పృథుః పూజనే ।
అక్రూర స్త్వభివన్దనే కపిపతిర్దాస్యేతు సఖ్యేఽ ర్జునః
సర్వస్వాత్మనివేదనే బలిరభూత్కృష్ణాప్తి రేవం పరా ॥)

క. చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థముఖ్యశాస్త్రంబులు నేఁ
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్లఁజదివితిఁదండ్రీ. 61

## నవవిధభక్తిమార్గములు

మ. తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీతొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁదలఁతున్ సత్యంబు దైత్యోత్తమా.

(సంస్కృతమున :- 1. శ్రవణము, 2. కీర్తనము, 3. స్మరణము, 4. పాదసేవనము, 5. అర్చనము, 6. వందనము, 7. దాస్యము, 8. సఖ్యము, 9. ఆత్మనివేదము.

తెలుఁగున :- 1. సఖ్యము, 2. శ్రవణము, 3. దాసత్వము, 4. వందనము, 5. అర్చనము, 6. సేవ, 7. ఆత్మజ్ఞానము, 8. సంకీర్తన, 9. చింతన.

మన శరీరమునకు నవద్వారము లున్నవి. కావున, నవవిధ భక్తి మార్గములు. తత్సాధన ఫలప్రాప్తికుపదేశింపఁబడినవి. అందువలననే



భాగవతము భక్తి సిద్ధాంతమునకు పరమ ప్రమాణమైనది. ప్రహ్లాదుని భక్తి ఆత్మనివేదన అనగా సర్వస్వార్పణభక్తి.) 63

శా. అంధేందూదయముల్ మహాబధిరశంఖారావముల్ మూక స
ద్గ్రంథాఖ్యాపనముల్ నపుంసకవధూకాంక్షల్ కృతఘ్నావళీ
బంధుత్వంబులు భస్మహవ్యములు లుబ్ధద్రవ్యముల్ క్రోడస
ద్గంధంబుల్ హరిభక్తివర్జితుల రిక్తవ్యర్థసంసారముల్. 64

సీ. కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁజూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణునాకర్ణించు వీనులు వీనులు
మధువైరిఁదవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
పురుషోత్తమునమీఁది బుద్ధి బుద్ధి

తే. దేవదేవునిఁజింతించు దినము దినము
చక్రహస్తునిఁబ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁజెప్పెడి గురుఁడు గురుఁడు
తండ్రి హరిఁజేరుమనియెడి తండ్రి తండ్రి. 65

సీ. కంజాక్షునకుఁగాని కాయంబు కాయమే
పవన గుంఫిత చర్మభస్త్రి గాక
వైకుంఠుఁబొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమఢమధ్వనితోడిఢక్క గాక
హరిపూజనము లేని హస్తంబు హస్తమే
తరుశాఖనిర్మితదర్విగాక

కమలేశుఁజూడని కన్నులు కన్నులే
తనుకుడ్యజాలరంధ్రములు గాక

ఆ. చక్రిచింత లేని జన్మంబు జన్మమే?
తరళసలిలబుద్బుదంబు గాక
విష్ణుభక్తిలేని విబుధుండు, విబుధుఁడే
పాదయుగముతోడిపశువు గాక. 66

సీ. సంసారజీమూతసంఘంబు విచ్చునే?
చక్రిదాస్యప్రభంజనము లేక
తాపత్రయాభీలదావాగ్ను లాఱునే?
విష్ణుసేవామృతవృష్టి లేక
సర్వంకషాఘౌఘజలరాసు లింకునే?
హరిమనీషాబడబాగ్ని లేక
ఘనవిపద్గాఢాంధకారంబు లడఁగునే?
పద్మాక్షునుతిరవిప్రభలు లేక

తే. నిరుపమాపునరావృత్తినిష్కళంక,
ముక్తినిధిఁగానవచ్చునే ముఖ్యమైన
శార్ఙ్గికోదండచింతనాంజనము లేక
తామరసగర్భునకు నైన దానవేంద్ర 67

పోతన 7-5-166 నుండి 171

**ప్రహ్లాద ఉవాచ :**

శ్లో॥ మతిర్న కృష్ణే పరతః స్వతో వా
మిథోఽభిపద్యేత గృహవ్రతానామ్ ।
అదా న్తగోభిర్విశతాం తమిస్రం
పునఃపునశ్చర్విత చర్వణానామ్ ॥ 75

వ్యాస 7-5-30



వ. అనినఁదండ్రికిఁబ్రహ్లాదుం డి ట్లనియె.

ఉ. అచ్చపుఁజీఁకటిం బడి గృహవ్రతులై విషయప్రవిష్టులై
చచ్చుచుఁబుట్టుచున్ మరలఁజర్వితచర్వణు లైనవారికిం
జెచ్చెరఁబుట్టునే? పరులు సెప్పిన నైన నిజేచ్ఛ నైన నే
మిచ్చిన నైనఁగానలకు నేఁగిన నైన హరి ప్రబోధముల్. 68

పోతన 7-5-181

శ్లో॥ న తే విదుః స్వార్థగతిం హి విష్ణుం
దురాశయా యే బహిరర్థమానినః ।
అన్ధా యథాన్ధైరుపనీయమానా
వాచీశతన్త్ర్యామురుదామ్ని బద్ధాః ॥

నైషాం మతిస్తావదురుక్రమాంఘ్రిం
స్పృశత్యనర్థాపగమో యదర్థః ।
మహీయసాం పాదరజోఽభిషేకం
నిష్కిఞ్చనానాం న వృణీత యావత్ ॥ 77

వ్యాస 7-5-31, 32

ఉ. కాననివాని నూతఁగొని కాననివాఁడు విశిష్టవస్తువుల్
గాననిభంగిఁగర్మములు గైకొని కొందఱు కర్మబద్ధు లై
కానరు విష్ణుఁగొంద ఱటఁగందు రకించనవైష్ణవాంఘ్రి సం
స్థానరజోభిషిక్తు లగు సంహృతకర్ములు దానవేశ్వరా ॥ 69

శా. శోధింపంబడె సర్వశాస్త్రములు రక్షోనాథ! వేయేటికిన్
గాథల్ మాధవశేముషీ తరణి సాంగత్యంబునం గాక దు
ర్మేధం దాటఁగ వచ్చునే? సుత వధూ మీనోగ్రవాంఛా మద
క్రోధోల్లోల విశాలసంసృతి మహా ఘోరామితాంభోనిధిన్. 70

పోతన 7-5-182, 183

## హిరణ్యకశిపుండు ప్రహ్లాదుని వివిధోపాయంబుల హింసించుట

**ప్రహ్లాద ఉవాచ :**

శ్లో॥ ఇత్యుక్త్వోపరతం పుత్రం హిరణ్యకశిపూ రుషా ।
అంధీకృతాత్మా స్వోత్సంగాన్నిరస్యత మహీతలే ॥ 78

ఆహామర్షరుషావిష్టః కషాయీభూతలోచనః ।
వధ్యతామాశ్వయం వధ్యో నిస్సారయత నైరృతాః ॥ 79

వ్యాస 7-5-33, 34

వ. హరిణ్యకశిపుండు రాక్షసవీరుల వీక్షించి యిట్లనియె.

శా. పంచాబ్దంబులవాఁడు తండ్రి నగు నాపక్షంబు నిందించి య
త్నించి ద్భీతియు లేక విష్ణు నహితుం గీర్తింపుచున్నాఁడు వ
ల్దంచుం జెప్పిన మానఁడంగమునఁబుత్రాకారతన్ వ్యాధి జ
న్మించెన్ వీని వధించి రండు దనుజుల్ మీ మీపటుత్వంబులన్. 71

పోతన 7-5-186, 187

శ్లో॥ పరోఽ ప్యపత్యం హితకృద్యథౌషధం
స్వదేహజోఽ ప్యామయవత్సుతోఽ హితః ।
ఛిన్ద్యాత్తదఙ్గం యదుతాత్మనోఽ హితం
శేషం సుఖం జీవతి యద్వివర్జనాత్ ॥ 80

వ్యాస 7-5-37

శా. అంగవ్రాతములోఁజికిత్సకుఁడు దుష్టాంగంబు ఖండించి శే
షాంగశ్రేణికి రక్ష సేయుక్రియ నీయజ్ఞుం గులద్రోహి దు
స్సంగుం గేశవపక్షపాతి నధముం జంపించి వీరవ్రతో
త్తుంగఖ్యాతిఁజరించెదం గులము నిర్దోషంబు గావించెదన్. 72

పోతన 7-5-188



వ. హిరణ్యకశిపునకు జండామార్కులిట్లనిరి.

శ్లో॥ జితం త్వయైకేన జగత్త్రయం ప్రభో
విజృంభణత్రస్తసమ స్తధిష్ణ్యపమ్ ।
న తస్య చింత్యం తవ నాథ చక్ష్మహే
న వై శిశూనాం గుణదోషయోః పదమ్ ॥ 81

వ్యాస 7-5-49

శా. శుభ్రఖ్యాతివి నీ ప్రభావము మహాచోద్యంబు దైత్యేంద్ర! రో
ష భ్రూయుగ్మ విజృంభణంబున దిగీశవ్రాతమున్ బోరులన్
విభ్రాంతంబుగఁజేసియేలితి గదా! విశ్వంబు, వీఁడెంత! యీ
దభ్రోక్తుల్ గుణదోష హేతువులు చింతం బొంద నీ కేటికిన్. 73

పోతన 7-5-206

* * *

# అధ్యాయము-6

## ప్రహ్లాదుడు దైత్యకుమారులకు హితము చెప్పట

**ప్రహ్లాద ఉవాచ :**

శ్లో॥ హంతార్భకా మే శృణుత వచోవస్సర్వతశ్శివమ్ ।
వయస్యాన్ పశ్యత మృతాన్ క్రీడంతో మా ప్రమాద్యత ॥ 82

న పురాపి వయం బాలా ఆత్మనోఽథ ప్రియైషిణః ।
గురూక్తమపి న గ్రాహ్యం యదనర్థేఽర్థకల్పనమ్ ॥ 83

వ్యాస 7-6-1, 2

ఉ. బాలకులార! రండు మన ప్రాయముబాలురు కొంద ఱుర్విలోఁ
గూలుటకంటిరే! గురుఁడు క్రూరుఁడనర్థచయంబునందు దు
శ్శీలత నర్థకల్పనముఁజేసెడి గ్రాహ్యము గాదు శాస్త్రముల్
మే లెఱిఁగించెదన్ వినిన మీకు నిరంతర భద్ర మయ్యెడిన్. 74

పోతన 7-6-212

శ్లో॥ కౌమార ఆచరేత్ప్రాజ్ఞో ధర్మాన్ భాగవతానిహ ।
దుర్లభం మానుషం జన్మ తదప్యధ్రువమర్థదమ్ ॥

పుంసో వర్షశతం హ్యాయుస్తదర్ధ మజితాత్మనః ।
నిష్ఫలం యదసౌ రాత్ర్యాం శేతేఽంధం ప్రాపిత స్తమః ॥ 85

శ్లో॥ ముగ్ధస్య బాల్యే కైశోరే క్రీడతో యాంతి వింశతిః ।
జరయా గ్రస్తదేహస్య యాత్యకల్యస్య వింశతిః ॥ 86

దురాపూరేణ కామేన మోహేన చ బలీయసా ।
శేషం గృహేషు సక్తస్య ప్రమత్తస్యాపయాతి హి ॥

కోన్వర్థతృష్ణాం విసృజేత్ప్రాణేభ్యోఽపి గరీయసీమ్ ।
యం క్రీణాత్యసుభిః ప్రేష్ఠైస్తస్కరస్సేవకో వణిక్ ॥ 88

వ్యాస 7-6-6, 11.12, 13,18



వ. వినుండు, సకలజన్మంబు లందును ధర్మార్థచరణ కారణం బయిన మానుషజన్మంబు దుర్లభం బందుఁబురుషత్వంబు దుర్గమంబదియు శతవర్ష పరిమితంబైన జీవితకాలంబున నియంతంబై యుండు. అందు సగ మంధకారబంధురం బయి రాత్రి రూపంబున నిద్రాది వ్యవహారంబుల నిరర్థకం బయిచనుఁ జిక్కిన పంచాశద్వత్సరంబులందును బాల్యకైశోరవయో విశేషంబుల వింశతిహాయనంబులుగడచుఁగడమ ముప్పదియబ్దంబులు నింద్రియంబులచేతఁబట్టువడి దురవగాహంబులయిన కామ క్రోధ లోభ మోహ మదమత్సరంబులను పాశంబులం గట్టువడి విడివడ సమర్థుండు గాక ప్రాణంబులకంటె మధురాయమాణయైన తృష్ణకు లోనై భృత్యతస్కరవణి క్కర్మంబులఁబ్రాణహానియైన నంగీకరించి పరార్థంబుల నర్థించు. 75

పోతన 7-6-213

శ్లో॥ యతో న కశ్చిత్క్వచ కుత్ర విద్వాన్
దీనస్స్వ మాత్మానమలం సమర్థః
విమోచితుం కామదృశాం విహార
క్రీడామృగోయన్నిగళో విసర్గః ॥ 89

వ్యాస 7-6-25

శా. హేలాపాన విజృంభమాణ మద గర్వారూఢ దేహోల్లసత్
బాలాలోకన శృంఖలానిచయ సంబద్ధాత్ముఁడై లేశమున్
వేలానిస్సరణంబు గానక మహావిద్వాంసుఁడున్ గామినీ
హేలాకృష్ణ కురంగశాబక మగున్ హీనస్థితిన్ వింటిరే ! 76

పోతన 7-6-215

శ్లో॥ తతో విదూరాత్పరిహృత్య దైత్యా
దైత్యేషు సంగం విషయాత్మ కేషు ।
ఉపేత నారాయణమాదిదేవం
స ముక్తసంగైరిషితోఽపవర్గః ॥ 90

న హ్యచ్యుతం ప్రీణయతో బహ్వాయాసోఽ సురాత్మజాః ।
ఆత్మత్వాత్సర్వభూతానాం సిద్ధిత్వాదిహ సర్వతః ॥ 91

వ్యాస 7-6-26,27

వ. గావున కౌమార సమయంబున మనీషాగరిష్ఠుండై పరమభాగవత ధర్మంబు ననుష్ఠింపవలయు. వృథా ప్రయాసంబున నాయుర్వ్యయంబు సేయందగదు. హరిభజనంబున మోక్షంబు సిద్ధించు. విష్ణుండు సర్వ భూతంబులకు నాత్మేశ్వరుండు, ప్రియుండు ముముక్షువైన దేహికి దేహావసాన పర్యంతంబు నారాయణ చరణారవింద సేవనంబు కర్తవ్యంబు. 77

సీ. కంటిరే మనవారు ఘనులు గృహస్థు లై
విఫలులై కైకొన్న వెఱ్ఱితనము
భద్రార్థులై యుండి పాయరు సంసార
పద్ధతి నూరక పట్టువడిరి
కలయోనులం దెల్ల గర్భాద్యవస్థలఁ
బురుషుండు దేహి యై పుట్టుచుండుఁ
ద న్నెఱుగఁడు కర్మతంత్రుఁడై కడపట
ముట్టఁడు భవశతములకు నయిన

ఆ. దీన శుభము లేదు దివ్యకీర్తియు లేదు
జగతిఁబుట్టి పుట్టి చచ్చి చచ్చి
పొరల నేల మనకుఁబుట్టని చావని
త్రోవ వెదకికొనుట దొడ్డ బుద్ధి. 78

ఆ. విషయసక్తులైన విబుధాహితులతోడి
మనికి వలదు, ముక్తిమార్గవాంఛ
నాదిదేవు విష్ణు నాశ్రయింపుఁడు, ముక్త
సంగజనుఁగూడి శైశవమున. 79

పోతన 7-6-213, 214, 216



శ్లో॥ తస్మాత్సర్వేషు భూతేషు దయాం కురుత సౌహృదమ్ ।
ఆసురం భావమున్ముచ్య యయా తుష్యత్యధోక్షజః ॥ 92

తుష్టే చ తత్ర కిమలభ్యమనన్త ఆద్యే
కిం తైర్గుణైర్వ్యతికరాదిహ యే స్వసిద్ధాః ।
ధర్మాదయః కిమగుణేన చ కాంక్షి తేన
సారం జుషాం చరణయోరుపగాయతాం నః ॥

ధర్మార్థకామ ఇతి యోఽ భిహితస్త్రివర్గ
ఈక్షా త్రయీ నయదమౌ వివిధా చ వార్తా ।
మన్యే తదేతదఖిలం నిగమస్య సత్యం
స్వాత్మార్పణం స్వసుహృదః పరమస్య పుంసః ॥ 94

వ్యాస 7-6-32 నుండి 34

వ. తత్కారణంబున నాసురభావంబు విడిచి సర్వభూతంబులందును దయాసుహృద్భావంబులు కర్తవ్యంబులు. దయాసుహృద్భావంబులు గల్గిన నధోక్షజుండు సంతసించు. అనంతుం డాద్యుండు. హరి సంతసించిన నలభ్యం బెయ్యది లేదు. జనార్దనచరణసరసీరుహ యుగళ స్మరణ సుధారసపాన పరవశులమైతిమేని మనకు దైవవశంబున నకాంక్షితంబులై సిద్ధించు. ధర్మార్థకామంబులు కాంక్షితంబై సిద్ధించు మోక్షం బననేల? త్రివర్గంబును నాత్మవిద్యయుం దర్క దండ నీతి జీవికాదు లన్నియుఁ ద్రిగుణ్యవిషయంబు లయిన వేదంబుల వలనం బ్రతిపాద్యంబులు. నిస్త్రైగుణ్య లక్షణంబునం బరమపురుషుండైన హరికి నాత్మసమర్పణంబు సేయుట మేలు. పరమాత్మ తత్త్వ జ్ఞానోదయంబునం జేసి స్వపరభ్రాంతిఁజేయక పురుషుండు యోగా వధూతత్వంబున నాత్మవికల్పభేదంబునం గలలోఁ గన్న విశేషంబుల భంగిం దథ్యం బనక మిథ్య యని తలంచు. 80

పోతన 7-6-217

శ్లో॥ జ్ఞానం తదేతదఖిలం దురవాపమాహ
నారాయణో నరసఖః కిల నారదాయ ।
ఏకాంతినా భగవత స్తదకించనానాం
పాదారవిందరజసాఽఽప్లుతదేహినాం స్యాత్ ॥ 95
వ్యాస 7-6-35

మ. నరుఁడుం దానును మైత్రితో మెలగుచున్ నారాయణుం డింతయున్
వరుసన్నారద సంయమీశ్వరునకున్ వ్యాఖ్యానమున్‌జేసె మున్
హరిభక్తాంఘ్రి పరాగ శుద్ధతను లేకాంతుల్ మహాకించనుల్
పరతత్త్వజ్ఞులుగాని నేరరు మదిన్ భావింప నీ జ్ఞానమున్. 81
పోతన 7-6-218

* * *

## అధ్యాయము-7

**నారద ఉవాచ :**

శ్లో॥ ఆత్మా నిత్యోఽవ్యయశ్శుద్ధో హ్యేకః క్షేత్రజ్ఞ ఆశ్రయః ।
అవిక్రియస్స్వదృగ్ఘేతుర్వ్యాపకోఽసంగ్యనావృతః ॥ 96

ఏతైర్ద్వాదశభిర్విద్వానాత్మనో లక్షణైః పరైః ।
అహం మమేత్య సద్భావం దేహాదౌ మోహజం త్యజేత్ ॥ 97
వ్యాస 7-7-19, 20

వ. షడ్వికారంబు లాత్మకు లేవు. ఆత్మ నిత్యుండు, క్షయరహితుండు, శుద్ధుండు, క్షేత్రజ్ఞుండు, గగనాదులకు నాశ్రయుండు, క్రియాశూన్యుండు, స్వప్రకాశుండు, సృష్టిహేతువు, వ్యాపకుండు, నిస్సంగుడు, పరిపూర్ణుండు, నొక్కండు నని వివేకసమర్థంబులగు నాత్మ లక్షణంబులు పండ్రెండు నెఱుంగుచు, దేహాదులందు మోహజనకంబులగు నహంకార మమకారంబులు విడువవలెను.

పోతన 7-7-237

శ్లో॥ దేవోఽసురో మనుష్యో వా రక్షో గంధర్వ ఏవ వా ।
భజన్ముకుందచరణం స్వస్తిమాన్ స్యాద్యథోదయమ్ ॥ 98
వ్యాస 7-7-52

క. దానవ దైత్య భుజంగమ
మానవ గంధర్వ సుర సమాజములో ల
క్ష్మీనాథు చరణ కమల
ధ్యానంబున నెవ్వఁడైన ధన్యత నొందున్. 83
పోతన 7-7-242

శ్లో॥ నాలం ద్విజత్వం దేవత్వమృషిత్వం వాసురాత్మజాః ।
ప్రీణనాయ ముకున్దస్య న వృత్తం న బహుజ్ఞతా ॥ 99
వ్యాస 7-7-53

క. చాలదు భూదేవత్వము
చాలదు దేవత్వ మధికశాంతత్వంబున్
జాలదు హరి మెప్పింప వి
శాలోద్యములార! భక్తి చాలినభంగిన్. 84

పోతన 7-7-244

శ్లో॥ న దానం న తపో నేజ్యా న శౌచం న వ్రతాని చ ।
ప్రీయతేఽమలయా భక్త్యా హరిరన్యద్విడంబనమ్ ॥ 100

వ్యాస 7-7-54

క. చిక్కఁడు వ్రతములఁగ్రతువులఁ
జిక్కఁడు దానముల శౌచశీలతపములన్
జిక్కఁడు యుక్తిని, భక్తినిఁ
జిక్కిన క్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ.

పోతన 7-7-243

శ్లో॥ ఏతావానేవ లోకేఽస్మిన్ పుంసః స్వార్థః పరః స్మృతః ।
ఏకాంతభక్తిర్గోవిందే యత్సర్వత్ర తదీక్షణమ్ ॥ 101

వ్యాస 7-7-57

క. ఆడుదము మనము హరి రతిఁ
బాడుద మే ప్రొద్దు విష్ణు భద్రయశంబుల్
వీడుదము దనుజసంగతిఁ
గూడుదము ముకుంద భక్తికోటిన్ సూటిన్.

క. విత్తము సంసృతిపటలము
వృత్తము కామాది వైరి వైర్గంబుల నేఁ
డిత్తము చిత్తము హరికినిఁ
జొత్తము నిర్వాణపదము శుభమగు మనకున్. 87

పోతన 7-7-248, 249

## అధ్యాయము-8

### హిరణ్యకశిపునకు ప్రహ్లాదుని నివేదన

**ప్రహ్లాద ఉవాచ :**

శ్లో॥ న కేవలం మే భవతశ్చ రాజన్
స వై బలం బలినాం చాపరేషామ్ ।
పరే పరేఽమీ స్థిరజంగమా యే
బ్రహ్మాదయో యేన వశం ప్రణీతాః ॥ 102

స ఈశ్వరః కాల ఉరుక్రమోఽంజసా
హ్యోజస్సహస్సత్త్వబలేంద్రియాత్మా ।
స ఏవ విశ్వం పరమస్స్వశక్తిభిః
సృజత్యవత్యత్తి గుణత్రయేశః ॥ 103

వ్యాస 7-8-8, 9

క. బలయుతులకు దుర్బలులకు
బల మెవ్వఁడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బల మెవ్వఁడు ప్రాణులకును
బల మెవ్వం డట్టి విభుఁడు బల మసురేంద్రా! 88

క. దిక్కులు కాలముతో నే
దిక్కున లేకుండుఁగలుగు దిక్కుల మొదలై
దిక్కు గల లేని వారికి
దిక్కెయ్యది యదియ నాకు దిక్కు మహాత్మా! 89

సీ. కాలరూపంబులఁగ్రమ విశేషంబుల
నలఘు గుణాశ్రయుండైన విభుఁడు
సత్త్వబలేంద్రియ సహజ ప్రభావాత్ముఁ
డై వినోదంబుల నఖిలజగముఁ

గల్పించు రక్షించు ఖండించు నవ్వయుం
డన్ని రూపములందు నతఁడు గలఁడు
చిత్తంబు సమముగాఁజేయుము మార్గంబు
దప్పి వర్తించు చిత్తంబుకంటె

తే. వైరు లెవ్వరు? చిత్తంబు వైరి గాక
చిత్తమును నీకు వశముగాఁజేయవయ్య!
మదయుతాసురభావంబు మానవయ్య!
యయ్య! నీ మ్రోల మే లాదరయ్య! జనులు. 90

పోతన 7-8-264 నుండి 266

శ్లో॥ జహ్యాసురం భావమిమం త్వమాత్మనః
సమం మనో ధత్స్వ న సంతి విద్విషః ।
ఋతేఽ జితాదాత్మన ఉత్పథస్థితా
త్తద్ధి హ్యానంతస్య మహత్సమర్హణమ్ ॥ 104

దస్యూన్ పురాషణ్ణ విజిత్య లుమ్పతో
మన్యన్త ఏకే స్వజితా దిశో దశ ।
జితాత్మనోఽ జ్ఞస్య సమస్య దేహినాం
సాధోః స్వమోహప్రభవాః కుతః పరే ॥ 105

వ్యాస 7-8-10, 11

ఉ. లోకము లన్నియున్ గడియలోన జయించినవాఁడ, వింద్రియా
నీకముఁజిత్తమున్ గెలువ నేరవు, నిన్ను నిబద్ధుఁజేయు నీ
భీకరశత్రు లార్వురఁబ్రభిన్నులఁజేసినఁబ్రాణికోటిలో
నీకు విరోధి లేఁడొకఁడు, నేర్పునఁజూడుము దానవేశ్వరా! 91

పోతన 7-8-267



క. పాలింపుము శేముషి ను
న్మూలింపుము కర్మబంధముల సమదృష్టిన్
జాలింపుము సంసారముఁ
గీలింపుము హృదయమందుఁగేశవభక్తిన్. 92

పోతన 7-8-268

మ. కలఁడంబోధి గలండు గాలిఁగలఁడాకాశంబునం గుంభినిన్
గలఁడగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోతచంద్రాత్మలన్
గలఁడోంకారమునం ద్రిమూర్తులఁద్రిలింగవ్యక్తులం దంతటన్
గలఁడీశుండు గలండు తండ్రి! వెదకంగా నేల యీయాయెడన్.

క. ఇందుఁగలఁడందు లేఁడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే కలఁడు దానవాగ్రణి! వింటే. 94

వ. అని యి వ్విధంబున. 95

మ. హరి సర్వాకృతులం గలం డనుచుఁబ్రహ్లాదుండు భాషింప స
త్వరుఁడై యెందునులేఁడు లేఁడని సుతున్ దైత్యుండు తర్జింప శ్రీ
నరసింహాకృతి నుండె నచ్యుతుఁడు నానా జంగమ స్థావరో
త్కర గర్భంబుల నన్ని దేశముల నుద్దండ ప్రభావంబునన్. 96

పోతన 7-8-374 నుండి 277

**హిరణ్యకశిపురువాచ :**

శ్లో॥ యస్త్వయా మందభాగ్యోక్తో మదన్యో జగదీశ్వరః ।
క్వాసౌ యది హ సర్వత్ర కస్మాత్ స్తంభే దృశ్యతే ॥ 106

సోఽ హం వికత్థమానస్య శిరః కాయాద్ధరామి తే ।
గోపాయేత హరిస్త్వాద్య యస్తే శరణమీప్సితః ॥ 107

శ్లో॥ ఏవం దుర్మక్తైర్ముహురర్దయన్ రుషా
సుతం మహాభాగవతం మహాసురః ।
ఖడ్గం ప్రగృహ్యోత్పతితో వరాసనాత్
స్తంభం తతాడోరుబలస్స్వముష్టినా ॥ 108

తదైవ తస్మిన్నినదోఽతిభీషణో
బభూవ యేనాండకటాహమస్ఫుటత్ ।
యం వై స్వధిష్ణ్యోపగతం త్వజాదయః
శృత్వా స్వధామవ్యయమంగ మేని రే ॥

అభిక్రమన్పుత్రవధేప్సురోజసా
నిశమ్య నిర్హ్రాద మపూర్వ మద్భుతమ్ ।
అంతస్సభాయాం న దదర్శ తత్పదం
వితత్రసుర్యేన సురారియూథపాః ॥

సత్యం విధాతుం నిజభృత్యభాషితం
వ్యాప్తిం చ భూతేష్వఖిలేషు చాత్మనః ।
అదృశ్యతాత్యద్భుతరూపముద్వహం
స్తంభే సభాయాం న మృగం న మానుషమ్ ॥ 111

వ్యాస 7-8-13 నుండి 18

శా. నాతోడం బ్రతిభాష నాడెదు జగన్నాథుండు నాకంటె నీ
భూతశ్రేణికి రాజు లేఁడొకఁడు సంపూర్ణ ప్రభావుండు మ
ద్భ్రాతం జంపిన మున్ను నే వెదికితిన్ బల్మాఱు నారాయణుం
డేత ద్విశ్వములోన లేఁడు మఱి వాఁడెందుండురా దుర్మతీ!

క. ఎక్కడఁగలఁడే క్రియ నే
చక్కిని వర్తించు నెట్టిజాడను వచ్చున్!
జక్కడుతు నిన్ను విష్ణునిఁ
బెక్కులు ప్రేలెదవు వాని భృత్యునిపగిదిన్. 98



క. డింభక! సర్వస్థలముల
నంభోరుహనేత్రుఁడుండు నంచు మిగుల సం
రంభంబునఁబలికెద వీ
స్తంభంబునఁజూపఁగలవె చక్రిన్ గ్రక్రిన్. 99

క. స్తంభంబునఁజూపవేనియుఁ
గుంభిని నీ శిరము ద్రుంచి కూల్పగ రక్షా
రంభమున వచ్చి హరి వి
స్రంభంబున నడ్డపడఁగ శక్తుం డగునే.

వ. అనిన భక్తవత్సలుం డగు శ్రీహరిపరమభక్తుం డైన ప్రహ్లాదుం డిట్లనియె.

శా. అంభోజాసనుఁడాది గాఁగఁదృణపర్యంతంబు విశ్వాత్ముఁడై
సంభావంబున నుండు ప్రోడ విపుల స్తంభంబులో నుండఁడే
స్తంభాంతర్గతుఁడయ్యు నుండుటకు నే సందేహమున్ లేదు ని
ర్దంభత్వంబున నేఁడు గానఁబడుఁబ్రత్యక్ష స్వరూపంబునన్.

వ. అనిన విని కరాళించి, గ్రద్దన లేచి, గద్దియడిగ్గ నుఱికి, యొఱ వెఱికిన ఖడ్గంబుఁగేల నమర్చి, జళిపించుచు, మహాభాగవత శిఖామణి యైన ప్రహ్లాదుని ధిక్కరింపుచు.

మ. వినరా! డింభక! మూఢచిత్త! గరిమన్ విష్ణుండు విశ్వాత్మకుం
డని భాషించెదవైన నిందుఁగలఁడే యంచున్ మదోద్రేకియై
దనుజేంద్రుం డఱచేత వ్రేసెను మహోదగ్ర ప్రభాశుంభమున్
జన దృగ్భీషణ దంభమున్ హరిజను స్సంరంభమున్ స్తంభమున్.
104

పోతన 7-8-271, 272 & 279 నుండి 284

## శ్రీమన్నృసింహమూర్త్యవతారఘట్టః

### (ముఖ్య మూల శ్లోకములు)

శ్లో॥ ప్రతప్తచామీకరచండలోచనం
స్ఫురత్సటాకేసరజృంభితాననమ్ ।
కరాళదంష్ట్రం కరవాలచంచల
క్షురాంతజిహ్వాం భ్రుకుటీముఖోల్బణమ్ ॥ 112

స్తబ్ధోర్ధ్వకర్ణం గిరికందరాద్భుతం
వ్యాత్తాస్యనాసం హనుభేదభీషణమ్ ।
దివి స్పృశత్కాయమదీర్ఘపీవర
గ్రీవోరువక్షస్థలమల్పమధ్యమమ్ ॥ 113
వ్యాస 7-8-21, 22

### శ్రీహరి నృసింహరూపమున స్తంభమునం దావిర్భవించుట

వ. ఇట్లు దానవేంద్రుండు, పరిగృహ్యమాన వైరుండును, ... ప్రఫుల్ల పద్మయుగళ సంకాశ భాసుర చక్ర చాప హలకులి శాంకుశ జలచర రేఖాంకిత చారుచరణతలుండును, చరణ చంక్రమణ ఘన వినమిత విశ్వ విశ్వంభరాభర ధౌరేయ దిక్కుంభి కుంభీనస కుంభినీధర కూర్మ కులశేఖరుండును, దుగ్ధజలధిజాత శుండాల శుండాదండిత మండిత ప్రకాండ ప్రచండ మహోరుస్తంభ యుగళుండును, ఘణఘణాయమాన మణికింకిణీగణ ముఖరిత మేఖలావలయ వలయిత పీతాంబర శోభిత కటిప్రదేశుండును, నిర్జర నిమ్నగావర్త వర్తుల కమలాకర గంభీర నాభీవివరుండును, ముష్టిపరిమేయ వినుత తనుతర స్నిగ్ధ మధ్యుండును, కులాచల సానుభాగ సదృశ కర్కశ విశాల వక్షుండును...మహాప్రభువుండును నైన శ్రీనృసింహ దేవుం డావిర్భవించినం గనుంగొని. 105



క. నరమూర్తి గాదు కేవల
హరిమూర్తియుఁగాదు మానవాకారము కే
సరి యాకారము నున్నది
హరి మాయారచిత మగు యథార్థము సూడన్. 106
పోతన 7-8-285, 286
వ్యాస 7-8-18 నుండి 24

శ్లో॥ తం శ్యేనవేగం శతచంద్రవర్త్మభి
శ్చరంతమచ్ఛిద్రముపర్యధో హరిః ।
కృత్వాట్టహాసం ఖరముత్స్వనోల్బణం
నిమీలితాక్షం జగృహే మహాజవః ॥ 114

విష్వక్ స్ఫురంతం గ్రహణాతురం హరి
ర్వ్యాళో యథాఽఽఖుం కులిశాక్షతత్వచమ్ ।
ద్వార్యూరుమాపాత్య దదార లీలయా
యథాంత్రమాలీ ద్విపహత్యయా హరిః ॥
సంరంభదుష్ప్రేక్ష్యకరాళలోచనో
వ్యాత్తాననాంతర్లిలిహన్ స్వజిహ్వయా ।
అసృగ్లవాక్తారుణ కేసరాననో
యథాంత్రమాలీ ద్విపహత్యయా హరిః ”

నఖాంకురోత్పాటితహృత్సరోరుహం
విసృజ్య తస్యానుచరానుదాయుధాన్ ।
అహం సమంతాన్నఖశస్త్రపాణిభి
ర్దోర్దండ యూథాఽనుపథాన్ సహస్రశః ॥ 117
వ్యాస 7-8-29 నుండి32

సీ. పంచాన నోద్ధూత పావక జ్వాలలు
భూనభోంతర మెల్లఁబూరితముగ

దంష్ట్రాంకు రాభీల ధగధగాయిత దీప్తి
నసురేంద్రు నేత్రము లంధములుగc
గంటక సన్నిభోత్కట కేసరాహతి
నభ్రసంఘము భిన్న మై చరింపc
బ్రళయాభ్ర చంచలాప్రతిమ భాస్వరములై
ఖర నఖరోచులు గ్రమ్ముదేర

తే. సటలు జళిపించి గర్జించి సంభ్రమించి
దృష్టి సారించి బొమలు బంధించి కెరలి
జిహ్వ యాడించి లంఘించి చేత నొడిపి
పట్టె నరసింహుcడా దితిపట్టి నధిప! 107

క. సరకుగొనక లీలాగతి
నురగేంద్రుcడు మూషకంబు నొడిసినభంగిన్
నరకేసరి దను నొడిసిన
సురవిమతుcడు ప్రాణభీతి సుడివడియె నృపా!

క. సురరాజవైరిలోcబడె
బరిభావిత సాధుభక్త పటలాంహునకున్
నరసింహునకు నుదంచ
త్ఖరతరజిహ్వునకు నుగ్రతర రంహునకున్.

వ. అంత

మ. విహగేంద్రుం డహి వ్రచ్చుకైవడి మహోద్వృత్తి నృసింహుండు సా
గ్రహుcడై యూరువులందుcజేర్చి నఖసంఘాతంబులన్ వ్రచ్చె దు
స్సహు దంభోళి కఠోరదేహు నచలోత్సాహున్ మహాబాహు నిం
ద్రహుతాశాంతక భీకరున్ ఘనకరున్ దైత్యాన్వయ శ్రీకరున్.



శా. చించున్ హృత్కమలంబు శోణితమువర్షించున్ ధరామండలిన్
ద్రెంచుం గర్కశ నాడికావళులు భేదించున్ మహా వక్షమున్
ద్రెంచున్ మాంసము సూక్ష్మఖండములుగా దుష్టాసురున్ వ్రచ్చి ద
ర్పించుం బ్రేవులు కంఠమాలికలు కల్పించు నృఖోద్భాసియై.

సీ. వక్షః కవాటంబు వ్రక్కలు సేయుచో
ఘనకుఠారంబుల కరణి నొప్పు
గంభీర హృదయపంకజము భేదించుచోc
గుద్దాలముల భంగిcగొమరు మిగులు
ధమనీ వితానంబుcదగిలి ఖండించుచోc
బటు లవిత్రంబుల పగిది మెఱయు
జఠర విశా లాంత్రజాలంబుcద్రెంచుచోc
గ్రకచ సంఘంబుల గరిమcజూపు

తే. నంకగతుcడైన దైత్యుని నాగ్రహమున
శస్త్రచయముల నొంపక సంహరించి
యమరు నరసింహు నఖరంబు లతివిచిత్ర
సమర ముఖరంబులై యుండె జనవరేణ్య! 113

పోతన 7-8-291 నుండి 297

## శ్రీనృసింహదేవుని స్తుతియించుట

**ఇంద్ర ఉవాచ :**

శ్లో॥ ప్రత్యానీతాః పరమ భవతా త్రాయతానః స్వభాగా
దైత్యాక్రాంతం హృదయకమలం త్వద్గృహం ప్రత్యబోధి ।
కాలగ్రస్తంకియదిద మహో నాథ శుశ్రూషతాం తే
ముక్తిస్తేషాం న హి బహుమతా నారసింహాపరైః కిమ్ ॥118

వ్యాస 7-8-44

సీ. ప్రాణిసంఘముల హృత్పద్మ మధ్యంబుల
నివసించి భాసిల్లు నీవ యెఱుఁగు
దింతకాలము దానవేశ్వరుచే బాధ
పడి చిక్కియున్న యాపన్నజనుల
రక్షించితివి మమ్ము రాక్షసేశ్వరుఁజంపి
క్రతుహవ్యములు మాకుఁగలిగె మఱల
మంటిమి నీసేవ మరగినవారలు
కైవల్యవిభవంబు కాంక్ష సేయ

ఆ. రితరసుఖము లెల్ల నిచ్చగింపఁగ నేల
యస్థిరంబు లివి యనంతభక్తిఁ
గొలువనిమ్ము నిన్ను ఘోరదైత్యానీక
చిత్తభయదరంహ శ్రీనృసింహ ! 114

పోతన 7-8-310

**విష్ణుపారిషదా ఊచుః :**

శ్లో॥ అద్యైతన్నరహరిరూప మద్భుతం
వై దృష్టం న శ్శరణద సర్వలోకశర్మ ।
సోఽయం తే విధికర ఈశ విప్రశాపా
త్తస్యేదం నిధన మనుగ్రహాయ విద్మః ॥ 119

వ్యాస 7-8-58

ఉ. సంచిత విప్రశాపమునఁజండనిశాచరుఁడైన వీని శి
క్షించుట కీడుగాదు కృపచేసితి వీశ్వర! భక్తితోడ సే
వించుటకంటె వైరమున వేగమె చేరఁగవచ్చు నిన్ను నీ
యంచిత నారసింహతను వద్భుత మాపదఁబాసి రందఱున్. 115

పోతన 7-8-338

* * *

## అధ్యాయము-9

**నారద ఉవాచ :**

శ్లో॥ ఏవం సురాదయ స్సర్వే బ్రహ్మరుద్రపురస్సరాః ।
నోపేతుమశక న్మన్యుసంరంభం సుదురాసదమ్ ॥ 120

సాక్షాచ్ఛ్రీః ప్రేషితా దేవైర్దృష్ట్వా తన్మహదద్భుతం ।
అదృష్టాశ్రుతపూర్వత్వాత్సానో పేయాయ శంకితా ॥ 121

వ్యాస 7-9-1, 2

వ. ఇట్లు బ్రహ్మ రుద్రేంద్ర సిద్ధ సాధ్య పురస్సరులైన దేవ ముఖ్యు లందఱు నెడగలిగి యనేక ప్రకారంబుల వినుతించి, రోష సంరంభ విజృంభమాణుండైన నరసింహదేవుని డగ్గఱ వెఱచి, లక్ష్మీ దేవిం బిలిచి యిట్లనిరి. 116

క. హరికిం బట్టపుదేవివి
హరిసేవా నిపుణమతివి హరిగతివి సదా
హరిరతివి నీవు సని నర
హరి రోషము డింప వమ్మ! హరివరమధ్యా! 117

వ. అనిన నియ్యకొని మహోత్కంఠతోడ నా కలకంఠి నర కంఠీరవుని యుపకంఠంబునకుం జని.

సీ. ప్రళయార్క బింబంబు పగిది నున్నది గాని
నెమ్మోము పూర్ణేందు నిభము గాదు
శిఖి శిఖాసంఘంబు చెలువు చూపెడుఁగాని
చూడ్కి ప్రసాదభాసురము గాదు
వీర రౌద్రాద్భు తావేశ మొప్పెడుఁగాని
భూరి కృపారస స్ఫూర్తి గాదు

భయద దంష్ట్రాంకుర ప్రభలు గప్పెఁడు గాని
దరహసి తాంబుజాతంబు గాదు

తే. కఠినఖరనారసింహవిగ్రహము గాని
కామినీజన సులభవిగ్రహము గాదు
విన్నదియుఁగాదు తొల్లి నే విష్ణువలనఁ
గన్నదియుఁగాదు భీషణాకార మనుచు. 119

పోతన 7-9-339 నుండి 342

శ్లో॥ స్వపాదమూలే పతితం తమర్భకం
విలోక్య దేవః కృపయా పరిప్లుతః ।
ఉత్థాప్య తచ్ఛీర్ష్ణ్యదధాత్కరాంబుజం
కాలాహివిత్రస్తధియాం కృతాభయమ్ ॥ 122

వ్యాస 7-9-5

ఉ. ప్రాభవ మొప్ప నుత్కట కృపామతియై కదియంగఁజీరి సం
శోభిత దృష్టిసంగములఁజూచుచు బాలుని మౌళియందు లో
కాభినుతుండు వెట్టె నసురాంతకుఁడుద్భట కాలసర్ప భీ
తాభయ దానశస్తము ననర్గళ మంగళ హేతు హస్తమున్. 120

పోతన 7-9-347

## ప్రహ్లాదుఁడు నృసింహమూర్తిని స్తుతియించుట

శ్లో॥ మన్యేఽ ధునాభిజనరూపతపశ్శ్రుతౌజ
స్తేజః ప్రభావబలపౌరుష బుద్ధియోగాః ।
నారాధనాయ హి భవన్తి పరస్య పుంసో
భక్త్యా తుతోష భగవాన్ గజయూథపాయ ॥ 123

వ్యాస 7-9-9

మ. తపముల్ వంశము దేజమున్ శ్రుతము సౌందర్యంబు నుద్యోగమున్
నిపుణత్వంబుఁబ్రతాపపౌరుషములున్ నిష్ఠాబలప్రజ్ఞలున్



జపహోమంబులుఁజాల వీశ్వర! భవత్సంతుష్టికై దంతియూ
థపుఁజందంబున భక్తి సేయ వలయుం దాత్పర్యసంయుక్తుఁడై. 121

పోతన 7-9-350

శ్లో॥ సర్వే హ్యమీ విధికరాస్తవ సత్త్వధామ్నో
బ్రహ్మాదయో వయమివేశ న చోద్విజంతః ।
క్షేమాయ భూతాయ ఉతాత్మసుఖాయ చాస్య
విక్రీడితం భగవతో రుచిరావతారైః ॥ 124

వ్యాస 7-9-13

సీ. సత్త్వాకరుఁడ వైన సర్వేశ! నీ యాజ్ఞ
శిరముల నిడుకొని చేయువారు
బ్రహ్మాదు లమరులు భయ మొందుచున్నారు
నీ భీషణాకృతి నేఁడు చూచి
రోషంబు మాను నీ రుచిర విగ్రహములు
కల్యాణకరములుగాని భీతి
కరములు గావు లోకములకు వృశ్చిక
పన్నగములభంగి భయముఁజేయు

తే. నసుర మర్దించితివి సాధుహర్ష మయ్యె
నవతరించిన పని దీఱె నలుక యేల
కలుషహారివి సంతోషకారి వనుచు
నిన్నుఁదలఁతురు లోకులు నిర్మలాత్మ! 122

పోతన 7-9-354

శ్లో॥ నాహం బిభేమ్యజిత తేఽ తిభయానకాస్య
జిహ్వార్కనేత్రభ్రుకుటీరభసోగ్రదంష్ట్రాత్ ।
ఆంత్రస్రజః క్షతజకేసర శంకుకర్ణా
న్నిర్హ్రాదభీతదిగిభాదరిభిన్నఖాగ్రాత్ ॥ 125

వ్యాస 7-9-15

మ. ఖరదంష్ట్రా భ్రుకుటీ సటా నఖయు నుగ్రధ్వానయున్ రక్త కే
సరయుందీర్ఘతరాంత్రమాలికయు భాస్వన్నేత్రయున్నైన నీ
నరసింహాకృతిఁజూచి నే వెఱవఁ, బూర్ణ క్రూర దుర్వార దు
ర్భర సంసారదవాగ్నికిన్ వెఱతు, నీ పాదాశ్రయుం జేయవే. 123
పోతన 7-9-355

శ్లో॥ క్వాహం రజః ప్రభవ ఈశ తమోఽధికేఽస్మిన్
జాతః సురేతరకులేక్వ తవానుకమ్పా?
న బ్రహ్మణో న తు భవస్య న వై రమాయా
యన్మేఽర్పితః శిరసి పద్మకరః ప్రసాదః ॥ 126
వ్యాస 7-9-26

ఉ. శ్రీమహిళా మహేశ సరసీరుహగర్భుల కైన నీమహో
ద్దామకరంబుచే నభయదానము సేయవు నేను బాలుఁడం
దామసవంశసంభవుఁడ దైత్యుఁడ నుగ్రరజోగుణుండ ని
స్సీమదయం గరాంబుజము శీర్షముఁజేర్చుట చోద్యమీశ్వరా.
పోతన 7-9-359

శ్లో॥ తస్మై భవాన్ హయశిర స్తమమత్ర బిభ్ర
ద్వేద ద్రుహా వతిబలౌ మధుకైటభాఖ్యౌ ।
హత్వాఽఽదిశ చ్ఛ్రుతిగణాంస్తు రజ స్తమశ్చ
సత్త్వం తవ ప్రియతమాం తనుమామనంతి ॥ 127
వ్యాస 7-9-37

క. ఘోటకవదనుఁడ వై మధు
కైటభులం ద్రుంచి నిగమగణముల నెల్లన్
బాటించి యజున కిచ్చిన
కూటస్థుఁడ వీశ్వరుఁడవు కోవిదవంద్యా! 125
పోతన 7-9-361



శ్లో॥ జిహ్వైకతోఽచ్యుత వికర్షతి మావితృప్తా
శిశ్నోఽన్యత స్త్వగుదరం శ్రవణం కుతశ్చిత్ ।
ఘ్రాణోఽన్యతశ్చపలదృక్క్వచకర్మశక్తి
ర్బహ్వ్యస్సపత్న్యఇవ గేహపతిం లునన్తి ॥ 128
వ్యాస 7-9-40

సీ. కామహర్షాదిసంకలితమై చిత్తంబు
భవదీయచింతనపదవి సొరదు
మధురాదిరసముల మరగి చొక్కుచు జిహ్వ
నీ వర్ణనమునకు నిగుడ నీదు
సుందరీముఖములఁజూడఁగోరుచుఁజూడ్కి
తావకాకృతులపైఁదగులువడదు
వివిధ దుర్భాషలు వినఁగోరు వీనులు
వినవు యుష్మత్కథావిరచనములు

తే. ఘ్రాణ మురవడిఁదిరుగు దుర్గంధములకు
దవులు గొలుపదు వైష్ణవధర్మములకు
నడఁగి యుండవు కర్మేంద్రియములు పురుషుఁ
గలఁచు సవతులు గృహమేధిఁగలఁచునట్లు. 126
పోతన 7-9-363

శ్లో॥ తత్ తేఽర్హసత్తమ నమఃస్తుతిర్మపూజాః
కర్మస్మృతిశ్చరణయోః శ్రవణం కథాయామ్ ।
సంసేవయా త్వయి వినేతి షడంగయా కిం
భక్తిం జనః పరమహంసగతౌ లభేత ॥ 129
వ్యాస 7-9-50

సీ. నీగృహాంగణభూమి నిటలంబు మోవంగ
మోదించి నిత్యంబు మ్రొక్కఁడేని
నీమంగళ స్తవనికరవర్ణంబులు
పలుమాఱు నాలుకం బలుకఁడేని

నీ యధీనములుగా నిఖిలకృత్యంబులు
ప్రియభావమున సమర్పింపఁడేని
నీపదాంబుజముల నిర్మలహృదయుఁడై
చింతించి మక్కువఁజిక్కఁడేని

తే. నిన్నుఁజెవులార వినఁడేని, నీకు సేవ
సేయ రాఁడేని, బ్రహ్మంబు జెందఁగలఁడె
యోగి యైనఁ, దపోవ్రతయోగియైన,
వేది యైన, మహాతత్త్వవేది యైన, 127

పోతన 7-9-367

**శ్రీభగవానువాచ :**

శ్లో॥ ప్రహ్లాద భద్ర భద్రం తే ప్రీతోఽ హం తేఽ సురోత్తమ ।
వరం వృణీష్వాభిమతం కామపూరోఽ స్మ్యహం నృణామ్ ॥

మామప్రీణత ఆయుష్మన్ దర్శనం దుర్లభం హి మే ।
దృష్ట్వా మాం న పునర్జంతురాత్మానం తప్తు మర్హతి ॥

ప్రీణంతిహ్యథ మాం ధీరాస్సర్వభావేన సాధవః ।
శ్రేయస్కామా మహాభాగాస్సర్వాసామాశిషాం పతిమ్ ॥ 132

వ్యాస 7-9-52 నుండి 54

శా. సంతోషించితి నీచరిత్రమునకున్ సద్భద్రమౌఁగాక నీ
యంతర్వాంఛితలాభ మెల్లఁగరుణాయత్తుండనై యిచ్చెదన్
జింతం జెందకు భక్తకామదుఁడ నేసిద్ధంబు దుర్లోక్యుఁడన్
జంతుశ్రేణికి నన్నుఁజూచినఁబునర్జన్మంబు లే దర్భకా. 128

ఆ. సకలభావములను సాధులు విద్వాంసు
లఖిలభద్రవిభుఁడ నైన నన్నుఁ
గోర్కు లి మ్మటంచుఁగోరుదు రిచ్చెదఁ
గోరు మెద్ది యైన గుణ్ణి నీవు. 129

పోతన 7-9-369, 370

## అధ్యాయము-10

**ప్రహ్లాద ఉవాచ :**

శ్లో॥ యది దాసీశ మే కామాన్ వరాంస్త్వం వరదర్ష భ ।
కామానాం హృద్యసంరోహం భవతస్తు వృణే వరమ్ ॥ 133

ఇంద్రియాణి మనః ప్రాణా ఆత్మా ధర్మో ధృతిర్మతిః ।
హ్రీశ్శ్రీస్తేజస్స్మృతిస్సత్యం యస్య నశ్యంతి జన్మనా ॥

విముంచతి యదా కామాన్ మానవో మనసి స్థితాన్ ।
తర్హ్యేవ పుండరీకాక్ష భగవత్త్వాయ కల్పతే ॥

ఓం నమోభగవతే తుభ్యం పురుషాయ మహాత్మనే ।
హరయేఽ ద్భుతసింహాయ బ్రహ్మణే పరమాత్మనే ॥ 136

వ్యాస 7-10-8 నుండి 11

వ. లోకంబులందు భృత్యు లర్థకాములై రాజుల సేవింతురు. రాజులుం బ్రయోజనంబు లర్థించి, భృత్యులకు నర్థంబు లొసంగుదురు. అవ్విధంబునఁ గాదు. నాకుం గామంబు లేదు. నీకుం బ్రయోజనంబు లే దయినను దేవా! వరదుండ వయ్యెద వేనిఁగామంబులు వృద్ధిబొందని వరంబు కృపసేయుము. కామంబులు విడిచిన పురుషుండు నీతోడ సమానవిభవుం డగు. నరసింహ! పరమాత్మ! పురుషోత్తమ! యని ప్రణవపూర్వకంబుగా నమస్కరించెను. 130

పోతన 7-10-371

**శ్రీభగవానువాచ :**

శ్లో॥ నై కాంతినో మే మయి జాత్విహాశిషో
హ్యాశాస్యతేఽ ముత్ర చ వైభవద్విధాః ।
తథాపి మన్వంతరమేతదత్ర వై
దైత్యేశ్వరాణామనుభుంక్ష్వ భోగాన్ ॥ 137

కథా మదీయా జుషమాణః ప్రియాస్త్వ
మావేశ్య మామాత్మని సంతమేకమ్ ।
సర్వేషు భూతేష్వధియజ్ఞ మీశం
యజస్వ యోగేన చ కర్మ హిన్వన్ ॥

భోగేన పుణ్యం కుశలేన పాపం
కళేబరం కాలజవేన హిత్వా ।
కీర్తిం విశుద్ధాం సురలోకగీతాం
విస్తార్య మామేష్యసి ముక్తబంధః ॥

య ఏతత్కీర్తయేన్మహ్యం త్వయా గీత మిదం నరః।
త్వాం చ మాం చ స్మరన్ కాలే కర్మబంధాద్విముచ్యతే ॥ 140

వ్యాస 7-10-12 నుండి 15

సీ. నీవంటి విజ్ఞాననిపుణు లేకాంతులు
గోర్కులు నాయందుఁగోర నొల్ల
రట్లైనఁబ్రహ్లాద! యసురేంద్రభర్తవై
సాగి మన్వంతరసమయ మెల్ల
నిఖిలభోగంబులు నీవు భోగింపుము
కల్యాణబుద్ధి నా కథలు వినుము
సకలభూతములందు సంపూర్ణుఁడగు నన్ను
యజ్ఞేశు నీశ్వరు నాత్మ నిలిపి

ఆ. కర్మచయము లెల్ల ఖండించి పూజన
మాచరింపు మీశ్వరార్పణముగ
భోగముల నశించుఁబుణ్యంబు వ్రతములఁ
బాపసంచయములు పాయు నిన్ను. 131



వ. మఱియు నటమీఁదఁగాలవేగంబునం గళేబరంబు విడిచి, త్రైలోక్య విరాజమానంబును, దివిజరాజ జేగీయమానంబును, బరిపూరిత దశదిశంబును నైన యశంబుతోడ ముక్తబంధుఁడవై నన్ను డగ్గఱియెదవు వినుము.

ఆ. నరుఁడు ప్రియముతోడ నా యవతారంబు
నీ యుదారగీత నికరములను
మానసించె నేని మఱి సంభవింపఁడు
కర్మబంధచయము గడచిపోవు.

పోతన 7-10-372 నుండి 374

శ్లో॥ మైవం సురాసురాణాం తే ప్రదేయః పద్మసంభవ ।
వరః క్రూరనిసర్గాణామహీనామమృతం యథా ॥ 141

వ్యాస 7-10-32

వ. అనినఁనృసింహదేవుండు బ్రహ్మ కిట్లనియె.

క. మన్నించి దేవశత్రుల
కెన్నఁడు నిటువంటివరము లీకుము పాపో
త్పన్నులకు వరము లిచ్చుట
పన్నగముల కమృత మిడుట పంకజగర్భా! 134

పోతన 7-10-383

శ్లో॥ త్రిస్సప్తభిః పితా పూతః పితృభిస్సహతేఽనఘ ।
యత్సాధోఽస్య కులే జాతో భవాన్ వై కులపావనః ॥ 142

శ్లో॥ యత్ర యత్ర చ మద్భక్తాః ప్రశాంతాస్సమదర్శినః ।
సాధవస్సముదాచారాస్తేపూయం తేఽపి కీకటాన్ ॥ 143

మ. నిజభక్తుండవు నాకు నిన్నుఁగనుటన్ నీతండ్రి త్రిస్సప్త పూ
ర్వజులం గూడి పవిత్రుఁడై శుభగతిన్ వర్తించు విజ్ఞానదీ
ప జితానేక భవాంధకారు లగు మద్భక్తుల్ వినోదించు దే
శజనుల్ దుర్జనులైన శుద్ధులు సుమీ సత్యంబు దైత్యోత్తమా! 135
పోతన 7-10-378

శ్లో॥ ఏతద్య ఆదిపురుషస్య మృగేంద్రలీలాం
దైత్యేంద్రయూథపవధం ప్రయతః పఠేత ।
దైత్యాత్మజస్య చ సతాం ప్రవరస్య పుణ్యం
శృత్వానుభావమకుతో భయమేతి లోకమ్ ॥ 144
వ్యాస 7-10-49

ఉ. శ్రీరమణీయ మైన నరసింహ విహారము నింద్ర శత్రుసం
హారముఁబుణ్యభాగవతుఁడైన నిశాచరనాథపుత్ర సం
చారము నెవ్వఁడైన సువిచారత విన్నఁబఠించినన్ శుభా
కారముతోడ నేభయముఁగల్గనిలోకముఁజెందు భూవరా.
పోతన 7-10-385

* * *

# అధ్యాయము-11

## సనాతనధర్మములు

### నారదుండు ధర్మరాజునకు తెలుపుట

**శ్రీనారద ఉవాచ :**

శ్లో॥ ధర్మమూలో హి భగవాన్ సర్వవేదదుయో హరిః ।
స్మృతం చ తద్విదాం రాజన్ యేన చాత్మా ప్రసీదతి ॥ 145

శ్లో॥ సత్యం దయా తపశ్శౌచం తితిక్షేక్షాశమో దమః ।
అహింసా బ్రహ్మచర్యం చ త్యాగస్స్వాధ్యాయ ఆర్జవమ్ ॥ 146

సంతోషస్సమదృక్సేవా గ్రామ్యేహోపరమశ్శనైః ।
నృణాం విపర్యయే హేక్షామౌనమాత్మ విమర్శనమ్ ॥

అన్నాద్యాదేస్సంవిభాగో భూతేభ్యశ్చ యథార్హతః ।
తేష్వాత్మదేవతాబుద్ధిస్సుతరాం నృషు పాండవ ॥

శ్రవణం కీర్తనం చాస్య స్మరణం మహతాం గతేః ।
సేవే జ్యావనతిస్సఖ్యం దాస్యమాత్మసమర్పణమ్ ॥

నృణామయం పరో ధర్మస్సర్వేషాం సముదాహృతః ।
త్రింశల్లక్షణవాన్ సాధుస్సర్వాత్మా యేన తుష్యతి ॥ 150
వ్యాస 7-11-7 నుండి 12

వ. నారదుండు ధర్మరాజుం జూచి, భువనశోభనంబుకొఱకు బదరి కాశ్రమంబునఁదపోనిరతుండై యున్న నారాయణునివలన తాను విన్న సనాతనధర్మంబు సెప్పుచున్నాడు. సకల వర్ణంబుల జనులకు సత్యంబును, దయయును నుపవాసాది తపంబును, శౌచంబును, సైరణయు, సద సద్వివేకంబును, మనోనియమంబును, బహిరింద్రియ జయంబును, హింస

లేమియు, బ్రహ్మచర్యంబును, దానంబును, యథోచిత జపంబును, సంతోషంబును, మార్దవంబును, సమదర్శనంబును, మహాజన సేవయు, గ్రామ్యంబులైన కోరికలు మానుటయు, నిష్ఫలక్రియలు విడుచుటయు, మితభాషిత్వంబును, దేహంబుగాని తన్ను వెదకికొనుటయు, నన్నోదకంబులు ప్రాణులకుం బంచియిచ్చుటయుఁ, బ్రాణులందు దేవతాబుద్ధియు,నాత్మబుద్ధిం జేయుటయు, శ్రీనారాయణచరణ స్మరణ కీర్తన శ్రవణ సేవార్చన నమస్కార దాస్యాత్మసమర్పణ సఖ్యంబు లనెడి త్రింశ ల్లక్షణంబులు గలుగ వలయు. 137

పోతన 7-11-409

(గమనిక :- పైన తెలియచేసిన 12వ శ్లోక భావమే యీక్రింది శ్లోకములో తెలియబడుచున్నది.

శ్లో॥ ధర్మం తు సాక్షాద్భగవ త్ప్రణీతం
న వై విదుః ఋషయో యే చ దేవాః ।
న సిద్ధముఖ్యా అసురా మనుష్యాః
కుతో ను విద్యాధరచారణాదయః ॥) 151

వ్యాస 6-3-19

సర్వవేదమయో విప్రస్సర్వదేవమయో నృపః ।
శమో దమస్తపశ్శౌచం సంతోషః క్షాంతిరార్జవమ్ ।
జ్ఞానం దయాచ్యుతాత్మత్వం సత్యం చ బ్రహ్మలక్షణమ్ ॥

వ్యాస 7-11-21

వ. సర్వవేదమయుండు బ్రాహ్మణుండు. సర్వదేవమయుండు క్షత్రియుండు. బ్రాహ్మణ క్షత్రియులకు నీచసేవనంబు కర్తవ్యంబు గాదు. 138

క. దమమును శౌచముఁదపమును
శమమును మార్దవముఁగృపయు సత్యజ్ఞాన



క్షమలును హరిభక్తియు హ
ర్షము నిజలక్షణము లగ్రజాతికి నధిపా! 139

పోతన 7-11-411, 412

శ్లో॥ శౌర్యం వీర్యం ధృతి స్తేజస్త్యాగ ఆత్మజయః క్షమాః ।
బ్రహ్మణ్యతా ప్రసాదశ్చ రక్షా చక్షత్రలక్షణమ్ ॥ 153

వ్యాస 7-11-22

ఉ. శౌర్యము దానశీలముఁ బ్రసాదము నాత్మజయంబుఁ దేజమున్
ధైర్యము దేవభక్తియును ధర్మము నర్థముఁ గామమున్ బుధా
చార్య ముకుంద సేవలును, సత్కృతియుం బరితోషణంబు స
ద్వీర్యము రక్షణంబుఁ బృథివీవరశేఖర! రాజచిహ్నముల్. 140

పోతన 7-11-413

## స్త్రీ ధర్మములు

శ్లో॥ స్త్రీణాం తు పతిదేవానాం తచ్ఛుశ్రూషానుకూలతా ।
తద్బంధుష్వనువృత్తిశ్చ నిత్యం తద్వ్రతధారణమ్ ॥ 154

సంమార్జనోపలేపాభ్యాం గృహమండనవర్తనైః ।
స్వయం చ మండితా నిత్యం పరిమృష్టపరిచ్ఛదా ॥

కామైరుచ్చావచైస్సాధ్వీ ప్రశ్రయేణ దమేన చ ।
వాక్యైస్సత్యైః ప్రియైః ప్రేమ్ణా కాలే కాలే భజేత్పతిమ్ ॥

సంతుష్టాఽలోలుపా దక్షా ధర్మజ్ఞా ప్రియసత్యవాక్ ।
అప్రమత్తా శుచిస్స్నిగ్ధా పతిం త్వపతితం భజేత్ ॥

యా పతిం హరిభావేన భజేచ్ఛ్రీరివ తత్పరా ।
హర్యాత్మనా హరేర్లోకే పత్యా శ్రీరివ మోదతే ॥ 158

వ్యాస 7-11-25 నుండి 29

సీ. నిలయము పాటించి నిర్మలదేహి యై
శృంగార మేప్రొద్దుఁజేయవలయు
సత్యప్రియాలప చతురయై ప్రాణేశు
చిత్తంబు ప్రేమ రంజింప వలయు
దాక్షిణ్య సంతోష ధర్మ మేధాదుల
దైవతమని ప్రియుఁదలఁప వలయు
నాథుఁడేపద్ధతి నడచు నా పద్ధతి
నడచి సద్బంధుల నడప వలయు

ఆ. మార్దవమునఁబతికి మజ్జన భోజన
శయన పాన రతుల జరుపవలయు
విభుఁడు పతితుఁడైన వెలఁది పాతివ్రత్య
మహిమఁబుణ్యుఁజేసి మనుప వలయు. 141

క. తరుణి తన ప్రాణవల్లభు
హరిభావంబుగ భజించు యతఁడును దానున్
సిరి కైవడి వర్తించుచు
హరిలోకమునందు సంతతానందమునన్.

క. ఉపవాసంబులు వ్రతములుఁ
దపములు వెయ్యేల భర్తదైవత మని ని
ష్కపటతఁగొలిచిన సాధ్వికి
నృపవర! దుర్లభము లేదు నిఖిలజగములన్. 143

పోతన 7-11-417, 418

* * *

## అధ్యాయము-12

### బ్రహ్మచారి ధర్మములు

**నారదుండిట్లనియె :**

వ. వినుము. బ్రహ్మచారి మౌంజీ, కౌపీన యజ్ఞోపవీత కృష్ణాజినపాలాశ దండ కమండలుధరుండును, సంస్కారహీన శిరోరుహుండును, దర్భ హస్తుండును, శీలప్రశస్తుండును, మౌనియునై, త్రిసంధ్యంబును బ్రహ్మ గాయత్రి జపించుచు, సాయం ప్రాత రవసరంబుల నర్కపావక గురు దేవతోపాసనంబులు సేయుచు, గురుమందిరమునకుం జని, దానుని చందంబున భక్తి వినయ సౌమనస్యంబులు గలిగి, వేదంబులు చదువుచు, నధ్యయనోపక్రమావసానంబుల గురుచరణంబులకు నమస్కరింపుచు, రేపు మాపును విహితగృహంబుల భక్షించి, భైక్షంబు గురువునకు నివేదించి, యనుజ్ఞఁగొని, మితభోజనంబు గావింపుచు, విహితకాలంబుల నుపవసింపుచు నంగనలందు నంగనాసక్తులందుం బ్రయోజనమాత్ర భాషణంబు లొనర్చుచు, గురుపరాంగనలవలన నభ్యంగ కేశప్రసాధన శరీర మర్దన మజ్జన రహస్య యోగంబులు వర్జించుచు, గృహంబున నుండక, జితేంద్రియత్వంబున సత్యభాషణుండై సంచరించ వలయు. 144

ఆ. పొలఁతి దావవహ్ని, పురుషుఁడాజ్యఘటంబు
కరఁగ కుండరాదు, కదిసెనేని,
బ్రహ్మయైనఁగూతుఁబట్టక మానఁడు,
వడుగు కింతిపొత్తు వలదు! వలదు!! 145

పోతన 7-12-421, 422

వ్యాస 7-12-1 నుండి 11

* * *

## అధ్యాయము-13

### ప్రహ్లాదాజగరసంవాదము

**బ్రాహ్మణ ఉవాచ :**

శ్లో॥ పశ్యామి ధనినాం క్లేశం లుబ్ధానామజితాత్మనామ్।
భయాదలబ్ధనిద్రాణాం సర్వతో హి విశంకినామ్॥ 159

రాజతశ్చోరతః శత్రోః స్వజనాత్పశుపక్షితః।
అర్థిభ్యః కాలతః స్వస్మాన్నిత్యం ప్రాణార్థవద్భయమ్॥

శోకమోహభయక్రోధరాగక్లైబ్యశ్రమాదయః।
యన్మూలాః స్యుర్నృణాం జహ్యాత్ స్పృహాం ప్రాణార్థ యోర్బుధః॥
వ్యాస 7-13-32 నుండి 34 161

వ. మర్త్యునకు ధనంబు ప్రాప్తంబయిన నది దుఃఖకరముగాని సుఖకరంబు గాదు. లోభవంతులయిన ధనవంతులు నిద్రాహారంబులులేక రాజచోరయాచక శత్రుమిత్రాది సర్వస్థలంబులందును శంకించుచు దానభోగంబులు మఱచి యుండుదురు. ప్రాణార్థవంతులకు భయంబు నిత్యంబు. శోకమోహభయ క్రోధరాగశ్రమాదులు వాంఛా మూలంబులు. వాంఛ లేకుండ వలయును.
146

పోతన 7-13-435

* * *

## అధ్యాయము-14

**నారద ఉవాచ :**

శ్లో॥ అథ దేశాన్ ప్రవక్ష్యామి ధర్మాదిశ్రేయ ఆవహన్।
స వై పుణ్యతమో దేశ స్సత్పాత్రం యత్ర లభ్యతే।
బింబం భగవతో యత్ర సర్వమేతచ్చరాచరమ్॥ 162

యత్ర హి బ్రాహ్మణకులం తపోవిద్యాదయాన్వితమ్।
యత్ర యత్ర హరేరర్చా స దేశశ్శ్రేయసాం పదమ్॥

యత్ర గంగాదయో నద్యః పురాణేషు చ విశ్రుతాః।
సరాంసి పుష్కరాదీని క్షేత్రాణ్యర్హాశితాన్యుత॥ 164
వ్యాస 7-14-28 నుండి 30

మ. విను మే దేశములం దయాగుణ తపో విద్యాన్వితంబైనవి
ప్రనికాయంబు వసించు నే స్థలములన్ భాగీరథీముఖ్య వా
హిను లుండున్ హరిపూజ లెయ్యెడల భూయిష్ఠ ప్రకాశంబులన్
దనరున్ భూవర! యట్టి చోటులఁదగున్ ధర్మంబులం జేయఁగన్.
147

క. హరియందు జగము లుండును
హరిరూపము సాధుపాత్ర మందుండు శివం
కర మగు పాత్రము గలిగిన
నరయఁగ నది పుణ్యదేశ మనఘచరిత్రా! 148
పోతన 7-14-449, 450

శ్లో॥ ఏతాన్ దేశాన్నిషేవేత శ్రేయఃకామో హ్యాభీక్ష్ణశః।
ధర్మోహ్యత్రేహితః పుంసాం సహస్రాధిఫలోదయః॥ 165
పోతన 7-14-34

ఆ. భూవరేంద్ర! యిట్టి పుణ్యప్రదేశంబు
లందు నరుఁడు సేయునట్టి ధర్మ
మల్ప మైన నది సహస్రగుణాధిక
ఫలము నిచ్చు హరి కృపావశమున.

పోతన 7-14-452

శ్లో॥ పురుషేష్వసి రాజేంద్ర సుపాత్రం బ్రాహ్మణం విదుః।
తపసా విద్యయా తుష్ట్యాథత్తేవేదం హరేస్తనుమ్॥ 166

నన్వస్య బ్రాహ్మణా రాజన్ కృష్ణస్య జగదాత్మనః।
పురతః పాదరజసా త్రిలోకీం దైవతం మహత్॥ 167

వ్యాస 7-14-42, 43

ఆ. అఖిల లోకములకు హరి దైవతము సూడ
హరికి దైవతము ధరామరుండు
పదపరాగ లేశ పంక్తిచేఁద్రైలోక్య
పావనంబుఁజేయు బ్రాహ్మణుండు. 150

**నారద ఉవాచ :**

శ్లో॥ ద్వౌదైవే పితృకార్యే త్రీనేకైక ముభయత్ర వా।
భోజయేత్ సుసమృద్ధోఽపి శ్రాద్ధే కుర్యాన్న విస్తరమ్॥ 168

వ్యాస 7-15-3

వ. గృహస్థుండు విద్యాతపోగరిష్ఠులైన బ్రాహ్మణజనులందు పితృజనుల నుద్దేశించి కవ్యంబులును దేవతల నుద్దేశించి హవ్యంబులును బెట్టుట ముఖ్యము. దైవకార్యంబునకు నిరువురనైన నొకరినైనఁ, బితృకార్యంబునకు ముఫ్వురనైన నొకరినైన, భోజనంబునైనఁ, బితృకార్యంబునకు ముఫ్వురనైన నొకరినైన, భోజనంబు సేయింపవలయు. ధనవంతునకైనను శ్రాద్ధవిస్తారంబు కర్తవ్యంబుగాదు. 151

పోతన 7-15-455



శ్లో॥ అసన్తుష్టస్య విప్రస్య తేజో విద్యా తపో యశః।
స్రవన్తీన్ద్రియలౌల్యేన జ్ఞానం చైవావకీర్యతే॥

కామస్యాంతం హిక్షుత్తృడ్భ్యాం క్రోధస్యాంతం ఫలోదయాత్
జనో యాతి న లోభస్య జిత్వా భుక్త్వాదిశో భువః॥

పణ్డితా బహవో రాజన్ బహుజ్ఞాః సంశయచ్ఛిదః।
సదసస్పతయోఽప్యేకే అసన్తోషాత్ పతన్త్యధః॥

వ్యాస 7-15-19 నుండి 21

వ. సంతోషిగాని విప్రుని విద్యాతపోవిభవయశంబులు నిరర్థకంబులు. ఇంద్రియలోలత్వంబున జ్ఞానంబు నశించు. 152

పోతన 7-15-458

శ్లో॥ గృహస్థస్య ప్రియాత్యాగో వ్రతత్యాగో వటోరపి।
తపస్వినో గ్రామసేవా భిక్షోరింద్రియలోలతా॥ 172

వ్యాస 7-15-38

ఆ. వ్రతము మానఁదగదు వడుగుఁగుఱ్ఱనికినిఁ
గ్రియలు మానఁదగదు గృహగతునికిఁ
దపసి కూర నుండఁదగదు సన్యాసికిఁ
దరుణితోడి పొత్తు తగదు! తగదు!! 153

పోతన 7-15-463

శ్లో॥ ఆహుః శరీరం రథమిన్ద్రియాణి
హయానభీషూన్ మన ఇన్ద్రియేశమ్।
వర్త్మాని మాత్రా ధిషణాం చసూతం
సత్త్వం బృహద్ బన్ధుర మీశసృష్టమ్॥ 173

అక్షం దశప్రాణమధర్మధర్మౌ
చక్రేఽభిమానం రథినం చ జీవమ్।
ధనుర్హి తస్య ప్రణవం పఠన్తి
శరం తు జీవం పరమేవ లక్ష్యమ్॥

రాగో ద్వేషశ్చ లోభశ్చ శోకమోహౌ భయం మదః।
మానోవమానోసూయా చ మాయా హింసా చ మత్సరః॥175

వ్యాస 7-15-41 నుండి 43

సీ. రథము మేనెల్ల, సారథి బుద్ధి, యింద్రియ
గణము గుఱ్ఱములు, పగ్గములు మనము,
ప్రాణాదిదశవిధపవనంబు లిరుసు, ధ
ర్మాధర్మగతులు రథాంగకములు,
బహుళతరంబైన బంధంబు చిత్తము,
శబ్దాదికములు సంచారభూము,
లభిమానసంయుతు డయిన జీవుఁడు రథి,
ఘనతరప్రణవంబు కార్ముకంబు

తే. శుద్ధజీవుండు బాణంబు, శుభదమైన
బ్రహ్మ మంచితలక్ష్యంబు, పరులు రాగ
భయ మద ద్వేష శోక లోభ ప్రమోహ
మాన మత్సర ముఖములు, మానవేంద్ర! 154

పోతన 7-15-464

శ్లో॥ నో చేత్ప్రమత్తమసదింద్రియవాజిసూతా
నీత్వోత్పథం విషయదస్యుషు నిక్షిపంతి।



తే దస్యవస్సహయసూతమముంతమోఽంధే
సంసారకూప ఉరుమృత్యుభయే క్షిపంతి॥ 176

వ్యాస 7-15-46

ఆ. విషయశత్రు లెల్ల విక్రాంతితోడ సా
రథిసమేతుఁడయిన రథికుఁబట్టి
యుగ్ర తిమిర మృత్యుయుత మగు సంసార
కూప మధ్యమందుఁగూల్తు రథిప!

పోతన 7-15-466

శ్లో॥ ప్రవృత్తిం చ నివృత్తిం చ ద్వివిధం కర్మ వైదికమ్।
ఆవర్తతే ప్రవృత్తేన నివృత్తేనాశ్నుతేఽమృతమ్॥

వ్యాస 7-15-47

వ. వినుము, వైదికకర్మంబు ప్రవృత్తంబును నివృత్తంబునను రెండు దెఱంగులయ్యె నందు బ్రవృత్తంబునఁబునరావర్తనంబును నివృత్తంబున మోక్షంబును సిద్ధించు. 156

పోతన 7-15-467

శ్లో॥ ఏతైరన్యైశ్చ వేదో క్తైర్వర్తమానస్స్వ కర్మభిః।
గృహేఽప్యస్య గతిం యాయాద్రాజం స్తద్భక్తిమాన్నరః॥ 178

వ్యాస 7-15-68

క. వాదములు వేయు నేటికి
వేదోక్తవిధిం జరించు విబుధుఁడు గృహమం
దాదరమున నారాయణ
పాదంబులు గొలిచి ముక్తిపదమున కేఁగున్. 157

పోతన 7-15-470

శ్లో॥ ధర్మస్తే గృహమేధీ యో వర్ణితః పాపనాశనః।
గృహస్థోయేన పదవీమంజసాన్యాసినామియాత్॥ 179
వ్యాస 7-15-75

ఆ. కౌశలమున మోక్షగతికి గృహస్థుఁడే
ధర్మ మాచరించి తగిలిపోవు
నట్టి ధర్మమెల్ల నతివిశదంబుగాఁ
బలుకఁబడియె నీకు భవ్యచరిత! 158
పోతన 7-15-477

శ్లో॥ యూయం నృలోకే బత భూరిభాగో
లోకం పునానా మునయోఽభియాంతి।
యేషాం గృహానావసతీతి సాక్షా
ద్గూఢం పరం బ్రహ్మ మనుష్యలింగమ్॥

స వా అయం బ్రహ్మ మహద్విమృగ్యం
కైవల్య నిర్వాణసుఖానుభూతిః।
ప్రియస్సుహృద్వః ఖలు మాతులేయ
ఆత్మార్హణీయో విధికృద్గురుశ్చ॥

న యస్య సాక్షాద్భవ పద్మజాదిభీ
రూపం ధియా వస్తుతయోపవర్ణితమ్।
మౌనేన భక్త్యోపశమేన పూజితః
ప్రసీదతామేష స సాత్త్వతాం పతిః॥ 182
వ్యాస 7-15-76 నుండి 78

మ. అఖిలాధారుఁడజాది దుర్లభుఁడు బ్రహ్మం బైన విష్ణుండు నీ
మఖమం దర్చితుఁడై, నివాసగతుఁడై, మర్త్యాకృతిన్, సేవ్యుఁడై,



సఖియై, చారకుఁడై, మనోదయితుఁడై, సంబంధియై, మంత్రియై,
సుఖదుం డయ్యె, భవన్మహిమఁ జోద్యంబు ధాత్రీశ్వరా! 159
పోతన 7-15-478

క. రాజీవసదృశలోచన!
రాజీవభవాది దేవరాజవినుత! వి
భ్రాజితకీర్తిలతావృత!
రాజీవభవాండభాండ! రఘుకులతిలకా!

**మాలిని.**
ధరణిదుహితృరంతా! ధర్మమార్గానుగంతా!
నిరుపమనయవంతా! నిర్జరారాతిహంతా!
గురుబుధసుఖకర్తా! కుంభినీచక్రభర్తా!
సురభయపరిహర్తా! సూరిచేతోవిహర్తా! 161

చ. హరపటుచాపఖండన! మహాద్భుత విక్రమశౌర్య భండనా!
శరనిధి గర్వభంజన! రసాతనయాహృదయాబ్జ రంజనా!
తరుచర సైన్యపాలన! సుధాంధసమౌని మనోజ్ఞఖేలనా!
సరసిజగర్భ సన్నుత! నిశాచర సంహర! త్రైజగన్నుతా! 162
పోతన 7-15-480 నుండి 482

యదక్షరపదభ్రష్టం
మాత్రాహీనం తు యద్భవేత్।
తత్సర్వం క్షమ్యతాం దేవ
*పరిపూర్ణం తదస్తు తే॥

* నారాయణ నమోఽస్తుతే । - పాఠాంతరం.

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం
న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః।
గోబ్రాహ్మణేభ్య శ్శుభమస్తు నిత్యం
లోకా స్సమస్తా స్సుఖినో భవంతు॥

**ఓమ్ తత్ సత్ సర్వమ్**

**శ్రీకృష్ణార్పణమస్తు.**